Dr Dayananda Swamy ebooks

శ్రీమత్

# భగవద్గీతా సర్వస్వము

## ప్రథమ షట్కము



గ్రంథకర్త

సాహిత్య విద్యా ప్రవీణ - వేదాంత విద్యా ధురీణ

యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Dr Dayananda Swamy ebooks

శ్రీమత్

# భగవద్గీతా సర్వస్వము

ప్రథమ షట్కము

గ్రంథకర్త

సాహిత్య విద్యా ప్రవీణ - వేదాంత విద్యా ధురీణ

యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Dr Dayananda Swamy ebooks

| | | |
|---|---|---|
| గ్రంథ నామము | : | భగవద్గీతా సర్వస్వము |
| కర్త | : | యల్లంరాజు శ్రీనివాసరావు |
| ముద్రణము | : | తృతీయము |
| ముద్రణ కాలము | : | శ్రీ జయ నామ సంవత్సర జ్యేష్ఠ మాసము,<br>జూన్ - 2014 |
| గ్రంధ మూల్యము | : | రూ. 275/- |
| ప్రతులు | : | 500 |
| డి.టి.పి. | : | రితిక్ ఇమేజస్<br>సీతారాంపురం, విజయవాడ - 520 002<br>ఆంధ్రప్రదేశ్ - సెల్ : 94401 59871 |
| ముద్రాపకులు | : | నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్,<br>గాంధీనగర్, విజయవాడ-3.<br>ఫోన్ : 0866-2574828 |
| ప్రాప్తి స్థానము | : | యల్లంరాజు శ్రీనివాసరావు<br>F1, వేంకటసాయి టవర్స్,<br>పాపరాజు వీధి, సత్యనారాయణపురం<br>విజయవాడ - 520 011<br>ఫోన్ : 0866-2538526 |
| ప్రతులకు | : | యం. సుధాకర్<br>సత్యనారాయణపురం,<br>విజయవాడ - 520 011<br>సెల్ : 94405 24168 |

Dr Dayananda Swamy ebooks

# గీతాంజలి

పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయమ్
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహా భారతమ్
అద్వైతామృత వర్షిణీం భగవతీ మష్టాద శాధ్యా యినీమ్
అంబ! త్వామను సందధామి భగవద్గీతే భవద్వేషిణీ

సర్వోపనిషదో గావః
దోగ్ధా గోపాల నందనః
పార్థో వత్సః సుధీ ర్భోక్తా
దుగ్ధం గీతామృతం మహత్-

Dr Dayananda Swamy ebooks

# విషయసూచిక


ఉపోద్ఘాతము ........................................ 5

1. విషాదయోగము ........................................ 15

2. సాంఖ్యయోగము ........................................ 47

3. కర్మయోగము ........................................ 203

4. జ్ఞానయోగము ........................................ 275

5. కర్మసన్న్యాసయోగము ........................................ 369

6. ఆత్మసంయమ యోగము ........................................ 445

ఉపసంహారము ........................................ 561

Dr Dayananda Swamy ebooks


# ఉపోద్ఘాతము

అధ్యాత్మ రంగంలో భగవద్గీతకు వచ్చిన ప్రచారం మరి దేనికీ రాలేదు. మహాభారతంలో ఒక్క భగవద్గీతే గాదు. ఎన్నో ఉన్నాయి గీతలు. ఋభుగీత - హంసగీత బ్రాహ్మణ గీత అను గీత - ఒక్కటిగాదు. చాలా ఉన్నాయి. కాని వాటిలో దేనికీ రాలేదింత ప్రఖ్యాతి. ఇంతకన్నా నాలుగురెట్లు పెద్దది మోక్షధర్మమనే ప్రకరణం. అదీ వేదవ్యాసుడి రచనే. దానికి గూడా ఇంత పేరు లేదు. ఆఖరుకు మృత్యురహస్యాన్ని కూడా భేదించి బయటపెట్టిన సనత్సు జాతీయానికి కూడా లేదు. క్రైస్తవులకు హోలీ బైబులెలాటిదో - మహమ్మదీయులకు ఖరానే షరీ ఫెలాంటిదో - భారతీయులకు భగవద్గీత అలాంటిది. వాటికి లోకంలో ఎంత ప్రఖ్యాతీ వ్యాప్తీ ఉన్నదో భగవద్గీతకు కూడా అంతే ఉన్నది.

ఇంకా ఒక విశేషమేమంటే భగవద్గీత నిజంగా భగవద్గీతే. అంటే అర్థం. ప్రజ్ఞానం బ్రహ్మ అన్నారు. భగవంతుడంటే జ్ఞాన స్వరూపుడు. అఖండమైన జ్ఞానమది. అది కూడా సిద్ధమే **Ready made** గాని సాధ్యం **To be made** కాదన్నారు. కనుక అల్పజ్ఞుడైన మానవుడు దాన్ని అందుకొని తరించాలంటే జ్ఞానమొక్కటే మార్గం మరేదీ గాదు. అది కూడా సిద్ధమే కాబట్టి క్రియారూపమైన సాధన ఏదీ లేదు. ఉన్నదల్లా దాని నున్నదున్నట్టు

Dr Dayananda Swamy ebooks



గుర్తించటమే. గుర్తిస్తే చాలు. అదే అయిపోతాడీ జీవుడు. కొత్తగా అయిపోవటం కూడా కాదు. అయి ఉన్నాననే సత్యం మరచిపోయి మరలా దాన్ని కంఠచామీకర న్యాయంగా గుర్తు చేసుకోవటమే. దీనికే ప్రత్యభిజ్ఞాన **Recognition** మని నామకరణం చేశా రద్వైతులు.

కాబట్టి జ్ఞానమొక్కటే సాధనం మోక్షానికి. ఈ రహస్యం లోకానికి చాటి చెప్పటమే భగవద్గీత విశిష్టత. యద్జ్ఞాత్వా మోక్ష్యసే అశుభాత్ - జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం.జ్ఞానం వల్లనే సంసారోప శమనం. సర్వం జ్ఞాన ప్లవేనైవ వృజినం సంతరిష్యసి. సాంసారికమైన తాపాలన్నీ దాటి బయట పడాలంటే జ్ఞానమే శరణ్యం. నహి జ్ఞానేన సదృశం. జ్ఞానంతో సమానమేదీ లేదు. కర్మ భక్తి సమాధు లేవైనా ఉన్నాయని భావించినా అవన్నీ జ్ఞానే పరిసమాప్యతే. జ్ఞానంలోనే కలిసి వస్తాయి. వేరుగా ఆచరించ నక్కర లేదు. ఎందుకంటే జ్ఞానం జ్ఞేయం జ్ఞాన గమ్యం - అంతా మన స్వరూపమే. అది కూడా ఎక్కడో లేదు. ఎక్కడబడితే అక్కడే ఉంది. అంతర్బహిశ్చ భూతానా మచరం చరమే వచ. సమస్త పదార్థాలలో సకల జీవులలో లోపలా వెలపలా మధ్యలో అనే తేడా లేకుండా నిండి నిబిడీకృత మయి ఉంది. అంతే కాదు. ప్రత్యక్షావ గమం - ప్రత్యక్షంగా మనకు కనిపిస్తూనే ఉంది. సుసుఖం కర్తుం. దాన్ని అందుకోటం కూడా అతి సులభం. అందుకే మీరు జ్ఞానమే ఒక యజ్ఞ మనుకొని సాధన చేయండి నేను సంతోషిస్తానని జ్ఞాన స్వరూపుడైన పరమాత్మ పదే పదే మనలను హెచ్చరిస్తున్నాడు.

Dr Dayananda Swamy ebooks


ఇలాటి అసలైన అద్వైత విజ్ఞానం లోకానికంతటికీ ఉపదేశించటమే భగవద్గీత ప్రత్యేకత. జీవ జగదీశ్వర తత్త్వాలు మూడింటికీ వస్తుతః ఏ మాత్రమూ భేదం లేదు. మూడూ కలిసి జ్ఞాన స్వరూపంగా ఏకమేనని చాటటం కన్నా విలువైన ఉపదేశమేముంది లోకంలో. అసలు జీవుడూ ఈశ్వరుడనే తేడాయే లేదు. వాడికే గాదు. వీడికీ లేవు వాస్తవంలో జనన మరణాలని చాటుతున్నది గీత. నత్వేవాహం జాతునాసం నత్వం - న చైవ న భవిష్యామః - క్షేత్ర జ్ఞంచాపి మాంవిద్ధి సర్వక్షేత్రేషు - ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి - ఇలాటి అమూల్యమైన బోధ మరే మతమూ మత గ్రంథమూ చేయలేదు లోకానికింత వరకూ. అందరూ దేవుడెక్కడో ఉన్నాడు. వాణ్ణి అందుకోవాలంటే ఫలానా మార్గంలో ప్రయత్నిస్తే గాని అందుకోలేడు మానవుడని ఏకరువు పెట్టేవారే.

అయితే ఇలాటి లోకోత్తరమైన జ్ఞానాన్ని ఒక్కసారిగా అందుకోవాలంటే లోకులందరికీ చేతగాదు. లోకంలో మధ్యములుంటారు. మందులుంటారు. అతి మందులు కూడా ఉంటారు. అంచేత వారందరినీ అంచెల వారీగా ఆస్థాయి కెదిగించాలని మరలా క్రిందికి దిగివచ్చి కర్మయోగ - సమాధియోగ భక్తియోగాలనే మూడింటినీ బోధిస్తుంది గీత. ఎందుకంటే మానవులందరూ భగవంతుడికి కావలసిన వారే. మమ వర్త్మాను వర్తంతే మనుష్యాః పార్థ సర్వశః అయనే కంఠోక్తిగా చెప్పిన మాట. ప్రతి ఒక్కరూ నా మార్గంలోనే బ్రతుకుతున్నారు. కాబట్టి వారి నుద్ధరించటం నా కర్తవ్యమంటాడు

Dr Dayananda Swamy ebooks



భగవానుడు. ఎంత గొప్ప మాట ఇది. బుద్ధి జీవులని పేరు మానవులకు. అందరికీ బుద్ధి అనే సాధనం దగ్గర ఉన్నా దానికి రజో మాలిన్యం తమో మాలిన్యం దట్టంగా పట్టి ఉంటాయి. అందుకే బ్రహ్మ జ్ఞానం వారికెంత బోధించినా పట్టుపడదు. అంచేత తమో మాలిన్యం క్షాళితం చేయటానికి కర్మయోగమూ - రజో మాలిన్యం కడిగి వేయటానికి సమాధి భక్తియోగాలనూ వర్ణించి చెప్పింది. అప్పటికెంత సానుభూతో చూడండి మన మీద భగవానుడికి. ఎంత సార్వ జనీనమో **Universal** చూడండి భగవద్గీత. పండితులకే కాదు పామరులకూ చూపుతుందది తరణోపాయం. తేపి చాతి తరంత్యేవ నిత్యం శ్రుతి పరాయణాః - పెద్దల నడిగి తెలుసుకోండి. వారి బోధ వినండి. మీరూ జ్ఞానం సంపాదించి బాగుపడతారని పామరులకూ కూడా అభయ మిస్తుంది గీత.

అంతేగాదు. కర్మగాని సమాధి గాని భక్తిగాని జ్ఞానంగాని ఏదైనా యోగంగా మార్చుకొని చూడండని అది మనకిచ్చే గొప్ప సలహా. అసలైన పరిపూర్ణమైన భగవత్తత్త్వాన్ని పట్టుకోటమే యోగం. యోగమంటే అసలు కలయిక **Union** అని అర్థం. జీవేశ్వరైక్యమే అది. దానికి కేవల కర్మ పనికిరాదు. అహంకార మమకారాలు వదలని అనుష్ఠాన రూపమది. కేవల సమాధి పనికిరాదు. అనులోమంగా ఏదీ పట్టుకోక ప్రతిలోమంగా చిత్తవృత్తులను ఖాళీ చేసుకొనే ఉద్యమమది. అలాగే కేవల భక్తి పనికిరాదు. అనులోమంగా ఒక మూర్తిని ధ్యానిస్తూ కూచున్నా అది ఆయా దేవతా

Dr Dayananda Swamy ebooks


మూర్తులే. వారిని గూడా అనేకంగా నీకన్యంగా భావిస్తుంటావు కాబట్టి అదీ పనికిరాదు. పోతే కర్మ నిష్కామమైన యోగంగా మారితే అది చిత్త శుద్ధి నిస్తుంది. సమాధి యోగంగా మారితే అది ఆత్మజ్ఞానానికి కావలసిన ఏకాగ్రత నిస్తుంది. అలాగే భక్తి దేవతోపాసనగా గాక అనన్య భావనతో పాటిస్తే అది నిర్గుణమైన బ్రహ్మోను భవానికే దారి తీస్తుంది. అప్పుడన్నీ కలిసి అఖండమైన ఆత్మ జ్ఞానంగానే పరిణమిస్తాయి. ఇదీ భగవద్గీత చేసి చూపిన అద్భుతమైన సమన్వయం **Grand Synthesis.**

అందుకే కర్మానుష్ఠానం చెప్పదు గీత. కర్మయోగం బోధిస్తుంది. ధ్యానమని చెప్పదు. ధ్యానయోగమని వర్ణిస్తుంది. ఉపాసన అనేమాట రానీయదు. దానికి మారుగా భక్తియోగ మని పేర్కొంటుంది. ఉపనిషత్తులలోని దేవతోపాసనలన్నీ కామ్యకర్మలు గనుక తగ్గు జాతివని త్రోసి పుచ్చుతుంది. ఆయా దేవతలను గూర్చి చేసే యజ్ఞాలూ యాగాలూ యాంత్రికమైన చేష్టలవి జ్ఞానానికి పనికిరావు. అసలు జ్ఞానమే ఒక మహాయజ్ఞం. దానికి తీసికట్టు మిగతా యజ్ఞాలేవైనా. అవి కేవలం భౌతికమైన ద్రవ్య య జ్ఞాలైతే ఇది జ్ఞానయజ్ఞం. నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే – శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ జ్ఞాన యజ్ఞః పరంతప అని గీతా సందేశం. మరి సన్న్యాస మంటే కాషాయ గుడ్డలు కట్టుకొని పరుగెత్తిపోవటం కాదు. మనస్సన్న్యాసమే అసలైన సన్న్యాస మని లోకానికి చాటి చెప్పింది. సర్వ కర్మాణి మనసా సన్న్యస్య – చేత సా సర్వ కర్మాణి

Dr Dayananda Swamy ebooks



మయి సన్న్యస్య అని పదే పదే గుర్తు చేస్తుంది. అంతే కాదు. బ్రహ్మ క్షత్రాది వర్ణ విభాగం కూడా ఏ మానవుడూ సృష్టించింది కాదు. నేనే కల్పించానని ముందు చెప్పి సర్వసాక్షి నైన నేను మాత్రమెలా కల్పిస్తాను. అది వారి వారి స్వభావాన్నిబట్టి ఏర్పడిందేనని పేర్కొంటుంది భగవద్గీత. నిజమే గుణ కర్మలను బట్టి ఏ వైషమ్యమైనా సృష్టిలో. సమమైన దృష్టితో చూస్తే ఏ విభాగమూ లేదు. అందుకే సమదర్శనమే గొప్ప దర్శనమని కూడా చాటుతుంది గీత.

ఇలాటి విప్లవాత్మకమైన విశ్వజనీనమైన భావాలెన్నో ఉన్నాయి భగవద్గీతలో. ఆఖరుకు మత్స్య కూర్మాద్యవతారా లెక్కడ ఉన్నాయి మనం చూడలేదు గదా అని హేతువాదు లీనాడు ప్రశ్నిస్తే అవి నమ్మినా నమ్మకపోయినా భగవ ద్విభూతి ఎక్కడ కొట్టవచ్చినట్టు కనిపిస్తే అదే భగవదవతార మనుకోమని ఎంతో నవీనమైన భావాన్ని కూడా మనకందిస్తుంది. య ద్య ద్విభూతి మత్సత్త్వం - తత్తదేవా వ గచ్ఛత్వం మమ తేజోంశ సంభవ మంటే అదే గదా అర్థం. ఇదుగో ఈ సమన్వయ మార్గమే భగవద్గీత ప్రత్యేకత. అంతేకాదు. ఆధ్యాత్మికమే గాక ధార్మిక నైతిక సామాజిక శారీరక మానసిక దైవందిన జీవిత రంగాలలో ఏ రంగంలో మానవుడెలా జీవించాలో వాడి సుఖ జీవనానికేది ఆవశ్యకమో అదంతా పూస గుచ్చినట్టు బోధించి మానవజాతి సర్వతో ముఖాభివృద్ధికి తోడు పడటమింకా దానికున్న గొప్ప విశిష్టత.

Dr Dayananda Swamy ebooks


మానవులలో దైవగుణ సంపన్నులెవరో ఆ సురరాక్షస గుణాలున్న వారెవరో - వారి వారి ఆహార విహారా లెలాటివో - ఎలాంటి దసలు ఆదర్శప్రాయమైన జీవితమో - అది ఎలా అలవరుచుకోవాలో - ప్రొద్దున లేచినప్పటి నుంచీ రాత్రి పడుకోబోయే వరకూ బ్రతికినంత కాలమూ ఏ లక్ష్యం కోసం బ్రతుకు సాగించాలో మానవ లోకానికి తెలియజేయటం కన్నా విలువ గల ప్రసంగమేముంది. అది భగవద్గీత సాధించినట్లు ఏ గ్రంథమూ సాధించ లేదంటే అతిశయోక్తి కాదు. యదిహాస్తి తదన్యత్ర అని మహాభారతానికి సామూహికంగా వచ్చిన కీర్తి అందులో ఏకదేశమైన ఒక్క భగవద్గీతకే అన్వయించినా అన్వయించుకోవచ్చు. మానవ విజ్ఞాన సర్వస్వమే భగవద్గీత. **Encyclopedia of human knowledge.**

అది మనసులో ఉండే నేను నా యీ గ్రంధానికి భగవద్గీతా సర్వస్వమని పేరు పెట్టాను. ఇది నేను వ్రాయాలని వ్రాయలేదు. అసలా తలంపు కూడా లేదు నాకు. ఎందుకంటే నేను వ్రాసినవే చాలా ఉన్నాయిప్పటికి. తత్త్వ సాహిత్యమనీ - సాహిత్యతత్త్వమనీ పేరుపెట్టి పది పదిహేను గ్రంథాలు వేదాంత విజ్ఞానం జిజ్ఞాసు లోకాని కందివ్వాలని అప్పుడప్పుడు వ్రాసి ప్రకటించాను. కాని రచనా వ్యాసంగమే గాక ప్రవచన వ్యాసంగం కూడా ఉన్నవాణ్ణి నేను. ఆ సందర్భంగా ప్రస్థానత్రయం శాంకర భాష్యంతో మొదట హైదరాబాదులోనూ తరువాత విజయవాడలోనూ కొన్ని సంవత్సరాల నుంచీ సత్సంగ సభ్యులకు ప్రతి దినమూ దీక్షగా బోధ చేస్తూ వచ్చాను. అందులో గీతా ప్రవచనం హైదరాబాదులో 150 రోజులు

Dr Dayananda Swamy ebooks



సాగితే విజయవాడలో 96 రోజులు గడిచింది. అది కాసెట్లలో రికార్డు చేశారు మనవాళ్లు.

అంతటితో ఆగకుండా స్వదేశంలోనూ విదేశాలలోనూ ఉన్న మా శిష్యులే కొందరు వాటిని గ్రంధస్థం చేసి ప్రచురించమని హార్దికంగా ఆర్ధికంగా కూడా నన్ను ప్రోత్సహించారు. గ్రంధస్థం చేసే ఓపిక నాకీ వయసులో లేదని చెబితే - పోనీలెండి మేమే చేసి మీకిస్తామని చెప్పి కొందరు శిష్యురాండ్రు ఇటు విజయవాడలో అటు హైదరాబాదులో అదే పనిగా కూచుని పాపం పది పదిహేనధ్యాయాల వరకూ కాసెట్లు వింటూ వాటిని చక్కగా కాగితాల మీద వ్రాసి చేతికిచ్చారు. ఆర్థికంగానూ యధాశక్తిగా తోడుపడ్డారు. విదేశవాసులైన శిష్యులు సమక్షంలో లేకున్నా ఆర్థికంగా బాగా ఆదుకొన్నారు నన్ను. ఇంతగా ఇంతమంది పట్టుపడితే ఇక నేను బిద్ధకించి ప్రయోజనం లేదని రంగంలో దిగవలసి వచ్చింది.

కాని తీరా దిగన తరువాత రెండు ఇబ్బందు లెదురయ్యాయి. నేను భగవద్గీత ప్రచవనం చేసినప్పుడేవేవో చెప్పాను. ఎన్నెన్నో చెప్పాను విషయాలు. శంకర భాష్యమూ చెప్పాను. దానిమీద ఎంతో భావన చేసీ చెప్పాను. అక్కడి నుంచీ ఇక్కడి నుంచీ పట్టుకు వచ్చి ఎన్నో ప్రసంగాలు చేశాను. అందులో చాలా పునరుక్తులూ ఉన్నాయి. అప్రస్తుత ప్రసంగాలూ ఉన్నాయి. అవన్నీఅలాగే ఉంచి ప్రచురిస్తే బాగుండదు. గందరగోళంగా ఉంటుంది పాఠకులకు. కనుక ప్రచురణ కనుగుణంగా ఎంతో సవరించి ఒక పద్ధతిలో పెట్టవలసి వచ్చింది. ఇది ఒకటి.

Dr Dayananda Swamy ebooks

ఇంకొకటి ఏమంటే మిగతా ఎక్కువగా చెప్పిన విషయాలన్నీ కత్తిరించినా నేను చెబుతూ వచ్చిన అతి ముఖ్యమైన భావాలేవీ జారిపోకుండా సేకరించటం నా బాధ్యత. అక్కడక్కడ శాంకరభాష్య సూక్తులుదా హరిస్తూ వాటితో నా భావాలు సరిపోల్చుకొంటూ రావలసి వచ్చింది. అదీ ఇదీ అయ్యేసరికి గ్రంథ పరిమాణం బాగా పెరిగిపోయింది. అందులోనూ ఈ మొదటి షట్కమే ఇప్పుడయిదు వందల పేజీలకు పైగా తయారయింది. ఇక మిగతా రెండు షట్కాలూ చేరితే మూడూ కలిసి 15, 16 వందల పుటలకు తక్కువ కావు. ఇంకా ఎక్కువే అవుతాయేమో నని కూడా అనుమానమే. ఇదంతా ఓపికగా వ్రాసి మొత్తం గ్రంథ మొక్కసారే ప్రకటిద్దామా అని నాకాలోచన వచ్చింది. అలాగైతే మూడు సంపుటాలూ పాఠకుల కొకే మారు అందజేయ వచ్చు. కాని దానికి చాలా దీర్ఘకాలం పడుతుంది. జిజ్ఞాసువులైన పాఠకులింత కాల మెదురు చూడలేరు కూడా. అంచేత అంత దీర్ఘమైన ప్రణాళిక ఇప్పుడే వేయట మిష్టం లేక లేని ఓపిక తెచ్చుకొని మొదటి ఆరధ్యాయాలూ ముందుగా వ్రాసి ప్రకటించవలసి వస్తున్నది.

సమగ్రమైన గ్రంథ మొక్కసారిగా మీకు అందివ్వ లేకపోయాననే కొరత ఒకటి మనసులో ఉన్నప్పటికీ మొదట ఈ ప్రథమ షట్కమైనా పూర్తి చేసి మీ చేతిలో పెట్టగలిగానని నాకు తృప్తి. భగవద్గీతా సర్వస్వమని పేరుపెట్టి నందుకిది ఆపేరుకు తగినట్టుందో లేదో నాకు తెలియదు. మీరు

Dr Dayananda Swamy ebooks



తెలియజేస్తే తెలుసుకొని సంతోషిస్తాను. కనుక వివేచనా శీలురైన పాఠకులు ముందుగా నేను వెలువరించి మీకందించిన ఈ ప్రథమ సంపుటాన్ని జాగ్రత్తగా పరిశీలించి నాకు తెలిపితే మీ ఉత్సాహాన్ని బట్టి మిగతా రెండు సంపుటాలూ కాలక్రమేణా ప్రకటించి మిమ్ము తృప్తి పరచాలని ఉంది నాకు. ఈ రూపంగా శ్రీ కృష్ణ కృష్ణద్వైపాయన శంకర భగవత్పాదాది సద్గురు ప్రసాద లబ్ధమైన అద్వైత విజ్ఞాన ధనాన్ని నలుగురమూ పంచుకొని అనుభవిస్తూ మానవ జన్మ సార్థకం చేసుకోవాలని కూడా ఉంది. ఇక సెలవా మరి.

**ఇతి**

**విబుధ జన విధేయః**

## శ్రీనివాస నామధేయః

Dr Dayananda Swamy ebooks

# 1. విషాద యోగము

ఉపనిషత్తులు - బ్రహ్మ సూత్రాలు - భగవద్గీత - ఈ మూడింటికీ ప్రస్థాన త్రయమని పేరు. ప్రస్థాన మంటే మార్గమని అర్థం. ప్రస్థాన త్రయమంటే మూడు మార్గాలని బోధపడుతున్నది. కాని వాస్తవంలో మూడు మార్గాలు లేవిక్కడ. ఒకే ఒక మార్గం మోక్షానికి. నాన్యః పంథా అయనాయ విద్యతే అని చాటుతున్నది శాస్త్రం. మరి మూడేమిటి. ఒకే మార్గంలో మూడు మజిలీలవి. అందులో మొదటి భూమిక ఉపనిషత్తులు. రెండవది బ్రహ్మసూత్రాలు. పోతే మూడవది భగవద్గీత. మోక్షసాధకుడైన మానవు డంచెల వారీగా ఈ మూడింటిలోనూ ప్రయాణం చేస్తూపోతే చివరకు మోక్షమనే గమ్యాన్ని చేరగలడు. ఉపనిషత్తులు శ్రవణానికీ బ్రహ్మసూత్రాలు మననానికీ భగవద్గీత నిది ధ్యాసనకూ తోడ్పడతాయని చెబుతారు పెద్దలు.

Dr Dayananda Swamy ebooks



బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్య డిలాగే ఉపదేశిస్తాడు తన భార్య మైత్రేయికి. ఆత్మావా అరే ద్రష్టవ్యః ఆత్మను చూడాలి మైత్రేయీ నీవు. అది ఎలాగో తెలుసా. శ్రోతవ్యో - మంతవ్యో - నిదిధ్యాసితవ్యః - మొదట శ్రవణం చేయి - తరువాత మననం చేయి - ఆ తరువాత ధ్యానం చేయి - అలా చేస్తే నీకు తప్పకుండా ఆత్మ సాక్షాత్కార మవుతుందంటాడు. అసలు విషయ మేమిటంటే మనకందరికీ మూడు వ్యాధులున్నాయి. మనకంటే మనలో చదువు సంధ్యా లేక పామరంగా బ్రతికే మానవులకే గాదు. అంతో ఇంతో చదువుకొన్న పండితులకూ శాస్త్రజ్ఞులకూ కళాకారులకూ తుదకు నాలుగు వేదాలూ ఏకరువు పెట్టిన ధర్మశాస్త్రజ్ఞులకూ - సర్వే సర్వత్రా పట్టుకొన్న వ్యాధులివి. సర్వభూతాని సమ్మోహం సర్గేయాంతి అన్నట్టు పుట్టుకతోనే సంక్రమించినవి. ఆఖరు కొక్క విదేహ ముక్తుడేమైనా తప్పించుకొంటాడేమో గాని జీవన్ముక్తుడికి కూడా ప్రారబ్ధ రూపంగా వెంటాడే బాపతే. ఇంతెందుకు. భూమండలం మీద శరీర మనే ఉపాధితో బ్రతుకుతున్న ప్రతి మానవుడూ వ్యాధిగ్రస్తుడే. ఒకటిగాదు. రెండుగావు. మూడు వ్యాధులు. అందరికీ సంక్రమించిన సాంక్రామికమైన వ్యాధులు.

ఏమిటా వ్యాధులు. అజ్ఞాన మొకటి - సంశయమొకటి - విపర్యయ మొకటి. అజ్ఞాన మంటే అసలు జ్ఞానమే లేదని గాదు. బుద్ధి జీవులైన మానవుల కంతో ఇంతో జ్ఞానముండనే ఉంటుంది. కాని పామరుడు మొదలు పండితుడి వరకూ ప్రతి ఒక్కడి జ్ఞానమూ పరిమితమైన జ్ఞానమే. పరలోకా

Dr Dayananda Swamy ebooks


లున్నాయి - జన్మాంతరా లున్నాయని చాటి చెప్పే మీమాంసకుడి జ్ఞానం కూడా పరిమితమే. దీనికే విశేష జ్ఞానమని పేరు. అక్కడి కక్కడ పరిచ్ఛిన్నమే కాని అది పరిపూర్ణమైన జ్ఞానం కాదు. సామాన్యమైన జ్ఞానమే పరిపూర్ణమైనది. కనుకనే దానికి భిన్నమైన జ్ఞానాలన్నిటినీ అపర విద్యలని త్రోసిపుచ్చింది ముండకోపనిషత్తు ఋగ్వేదం దగ్గరి నుంచీ ఈనాటి **Computer Sciences** వరకూ అన్నీ అపర విద్యలే. పోతే ఇలాటి అజ్ఞాన మున్నంత వరకూ సుఖం లేదు. అది సంశయమనే మరొక వ్యాధికి దారి తీస్తుంది. కొంత తెలిసిన వాడికి మిగతాదంతా సందేహమేగదా. జీవ జగదీశ్వరులు మూడూ ఆత్మ స్వరూపమేనని గుర్తిస్తే అది పరిపూర్ణమైన సామాన్య జ్ఞానం. అలాంటి జ్ఞానానికి నోచుకోకపోతే అంతా సందేహమే. కాగా ఇలాటి సంశయమనే వ్యాధి ఎప్పుడేర్పడిందో అది మరొక మూడవ వ్యాధిని కల్పించింది. అదేదో గాదు విపర్యయం. అంటే అంతా ఆత్మ స్వరూపంగా గాక అదే జీవ జగదీశ్వరులుగా మారి మనలనీ సంసారంలో పడ దోస్తుంది. విపర్యయ మంటే తల క్రిందులు గావటమని అర్థం. ఆత్మ అనాత్మ ప్రపంచంగా మారటమే తల క్రిందులంటే. కనుక ఇవి మూడూ మనకందరికీ పట్టుకొన్న మూడు ప్రబలమైన వ్యాధులు.

వ్యాధి అని ఎప్పుడన్నామో అప్పుడు దానికి చికిత్స చేసుకోవట్టం మన కర్తవ్యం. ఎవడికి వాడు చేసుకోలేడు కాబట్టి ఒక వైద్యుడు కావాలి మనకు. అతడు చికిత్స చేస్తే మన కనారోగ్యం పోయి ఆరోగ్యమనే ఫలితం చేకూరటం అన్నిటికన్నా ముఖ్యం. ఇంతకూ వ్యాధీ వైద్యుడూ

Dr Dayananda Swamy ebooks



విశేష రూపాలుగా భాసిస్తున్నదో - అలాగే ఆత్మ అనాత్మగా భాసిస్తున్నది. కాబట్టి సర్వమూ ఆత్మేనని చివరకు ప్రతిపాదించా రాయన.

దీనితో ఉపనిషత్తులు వర్ణించిన ఏకాత్మ భావం స్థూణా నిఖనన న్యాయంగా సాధకుడి మనసులో బాగా గట్టిపడింది. ఉపనిషత్తుల ద్వారా శ్రవణం చేసిన విషయంలో ఎలాంటి సందేహ మేర్పడినా దాన్నిఈ బ్రహ్మసూత్రాలు మననం చేస్తేచాలు. నిర్మూలమైపోయి మనకు నిశ్చయ జ్ఞాన మేర్పడుతుంది. శ్రవణం వల్ల అజ్ఞానమనే రోగం తొలగిపోయి ఆత్మజ్ఞానమనే ఆరోగ్యం చేకూరితే - మననం ద్వారా సంశయమనే రుగ్మతపోయి నిశ్చయమనే ఫల మేర్పడిందన్న మాట. అయినా పూర్తిగా పరిష్కారం చిక్కలేదు మనకు. నిశ్చయ జ్ఞాన మేర్పడ్డా అది కేవలం మనస్సులోనే. దైనందిన జీవితంలో అది ప్రవేశించడం లేదు. జ్ఞానం జ్ఞానమే - జీవితం జీవితమే అయి కూచుంది. అలాగైతే తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదమన్న సామెతే అవుతుంది. పరిపూర్ణత లేదు. సిద్ధాంతం అనుభవంగా మారినప్పుడే పరిపూర్ణత. అదే మన సమస్యకు శాశ్వతమైన పరిష్కారం. అంతవరకూ విపర్యయమనే వ్యాధి మనలను వదలిపెట్టదు. విపర్యయమంటే ముందే మనవి చేశాము తల్లక్రిందులు వ్యవహారమని. అంతా స్వరూపమేనని మానసికంగా గుర్తించామే గాని ప్రతిక్షణమూ దాని కనుగుణంగా జీవితం సాగించగలమా. వ్యవహారంలోకి వచ్చే సరికి ఆత్మ అనాత్మ అనే భేదం - తన్ని మిత్తంగా ఏర్పడే సుఖదుఃఖాదులూ కొట్ట వచ్చినట్టు కనిపిస్తూంటాయి. ఇక సమస్య ఏమి పరిష్కార మయిందని.

Dr Dayananda Swamy ebooks



కాబట్టి ఇలాంటి విపర్యయ మనే మూడవ వ్యాధికి కూడా చికిత్స చేయగలిగి నప్పుడే మానవుడికి ఘన విజయం. ఏమిటది ఎలాగ ఏదోగా దది నిది ధ్యాస. నిధ్యాతు మిచ్ఛా నిది ధ్యాసా అన్నారు. నిధ్యాన మంటే బాగా నిగా పెట్టి చూడటం. **Close keen total attention – Observation.** ఏకాగ్రత అనుకోండి. భూతేషు భూతేషు విచిత్య అని కేనోపనిషత్తు చెప్పినట్టు ఏది చూచినా అస్తి భాతి అంతకన్నా విశేషమేమీ లేదని తదేక దృష్టితో బ్రతుకు సాగించటం. బ్రహ్మ పశ్చాద్బ్రహ్మ పురస్తా త్తన్నట్టు భావం లోనూ బాహ్యంలోనూ ఎక్కడ ఎప్పుడు ఏది చూచినా అంతా బ్రహ్మమయం అంతా ఆత్మమయం మరొక విజాతీయ భావమే మనసుకు రాకూడదు. ఇదీ నిది ధ్యాస అంటే. విజాతీయ ప్రత్యయానంతరిత సజాతీయ ప్రత్యయ ప్రవాహః అని శాస్త్రమే ఘోషిస్తున్నది. ఇలాంటి ధ్యాన మలవడితే మన మపర ప్రహ్లాదులమూ అపర కుచేలురమూ అయిపోతాము. సందేహం లేదు. యాజ్ఞవల్క్య మహర్షి హామీ ఇచ్చినట్లు తప్పకుండా మన కాత్మ ప్రత్యక్షమయి తీరుతుంది. ఇదం సర్వం యదయ మాత్మా. ఆత్మా నాత్మలనే హద్దు చెరిగిపోయి సర్వమూ ఆత్మ స్వరూపంగానే దర్శనమిస్తుంది. ఇక ఏ సమస్యా ఉండబోదు. సంసారం కాదప్పుడు మనకది సాయుజ్యమే.

కాని ఇలాంటి మహా భాగ్యం సాధకుడికి లభించాలంటే సామాన్యం కాదు. విపర్యయమనే మూడవ వ్యాధికి కూడా మందు పడాలి. మందు నిది ధ్యాసే అయినా – దాని వల్ల చేకూరే ఆరోగ్యం ఆత్మానుభవమే మోక్షమే అయినా – అది మనకు ప్రసాదించే గొప్ప వైద్యనాధుడు కావాలి.

Dr Dayananda Swamy ebooks



మనకు బోధిస్తున్న నిది ధ్యాసనా రహస్యం. దీనితో విపర్యయమనే ఆఖరి వ్యాధి కూడా నిర్మూలమై పోయి మోక్షమనే మహాఫలం జీవించి ఉండగానే సిద్ధించి మానవుడు జీవన్ముక్తినే చవి చూడగలడు. అలా చూస్తే ఇక ఏ సమస్యా లేదు జీవితానికి.

అయితే ఇప్పుడొక ఆ శంక. శ్రవణ మనన నిది ధ్యాసలనేవి మూడూ ఉపనిషత్తే చెప్పింది గదా. అదే గదా యాజ్ఞవల్క్యుడు మైత్రేయి కుపదేశించాడని ఉదాహరించారు. అప్పటికి వాటిని గురించిన వివరణ కూడా అందులోనే వస్తుంది గదా. ఇలా మొదటి ప్రస్థాన మైన ఉపనిషత్తులోనే సాధన మార్గమంతా మనకు లభిస్తున్నప్పుడిక ఈ బ్రహ్మసూత్రాలు భగవద్గీత మనకు క్రొత్తగా చెప్పేదేమిటి. అవసరమేమిటి. ఉపనిషత్తుల వల్లనే సమస్తమూ సాధకుడైనవాడు గ్రహించవచ్చు గదా అని ప్రశ్న.

వాస్తవమే. సిద్ధాంతమూ సాధనా అంతా ఉపనిషత్తులోనే వర్ణించబడ్డాయి. సందేహం లేదు. అందువల్లనే అసలు ఉపనిషత్తులే శాస్త్రమని పేరు వచ్చింది. సమస్యా- పరిష్కారమూ రెండూ సాంగోపాంగంగా వర్ణించి చెప్పేదేదో అదీ శాస్త్రమంటే. శాస్తీతి శాస్త్రమ్. కుండబద్దలు కొట్టినట్టు నిర్మొహమాటంగా తెగేసి చెప్పేది గనుక దానికి శాస్త్రమని పేరు వచ్చింది. ఆ పని ఉపనిషత్తే చేస్తున్నది గనుక వేదాంతమనే మాట వేదానికి చివరి భాగమని వాచ్యార్థం చెప్పుకొన్నా మానవుడి విజ్ఞానానికే అంతం లేదా పర్యవ సానమని లక్ష్యార్థం కూడా చెప్పుకో

Dr Dayananda Swamy ebooks


మంటారు పెద్దలు. కానీ వచ్చిన ఇబ్బంది ఏమంటే శ్రవణ మననా దులు మూడూ ఉన్నా అవి చాలా గుప్తంగా ఉన్నాయక్కడ. స్పష్టంగా బయటపడి కనపడవు. బాగా విమర్శించి చూచే ఉత్తమాధికారి కైతేనే అవి ప్రకటమై కనిపిస్తాయి. అలాంటి వాడి కుపనిషత్తే చాలు. ఇక దేని సహాయమూ అక్కరలేదు.

పోతే అందరూ అలాటి కుశాగ్రబుద్ధు లుండరు. మంద మధ్య మాధికారులే నూటికి తొంబది మంది. అలాటి పాఠకులకు కావలసి వస్తాయి బ్రహ్మసూత్రాలూ భగవద్గీతా. అలాగని అవి ఏవో క్రొత్త విషయాలు మనకు చెబుతాయని కాదు. ఉపనిషత్తులు చెప్పనిదంటూ ఏదీలేదు. అయితే తద్ద్వారా శ్రవణం చేసిన విషయం మనకు బాగా పట్టకపోతే అందులో దాగి ఉన్న ఉపపత్తులను చక్కగా సమన్వయించి చూపటానికి వచ్చాయి బ్రహ్మసూత్రాలు. కనుకనే వేదాంత వాక్య మీమాంసా అని పేర్కొన్నారు దాన్ని బాదరాయణులు. అలాగే ఉద్దేశించి వ్రాశారు సూత్రాలను. కాగా భగవద్గీత కూడా క్రొత్త విషయాన్ని ఏదీ చెప్పదు. ఉపనిషత్సారమే భగవద్గీత. ఉపనిషత్తులు గోవులైతే వాటిని పిండగా వచ్చిన క్షీరమే భగవద్గీత అని గదా వర్ణించారు. మరి ఎందుకీ భగవద్గీత అంటే ఉపనిషత్తులలో చాలా నిగూఢంగా ఉన్న అనుభవ రహస్యాలను బయటపెట్టటానికి.

ఇంకా ఒక రహస్యమేమంటే మనమెక్కడికైనా ప్రయాణం చేస్తున్నామంటే ఒక్కొక్క మైలురాయీ దాటి పోతుంటాము. రెండవ మైలు

Dr Dayananda Swamy ebooks



ఎంత అద్భుతంగా ఉందో చూడండి ఈ కల్పన. జీవితమంతా కండ్లకు కట్టినట్లు చూపుతున్న దుపనిషత్తు. ఇది ఎంతో వ్యంగ్యంగా బయటపెడుతున్నాడు వ్యాసుడు. ఎలాగ. కురుక్షేత్ర మేదోగాదు సంసారమే. అర్జునుడెక్కి కూచున్న రథ మీ శరీరమే. అర్జునుడు నీవూ నేనే. నరుడని పేరు గదా అర్జునుడికి. నరులమే గదా మనం కూడా. పోతే సారథి ఎవరు బుద్ధి అని గదా వర్ణించిం దుపనిషత్తు. అది కృష్ణ పరమాత్మే. మరి గుఱ్ఱాలో. మన ఇంద్రియాలే అర్జునుడి గుఱ్ఱాలు. కాదా అవి వెళ్ళిపోయే మార్గాలు ఆ సైనికుల మధ్యలో ఉన్నవే. కౌరవ పాండవ సైన్యాలు కూడా ఏవో కావు. దైవాసుర సంపదలకు ప్రతీకలే. అదే దైవాసుర సంప ద్విభాగ యోగంగా మలిచి చూపాడు గీతలో వ్యాసమహర్షి. పోతే ఈ దేహాత్మ భావం వదలకుండా బాధపడుతున్నాడే అర్జునుడు. వాడు అలాటి అభిమానంతో కొట్టు మిట్టాడుతూ సాంసారిక మైన సుఖదుఃఖా లనుభవించే ప్రతి ఒక్క మానవుడే. ఇంతకూ కఠోపనిషత్తు బాహాటంగా చెప్పిన కథ వ్యంగ్యంగా సూచిస్తున్నాడు వ్యాస భగవానుడు.

పోతే ఈ సుఖదుఃఖాదుల భోక్తృత్వాని కేమిటి పర్యవసాన మని అడిగితే మరణమేనని చాటుతున్నది కఠోపనిషత్తు. ఒక మరణంతో సమసిపోదు. మరణం జననానికీ జననం మరణానికీ ఎడతెగని ఒకానొక విషవలయమిది. ఇది ఏమిటీ మరణ మనేది. దీని కేమిటి పరిష్కారమని యమధర్మరాజునే నిలదీసి అడిగాడొక కుర్రవాడు. అతని పేరు నచికేతుడు.

Dr Dayananda Swamy ebooks


కఠోపనిషత్తంతా ఇదే. యమ నచికేత స్సంవాదమే. అందులో చర్చించిన విషయమంతా మరణమనే సమస్యే. అసలు మరణమనే దొక్కటే సమస్య మానవుడికి. ఎన్నో ఉన్నట్లు కనిపిస్తాయి కాని ఎన్ని ఉన్నా అందులోనే చేరిపోతాయి. ఎంచేత. వాస్తవానికి జననం లేదు. జీవితం లేదు. అంతా మరణమే. మార్పే గదా మరణమంటే. ఒకటి పోయి ఒకటి రావటమే మార్పు. బాల్యం పోయి యౌవనం యౌవనం పోయి వార్ధక్యం. అది పోయి అవసానం. మరణం కాక ఏమిటి – ఒక ఆలోచన పోయి ఒక ఆలోచన. ఒక మాట పోయి మరొక మాట – ఒక చేష్టపోయి మరొక చేష్ట – మరణం కాక మరేమిటి. అలాగే ఒక జీవితమంతా గడచిపోయి మరొక జీవితం తయారవుతున్న దేమో. ఇలా జనన మరణాలు పరంపరగా ఏర్పడుతుంటే అంతా మరణమే జీవులకు. ఇలా ఆగకుండా సాగిపోవటమే మరణం.

ఇది కఠోపనిషత్తు వర్ణించినట్టే వర్ణిస్తున్నది భగవద్గీత. దేహి నోస్మిన్ యధా దేహే – కౌమారం యౌవనం జరా – తథా దేహాంతర ప్రాప్తిః – జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ – దుఃఖాలయ మశాశ్వతమ్ – మృత్యు సంసార వర్త్మని – ఇలా అంతా మృత్యుమయమే సంసారం. అందుకే దుఃఖాలయ మశాశ్వతం. అలాంటప్పుడిది గాక మరి సమస్య ఏముంటుంది మానవుడికి. కఠోపనిషత్తొక నెపం. భగవద్గీత అంత కన్నా పెద్ద నెపం. రెండింటిలోనూ అటు నచికేతుడికీ ఇటు అర్జునుడికీ

Dr Dayananda Swamy ebooks



కర్మణి. అర్జునా నేను ఆత్మ జ్ఞానం బోధించినా దానినందుకొనే అర్హత నీకు లేదు. నీకు అధికారం నేను బోధించిన కర్మయోగమే - అది నీకు తీవ్రమైన శ్రద్ధాసక్తులూ జిజ్ఞాసా అబ్బిన కొద్దీ సత్త్వశుద్ధి ఏర్పడి అదీ క్రమంగా ఎప్పటికో ఒకప్పటికి జ్ఞానానికి దారి తీస్తుందని సూచిస్తాడు. ఇంతకూ నచికేతుడొకడూ అర్జునుడొకడూ ఉన్నారని కాదు మనం భావించ వలసింది. ఆ రెండు పాత్రలూ మనకోసం సృష్టి అయినవే. నీకు తీవ్రమైన జిజ్ఞాసా ముముక్షా ఉంటే చెప్పు. మృత్యు రహస్యం బోధపడుతుంది. దానికి పరిష్కారమేదో అదీ తేటపడుతుంది. అలాటి సామర్థ్యానికి నోచుకోకపోతే అడుగుతావు వింటావేగాని కంటావని మాత్రం మేము గారంటీ ఇవ్వలే మంటారు అటు శాస్త్రమూ ఇటు సద్గురువులూ. ఇదీ అసలు అంతరార్థం.

ఏతావతా తేలిన సారాంశ మేమిటి. విషాదమే జీవిత సమస్య. కఠోపనిషత్తు చెప్పినా అదే. భగవద్గీత చెప్పినా అదే. అర్జునుణ్ణి మరచిపోయి మనం భావిస్తే చస్తామనే భయం పుట్టి పెరుగుతున్న మనకందరికీ ఉంది. ప్రతిక్షణమూ మనలను వెంటాడుతూనే ఉంది. మనమూ మన చుట్టూ ఉన్న బంధువర్గమూ అందరమూ పోతామే అని. ఇందులో ఒకటి మిథ్యాత్మ అయితే ఇంకొకటి గౌణాత్మ. మిథ్యాత్మ నేను - గౌణాత్మ నన్నంటి పట్టుకొన్న బంధుమిత్రాదులు. ఇంకా దేవుడు మేలు చేస్తే వస్తువాహనాది జడపదార్థాలు కూడా. నేను పోయినా కష్టమే. నాది పోయినా కష్టమే. ఒకటి అహం

Dr Dayananda Swamy ebooks

మరొకటి మమ. ఈ అహం మమలు రెండూ పోవటమెవరికీ ఇష్టం లేదు. రెండూ ఎప్పటికీ శాశ్వతంగా ఉండాలనే ఉండ జూచుకొని బ్రతుకుతూ ఉండాలనే మన ఆశ. ఇందులో ఎవరు పోయినా ఒప్పుకోను. నేను పోగూడదు. నావాళ్లూ పోగూడదు.

ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ - సఖీం స్తథా శ్వశురాన్ సుహృదశ్చైవ - సేనయో రుభయో రపి. రెండువైపులా కనిపిస్తున్న వారెవరు. ఎవరో గారు అందరూ మనవాళ్లే. సేనయో రుభయోః అంటే అప్పటికి మిత్రులూ శత్రువులూ - అనే తేడా లేదు. అందరూ పోతారనే భావంతో చూచినప్పుడు శత్రుమిత్ర భేదం లేదు. అంతా కలిసి మానవ మాత్రులే. అంతా మనవాళ్లే. స్వజనమే. ఎవరికి అర్జునుడికా. అర్జును డెక్కడ ఉన్నాడు. మనమే. అందరినీ చూచేసరికి నకాంక్షే విజయం కృష్ణ నచరాజ్యం సుఖానిచ - కింనో రాజ్యేన కింభోగైః - ఎందుకీ రాజ్యం - ఎందుకీ సుఖాలు - ఏవీ అక్కరలేదనే వైరాగ్య భావం కలుగుతుంది. ఎందుకని. స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ. మనవాళ్లనే చంపుకొని మనం గడించే ఆ సౌఖ్య మేమిటి. మీదు మిక్కిలి పాపమే వాశ్రయే దస్మాన్ - పాపాన్ని మూట గట్టుకొంటా మేమో.

అంతేకాదు. నచైత ద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ - యది వా నో జయేయుః - అసలీ యుద్ధమనేది జరిగితే మనమే గెలుస్తామని ఏమిటి నమ్మకం. మనమైనా గెలవ వచ్చు. మనం శత్రువులని భావించే

Dr Dayananda Swamy ebooks



మనవాళ్లైనా గెలవ వచ్చు. అందులో వారివల్ల నేను పోయినా బాధే - నావల్ల వారు మరణించినా బాధే. మరణ మెవరికైనా మరణమే గదా. వారు పోయి నేను బ్రతికినా - ఇంతమంది పోయారే అని బాధ. అలాకాక నేను పోయి వారు బ్రతికినా అసలు నేనే పోయానే అని బాధ. ఏ పక్షంలోనూ బాధే తప్ప సుఖం లేదు. శాంతి లేదు. అని ఆ నరుడికే గాదు. ఈ నరుడికీ పట్టుకొన్న విషాదమిదే. దీనితో కుంగిపోయి రథంలో కూలబడి పోయిన వాడా నరుడే గాదు. శరీర మనే రథంలోనే ఇలా ఆలోచిస్తూ ఇందులో నుంచి బయట పడలేక పోయే ఈ నాటి నరుడు కూడా. గాండీవం స్రంసతే హస్తా త్త్వక్చైవ పరిదహ్యతే - వేపథుశ్చ శరీరేమే జాయతే అని ఆక్రందనం చేస్తున్న దానరుడే గాదు. భయసంభ్ర మాందోళనలతో దిక్కు తోచక నిత్యమూ మరణ భయం తరుముకొని వస్తుంటే మనసు పనిచేయక జీవితాంతమూ సతమత మవుతున్న మనబోటి మానవులం కూడా.

లోకంలో ఆ బాలగోపాలమూ అందరికీ పట్టుకొన్న ఏకైక సమస్య ఈ విషాదమే. విషాద యోగం పరిష్కారం కాదు. సమస్య. శాస్త్రమెప్పుడూ పరిష్కారాన్ని ఉపదేశించాలి గాని సమస్య నేకరువు పెట్టటం కాదు. సమస్య నెందుకు ప్రపంచించటం. అది మనకీ లోకానుభవంలోనే సిద్ధమై ఉన్నది. అనుభవ సిద్ధమైనది సమస్య - శాస్త్ర సిద్ధమైనది దాని పరిష్కారం. అదే రోగమూ చికిత్సా అని చమత్కారంగా వర్ణిస్తూ వచ్చా మింతవరకూ.

Dr Dayananda Swamy ebooks



అందుకేనేమో భగవత్పాదులు కూడా సమస్యనేమిటి చెప్పేదని విషాదయోగానికి ఎక్కువగా భాష్యం వ్రాయకుండా మూడు నాలుగు మాటలలో క్లుప్తంగా చెప్పి ముగించారు. అత్ర దృష్ట్వాతు పాండ వానీక మిత్యారభ్య యావ న్నయోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవహ ఇత్యేత దంతః ప్రాణినాం శోకమోహాది సంసార బీజభూత దోషోద్భవ కారణ ప్రదర్శనార్థత్వేన వ్యాఖ్యేయో గ్రంధః - తధాహి అర్జునేన రాజ్య గురుపుత్ర మిత్ర సుహృత్స్వజన సంబంధి బాంధవేషు అహమేతేషాం మమైతే ఇత్యేవం ప్రత్యయ నిమిత్త స్నేహ విచ్ఛేదాది నిమిత్తౌ ఆత్మనః శోకమోహౌ ప్రదర్శితౌ కధం భీష్మమహం సంఖ్యే ఇత్యాదినా - ఇక్కడ పాండవ కౌరవ సైన్యాన్ని చూచి అనే శ్లోకం మొదలు ఇక నేను యుద్ధం చేయనని రథంలో కూలబడి పోయాడనే శ్లోకం వరకూ మహర్షి చెప్పదలచిన విషయ మొక్కటే. లోకంలో ప్రాణులందరికీ సంసార బంధమనేది ఏర్పడిందంటే దానికి కారణం మోహ శోకాలే. దానికి నిదర్శన మర్జునుడు తన వాళ్ల నందరినీ చూచి వీరందరూ నావారు వీరందరి వాడనూ నేను గదా అలాంటప్పుడు భీష్మ ద్రోణాదులతో నేనెలా పోరాడగలనని వాపోవటమే. ఇలా వ్యాఖ్యానిస్తే సరిపోతుందీ విషాదయోగ మంతా నంటారు ఆచార్యులవారు.

భగవద్గీత అనేది ఇతిహాసం కాదు. పురాణం కాదు. అది ఒక గొప్ప శాస్త్రం. శాస్త్రంగానే చూడాలి దాన్ని. ఏదో కథా కార్యాణమని చూడ

Dr Dayananda Swamy ebooks



వద్దంటారు భగవత్పాదులు. గీతా శాస్త్రం గీతా శాస్త్రమని మాటిమాటికీ హెచ్చరిస్తుంటా రాయన. అసలు గీతలోనే ఉందామాట. ఇతి గుహ్యతమం శాస్త్రమంటాడు మహర్షి. తస్మా చ్ఛాస్త్రం ప్రమాణంతే - యశ్శాస్త్ర విధి ముత్సృజ్య అని ఇటూ అటూ కూడా తిప్పి తిప్పి మాటాడుతాడు. కాకపోయినా ఉపనిషత్తు శాస్త్రమయి - ఉత్తర మీమాంస శాస్త్రమయి - గీత శాస్త్రం కాకపోవట మేమిటి. ప్రస్థాన త్రయమంతా కలిసి ఒకే ఒక శాస్త్రమని గదా పేర్కొన్నాము. శాస్త్రమనే అభిప్రాయంతోనే శాస్త్రాని కవశ్యంగా ఉండవలసిన అధికారి విషయ సంబంధ ప్రయోజనాలనే అనుబంధ చతుష్టయాన్ని కూడా భగవద్గీత కన్వయించి చూపారు శంకరులు. ఇమం ద్వి ప్రకారమ్ ధర్మమ్ నిశ్శ్రేయస ప్రయోజనం - పరమార్థ తత్త్వంచ వాసు దేవాఖ్యం పరం బ్రహ్మ అభిధేయ భూతం విశేషతః అభివ్యం జయత్ విశిష్ట ప్రయోజన సంబంధా భిధేయ వత్ గీతాశాస్త్రమ్.

అంచేత శాస్త్రీయమైన మార్గంలోనే బోధ చేయాలి గీత. చేస్తున్నది కూడా. శాస్త్రమెప్పుడూ అనువాద విధాన రూపంగా నడుస్తుంది. మనకిప్పుడున్న అనుభవాన్ని పేర్కొనట మను వాదం. పోతే దానికిది పరిహారమని సూచించటం విధానం. అలాగే చేస్తున్న దిప్పుడు గీత. మరణమే ప్రాణు లందరికీ ఉన్న సమస్య అని మన సమస్యను వర్ణించింది. అదే మొట్టమొదటి అధ్యాయం విషాదయోగం. కాగా దీనికి పరిహార

Dr Dayananda Swamy ebooks


మేమిటని అడిగితే అది ఏదోగాదు సన్న్యాసం - తత్ఫలితంగా నీకు కలిగేది మోక్షమే సుమా అని మన కర్తవ్యాన్ని విధిస్తున్నది. చిట్టచివరిదైన మోక్ష సన్న్యాస యోగమనే అధ్యాయం.

మోక్ష సన్న్యాస మంటే మోక్షం కోసం సన్న్యాసం. అంతేగాని మోక్షాన్నే సన్న్యసించటమని గాదు. మోక్షాన్ని సన్న్యసిస్తే మరలా విషాదమే మన పాలిటికి సమస్య పునరావృత్త మవుతుంది. మరి సన్న్యాస మేమిటి. వదులుకోట మని అర్థం. దేన్ని. నామరూపాలను. అవి సచ్చిదాత్మకమైన తత్త్వాన్ని కప్పివేసి మనకు కనపడకుండా చేశాయి. నామరూపాలే సంసారం. నామం లోపలి భావమైతే రూపం బాహ్యమైన పదార్థం Thing. మొదటిది జీవుడు. రెండవది జగత్తు. ఇదే గదా మనకు బంధం. ఇవి ఆవరించటం వల్లనే ఆత్మ స్వరూపం మరుగు పడింది గనుక దాన్ని పైకి తెచ్చుకోవాలంటే వీటి కప్పు తొలగించుకోవాలి. అదే సర్వధర్మాన్ పరిత్యజ్య. సన్న్యాసమంటే పరిత్యాగమే. సర్వధర్మా లేవో గావు. ఈ నామరూపాలే. ఇవే ధర్మాలు Properties belonging to the self.

మరి వీటిని వదిలేస్తే పట్టుకో వలసిన దేది. ఆ కొమ్మను పట్టుకొని గదా ఈ కొమ్మను వదిలేస్తా రెవరైనా. ఆ కొమ్మ ఏది. మామేకం శరణం వ్రజ. ఆ కొమ్మ నేనే నంటున్నాడు కృష్ణ భగవానుడు. నేనంటే కృష్ణ విగ్రహం కాదు. అహమాత్మా గుడా కేశ అని గదా సెలవిచ్చాడు. కృష్ణుడంటే నీలమేఘ శ్యామలమైన మూర్తిగాదు. అది ఉపాధి. ఆకాశానికి

Dr Dayananda Swamy ebooks



ఘటంలాగా. అమూర్తమైన ఆకాశంలాంటి దాత్మ. చిదాకాశం సర్వవ్యాపకం. అందుకే సర్వభూతాశయ స్థితః అని వర్ణించాడు. అలాటి వ్యాపకమైన చైతన్యమే ఇక్కడ మామేకమనే మాట కర్థం. అలాంటి ఆత్మతత్త్వాన్ని భజించినప్పుడే దానిమీద ఆరోపితమైన ఈ నామరూపాలనే అనాత్మ ధర్మాలన్నీ వదలిపోతాయి. పోతే అహం త్వా సర్వపాపే భ్యో మోక్షయిష్యామి. ఈ నామరూపాలనే సమస్త పాపాల నుంచి మోక్షమనేది లభిస్తుంది మానవుడికి. ఇదీ మోక్ష సన్న్యాస యోగం చివరకు చేసిన పరిష్కారం.

ఇంతకూ విషాదం ద్వారా సమస్య ఏమిటో బయట పెట్టింది గీతాశాస్త్రం. మోక్ష సన్న్యాసం ద్వారా దానికి పరిష్కారం సెలవిచ్చింది. ఇప్పుడీ సమస్య దగ్గరి నుంచి ఆ పరిష్కారం వరకూ మన చూపు ప్రసరిస్తే మధ్యలో ఒక పెద్ద వంతెన కనపడుతుంది. గోదావరి లాంటి ఒక పెద్దనది దాటాలంటే ఇద్దరి నుంచి అద్దరికి వెళ్లాలి. రెండు దరులనూ కలిపే ఒక వంతెన ఉండాలి. ఇక్కడ విషాద యోగ మిద్దరి అనుకొంటే మోక్ష సన్న్యాస మద్దరి. పోతే ఇక వంతెన ఏమిటి. మధ్యలో ఉన్న 16 అధ్యాయాలూ అలాటి ఒక పెద్ద వంతెనే అనుకోవచ్చు. కానీ ఈ వంతెన మీది నుంచి మన మొంటరిగా నడచి పోగలమా మనలో ప్రతి ఒక్కరికీ అలాంటి ధైర్య మున్నదా. అందరమూ ఉత్తమాధికారులం కాదు గదా. అంటే శాస్త్రమే కాక మార్గదర్శకుడైన సద్గురువు కూడా అవసర మన్నారు

Dr Dayananda Swamy ebooks


పెద్దలు. ఆచార్యవాన్ పురుషో వేద అని ఛాందోగ్యం వర్ణిస్తున్నది. శాస్త్రాచార్యోపదేశ జనిత జ్ఞానదీప ప్రకాశేన అని తరుచుగా బోధిస్తారు భాష్యకారులు.

అయితే ఎవరలాటి సద్గురువులు. కృష్ణభగవానుడా కావచ్చు. కృష్ణం వందే జగద్గురు మన్నారు. జగత్తు కంతా గురువయి నప్పుడు మనకు కాకుండా పోతాడా. కాని కృష్ణావ తారం కాదిక్కడ జగద్గురువంటే. కృష్ణ పరమాత్మ అవతారం ద్వాపరయుగానికే పరిమితం. అర్జునుడి లాంటి వారికే ఉపయోగపడ్డాడా అవతార పురుషుడు. పోతే పరమాత్మ స్వరూపంగా ఆయన ఎప్పుడూ ఉన్నాడు. అప్పుడూ ఇప్పుడూ ఉన్నాడు. అయితే పలకడు భాషించడు. పలకటానికీ చేయటానికీ అది కృష్ణుడిలాగా మూర్తం కాదు. అమూర్తం. అమూర్తం మూర్తీ భవిస్తే గాని మన కుపయోగ పడడు. మూర్తి దాని కుపాధి. అది ఎప్పటికప్పుడు ధరించగలదు. వదిలేయగలదా పరమాత్మ. అలా ధరించే మూర్తులే గురుమూర్తులు. గురువనే ఉపాధిలో చేరి కనిపించే బ్రహ్మ స్వరూపులే వారు. గురు స్సాక్షా త్పరం బ్రహ్మ అన్నమాట కిదే అంతరార్థం. ఇలాంటి సద్గురువు లైతే మనకే కాలంలోనైనా లభిస్తారు. లభిస్తారని చెప్పటానికి తార్కాణ కృష్ణుడు నిర్యాణమై పోయినా అపర కృష్ణుడొక శుక మహర్షి వచ్చి పరీక్షిత్తుకు తత్త్వోపదేశం చేయటమే. కృష్ణుడు అర్జునుడికి భగవద్గీతను పదేశిస్తే శుకుడు భాగవతమే బోధించాడు గదా పరీక్షిత్తుకు. మరి కృష్ణుడు బోధించినా పని చేయలే దది అర్జునుడికి.

Dr Dayananda Swamy ebooks



ఆయన తరఫున శుకుడు బోధించినా ఫలితమిచ్చింది పరీక్షిత్తుకు. సద్గురువు స్థాయి ఒక్కటే అయినా గ్రహించే శిష్యుల అధికార తారతమ్యాన్ని బట్టే అది ఒంట బడుతుందనటాని కింత కన్నా నిదర్శన మేముంది.

ఇంతకూ జగద్గురువే మనకు గురువు కానక్కరలేదు. తత్త్వ దృశుడైన ఏ సద్గురువైనా గురువే మనకు గ్రహించే తాహత్తుండా లేగాని. అందుకే తద్విద్ధి ప్రణిపాతేన - పరిప్రశ్నేన సేవయా అని శిష్యుడి కొక మూడు షరతులు పెట్టింది భగవద్గీత. కాని అవి కూడా సరిపోవు. అవి ఆషాఢభూతి లాంటి వాళ్లు కూడా ప్రదర్శించవచ్చు. అలాంటి పైపై తళుకులు కాదు మాకు కావలసిందంటూ మళ్లీ ఒక మూడు విధించింది. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పర స్సంయతేంద్రియః - బాహిరమైన లక్షణాలు కావు. ఆంతరికమైన శ్రద్ధాతాత్పర్యాదు లుండాలి శిష్యునికి. అప్పుడే జ్ఞానం లబ్ధ్వా. ఆత్మజ్ఞానం వాడికి లభిస్తుంది. అంతవరకూ ఉపదేక్ష్యంతి తే జ్ఞానం వారేమో ఉపదేశిస్తూనే ఉంటారు. నీకు మాత్రమది గగన కుసుమం.

అయితే ఒకటి. ఎంత యోగ్యత ఉన్న శిష్యుడైనా అడిగి తెలుసుకోవాలి విషయం. అడగనిదే అమ్మైనా పెట్టదంటారు. నా పృష్టః కస్యచి ద్బ్రూయా త్తని శాస్త్రం కూడా ఘోషిస్తున్నది. అలా అడగాలంటే సమస్యను గుర్తించినవాడే అడుగుతాడు. నచికేతునికి పట్టుకొన్న సమస్యే అర్జునుడికీ పట్టుకొన్న దిక్కడ. అదే మరణ సమస్య. విషాదం దాని మూలాన్నే. అలాంటి సమస్యతో మథన పడుతూనే అడిగా డర్జునుడు.

Dr Dayananda Swamy ebooks


కార్పణ్య దోషోపహత స్వభావః పృచ్ఛామి త్వా ధర్మ సమ్మూఢ చేతాః - విషాదంతో కుంగిపోతున్నాను. బావగారూ అందుకే దీనికి పరిష్కారమేమిటా అని మిమ్ములను ప్రశ్నిస్తున్నాను. యచ్ఛ్రేయః స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే శిష్య స్తేహం శాధి మా త్వాం ప్రపన్నమ్. మీకు నేను మఱదిని గానిప్పుడు శిష్య పరమాణువును ఏది నాకు హితమో నాకు తెలియదు. తెలియక ప్రేయస్సే శ్రేయ స్సని భ్రమపడవచ్చు. మీరా శ్రేయస్సేదో చెప్పి నా భ్రాంతిని పోగొట్టం డని ప్రాధేయపడ్డాడు. నేను శిషణ్ణి అని ఎప్పుడన్నాడో అప్పుడు శాసించి చెప్పవలసిన బాధ్యత గురువుకుంది. అలాగే చెప్పాడు సమాధానం యముడు నచికేతుడికి. ఈ నచికేతుడికీ కాల స్వరూపుడైన ఈ కృష్ణుడనే యముడు కూడా బోధించాడు.

ఏమిటా సమాధానం. మనం ముందే చెప్పుకొన్నామొక మాట. అనువాదం విధానమని. లోకానుభవంలో ఉన్న సమస్య ఏదో దాన్ని అనువదించి శాస్త్రం దానికి శాస్త్రీయమైన మార్గంలో పరిష్కారం చూపాలి. సమస్య ఏమిటో తెలిపిందిప్పుడు. మరణం. దానికి పరిష్కారమేదోగాదు అమృతత్వం మోక్షం. మోక్ష సన్న్యాస యోగంలో పేర్కొన్న మోక్షం. అది అందుకొనే విధానం సన్న్యాసం. ఇది సరిగా కఠోపనిషత్తు బోధించిన బాణీలోనే బోధిస్తున్నది గీత. ముంజా దిషీకా మివ ధైర్యేణ - నీ స్వరూపాన్ని నీవు ఈ ఉపాధిలో నుంచి వేరు చేసుకొని చూడాలి. ఎక్కడ ఉందని

Dr Dayananda Swamy ebooks



అది ఎలా చేసుకోవాలంటే అశరీరం శరీరేషు. మన ఈ శరీరంలోనే ఉందది అశరీరంగా. దాన్నే నీవు నీ శరీరం మేరకే చూస్తున్నావిప్పుడు. కనుకనే శరీర బంధం పోతే దానితోపాటు నేను పోయానని మరణాన్ని కొని తెచ్చుకొంటున్నావు. అలా కాక మహాంతం విభు మాత్మానం మత్వా ధీరో నశోచతి. దానికీ శరీరపు టెల్లలు తప్పించి సర్వత్రా ఆకాశంలాగా వ్యాపించినట్టు సర్వ పదార్థాల రూపంగా అదే భాసిస్తున్నట్టు భావించు. అప్పుడు శరీరం పోయినా నీవు పోవు. సర్వత్రా పరుచుకొని ఉండి దీని రాకపోకలు సాక్షిగా గుర్తిస్తుంటావు. మృత్యు నిమిత్తమైన శోకం నీకు తప్పకుండా తప్పిపోతుంది. ఇదీ ఉపనిషద్బోధ.

ఒక్క కఠోపనిషత్తునే కాదు. ఈ పరిష్కరించుకొనే విధానంలో ఛాందోగ్యాన్ని కూడా చక్కగా అనుసరిస్తూ పోయింది భగవద్గీత. పైకి కనపడదా అనుసరణ. కాని గీతానిర్మాణ ప్రణాళికలోనే అది తొంగి చూస్తున్నదని ఆ రహస్యాన్ని బయటపెట్టారు శ్రీధర మధుసూదనాది వ్యాఖ్యాత లందరూ. అదేదోగాదు. ఛాందోగ్యం 6వ అధ్యాయంలో శ్వేత కేతువు కుద్దాలకుడు చేసిన తత్త్వమసి వాక్యోపదేశం. తొమ్మిది మార్లు బోధించాడు మహర్షి తత్త్వమసి వాక్యాన్ని. బహుశా నవావరణ రూపమైన అమ్మవారి రాజ్యాన్ని దాటి దశమ స్త్వమసి అన్నట్టు దశమమైన అయ్యగారి ఆత్మ సామ్రాజ్యంలో ప్రవేశించండని మనకు బోధ చేయటానికి సంకేత మేమో.

卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐

Dr Dayananda Swamy ebooks

తత్త్వమసి అంటే ఏమని అర్థం. త్వమ్మంటే నీవు – తత్తంటే అది. అసి అంటే అయి ఉన్నావని శబ్దార్థం. నీవదేనంటే ఎవడీ నీవు. ఎవడా అది. నీవు ఇప్పుడీ శరీరం మేరకే ఉండి సంసార కష్టాలను భవించే జీవుడు. అది అంటే ఇలాంటి శరీరాలు కోటానకోట్లు వ్యాపించి సర్వత్ర ఆకాశంలాగా పరచుకొని ఉన్న చిదాకాశం. పరమాత్మ. పోతే అసి ఏమిటి. ఈ జీవాత్మ ఎవరో కాదు వాస్తవంలో ఆ పరమాత్మే సుమా. అదే ఈ వేషంలో కనిపిస్తున్నదని రెంటికీ ఏకత్వాన్ని చెప్పటం. శాస్త్రం చెబితే అవి ఏకమా అంతకు ముందే ఏకమా. ముందునుంచీ అవి ఏకమే. రెండు గావు. ఒకే ఒక తత్త్వం. అయినా అనాది కాల ప్రవృత్తమైన అజ్ఞానం మూలంగా ఆత్మానాత్మలనే Sub-Obj విభాగ మేర్పడింది. వాస్తవం కాదది. ఆభాస. అజ్ఞాన మనేది ఉన్నంత వరకూ ఆ భాసే మనపాలిటికి వస్తువై వస్తురూపమైన ఏకాత్మ భావ మా భాస అయిపోయింది.

కనుక ఇప్పుడీ నామరూపాలనే ఉపాధి నుంచి ఇందులో కలిసిపోయి వాటితో తాదాత్మ్యం చెందిన ఆత్మ చైతన్యాన్ని వేరు చేసి చూడాలి మనం. ఆ తరువాత ఆ ఆత్మ దృష్టితో అనాత్మగా భాసించే ఈ ఉపాధి వర్గాన్ని అంతటినీ చూచి దీన్ని కూడా ఆత్మలోనే ప్రవిలయం చేసుకొని అంతా ఏకాత్మగా దర్శించగలగాలి. ఇందులో వేరు చేయటం

Dr Dayananda Swamy ebooks



పదార్థ జ్ఞానమైతే - ఆత్మ దృష్టితో చూడటం వాక్యార్థ జ్ఞానమైతే - అంతా అఖండమైన ఆత్మ స్వరూపంగా అనుభవానికి రావటం అవాక్యార్థ జ్ఞానం పదార్థాలంటే జీవ పదార్థం - ఈశ్వర పదార్థం. అవి వాచ్యార్థం కావచ్చు. లక్ష్యార్థం కావచ్చు. నామరూపాదులైన ఉపాధులతో కూడిన చైతన్యం వాచ్యార్థం. అవి లేనిది లక్ష్యార్థం. కనుక భాగత్యాగ లక్షణ చెప్పుకోమన్నారు శాస్త్రజ్ఞులు. అంటే ఉపాధులను త్యజించి చైతన్యాన్ని మాత్రం భజించమని భావం. దీని కే లక్ష్యార్థమని పేరు. దీనితో తత్త్వం పదార్థాలు రెండూ శుద్ధి అవుతాయి. అయితే అవి శుద్ధమైన చైతన్య రూపాలే గనుక రెండు కావు ఒకటే ననే ప్రతిపత్తి కలుగుతుంది సాధకుడికి. దీనికే వాక్యార్థమని పేరు. పోతే ఆ ఏకత్వాన్ని పరోక్షంగా ఎక్కడో ఉందని చూడక అది నేనే నా స్వరూపమేనని అపరోక్షంగా దర్శించటమే అవాక్యార్థం. దీనితో సమాప్తం తత్త్వమసి విచారణ.

ఇది ఛాందోగ్య బోధ అయితే ఇదే బోధ ఇప్పుడు భగవద్గీత కూడా సాగిస్తున్నది. అది ఎలాగంటే భగవద్గీతను దీనిని బట్టి మూడు షట్కాలుగా విభజించారు పెద్దలు. 18 అధ్యాయాలు గదా భగవద్గీతలో ఉన్నది. అందులో మొదటి ఆరూ ఒక షట్కం - రెండవ ఆరూ ఒక షట్కం పోతే మూడవ ఆరూ ఒక షట్కం. మొదటి షట్కం త్వం పదార్థ శోధన అయితే - రెండవది తత్పదార్థ శోధన అయితే రెండు షట్కాలూ కలిసి

Dr Dayananda Swamy ebooks



పదార్థ జ్ఞాన మందిస్తాయి మనకు. కాగా మూడవ షట్కం 'అసి' అనే వాక్యార్థ జ్ఞానమిస్తుంది. అంతవరకూ పరోక్షమే. పోతే ఇక అపరోక్ష రూపమైన అవాక్యార్థ జ్ఞానమెక్కడ ఉంది గీతలో. అర్జునుడి చివరి చివరి మాటలలో ఉందని అర్థం చేసుకోవాలి మనం. ఏమిటది. నష్టో మోహః స్మృతిర్ల బ్ధా త్వత్ప్రసాదా న్మ యాచ్యుత. మహాత్మా నాకు నీవు ఎలాంటి జ్ఞానాన్ని ప్రసాదించావంటే దాని మూలంగా నా అజ్ఞాన మనేది పూర్తిగా తొలగి పోయింది. సర్వమూ ఆత్మస్వరూపమే మరేదీ లేదనే స్మృతి కూడా ఏర్పడింది - అని హామీ ఇస్తాడు. అంటే పరోక్షంగా తాను శ్రవణం చేసిన వాక్యార్థ జ్ఞానాన్ని అపరోక్షంగా అనుభవానికి తెచ్చుకొని మాటాడుతున్నా డర్జునుడు.

అర్జునుడు నిజంగా తెచ్చుకొన్నాడో లేదో గాని అసలు స్వానుభవానికి తెచ్చుకొన్నవాడి మాట ఇలాగే ఉంటుంది. తద్ధాస్యవిజ జ్ఞావితి - విజజ్ఞావితి అని ఉంది ఛాందోగ్యంలో. శ్వేత కేతువు జ్ఞానమే కాదు విజ్ఞానం కూడా సంపాదించాడట. జ్ఞానమంటే శాస్త్ర జన్యం. విజ్ఞానమంటే అనుభవ జన్యం. జ్ఞాన విజ్ఞానాలు రెండూ వేరు చేసి భగవద్గీతే చెబుతున్నది మనకు. జ్ఞానం తేహం సవిజ్ఞాన మిదం వక్ష్యామి అని భగవానుడి మాట. భగవత్పాదు లలాగే వేరుగా చూపుతూ వాటిని వ్యాఖ్యానించారు. ఇలాటి విజ్ఞానమే అవాక్యార్థం. అది అర్జునుడి కుందో

Dr Dayananda Swamy ebooks



లేదో మన కక్కర లేదు. ఉత్తమాధికారి అయిన అర్జును డెవడైనా ఉంటే ఎక్కడ ఎప్పుడైనా ఉంటే వాడు తన అనుభవాన్ని ఇలాగే ప్రకటిస్తాడని తాత్పర్యం. అర్జునం నిమిత్తీకృత్య అని భాష్యకారులే సెలవిచ్చారు. అర్జునుడనే వాడు ఒక నిమిత్తమాత్రం. తద్ద్వారా గీతాశాస్త్రం శాస్త్రీయమైన మార్గంలో చేస్తున్న విభాగమిది. ప్రస్తుతమీ మార్గంలో మనబోటి మానవులందరికీ భగవద్గీత చేస్తున్న మహోపదేశ మేమిటో అంచెలవారీగా అందుకోవలసి ఉంది మనం.

**ఇతి**

**విషాదయోగః సమాప్తః**

卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐卐

Dr Dayananda Swamy ebooks


# 2. సాంఖ్య యోగము

**అశోచ్యా నన్వశోచ స్త్వం - ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**

**గతాసూ నగతా సూంశ్చ - నాను శోచంతి పండితాః -11**

విషాదయోగం సమాప్త మయింది. పోతే ఇప్పుడు మనం రెండవదైన సాంఖ్యయోగంలో ప్రవేశించాము. సాంఖ్యంలో కూడా 10 శ్లోకాలున్నాయి. ఇది 11 వ శ్లోకం. కాని గీతాశాస్త్రంలో ఇదే మొదటి శ్లోకం. ఉపదేశంతో గదా శాస్త్రమనేది ప్రారంభ మవుతుందని చెప్పాము. ఉపదేశ మనేది ఇక్కడి నుంచే. ఇంతవరకూ నడచిందంతా కథా భాగమూ అర్జున విషాదమూ. విషాదం మనకను భవ సిద్ధమే. అందులో శాస్త్రానికి ప్రమేయం లేదు. అయితే సమస్య లేనిదే ఉపదేశించే అవసరం రాదు కాబట్టి అది

Dr Dayananda Swamy ebooks



ఏమిటో ఎలాటిదో ముందుగా పేర్కొన్నది గీత. అలా పేర్కొని దానికిపుడు పరిష్కార మేమిటో వర్ణించి చెబుతున్నాడు పరమాత్మ. ఏమిటా పరిష్కారం. అది ఇప్పుడీ సాంఖ్యయోగం నుంచీ శ్రద్ధాత్రయం దాకా 16 అధ్యాయాలలో బయట పెడుతుంది గీత.

సాంఖ్యమంటే సంఖ్యానం. ఇది ఇంత అది అంత అని విభజించి చూపటం. సమ్యక్ ఖ్యాయతే ఆత్మ తత్త్వమితి సాంఖ్యమని కూడా అర్థం చెప్పవచ్చు. ఆత్మ అంటే ఏమిటో దాని జ్ఞానం మనకందించే దని కూడా అర్థమే. ఆత్మజ్ఞానం లేనంతవరకూ ఈ శరీరమే ఆత్మ అని మిగతా ప్రపంచమంతా ఆత్మ కాదు అనాత్మ అని - ద్వైత దృష్టితో చూస్తుంటాడు ప్రతివాడూ. అలా చూస్తున్నంతవరకూ సంసార బంధం తప్పదు మానవుడికి. అది తప్పిపోవాలంటే ఆత్మ అంటే ఏమిటో దాని జ్ఞానం సంపాదించ వలసిందే. అందుకే ఈ సంఖ్యానం. భగవత్పాదులు కూడా ఇది మనసులో పెట్టుకొనే ఇలా వ్రాస్తున్నారు దీని కవతారిక. మహతి శోక సాగరే నిమగ్నస్య అర్జునస్య ఆత్మజ్ఞానా దన్య త్రోద్ధరణ మపశ్యన్ భగవాంస్త ముద్దిధారయిషుః ఆత్మ జ్ఞానాయా వతారయన్నని.

జ్ఞానం లేకపోవటం వల్లనే శోకం మానవుడికి. కో మోహః కః శ్శోకః ఏకత్వ మనుపశ్యతః అని చాటుతున్న దీశావాస్యం. అంతా ఆత్మ అని చూచేవాడికి మోహ మెక్కడిది. శోక మెక్కడిది. మోహమంటే అజ్ఞానమే గదా. ఆ బాలగోపాలమూ మనకన్ని రకాలైన జ్ఞానాలూ ఉన్నాయి. కాని

Dr Dayananda Swamy ebooks



జనన మరణాలు మనకు లేవనే జ్ఞానం లేదు. అది లేకనే గతాసూ నగతా సూంశ్చ - అన్వశోచః - పోయిన వాళ్లు పోయారే అని ఉన్నవాళ్లు కూడా ఎంతోకాల ముందరు పోతారే అని ఏడుస్తూ కూచుంటాము. వాస్తవంలో వారందరూ అశోచ్యులే. శోకించవలసిన వాళ్లు కారంటున్నది గీత. ఎందుకు కారు. వాస్తవంలో ఎవరూ పోలేదు కాబట్టి. శరీరం పోయిదంటావా అది ఎక్కడికీ పోలేదు. అక్కడే మన కళ్ల ముందే పడి ఉంది. కనిపిస్తూనే ఉంది. లేక అందులో ఉన్న ఆత్మ పోయిందంటావా అది చైతన్య స్వరూపం నిరాకారం. ఆకాశం లాంటిదది. ఇప్పుడూ మృతశరీరం చుట్టూ లోపలా ఉన్న ఆకాశ మెక్కడికైనా పోయిందా. అదీ అక్కడే ఉంది. మరి పోయిందేది.

ఏదో తెలియక కంగారు పడుతున్నాము. శరీర మున్నా అది కదలటం లేదు. మెదలటం లేదు. ఆలోచించదు. మాటాడదు. మనతో ఏమాత్రమూ వ్యవహరించటం లేదు. నిశ్చేష్టమై పడి ఉన్నది. అలా ఊరక పడి ఉంటే దాన్ని దగ్గర ఉంచుకోటం మన కిష్టం లేదు. మరి నిద్రలో మూర్ఛలో కూడా అలాగే నిశ్చలంగా ఉంటుంది కదా. ఉంచుకొంటున్నాము గదా. మళ్లీ తెల్లవారితే వస్తాడని - వైద్యుడింకా పోయాడన లేదు కాబట్టి - శ్వాస ఆడుతున్నది కాబట్టి - తెలివి వచ్చి కూచుంటాడని నమ్మకం మనకు. ఇక్కడ అలాటి ఆశ కూడా లేదు. మనసూ ప్రాణమూ రెండూ పనిచేయటం లేదు. అందుకోసం నిరాశ చేసుకొని తీసుకుపోయి దహనమో ఖననమో

Dr Dayananda Swamy ebooks



చేసి వస్తున్నాము. ఇది ఈ కనిపించే దేహమే ఆత్మ అనుకోటం వల్ల వచ్చిన పొరబాటు. ఆ దేహం కదులుతూ మెదులుతూ ఉంటే బ్రతికి ఉన్నాడంటారు. కదలకుండా పడిపోతే చనిపోయాడంటారు. అప్పటికి చలించే దేహమే ఆత్మ. దీనికే దేహాత్మ వాదమని పేరు. ఇది లోకులందరికీ ఉంది ఈ దృష్టి. పోతే చాలామంది శాస్త్రజ్ఞులకూ Scientists ఉంది.

ఇదిగాక ఇంకొక దృష్టి కూడా ఉంది కొంతమందికి. వారు లోకులలోనే ఆస్తికులు. శాస్త్రజ్ఞులలో మీమాంసకులు. వారిది జీవాత్మ వాదం. శరీరమే కాదు ఆత్మ. అంతకు మించి జీవపదార్థ మొకటి ఉంది ఈ శరీరంలో. స్థూలమైన శరీరమే ఇక్కడ దగ్ధమై పోతున్నది. ఇది చని పోయినా అది పోదు. మరణ సమయంలో దీన్ని వదిలేసి అది బయటికి వస్తుంది. దానికే సూక్ష్మ శరీరం లేదా లింగ శరీర Subtle Body మని పేరు. ఏదో గాదది. మనలో ఇప్పుడున్న మనస్సూ ప్రాణమే. ప్రారబ్ధం తీరితే అవి ఈ స్థూల శరీరంలో పనిచేయవు. కనుకనే ఇది నిశ్చేష్టమయింది. కాని అవి మాత్రం నిశ్చేష్టం కావు. మనసు దారి చూపుతూ ఉంటే ప్రాణం కదిలి లోకాంతరాలకు పోతుంది. అందులో ప్రాణం ద్వారా కర్త మనసు ద్వారా భోక్త అవుతున్న ఒకానొక చైతన్య శకలమే జీవుడు. వీడు పుణ్యం చేసుకొని స్వర్గానికి పాపం చేసి నరకానికి వెళ్లి అక్కడ ఆయా సుఖదుఃఖా లను భవించి మరలా కర్మశేషంతో ఈ కర్మ భూమిలో ఇంకొక శరీరం ధరించి జన్మిస్తాడు. ఇలా కర్మ జన్మకూ జన్మ కర్మకూ దారి తీయటం

Dr Dayananda Swamy ebooks


మూలంగా కనిపించే శరీరం పోయినా – కనిపించని శరీరంతో వాడు బ్రతుకుతూనే ఉంటాడని ధర్మశాస్త్రం చెబుతూ ఉంది. లోకులు నమ్ముతూ ఉన్నారు. వీరే జీవాత్మ వాదులు. ఇందులో దేహాత్మ దృష్టి అర్థకామాల వరకు పరిమితమైతే – జీవాత్మ భావం ధర్మపురుషార్థంతో ఆగిపోతున్నది. వీరిద్దరికీ ఆత్మ దృష్టి లేదు. అసలైన ఆత్మ ఏదో తెలియదు.

అసలైన ఆత్మ ప్రత్యగాత్మ. అది ఇటు దేహమూ కాదు. అటు ఈ దేహంలోనే కర్తగా భోక్తగా ఉన్నాడనుకొనే జీవుడూ కాదు. మరి ఎవడు భౌతికమైన శరీరమూ గాక మనః ప్రాణరూపంగా చలించే సూక్ష్మ శరీరమూ గాక – వీటి రెండింటినీ సాక్షిగా గమనించే శుద్ధ చైతన్యం. అది ఇప్పుడూ ఉంది మనలో. ఈ కనిపించే స్థూల శరీరమెలా చూస్తున్నామో దీనిలో నేనీ పనిచేస్తున్నాను – కష్ట సుఖాలను భవిస్తున్నా ననే సూక్ష శరీరమెలా భావిస్తున్నామో – అలాగే వీటి వ్యవహారా న్నంతా గమనిస్తున్న సాక్షిని కూడా నేనే గదా అనే భావన కూడా ఉంది మనకు. ఇదే ప్రత్యగాత్మ. ఇది స్థూలమూ కాదు సూక్ష్మమూ కాదు. రెంటినీ గమనిస్తున్నది గనుక కాదది. అలాగే గమనించే జ్ఞానం గనుక అది అజ్ఞాన రూపమైన కారణ శరీరమూ కాదు. శరీర త్రయాన్ని దాటి పోయిన అశరీరమైన కేవల జ్ఞానం. పరిశుద్ధమైన జ్ఞానం పరిశుద్ధ మెప్పుడయిందో పరిపూర్ణం నిరాకారం సర్వవ్యాపకం త్రివిధ శరీరాలలోనే గాక వాటి వెలపల కూడా ఉండగలదు కాబట్టి దానికిక మరణం లేదు. లోకాంతర జన్మాంతరాలు లేవు. పరమార్థ స్వరూపేణ నిత్యత్వా త్తన్నారు భాష్యకారులు.

Dr Dayananda Swamy ebooks



అలాంటప్పుడిక ఒకదాన్ని గురించి ఇదిపోయిందే అని విలపించటం దేనికి. నాను శోచంతి పండితాః – పండితులైతే విలపించరు. పండా ఆత్మ విషయా బుద్ధిః – సా యేషాం తే పండితాః – పండ అంటే ప్రత్యగాత్మ జ్ఞానం – అది ఉన్న వాడెవడో వాడు పండితుడు. అలాటి పాండిత్య మిప్పుడు అర్జునుడికి లేదు. అతడికున్నది అందరికి మల్లేనే దేహాత్మ జ్ఞానం. మహా అయితే జీవాత్మ జ్ఞాన ముండవచ్చు. ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే. అందుకే తెలివి తేటలు ప్రదర్శిస్తున్నా డాత్మ అంటే ఎంతో తెలిసినవాడిలాగా. పతంతి పితరో హ్యేషాం లుప్త పిండో దక క్రియాః – నరకే నియతం వాసో భవతీత్యను శుశ్రుమ అని ధర్మశాస్త్రజ్ఞాన మంతా ఏకరువు పెడతాడు. పదిమందిని నిష్కారణంగా చంపితే నరకానికి పోతా నంటాడు. పితృపితామహు లంతా నరకంలో పడి పోతారు వారికి పిండోదకా లిచ్చే నాధుడు కూడా లేకపోతాడంటాడు. చచ్చిన తరువాత జీవు డొకడున్నాడు. వాడిహాన్ని వదలి పరానికి వెళ్లుతాడని అతడికెవరు చెప్పారు. శాస్త్రం చెప్పింది. విన్నాడు. అంత మాత్రమే. జీవుడు బ్రతికే ఉంటాడని తెలుసుగదా ఇక పోయాడే అని ఏడవటం దేనికి దేనికదే. ఇక్కడ శరీరంతో కనపడటం లేదే అని బాధ.. అక్కడ బ్రతికుంటాడని విన్నామే గాని ఎక్కడ ఉంటాడో ఎన్నాళ్లుంటాడో మళ్లీ ఎక్కడ పుడతాడో ఇక మళ్లీ వాణ్ణి చూడలేమే అని కూడా బాధే.

అందుకే అన్వశోచః ప్రజ్ఞావాదాంశ్చ భాషసే – దృష్టంగా కనపడటం లేదనీ అదృష్టంగా ఎక్కడో ఉన్నాడని రెండు మాటలూ మాటాడుతున్నాడు.

Dr Dayananda Swamy ebooks


తెలివి తేటలు చూపుతున్నాడు. తెలివి లేక ఏడుస్తున్నాడు. ఇంతకూ జ్ఞానముందా అర్జునుడికి లేదా. శాస్త్రీయంగా సమాధానం చెబితే జీవాత్మ జ్ఞానముంది. ప్రత్యగాత్మ జ్ఞానం లేదు. దేవుడు మేలు చేస్తే దేహాత్మ జ్ఞానమే ఎక్కువ మోతాదులో ఉందేమో కూడా. అర్జునుడికనే గాదు. మనలాంటి అర్జునులను కూడా పట్టి పీడిస్తున్న దిదే. దేహమే ఆత్మ అనే జ్ఞానం ముమ్మరంగా ఉంది మనకు. శాస్త్రం కూడా వింటుంటాము కాబట్టి లోకాంతర జన్మాంతరా లున్నాయి గనుక జీవాత్మగా రాకపోకలు చేస్తుంటామనే జ్ఞానం కూడా సవసవగా ఉంది. రెండింటిలోనూ జనన మరణాలనేవి మనలను వెంటాడుతునే ఉన్నాయి. తప్పించుకోలేము. తప్పించుకొనే ఉపాయమేదైనా ఉందా అని ప్రశ్న. దీనికిప్పుడు సమాధాన మిస్తున్నాడు భగవానుడు.

**నత్వేవాహం జాతు నాసం - నత్వం నేమే జనాధి పాః**

**న చైవ న భవిష్యామః - సర్వేవయ మతః పరమ్ -12**

అర్జునా నీవు పూర్తిగా తెలిసినవాడవు కావు. అసలు తెలియని వాడవు కావు. కొంత తెలుసు కొంత తెలియదు నీకు. పూర్తిగా తెలిసినవాడు ప్రత్యగాత్మ వాది. అసలు తెలియని వాడు దేహాత్మ వాది. నీవిటు దేహాత్మతో తృప్తి పడటం లేదు. అటు ప్రత్యగాత్మ స్థితి నందుకో లేదు. మధ్యలో జీవాత్మ భావంతో సతమత మవుతున్నావు. కనుకనే జీవించే వారంతా మరణిస్తారే అని - మరణించిన వారంతా ఎక్కడో ఉన్నారు మనకంతు

Dr Dayananda Swamy ebooks



పట్టటం లేదే అని మధన పడుతున్నావు. నామాట వినేట్టయితే అసలు నీకు మరణం లేదు. మరణం లేదంటే జననం కూడా లేదు. అలాంటి భాగ్యం పరమాత్మనైన నాకేగాని మీబోటి జీవులకు లేదను కొంటావేమో. నత్వేవా హం జాతు నాసం - నేనూ ఇంతకు పూర్వం లేకపోలేదు. నత్వం. నీవూ లేకపోలేదు. నేమే జనాధిపాః - ఈ భీష్మద్రోణాదులూ లేకపోలేదు. అంతేగాదు. న చైవ న భవిష్యామః - ఇక మీదట కూడా లేకపోము. ఎవరు. సర్వేవయమ్ - మన మందరమూ.

అందరినీ కలుపుకొని మాటాడుతున్నాడు పరమాత్మ. నేనూ నీవూ వీరూ అని ఉత్తమ మధ్యమ ప్రధమ పురుషలుగా చెప్పుకొనే మానవులంతా. మానవులే గాదు - నేనూ అని పరమాత్మ అంటున్నాడు కాబట్టి జీవేశ్వరులనే తేడా లేకుండా మాటాడుతున్నాడు. ఏమని. మొదటి నుంచీ ఉన్నారందరూ ఇకమీదట ఉండబోతారు. మొదటి నుంచీ అంటే జన్మలేదని - ఇకమీద కూడా ఉంటాము కాబట్టి మరణం లేదని - జనన మరణా లెగిరిపోయాయి. అవి తనకే గాక మనబోటి జీవులకూ లేవని హామీ ఇస్తున్నాడు. మానవ జీవితానికి జనన మరణాలే రెండు కొసలు. కొసలు రెండూ లేవనే సరికి మధ్యమే అవిచ్ఛిన్నంగా సాగిపోతుంది. అంటే స్థితే ఉంది మనకు గతి లేదు. దీనికే బ్రాహ్మీ స్థితి అని పేరు పెట్టింది గీత. అప్పటికి పుట్టుకా లేదు. గిట్టుకా లేదు. ఒకప్పుడు రాలేదు మనం. ఒకప్పుడు పోలేదు. ఎప్పుడూ ఉంటూనే ఉన్నాము.

Dr Dayananda Swamy ebooks

ఉన్నామంటే ఎలా ఉంటాం. శరీరం గానా - మనస్సు గానా - ప్రాణం గానా. ఏదీ గాదు. శరీర మనః ప్రాణాలుగా అయితే వాటితో తాదాత్మ్యం **Identity** చెందిన నేరాని కవిపోతే మనమూ పోక తప్పదు. మరి ఎలాగ ఆత్మగా. అంటే వాటి రాకపోకలు కనిపెట్టే శుద్ధ చైతన్య స్వరూపంగా. అది క్రొత్తగా తెచ్చి పెట్టుకొనేది గాదు. ఇప్పుడూ ఉందని చెప్పాము. అదే ప్రత్యగాత్మ. మనసులో కలిగే ఆలోచనల దగ్గర నుంచీ సుఖదుఃఖాదుల దగ్గరి నుంచీ ప్రాణ స్పందన దగ్గరి నుంచీ చక్షురాదులైన ఇంద్రియ వ్యాపారాల దగ్గరి నుంచీ చివరకు వీటన్నిటినీ అనుక్షణమూ మోస్తున్న ఈ శరీరం దాకా అన్నింటి మంచి చెడ్డలను నిత్యమూ గమనిస్తూ-తాను కదలకుండా కదిలే వాటన్నిటినీ సాక్షిగా చూస్తున్న జ్ఞానమే నా స్వరూపం. అలా చూడాలంటే అది వాటి కంటే విలక్షణంగా వెనకాల ఉండి చూడాలి కాబట్టి దాన్ని ప్రత్యక్కన్నారు. అది మన స్వరూపమే కాబట్టి ఆత్మ Self అన్నారు. వెరసి ప్రత్యగాత్మ అయింది.

ప్రత్యగాత్మ ఎప్పుడయిందో అది ఇక ఈ శరీరాద్యు పాధులతో సంబంధం లేదు కాబట్టి నిరాకార మవుతుంది. నిరాకారమైతే వ్యాపకమూ నిశ్చలమూ కాక తప్పదు. పోతే వ్యాపకమైన చైతన్యాలు రెండుండటానికి వీలు లేదు. దేహాది సంఘాతం మేరకే పరిమితమైతే వేరవుతాయి గాని పరిపూర్ణంగా వ్యాపిస్తే ఎలా వేరవుతాయి. కాబట్టి ప్రత్యగాత్మే పరమాత్మ. రెంటికీ తేడా లేదు. అదే చెబుతున్నా డిప్పుడు పరమాత్మే స్వయంగా. బాబూ శుద్ధ చైతన్యమే నీ అసలైన ఆత్మ గనుక మన మందరమూ

Dr Dayananda Swamy ebooks


ఒక్కటేనని. అప్పటికీ జీవాత్మ లేదు. దేహాత్మ లేదు. ఆ మాటకు వస్తే ప్రత్యగాత్మ పరమాత్మ కూడా లేదు. ప్రత్యక్కూ పరమ అనేవి కూడా పిండాండ బ్రహ్మాండాలను దృష్టిలో పెట్టుకొని చెప్పుకొనే మాటలే. ఉన్నదొకే ఒక చైతన్య మన్నప్పు డిన్ని ఆత్మ లెక్కడివి. అన్నీ కలిసి ఒకే ఒక ఆత్మ - ఏకాత్మ సర్వాత్మ **Universal Self.**

అలాంటప్పుడీ జీవాత్మ ఎక్కడి నుంచి వచ్చాడు. వస్తు సిద్ధంగా **Actual** రాలేదు. బుద్ధి సిద్ధంగా **Notional** ఏర్పడ్డాడు. దాని పాటి కది అంతా ఆత్మే అయినా ఆత్మ కాని ఏదో ఒక దేహముంది - అదే నేనని భావించటం మూలాన దేహాత్మగా తయారయ్యాము. మనః ప్రాణాలనే ఉపాధులే నేనని భావించి జీవాత్మగా మారిపోయాము. ఇదంతా మన భావనే. వాస్తవంలో ఆత్మ ఆత్మగానే ఉంది. అది దేహాత్మ కాలేదు. జీవాత్మా కాలేదు. అయిందని భావించామంటే అది మన భ్రాంతి **Illusion.** దీనికే అవిద్య అని అజ్ఞానమని పేరు. ఈ అజ్ఞాన మున్నంత వరకూ ఇలా భావించకా పోము. తన్ని మిత్తంగా కలిగే జనన మరణాలను భవించకాపోము. అంటే అప్పటికి తేలిందేమిటి. వాస్తవంలో ప్రతి ఒక్కరూ ఆత్మ రూపంగా పరమాత్మతో ఏకమైనా శరీరాదులే తానని భావించటం మూలంగా జీవాత్మగా మారి జనన మరణాదు లను భవిస్తున్నారన్న మాట.

**దేహి నోఽస్మిన్ యథా దేహే - కౌమారం యౌవనం జరా**

**తథా దేహాంతర ప్రాప్తి - ర్ధీర స్తత్ర న ముహ్యతి - 13**

Dr Dayananda Swamy ebooks

అలా దేహాత్మగా మారిపోయిన ట్టేమిటి దాఖలా అని అడిగితే చెబుతున్నాడు. దేహమే నని దీనితో తాదాత్మ్యం చెందటం వల్లనే దేహి అయ్యాడు మానవుడు. దేహం సరిహద్దుల లోనే జీవిస్తుంటాడు కాబట్టి దేహి అని పేరు వచ్చింది. వాస్తవంలో ఈ దేహం లేదు మనకు. దీనితో సంబంధమూ లేదు. దేహమూ దేహి అని పేర్కొనటంలోనే తెలిసి పోతున్నదది దేహః అస్యాస్తీతి దేహీ. దేహం కలవాడెవడో వాడు గదా దేహి. కలవాడంటే ఏమని అర్థం. అది వీడికున్న దనేగాని అదేవీడని కాదు గదా. ఇప్పుడొక పుస్తకం నా చేతిలో ఉందని నన్ను పుస్తకి అనవచ్చు. నేను పుస్తక ధారినే గాని పుస్తకమే నేనవుతానా. పుస్తకమే నేనయితే పుస్తకం ప్రక్కన పెడితే నేను లేకుండా పోవలసి వస్తుంది. పుస్తకం దూరమైనా నా పాటికి నేనుంటూనే ఉన్నాను గదా. అది వినాభావ సంబంధమే **Seperable contact** గాని అవినాభావ సంబంధం **In-separable contact** కాదు.

అలాగే ఇప్పుడు దేహే కౌమారం యౌవనం జరా – ఈ దేహంలో నేను బాల్యాన్ని అనుభవించాను. అది పోయి యౌవనం వస్తే దాన్ని అనుభవించాను. అలాగే ఆ యౌవనం పోయి వార్ధక్యం ప్రాప్తిస్తే దాన్ని అనుభవిస్తున్నాను. బాల్యంపోయి యౌవనం – యౌవనం పోయి జర ఏదీ నిలకడగా ఉండటం లేదు. ఒక దశ పోయి ఒక దశ వస్తున్నది. ఇలా ఆయా దశలు వస్తూపోతూ ఉన్నా దేహి నైన నేను మారటం

Dr Dayananda Swamy ebooks

లేదు. బాల్యంతో పాటు నేను పోనూ లేదు. యౌవనంతో పాటు రానూ లేదు. దశలు మారుతున్నా నేను మారటం లేదు. అంతేకాదు. ఆయా అవస్థలతో పాటుగా దేహం కూడా మారుతున్నది. బాల్యంలో చూచిన దేహం యౌవనంలో లేదు. యౌవనంలో గోచరించింది వార్ధక్యంలో లేదు. శరీరమూ శరీరావస్థలూ రెండూ మారి పోతున్నాయి.

అంతే కాదు. బాల్య యౌవనాదులే గాక ప్రతి దినమూ మారుతున్నాయి దశలు. జాగ్రత్తు పోయి స్వప్నావస్థ వస్తున్నది. స్వప్నం కూడా పోయి సుషుప్తిలో పడిపోతున్నాము. అప్పుడా దశలే గాక ఆయా దశలలో మన శరీరం కూడా పూర్తిగా మారిపోయిన ట్టనుభవానికి వస్తున్నది మనకు. చూడండి. జాగ్రదవస్థలో ఉన్నప్పుడు మన మీ కరచణాదులతో కూడిన స్థూల శరీరాన్ని స్పష్టంగా చూస్తున్నాము. అదే జాగ్రత్తు పోయి స్వప్నంలో ప్రవేశించే సరికే స్థూల దేహం కనిపించటం లేదు. పడక మీద ఉందో లేదో కూడా గమనం లేదు. దీనికి మారుగా మరి ఒక శరీరం కనిపిస్తుంటుంది. అందులో కూచొని అదే నేనను కొని ఇటూ అటూ తిరుగుతుంటాము. ఆ స్వప్న శరీరమీ జాగ్రచ్ఛరీరం కాదు గదా. అలాగే స్వప్నంలో నుంచి సుషుప్తిలోకి వెళ్లామంటే అక్కడ ఏదీ లేదు. గాఢమైన తమస్సు శరీరం కాదు. నేను గాదు. ఎవ్వరూ కనిపించరు నాకు. అసలు ఈ రెండు శరీరాలూ లేవక్కడ. అశరీరమయి పోయాము మనం.

Dr Dayananda Swamy ebooks

అప్పటికి శరీరమే నేను కాననే సత్యం తెలిసిపోయింది గదా మనకు. శరీరమే నేనయితే అది సుషుప్తిలో మనకెందుకు గోచరించటం లేదు. అయితే మనకు మనమూ ఉన్నట్టు స్ఫురించటం లేదు గదా అని అడగవచ్చు. స్ఫురించటం లేదు. అంత మాత్రమే. సర్వాత్మనా పోలేదు మనం. ఏమిటి నిదర్శనం. అప్పటికి గుర్తు లేకపోయినా తెల్లవారగానే గుర్తు వస్తున్న దప్పుడూ నేనున్నానని. నేనే లేకపోతే ఆ దశ ననుభవించిం దెవరు. దశే దశ ననుభవించ లేదు గదా. దశానాథు డుండి గదా దశ ననుభవించ వలసింది. కనుక మూడవ స్థల లోనూ నేననే జ్ఞానం అనువృత్త **Continue** మవుతూనే ఉంది. ఎటు వచ్చీ అవస్థలూ వాటిలో మనకు గోచరించే దేహాదులే వ్యావృత్త **Discontinue** మవుతున్నాయి.

ఇది మన కిప్పుడున్న అనుభవం. జీవిత కాలంలో మనకున్న ఈ ప్రత్యక్షానుభవాన్ని బట్టి పరోక్షంగా రేపు జరగబోయే వ్యవహారాన్ని మన మర్థం చేసుకోవలసి ఉందంటాడు పరమాత్మ. తథా దేహాంతర ప్రాప్తిః - రేపు మరణ సమయంలో ఈ కనిపించే దేహం పూర్తిగా పోయి నీకు మరొక దేహం ప్రాప్తిస్తుం దేమో. ఎందుకు నమ్మవు. స్వప్నంలో రావటం లేదా వేరొక దేహం. అలాగే మరణానంతరమూ రావచ్చు. అయితే స్వప్నంలో మనకీ ప్రాణమనేది పోవటం లేదు. ప్రాణం ఉండగానే వస్తున్నాయి పోతున్నాయి స్వప్న సుషుప్తులు. పోతే మరణావస్థ అలాంటిది కాదు. అందులో ప్రాణమే ఆగిపోతున్నది. దానితోపాటు మనసూ నిలిచి

Dr Dayananda Swamy ebooks



పోతున్నది. కనుక మన కనుమానం మరణానంతరం మన ముంటామో లేదో ఏమయి పోతామో నని. అలా అనుమానించ నక్కరలేదు. తప్పకుండా ఉంటాము మనం. ధీర స్తత్ర న ముహ్యతి. ధైర్యం లేక నీవు బెంబేలు పడుతున్నావు. ధైర్యంతో ఉంటే నీకెలాటి వ్యామోహమూ లేదని హామీ ఇస్తున్నాడు భగవానుడు.

ధీర స్యాస్తీతి ధీరః – తస్య భావః ధైర్యం. ధీ అంటే బుద్ధి. అది ఉన్నవాడే ధీరుడు. వాడికున్న లక్షణమే ధైర్యం. అంటే ఏమిటర్థం. ధీ లేదా బుద్ధి అనేది రెండు విధాలు. ఒకటి నేనీ దేహం మాత్రమే కాను. ఇందులో కర్తగా భోక్తగా అన్నీ చేస్తూ అనుభవిస్తూ ఉన్న జీవుణ్ణి **Active Self** అనే బుద్ధి. మరొకటి కర్తృత్వ భోక్తృత్వాలు కూడా నాకు లేవు. ఈ కలా పాని కంతా కేవలం సాక్షిరూపంగా ఉన్న ద్రష్టను **Witnessing Self** నేననే బుద్ధి. వీటిలో మొదటిది జీవాత్మ భావం. రెండవది ప్రత్యగాత్మ భావం రెండింటిలోనూ ఆత్మకు వినాశం లేదు. మరణానంతరం కూడా ఉందనే నమ్మక ముంది.

కాని తేడా ఎక్కడంటే ప్రస్తుతం మనకున్న ఈ స్థూల దేహ మిక్కడ పతనమై పోయినా మరొక సూక్ష్మదేహంలో కూచొని ఎక్కడికో వెళ్లిపోతామని – మరలా కర్మభూమిలో జన్మిస్తే ఇంకొక దేహంలో ప్రవేశిస్తామని – కనుక మరణం మనలను పూర్తిగా నశింపజేయదని – నమ్ముతాడు జీవాత్మ వాది. అలాటి దృష్టి ననుసరించి చెబుతున్నాడు

Dr Dayananda Swamy ebooks


పరమాత్మ - తథా దేహాంతర ప్రాప్తిః అని. తథా అంటే ఈ దేహం పోయినా పూర్తిగా పోలేదు నీవు. కనుక అది మరణం కాదుః మరొక దేహం నీకు తయారుగా ఉంటుంది. అందులో చేరి మరలా జన్మిస్తావు భయపడ వద్దని ధైర్యంగా ఉండమంటాడు.

కాని ఇది సమస్యకు పరిష్కారం కాదు. పరిష్కారం మానవుడికి జనన మరణాలు రెండూ లేక పోతేనే. అది నేను జీవుడనే భావం నీకున్నంత వరకూ ఆసించలేవు. ఒక శరీరం పోయినా మరొక శరీరం ప్రాప్తిస్తూనే ఉంటుంది. అదిపోతే ఇంకొకటి. జనన మరణ పరంపర తప్పదు. కాబట్టి ఈ విషవలయం నుంచి పూర్తిగా బయట పడాలంటే నేను జీవుడననే బుద్ధికి స్వస్తి చెప్పి శుద్ధ చిన్మాత్ర స్వరూపుడననే ప్రత్యగాత్మ భావమేర్పడాలి మానవుడికి. అప్పుడిక మరణించినా అది నీ శరీరమనే ఉపాధికే గాని నీకు గాదు. ఎందుకంటే ఆకాశాత్మా అని ఛాందోగ్యం చెప్పినట్టు ఆకాశంలాగా విస్తరించి ఉంటావు నీవు. నిరాకారమైన చిదా కాశ స్వరూపుడవు కాబట్టి మరణం లేదు నీకు. మరణమంటే మార్పు చలనం. అది సాకారానికే గాని నిరాకారాని కేర్పడదు. మరణమే కాకుంటే ఇక జననమనే ప్రశ్న అసలే రాదు. అంటే దేహాంతర ప్రాప్తి అనే మాట వాడికి వర్తించదు. ఒక వేళ వర్తిస్తుందని చెప్పినా అది దేహాంత రప్రాప్తి. దేహాంతః దేహంలోపల అప్రాప్తి చేరి పోవడమంటూ ఉండదని విరిచి అర్థం చెప్పవలసి ఉంటుంది. లేదా దేహం కాని దేహ మాకాశం. ఆకాశాత్మా

Dr Dayananda Swamy ebooks



అన్నది గదా ఉపనిషత్తు - ఆకాశ ఇవ స్వరూపమ్ యస్య అని అర్థం వ్రాశారు భాష్యకారులు. అదే వాడి దేహ మనుకొంటే సరిపోతుంది. చిదాకాశమే దేహం. దానికి చావు పుట్టుక లేమున్నాయి. నిత్యమూ నిర్వికారమూ అది. కాబట్టి ప్రత్యగాత్మ నే అనే భావముంటే అసలైన ధైర్యమది. నముహ్యతి. మోహమే లేదప్పుడు. ప్రజ్ఞానమ్ బ్రహ్మ అన్నట్టు అంతా జ్ఞాన స్వరూపమే. నత్వే వాహం జాతు నాసమనే ముందు శ్లోక మీ ప్రత్యగాత్మ దృష్ట్యా చెప్పిన మాట. దేహినోస్మిన్ అని ఇప్పుడు చెప్పింది జీవాత్మ దృష్ట్యా చెబుతున్నది. ఇదీ తేడా.

**మాత్రా స్పర్శాస్తు కౌంతేయ - శీతోష్ణ సుఖదుఃఖదాః**

**ఆగమాపాయి నో నిత్యా - స్తాంస్తి తిక్షస్వ భారత - 14**

ఇప్పు దర్జునుడికి సవాలిది. తాను జీవాత్మ దృష్టితో బ్రతుకుతున్నాడా లేక ప్రత్యగాత్మనని గుర్తించి బ్రతుకుతున్నాడా తేల్చుకోవలసి ఉంది. జీవాత్మనే అనుకొన్నాడా. అయితే మాత్రా స్పర్శలు తప్పవు. మాత్రలేమిటి - స్పర్శలేమిటి. మీయంతే ఆభిరితి మాత్రా అంటున్నారు భగవత్పాదులు. శబ్ద స్పర్శాదులను కొలి చేస్తున్నాయి మన ఇంద్రియాలు. కన్ను రూపాన్నీ చెవి శబ్దాన్నీ నాలుక రసాన్నీ - ఇలా ఇది ఫలానా ఇదిఫలానా అని నిర్ణయించటమే కొలవటం. ప్రతి ఇంద్రియమూ చేస్తున్న పని ఈ కొలవటమే. ఇంద్రియాలకు ప్రమాణాలని పేరు. ప్రమాణమంటే కొలవటం **Measurement** అనే అర్థం. ఇవి కొలుస్తుంటే శబ్దాదులు వీటి చేత

Dr Dayananda Swamy ebooks


కొలత వేయ బడుతుంటాయి కాబట్టి **Measured** వాటికి ప్రమేయమని పేరు వచ్చింది.

ఒక్క చక్షురాది బాహ్యేంద్రియాలే గాదు మాత్రలు. ఆ మాటకు వస్తే మనస్సూ ప్రాణమనే అంతరింద్రియాలు కూడా ప్రమాణాలే మాత్రలే. ప్రాణ మాయా క్రియలనైతే - మనస్సు ఆలోచనలనూ సుఖదుఃఖా ద్యనుభవాలను కూడా కొలిచి చూపుతున్నది. కొలిచి చూపే ఇంద్రియాలు మాత్రలైతే వీటిచేత కొలవబడే శబ్ద స్పర్శాదులు కూడా మాత్రలే నన్నారు అభిజ్ఞులు. అప్పుడు మీయంతే ఇతి మాత్రా అని అర్థం చెప్పుకోవాలా మాటకు. మొత్తం మీద మాత్రలంటే అప్పటికే మని అర్థం. ప్రమాణా లైనమనఃప్రాణచక్షురాదీంద్రియాలూ - ప్రమేయాలైన శబ్దాదులైన ఇంద్రియార్థాలు **Objects** కూడా కలిసివస్తాయి. పంచతన్మాత్రలని అందుకే అన్నారు శబ్దాదులైన బాహ్య విషయాలను. ఇప్పుడు మాత్రలనే మాటలో ప్రమాణ ప్రమేయాలు రెండూ చేరిపోయాయి కాబట్టి ఇక ఏదీ మిగల లేదు సృష్టిలో. అంతా ఇందులోనే ఇమిడిపోయింది సంసారం.

అలాంటప్పుడిక జరుగుతున్న వ్యవహార మేమిటో చెబుతున్నది గీత. ఈ మాత్రలా మాత్రలతో నిత్యమూ సంబంధం పెట్టుకొంటూ ఉంటాయి. ఏ మాత్రలే మాత్రలతో ఇంద్రియాలనే మాత్రలు శబ్దాదులనే మాత్రలతో. చెప్పాము గదా కన్ను రూపంతో చెవి శబ్దంతోనని. అలాంటి సంబంధానికే స్పర్శ అని **Contact** పేరు. ఈ స్పర్శ వల్ల ఏమవుతున్న

Dr Dayananda Swamy ebooks



దంటే శీతోష్ణ సుఖదుఃఖదాః ఇది శీతమని ఇది ఉష్ణమని మన జ్ఞానానికి సోకుతున్నది. అంతేకాదు. దానివల్ల కలిగే సుఖదుఃఖాలు మన మనస్సుకు వస్తున్నాయి. శీతోష్ణాలనేవి త్వగిం ద్రియానికే గదా మిగతా చక్షురాదుల మాటేమిటని అడగ నక్కరలేదు. త్వగింద్రియం మిగతా అన్ని ఇంద్రియాలకైతే ఉపలక్షణంగా **Representative** తీసుకోవాలి మనం. అప్పటికి శీతోష్ణాల స్పర్శ ఇంద్రియాలకైతే దానివల్ల కలిగే సుఖదుఃఖా ద్యనుభవం మనస్సు కని అర్థం చేసుకోవలసి ఉంది. దీనితో అంతరింద్రియ బహిరింద్రియా లన్నీ కలిసి వచ్చాయి. ఇదే గదా సాంసారిక మైన వ్యవహార మంతా అనుభవానికి వచ్చే బాహ్య సామగ్రి – దానినెప్పుడూ అనుభవిస్తున్న ఆంతరిక **Internal** మైన మనస్సు. ఇంతకన్నా ఏముంది.

ఇంతవరకూ మన అనుభవంలో ఉన్న విషయమే. అది కూడా ఇంత పెద్ద విశ్లేషణ **analysis** చేసి అనుభవించటం లేదు మనం. ఏదో యాదృచ్ఛికంగా జరిగి పోతున్నట్లు చూస్తుంటాము. అలా కాదు రోజూ జరుగుతున్న వ్యవహారంలో ఇంత మర్మ మిమిడి ఉంది సుమా అని శాస్త్రం మనకు ముందు గుర్తు చేస్తున్నది. అలా చేసి మనకు సాధారణంగా తెలియని వేరొక రహస్య మిప్పుడు బోధిస్తున్నది. అదేమిటంటే ఆగమాపాయి నో నిత్యాః – ఈ సంబంధా లన్నీ ఏమను కొంటున్నావో నీవు. నిజంగా ఉన్నాయి మన మనుభవిస్తున్నా మనే అనుకొంటున్నావా కాదు. అదంతా వట్టిది. అబద్ధం నిత్యం కాదది అనిత్యం. ఎందువల్ల.

Dr Dayananda Swamy ebooks


ఆగమాపాయులు గనుక. ఆగమమేమిటి. అపాయ మేమిటి. ఆగమమంటే వచ్చేది. అపాయమంటే పోయేది. వస్తూపోతూ ఉంటాయవి ఎప్పటికప్పుడు. ఎప్పటికీ ఉండేవి కావా స్పర్శలు చూడండి. కంటితో ఒక రూపం చూస్తాం. మానేస్తాం. చెవితో ఒక శబ్దం వింటాం. మానేస్తాం. అలాగే మనసుతో కూడా సుఖ మొకప్పు డను భవిస్తాం. మరొకప్పుడదే మనస్సుతో దుఃఖ మనుభవిస్తాం.

చిత్ర మేమంటే శబ్దజ్ఞానమైనా రూప జ్ఞానమైనా ఏ ఇంద్రియం ద్వారా కలిగే జ్ఞానమైనా - అది ఆ ఇంద్రియానికి గాదు. అవి ద్వారాలు మాత్రమే జ్ఞానానికి. ఏ జ్ఞానమైనా అందేది మనస్సుకే. అదే అనుభవిస్తుందా జ్ఞానంవల్ల కలిగే కష్టమైనా సుఖమైనా. అందులో కష్టమను భవించేటప్పుడు సుఖానుభవం లేదు. సుఖ మనుభవిస్తున్నప్పుడు దుఃఖానుభవం లేదు. ఒక క్షణంలో ఒకే అనుభవం. రెండూ ఏక కాలంలో ఏర్పడవు. పైగా విరుద్ధమైన అనుభవా లసలే ఏర్పడవు. శీతోష్ణాలూ సుఖదుఃఖాలూ పరస్పర విరుద్ధమైన భావాలు **Mutually Opposed** గదా. ఏకకాలంలో ఎలా కలుగుతాయి. ఎలా అనుభవించగలం. కాబట్టి ఒకటిపోయి ఒకటి వచ్చినప్పుడే అనుభవం.

మరి అన్యోన్య విరుద్ధ భావాలు మనసుకు వస్తుంటే ఇన్ని మనసు లున్నాయా మానవుడికి. ఎప్పటికప్పుడు మారిపోవాలి గదా మనసు. సుఖదుఃఖాదులు మారుతున్నప్పు డది కూడా మారాలి గదా. తాను

Dr Dayananda Swamy ebooks



మారకుండా వాటి మార్పుల నెలా అనుభవించ గలదు. సుఖాకారంగా దుఃఖాకారంగా మనసు మారటానికే వృత్తి అని పేరు. ఆలోచనల పుట్టే గదా మనసు. ఆలోచన ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. కాబట్టి ఆలోచనే వృత్తి సుఖాదుల కనుగుణంగా తదాకార వృత్తులు **Both Ideas and Things** కూడా మారుతున్నాయంటే రెండూ ఆగమాపాయులే. అలాంటప్పుడు అనిత్యంగాక నిత్యమెలా అవుతాయవి. ప్రమాణ ప్రమేయాలు రెండూ అనిత్యమే. అంటే బాహ్యమైన వస్తువులూ **Things** మనసులో కలిగే వృత్తులూ **Ideas** రెండూ నిలకడ లేకుండా మారిపోయేవే.

అలాంటప్పుడిక మారకుండా అనాగమంగా అనపాయంగా ఉన్నదేది. ఏదీ లేదా. లేకుంటే ఈ మార్పుల కర్థం లేదు. మార్పులే మార్పులను గమనించలేవు. మార్పులేనిదే మారుతూ ఉన్నవాటికి సాక్షి. అది ఏదో గాదు. మనలో ఉన్న జ్ఞానమే. మనసే గదా జ్ఞానమంటే. కాదు అది జ్ఞానంలో కలిగే వృత్తి లేదా వృత్తి జ్ఞానం. కేవల జ్ఞానం కాదు. పరిశుద్ధమైన జ్ఞాన మయితేనే గాని అది వీటన్నింటి రాకపోకలకూ సాక్షి అనిపించుకోలేదు. ఇదుగో ఈ సాక్షి జ్ఞానమే ఆత్మ స్వరూపం. అది తాను స్థిరంగా ఉంటూ అస్థిరమైన ఈ మార్పు లన్నిటినీ చూస్తున్నది. మనసు దగ్గరి నుంచీ దాని ఆలోచనల దగ్గరి నుంచీ అందులో ప్రతి ఫలించే బాహ్యమైన శబ్ద స్పర్శాదుల వరకూ అన్నిటినీ కనిపెట్టి చూస్తున్నది. మన మనస్సు గాక అలాంటి దొకటి ఉందా అని సందేహించ బని లేదు.

Dr Dayananda Swamy ebooks



ఏ ఆలోచనా పెట్టుకోకుండా కొంచెం సేపు ఊరక కూచున్నావంటే తెలిసిపోతుంది. అది జాగ్రత్తు గాదు. నిద్ర గాదు. కేవలం నేనున్నా ననే ప్రజ్ఞ. అదే నీ ఆత్మ. అసలైన ఆత్మ. ప్రత్యగాత్మ. అదే నిత్య సిద్ధం సత్యమని పట్టుకొన్నావంటే తాం స్తితిక్షస్వ. నీవు వీటి వల్ల కలిగే బాధ లన్నింటినీ భరించవచ్చు. ఎలాగ. బాధ కూడా మనసులో కలిగే వృత్తే. మనసు వరకే దాని ప్రయాణం. అక్కడి కది ఆగిపోక తప్పదు. దాని రాకపోకలు చూస్తున్న నీ జ్ఞానానికి బాధేముంది. బాధకు సాక్షి బాధితం కాదు.

**యం హి న వ్యథయం త్యేతే - పురుషం పురుషర్షభ**

**సమదుఃఖ సుఖం ధీరం - సో మృతత్వాయ కల్పతే - 15**

నిజమే సాక్షికే బాధా లేదు. లోకంలో అంతే. శాస్త్రంలో అంతే. చూడండి. లోకంలో కూడా ఏ పనిలోనైనా తలదూర్చి చేస్తున్న వారికే దానివల్ల కలిగే కష్టనష్టాలు. ఊరక నిలబడి చూస్తున్న వాడికి లేదు. అలాగే ఆధ్యాత్మరంగంలో కూడా ఆత్మ అనేది కేవలం ద్రష్ట **Spectator** మాత్రమే నని గుర్తించిన వాడెందులోనూ పడిపోడు. ఆలోచనలలో పడిపోడు. వాటి మూలంగా కలిగే కష్ట సుఖాలలో పడిపోడు. యం హి న వ్యథ యంత్యేతే - అప్పుడు వాడి నేదీ బాధించదు.

అయితే ఒక్కటీ కండిషన్. పురుషం - వాడు పురుషుడయి ఉండాలి. పురుషుడేమిటి ఇప్పుడు మనం పురుషులమే గదా. కాదు. పురుషార్థమనే మాటలో ఉన్న పురుషుడు కాదిక్కడ పురుషుడంటే అక్కడ మానవుడని

Dr Dayananda Swamy ebooks


అర్థం. ఇక్కడ కేవలం మానవుడనే అర్థంలో వాడటం లేదీ పురుషుడనే మాట వేదవ్యాసుడు. మరేమని అర్థమీ మాటకు. పూర్ణత్వాత్ పురుషః - పరిపూర్ణత **Completion or perfection** ఉన్న వాడెవడో వాడు పురుషుడు అలాటి పూర్ణత్వం లేకుంటే కేవలం పురిశయనాత్ పురుషః బ్రహ్మపురమైన ఈ మానవ శరీరంలో శయనిస్తున్న ప్రతివాడూ పురుషుడే. శయనించటమంటే పడుకొని నిద్రపోయేవాడు. నిద్రపోయేవాడు పురుషుడెలా అవుతాడు. అలాగైతే పశుపక్ష్యాదులు కూడా పురుషులే. వాసనా జ్ఞానంతో బ్రతికే వన్నీ నిద్రాళువులే. మానవుడూ అలాటివాడే నని పించుకొంటే సుఖ మేముంది. వీడీ శరీరంలో వచ్చి కూచునే వరకే గాదు. జ్ఞానం సంపాదించి పూర్ణు డనిపించు కోవాలి. అప్పటికీ అది పూర్ణత్వం కాదు. ఆ జ్ఞానమైనా వృత్తి జ్ఞానమైతే లాభం లేదు. ఆయా శాస్త్ర జ్ఞానాలూ కళాజ్ఞా నాలూ కడకు ధర్మజ్ఞానమూ కూడా కాదు జ్ఞానమంటే మరి ఏజ్ఞానం. బ్రహ్మపురంలో వచ్చి కూచున్నందుకు బ్రహ్మ జ్ఞాన మార్జించాలి. అప్పుడే వాడు పూర్ణపురుషుడు. పురుష శబ్దానికి పురిశయనాత్ - పూర్ణత్వాత్తని మాత్రమే గాక పూరణా త్పురుషః అని మూడవ అర్థం చెప్పవలసి ఉంటుందప్పుడు. పూరణ మంటే ఈ శరీరం మేరకే ఈ మనస్సు మేరకే ఈ ఆలోచనల మేరకే ఈ ఈ విషయాల మేరకే బ్రతుకుతు న్నాననే గాక - వీటికి విలక్షణంగా ఉంటూ వీటన్నింటినీ పూరించి వ్యాపించి ఉన్నాననే జ్ఞానం. అప్పుడే పూర్ణ పురుష డని పించుకోగలడు.

Dr Dayananda Swamy ebooks

వాడికిక ఏ అనుభవమూ లేదు. సమదుఃఖ సుఖం - సుఖాను భవమూ లేదు. దుఃఖాను భవమూ కాదు. రెండు భావాలూ సమానమయి పోతాయి వాడికి. ఎందుకని. సమంగా వ్యాపించింది వాడి దృష్టి. రెండింటిలోనూ నిండిపోయింది. నిండకుంటే దేని పాటి కది విషమంగా విరుద్ధంగా కనపడతాయి. దృశ్యాలు రెండూ దృక్కుతో నిండిపోతే అవి ఇక దృశ్యాలు కావు. దృక్కే. దృక్కనేది ఎప్పుడూ ఏకమే. అనేకం కాదు. అనేకం దానికి గోచరించే దృశ్య ప్రపంచం. ఇంతెందుకు. మనకంటి చూపే ఉందనుకోండి. అది ఒక్కటే ఆ చూపు. తెలుపుచూచినా నలుపు చూచినా పసుపు చూచినా ఎరుపు చూచినా చూపు చూపే. అది మారదు. కాని దానికి కనిపించే ఎఱుపు నలుపనే రంగులు మారుతుంటాయి. ఇది మన కనుభవ సిద్ధమే.

అలాగే మన జ్ఞాన మొక చూపు లాంటిది. అది ఎప్పుడూ ఏకరూపమే **Uniform** జ్ఞానం జ్ఞానమే. మరి దానికి సోకే భావాలు చూడండి. ఎన్ని వందలు వేలయినా ఉంటాయి. ఎన్ని ఉన్నా వాటన్నింటినీ గ్రహించేది ఈ ఒక్క జ్ఞానమే. మార్పు వాటిలోనే గాని దానిలో లేదు. దానికన్నీ సమానమే. సుఖమైనా ఒకటే దుఃఖమైనా ఒకటే. అదేమిటండీ సుఖం వచ్చినప్పుడు ఇది సుఖమనీ దుఃఖం ముంచుకు వచ్చినప్పు డిది దుఃఖమనీ వేరుగా చూస్తున్నాము గదా అంటారేమో. వేరుగా చూస్తున్న

Dr Dayananda Swamy ebooks



జ్ఞానంలో కలిగే వృత్తి అది. జ్ఞానం కాదు. జ్ఞానమా సుఖదుఃఖాలనూ తదాకార వృత్తులనూ రెంటినీ సాక్షిగా చూస్తున్నది. అందులో వృత్తి. అది వృత్తిగాదు. అదే వృత్తిగా మారితే అన్ని వృత్తులనూ అది గమనించలేదు. కనుక వృత్త్యతీత మైన జ్ఞానమే జ్ఞానం. వృత్తి మనస్సయితే అది ఆత్మ. దానికంతా సమమే. వృత్తికి మల్లే విషమం కాదు. నిర్దోషంహి సమం బ్రహ్మ అని తరువాత రాబోతుంది. బ్రహ్మమనేది నిర్దోషమూ సమమూ నట. నిర్దోషమంటే వృత్తి రహితమైనది. సమమంటే సాక్షి అని భావం.

కాగా అలాటి సర్వసాక్షి అయిన జ్ఞానమే నా స్వరూపమని అదే ఎప్పు డనుభవానికి తెచ్చుకొన్నావో సోమృత త్వాయ కల్పతే. అప్పుడమృత మనేది నీకు వచ్చి ఒళ్లో పడుతుంది. నీకిక మృతి లేదు. అమృతత్వమే. మార్పుంటే గదా మృతి. వృత్తి జ్ఞానమైన మనసే నేననుకొంటే మృతుడ వయిపోతావు. దానికి కూడా సాక్షి అయిన ప్రత్యగాత్మ నని భావించినప్పుడు మృతుడ వెలా అవుతావు అమృతడవే. ముక్తుడవే నని తాత్పర్యం.

**నా సతో విద్యతే భావో - నాభావో విద్యతే సతః**

**ఉభయో రపి దృష్టోంత - స్త్వనయో స్తత్త్వ దర్శిభిః - 16**

అసలెప్పుడూ ముక్తులమే మన మా మాటకు వస్తే. ఒకప్పుడు ముక్తులం కాక క్రొత్తగా ఇప్పుడు ముక్తులం కావటం లేదు. న త్వే వాహం జాతు నాసమ్ నత్వం నేమే జనాధిపాః అని ముందే మనకు

Dr Dayananda Swamy ebooks



హామీ ఇచ్చాడు గదా పరమాత్మ. కారణ మేమంటే మనమే ఉన్నా మీ సృష్టిలో మరేదీ లేదు. అంటే ఏమని అర్థం. ఆత్మ చైతన్యానికి భిన్నంగా ఈ మాత్రలూ లేవు. ఈ స్పర్శలూ లేవు. తద్వారా కలిగే సుఖదుఃఖాదు లంత కన్నా లేవు. అసలీ సంసారమే లేదు. ఎంచేత. నాసతో విద్యతే భావః – లేని పదార్థ మెప్పుడూ లేదు. నాభావో విద్యతే సతః – ఉన్నదాని కెప్పుడూ మోసం లేదు. అది ఎప్పుడూ ఉంటుంది. లేని దెంత ఉందను కొన్నా ఉండబోదు. అలాగే ఉన్న పదార్థ మెంత లేదని త్రోసిపుచ్చినా లేకుండా పోదు. ఇంతకూ ఉన్నదే ఉంటుంది. లేనిది లేనే లేదు.

ఏమిటీ మాటల కర్థం. నిజంగా భగవద్గీత లాంటి శాస్త్రం చెప్పవలసిన మాటా ఇది. శాస్త్ర మెప్పుడూ మన కనుభవంలో లేని రహస్యాన్ని బయటపెట్టాలని గదా చెప్పాము. ఉపనిషన్నామ రహస్య విజ్ఞాన మని భగవత్పాదులే వాక్రుచ్చా రొక చోట. అలాంటప్పుడీ మాటేమిటి మనమెప్పుడైనా లేనిది ఉన్నట్టు గాని ఉన్నదాన్ని లేనట్టుగాని చూస్తామా. మెడకాయ మీద తలకాయ ఉన్న వాడెవడు గానీ చేయ దలాటి పని. ఒక కుండ కండ్లకు కనిపిస్తుంటే ఉందని చూస్తాం. పగిలిపోతే లేదని చూస్తాం. అంతేగాని కనిపిస్తున్నా లేదని చెప్పం. కనిపించకపోయినా ఉందని బుకాయించం. అయితే చంద్రమండలంలో ఇప్పుడెన్ని ఉన్నాయో మనం చూడటం లేదు గదా. అవి ఉన్నాయా లేవా అని అడిగితే మనసుకు

Dr Dayananda Swamy ebooks



వచ్చినంత వరకూ ఉన్నాయని చెబుతాం. రాకుంటే లేవంటాం. ఒకవేళ అక్కడికి వెళ్లి చూస్తే అప్పుడు చూచినంత మేర ఉన్నాయనే చెబుతా మంత మాత్రమే.

ప్రమాణాన్ని బట్టి ప్రమేయానికి అస్తిత్వమని పేర్కొంటారు శాస్త్రజ్ఞులు. ప్రమాణం మనకు మనబుద్ధే. బుద్ధిర్హినః ప్రమాణం సదసతో ర్యాథాత్మ్యాధిగమే. ఒకటి ఉందని గాని లేదనిగాని నిర్ణయించేది మానవుడి బుద్ధే నంటారు స్వామివారు. యద్విషయా బుద్ధి ర్వ్యభిచరతి తదసత్ - యద్విషయా న వ్యభిచరతి తత్సత్. దేని విషయంలో బుద్ధి ప్రక్కకు పోతుందో అది అసలే లేదు. ఏది అలా తొలగిపోదో అది ఉన్నదని సిద్ధాంతం చేశా రాయన. ఉదాహరణకు దూరాన మనకు నీళ్లు పొంగి పొర్లుతున్నట్లు కనిపిస్తాయి. కాని దగ్గరికి వెళ్లి చూస్తే అవి నీళ్లే కావు. అక్కడ ఉన్నది సూర్యరశ్మి. ఇప్పు డున్నదేది లేనిదేది. ఉన్నది రశ్మి. లేనిది జలం. కాని విమర్శించి చూడకపోతే లేని జలమే ఉన్నదని స్ఫురించింది. ఉన్న రశ్మే లేదని భాసించింది. అంటే ఉన్నది లేదని చూచావు నీవు. లేనిది ఉందని చూచావు. అవునా కాదా. ఇలా ఎన్నో ఉన్నాయి మన దైనందినాను భవంలో.

Dr Dayananda Swamy ebooks



ఒక రజ్జువు సర్పంగా భాసిస్తుంటుంది. ఒక స్తంభం చీకట్లో దొంగ లాగా భ్రమ గొలుపుతుంది. ఒక శుభ్రమైన ఆకాశమే నల్లని రంగు పూసుకొని కనిపిస్తుంది. ఇంతెందుకు. ఒక సముద్ర జలమే ఎన్నో తరంగాలుగా బుద్బుదాలుగా ఫేనాలుగా భాసిస్తూ వాటన్నిటినీ తన మీద కప్పుకొని చూడండి నావైపు అని కేకలు పెడుతుంటుంది. ఒక బంగారమే కటక కుండల కేయూరాదులైన అనేక రూపాలు ధరించి ఆ వేషాలతో కనిపిస్తూ మనల నాకర్షిస్తుంది. ఇవన్నీ దేనికి. అసలు మనకు ప్రతి రాత్రీ వచ్చే స్వప్నమే తీసుకొని చూడండి. ఏముందక్కడ పడుకొన్నప్పు డే మీ లేదు మన పడక గదిలో. ఏదైనా కనపడటాని కసలు మన కళ్లు కూడా మూతపడి ఉన్నాయి. పడ్డాయో లేదో ఎన్ని చిత్ర విచిత్రమైన దృశ్యాలు మన ఎదట సాక్షాత్కరిస్తాయో చెప్పలేము. అంతకు ముందు లేని విప్పుడు హఠాత్తుగా ఎక్కడి నుంచి ఊడిపడ్డాయి. మరి తెల్లవారితే ఏమయి పోయాయి.

అప్పటికి లోకానుభవమని మనం మురిసిపో నక్కరలేదు. లోకానుభవంలో అంతా ఉన్నదే ఉందని - లేనిదే లేదని దర్శించటం లేదు మనం. ఉన్నది లేదనీ లేనిది ఉందనీ బోల్తా పడి చూడడం కూడా లోకానుభవమే. ఆ మాటకు వస్తే లోకానుభవ మంతా కూడా నూటికి నూరు పాళ్లూ తారుమారుగా చూడటమే నని సిద్ధాంతం చేశారు వేదాంతులు. అది ఎలాగ అని మన కాశ్చర్యం వేస్తుంది. కాని వారు

Dr Dayananda Swamy ebooks



నిరూపణ చేసి చూపినప్పుడది ఎంత యధార్థమా అని అంత కన్నా ఆశ్చర్యం గొలుపుతుంది. వారు చూపే ఉపపత్తి **Argument** ఏమిటంటే ఒక ఆభరణం నీకు కనిపిస్తున్నదంటే అది దాని మూల పదార్థమైన బంగారం కంటే వేరుగా లేదు. ఆ బంగార మక్కడి కాగదు. అది ఆ బంగారు గని కంటే వేరే ఎక్కడా లేదు. ఆ గని పృథివీ తత్త్వం కన్నా భిన్నంగా లేదు. కఠినమైన ఈ పృథివి ద్రవరూపమైన జలం కన్నా వేరుగాదు. అది ద్రవీభవించిన తేజస్సే మరేదీగాదు. ఆ తేజస్సు వాయువే ఘర్షణ చెంది అలా మారింది గనుక దానికి విలక్షణం కాదు. చలించే ఆ వాయువు కూడా అచలమైన ఆకాశం కన్నా వ్యతిరిక్తం కాదు. మరి ఆకాశమో. అక్కడి కాగ వచ్చుగదా మనం. అన్ని చరాచర పదార్థాలకూ మూల భూతమదే గదా. అదే అంతకన్నా మరేదీ లేదని అక్కడికే ఆగిపోతారు భౌతిక శాస్త్రజ్ఞులు. కాదు దానికి కూడా మూలముంది అదే చిద్రూపమైన ఆత్మ అంటారు వేదాంత శాస్త్రజ్ఞులు. ఆకాశం సత్తయితే దాని అస్తిత్వాన్ని కూడా గమనించే ప్రమాణం చిత్ లేదా చైతన్యం **Pure Awareness or Consciousness** ఇక దానికేమిటి ప్రమాణమని ప్రశ్న లేదు. దానికదే ప్రమాణం. జ్ఞానం గదా అది. తనకు తానే ప్రమాణం. దీన్నే స్వతః ప్రమాణ **Self Evident** మంటారు.

ఇప్పుడీ జ్ఞానమనండి. ఆత్మ అనండి. ఇదే మొత్తం ప్రపంచాని కాధారం. దీనిమీద ఆధారపడే మిగతా ప్రపంచ మంతా స్ఫురిస్తున్నది.

Dr Dayananda Swamy ebooks


మనోభావాలు మొదలుకొని బాహ్యమైన ఆకాశం వరకు అన్నీ ఉన్నట్టు దానికే స్ఫురిస్తున్నాయి. అంటే దానికి భిన్నంగా ఇవి లేవు. వీటి పాటికివి అసత్. లేనివే. స్వతహాగా లేకున్నా ఇవి ఇలా ఉన్నట్టు మనకు భాసిస్తున్నా యంటే దాని మూలంగానే భాసిస్తున్నాయి. మూలభూతమైన ఆ జ్ఞానం మనకు వీటిలాగా గోచరించటం లేదు. భావం నిరాకారంగదా ఎలా గోచరిస్తుంది. నిరాకారమైనా సుఖాదులైన భావాలు గోచరించటం లేదా అని అడగవచ్చు. సుఖదుఃఖాదులు మన స్వరూపం కావు. మన జ్ఞానానికి సోకే భావాలు. మరి జ్ఞానమో అది సాక్షాత్తూ మన స్వరూపమే. స్వరూపం గనుకనే అది మనకు గోచరం కాదు. కానక్కరలేదు. మన మున్నట్లు మనకు తెలియదా. ఇక క్రొత్తగా గోచరించటం దేనికి. గోచరించకుండానే మనోభావాల దగ్గరినుంచీ సమస్త ప్రపంచాన్నీ గోచరింప చేసుకొంటుంది. గోచరించేదంతా దాని మీద ఆధారపడితేనే వాటి కస్తిత్వం. అంచేత వాటి పాటి కవి అసత్. పోతే దేనిమీదా ఆధారపడక తన పాటికి తానుండ గలదు కాబట్టి జ్ఞానమొక్కటే సత్.

అయితే సత్తయినా ప్రపంచంలాగా మన ఎదటికి వచ్చి కనపడని నేరానికి మన స్వరూపమైన జ్ఞానాన్నే మన మసత్తని భావించాము. కనపడుతున్నాయి గనుక అ సత్తయినా ఈ ప్రపంచాన్నంతా మనం సత్తని బోల్తా పడుతున్నాము. కనుకనే గీతాశాస్త్ర మిప్పుడు మనం చేస్తున్న తప్పు సరిదిద్దుకోమని మందలించి చెబుతున్నది. లేని అనాత్మ ప్రపంచం

Dr Dayananda Swamy ebooks



లేదని తెలుసుకో. ఎప్పుడూ ఉన్న ఆత్మ చైతన్యమే ఉందని గుర్తించమని. అయితే ఇది లేదని ఎప్పుడర్థ మవుతుంది మనకు. అది ఉందని గుర్తించినప్పుడు. వస్తువును గుర్తించినప్పుడే ఆభాస ఆభాస అయిపోతుంది. అంతవరకూ ఆ భాసే **Appearance** వాస్తవమయి దాని కాధార భూతమైన వస్తువే **Reality** ఆ భాస అని భ్రమ గొలుపుతుంది.

ఇది ఎలాటిదంటే చీకట్లో మనకొక సర్పం కదలిపోతున్నట్టు భాసిస్తుంది. అది సర్పం కాదు. ఒక తెల్లని నిడుపాటి త్రాడు. ఆ రజ్జువే గాలికి కదులుతుంటే ప్రాకుతూపోయే సర్పమని అపోహపడ్డాము. తన్మూలంగా తాడబద్ధమయి పాము నిజమయింది మన పాలిటికి. వాస్తవంలో పామే అసత్యం త్రాడే సత్యం. ఎప్పుడు గ్రహించగలమీ సత్యం. త్రాడును చూడక పామును చూస్తున్నంత వరకూ తెలియదు. అలాగే ఆత్మజ్ఞానం లేనంత వరకూ ఈ మాత్రా స్పర్శలూ శీతోష్ణాదులూ సుఖదుఃఖాదులైన ద్వంద్వాలూ - ఈ అనాత్మ జగత్తంతా వాస్తవంగానే ఉందనే భ్రాంతి మనకు తొలగిపోదు. రజ్జు దర్శనమయినట్టు ఆత్మ దర్శనం కావాలి మనకెప్పటికైనా.

అది ఎలాగ అంటే చెబుతున్నది గీత - ఉభయో రపి దృష్టోంత స్త్వనయో స్తత్త్వ దర్శిభిః - సద సత్తులు రెండింటి అంతమూ ఎప్పుడు చూడగలవో అప్పుడే నీవు తత్త్వాన్ని చూచినవాడ వవుతావు. సత్తు ఆత్మ - అసత్తు అనాత్మ ప్రపంచమని గదా వర్ణించాము. సత్తు కంతమంటే

Dr Dayananda Swamy ebooks


ఆత్మ కంతం లేదు వాస్తవానికి. అది సత్యం జ్ఞాన మనంతం. దానికంత మేదైనా ఉందంటే అది అనాత్మే అది కూడా ఆత్మ చైతన్యంతోనే నిండి ఆత్మగానే దర్శన మిస్తున్నప్పుడిక అంతమేమిటి - చూడటమేమిటి. అలాగే అసత్తీ అనాత్మ జగత్తే. ఇది అసలు లేనే లేనప్పుడిక దీని కంతమేమిటి మనం చూడటమేమిటి.

మరి ఏమిటీ మాటల కర్థం. ఎందుకిలా చెప్పింది గీత. పైగా అదే తత్త్వ దర్శన మంటున్నదే. జాగ్రత్తగా అర్ధం చేసుకోవాలి మనమొక ధర్మ సూక్ష్మమిక్కడ. సద సత్తుల అంతమిక్కడ సద సత్తులు కావు. అంటే దానికంత మిది దీనికంత మది అని గాదు. మరేమిటి. రెండింటికీ కలిసి అంతమొకటి ఉంది. అది అపరోక్షమైన నా స్వరూపం. అదే ఆత్మ. అది సత్తు కాదు. అసత్తు కాదు. సత్తన్నానో అసత్తది కాదా అని ప్రశ్న వస్తుంది. అసత్తన్నానో సత్తు కాదా అని అడుగుతావు. ఏ ఒక్కటని చెప్పినా అది సర్వ వ్యాపకమైన ఆత్మ కాదు. అవి రెండూ కలిసి ఎక్కడ అంతమయి పోతాయో ఎందులో లయమయి పోతాయో అది అఖండమైన ఆత్మ స్వరూపమని భావం. కనుకనే నసత్త న్నా సదుచ్యతే అని క్షేత్ర జ్ఞాధ్యాయంలో రాబోతుంది ఒక వాక్యం. అది సత్తూ కాదు అసత్తు కాదు అర్జునా అని స్వయంగా చాటి చెప్పాడు పరమాత్మ. కాబట్టి అలా సద సత్తులనే ద్వంద్వాలను రెంటినీ కలిపి నిర్ద్వంద్వంగా ఏకంగా దర్శించినప్పుడే అది తత్త్వ దర్శనమని గీతా హృదయం.

Dr Dayananda Swamy ebooks



**అవినాశి తు త ద్విద్ధి - యేన సర్వమిదం తతమ్**

**వినాశ మవ్యయ స్యాస్య - న కశ్చి త్కర్తు మర్హతి - 17**

ఏతా వతా మనకు తేలిన సారాంశమేమిటి ఆత్మ తప్ప విడిచి వస్తుతః మరేదీలేదు. మాత్రా స్పర్శల దగ్గరి నుంచీ సుఖదుఃఖాదుల వరకూ అన్నీ అబద్ధమే. అవే హుళక్కి అయినప్పుడిక వాటి ఒత్తిడిని మనం భరించటం భరించక పోవటమనే ప్రశ్నేముంది. ఎప్పటికప్పుడా గమా పాయులుగా వాటి రాకపోకలను ఒక ఇంద్రజాలంలాగా చూస్తూ కూచోటమే మనం చేయవలసిన పని.

కాని అలా చూస్తూ ఉన్న మన జ్ఞానం కూడా స్థిరంగా ఎక్కడ ఉంది. అది కూడా జ్ఞేయ ప్రపంచంలాగా వస్తూ పోతూ ఉన్న బాపతే గదా. అలాగే కదా మనకిప్పు డనుభవం. జాగ్రత్తులో ఉన్న జ్ఞానం స్వప్నంలో లేదు. స్వప్నజ్ఞానం కూడా సుషుప్తిలో అసలే లేదు. రేపు మరణిస్తే ఏమాత్రమూ లేదు. సర్వనాశనమే గదా అని ఒక పెద్ద ఆ శంక మన కందరికీ. దానికి జవాబిస్తున్నదీ శ్లోకం. ఏమని.

నీవు నాశన మయిపోతున్నదే అని భయ పడుతున్నది మేము చెప్పే జ్ఞానం కాదు. అది వృత్తి జ్ఞానం లేదా విశేష జ్ఞానం. అది నీ శరీరం మేరకే పరిచ్ఛిన్న **Limited** మైన జ్ఞానం. శరీర మనః ప్రాణాల మేరకే ఆగిపోయి వాటితో మమేకమైనది కాబట్టి అది శరీరమే పాటు పడితే ఆ పాటు పడుతుంది. జాగ్రదాద్యవస్థలలో హెచ్చుతూ తగ్గుతూ

Dr Dayananda Swamy ebooks

పోవటమందుకే. తుదకు మూర్ఛా మరణాదులలో అసలే మాసిపోవటం కూడా అందుకే. మనః ప్రాణాలు రెండూ పనిచేయకుండా ఆగిపోయే సరి కది కూడా ఆగిపోవలసి వస్తున్నది. ధ్యాయతీవ లేలాయతీవ - మనసు ధ్యానం చేస్తుంటే అది ధ్యానం చేస్తుంటుంది. అది డోలాయ మానమైతే ఇదీ డోలాయమాన మవుతుంది.

బృహ దారణ్యకంలో వస్తుందీ సందర్భం. యాజ్ఞవల్క్యుడు మైత్రేయి కాత్మ స్వరూపం ప్రజ్ఞాన ఘన మది ఎప్పటికీ నశించేది కాదని చెబుతూ ఒక మాట అన్నాడు. న ప్రేత్య సంజ్ఞాస్తి మరణిస్తే తెలివి తప్పుతుందని పేర్కొంటాడు. ఆ మాట వినేసరికి మైత్రేయికి మతి పోతుంది. అత్రైవమా భగవా నమూముహత్. ఇదేమిటి మహానుభావా అది ప్రజ్ఞాన ఘనమని ఘనంగా చెబుతారు. మరలా మరణిస్తే ప్రజ్ఞ తప్పుతుందంటారు. ఏమిటిదంతా ప్రజ్ఞాన ఘనమైతే ఎలా మరణిస్తుంది ఎలా తొలగిపోతుంది. మొత్తానికి నా మతి పోగొడుతున్నారు మీరు మీ మాటలతోనని వాపోతుంది. దానికి సంజాయిషీ ఇస్తూ నా హం మోహం బ్రవీమి అని ఒక్క మాటలో కొట్టి వేశాడు యాజ్ఞవల్క్యుడు. పోతే యాజ్ఞవల్క్యుడి వద్ద వకాలతా పుచ్చుకొని భగవత్పాదులు సంజ్ఞా అనే దానికి ముందు విశేష అని ఒక మాట దూర్చాడు. అప్పటికి సంజ్ఞా నాస్తి అనే మాటకు విశేష సంజ్ఞా నాస్తి - అని అర్థం చెప్పుకోవాలి మనం.

Dr Dayananda Swamy ebooks



విశేష సంజ్ఞ కాకుంటే మరే సంజ్ఞ అంటారు. సామాన్య సంజ్ఞ. మనస్సు తాలూకు వృత్తి మేరకే అయితే అది విశేష జ్ఞానం. వృత్తిరహితమైన దశనందుకొంటే అది సామాన్య జ్ఞానం. సామాన్యం గనుకనే అది ఈ శరీర మనః ప్రాణాదులైన ఉపాధుల మేరకే పరిమితం కానక్కరలేదు. ఎంత మనలోపల ఉందో అంత మన వెలపల కూడా ఉండగలదు. బహిరంతశ్చ భూతానా మని తరువాత భగవద్గీతే చెప్పబోతుంది. యావజ్జీవమూ మనకీ విశేష జ్ఞానమే అనుభవ సిద్ధంగదా దీనికతీతంగా మరొక సామాన్య జ్ఞానముందని మనకేమిటి దాఖలా అని సందేహించబని లేదు. ఎందుకంటే అపరిపూర్ణమైన జ్ఞానమిప్పుడు మన అనుభవంలో ఉందంటేనే పరిపూర్ణమైన దొకటి ఉండక తప్పదు. ఒకనిప్పు రవ మన ఒంటిని సోకిందంటే అఖండంగా వెలిగే అగ్నిహోత్ర మొకటి ఉండి తీరాలి. కాబట్టి అపరిపూర్ణ మెప్పుడూ పరిపూర్ణమైన దాని అస్తిత్వాన్ని సూచిస్తూ ఉంటుంది. ఇదే దానికి ప్రమాణం.

కాబట్టి అపరిపూర్ణమైన మన వృత్తి జ్ఞానానికే గాని దీనికి మూలమైన ఆ పరిపూర్ణమైన సామాన్య జ్ఞానానికి వినాశం లేదు. అది అవినాశి. ఎంచేత యేన సర్వమిదం తతం అది ఈ సమస్త పదార్థాలనూ వ్యాపించి ఉంది. సమస్తమంటే మాటిమాటికీ చెప్పనక్కర లేదు. మానవుడి అహంకారం **Ego** దగ్గరి నుంచీ బాహ్యామైన ఆకాశం వరకూ ఈ మొత్తాన్ని వ్యాపించింది. వ్యాప్తి అంటే ఏమనుకొన్నావో. బహిర్వ్యాప్తే గాదు.

Dr Dayananda Swamy ebooks


అంతర్వ్యాప్తే గాదు. స్వరూప వ్యాప్తి కూడా. ఆభరణాల పైభాగమంతా బంగారమే. అది బహిర్వ్యాప్తి. లోపల కొట్టి చూస్తే బంగారమే. అది అంతర్వ్యాప్తి. అంతేగాక దాని ప్రతి అణువువూ బంగారమే. అది స్వరూప వ్యాప్తి. ఇలా ప్రత్యణువూ అందులో బంగారమే అయితే ఇక ఆభరణమనేది ఎక్కడ ఉంది. ఉందని ఎవరు చెప్పారు. సువర్ణానికి వ్యతిరిక్తంగా అది ఒకటి ఉందనుకోటం మన భ్రాంతి. అలాటి భ్రాంతే ఇప్పుడీ ప్రపంచమంతా. దీనినంతటినీ అత్మ చైతన్యమే వ్యాపించి ఉందిప్పుడు. ప్రతి ఒక్కటీ అస్తి భాతి - ఉందనే స్ఫురణే గదా. ఆ స్ఫురణను మినహాయిస్తే ఏ పదార్థం గానీ ఎక్కడ కనిపించింది నీకు. మహా అయితే స్ఫురణే **Conscious-ness** ఆ రూపంలో కనిపిస్తున్నదని చెప్పాలి నీవు.

అలాంటప్పుడిక వినాశమనే దేముంది ఆత్మకు. అనాత్మ భూతమైన ఈ శరీరాది సంఘాతం పోయినా దీనితో మమేకమైన నేరానికీ జీవాత్మ తొలగిపోయినా సామాన్య రూపమైన ఆ ప్రత్యగాత్మ ఎక్కడికీ పోదు. పోవటానికది ఈ మనస్సూ ప్రాణమూ వీటితో చేతులు కలిపితే గదా. కనుక ఇది శరీరాన్ని అంటిపట్టుకొని నప్పుడూ ఉందది. ఇవి మరణకాలంలో దీన్ని వదిలేసి పోయినప్పుడూ ఉంది. ఆకాశంలాగా ఆ మృత శరీరం లోపలా వెలపలా వ్యాపించే ఉంది. విశేష జ్ఞానానికి తెలియదది తనకూ తన శరీరానికీ సాక్షిగా అక్కడే ఉందని. దీనికి తెలియకున్నా దానిపాటికది ఉంది. అవిద్యావశాత్తూ ఈ జీవుడి

Dr Dayananda Swamy ebooks



అనుభవంలో లేదే గాని వస్తు సిద్ధంగా **By itself** అది ఎప్పుడూ ఉంది. జీవించినా ఉంది. మరణించినా ఉంది. దానికి మరణం లేదు. కారణం అవ్యయ స్యాస్య. అవ్యయమది. వ్యయం కానిది. వ్యయమంటే ఖర్చు మారిపోవటం. ఆకారంలేని దెలా మారుతుంది. మన జ్ఞానమూ ఇప్పుడలాంటిదే గదా అంటావేమో. నిజమే. ఇదీ నిరాకారమే. కాని సాకారమైన మనః ప్రాణ శరీరాలను నెత్తిన వేసుకొని సాకారమని బోల్తా పడుతున్నది. కాబట్టి వస్తుతః నిరాకారమైనా బుద్ధితః కాదు. అంచేతనే రేపు మారిపోతుంది. మాసిపోతుంది. అది మనః ప్రాణాది ఉపాధులతో సంబంధం లేని నిరుపాధికమైన **Absolue** చైతన్యం కాబట్టి దానికి వినాశం లేదు.

వినాశ మవ్యయ స్యాస్యన కశ్చి త్కర్తు మర్హతి - ఒకవేళ ఎవడైనా దాన్ని నశింప జేయాలనుకొన్నా నశింప జేయలేడు. ఎందుకంటే దానికి భిన్నంగా ఎవడూ లేడు. అంతా అదే వ్యాపించి ఉన్నప్పుడంతా దాని స్వరూపమే గదా. నశింపజేస్తా ననుకొన్న వాడూ దాని స్వరూపమే. స్వరూపమంటే ఆత్మే. ఆత్మే అయినప్పుడది తన్ను తాను ఎలా చంపుకోగలదు. నకశ్చి దాత్మానం వినాశయితుం శక్నోతి ఈశ్వరోపి. వాడెంత సమర్థుడైనా ఆ పనిచేయుట మసంభవ మంటారు భగవత్పాదులు. ఇంకా ఒక మాట కూడా చెబుతారాయన. స్వాత్మని క్రియా విరోధాత్. ఏ క్రియ కూడా తన విషయంలో తనకు సంభవించదు. అగ్నికి మండుతూ

Dr Dayananda Swamy ebooks



ఉండటం స్వభావం. అది తనకు అన్యమైన ఏ తాటాకునో కాగితాన్నో మండిస్తుందేగాని తన్ను తాను మండించుకోగలదా మండించటం దేనికి - మంటే అది అయినప్పుడు. అలాగే ఆత్మ కూడా తన్ను తాను నశింపజేసుకొనట మసాధ్యం. తనకు భిన్నంగా మరొకటేదీ లేదు కాబట్టి మరొక దానివల్ల నశిస్తుందనే మాటా అర్థం లేని మాటే.

**అంతవంత ఇమే దేహా - నిత్యస్యోక్తా శ్శరీరిణః**

**అనాశినో ప్రమేయస్య - తస్మా ద్యుధ్యస్వ భారత - 18**

ఆత్మ నశించేది కాదని చెప్పారు గదా. అయితే ఇక నశించే పదార్థ మేదంటారు. అంతవంత ఇమే దేహా - ఇదుగో ఈ శరీరమనః ప్రాణాదులే నశించేవి. అంతవంతమివి. అంతమంటే కొస. అది ఒకటిగాదు. రెండు. ఒక పదార్థ ముందంటే దానికాదీ ఒక కొసే. అంతమూ ఒక కొసే. రెండు కొసలూ అంతాలే. అందులో మొదటిది జననమూ. రెండవది మరణమూ. ఇవి రెండూ లేని పదార్థ మీ సృష్టిలో లేదు. చేతనమైనా అచేతనమైనా ఏదైనా ఒకప్పుడు పుట్టి మరొకప్పుడు గిట్టవలసిందే. ఒక కుండ తయారుచేస్తే పుడుతుంది. పగిలిపోతే పోతుంది. ఒక చెట్టు విత్తనంలో నుంచి పుడుతుంది. మళ్లీ విత్తనంగా మారిపోతుంది. అలాగే ఒక మానవుడూ పుడతాడు పోతాడు.

అయితే అలా పుడుతూ పోతూ ఉన్నప్పుడేది ఆ పుట్టటం - ఏది ఆ పోవటం అని ఎప్పుడైనా ఆలోచించావా. అది పైకి కనిపించే ఆ

Dr Dayananda Swamy ebooks



రూపాలే. ఆ శరీరాలే. అవి వస్తూ పోతున్నాయి. అందులోనే ఉండి వాటిని సాక్షిగా చూస్తున్న ఆత్మ మాత్ర మలా రావటం లేదు. పోవటం లేదు. అది శరీరం కాదు. శరీరి - శరీరాన్ని ధరించిందే గాని అది శరీరం కాదు. శరీరమనేది దానికొక తొడుగు. ఒక వేషం. వేషం పోయినా వేషధారి పోడు. వేషాలెన్నైనా ఉంటాయి. వేషధారి ఒక్కడే. నిత్యస్యోక్తాః శరీరిణః వేషధారి ఎప్పుడూ ఉంటాడు. అతని వేషాలే వస్తూపోతూ ఉంటాయి.

అనాశినో ప్రమేయస్య. అయితే చిత్రమేమంటే నశించే శరీరంలో ఉండి కూడా అది నశించకుండా అవినాశిగా నిలిచి ఉండటం. ఈ సందర్భంలో కఠోపనిషత్తు చాటి చెప్పిన మాట చిరస్మరణీయం. అశరీరం శరీరేషు అనవస్థే ష్వవస్థితమ్. అశరీరమైన దొకటి మన శరీరంలో వచ్చి కూచున్నది. ఇది నశించినా అది నశించని పదార్థం. ఏమి కారణం. అది నిరాకారమూ వ్యాపకమూ కావటమే. వ్యాపకం గనుకనే శరీరం వెలపలే గాక లోపలా ఉండగలదు. లోపల ఉన్నా నిరాకారం గనుక సాకారమైన శరీరం నశించినా అది నశించదు.

మంచిదే కాని నిరాకారమైన పదార్థమదే గాక ఆకాశం కూడా ఒకటి ఉంది గదా. అది కూడా ఆత్మలాగా అవినాశియేనా అని అడిగితే చెబుతున్నది సమాధానం గీత. అప్రమేయస్య. ప్రమేయం కానిదేదో అది అప్రమేయం. ఆత్మ ఒక్కటే ప్రమేయం కాదు. మిగతా దంతా ప్రమేయమే. ప్రమేయమంటే ప్రమాణానికి విషయమయ్యేది **Object** గోచరించేది అని

Dr Dayananda Swamy ebooks


అర్థం. ఆకాశం మన జ్ఞానానికి గోచరిస్తున్నదా కాదా ఇప్పుడు. ఇది ఆకాశమెంతో దూరం విస్తరించి ఉన్నదని చెబుతున్న దెవరిప్పుడు నీనా జ్ఞానమే గదా. జ్ఞానేనహి ప్రమాణేన అంటారు భగవత్పాదులు. జ్ఞానమే చివరకు ప్రమాణం. ప్రమాణానికి ప్రమాణ మక్కర లేదు. అదే ప్రమాణ మయినప్పుడు దానికి మరి ప్రమాణం **Proof or Evidence** దేనికి. తానున్నాని తానే అనుకోగలదది. తన ఉనికి తాను గుర్తిస్తూ మరొకటి గూడా ఉందని గుర్తిస్తున్నది. ఆ మరొకటి క్రిందికి వస్తుంది ఆకాశం మొదలుకొని సమస్త ప్రపంచం కూడా. కనుక ఆకాశం కూడా. ప్రమేయమే గాని అప్రమేయం కాదు. అప్రమేయం స్వతః ప్రమాణమైన ఆత్మ చైతన్యమొక్కటే.

నను ఆగమేన ఆత్మా పరిచ్ఛిద్యతే ప్రత్యక్షాదినాచ పూర్వమ్ అని ఇక్కడ ఒక ఆక్షేపణ లేవదీశారు భాష్యకారులు. ఆత్మ ఒకటి ఉంది అది ఫలానా అని నీకెలా తెలిసింది. నేనున్నాననే ప్రత్యక్ష ప్రమాణం వల్లనే గదా గ్రహించావు. అలాగే శాస్త్రమనే ప్రమాణం కూడా చెబుతున్నది గదా ఆత్మానం చే ద్విజానీయా త్తని. అలాంటప్పుడాత్మ అప్రమేయమెలా అయింది. దాని కాయనే చేశారు పరిహారం. సిద్ధేహి ఆత్మని ప్రమాతరి ప్రమిత్సోః ప్రమాణా న్వేషణా భవతి అని. మొదట ఒక ప్రమాతగా **knower** నే ననేవాడను లేకపోతే ప్రమాణంతో ఒక ప్రమేయాన్ని గ్రహించాలనే బుద్ధి నాకేర్పడదు. కాబట్టి ప్రమాణం చెబితే నేను లేను. నేనుంటేనే ప్రమాణం పని చేస్తున్నది. కాబట్టి ప్రత్యక్షం ద్వారానా ఉనికి గాదు. నా ఉనికి ద్వారా ప్రత్యక్షం.

Dr Dayananda Swamy ebooks



అలాగే శాస్త్రం కూడా అతద్ధర్మా ధ్యారోపణ మాత్ర నివర్తక త్వేన ప్రమాణత్వం ఆత్మనః ప్రతిపద్యతే - న తు అజ్ఞాతార్ధ జ్ఞాపకత్వేన. ఆత్మ కనవసరంగా మన బోటిలోకు లారోపించిన నామరూపాది ధర్మాలను త్రోసి పారవేయటం వరకే ప్రమాణంగా పనిచేస్తుందేగాని మనకు తెలియని మన స్వరూపాన్ని ఇదుగో నీ స్వరూపమని సాక్షాత్తుగా చూపటానికి గాదు. యత్సాక్షా దపరోక్షా త్తం టున్నప్పుడది చూపితేనా నేనున్నానని నా ఆత్మను నేను పట్టుకోవలసింది. చూపకపోతే నేనున్నానని నాకు తెలియదా అని త్రోసిపుచ్చారు వారు.

కాబట్టి ఆత్మ అప్రమేయం. ప్రమేయం లాగా నశించేది కాదు. కనుక తస్మాద్యుధ్యస్వ భారత. నీవు యుద్ధం చేసినా తప్పు లేదు. నిశ్చింతగా చేయవచ్చు. యుద్ధమనేది ఇక్కడ ఉపలక్షణం. అన్ని ఇంద్రియ వ్యాపారాలకూ సూచకం. ఏ పనిచేసినా అందులో ఆత్మ వ్యతిరిక్తంగా ఏదీ లేదు కాబట్టి చేసినా చేయటం కాదది. మృగతృష్ణికలో దిగి స్నానం చేశామనుకొండి. అది స్నానమంటావా. పానం చేస్తే అది పానమంటావా. కర్మణ్య కర్మయః పశ్యేత్. కర్మలన్నీ కర్మలే గావు అకర్మలని తరువాత చెప్పబోతుంది గీత.

**య ఏవం వేత్తి హంతారం - యశ్చైవం మన్యతే హతమ్**
**ఉభౌతౌ న విజానీ తో నాయంహంతి న హన్యతే - 19**

ఏ పని చేసినా అది కర్మగాదు అకర్మేనని సిద్ధాంతం. చేస్తే అది ప్రమాదం గదా అని ఇప్పుడు ప్రశ్న వస్తుంది. గీత మనకు సిద్ధాంతరీత్యా

Dr Dayananda Swamy ebooks


చెబితే చెప్పవచ్చుగాని అది జీవితంలో ఆచరణ యోగ్యమా. యుద్ధం చేసి ఒకరిని చంపినా అది చంపటం కాదా. దానివల్ల పాపం రాదా. అలాగైతే ఒక పామరుడికీ బ్రహ్మవేత్తకూ తేడా ఏముంది అని అడిగితే ఏమిటి జవాబు. దానికే జవాబిస్తున్న దిప్పుడీ శ్లోకం. ఇదీ దీని తరువాతిదీ ఈ రెండు శ్లోకాలూ ఋగ్వేదంలోని మంత్ర వర్ణాలు. ఆత్మ ఏ క్రియకూ ప్రవర్తకం కాదు నివర్తక మనే సత్యాన్ని బలపరచటానికి గీత ఈ ఋగ్వేద మంత్రాలను పట్టుకొని వచ్చిందంటారు భగవత్పాదులు.

ఇక్కడ ఒక విషయం బాగా వివేచన చేసి చూడాలి మనం. లేకుంటే ఇదేమిటిలా మాటడుతున్నది భగవద్గీత అని కంగారు పడతాము. ఆత్మ అనేది అవిక్రియం. దానితో ఏ వికారానికి గానీ చోటు లేదు అని మాత్రమే మనం దీని ద్వారా అర్థం చేసుకోవలసిన విషయం. అంతేగాని ఒకరిని చంపటమూ చంపకపోవటమూ కాదు. అదైనా ఎందుకు ప్రస్తావించిందంటే గీత – అర్జునుడు క్షత్రియుడు. అధర్మాన్ని రూపుమాపి ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత పెట్టుకోవలసినవాడు. అందులో ఇంతమంది సైనికులను సంహరిస్తున్నాను గదా ఇది మహాపాపమనే భీతాహ ముండగూడ దతనికి. అందుకోసమీ చంపటమనే క్రియ ఇక్కడ ప్రస్తావనకు వచ్చిందే గాని అసలిదే చెప్పటం కాదు ఉద్దేశం. లోకంలో ఉన్న మానవులందరూ అర్జునుడి లాంటి క్షత్రియులు కారు గదా. అంచేత దినచర్యలో ఎవడే పని పెట్టుకొన్నా ఈ పని నేను చేస్తున్నాననే

Dr Dayananda Swamy ebooks


కర్తృత్వంగాని - దీని ఫలం నేను అనుభవిస్తున్నాననే భోక్తృ భావంగాని - ఇలాంటి అభిమానం పనికి రాదని చెప్పటమే ఇక్కడ బోధ.

ఈ భావం బాగా మన మనసుకు పట్టటానికే య ఏవం వేత్తి హంతా రం - యశ్చైనం మన్యతే హతం - ఎవడు నేను చంపుతున్నానని కర్తగా తన్ను భావిస్తాడో - ఎవడు వాడు చంపితే చస్తున్నానని కర్మగా తన్ను భావిస్తాడో - ఉభౌతౌ నవిజానీతః - వారిద్దరూ మూఢులే. ఆత్మ స్వరూపమేమిటో తెలియనివారే. వాస్తవంలో నాయం హంతి - నహన్యతే. వీడు చంపటమూ లేదు. వాడు చావటమూ లేదని ఘాటుగా చెబుతున్నది గీత. ఇలాంటి సందర్భమే మనకు గీత 18వ అధ్యాయంలో వస్తుంది. యస్య నా హం కృతో భావః - బుద్ధిర్యస్య నలిప్యతే. ఎవడీ పని నేను చేస్తున్నానే దీనివల్ల నాకు నరకపాతం తప్పదేమో ననే అహంకార మమకారాలు పెట్టుకోకుండా పనిచేస్తాడో హత్వాపిస ఇమాన్ లోకాన్ నహంతి న ని బధ్యతే. వాడెంత మందిని చంపినా చంపనివాడే నట.

ఏమిటీ విడ్డూరం. చంపినా చంపటం కాదనట మేమిటి. అన్యోన్య విరుద్ధమైన ప్రసంగం కదా అంటే భగవత్పాదులు సమాధానమిచ్చారు. దేహాద్యాత్మ బుద్ధ్యా లౌకికీం దృష్టి మాశ్రిత్య హత్వాపి ఇత్యాహ - పారమార్థికీ మాశ్రిత్య నహంతి నినిబధ్యతే ఇత్యాహ అని. దేహమేనేననే భావం వదలని వాడు నేనే చేస్తున్నానీ పని అని చేస్తాడు కాబట్టి వాడికంటుతుంది

Dr Dayananda Swamy ebooks

దాని ఫలం. అలా కాక నేను దేహం కాదు కేవల శుద్ధ చిన్మాత్ర స్వరూపుడనైన ఆత్మను గదా అని ఆ పని జరుగుతుంటే సాక్షి మాత్రుడుగా చూస్తుంటాడు గాబట్టి దాని ఫలమతని కంటదట.

అదే ప్రస్తుత మిక్కడ కూడా చెప్పుకోవలసిన సమాధానం. నీవు జీవాత్మ వనుకొంటేనే ఒక క్రియకు కర్తవూ భోక్తవూ అవుతావు. అప్పుడు చంపటం చంపటమే. చావటం చావటమే. అలాకాక నీవే ప్రత్యగాత్మ వనుకొంటే మాత్రమది చంపటమూ కాదు. చావటమంత కన్నా కాదు. రెండూ నీ దృష్టిలో ఒక ఆ భాస. వాస్తవం కాదు. అయితే వాస్తవం కాదు కాబట్టి ఎవరినైనా చంపవచ్చునా అని అడిగితే ఆ స్థాయి కెదిగిన వాడు ఎలాగూ చంపడు. కారణం తాను చంపాలనుకొన్న వాడూ తన స్వరూపమే. ఇక ఎలా చంపగలడు. అలాంటి బుద్ధే పుట్టదు వాడికి. అయితే ఎందుకీ మాట అంటే చెప్పాము గదా సమాధానం ఘాటుగా నీ మనసుకు నాటుకోటానికని చంపటం లాంటి కర్మ కూడా జ్ఞాని దృష్టిలో అకర్మ అయినప్పుడిక కైముతిక న్యాయంగా **What to speak of other actions** ఇక మిగతా మామూలు కర్మల మాట చెప్పటం దేనికని దీనిలోని అంతర్యం.

**నజాయతే మ్రియతే వా కదాచి**

**న్నాయం భూత్వా భవితావా నభూయః**

**అజోనిత్య శ్శాశ్వతోయం పురాణో**

**నహన్యతే హన్యమానే శరీరే - 20**

Dr Dayananda Swamy ebooks



ఇది ఇంకొక బుఝ్మంత్రం. గీత ఉదాహరిస్తున్నది. ఉభౌతౌన విజానీతః ఇద్దరూ మూఢులే. అసలైన ఆత్మ స్వరూపమేదో తెలియక శరీరా ద్యుపాధులే ఆత్మ అనుకొని ఒకానొక క్రియకు కర్తనని భోక్తనని ఎవడికి వాడు భావిస్తున్నాడని గదా ముందు వర్ణించారు. ప్రస్తుతమా అసలైన ఆత్మ పదార్థమేమిటి - అది ఎలాంటిది. దానికీ కర్మ కలాపంతో సంపర్క మెలా లేదనే సత్యం బయట పెడుతున్నదీ శ్లోకం.

నజాయతే మ్రియతే వా కదాచిత్ అది జన్మించదు. మరణించదు. ఏదైనా జన్మించిందంటే అది మరణించి తీరాలి. ఏదైనా మరణిస్తున్న దంటే అది అంతకు ముందు జన్మించి ఉండాలి. జన్మించకనే పోతే మరణించలేదు. మరణించాలంటే జన్మించక తప్పదు. షడ్భావ వికారాలని పరిగణించాడు యాస్కుడనే మహర్షి. లోకంలో మనం చూచే ప్రతి పదార్థానికీ ఆరు వికారాలు లేదా మార్పులనేవి అవశ్యంగా ఉండి తీరుతాయి. జాయతే - మొదట జన్మించాలది. అస్తి - జన్మించిన తరువాత ఉంటుంది. వర్ధతే - ఉండటం వరకే గాక పెరుగుతూ పోతుంది. విపరిణమతే పెరిగి పెరిగి మారిపోతుంది. అపక్షీయతే - మారుతూ మారుతూ తరిగిపోతుంది. కృశించి పోతుంది. వినశ్యతి - కృశించి చివరకు నశించి మన కంటికి కనపడకుండా పోతుంది.

ఇప్పుడీ వికారాలనేవి లేని పదార్థమంటూ లేదు సృష్టిలో. పోతే ఆత్మ చైతన్యమొక్కటే ఇలాంటి వికారాలేవీ లేని పదార్థం. అది జన్మించదు.

Dr Dayananda Swamy ebooks


మరణించదు. జనన మరణాలనేవి ఆరు భావ వికారాలలో మొదటిది చివరిది అవి రెండూ లేవని చెప్పటం మూలాన మధ్యలో ఉండే నాలుగూ లేవని వేరే చెప్పనక్కరలేదు. నిర్వికారమైన దాత్మ అని అర్థమవుతున్నది. నాయం భూత్వా భవితా వాన భూయః అది ఒకప్పుడుండి మరొకప్పుడు పోయేదీ కాదు. అలాగే అంతకు ముందు అభూత్వా వా భవితా - లేకుండా పోయి కాలాంతరంలో శరీరంలాగా పుట్టుకు వచ్చేదీ కాదు. అసలు జన్మే లేదు దానికి. జన్మలేదు గనుకనే మరణమూ లేదు. అజమూ అమరమూ అది. అనాత్మ లాగా ఆగమా పాయాలు లేనిదని భావం.

అంతేకాదు. ఆద్యంతాలు లేవని రెండు కొసలూ కొట్టి వేయటం మూలంగా మధ్యలో కలిగే వికారాలు కూడా వాటంతట అవి కొట్టు పడిపోయినా - అవి కూడా కంఠోక్తిగా చెబితే నిస్సందేహంగా స్పష్టంగా ఉంటుందనే అభిప్రాయంతో మరలా వర్ణిస్తున్నది గీత. అజోనిత్యః శాశ్వతోయం పురాణః అని - శాశ్వత మనే మాట అపక్షయ మనేది లేదని కొట్టి వేస్తున్నది. అపక్షయ మంటే తరిగిపోవటం కదా. ఆత్మ స్వరూపతః క్షీణించదు. కారణం నిరవయవ మది **Indivisible** గుణ క్షయం వల్లనూ క్షీణించదు. కారణం నిర్గుణమది. కనుక శాశ్వతం. శశ్వత్ ఎప్పుడూ భవం ఒకేలా ఉంటుందని అర్థం.

అపక్షయ మెప్పుడు లేదో దానికి ప్రతీపమైన వృద్ధి లక్షణం కూడా లేదాత్మకు. అది పురాణం. ఏది అవయవాల బలంతో పెరిగి పెద్దదవుతుందో

Dr Dayananda Swamy ebooks


దానికి నవమని లేదు. ఇది అలా పెరిగేది కాదు. పెద్దదయ్యేది కాదు. పురాపి నవ ఏవ ఇతి పురాణః అన్నారు. ఇంతకు పూర్వ మెలా ఉందో అలాగే ఉంది ఇప్పుడూ ఎప్పుడూ క్రొత్తే ఎప్పుడూ ప్రాతే. ఎలా అనుకొంటే అలా. ఒక రకంగా కొత్త మరోరకంగా పాత. అనుభవానికి రానంత వరకూ కొత్తగా కనిపిస్తుంటుంది. అనుభవానికి వస్తే మొదటి నుంచీ ఉన్న పాతదే గదా ఇది ఇప్పుడు నాకు దర్శన మిచ్చిం దనిపిస్తుంది. అందువల్ల పురాణ మన్నా రాత్మను. అలాగే నహన్యతే హన్యమానే శరీరే. శరీరం దెబ్బ తినవలసిందేగాని దానికెప్పటికీ మార్పు లేదు. నిరాకారమూ ఆత్మ స్వరూపమూ కాబట్టి హెచ్చు తగ్గులు లేవు దానికి. ఈ మాటతో విపరిణామ మనే మరొక వికారం కూడా త్రోసి రాజయి పోయింది.

దీన్ని బట్టి తేలిందేమి టిప్పుడు. ఆత్మ అంటే అది మనం చూచే ఏ ప్రాపంచిక పదార్థాల లాంటిదీ కాదు. ఇది జనన మరణాది వికారాలతో కూడిందయితే అది అజమూ అజరమూ - నిర్వికారమూ. కనుకనే అది సర్వవ్యాపక మయి ఎప్పుడూ ఏకరూపంగా ఉన్న తత్త్వం. నిరాకారం గనుక అది శరీరాదుల లోపలే ఉన్నా వీటిలాగా నశించేది కాదు. మీదు మిక్కిలి జ్ఞాన స్వరూపం కాబట్టి అది వీటన్నింటి మార్పులనూ గమనిస్తూ సాక్షిగా నిలిచి ఉంటుంది. అలాంటప్పుడాత్మ కూడా నశిస్తుందేమోనని భయపడట మెంత పొరబాటు. కేవల మజ్ఞాన మనేది వదలకనే అలా భ్రాంతి పడుతున్నాడు మానవుడు. వాస్తవంలో అది దేనినీ చంపటమూ లేదు. మరొక దాని మూలంగా చావటమూ లేదు.

Dr Dayananda Swamy ebooks

**వేదా వినాశినం నిత్యం - య ఏన మజ మవ్యయం**

**కథం స పురుషః పార్థ - కం ఘాతయతి హంతి కమ్ - 21**

అయినా వీడు చంపాడు – వాడు చచ్చాడు. వాడు వీణ్ణి చంపించాడని లోక వ్యవహారమొకటి మనలను కలవరపెడుతూనే ఉంటుంది. అనుభవంలో ఉండే దానిని మనం కాదనలేము గదా. ఎలా మనకు మనం సమాధానం చెప్పుకోవాలా అని ప్రతి ఒక్కళ్ళమూ ఈ విషయంలో మథన పడుతుంటాము. ఎందుకంటే శాస్త్ర మేదీ లేదు – అంతా హుళక్కేనని చాటుతున్నది. అనుభవం దానికి విరుద్ధంగా మన కేర్పడుతున్నది. పరస్పర విరుద్ధంగా తోస్తున్న ఈ రెండు మార్గాలనూ సమన్వయించుకొని చూడట మెలాగా అని మథన పడటం సహజమే.

దీనికొక్కటే పరిష్కార మార్గం. అది భగవత్పాదుల మాటల్లో వినండి. ఎంత బ్రహ్మాండంగా ఉంటుందో. ఆక్షేప సమాధాన రూపంగా నడిచేది గదా భాష్యమంటే. మొదట ఆయనగారే ఆక్షేపిస్తున్నారు. ననూక్త ఏవ ఆత్మనః అవి క్రియత్వం కర్మా సంభవ కారణ విశేషః – సత్యముక్తం – న తు స కారణ విశేషః అన్యత్వా ద్విదుషః అవిక్రియా దాత్మనః – నహి అవి క్రియం స్థాణుం విదిత వతః కర్మ న సంభవతి ఇతిచేన్న – విదుషః ఆత్మ త్వాత్. కర్మ చేసినా చేయటం లేదని భావించట మేమి న్యాయం. ఎలా చెప్పగలరు. ఏమిటి అందులో మీరు చూపగల ఉపపత్తి. ఆత్మ అవిక్రియం. అందువల్ల ఏ పనీ జ్ఞాని అయిన వాడి కంటదంటారా. అది

Dr Dayananda Swamy ebooks



ఒక హేతువు కాదు. ఎందుకంటే అవిక్రియమైన ఆత్మకూ జ్ఞానికీ ఏమిటి సంబంధం. ఆత్మ అలాంటిదని గుర్తిస్తున్నాడత డంత మాత్రమే. నహి అవిక్రియం స్థాణుం విదిత వతః కర్మ న సంభవతి. ఇప్పుడు మనమొక స్తంభాన్ని నిశ్చలంగా ఉందని చూస్తున్నా మనుకోండి. అంత మాత్రాన మనం నిశ్చలమై పోతామా. అని ఆక్షేపించి ఆయనే దానికిలా సమాధానమిస్తారు. ఏమని. న విదుషః ఆత్మత్వాత్. నిష్క్రియ మంటున్న ఆత్మ ఏదో గాదు. తానే. స్తంభంలాగా అది పరాయిది గాదు. జ్ఞాని స్వరూపమే ఆత్మఅంటే. ఆత్మాహి నామ స్వరూప మని సూత్ర భాష్యంలో వస్తుందీ వాక్యం. జ్ఞానీ ఆత్మా స్వరూపం – అంతా ఒక్కటే.

అంచేత వేదా వినా శినం. ఎవడైతే అవినాశి నిత్యం అజం – అవ్యయమని ఆత్మను గుర్తిస్తాడో కథం స పురుషః కంఘాతయతి – హంతి కం – వాడెవరినైనా ఎలా చంపగలడు – చంపించగలడు – అని ప్రశ్నిస్తున్నది గీత. ఇక్కడ వేద అనే శబ్దం చాలా సార్థకమైనది. చాలా గంభీరమైనది. వేద అంటే ఊరక తెలుసుకోట మనే గాదు. దర్శించటం అనుభవించట మని కూడా అర్థమే. అసలదే అర్థం. సంస్కృతానికి సహోదర లాటిను భాషలో ఇప్పటికీ ఆ క్రియా పదానికి చూడటమనే అర్థం. **Ego Video** అంటే నేను చూస్తున్నాని ఆ భాషలో అర్థం. **Audio-Video** అనే మాటలీ రోజుల్లో తెలియని వారు లేరు. ఏమిటా మాటల కర్థం. **Audio** అంటే నేను వింటున్నానని **Video** అంటే నేను కంటున్నానని. అంచేత

Dr Dayananda Swamy ebooks


విద్ - అనే ధాతువు కసలు మొదటి నుంచీ ఉన్న అర్థం దర్శనమే. తెలియటమని గాదు. తెలియటం పరోక్ష జ్ఞానమే. కనటమే అపరోక్ష జ్ఞానం. ఆత్మ అంటే ఏదో పరోక్షంగా ఎక్కడో ఉందని ఆలోచిస్తుంటాడు మానవుడు దాని వర్ణన వింటున్నంత వరకూ. అలా కాక ఆ వింటున్న ఆత్మ ఏదో గాదు ఆ లక్షణాలన్నీ ఉన్న ఆత్మ తానే తన స్వరూపమే నని ఎప్పుడు గుర్తిస్తాడో అప్పుడది వాడి కపరోక్ష మవుతుంది. అపరోక్ష మయిందో నేనే గదా. ఏ పని చేసినా చేయని వాడనని తన్నే అవిక్రియంగా దర్శించగలడు.

అలా దర్శించినవాడే పురుషుడు. పూర్ణత్వ మున్నవాడు. పూర్ణత్వమంటే తన స్వరూపాన్నే సర్వత్రా ఉన్నట్టు చూచేవాడు. సర్వత్రా అన్నప్పుడు చంపేవాడూ - చంపించేవాడూ చంపటమూ ఇన్ని రూపాలుగా కనపడదు. అంతా కలిసి తన స్వరూపమే. అదే ఇన్ని రూపాలుగా భాసిస్తున్నది. ఇదంతా నాదే - నేనేననే అద్భుతమైన ఒక అఖండానుభవం కలుగుతుంది. అయినా చంపటం తప్పు గదా అంటే అది తానుగా చేయటం లేదు గదా వాడు. చేయలేదు కూడా. మరా క్రియ ఏమిటి ఎవరు చేస్తున్నారు. ఇతరులు చేస్తుంటే వాడు సాక్షిగా చూస్తున్నాడు. వారజ్ఞానులు గనుక చేస్తారు. వీడు జ్ఞాని గనుక చూస్తాడు. నివారించవచ్చు గదా. నివారించ గలిగినంత నివారిస్తాడు. అలాకాకపోతే నివారించడు. కాకపోయినా ఈ సృష్టిలో అన్నీ మనకు కనపడే జరుగుతున్నాయా. కనపడకుండా ఎన్ని ఘోరాలు

Dr Dayananda Swamy ebooks



జరుగుతున్నాయో. మానవులే గాదు. ఒక జంతువు మరొక జంతువును విరుచుకు తింటుంది. అదంతా నీవాపగలవా. అదీ ఒక ప్రయత్నమే. కర్మే. కర్మలన్నీ సాక్షిగా చూచేవాడు మళ్లీ కర్మ చేయాలని సంకల్పించి అందులో తల దూర్చుట మేమిటి. అంచేత ఉపేక్షించడు అపేక్షించడు పూర్ణ పురుషుడైన జ్ఞాని. మంచీ చెడ్డా ఏది జరిగినా అది ఒక పరమాత్మ లీలగా విభూతిగా భావిస్తుంటాడు. ఇదీ భగవద్గీతా తాత్పర్యం.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**

**నవాని గృహ్ణాతి నరో పరాణి**

**తథ్య చ్ఛరీరాణి విహాయజీర్ణా**

**న్యన్యాని సంయాతి నవాని దేహీ - 22**

ఇంతకూ ఈ శరీరం నేను ధరించిన ఒక వేషమని దర్శించే వాడొకడైతే ఇది వేషమేమిటి - ఈ శరీరమే నేనని దీనితో తాదాత్మ్యం చెందిన వాడింకొకడు. వీడు జీవాత్మ భావ మింకా వదలని వాడైతే వాడు దీనికి స్వస్తి చెప్పి దానికి కూడా సాక్షి అయిన ప్రత్యగాత్మ భావాన్ని వాటేసుకొన్నవాడు. ఇద్దరికీ దేహి అనే పేరు. దేహంలో ఉన్న వాడెవడో వాడు దేహి. దేహంలో ఉన్నా దేహం నేను కాదనుకొంటే మంచిదే. దేహమే నేనని దానితో మమేక మైతేనే ప్రమాదం. ఇది ఎలాటిదంటే మనమొక కూర్చీలో వచ్చి కూచున్నా మనుకోండి. ఇప్పుడా కుర్చీయే నేనవుతానా కాదు గదా. కుర్చీ వేరు. నా శరీరం వేరు. వేరనే భావ ముండటం

Dr Dayananda Swamy ebooks

మూలాన్నే అందులో కూచో గలుగుతున్నాం. మరలా దాన్ని వదిలేసి వెళ్ల గలుగుతున్నాం. అలా కాక కుర్చీయే నేనయి పోయానని భ్రమపడ్డా ననుకోండి. దాన్ని విడిచి బయటికి పోగలనా చెప్పండి. పోయినా దాన్ని నెత్తి పెట్టుకొనే పోవలసి వస్తుంది.

ప్రస్తుతమలాంటి దుస్థితే ఏర్పడింది మన ఆత్మకు. అనే న జీవే నాత్మనా అను ప్రవిశ్య అని ఛాందోగ్యం చెప్పినట్టు అది ఈ శరీరంలో వచ్చి ప్రవేశించింది. ప్రవేశించినా ప్రవేశించాననే స్పృహ లేదు దానికి. స్పృహే ఉంటే ఎలా వచ్చి చేరిందో అలా దీన్ని వదిలేసి పోగలిగేది. బుద్ధి పూర్వకంగా వస్తే గదా - బుద్ధిపూర్వకంగా వెళ్లగలిగేది. ఎవరో మెడపట్టితోస్తే వచ్చిపడ్డాడు. మరలా పట్టి తోస్తే వెళ్లిపోతున్నాడు ప్రతి జీవీ. ఇదే జీవాత్మ భావమంటే. దీన్ని దృష్టిలో పెట్టుకొని వర్ణిస్తున్న దిప్పుడు గీత.

వాసాంసి జీర్ణాని యథా విహాయ మాసి జీర్ణమైపోయిన బట్టలు వదిలేసి నవా ని గృహ్ణాతి నరో పరాణి వాటి బదులు క్రొత్త బట్ట లెలా ధరిస్తామో - అలాగే శరీరాణి విహాయ జీర్ణాని - జరా జర్జరిత మైన శరీరాలను కూడా వదిలేసి - అన్యాని సంయాతి న వాని దేహీ. మరి ఒక క్రొత్త శరీరంలోకి వెళ్లి కూచుంటున్నాము. ఇక్కడ ముందున్న శరీరాన్ని విడిచిపెట్టటం మరణమైతే - మరొక శరీరంలో ప్రవేశించటం జననం. మరణంతో సమసి పోవటం లేదు జీవుడి యాత్ర. ఒక శరీరంలో

Dr Dayananda Swamy ebooks


మరణిస్తే మరొక శరీరంలో మరలా జన్మించ వలసిందే. జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ అని తరువాత రాబోతుంది శ్లోకం. ఇలా జనన మరణా లనుభవిస్తున్నంత వరకూ వాడు జీవుడే గాని ఆత్మ స్వరూపుడు కాడు.

పోతే ఇక ఆత్మ అంటే ఏమిటో గుర్తించిన జ్ఞాని వ్యవహారమెలా ఉంటుంది. వాడు శరీరంలో వచ్చి ప్రవేశించినా శరీరాన్ని వదిలేసి వెళ్లినా మరొకరి ప్రమేయం లేదందులో. వాడి పాటికి వాడే వచ్చాననే ప్రజ్ఞతో రాగలడు. మరలా దీన్ని వదిలేసి పోతున్నాననే ప్రజ్ఞతోనే పోగలడు. ఒక బట్టను మనం వదిలేస్తున్నా మంటే బట్టే నేను కాను కేవలం నా కది ఒక ఉపాధి అనే జ్ఞాన ముండే గదా వదిలేస్తాము. అలాగే దాని స్థానంలో క్రొత్త బట్ట ధరిస్తున్నా అలాటి జ్ఞానంతోనే గదా ధరిస్తాము. ఇలా జనన మరణాలను రెండింటినీ ఇలాటి జ్ఞానంతోనే ధరిస్తాడు వాడు. అలాంటి జ్ఞాన మున్నప్పుడవి వాడికి జనన మరణాలే గావు. జన్మ కర్మ చమే దివ్యమ్. బహూని మే వ్యతీతాని జన్మాని తవచార్జున - తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరం తప అని ఉత్తరత్రా ఇరువురికీ తేడా ఏమిటో స్పష్టం చేస్తాడు పరమాత్మ. పరమాత్మా జన్మిస్తాడు మరణిస్తాడు జీవుడిలాగే. కాని వాడిది జన్మకాదు అవతారం - మరణం కాదు నిర్యాణం. ఒకచోట నేను ధరించింది శరీరం - శరీరమే నేను కాననే ప్రజ్ఞ ఉంది. మరొక చోట అలాటి ప్రజ్ఞ లేదు. ఇదీ ఇక్కడ మనమర్థం చేసుకోవలసిన సత్యం.

Dr Dayananda Swamy ebooks

**నైనం ఛిందంతి శస్త్రాణి - నైనం దహతి పావకః**

**న చైనం క్లేదయంత్యాపో - నశోషయతి మారుతః - 23**

జీవుడర్థం చేసుకోలేక పోయినా – ఈశ్వరు డర్థం చేసుకొంటాడని చెప్పినా తేడా వారి దృష్టిలో ఉండవలసిందే గాని ఆ వస్తువులో లేదు. వసించే దేదో అది వస్తువు. ఎప్పుడూ ఉన్న పదార్థం. అది స్వతః ప్రమాణమైన ఆత్మ చైతన్యమే. మరేదీ కాదు. మరేదీ లేదు కూడా దాని దృష్టిలో. యేన సర్వమిదం తత మ్మని ఇంతకుముందే గ్రహించా మీ విషయం. సర్వవ్యాపక మన్నప్పుడేది గానీ దాన్ని దెబ్బ తీయలేదు. అన్నీ దాని స్వరూపమే గదా. అలాంటప్పుడది దాన్ని ఎలా బాధించగలదు. సముద్రమంతా జల స్వరూపమే. అందులో పైకి వచ్చే తరంగ బుద్బుదాదులు కూడా జలమే గాని వేరు గావు. ఇప్పుడా తరంగ జలం సముద్ర జలాన్ని ఏమి చేయగలదు. మేలు చేయదు. కీడు చేయదు.

అలాగే ప్రస్తుతం సచ్చిద్రూపమైన ఆత్మలో నుంచి సర్వప్రపంచమూ తరంగాలలాగా జన్మిస్తూ ఉంది. అందులోనే లయమవుతుంది. అలాంటప్పుడీ ప్రపంచం దాన్ని ఏమి చేయగలదు. ప్రపంచమంటే పంచభూతాత్మకమే గదా. పంచభూతాలంటే ఏమిటి. పృధి వ్యప్తే జోవా య్వాకాశాలు. శస్త్రాలన్నీ పృధివీ వికారాలే గదా. నైనం ఛిందంతి శస్త్రాణి – అస్త్రశస్త్రాదులెన్ని ప్రయోగించినా ఆత్మ దెబ్బ తినదు. పృధివి దాని మీద చేయి చేసుకోలేదని అర్థం. అలాగే నైనం దహతి పావకః – అగ్ని

Dr Dayananda Swamy ebooks

దేని నైనా కాల్చగలదు గాని ఆత్మను కాల్చలేదు. నచైనం క్లేదయం త్యాపః - జలం కూడా దాన్ని తడపలేదు. నశోషయతి మారుతః గాలి అయితే దాన్ని ఆర్పనే లేదు.

దీన్నిబట్టి తేలిందేమిటి. పృధివీ అగ్నీ జలం వాయువు - ఇవి నాలుగూ భూతాలు **Elements.** అవి భౌతికమైన **Compounds** పదార్థాలనైతే ఏమైనా చేయగలవు. పోతే భౌతికం **Physical** కాదు ఆత్మ. అభౌతికమైన **Metaphysical** తత్త్వమది. భౌతికాని కది అన్నివిధాలా విలక్షణ మైనది. అలాంటప్పుడివి దాన్ని ఎలా దెబ్బతీస్తాయి. అసంభవం.

**అచ్ఛేద్యోయ మదాహ్యోయ - మక్లేద్యో శోష్య ఏవచ**

**నిత్య స్సర్వగతః స్థాణు - రచలోయం సనాతనః - 24**

పృధి వ్యాదులైన నాలుగు భూతాలూ దాన్ని ఏమీ చేయలేవని ప్రతిపాదించారు. బాగానే ఉంది. కాని ఆకాశం సంగతి చెప్పలేదేమిటి. అది కూడా అచ్ఛేద్యమూ అదాహ్యమూ అక్లేద్యమూ అశోష్యమే గదా. ఒక ఖడ్గం చేతికి తీసుకొని ఆకాశాన్ని ఖండించగలవా. అగ్ని ఎంత రగులుకొల్పినా ఆకాశాన్ని కాల్చగలదా. మరి ఎంతో వర్షం కురుస్తుంటుంది. ఆ వర్షధార దాన్ని తడుపుతున్నదా. లేదుగదా. అలాగే దానిలోనే పుట్టి దానిలోనే వీస్తున్నది గాలి. అది దాన్ని ఏమి చేయ గలుగుతున్నది. ఆర్పగలుగుతున్నదా అలాంటప్పుడీ కనిపించే ఆకాశమే ఆత్మ అనుకొంటే సరిపోదా అని ప్రశ్న వస్తుంది.

Dr Dayananda Swamy ebooks

నిజమే. ఆకాశాని కాత్మ కున్న లక్షణాలు చాలా వరకున్నాయి. సర్వగతః స్థాణుః అచలః అనే మూడు లక్షణాలూ దానికి సరిపోతాయి. ఆకాశం సర్వగతమే. సర్వత్రా పరుచుకొని కనిపిస్తుంది. స్థాణుః కదలకుండా స్థిరంగా ఉంది. అంతే కాదు అచలః - వాయువు తేజస్సు - ఇలాంటి దేది దాన్ని కదిపినా కదలదు. కాని నిత్యః సనాతనః అనే రెండు లక్షణాలు లేవు దానికి. అది నిత్యం కాదు. సనాతనం కాదు. తస్మాదాత్మన ఆకాశః సంభూతః అని చాటిస్తున్నది తైత్తిరీయం. ఆకాశం కూడా ఆత్మ నుంచి జన్మించిందట. అంటే అర్థం. చైతన్యమన్నింటికీ ప్రమాణ మయినట్టే ఆకాశముందని చెప్పటానికి కూడా అదే ప్రమాణం. ఆకాశాని కాకాశమే ప్రమాణం కాదు. కారణం అది జడ పదార్థం. తన అస్తిత్వాన్ని తాను గుర్తించలేదు. గుర్తించటాని కాత్మ చైతన్య మావశ్యకం. కనుక స్వతః ప్రమాణం కాదు కాబట్టి నిత్యం కాదది.

అలాగే సనాతనం కూడా కాదు. సనాతనమంటే మొదటి నుంచీ ఉన్నది నకారణా త్కుతశ్చి న్నిష్పన్నః అని అర్థం వ్రాశారు భాష్యకారులు. దాన్ని జన్మింప జేసే కారణమేదీ లేకపోతే అది సనాతనం **Eternal.** అలాంటిది స్వతః ప్రమాణమైన ఆత్మే కావాలిగాని మరేదీ కాదు. ఆకాశానికి కూడా అదే ప్రమాణ మన్నప్పు డాకాశం సనాతన మెలా కాగలదు. అదుందని చెప్పటానికి చైతన్య మవసరం గదా. మరి ఆత్మకో. అది ఉన్నట్టు దానికే తెలుసు. ఇంకొకటి అక్కరలేదు. కనుకనే సనాతన మది.

Dr Dayananda Swamy ebooks



దీనితో మిగతా నాలుగు భూతాలతో పాటు ఆకాశమనే అయిదవ భూతం కూడా బలాదూరయి పోయింది.

**అవ్యక్తోయ మచింత్యోయ - మవికార్యోయ ముచ్యతే**

**తస్మాదేవం విదిత్వైనం - నాను శోచితు మర్హసి - 25**

ఇంతకూ పాంచ భౌతికం కాదాత్మ అనేది - అభౌతికమని చెప్పినట్టయింది. అభౌతికమైతే అది అవ్యక్తః అవ్యక్తమైనది. నామరూపాత్మకమైతే అది వ్యక్తం **Manifest.** అలా కానిదైతే అవ్యక్తం. పృథి వ్యాది భూతాలు నాలుగూ నామరూపాత్మకాలు. వాయ్వాకాశాలు రెండూ రూపరహితమైనా వాయువు చలనాత్మకం గనుక వ్యక్తమే. ఆకాశం శబ్దాత్మకం గనుక అదీ వ్యక్తమే. అంతేగాక ఇది వాయువూ ఇది ఆకాశమని జ్ఞానం చేత గ్రహించ గలుగుతున్నాము. కనుక ఆ మేర కవి వ్యక్తమే. పోతే అలా ఏమాత్రమూ గ్రహించలేని దాత్మ. అదే అన్నింటినీ గ్రహిస్తుంద న్నప్పుడు దాన్ని ఏది గ్రహించాలి ఎలా గ్రహించాలి. కనుక అది ఒక్కటే అవ్యక్తం. నిరాకారం - నిరవయవ **Formless Indivisible** మైన తత్త్వం. దీనితో సాకారమూ సావయవమూ అయిన స్థూల శరీరంతో దానికి సంబంధం లేదని తెలిసిపోయింది.

పోతే అచింత్యః అది మనసుతో కూడా ఆలోచించేది కాదు. మనస్సు కలితమైన పదార్థం. ఎందుకని. ఆలోచించామంటే అది ఆలోచనకు విషయ **Object** మవుతుంది. విషయమైతే అది అనాత్మేగాని ఆత్మకాదు.

Dr Dayananda Swamy ebooks

అందుచేత మనః ప్రాణాలకది విలక్షణం. ప్రాణమనేది వాయుతత్త్వమే గదా. వాయువు దానిమీద పనిచేయదని ఇంతకుముందే పేర్కొన్నాము కాబట్టి తద్వికారమైన ప్రాణం సంగతి వేరే చెప్పనక్కరలేదు. పోతే అచింత్యమన్నారు కాబట్టి మనస్సు సంగతీ తేలిపోయిందిప్పుడు. దీనివల్ల స్థూల శరీరమే కాక సూక్ష్మశరీరంతో కూడా సంసర్గం లేదని చెప్పటమయింది. మనః ప్రాణాలే గదా సూక్ష్మ శరీరం.

పోతే అజ్ఞాన మనే కారణ శరీరమొక్కటి మిగిలిపోయింది. అవి కార్యోయ ముచ్యతే అనటం మూలంగా అది కూడా కాదాత్మ అని తేట పడుతున్నది. వికారమంటే మార్పు. నిరాకార నిశ్చలం జ్ఞాన స్వరూపమని ఎప్పుడన్నామో అప్పుడాత్మ కెలాటి వికారమూ ఉండటానికి లేదు. అజ్ఞానమనే వికార ముండ వచ్చు గదా అని అడిగితే అదీకాదని చెబుతున్నాడు. తస్మా దేవం విదిత్వా అని. దాన్ని అఖండ జ్ఞాన స్వరూపమే నని గుర్తించగలిగితే అది కూడా లేదని. ఎలాగా. దాన్ని జ్ఞానమని గుర్తించే దెవరు. అదేగదా. అది జ్ఞానం కాక పోతే తన్ను తాను జ్ఞానమని గుర్తించగలదా. కాబట్టి అజ్ఞానమనే కారణ శరీరం కూడా కాదది. అశరీరం. అశరీర మెప్పుడయిందో భౌతికం కావటానికి వీలుకాదు. కాకపోతే ఇక దానికి జనన మరణాదుల గంధం కూడా లేదు. ఎప్పుడూ ఉన్న పదార్థం. పదార్థం కాని పదార్థం. ఆత్మ పదార్థం **Subjective Entity.** అలాంటప్పుడు వారు పోయారే పోతారే అని శోకించటం దేనికి. అనవసరం. నాను శోచితు మర్హసి.

Dr Dayananda Swamy ebooks

**అథచైనం నిత్యజాతం - నిత్యం వా మన్యసే మృతం**

**తథాపి త్వం మహాబాహో - నైనం శోచితు మర్హసి - 26**

ఇంత నచ్చచెప్పినా శాస్త్రం - మనకింకా జిడ్డు వదలలే దనుకోండి. శరీరమే ఆత్మ అంతకన్నా అతీతంగా ఎక్కడా లేదనే భావంతో బ్రతుకున్నా మనుకోండి. దీని కభ్యుప గమ వాదమని పేరు పెట్టింది శాస్త్రం. నిజంగా ఆత్మ శరీర మయిందని కాదు. ఒకవేళ అలాగే భావించా మను కోండి. అప్పటికీ మరణ భయం నీవు పెట్టుకోట మవివేకమే నని చాటుతున్నా డిప్పుడు పరమాత్మ.

అధ చైనం నిత్యజాతం - నిత్యం వామన్యసే మృతం - నిత్యమూ జన్మిస్తూనే ఉన్నావు. నిత్యమూ మరణిస్తూనే ఉన్నావు. ఒక శరీరం వచ్చింది నీకు. దాన్ని జన్మ అంటున్నావు. ఆ శరీరం పోయింది. దాన్ని మరణమన్నావు. అది పోయి మరొక శరీరం వచ్చింది. దాన్ని మళ్లీ జన్మ అన్నావు. ఇలా శరీరాలు పోతూ వస్తూ ఉన్నప్పుడు ఇక నీకు భయమెందుకు. ఎప్పుడూ ఇలా శరీరంతోపాటు పుట్టాన ననుకొంటూ దానితోపాటు పోయా ననుకొంటూ మళ్లీ అది పుడితే నేను పుట్టానని భావిస్తున్నావు గదా. అలాంటప్పు డశరీరమని ఆత్మను భావించి జనన మరణాలు దానికి లేవని ఎలా బాధపడవో - అలాగే సశరీర మని భావించి జనన మరణాలు దానికే కలుగుతున్నా యనుకొన్నా బాధేముంది నీకు. నిత్యమూ జనన మరణా లేర్పడుతూనే ఉన్నప్పు డెక్కడికీ పోవటమూ లేదు రావటమూ

Dr Dayananda Swamy ebooks

లేదు. ఎప్పుడూ జనన మరణా లనుభవిస్తూనే ఉన్నావు నీవు. ఇక ఏమయిపోతానో అని శోకాండాలు పెట్టటం దేనికి **Method in Madness** ఇలా భావించినా స్తిమితంగా ఉండవచ్చు గదా మానవుడు.

**జాతస్య హిధ్రువో మృత్యుః - ధ్రువం జన్మ మృతస్యచ**

**తస్మా దపరిహార్యేర్థే - నత్వం శోచితు మర్హసి - 27**

జాతస్యహి ధ్రువో మృత్యుః - పుట్టిన ప్రతివాడూ ఎప్పటికైనా పోవలసిందే తప్పదు. అలాగే ధ్రువం జన్మ మృతస్యచ. పోయినవాడు కూడా మరలా పుట్టవలసిందే. అదీ తప్పదు. ఇది ఒక చక్రం. సంసార చక్రం. చక్రం తిరిగి నట్టు తిరుగుతూనే ఉంటుంది. అందుకే సంసారమని కూడా అన్నారు దీన్ని. సంసరతీతి సంసారః - అవిచ్ఛిన్నంగా ఎప్పుడూ సాగిపోయే దని అర్థం. జననం తరువాత మరణం మరణం తరువాత జనన మన్నప్పుడది సంసారంగాక మరేమిటి చక్రంలాంటి దనిగదా చెప్పాము. చక్రం తిరుగుతుంటే క్రిందిది పైకి పైది క్రిందికీ రాక తప్పదు. క్రిందిది పైకి వస్తే జన్మ. పైది క్రిందికి పోతే మరణ మనుకొంటే సరిపోతుంది. ఒక రంగులరాట్న మెక్కి కూచుంటే వాడు తిప్పుతూ ఉంటాడు మనలను. మనం కండ్లు తిరగకుండా కూచోవాలే గాని బయలుదేరిన చోటికే వస్తుంటాము మరలా.

అలాగే పుడుతున్నాము. పోతున్నాము. - మరలా పుడుతున్నాము ఇక భయమేముంది. తస్మా దపరిహార్యేర్థే. అనివార్యంగా జరుగుతూ

Dr Dayananda Swamy ebooks


ఉన్నప్పుడీ యాత్ర. - నత్వం శోచితు మర్హసి. ఇక నీవు పోయారే అని ఎవరిని గూర్చి దిగులు చెందట మనవసర మంటాడు భగవానుడు.

నిజమే - కాని ఒక్క విషయం. పుట్టినవాడు పోయి ఆ పోయినవాడే మళ్లీ వచ్చాడని తెలిస్తే మీరు చెప్పినట్టు మాకు దిగులూ విచారమూ లేదు కాని పుట్టినవాడు పోవటమే చూస్తున్నాము గాని పోయినవాడు మరలా రావట మెక్కడా చూడటం లేదు మనం. శాస్త్రం చెప్పటమే అది. మన అనుభవంలో లేదు. ఒకవేళ వస్తాడని శాస్త్రం హామీ ఇచ్చినా ఆ చచ్చినవాడే ఈ పుట్టినవాడనే ప్రజ్ఞ ఆ చచ్చిన వాడికీ లేదు. ఈ పుట్టినవాడికీ లేదు. వాడే వీడనే జ్ఞానం బంధు మిత్రాదులకూ లేదు. నిజంగా వాడే వీడుగా జన్మించి ఉంటే వీడికా పూర్వజన్మ స్మృతి లేకుండా పోవటమేమిటి? రాత్రి పడుకొని నిద్రపోయాము. పోతున్న వరకూ నీకూ ముందురోజు జరిగిన వృత్తాంతం గుర్తు లేకపోయినా తెల్లవారి మెలకువ రాగానే గుర్తు వస్తున్నదా లేదా. ఇంకా ప్రాణమనేది ఉంది కాబట్టి దాన్ని భరిస్తున్న ఈ స్థూల దేహమింకా ఉంది కాబట్టి ఉంటున్నదా స్మృతి **Conscience** మనకు. కాని ఈ దేహమూ ప్రాణమూ రెండూ బూదిపాలయి పోయాయి మరణంతో. అలాంటప్పు డెవడు వచ్చాడో ఎవడు రాలేదో ఎలా చెప్పగలం.

సరిగా ఇదే ప్రశ్న వేశాడు ఛాందోగ్యంలో తన తండ్రి ఉద్దాలకుణ్ణి శ్వేతకేతువు. నాన్నా ప్రతివాడూ చివరకు కన్ను మూస్తున్నాడు గదా. జీవన్ముక్తుడికైనా మరణం తప్పదని చెప్పారు గదా మీరు. మరి ఒక తరంగం

Dr Dayananda Swamy ebooks


ఒడ్డుకు వచ్చి విరిగిపోయిన తరువాత మరలా అదే తరంగం పుట్టుకు వచ్చిందని చెప్పలేము గదా. ఎప్పటికప్పుడు పోయేది పోతుంటే పుట్టేది పుడుతుంటుంది గదా. అలాగే పోయినవాడు పోతుంటే పుట్టేవాడు పుడుతుంటాడేమో. ఆ పోయినవాడు మరలా పుట్టాడని ఏమిటి నమ్మకమని అడుగుతాడా కుర్రవాడు. దానికాయన ఇచ్చిన సమాధానమేమంటే జీవాపేతం వావ కి లేదం మ్రియతే - నజీవో మ్రియతే అని. జీవుడి ఉపాధి అయిన శరీరం మరణిస్తుందేగాని చైతన్య రూపుడైన జీవుడికి మరణం లేదు. అయినా వాడు తాను కర్తనూ భోక్తనూ అనే అభిమానం వదలకుండా పోయాడు కాబట్టి మరలా తాను చేసుకొన్న కర్మఫల మను భవించటానికి జన్మ ఎత్తవలసిందే నంటాడు.

ఇది ఏమి సమాధాన మనిపిస్తుంది మనకు. కాని ఇదే సరియైన సమాధానం. చేసిన పని ఎక్కడికీ పోదు. **Action Produces reaction** అని సైన్సు చెబుతున్నది. నీవు చేసిన పని మాసిపోవచ్చు. దాని సంస్కారం **impression** అలాగే నీ మనసులో నిలిచి పోతుంది. దాని ఫలితమను భవించటానికి మరలా దాని కనుగుణమైన జన్మ ఎత్తక తప్పదు. అంతేకాదు. **Matter can neither be created nor destroyed** అని అదే సైన్సు మరొక సత్యం బయటపెడుతున్నది. నా భావో విద్యతే సతః అని గీత ఎప్పుడో చెప్పిందీ మాట. ఉన్న పదార్థ మెక్కడికీ పోదు. ఏమీ కాదు. మహా అయితే దాని రూపం మరో రూపంలో ప్రత్యక్ష మవుతుంది. **Form**

Dr Dayananda Swamy ebooks



మారుతుందే గాని **Substance** అదే. ఈ సూత్రాన్ని అన్వయిస్తే ప్రస్తుత మీ శరీరంలో నేను కర్తను అని భావిస్తూ జీవితాంతమూ మంచీ చెడ్డా చేస్తూ పోయిన జీవుడు మాత్రమెలా అభావ మయిపోతాడు. కర్త అయినప్పుడు భోక్త ఎలాకాక పోతాడు. భోక్త గనుకనే ఆ కర్మఫలం మరొక జన్మ ఎత్తి అనుభవించక తప్పదు.

మంచిదే. హేతువాదం వినటానికి ఎంతో బాగుంది. కాని అలా నేనే మరలా ఈ జన్మ ఎత్తాననే ప్రజ్ఞ లేదే మనకిప్పుడని మరలా ఆశంక మనకు. దీనికి సమాధాన మింతకు ముందే ఇచ్చాడు మనకు భగవానుడు. తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ అని. నీకూ నాకూ జన్మలెన్నో గడచిపోయాయి. కాని నీకవి గుర్తు లేవు నాకు గుర్తున్నాయంటాడు. ఇదుగో ఈ గుర్తుండటం లేకపోవటంలో ఉంది రహస్యం. ఆయనకు గుర్తుండి మనకెందుకు లేదు. ఆయన సర్వజ్ఞుడు. మన మల్పజ్ఞులం. అంటే అర్థం విశేష జ్ఞానమే గాని, సామాన్య జ్ఞానం లేదు మనకు. మనకు జ్ఞానముందనే మాటే గాని అది వృత్తి రూపంగా ప్రసరిస్తూ ఆ వృత్తుల కనుగుణంగా ఆయా విశేషాలతో లావాదేవీ పెట్టుకొంటుంది యావజ్జీవమూ. మరణంలో ఆ వృత్తులు నిలిచిపోయి అది పెట్టిన వందులాంటి వాసనలే **Impressions** మిగిలిపోతాయి. అవి మనల నెక్కడికి తీసుకెళ్లు తున్నవో అక్కడ ఏమి జరుగుతున్నదో మరలా ఇక్కడికి వచ్చి ఎక్కడ పడుతున్నామో మనకే తెలియదు. నిద్రలో నడచి పోవటం లాంటి దీవాసనా జ్ఞానం. జ్ఞానమని పేరేగాని అది జ్ఞానం కాదు జ్ఞానాభాస.

Dr Dayananda Swamy ebooks

అంచేతనే మనకు జన్మాంతర జ్ఞానం లేదు. అందుకే మనం జీవులమే గాని ఈశ్వరులం కాకుండా పోయాము. వృత్తి సంస్కార చక్రంగా సాగే ఈ జ్ఞానానికి స్వస్తి చెప్పి ఎప్పటికైనా ఆ సాక్షిజ్ఞానమే నేనని మనలను మన మర్థం చేసుకోగలిగితే అప్పుడు మనం జీవులమే గాదు. కర్తృత్వ భోక్తృత్వా లుండవు మనకు. ఉండకపోతే మనమిక ఈశ్వర స్వరూపులమే. అంటే జనన మరణ రూపమైన ఈ విషవలయంలో నుంచి బయటపడగలం. అంతవరకూ అవిద్యావశ వర్తులమే కాబట్టి ఏ జీవికీ తన మరణం గుర్తు లేదు. మరణానంతరం జననమూ గుర్తు లేదు. ఇదీ మనకు శాస్త్రమిచ్చే సమాధానం.

**అవ్యక్తా దీని భూతాని - వ్యక్త మధ్యాని భారత**

**అవ్యక్త నిధనాన్యేవ - తత్ర కా పరిదేవనా - 28**

అయితే జీవుడు కూడా ఈశ్వరుడేనని గదా అద్వైత సిద్ధాంతం. అలాంటప్పు డీశ్వరుడి కన్నీ గుర్తుండట మేమిటి. జీవుడికి లేకపోవట మేమిటి. అవిద్యావశాత్తంటారా. ఈ అవిద్య ఎక్కడిది. ఇది జీవుణ్ణి మాత్రమే బంధించట మేమిటి. అనే ప్రశ్నకిప్పుడు జవాబిస్తున్నదీ శ్లోకం. అవిద్యాత్మికాహి బీజ శక్తి రవ్యక్త శబ్ద నిర్దేశ్యా పరమేశ్వరా శ్రయా మాయా మయీ మహాసుప్తిః అని సూత్రభాష్యంలో స్వామి వారీ విషయాన్ని ఎంతో దూరం వివరించారు. అవిద్య అంటే అవ్యక్తమైన మాయా శక్తి. అవిద్య అవ్యక్తం మాయా సుప్తి అనే శబ్దాల కన్నిటికీ ఒకటే అర్థం. వ్యక్తం కానిదేదో

Dr Dayananda Swamy ebooks


అది అవ్యక్తం. ఇదమిత్థమని నిర్వచించటానికి వీలుపడని ఒక మాహామాయ. గాఢాంధకారం లాంటి దశ అది.

అవ్యక్తా దీని భూతాని. అలాటి అవ్యక్తం నుంచే వచ్చారీ జీవులందరూ. వ్యావక్త నిధ నాన్యేవ. అలాగే మళ్లీ అవ్యక్తంలోనే అంతమై పోతున్నారు . వ్యక్తమధ్యాని. కానీ మధ్యలో మాత్రం వ్యక్తమై కనిపిస్తుంటారు జీవితంలో. ఆద్యంతాలలో కనిపించని ఈ జీవుడు మధ్యలో కనిపిస్తే మాత్రమది యధార్ధమా. ఆదావంతే చ యన్నాస్తి - వర్తమానేపి తత్తథా అన్నారు గౌదపాదులు. అప్పుడు కూడా అది అబద్ధమే. అయితే అది మొదట్లోనూ చివర్లోనూ లేనిదీ మధ్యకాలంలో ఎలా కనిపించింది. అదే హేతువుకూ నిలవదు గదా అంటే అసలే లేదని కాదు. ఆద్యంతాలలో ప్రకటం కాకుండా మరుగుపడి ఉంది. అదీ అవ్యక్తమనే మాట కర్థం. కనుకనే అదర్శనా దా పతితః పునశ్చాదర్శనం గతః అని మహాభారతంలోనే మరొకచోట సెలవిచ్చారు వ్యాస భగవానులు. అనుపలబ్ధే **Unmanifest** గాని అది అత్యంతా భావం **Non-existance** కాదు. అభావం కాకుంటే అప్పుడెందుకు జ్ఞానం లేదీ జీవుడికి .ఎందుకు లేదో భాష్యకారులే వ్రాస్తున్నారు వినండి. యస్యాం స్వరూప ప్రతిబోధ రహితాః శేరతే సంసారిణో జీవాః ఆ మహాసుషుప్తిలో పడి నిద్రపోతున్నారట ఈ జీవులు. కారణం స్వరూప ప్రతిబోధం లేదట వారికి. అంటే నేను ఫలానా గదా అనే ఆత్మజ్ఞానం కోలుపోయారు. అది వారికి వ్యక్తం కావటం లేదు. కనుకనే దాని కవ్యక్తమని అసలు పేరు వచ్చింది.

Dr Dayananda Swamy ebooks

కనుకనే ఇలాటి అవ్యక్తమే నాకు ఆది ఇదే నాకు అంతమని భావిస్తున్నాడు యావజ్జీవమూ ప్రతి ఒక్క మానవుడూ. ఇది మనకందరికీ ఇప్పుడు స్వానుభవ సిద్ధమే గదా. నీవెక్కడి నుంచి వచ్చావని అడిగితే ఎవడైనా ఏమి చెబుతాడు. మళ్లీ ఎక్కడికి నీ ప్రయాణమంటే ఏమి చెబుతాడు. అవి రెండూ రెండు ఇనుప తెరలలాగా పడిపోయాయి. మన దృష్టి కేమాత్రమూ దారి ఇవ్వటం లేదు. ఒక నిద్రలోకి ఎలా వచ్చామో తిరిగి ఆ నిద్రలోనుంచి జాగ్రత్తులోకి ఎలా వస్తున్నామో జ్ఞప్తి ఉందా నీకు తెలియకుండానే పడుతుంది నిద్ర. తెలియకుండానే విడిపోతుంది. అలాగే ఈ దీర్ఘకాలికమైన నిద్ర కూడా. మహాసుషుప్తి అని పేరు పెట్టారంటే భగవత్పాదులు నిజంగా మహాసుషుప్తే ఇది. అందుకే స్వరూప జ్ఞానం లేదన్నారాయన. జ్ఞానముంటే నిద్ర ఎలా పడుతుంది. నిద్ర పడితే జ్ఞానమెలా ఉంటుంది. ఇది జీవుడికే ఎందు కేర్పడిందంటే వీడికున్న జ్ఞానం విశేష జ్ఞానమే గాని **Relative** సామాన్య **Absolute** జ్ఞానం కాకపోవటం వల్ల ఇది ఇలా మనలను వెంటాడుతున్నంత వరకూ తత్ర కా పరిదేవనా. ఆ క్రందనం చేసి ప్రయోజనం లేదు. జీవాత్మ భావం ప్రత్యగాత్మ భావానికి ఎదగ గలిగినప్పుడే పరిదేవనకు పూర్తి పరిష్కారం. అప్పు డవ్యక్తంలో నుంచి వచ్చా మనుకోము. అందులోనే వెళ్లి కలుస్తున్నా మనుకోము. అజమూ అమరమైన ఆత్మ స్థితిలో ఎప్పుడూ ఉన్నామనే ప్రజ్ఞతోనే ఉండిపోగలం.

**ఆశ్చర్య వ త్పశ్యతి కశ్చి దేన**

**మాశ్చర్య వ ద్వదతి తథైవ చాన్యః**

**ఆశ్చర్యవ చ్చైన మన్యః శృణోతి**

**శ్రుత్వా ప్యేనం వేదన చైవ కశ్చిత్ - 29**

అయితే ఆ స్థితి నందుకోట మంత సులభం కాదు. క్రొత్తగా అందుకొనేది గాదు. ఇంతకుముందే అందుకొని ఉన్నాము కూడా. అయినా గుర్తింపు లేక బ్రతుకుతున్నాము. అందుకే ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనమ్ ఆత్మను గురించి శాస్త్రం చెబుతున్నా గురువులు బోధిస్తున్నా ఏమి చెబుతున్నారో ఉన్నదున్నట్టు పట్టుకోలేక ఆశ్చర్యంగా చూస్తుంటాడొకడు. ఇంతకు ముందెప్పుడూ చూడని దొక్కసారిగా చూస్తే అది ఆశ్చర్యం. చూస్తున్న నీవే సుమా అది అని చెప్పే మాట వింటే మరీ ఆశ్చర్యం.

అలాగే ఆశ్చర్య వ ద్వదతి. ఇంతవరకూ నేనెప్పుడూ విన్నదిగాదు. ఇవాళ ఆయనగారు దాన్ని గూర్చి బోధిస్తుంటే ఏమిటా అది అని ఆశ్చర్యం వేస్తున్నదని చెబుతుంటా డింకొకడు. అంతేకాదు. ఆశ్చర్యవ చ్చైన మన్యః శృణోతి. గురువుగారది ఆశ్చర్యంగా చూచి చెబుతుంటే శిష్యుడంతకన్నా అది ఆశ్చర్యపడి వింటుంటాడు. శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్. ఎంత వింటున్నా కూడా ఉన్నదున్నట్టు ఆత్మ స్వరూపాన్ని పట్టుకోలేడు వేరొకడు. ఇంతకూ చూచినా చెప్పినా విన్నా అది అసలైన ఆత్మ కాదు. చూడటం చెప్పటం వినటం ఇవన్నీ ఇంద్రియ వ్యాపారాలు. గ్రహించటం

Dr Dayananda Swamy ebooks
మనో వ్యాపారం. ఆత్మ మనస్సుకూ ఇంద్రియాలకూ **అతీతమైనది.** అవిషయమైనది. అది విషయి **Subject** గాని విషయం **Object** కాదు. అలాంటప్పుడు దాన్ని వీటి ద్వారా ఎలా పట్టుకోగలం.

అయితే ఏమిటిక మార్గమని మనకు గాబరా. ఒక్కటే ఉపాయం. కేనోపనిషత్తు చెబుతున్నది. యద్వాచా అనభ్యుదితం యేనవా గభ్యుద్యతే ఏది వాక్కుతో చెప్పలేవో మీదు మిక్కిలి ఏది వాక్కునే నడుపుతున్నదో అదీ ఆత్మ. అంటే చూడటం చెప్పటం వినటం ఇలాటి వ్యాపారాల నన్నిటినీ ఏది ప్రేరణ చేస్తున్నదో ఏది ఉదాసీనంగా వెనకాల ఉంటే దాన్ని అలంబనం చేసుకొని అవన్నీ ప్రసరిస్తున్నాయో - అలాటి సాక్షి జ్ఞానమే ఆత్మ అని అర్థం చేసుకొంటే చాలు. అదే దాన్ని పట్టుకొనే మార్గం. ఇది ఎలాంటిదంటే ఏ ప్రకాశాన్ని ఆధారం చేసుకొని ఈ చరాచర పదార్థాలన్నీ మనకు స్ఫురిస్తున్నాయో అది సూర్య ప్రకాశమని చెప్పటం లాంటిది.

దేహీ నిత్య మవధ్యోయం - దేహే సర్వస్య భారత తస్మాత్సర్వాణి భూతాని - నత్వం శోచితు మర్హసి - అలాంటప్పుడీ శరీరాదులు పోతే అది పోయిందని విచారించటం దేనికి. దేహీ నిత్య మవధ్యోయం దేహే సర్వస్య - దేహం నశిస్తున్నదే గాని దాన్ని ధరించిన దేహి నశించటం లేదు. తరంగ రూపం నశిస్తున్నదేగాని తరంగంలో ఉన్న జల మెక్కడికీ పోలేదు. అది ధరించిన రూపమే తరంగం. అలాగే ఆత్మ చైతన్యం తాలూకు రూపమీ దేహం. రూపం పోతే పదార్థం **Substance** పోతుందా పోదు. ఎప్పటికీ పోదు.

Dr Dayananda Swamy ebooks


పోలేదు కూడా. ఎందుకంటే ఆత్మ అనేది శుద్ధచైతన్యం తప్ప మరేదీ కాదు. చైతన్యానికొక ఆకారమంటూ ఉండబోదు. అది నిరాకారం. నిరాకారమైతే వ్యాపక మవుతుంది. సర్వవ్యాపకం గనుక అది జంగమాలలో ఎలా ఉంటుందో స్థావరాలలో కూడా అలాగే ఉండగలదు. సర్వస్య అనటంలో స్థావర జంగమాలు రెండూ కలిసి వస్తాయంటారు భాష్యకారులు. స్థావర జంగమాలు రెండూ దానికి శరీరాలు. అది నిరాకారమైతే ఇవి సాకారం. అది నిరవయవమైతే ఇవి సావయవం. సాకారం సావయవం గనుకనే ఇవి ఎప్పటికప్పుడు వస్తాయి పోతాయి. జనన మరణాలు వీటికే. దానికి గాదు. అది నిరాకారం నిరవయవం కాబట్టి రాకపోకలు లేవు దానికి. కనుక నిత్య వమధ్యోయం - నిత్య సిద్ధమది అని వ్యాఖ్యానిస్తారు గురువుగారు.

**స్వధర్మమపి చావేక్ష్య - న వికంపితు మర్హసి**

**ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోన్యత్ - క్షత్త్రియస్యన విద్యతే - 30**

ఇక్కడికి ఆత్మజ్ఞాన ప్రకరణం సమాప్తమయింది. ఆత్మ దృష్టితో చూస్తే నేను చంపుతున్నానే - ఇంతమంది నా మూలంగా చస్తున్నారే అని బెంగ పెట్టుకో నక్కరలేదు. ఏ కర్మ జరిగినా ఆ కర్మకు నేను కర్తను కాను కేవలం ద్రష్టనే అనే బరవసా ఉంటుంది జ్ఞానికి. ఇది పారమార్థికమైన దృష్టి. పోతే అలాకాక లౌకికమైన దృష్టితో చూచినా శోకించ నక్కరలేదని చాటుతున్నా డిప్పుడు భగవానుడు.

Dr Dayananda Swamy ebooks

స్వధర్మ మపిచా వేక్ష్యన వికంపితు మర్హసి. కారణమేమంటే యుద్ధం చేయటమూ ఆ యుద్ధంలో పదిమంది శత్రువులను నీవు వధించట మనేది నీ స్వధర్మం. ఎవడి ధర్మం వాడు నిర్వర్తించటంలో తప్పు లేదు. నిర్వర్తించక పోతేనే తప్పు. పైగా ఎప్పుడూ చేయమనటం లేదు. నిష్కారణంగా చేయమనటం లేదు యుద్ధం. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేయాలి క్షత్రియుడనే వాడు. అది వాడి కర్తవ్యం. నా విష్ణుః పృథివీ పతిః అన్నారు. విష్ణ్వంశతో పుట్టాడు క్షత్రియుడు. విష్ణువెలా దుష్టులను శిక్షించటాని కవతరిస్తుంటాడో అలాగే జన్మించాడు క్షత్రియుడు దుష్టశిక్షణ చేయటానికి. అలా కాకుంటే దేశాన్ని కాపాడలేడు. ప్రజలకు శాంతి సౌఖ్యాలు లేకుండాపోతాయి. అది మహాపాపం.

ధర్మ్యాద్ధి యుద్ధాత్ శ్రేయోన్యత్ - క్షత్రియస్య నవిద్యతే. అంచేత యుద్ధం చేస్తే దోషమని భావించరాదు. నిర్నిమిత్తంగా ఎప్పుడు బడితే అప్పుడు తన స్వార్థం కోసం చేస్తే దోషం. అలా కాక ధర్మాన్ని నిలబెట్టటం కోసమని ధార్మికమైన యుద్ధం చేస్తే అంతకన్నా క్షత్రియుడైన వాడికి శ్రేయస్సు లేదు. తనకూ తన ప్రజలకూ కూడా మంచి కలిగిస్తుందది. ఒక జడ్జీ ఉరిశిక్ష వేస్తాడొక నేరస్థుడికి. అయ్యో వీణ్ణి ఉరి తీస్తే ఆ పాతకం నాకు చుట్టుకొంటుందే అని భయపడతాడా బాధపడతాడా. అది తన కోసమంటూ చేయలేదతడు. అలాగే నీ కోసమని నీవు చేయటం లేదు. కనుక పాపకార్యం కాదది.

Dr Dayananda Swamy ebooks



అర్జునుడికే చెప్పాడని కాదిక్కడ మనం చూడవలసింది. అక్కడ కథలో అర్జునుడు క్షత్రియుడు కాబట్టి యుద్ధమనే ప్రస్తావన వచ్చింది. పోతే మన సంగతేమిటి. మనం క్షత్రియులం కాకున్నా జీవితమనే రణరంగంలో పరిస్థితులతో యుద్ధం సాగిస్తూనే ఉంటాము. అలా సాగిస్తున్నప్పు డిది కూడా నేను చేస్తున్నాననే కర్తృత్వ బుద్ధి పెట్టు కోకుండా చేస్తూ పోవాలని సమన్వయించు కోవాలి మనమంతా. అప్పుడది దోషం క్రిందికి రాదు. అప్పుడు మనమూ ఒక విధంగా క్షత్రియులమే అవుతాము. క్షతాత్త్రాయతే ఇతి క్షత్రియః క్షతమంటే దెబ్బ - క్షతం నుంచి కాపాడేవాడు క్షత్రియుడు. ప్రజలకు దెబ్బ తగలకుండా రాజులు చూడవలసి ఉంటే మనమూ కర్మఫల దోషమనే దెబ్బ తగలకుండా జీవితాన్ని కాపాడుకొన్న వాళ్ల మవుతామని భావం.

**యదృచ్ఛయా చోప పన్నం - స్వర్గ ద్వార మపావృతం**

**సుఖినః క్షత్రియాః పార్థ - లభంతే యుద్ధ మీ దృశమ్ - 31**

అంతేకాదు. యుద్ధం చేసి నలుగురి ప్రాణాలు తీస్తే పాతకం వస్తుందని గదా బాధపడుతున్నావు. పాతకం రాకపోగా దానివల్ల మరి ఎంతోమంది ప్రాణాలు నిలబెడుతున్నావు. కాబట్టి శ్రేయస్సే కలుగుతుంది నీకు. ఎలాంటి దాశ్రేయస్సు. చెబుతున్నాడు. స్వర్గ ద్వార మపావృతం. స్వర్గ ద్వారాలు తెరచి ఉంచుతారు నీ కోసం. ధర్మయుద్ధంలో మరణిస్తే వీరస్వర్గం వస్తుందని కదా చెప్పారు ధర్మశాస్త్రంలో. కనుక భయం లేదు. స్వర్గమే లభిస్తుంది నీకు. యదృచ్ఛయా చోపపన్నం అది కూడా యదృచ్ఛయా అప్రయత్నంగానే లభ్యమవుతుంది. నేను హామీ ఇస్తున్నానంటాడు పరమాత్మ.

Dr Dayananda Swamy ebooks

అంచేత సుఖినః క్షత్రియా లభంతే యుద్ధ మీదృశం. అయ్యో అనవసరంగా ఈ యుద్ధం వచ్చి నెత్తిన బడ్డదే. చేయక తప్పటం లేదే చేస్తే ఇంతమంది మూకుమ్మడిగా నా చేతిలో మరణిస్తారే అని దిగులు పడనక్కరలేదు. ఇలాంటి యుద్ధం చేస్తున్నావంటే ఎంతో అదృష్టమనుకో. ఎంతో సుఖానికి నోచుకొన్న క్షత్రియులకే ఇలాటి భాగ్యం పడుతుందని భావించు. నీధర్మం నీవు చేస్తున్నావు. దానివల్ల హాని లేకపోగా తరువాత దాని ఫలితంగా స్వర్గ సుఖాన్నే చూరగొంటున్నావు. అలాంటప్పుడు తప్పు చేస్తున్నాననే సంకోచం దేనికి నీకు.

ఇక్కడ శ్రేయస్సనే మాట గుర్తుంచుకోండి. ఇది మనకు పరమాత్మ ఎంత చేయమని సిఫారసు చేస్తున్నా శ్రేయస్సేగాని నిః శ్రేయసం కాదు. శ్రేయస్సంటే అభ్యుదయం. **Prosperity** నిశ్శ్రేయసమంటే అభ్యుదయమే గాదు. మోక్షం. ధర్మ మభ్యుదయాన్ని మాత్రమే ఇస్తుంది. మోక్షాన్ని ప్రసాదించలేదు. ఆత్మజ్ఞానం లేకుండా కలగదది. అది లేకున్నా కేవలం ధర్మాన్ని పాటిస్తే కలుగుతుంది శ్రేయస్సు. అదే స్వర్గలోక ప్రాప్తి. కలుగుతుందనే గాని ఎంతో కాల మనుభవించ లేడా సుఖం. అనుభవం తీరిపోగానే మరలా వచ్చి పడవలసి వస్తుందీ కర్మ భూమిలో.

కనుక స్వధర్మ మపిచా వేక్ష్య అనే శ్లోకం దగ్గరి నుంచీ సుఖదుఃఖే సమేకృత్వా అని రాబోయే శ్లోకం వరకూ ఈ ఎనిమిది శ్లోకాలూ మనకు ధర్మ పురుషార్థాన్నే బోధిస్తాయి గాని మోక్ష పురుషార్థాన్ని కాదు. అలాగే

Dr Dayananda Swamy ebooks


వివరణ ఇచ్చారు భాష్యకారులు కూడా. మరి ఆత్మజ్ఞాన మందిస్తూ అందిస్తూ మధ్యలో అనాత్మ రూపమైన ధర్మాన్ని ఎందుకు ప్రస్తావించటమని ప్రశ్న వస్తుంది. వందకు వంద తెచ్చుకోలేక పోతే ఎనభయ్యో తొంభయ్యో మార్కులైనా తెచ్చుకోమని సలహా ఇచ్చినట్టు మోక్ష పురుషార్థానికి ఎదగలేక పోయినా కనీసం నీధర్మమైనా నీవు పాటించు. దానికి కూడా తగిన ఫలముంటుందని ఇది ఒక ప్రరోచన **Temptation** అని గ్రహించాలి విమర్శకులు. అంతేగాని గీతా తాత్పర్య మిదే నని భ్రాంతి పడరాదు.

**అథచేత్త్వమిమం ధర్మ్యం - సంగ్రామం న కరిష్యసి**
**తతః స్వధర్మం కీర్తించ - హిత్వా పాప మవాప్స్యసి - 32**

కనుకనే చూడండి. ఈ బోధలో ఎక్కడబట్టినా ధర్మం స్వర్గం - యుద్ధం - స్వధర్మం - అనే మాటలే దొర్లుతుంటాయి గాని జ్ఞానం నిశ్శ్రేయసం. - మోక్షమనే మాట ఎక్కడా రాదు. అందుకే ధార్మికమైన బోధ ఇది. తాత్త్వికమైన బోధ కాదు. అథచేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి. నేను నీకెంత నచ్చజెప్పినా ససేమిరా నేనీ యుద్ధం చేయనుగాక చేయనని మొండికి పడ్డావో దెబ్బతింటా వర్జునా అని బెదిరిస్తాడు కృష్ణ భగవానుడు.

ఏమిటా దెబ్బ క్షత్రియుడికి విధించిన స్వధర్మాన్ని పాటించక పోవటమే గాదు. తతః స్వధర్మం కీర్తించ హిత్వా. లోకంలో నీకు కీర్తి ప్రతిష్ఠలు లేకుండా పోతాయి. అంతేగాక పాప మవా ప్స్యసి. ఎక్కడ లేని పాపాన్నీ

Dr Dayananda Swamy ebooks

అంటగట్టు కొంటావు. ప్రతిష్ఠ కోలుపోవట మొక నష్టమైతే దానికి మారుగా పాపానబడి పోవటం మరొక నష్టం. రెండు నష్టాల పాలవుతాడు మానవుడు. అర్జునుడనే గాదు. ఏ మానవుడైనా లోకంలో తనకు విహితమైన ధర్మాన్ని తాను ఆచరించాలి. ధర్మం చర అని గదా శాస్త్రం చెబుతున్నది. ఆచరిస్తేనే అది ధర్మం. ధర్మ మాచరించటం లేదంటే దానికి ప్రత్యవాయ దోషమని పేరు. దానివల్ల లోకంలో సోమరి పనికిమాలిన వాడని చెడ్డపేరు తెచ్చుకోటమే గాక అధర్మపరుడై చివరకు నరకానికే టిక్కెట్టు తీసుకొంటాడు.

ఇది ఒక బిభీషిక. అంటే బెదిరించటం. ఎందుకీ బెదిరింపు అలా బెదరగొడితేనైనా వీడు బద్ధకించకుండా నిర్లక్ష్యంగా బ్రతకకుండా ధార్మికమైన జీవితం జీవిస్తాడని ఆశ. అయ్యో దీనివల్ల ఇంత ఉపద్రవం వచ్చి పడుతుందా - అయితే ఇప్పటికైనా మేలుకోటం మంచిది. ఇక మీదటనైనా మన ధర్మం మనం పాటిద్దాం. దానివల్ల మేలు మాట అలా ఉంచి కీడైనా జరగకుండా పోతుందని ధర్మానుష్ఠానం వైపు మొగ్గుచూపుతాడు మానవుడు. ఇదీ శాస్త్ర హృదయం.

**అకీర్తిం చాపి భూతాని - కథయిష్యంతి తే వ్యయాం**
**సంభావితస్య చాకీర్తి - ర్మరణా దతిరిచ్యతే - 33**

ఇంకా భయపెడుతున్నాడు పరమాత్మ. అబ్బాయీ నీవు మోక్షానికి నోచుకోక పోతే పోయావు. కనీసం ధర్మాచరణ కైనా నడుం కట్టు. అలా కట్టక పోయావో రెంటికీ చెడ్డ రేవడవయి పోతావు జాగ్రత్త. అకీర్తించాపి భూతాని కథయిష్యంతి. కలకాలమూ నీ కపకీర్తి వస్తుంది లోకంలో. నేనుంటే

Dr Dayananda Swamy ebooks



గదా చూడటాని కంటావా. నీవున్నా లేకపోయినా ఆకళంకం తప్పదు నీకు. నీ అనంతరం కూడా నీకు చెడ్డ పేరే. అది చెప్పుకొంటూనే ఉంటారు లోకులంతా. అవ్యయాం. అది ఎప్పటికీ మాసిపోదు. నీవు కన్ను మూసినా నీవారసులూ నీ కొడుకులూ మనవళ్లైనా వినవలసి వస్తుంది కర్ణకఠోరమైన ఆ మాటలు.

అది నీకేమి మర్యాద. సంభావితస్య చా కీర్తిః - అంతో ఇంతో పేరుగా బ్రతికినవాడవు గదా నీవు జీవితంలో. బ్రతికి నంతకాలమూ అంత గౌరవ ప్రతిష్ఠలతో బ్రతికి చివరకందరి చేతా పనికిమాలిన వాడనిపించుకొని పోవటం కన్నా అపఖ్యాతి ఉందా నీకు. మరణం కన్నా అది బాధాకరం. ఎవడైనా ఒక్కసారే మరణిస్తాడు. పదే పదే మరణించడు. కాని పాడు పేరు తెచ్చుకొని జీవించినా ప్రతిక్షణమూ మరణమే. అలా బ్రతకటం కన్నా వెంటనే ఆత్మహత్య చేసుకొని పోవటం మంచిది. మానహాని కంటే మరణం మేలన్నారు పెద్దలు. కనుక అలా నికృష్టమైన చావు చావకుండా యుద్ధం చేసి మహా వీరుడ వనిపించుకొని మరణించు. అది నీకు యశస్సునూ తెస్తుంది. అపవాదమూ తప్పిస్తుంది.

**భయాద్రణా దుపరతం - మంస్యంతే త్వాం మహారథాః**

**యేషాంచ త్వం బహు మతో - భూత్వా యాస్యసి లాఘవమ్ - 34**

అలాకాక యుద్ధభూమి నుంచి పలాయనం చిత్తగించా వనుకో. అది గొప్పగా భావించరెవరూ. ఎంత మహత్తర కార్యం చేశాడీ అర్జునుడని నీకు కిరీటమూ పెట్టరు. భయాద్రణా దుపరతం మంస్యంతే త్వాం

Dr Dayananda Swamy ebooks

ఇంతమంది సైనికులను చూచి భయపడి పిరికి పందలాగా పరుగెత్తి పోయాడని చీకొడతారు. ఎవరు ఎవరో దుర్యోధనాదులే గాదు నీకు ఆప్తులని భావించే మహారథాః భీష్మ ద్రోణాది అతిరథ మహారథులు కూడా.

మొదటినుంచీ నీకు భీష్మద్రోణులంటే గౌరవమే గదా. అంతేకాక యేషాంచత్వం బహుమతో భూత్వా. వారికి నీవన్నా ఎంతో అభిమానమే గదా. శత్రుపక్షంలో ఉండి కూడా వారు నిన్నభిమాని స్తున్నారంటే చూడు. నీవు వారి దృష్టిలో ఎంత ప్రేమ పాత్రుడవో. అలాంటి అవ్యాజమైన ఆదరాభిమానాలను పెద్దల వద్ద సంపాదించి అది నిలబెట్టుకోలేక తప్పించుకొని పోయావంటే ఏమి మర్యాద. మర్యాద లేకపోగా నవ్వులపాలయి పోతావు. యాస్యసి లాఘవమ్. చాలా తేలిక మనిషివని పించుకోవలసి వస్తుంది. కనుక ధైర్యంగా యుద్ధానికే ఉపక్రమించు.

ఇది అర్జునుడికే కాదు. మనలాటి అర్జునులకు కూడానని చెప్పాను. ప్రతి వాక్యమూ ఎక్కడికక్కడ మన జీవితాలకూ కూడా అన్వయించుకొంటూ పోవాలి. ఒకటి ధర్మమని తోచినప్పుడలాగే నడుచుకోవాలి గాని మానవుడెగ గొట్టి తిరగకూడదు. తిరిగితే నలుగురూ చీకొట్టటమే గాదు. మనకూ అది మంచి చేయదు. ఎప్పటికైనా అది ముప్పు తెస్తుంది జీవితంలో. ఇది మనలో ప్రతి ఒక్కరికీ నిత్య జీవితంలో ప్రత్యక్ష సిద్ధమే.

**అవాచ్యవాదాంశ్చ బహూన్ - వదిష్యంతి తవాహితాః**

**నిందంతస్తవ సామర్థ్యం - తతో దుఃఖతరం ను కిమ్ - 36**

Dr Dayananda Swamy ebooks


మరి ఇంత గుణదోషాలు చూపి చెప్పినా నీ వర్థం చేసుకోలేకపోతే అది నీ దౌర్భాగ్యం. అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి. నలుగురి నోళ్లలో నానిపోతావు. అనరాని మాటలంటారు నిన్ను. ఒకటి గాదు రెండు గాదు. ఎన్ని తిట్లు తిడతారో. నోటబట్టరాని తిట్లు తిడతారు. అవన్నీ నీవు భరించవలసి ఉంటుంది. ఎవరా తిట్టేవారు. అహితాః నీవంటే పడని దుర్యోధనాదులు. హితులైన భీష్మద్రోణాదూలందరూ అయ్యో అర్జునుడేమా ఇలా డీలాపడి పారిపోయాడని బాధపడుతుంటే - అహితులైన కర్ణ దుర్యోధనాదులకదే మంచి అవకాశం నానా మాటలూ అనటానికీ - ఆడిపోసుకోటానికీ.

నిందం తస్తవ సామర్థ్యం - స్వర్గం దాకా వెళ్లి నివాత కవచాది రాక్షసుల నెంతోమందిని మట్టుపెట్టి దేవేంద్రుడి చేత కూడా బహుమానం పొందిన వాడేమిటిలా పిరికి పందలాగా పారిపోయాడు. ఇంతేనా ఈ అర్జునుడి సామర్థ్యమని హేళన చేస్తారు కూడా. ఇంతకన్నా తతో దుఃఖతరం ను కిమ్ విచారకరమైన విషయమే ముంటుంది. ఇటు నీకు కావలసిన వాళ్లూ నిన్ను మెచ్చరు. అటు పరాయి వాళ్లూ నిన్ను పరిహసిస్తారు - నీబోటి మహావీరుడికిది ఎలాటి సిగ్గుచేటయిన వ్యవహారం. ఒక్క క్షణం స్తిమితంగా ఆలోచించి చూడు నీకే తెలుస్తుంది.

ఎవరికి. అర్జునుడికా మనకూ కూడా. తొందరపడి ఒక నిర్ణయం తీసుకొన్నామంటే అది ఎంత పశ్చాత్తాపానికైనా దారి తీస్తుంది. లోకులందరిలో తలవంపు తెచ్చుకొంటాము. నవ్వుల పాలవుతాము. అదే ముందు వెనుక లాలోచించి ఏది కర్తవ్యమో అది చేశామంటే అయినవారూ

Dr Dayananda Swamy ebooks


కాని వారూ ఇక ఎవరూ మాటాడటానికి లేదు. మనమేమీ కాని పనిచేయటం లేదనే ధైర్యముంటుంది మనకు. కాబట్టి ఒకరి మెప్పు లేకపోయినా తప్పు పట్టటానికి లేదెవ్వరూ. వారు కితాబిచ్చినా ఇవ్వకపోయినా మన ధర్మం మనం నెరవేర్చామనే ఆత్మ సంతృప్తి అయినా ఉంటుంది మనకు.

**హతోవా ప్రాప్స్యసే స్వర్గం జిత్వావా భోక్ష్యసే మహీం**

**తస్మా దుత్తిష్ఠ కౌంతేయ - యుద్ధాయ కృత నిశ్చయః - 36**

మన ధర్మం మనం చేస్తూపోతే అది మన కనుకూలంగానే పరిణమిస్తుందని ఏమిటి నమ్మకం. యుద్ధం చేయమన్నారు. బాగానే ఉంది. యుద్ధంలో మనకు విజయమే దక్కుతుందని చెప్పలేము గదా. అడుసులో పాతిన స్తంభమది. ఎటు ప్రక్క ఒరుగుతుందో చెప్పటం కష్టం. జయాపజయాలు దైవాధీనాలు. మనకే అపజయం కలిగినా కలగవచ్చు గదా అని కీడు శంకించావో. అప్పటికీ నీకెలాటి మోసమూ లేదని హామీ ఇస్తున్నాడు కృష్ణభగవానుడు.

అర్జునా. నీవు శంకించినట్టు ఒకవేళ నీకు పరాజయమే ప్రాప్తించి యుద్ధభూమిలోనే హతోవా మరణించావనుకో అయినా భయం లేదు. ప్రాప్స్యసే స్వర్గం. వీరస్వర్గమైనా లభిస్తుంది నీకు. ఇహంలో అనుభవించిన దానికంటే వెయ్యిరెట్లు సుఖమను భవిస్తావు స్వర్గంలో. అలా కాక నీకు యుద్ధంలో విజయమే ప్రాప్తించిందనుకో. జిత్వావా భోక్ష్యసే మహీం.

Dr Dayananda Swamy ebooks



ఉన్నదానికి మోసం లేదు. శత్రుసంహారం చేసి భూతలస్వర్గమే అనుభవిస్తావు. అక్కడ చచ్చి అయితే ఇక్కడ బ్రతికుండే అనుభవిస్తావన్నిభోగాలూ. అంచేత ఎటుచూచినా నీవు పరుగెత్తి పోవటం కంటే పరులతో యుద్ధం చేయటమే లాభదాయకం. తస్మాదుత్తిష్ఠ. కాబట్టి ఇక ఎలాటి భయాందోళనలూ మనసుకు రానీయక యుద్ధాయ కృత నిశ్చయః పోరాడటానికే నిశ్చయం చేసుకో. లే. లేచి గాండీవం చేతికి తీసుకో. శత్రువుల మీద శరవర్షం కురిపించు. ధీరుడవూ వీరుడవని పించుకో అని బోధ. మనకూ ఒక గొప్ప హితబోధే ఇది. ఏదైనా అనుకూలిస్తే మహా ఉత్సాహం మనకు. ఎగిరి గంతు వేస్తాము. సంతోషంతో పొంగిపోతాము. ప్రతికూలిస్తుందని తోచిందో విషాదంతో కుంగిపోతాము. అలా మోద విషాదాలకు బానిస అయిపోగూడదు మానవుడు. మన జీవితాన్ని ముందుకు నడపవలసింది సుఖదుఃఖాది బుద్ధిగాదు. ధర్మబుద్ధి. ఇది ధర్మమిది నాకు కర్తవ్యమని తోచినప్పుడది వెంటనే ఆచరించటం శ్రేయోదాయకం. దానివల్ల కష్టమా సుఖమా అని డోలాయమానం పనికిరాదు. అలాగైతే ఏమంచి పనీ చేయలేము. చేసేది మంచిదని నిశ్చయం కలిగినప్పుడది తాత్కాలికంగా ప్రతికూలించినా చివరకదే అనుకూలంగా మారి మన కానంద మిస్తుంది. సందేహం లేదు. పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదంటారు. అది అక్షరాలా సత్యం.

**సుఖదుఃఖే సమే కృత్వా - లాభాలాభౌ జయా జయౌ**

**తతో యుద్ధాయ యుజ్యస్వ - నైవం పాప మవాప్స్యసి - 37**

Dr Dayananda Swamy ebooks

ఇంతకూ ఒక్క మాట చెబుతాను విను. లోకమంతా ద్వంద్వాత్మకం. ద్వంద్వాలంటే ఏవోగావు. సుఖదుఃఖే - లాభా లాభౌ జయా జయౌ. సుఖమూ - దుఃఖమూ లాభమూ - నష్టమూ - జయమూ - అపజయమూ ఇలాంటివి. ఉదాహరణ కొక మూడిచ్చిందేగాని ఇలాటి ద్వంద్వాలు **opposites** ఎన్నో ఉన్నాయి సృష్టిలో. అవన్నీ మన జీవితంలో తొంగి చూస్తుంటాయి. సలహా ఇస్తుంటాయి కూడా. సుఖాన్నే దగ్గర పెట్టుకో దుఃఖం పనికిరాదు. దాన్ని త్రోసివేయి. లాభం కోసమే ప్రయత్నించు. ఎప్పుడూ నష్టాన్ని కొని తెచ్చుకోకు. జీవితంలో ఏ పని చేసినా అందులో నీకు జయమే చేకూరాలి గాని అపజయం కలగ కూడదు. ఇలా అనుకూలం వైపే నీ మనసు తిప్పుతుంటుంది. ప్రతికూలం కోరి తెచ్చుకో డెవ్వడూ.

కాని ఎప్పుడూ నీవు కోరిందే నీకు లభిస్తుందని హామీ ఇవ్వలే రెవ్వరూ. పుణ్యానికి పోతే పాప మెదురయినట్టు జీవితంలో సుఖంగా బ్రతకాలని కోరుకొంటే తరుచు దుఃఖమే మనకు ప్రాప్తించవచ్చు. వచ్చుగాదు. అదే మనకు తరుచుగా ఏర్పడే పరిస్థితి. దీనికేమిటి పరిహారమని మామూలుగా ఎవ్వడూ ఆలోచించడు లోకంలో. కొంచెం విమర్శించి చూస్తే కష్ట సుఖాలనేవి వాటిలో లేవు. ఇది కష్టమిది సుఖమని వాటిమీద ఎవడూ ముద్ర వేయలేదు. వాటి పాటికవి వేసుకోనూ లేదు. దృశ్యమైన పదార్థంలో లేదు వైషమ్యం. ద్రష్ట అయిన మనలోనే ఉంది. దృశ్యంలో లేదు మానవుడి దృష్టిలో ఉందని అర్థం.

Dr Dayananda Swamy ebooks



ఇంతెందుకు. ఒకడికి అనుకూలమైనది వేరొకడికి ప్రతీకూలం. వాడికి ప్రతికూలమైనది వీడికి అనుకూలం. మనం చూచే చూపును బట్టి మంచి చెడ్డలు మారుతుంటాయి. శీతోష్ణాదులూ సుఖదుఃఖాదులూ అన్నీ ఇంతే. ఎప్పుడైతే మన బుద్ధిని బట్టి వాటికి విలువ వస్తున్నదో – స్వయంగా వాటికే భావమూ లేదో – మనం చేయవలసిన పనేమిటి. ఆచూపుతో వాటిని చూడక పోవటమే. శాస్త్రీయంగా మాటాడితే ఇది హేయమిది ఉపాదేయమని తేడా చూడగూడదు. సమేకృత్వా రెండూ సమానమేనని భావించాలి. ఎప్పుడేది ప్రాప్తిస్తే అదే నాకు ప్రాప్తమని దానితో రాజీ పడాలి.

అలా పడగలమా అంటే మానవుడి కసాధ్యమేదీ లేదు. అచేతనమైన సుఖదుఃఖాది భావాలకే అంత బలమున్నప్పుడు సచేతనుడయి ఆలోచనాపరుడైన మానవుడి బుద్ధికెంత బలముండాలి. దృఢమైన బుద్ధి బలమున్న వాడికిది హేయ **Avoidable** మిది ఉపాదేయ **Acceptable** మనే చింత ఉండదు. మరేముంటుం దంటారు. రెండూ ఏకమే ఏదైతేనేమి అని ఉదాసీన బుద్ధి లేదా ఉపేక్షా బుద్ధి **Detached Attitude** మాత్రమే ఉంటుంది. అదే నీకు యమ ధైర్యమిస్తుంది. ఆ ధైర్యంతో నీవు ముందుకు సాగిపోతే ప్రతికూలం కూడా అంత బలంగా వచ్చి నిన్ను బాధించదు. కొంత కాలానికదే అనుకూలంగా మారిపోయినా ఆశ్చర్యం లేదు.

అలా కాకుంటే భగవాను డింతగా మనకు హామీ ఇవ్వడీ విషయంలో. తతో యుద్ధాయ యుజ్యస్వ. అంచేత వెనక్కు తగ్గకుండా జీవిత సమరంలో

Dr Dayananda Swamy ebooks


అర్జునుడిలాగా ముక్కుకు సూటిగా ముందుకే దూసుకుపోవాలి మనమంతా. నైవం పాప మవాప్స్యసి. అలా దృఢ సంకల్పంతో సాగిపోతే మనకు కష్టనష్టా లెప్పటికీ కలగవు. పాపం పాతక మంటే పడగొట్టేదని అసలైన అర్థం. పైకి రాకుండా పడిపోతామనే భయం లేదు. తాత్కాలికంగా పడ్డట్టు కనిపించినా కందుకమువోలె సుజనుడు క్రిందంబడి మగుడ మీదికి న్నెగయు జుమీ అని భర్తృహరి చెప్పినట్టు మళ్లీ జీవితంలో అభ్యుదయం కలిగి తీరుతుంది. ఒకవేళ కలగక పోయినా అధర్మం చేయలేదు ధర్మ మార్గంలోనే జీవించాము గదా అనే సంతృప్తి అయినా ఏర్పడుతుంది. ఇక నష్టమేముంది మానవుడికి. నష్టమే మంచి పనీ చేయలేక ఏడుస్తూ కూచున్నప్పుడే. అలాకాక మన ధర్మం మనం పాటించినప్పుడు సుఖదుః ఖాలు రెండూ మనకు సమానమే. కనుక అందులో ఏది జరిగినా అది లాభమే మనకు. ఇలాటి దృష్టి ఉన్నప్పుడిక ఏ భయమూ లేదు మానవుడికి. ఇదీ దీనిలో మనం గ్రహించవలసిన భావం.

**ఏషా తే - భిహితా సాంఖ్యే - బుద్ధి ర్యోగే త్విమాం శృణు**

**బుద్ధ్యాయుక్తో యయా పార్థ - కర్మ బంధం ప్రహాస్యసి - 38**

ఇంతవరకూ గీత మనకు బోధించిన విషయమేమిటి - మనం గ్రహించినదేమిటి - అని ఒక్కసారి పునశ్చరణ చేసుకోవలసి ఉంది. ఆత్మానాత్మ వివేచన చేసి ఆత్మస్వరూప మేదో అందించాడు మొదట పరమాత్మ. అది పారమార్థిక దృష్టి. ఆ దృష్టే పెట్టుకొని చూస్తే నీకు మోహం

Dr Dayananda Swamy ebooks


లేదు శోకం లేదు. ఎవరిని గూర్చి నీవు శోకించ నక్కరలేదని అభయమిచ్చాడు. పోతే అలాటి దృష్టి అలవడ లేదనుకోండి. అలవడక లౌకికమైన దృష్టి పెట్టుకొని చూచినా పరవాలేదు. అప్పుడు కూడా నీవు శోకించ నక్కరలేదు. ఎందుకంటే జాతస్యహి ధ్రువో మృత్యుః - పుట్టినవాడు పోక తప్పదు. అంతేగాక ఎవడి ధర్మం వాడు పాటిస్తూ జీవించినప్పుడా ధర్మమే వాణ్ణి కాపాడుతుంది. దానివల్ల మోక్షమనే మహాఫలం కాకున్నా అభ్యుదయమనే ఫలమైనా సిద్ధిస్తుంది.

ఇదీ ఇంతవరకూ జరిగిన విషయం. ఇందులో ప్రధానంగా నడచింది పారమార్థికమైన బోధే. అథచైనం నిత్యజాతం స్వధర్మ మపి చావేక్ష్య మొదలుకొని ఇంతవరకూ సాగిన బోధ పారమార్థికం కాదు. వ్యావహారికం. లోకవ్యవహారాన్ని బట్టి చూచినా శోకమోహా లక్కర లేదని ధైర్యం చెప్పటానికే ఈ ఉపన్యాసం. ఇది ఉపదేశం కాదు. ఉపన్యాసం. ఇదంతా మనసులో ఉంచుకొనే వ్రాస్తున్నారు భగవత్పాదులు.

శోకమోహాపనయ నాయ లౌకికో న్యాయః స్వధర్మమపి చావేక్ష్య ఇత్యాద్యైః శ్లోకైరుక్తః - నతుతాత్పర్యేణ - పరమార్థ దర్శన మిహ ప్రకృతం- తచ్చోక్త ముపసంహ్రియతే ఏషాతే భిహితా ఇతి - శాస్త్ర విషయ విభాగ ప్రదర్శనాయ - అని. శాస్త్రానికి విషయ విభాగమెప్పుడూ ముఖ్యం. అంతా కలగాపులగం చేసి చెప్పగూడదు. వినేవాళ్ళ మనసు కూడా కలగాపులగ మయిపోతుంది. కనుకనే గీతాశాస్త్ర మిప్పుడీ శ్లోకంలో ముందుగా మనకు

Dr Dayananda Swamy ebooks

రెండు విషయాలు వేర్వేరుగా విభజించి చూపుతున్నది. ఇలా ఆరంభంలోనే వేరు చేసి చూపితే ఇక అంతం దాకా ఎక్కడ ఏది వర్ణించినా పరవాలేదు. అది ఎందులో ఏది చేర్చుకోవాలో తెలుసుకొంటూ ముందుకు సాగి పోగలడు సాధకుడని స్పష్టంగా సెలవిచ్చారు భాష్యకారులు.

ఇక ఈ శ్లోకంలో చేసిన ఆ విభాగమేమిటో అది ఎలాటిదో పరిశీలిద్దాం. సాంఖ్యమనీ యోగమనీ రెండు మాటలు దొర్లాయి ఇందులో మొదటిసారిగా వినిపిస్తున్నాయి ఈ మాటలు రెండూ భగవద్గీతలో. సాంఖ్య మేమిటి. యోగమేమిటి. ఇది కొంచెం మనలను తికమక పెట్టే భాష. ఇందులో ఇమిడి ఉన్న సంకేతం తరువాత అర్జునుడర్థం చేసుకోలేక అడిగితే భగవానుడే వివరిస్తాడు కర్మయోగమనే తృతీయాధ్యాయంలో. జ్ఞానయోగేన సాంఖ్యానాం - కర్మయోగేన యోగినా మని స్పష్టం చేస్తాడు. ఇంతకూ సాంఖ్యమంటే జ్ఞానం - యోగమంటే కర్మ. సాంఖ్యం యోగ మనేవి రెండూ ఆ రెండింటికీ పర్యాయ పదాలు. అంతకన్నా మరేదీ లేదు.

అప్పటికి సాంఖ్యం యోగమంటే మనం గాబరా పడనక్కర లేదు. జ్ఞానం కర్మ అని అర్థం చేసుకొంటే చాలు. ఇందులో ఏషాతే భిహితా సాంఖ్యేబుద్ధిః - యోగే త్విమాంశృణు - ఇంతవరకూ అర్జునా నీకు నేను వర్ణిస్తూ వచ్చింది సాంఖ్యబుద్ధి. అంటే ఆత్మజ్ఞానం. పోతే ఇక మరొక బుద్ధి కూడా నీకు అందిస్తున్నాను. అది కర్మబుద్ధి. అంటే కర్మకు సంబంధించిన జ్ఞానం. అయితే ఇది కూడా ఏమీ తక్కువది గాదు. బుద్ధ్యాయుక్తో యయాపార్థ - కర్మబంధం ప్రహాస్యసి. ఈ కర్మబుద్ధిని నీవవలంబించినా

Dr Dayananda Swamy ebooks



మంచిదే. దీనివల్ల నీవీ కర్మబంధాన్ని వదిలించుకొని బయటపడగలవు. భయం లేదని హామీ ఇస్తాడు.

ఏమిటీ గొడవ. నిజంగా గొడవగానే ఉందీ మాట. జ్ఞానంతోనా మానవుడు బంధ విముక్తు డయ్యేది. కర్మతోనా. జ్ఞానాదేవతు కైవల్యమని గదా శాస్త్రం చెబుతున్నది. అలాంటప్పుడు కర్మతోనే తరించవచ్చు. నంటుందేమిటి గీత. కర్మ ఇంకా బంధంలో పడదోస్తుందే గాని పైకి తీసుకుపోదు గదా. కర్మే మనకు తారకమైతే ఇక ఇంత కష్టపడి మనం జ్ఞానం సంపాదించటం దేనికి. అలా సంపాదించమని మొదటినుంచీ మనకు సలహా ఇవ్వటం దేనికి పరమాత్మ.

భగవత్పాదు లీ సమస్యను ఎలా పరిష్కరిస్తారో విందాం. సాంఖ్యే పరమార్థ వస్తు విషయే బుద్ధిః జ్ఞానం - సాక్షాత్ శోకమోహాది సంసారహేతు దోషనివృత్తి కారణం. యోగేతు తత్ప్రాప్త్యుపాయే నిస్సంగతయా ద్వంద్వప్రహాణ పూర్వకం ఈశ్వరా రాధనార్థే కర్మయోగే కర్మానుష్ఠానే సమాధియోగేచ - తాం బుద్ధిం స్తౌతి ప్రరోచనార్థం. తయాయుక్తః కర్మబంధం ధర్మాధర్మాఖ్యం ప్రహాస్యసి - ఈశ్వర ప్రసాద నిమిత్తజ్ఞాన ప్రాప్త్యైవ ఇత్యభిప్రాయః ఇదీ ఆయన ఇక్కడ చేసిన పరిష్కారం. ఇది చాలా గొప్ప పరిష్కారం. కర్మజ్ఞానాలు రెండూ గర్భశత్రువులని భావిస్తారేమో అలా చూడకండి. సవిమర్శంగా చూస్తే రెండింటికీ ఎంతో గొప్ప సమన్వయ ముంది. చెబుతాను వినమంటున్నా రాయన.

Dr Dayananda Swamy ebooks

కర్మ అంటే అది జ్ఞానంలాగా ఒకటిగాదు. కర్మానుష్ఠానం - కర్మయోగం - సమాధి యోగమని మూడు విధాలది. పెద్దలంతా చేశారు మనమూ ఆ మార్గంలోనే నడవటం మంచిదని మామూలుగా చేస్తూపోతే అది అనుష్ఠానం **Ritual.** అలాకాక ఆ చేసే ప్రతి కర్మా నేనే చేస్తున్నాననే కర్తృత్వబుద్ధీ - నాకోసమేననే భోక్తృత్వ బుద్ధీ వదిలేసి ఒకానొక ఈశ్వరుడు చేయిస్తున్నాడు - ఆయనకోసమే ఇది - అని నిర్లిప్తంగా చేయగలిగితే అది యోగం **Religion** అది కూడా దాటిపోయి చిత్తవృత్తులన్నీ కట్టివేసి ఏకాగ్రతతో ధ్యానిస్తూ పోతే అది సమాధి **Meditation.** దీనివల్ల కలిగే మేలేమంటే చిత్తానికి శుద్ధీ ఏకాగ్రతా **Purification and Concentration** రెండూ ఏర్పడతాయి. దాని వల్ల ధర్మాధర్మాలనే ద్వంద్వాలు నిన్ను బంధించవు. ఆ బంధంలో నుంచి బయటపడతావు. అయితే అది మోక్షమా అంటే కాదు. అసలైన మోక్షం జ్ఞానంవల్లనే. ఆ జ్ఞానానికి దారి తీస్తుందీ కర్మ. కర్మయోగంగా మారి యోగం సమాధిగా మారి దానివల్ల ఈశ్వరుడు ప్రసన్నుడయి తన్నిమిత్తంగా నీకు జ్ఞానమనేది ఉదయిస్తే అజ్ఞానం వల్ల నీకు ముక్తి.

అంటే అప్పటికి ఉత్తమాధికారికి జ్ఞానమే సాక్షాత్తుగా మోక్షప్రదం. మధ్యమ మందాధికారులకు కర్మజ్ఞానానికి దోహదం చేసి తద్వారా మోక్షదాయకం. సాక్షాత్తుగా కాదు. పరంపరయా **Not direct but indirect.** అయితే కర్మబంధం ప్రహాస్యసి అని ఎందుకన్నది భగవద్గీత.

Dr Dayananda Swamy ebooks


అన్నది కానీ వెంటనే మోక్షాన్ని అందిస్తుందని చెప్పలేదు గదా. అది ఆత్మజ్ఞానానంతరమనే అభిప్రాయంతో చెప్పి ఉండవచ్చు. తప్పేమిటంటారు భగవత్పాదులు. ఇది ఎలాంటిదంటే న్యూయార్కు పట్టణానికొకడు విమానంలో వెళ్లిపోయాడని ఎవరైనా అన్నారనుకోండి. న్యూయార్కు దాకా ఒకే విమానమని కాదు గదా. సింగపూరుదాకా ఒక విమానమైతే – ఆ తరువాత న్యూయార్కు దాకా మరొక విమానమని గదా మనమర్థం చేసుకోవలసింది. అందులో మొదటి విమానం రెండవ విమానాని కందిస్తే అది మరి దేనికీ అందివ్వకుండా గమ్యాన్నే చేరుస్తుంది మనలను. అలాగే ఇక్కడ కర్మమోక్షాన్ని ఇస్తుందంటే జ్ఞానం ద్వారానని చెప్పుకోవాలర్థం. ఇదీ భాష్యకారులిక్కడ చేసిన అద్భుతమైన పరిష్కారం సమన్వయం **Synthesis - 18** అధ్యాయాల గీతాశ్రవణమయ్యే వరకూ ఈ సమన్వయ దృష్టి ఏమరకుండా శ్రవణం చేయవలసి ఉంటుంది మనం.

**నేహాభిక్రమ నాశోస్తి - ప్రత్యవాయోన విద్యతే**
**స్వల్పమప్యస్య ధర్మస్య - త్రాయతే మహతో భయాత్ - 39**

ప్రస్తుత మీ ఆత్మజ్ఞానానికి దోహదం చేసే కర్మయోగమెలాంటిదో దానికున్న విశిష్టత ఏమిటో బయటపెడుతున్నాడు పరమాత్మ. నేహాభిక్రమనాశోస్తి. అభిక్రమమంటే ఉపక్రమం ప్రారంభమని అర్థం. కర్మయోగాన్ని జీవితంలో ప్రారంభంచేస్తూ పోతే దానికెప్పుడూ వినాశం లేదు. ఫలిత ముంటుందో లేదోనని సందేహించ నక్కరలేదు. తప్పకుండా

Dr Dayananda Swamy ebooks

ఉంటుంది ఫలితం. యధాకృష్యాదేః అని వ్రాస్తున్నారు స్వామివారు. అది ఒక సేద్యం లాంటిది గాదు ఫలితం లేకపోవటానికి. భూమి సేద్యం చేస్తుంటా డొక రైతు. పంట చేతికి వస్తుందని. వస్తే రావచ్చు. లేకపోతే పోవచ్చు. ఎన్నో అవరోధా లుంటాయి దానికి. సకాలంలో వర్షాలు పడకపోయినా - లేక దానికే తెగులు తగిలినా - ఏ ఉపద్రవం సంభవించినా వాడికి నష్టమే.

అలాంటి కష్టనష్టాలులేవిక్కడ. ఫలితం గారంటీ. ఎంత చేస్తే అంత ఫలితం. అంతేకాదు. ప్రత్యవాయ దోషం కూడా లేదు దీనికి. శాస్త్రీయమైన కర్మ లాచరిస్తున్నప్పుడు ప్రత్యవాయ దోషమని ఒకటున్నది. అది మానేసినా ప్రత్యవాయమే. చేసేది అపసవ్యంగా చేసినా ప్రత్యవాయమే. వైగుణ్యమని కూడా **Defect** అంటారు దీన్ని. పోతే ఈ కర్మయోగంలో అలాటి ప్రమాదం కూడా లేదని హామీ ఇస్తున్నాడు. చికిత్సలాంటిది కాదిది. రోగానికి చికిత్స చేయకపోయినా తప్పే. ఒక రోగాని కింకొక చికిత్స చేసినా తప్పే. ఇందులో ఆ భయం కూడా లేదు. చేసినదానికి మోసం రాదు. చేయకుంటే చెడిపోయింది లేదు. ఎంత చేస్తే అంతదాకా లాభముంటూనే ఉంటుంది. నష్టమే మాత్రమూ లేదు.

అంతేకాదు. స్వల్పమ ప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్. ఏ కొంచెమాచరించినా చాలు ఈ యోగధర్మం. ఎంతో భయం నుంచి మనలను కాపాడుతుంది. సంసార భయమే భయం. జన్మ మరణ లక్షణమది. జాతస్యహి ధ్రువో మృత్యుః అని భయపెట్టాడుగా పరమాత్మ. మరి ఎప్పుడూ

Dr Dayananda Swamy ebooks



పుడుతూ చస్తూ - చస్తూ పుడుతూ పోతే ఎప్పటికీ భయం తీరేది. ఎప్పటికీ విషవలయంలో నుంచి మనం బయటపడేది. అలా బయటపడాలంటే వెంటనే జ్ఞానమబ్బక పోయినా దానినందించే ఈ కర్మయోగమైనా ఆచరిస్తూపోవాలి మనం. ఆచరిస్తే మోక్షమార్గంలోనే ప్రయాణం చేస్తుంటాము కాబట్టి కొంచె మాలస్యంగా నైనా గమ్యం చేరగలమని ధైర్యం మనకు.

**వ్యవసాయాత్మికా బుద్ధి - రేకే హ కురు నందన**

**బహు శాఖా హ్యానం తాశ్చ - బుద్ధయో అవ్యవసాయినామ్ - 40**

ఇప్పుడీ సాంఖ్యబుద్ధి అనీ యోగబుద్ధి అనీ చెప్పామే. చెప్పామంటే మొదటిది చెప్పాము. రెండవది తరువాత చెప్పబోతా మనుకోండి. ఇవి రెండూ కలిసి వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ. ఒకే ఒక బుద్ధి. రెండు విమానాలు కలిసి న్యూయార్కు చేరటానికెలా తోడ్పడతాయో అలాగే రెండూ కలిసి చివరకు మోక్షాన్నే ప్రసాదిస్తాయి. కాబట్టి రెండూ ఒకే ఒక బుద్ధి. వ్యవసాయాత్మకం అంటే నిశ్చయాత్మకమైన బుద్ధి. ఎంచేత. సమ్యక్ప్రమాణం వల్ల ఏర్పడిన బుద్ధి ఇది. ఏది చూడాలో అదే చూస్తుంది జ్ఞానం. దాన్ని ఎలా అందుకోవాలో అలాగే అందుకొంటుంది యోగం. కనుకనే శ్రేయోమార్గాన్ని చూపుతాయి మనకు రెండూ కలిసి.

మరి మిగతా బుద్ధులో. బహుశాఖాహ్యానంతాశ్చ అంటున్నది గీత. దీనికి విపరీతమైన బుద్ధులవి. అనేకశాఖలూ అనంతాలూ. శాఖోపశాఖలుగా మారి ఒక్కొక్క శాఖలో మరలా అనంతంగా సాగిపోతుంటాయి. ఎడ

Dr Dayananda Swamy ebooks


తెరపి లేని బుద్ధులవి. ఎవరికీ బుద్ధులు. అవ్యవ సాయినాం. నిశ్చయ స్వభావం లేనివారికి. నిశ్చితమైన స్వభావమున్న వాడికొకే ఒక ఆలోచన ఉంటుంది. అలాంటి నిశ్చయానికి **Conviction** నోచుకోకపోతే కందిరీగల లాగా ఎన్నెన్నో ఆలోచనలు మనసులో రేగి ప్రాణం తీస్తుంటాయి మానవులను.

మసకచీకట్లో మనమొక తాడు చూచి పామని భయపడతాము. అది తాడనే దృష్టితో చూస్తే భయం లేదుగాని అలా కాకపోతే అది పామైనా కావచ్చు. గుడ్డపేలికైనా కావచ్చు. నీటి చారికైనా కావచ్చు. నేల చీలికైనా కావచ్చు. ఏదైనా కావచ్చు. మొదటిది వ్యవసాయాత్మకమైతే ఇది అవ్యవసాయాత్మకం. అది నిర్వికల్పమైతే ఇది సవికల్పం. అది సమ్యక్ప్రమాణ జనితం కాబట్టి ఏకం. ఇది అలా కాదు కాబట్టి అనేకం. అనంతం. పోనీ ఏదైతేనేమి అనుకోటానికి వీలులేదు. ఉన్నదున్నట్టు చూస్తే భయంలేదుగాని దాన్ని నీవు వికల్పించి చూస్తే భయపడవా. అలాగే ప్రస్తుత మాత్మ అనేది ఏకైకమైన తత్త్వం. దాన్ని అలాగే పట్టుకొంటే మోసం లేదు గాని దాన్నే మనం నామరూపాత్మకంగా చూచా మనుకోండి. అది మనకెప్పటికైనా భయావహమే. బంధమే. వ్యవసాయత్మకమైన దృష్టిలేని వారంతా నూటికి తొంభయిమంది ఇప్పుడలాగే చూస్తున్నారు. ఆత్మతత్త్వాన్ని వికల్పించి బయట చరాచర పదార్థాలుగా లోపల వాటికి సంబంధించిన నానావిధమైన ఆలోచనలుగా దర్శిస్తున్నారు. ఇలాటి అవ్యవసాయాత్మకమైన బుద్ధి ఉండటం మూలాన్నే అనేక విధాలైన సంసారబాధలకు గురి అవుతున్నారు.

Dr Dayananda Swamy ebooks



దీనికి భిన్నంగా ఆత్మ అంటే ఏమిటో ఉన్నదున్నట్టు పట్టుకొనే జ్ఞానమైనా - ఆ జ్ఞానానికి తోడు పడే యోగమైనా సరే. అది వ్యవసా యాత్మకమైన దృష్టి. నూటికి కోటి కెవడికో ఒకడి కలవడుతుంది. అలవడితే చాలు. ఆ ఏకైకమైన దృష్టితో ఉన్నవాడి కెప్పుడూ భయం లేదు. ఆత్మ అనే గమ్యం వైపే చేస్తున్న ప్రయాణమది. కర్మయోగమైనా అది జ్ఞానంతో కలిసి అటువైపే పయనిస్తుంది. యమున గంగలో కలిసి చివరకు సాగరంలో ప్రవేశించినట్టు రెండూ కలిసి ఏకైకమైన దృష్టిగా మారి ఆత్మ చైతన్యంలోనే చేరిపోతాయి. కాబట్టి సంసార చక్రభ్రమణం నుంచి తప్పించి నిన్ను బయటపడవేస్తుందీ బుద్ధి.

**యామిమాం పుష్పితాం వాచం - ప్రవదం త్యవిపశ్చితః**
**వేదవాదరతాః పార్థ - నాన్య దస్తీతి వాదినః - 41**

ఇలాటి వ్యవసాయాత్మకమైన బుద్ధిలేని మానవుల జీవిత విధానమేమిటో వారి ఆలోచనలూ - మాటలూ ఎలా ఉంటాయో బయట పెడుతున్నా రిప్పుడు. మానవులంటే పామర జనమే గాదు. పండితులమని విఱ్ఱవీగే మీమాంసకాదులు కూడా ఇలాటి వారేనంటారు వ్యాసభగవానులు. యామిమాం పుష్పితాం వాచం ప్రవదం త్యవిపశ్చితః - అవిపశ్చితః - అవివేకులే వారందరూ. పుష్పితాం వాచం పుష్పంలాగా చూడటానికీ వినటానికీ రమ్యంగా ఉంటుంది వారి ప్రసంగం. **Flowery Language** అనే ఆంగ్ల శబ్దానికెంత అతికినట్లుందో చూడండి ఈ పుష్పితాం వాచ మనే సంస్కృత శబ్దం. అక్కడ దానికేమని అర్థమో

Dr Dayananda Swamy ebooks


ఇక్కడా అదే అర్థం. పైకి పటారమేగాని లోపల లొటారం. ఊరక వాగుతుంటారు నోరు పెట్టుకొని. వివేచన లేదు. పాడు లేదు. అవివేకమైన ప్రసంగం చేస్తుంటారు.

ఎవరు వారు. వేదవాదరతాః నాలుగు వేదాలూ గుక్క తిప్పుకోకుండా వల్లెవేసే పండితులు. పండితమ్మన్యులేగాని నిజమైన పండితులు కారు. పండా ఆత్మ విషయాబుద్ధిః అని గురువుగారెప్పుడో చెప్పారు. ఆత్మజ్ఞానముంటే చెప్పు. వాడు పండితుడు. అది లేనివారు పండిత బ్రువులే. ఎందుకంటే నాన్యదస్తీతి వాదినః - వేదమంటే మంత్ర బ్రాహ్మణ భాగాలు రెండే. అవి కూడా విధినిషేధాత్మకమే. ఈ పనిచేయి నీవు. దీనివల్ల నీకు స్వర్గం లభిస్తుంది. ఇది చేయవద్దు. చేశావంటే నీకు నరకమే ప్రాప్తిస్తుంది సుమా - అని ధర్మాధర్మాల తాలూకు జ్ఞానం మనకందివ్వటమే వేదం చేసేపని. స్వర్గపశ్వాది ఫలమూ దానికి సంబంధించిన యజ్ఞయాగాది సాధన సామగ్రీ మనకు బోధించటం వరకే దాని కర్తవ్యమని భాష్యకారులు కూడా సెలవిస్తున్నారు. ఇంతకు మించి మరేదీ చెప్పదు వేదవాఙ్మయమని వాదిస్తారీ వైదికులు.

**కామాత్మానః స్వర్గ పరా - జన్మ కర్మ ఫలప్రదామ్**
**క్రియా విశేష బహుళాం - భోగైశ్వర్య గతిం ప్రతి - 42**

కామాత్మానః స్వర్గపరాః - కామమే వీరి స్వభావం. వీరి మనస్సులను ఆపరేట్ చేసి చూచినా అందులో కోరికలు తప్ప మరేదీ కనపడదు మనకు. ఆ కోరికలయినా దేనిమీద. ఒకే ఒకదానిమీద. అది స్వర్గం. ఇహం తప్పితే

Dr Dayananda Swamy ebooks



పరమే కనిపిస్తుంటుంది వీరికి. అది కూడా అపవర్గం కాదు. స్వర్గం. ఇహం లాగే అదీ ఒక లోకమే. ఇక్కడ మానవులైతే అక్కడ దేవతలు. ఇక్కడ సుఖమూ దుఃఖమూ రెండూ మిళితమై ఉంటే అక్కడ సుఖమే అనుభవిస్తారు మహా అయితే. అనుభవిస్తే మాత్రం ఎంత కాలమూ అనుభవం. పుణ్యఫలం ఖర్చయిపోగానే జన్మకర్మ ఫల ప్రదామ్. మళ్లీ తలక్రిందులుగా వచ్చి నేలమీద పడవలసిందే. పూర్వం యయాతి నహుషుడు – ఇలాంటి వారందరికీ పట్టిన గతి అదేగా. క్షీణేపుణ్యే మర్త్య లోకం విశంతి. తప్పేదేముంది. కర్మ చేస్తున్నాడంటే అది సత్కర్మ అయినా దుష్కర్మ అయినా దాని ఫలానుభవం తప్పించుకోలేడు మానవుడు. ఏమిటది. జన్మ. కర్మఫలం జన్మే. ప్రదాం. దాన్నే ప్రసాదిస్తుంది మనకీ కర్మ.

ఇలాంటి క్రియావిశేషహుళామ్. కర్మ విశేషాలన్నీ చిలువలు పలువలు పెట్టి నీకూ నాకూ ఏకరువు పెడుతుంటుంది వేదవాక్కు. వాఙ్మయమంతా దీనితో నిండిపోయింది. భోగైశ్వర్యగతిం ప్రతి – అది విని ఈ శ్రోత్రియులంతా తూచా తప్పకుండా ఆ కర్మలన్నీ తమ కోసమే ఉన్నట్లు వాటి నాచరించలేక సతమత మవుతుంటారు. ఎందుకు ఏమిటి వాటి ప్రయోజనమని అడిగితే భోగమూ ఐశ్వర్యమూ అని వర్ణిస్తారు. భోగమంటే స్వర్గసుఖాలు. ఐశ్వర్యమంటే అవన్నీ తమ చెప్పుచేతల్లో ఉండటం. అంటే తమ ఇష్టానుసారంగా ఏ సుఖాలైనా అనుభవించ వచ్చునన్న మాట.

Dr Dayananda Swamy ebooks


ఇదుగో ఈ సుఖానుభవానికి సాధనభూతమే ఈ వేదం చెప్పే కర్మకాండా. ఉపాసనాకాండా. ఇది ఎంతెంత శ్రద్ధాభక్తులతో వీరాచరించినా పునరావృత్తి తప్పదు వీరికి. మరలా వచ్చి ఈ సంసార సాగరంలో మత్స్యాది జలజంతువులలాగా ఈదుతూ చావవలసిందే. అలాంటప్పుడు వీరికీ సంసార సమస్య ఏమి పరిష్కారమయినట్టు.

**భోగైశ్వర్య ప్రసక్తానాం - తయాపహృత చేత సాం**
**వ్యవసాయాత్మికా బుద్ధి - స్సమాధౌ న విధీయతే - 43**

ఈ కర్మిష్ఠులకూ ఉపాసకులకూ - ఇద్దరికీ కనిపించే వెప్పుడూ భోగాలూ - ఐశ్వర్యాలే. అది తప్ప వీరికి మరొక లోకమే లేదు. భోగైశ్వర్య ప్రసక్తానాం ఎప్పుడెప్పుడీ శరీరాన్ని ఇక్కడ వదిలేసిపోయి ఆ స్వర్గసుఖాలను వాటేసుకుందామా అని ఉవ్విళ్లూరు తుంటారు. అదే లోకంగా బ్రతుకుతుంటారు. అవే తామూ తామే అవి అన్నట్టు మమేకమై పోతుంటారు. తయాపహృత చేతసాం - అలాంటి కర్మలన్నీ బోధించే వేద వాక్యాలను మాత్రమే ప్రమాణంగా తీసుకొని వాటి చేత పూర్తిగా మతి చెడగొట్టుకొని తామెంచుకొన్న మార్గంలోనే గుడ్డిగా పడిపోతుంటారు. మరొక మార్గంలో వారి బుద్ధి పనిచేయదు.

వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌన విధీయతే - మరొక మార్గమంటే ఏమిటది. జ్ఞానయోగమూ దానికి తోడ్పడే కర్మయోగమూ. అవి రెండూ కరువయి పోతాయి వారికి. ఎంతో దృఢమైన నిశ్చయముంటే గాని

Dr Dayananda Swamy ebooks



ఆమార్గంలో ప్రయాణం చేయలేదు బుద్ధి. సమాధి అంటే ఏకాగ్రమైన అంతః కరణం. ఆలోచిస్తే వీరాసించే సమస్తమూ అందులోనే గుప్తమయి ఉంది. లోకాలూ లోకాంతరాలూ అన్ని సుఖానుభవాలూ అక్కడే గుప్తమయి ఉన్నాయి. అవి ప్రకటమై మనకు కనపడాలన్నా అనుభవానికి రావాలన్నా పరిశుద్ధమైన ఏకాగ్రమైన బుద్ధి అవసరం మానవుడికి. అప్పుడే అది నిలకడ చెంది అన్ని ఫలానుభవాలనూ మనకందజేస్తుంది. మరి అలాంటి వ్యవసాయాత్మకమైన బుద్ధి ఎక్కడిదీ బేవకూఫులకు. కనుకనే గుడ్డెద్దు చేలో పడ్డట్టు యాంత్రికంగా కర్మలు చేయటాని కలవాటు పడ్డారే గాని దీనికి మూలభూతమైన తత్త్వమేమిటా - చివరకు మన జీవితానికి గమ్యమేమిటా అని ఏ మాత్రమూ ఆలోచన రాదు వీరికి. ఇక జ్ఞానమేమిటి యోగమేమిటి. కలలోని వార్త అది.

**త్రైగుణ్య విషయా వేదా - నిస్త్రైగుణ్యో భవార్జున**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో - నిర్యోగక్షేమ ఆత్మవాన్ - 44**

ఈ విధంగా వివేక బుద్ధిని కోలుపోయి కేవలం కామపరాయణులయి బ్రతుకు సాగించే ఈ కర్మోపాసకులకు కలిగే స్వర్గాది ఫలం కూడా త్రిగుణాత్మకమే గాని గుణాతీతం కాదు. సత్త్వరజస్తమస్సులనే ప్రకృతి గుణాలే గుణాలంటే. అవి మానవుణ్ణి ఈ శరీర మనః ప్రాణాలతో ముప్పేటగా చుట్టికట్టి పారేశాయి. మన మనస్సు సత్త్వం. మన ప్రాణం రజస్సు. పోతే మన శరీరం తమస్సు. శరీరమనః ప్రాణాలను తప్పిస్తే నీవూ నేనూ ఎక్కడ ఉన్నాం. ఖాళీ అయిపోయాం.

Dr Dayananda Swamy ebooks


మనమే గాక ఆ మాటకు వస్తే మనం చూచే ప్రపంచం కూడా త్రిగుణాత్మకమే. దేశం సత్త్వ గుణమైతే కాలం రజోగుణమైతే వస్తువులన్నీ తమో గుణమే. దేశకాల వస్తువులేగా **Space Time Substance** ప్రపంచమంటే. ఈ విధంగా అటు పిండాండమూ ఇటు బ్రహ్మాండమూ రెండూ కూడా త్రిగుణాత్మకమే అయికూచున్నాయి. అంతేకాదు. మానవుడి మనస్సే గుణాధీన మయినప్పు డది సృష్టించిన వాఙ్మయం గుణాతీత మవుతుందా. ఎంత అపౌరుషేయ మని నీవు నెత్తిన బెట్టుకొన్నా ఆఖరుకు వేదవాఙ్మయం కూడా త్రైగుణ్య విషయా వేదాః త్రిగుణాల పరిధి దాటి పోలేదు. అప్పటికీ బ్రహ్మాండమూ **Macro** దానిలో పరిభ్రమించే ఈ పిండాండమూ **Micro** అది సృష్టించుకొన్న వాఙ్మయ ప్రపంచమూ **intellectual world** మూడూ ఈ మూడు గుణాలకూ లోబడ్డ బాపతే.

ఇలా సమస్త సృష్టీ గుణాధీనమై బ్రతుకు తున్నప్పుడు నీవు వేదం చెప్పిందని ఏ యజ్ఞం చేసినా ఏయాగం చేసినా తద్ద్వారా ఏ స్వర్గానికి వెళ్లినా అక్కడ ఏయే సుఖాలు నీవాసించినా – అదంతా తాత్కాలికమే. పరిచ్ఛిన్నమే సాంతమే. అనంతమైన సుఖానుభవం నీవందుకోలేవు. కారణం గుణాధీనమైన బ్రతుకుకు అనంత సుఖమెలా లభిస్తుంది. మరి అలాంటి ఆత్మానుభవమే కావాలంటే ఏమిటి మార్గమని నీవడగవచ్చు. అది ఈ విధి కాండలో **Dos & Donts** దొరకదు నీకు. జ్ఞానకాండలోనే లభిస్తుంది.

Dr Dayananda Swamy ebooks

అందుకే నేను హెచ్చరిస్తున్నాను. నిస్త్రైగుణ్యోభవార్జున. త్రిగుణాల క్షేత్రాన్ని దాటిపో నీవు అర్జునా. త్రిగుణాతీతమైనది ఏదో గాదు జ్ఞానమే. అది ఈ త్రిగుణాత్మకమైన సృష్టిని గమనించి చూస్తున్నది. అది తనకు తాను సాక్షి అయి సమస్త సృష్టికీ సాక్షి అవుతున్నది. ఇప్పుడూ ఉన్నదది నీ దగ్గర. అయితే ఈ గుణాలతో చేతులు కలిపి కలుషితమయి పోయింది. పరిమితమయి పోయింది. ఈ గుణాల కాలుష్యం కడిగేసుకొని పరిశుద్ధ మయిందంటే పరిపూర్ణమయి తన వ్యాప్తిని తాను గుర్తిస్తుంది. గుర్తిస్తే అది ఇక కర్మ గాదు. జ్ఞానమే. దానికి దారితీసే కర్మ ఏదో అది యోగం. అప్పుడిక ఏ కర్మా ఆచరించటానికి బుద్ధి పుట్టదు. పుట్టటానికది కర్మ అయితే గదా. అది వేదమయితే గదా. అదంతా వ్యవసాయాత్మకమైన బుద్ధిగా మారి తేడా కనిపించదు.

నిర్ద్వంద్వో నిత్య సత్త్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్ అని దానివల్ల కలిగే గొప్ప ఫలితమేదో దాన్ని చాటి చెబుతున్నది శాస్త్రం. సుఖదుఃఖాది ద్వంద్వాలు పనిచేయవు వాడిమీద. గుణాత్మకమైన సంసారదశలోనే అవి. గుణాతీతమైన భూమినందుకొన్న మనస్సుకా చింత ఉండదు. అది లేకపోతే నిత్యసత్త్వస్థః రజస్తమో గుణాల దాడి పూర్తిగా తగ్గి ఎప్పుడూ సాత్త్వకమైన స్థితిలోనే ఉంటాడు. శుద్ధసత్త్వ సంపన్నుడయితే నిర్యోగక్షేమః యోగక్షేమాలు చూచుకోడు. అనుపాత్తస్యోపాదానం యోగః ఉపాత్తస్య రక్షణం క్షేమః అని అర్థం చెప్పారు భాష్యకారులు. మనకంతకు ముందు లేనిది ప్రాప్తిస్తే అది యోగం. ప్రాప్తించింది ఎప్పటికీ నిలిచి ఉంటే క్షేమం.

Dr.Dayananda Swamy ebooks

వాటి మీద దృష్టి ఉన్నంత వరకూ శ్రేయోమార్గంలో ప్రయాణం చేయలేడు సాధకుడు. కనుక వాటి మీద చూపుపెట్టరాదు. వాటి పాటికవి జరుగుతూ పోతే సాక్షిగా చూస్తుండాలని భావం. అలా చూస్తూ కూచోవాలంటే మాటలు గాదు. ఆత్మవాన్ అన్నారు. ఆత్మవంతుడ వయి ఉండాలి. అంటే అప్రమత్తుడవయి **Total attention** ఉండాలని అర్థం వ్రాశారు స్వామివారు. ఏమాత్రమూ పరాకు లేకుండా తానుగా దేనికీ ప్రాకులాడకుండా జరిగే ప్రతి పనీ జ్ఞానదృష్టితో గమనిస్తూ ఉండాలని సాధకుడికిచ్చే సలహా. అది పాటిస్తే కలిగే ఫలమూ అదే.

**యావానర్థ ఉదపానే - సర్వతః సంప్లుతోదకే**
**తావాన్ సర్వేషు వేదేషు - బ్రాహ్మణస్య విజానతః - 45**

కాకపోయినా వేదం చెప్పింది – మేము చేస్తున్నామని తమ అపరాధం నిష్కారణంగా వేద వాఙ్మయం మీద తోస్తున్నారే కర్మిష్ఠులు. వేదమేమని చెప్పింది. నీవెప్పుడూ కర్మలే చేస్తూ కూచోమని చెప్పిందా. ఆ మాటకు వస్తే అది కర్మలూ చెప్పింది. జ్ఞానమూ చెప్పింది. ఉదపానే సర్వతః సంప్లుతోదకే అది ఒక కూపమూ తటాకం లాంటిది. తటాకంలో ఎంతైనా ఉంటుంది జలం. ఒడ్లు రెండూ ఒరుసుకొని పారుతుంటుంది. అందులో దిగి ఒక మానవుడు దాహం తీర్చుకోవా లనుకోండి. ఎక్కడ దిగాలి ఎంత నీరు త్రాగాలని అడిగితే ఏమని చెబుతావు. ఎక్కడ దిగినా నీకెంత నీరు త్రాగాలనిపిస్తే అంతే త్రాగి పొమ్మని సలహా ఇస్తావా లేదా. అందులో

Dr Dayananda Swamy ebooks


ఉన్న నీళ్లన్నీ త్రాగలేడు వాడు. అలాగని అసలే తాగకుండా వెళ్లిపోడు. 'యవానర్థః తావాన్' ఎంతమాత్రంతో తన దాహం తీరుతుందో అంతేగదా.

అలాగే తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః - వేదం కూడా ఒక బావిలాంటిది. చెరువులాంటిది. అక్కడ నీరు సమృద్ధిగా ఉన్నట్టే ఇక్కడ పుష్కలంగా దొరుకుతుంది సామగ్రి. అది కర్మ అని చెప్పు. ఆయా దేవతల తాలూకు ఉపాసనలని చెప్పు. మంత్రతంత్రాదులు చెప్పు. ఆఖరు కాత్మజ్ఞానమని చెప్పు. అన్నీ మనకు లభిస్తా యందులో. లభిస్తాయి గదా అది చెప్పినవన్నీ తూచా తప్పకుండా పాటించాలని ఎవరు బలవంతం చేశారు నిన్ను. అందులో నీకు కావలసిన దేదో అదే తీసుకోవచ్చుగదా. అది గాక ఎంతైనా ఉండవచ్చు ఆ కార్ఖానలో. అవన్నీ నీవు త్రవ్వి తలకెత్తు కోవలసిన అవసరం దేనికని అడుగుతున్నాడు పరమాత్మ.

అయితే అందులో నన్నేది తీసుకోమని అడుగుతున్నావా. బ్రాహ్మణస్య విజానతః అని జవాబు - విజానతః అంటే నీవు వివేకవంతు డ వయితే - బ్రాహ్మణస్య బ్రహ్మజ్ఞానమే నీకు కావలసిన దందులో. అదే నీవందుకో మిగతాదంతా నీకనవసరం. నీకెంత కావాలో అంతే త్రాగి మిగతా నీళ్లెన్ని ఉన్నా అక్కరలేదని ఎలా వెళ్లిపోతావో - అలాగే నీకు జన్మతారకమైన ఆత్మజ్ఞానమే పట్టుకో వేదంలో. మిగతా కర్మకాండ ఎంత ఉంటే నీకెందుకు. అదేమైనా జన్మరాహిత్య మనే మహాఫలం నీకు ఇస్తుందా చస్తుందా. ఇంకా సంసారబంధానికే దారి తీస్తుంది. స్వర్గానికి పోయినా సవతి పోరు

Dr.Dayananda Swamy ebooks

తప్పలేదన్నట్టు యజ్ఞయాగాదులు చేసి స్వర్గాన్ని కొట్టేశానని నీవు సంతోషించినా అదీ తాత్కాలికమే.

కనుకనే ఈశావాస్యంలో అంధేన తమ సావృతా అనే చోట అర్థం వ్రాస్తూ స్వర్గం కూడా నరకంలాగా అంధకార బంధురమే. అదీ వాస్తవంలో నరకమే. కారణమేమంటే ఆత్మచైతన్య ప్రకాశమనేది ఇక్కడా లేదక్కడా లేదు నరకం గాక స్వర్గమెలా అయిందని ప్రశ్నించారు భగవత్పాదులు. అంచేత ఒక సంతర్పణలో అంతా మనకోసమే వడ్డించారని అన్ని విస్తళ్లముందూ మనమే ఎలా కూచోమో – అలాగే వేదవాఙ్మయంలో ప్రతిమాటా మనకోసమే మనమే దాన్ని అమలుపరచాలని భావించటం కూడా పెద్ద పొరబాటు. మందాధికారుల కోసం కర్మ చెప్పింది వేదం. మధ్యముల కోసం ఆయా ఉపాసనలు బోధించింది. చివరకు వేదాంతంలో ఉత్తమాధికారులైన వారికే ఆత్మజ్ఞాన ముపదేశించింది. అధికార భేదాన్ని బట్టి దాని బోధ – పిడుగుకూ బియ్యానికీ ఒకే మంత్రమన్నట్టు కాదు.

**కర్మణ్యేవాధికారస్తే - మా ఫలేషు కదాచన**

**మా కర్మఫలహేతు ర్భూ - ర్మాతే సంగోస్త్వ కర్మణి - 46**

అయితే ఇప్పుడీ గీతా శ్రోత అర్జునుడే కోవకు చెందినవాడా అని ప్రశ్న వచ్చింది. వీడుత్తముడా – మధ్యముడా – మందుడా. ఎవరు చెప్పాలీ మాట. అర్జునుడా. అర్జునుడు తనకు తాను సర్టిఫికేటిచ్చుకోటం బాగుండదు. పోతే అతనికి బోధ చేస్తున్న గురువుగారు కృష్ణ పరమాత్మే

Dr Dayananda Swamy ebooks


నిర్ణయించా లతడే కోవవాడో. పరీక్షాధికారి ఆయన గదా. ఆయన చెబితే దానికి తిరుగులేదు.

మరి ఆ గురువు శిష్యుణ్ణి గూర్చి ఏమని సెలవిచ్చాడు. కర్మణ్యేవాధికారస్తే అర్జునా నీకు కర్మలోనే అధికారం **Admission** జ్ఞానంలో కాదు. అంటే అర్జునుడు మందాధికారి అని వేరే చెప్పనక్కరలేదు. ఇంత దూరమదీ ఇదీ బోధ చేస్తూ వచ్చి తీరా ఇప్పుడు వాణ్ణి పట్టుకొని పరమాత్మ మందాధికారివి పొమ్మంటే ఏమి న్యాయమని నీకూ నాకూ అనిపించవచ్చు. ఇక్కడ రెండు మర్మాలున్నాయి ఆయన మాటల్లో మనం గ్రహించవలసినవి. ఒకటి గీతోపదేశం ఒక అర్జునుడికే గాదు సర్వులకూ. అర్జునుడు ఒక నిమిత్తమేనని మొదటినుంచీ చెబుతూనే వచ్చాము. అంచేత శాస్త్రమిప్పుడు జ్ఞానం కర్మ రెండూ చెబుతున్నదంటే రెండూ అర్జునుడికే ఉద్దేశించి చెప్పిందని పొరబాటు పడగూడదు. అర్జునుడి లాంటి వారికి కర్మ అయితే ఏ ఉద్ధవుడిలాంటి ఉత్తమాధికారికో జ్ఞానం బోధించి ఉండవచ్చు. గీతలో ఉద్ధవుడి పేరు లేదే అంటే ఉద్ధవుడి లాంటి వాడంటున్నాము గుర్తించండి. మనుష్యాణాం సహస్రేషు అన్నట్టు కొద్దిమంది ఉత్తమాధికారు లుండవచ్చు మానవులలోనే. వారు ద్వాపరంలోనే కాదు. ఈ కలియుగంలో ఇప్పుడు కూడా ఉంటారు. అలాంటి వారికి గీత జ్ఞానమే బోధిస్తుంది కర్మ గాదు. అందుకే జ్ఞానయోగేన సాంఖ్యానామని తరువాత రెండూ విభక్తం చేసి చెప్పబోతాడు కృష్ణభగవానుడు.

Dr Dayananda Swamy ebooks


ఇంకొక రహస్యమేమంటే కర్మలోనే అర్జునుడికి ప్రవేశమిక దేనిలోనూ లేదనగానే మన ములిక్కి పడనక్కర లేదు. అర్జునుడంత కన్నా గాబరా పడనక్కర లేదు. కేవల కర్మానుష్ఠానం కాదు పరమాత్మ ఇక్కడ ఉద్దేశించింది. కర్మణా పితృలోకః దానివల్ల లోకాంతర ప్రాప్తే గాని జ్ఞాన ప్రాప్తి లేదు. పోతే అదే యోగంగా మారితే మాత్రం చాలా గొప్పది. అప్పుడది ఏదో పెద్దలందరూ చేశారు మనమూ చేస్తున్నామనే యాంత్రికమైన క్రియగాదు. ఆత్మజ్ఞానానికి ఎంతో దోహదం చేస్తుందా కర్మ. దీనికే అనుష్ఠానమనేది యాంత్రికం. అది జ్ఞానానికి తోడు పడదు. ఒక కర్మణా పితృలోకః దానివల్ల లోకాంతర ప్రాప్తేగాని జ్ఞానప్రాప్తి లేదు. పోతే అదే యోగంగా మారితే మాత్రం చాలా గొప్పది. అప్పుడది ఏదో పెద్దలందరూ చేశారు. మనమూ చేస్తున్నామనే యాంత్రికమైన క్రియగాదు. ఆత్మజ్ఞానానికి ఎంతో దోహదం చేస్తుందా కర్మ. దీనికే అనుష్ఠానమని గాక యోగమని పేరు పెట్టింది గీత.

ఇది ఎలాంటిదంటే ఒక నదీ ప్రవాహముంది. దాని ఇష్టానుసారంగా వదిలేస్తే అది పోయి సముద్రంలో కలిసిపోతుంది. శుద్ధమైన నదీ జలం అశుద్ధమైన లవణరసంగా మారుతుంది. ఎవరికీ ఉపయోగపడదు. అలా కాక దానికి ఆనకట్టలు కట్టి కాలువలు తీర్చి పంటపొలాలకు పారించగలిగితే దేశం సస్యశ్యామలంగా మారుతుంది. నలుగురికీ

Dr Dayananda Swamy ebooks


ఉపయోగపడుతుంది. అలాగే కర్మ కర్మకోసమని మామూలుగా చేస్తూ పోతే పెద్ద ఫలితమివ్వదు. మహా అయితే పితృలోక ప్రాప్తి దాని ఫలితం. అయినా సుఖం లేదు. అది ఖర్చు కాగానే మళ్లీ వెనక్కు మళ్ల వలసిందే తప్పదు. కాని అదే కర్మ యోగంగా మారిందో సత్త్వశుద్ధి ద్వారా ఆత్మజ్ఞానాన్నే అందించి నీ జీవితం సార్థకం చేయగలదు. ఇంతకూ కర్మానుష్ఠానం మోక్షమార్గానికే దూరమైతే కర్మయోగం ఆ మార్గంలో నిన్ను ప్రవేశపెడుతుంది. అది క్రమేణ నిన్ను గమ్యం చేరుస్తుంది.

అంచేత మనమంతా మందాధికారులమా అని బెంగ పెట్టుకోరాదు. అధ్యాత్మరంగంలో ప్రవేశం దొరికిందే అని ఎంతో సంతోషించాలి. అది ఎలాగో వివరిస్తున్నాడు పరమాత్మ. మా ఫలేషు కదాచన - మా కర్మఫలహేతుర్భూః ఫలితం మీద వల్ల మాలిన అభిమానం పెట్టుకోకుండా పనిచేయి అర్జునా కర్మ ఫలానికి నీవు హేతుభూతుడవు కూడా కావద్దు. ఫలదృష్టి మమకారమైతే దానికి హేతువనే దృష్టి అహంకారం. నేను చేస్తున్నాననే కర్తృత్వ బుద్ధి అహం. దీనివల్ల ఈ ఫలం నాకు తప్పకుండా కలగాలనే భోక్తృత్వ బుద్ధి మమ. ఇవి రెండే జీవభావం. వీటిలోనే సుడి తిరుగుతున్నంత వరకూ నీవు అసలైన ఆత్మ తాలూకు జ్ఞానాన్ని ఆసించలేవు. అవి దూరం చేసుకొన్నప్పుడే జీవాత్మ ప్రత్యగాత్మగా నీకు దర్శనమిస్తుంది.

అయితే ఏ కర్మా చేయకుండా మానేస్తే సరిపోదా అని మళ్లీ బోల్తా పడతావేమో. అది అసలే పనికిరాదు. సోమరివయి పోతావు కర్మలు మానేస్తే.

Dr Dayananda Swamy ebooks

కర్మ చేయవలసిందే. చేయమన్నారు గదా అని కర్తృత్వభోక్తృత్వాలు పెట్టుకొని చేయగూడదు. అప్పటికి చేయటమూ కాదు. మానటమూ కాదు. చేస్తే యాంత్రికంగా చేయటం కాదు. మానితే తప్పించుకొందామనే భావంతో మానటం కాదు. మాతేసంగో స్త్వకర్మణి కర్మలు ఎగగొట్టి తిరుగుదామనే పలాయనవాదం **Excapism** పనికిరాదు. యాంత్రికంగా చేసినా - అసలే మానేసినా ఈ రెండింటిలోనూ నీకు జ్ఞానసిద్ధి లేదు. అవి రెండూ రెండు అతి చేష్టలు **Extremes.** నిర్లిప్తంగా చేయాలి ఏ పని అయినా అదే కర్మయోగం. జ్ఞానానికి తోడ్పడేది కేవల మీ కర్మ యోగమనే మధ్యే మార్గమే. అర్జునుడి ద్వారా లోకానికంతా గీత చేస్తున్న మహోపదేశ మిది.

**యోగస్థః కురు కర్మాణి - సంగం త్యక్త్వా ధనంజయ**
**సిద్ధ్యసిద్ధ్యోః స్సమో భూత్వా - సమత్వం యోగ ఉచ్యతే - 47**

అయితే ఇప్పుడొక పెద్ద చిక్కు వచ్చి పడ్డది. కర్మ మానేయటం పనికిరాదు చేయమంటున్నారు బాగానే ఉంది. ఫలిత మాసించకుండా పనిచేయగలమా. అలాగే నేను చేస్తున్నాననే భావం పెట్టుకోకుండా చేయగలమా అది సాధ్యమా. సాధ్యమే నంటున్నది గీత. యోగస్థః కురు - సంగంత్యక్త్వా అని అది మనకిచ్చే సలహా. మామూలుగా చూస్తే అసాధ్యమేనని తోచవచ్చు నీకు. కాని ఈ మార్గంలో కొంత శిక్షణ పొందినవాడి కంత అసాధ్యమేమీ గాదని హామీ ఇస్తున్నాడు పరమాత్మ.

అది ఎలాగంటే నీవు యోగస్థుడవే అయితే సంగం వదిలేయవచ్చు. సంగమంటే అభిమానం **Attachment.** కర్తృసంగం. ఫలసంగమని సంగం

Dr Dayananda Swamy ebooks


రెండు విధాలు. అందులో కర్తనను కొన్నప్పుడే ఫలం మీద సంగ మేర్పడుతుంది. అలా కాక ఈశ్వరుడే దీనికి కర్త ఆయనే నాద్వారా ఈ పని చేస్తున్నాడు. ఈ కర్మఫలం కూడా ఆయనకే చెందుతుందని రెండింటితోనూ నీవు తెగతెంపులు చేసుకొన్నావో ధన్యుడవు. ఈశ్వర స్ఫృహతో చేయాలి ఏ కర్మ చేసినా. అది చాలా ముఖ్యం. ఆ స్ఫృహ**Awareness** లేకుండా సంగమనేది వదులుకోలేవు. అసాధ్యం. స్ఫృహ ఉంటే మాత్రమ సాధ్యం కాదు. సాధ్యమే.

అలా అసక్తమైన బుద్ధితోనే ఉండాలి చివరిదాకా. సిద్ధ్యసిద్ధ్యో స్సమోభూత్వా ఆఖరుకు సిద్ధి అయినా అసిద్ధి అయినా ఏకంగా చూడగలిగి ఉండాలి. తేడా చూడగూడదు. సిద్ధి అంటే దీనివల్ల నాకు సత్త్వశుద్ధి ఏర్పడుతుంది. అది నాకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తుందని కలలు కనగూడదు. అలాగే అసిద్ధి ఏర్పడి ఏదీ నీకు ప్రాప్తించకపోతే కుంగిపోకూడదు. అనుకూలించినా ప్రతికూలించినా అది కూడా ఈశ్వరుడికే అప్పజెప్పి చేతులు దులుపుకోవాలి. సమత్వం యోగ ఉచ్యతే - ఈ సమత్వ బుద్ధికే యోగమని పేరు. యోగస్థః కురు - ఇలాటి యోగాన్ని అవలంబించి అందులోనే పాతుకొని పోవాలి నీవు. అది నీవరకే పరిమితమైతే నీకెప్పటికీ రాదు. నీ బుద్ధి అంతకంతకు విస్తరించి ఈశ్వరుడి స్థాయినందుకొని ఆ ఈశ్వర స్ఫురణ తోనే నిండిపోవాలి. అలాటి విశాలమైన బుద్ధితో నీవే కర్మ చేసినా చేస్తూ పోవాలి. ఇలాటి శిక్షణ Discipline

Dr Dayananda Swamy ebooks

పొందినప్పుడే కర్మానుష్ఠానం కర్మ యోగంగా మారి సత్త్వ శుద్ధి ద్వారా ఎప్పటికైనా నీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

**దూరేణ హ్యవరం కర్మ - బుద్ధి యోగా ద్ధనం జయ**

**బుద్ధౌ శరణ మన్విచ్ఛ - కృపణాః ఫలహేతవః - 48**

కాబట్టి కర్మణ్యేవాధికారస్తే అని నీకు నీ స్థానమేదో చూపానంతే. నీవు పనికిరాని వాడనే మోనని బాధపడవద్దు. కర్మ అన్నానే గాని కర్మానుష్ఠానమని నిర్దేశించలేదు గదా. కర్మ యోగ మవలంబించమని నా వివక్షిత మంటాడు భగవానుడు. అలాటి శిక్షణ మార్గంలోనే పయనించ వలసిన వాడని అర్జునుణ్ణి గూర్చి ఆయన కున్న అభిప్రాయం. మనలో చాలామంది అలాటి అర్జునులే. మనలో 90 మంది సకామంగా ఆచరించే వారే కర్మలు. కామోకార్షీత్ - మన్యురకార్షీత్ అని సంధ్యావందనంలో నిత్యమూ చదువుతూనే ఉంటాం. ఈ పని కామమే చేయిస్తున్నది క్రోధమే చేయిస్తున్నదని దాని అర్థం. అలాగే చేస్తున్నారు ఏ సత్కర్మనైనా దుష్కర్మనైనా కర్మిష్ఠులంతా. అలాగే గుడ్డిగా చేస్తూ పోయేదే అయితే దూరేణ హ్యవరం కర్మ అది చాలా నికృష్టమైన కర్మ. గొప్ప ఫలితమేదీ నీకందివ్వదు. ఏమిటా గొప్ప ఫలం. జ్ఞానోదయం. ఆత్మ జ్ఞానానికి పనికిరాని కర్మనెంత నీవు శాస్త్రీయంగా చేస్తే మాత్రమేమి ప్రయోజనం. అవరం బుద్ధి యోగాత్. సమత్వ బుద్ధితో కూడిన కర్మయోగం కన్నా అది చాలా రెట్లు హీనమైనది. ఈశ్వర స్పృహ పెట్టుకొని నిష్కామంగా ఆచరించే కర్మయోగమే దానికన్నా

Dr Dayananda Swamy ebooks



ఎన్నోరెట్లు ప్రశస్తమైనది. దీనివల్ల ఫలితమున్నది దానివల్ల లేదు. ఒకవేళ ఉన్నా అది పితృలోకం వరకేగాని ఆత్మజ్ఞానం కానేరదని ముందే పేర్కొన్నాము. అంతేగాక దానివల్ల లోకాంతరాలకు వెళ్లి ఎంత సుఖమనుభవించినా మరలా వెనక్కు మరలవలసిందే. మరి కర్మయోగమైతే అలాటి పాటుపోట్లుండవు.

అది ఎలాగని ఆశ్చర్యపడ నక్కరలేదు. అది బుద్ధియోగం. యోగ విషయమైన బుద్ధి అయినా కావచ్చు. తత్పరిపాకం వల్ల కలిగే సాంఖ్యబుద్ధి అయినా కావచ్చు. రెండూ బుద్ధి యోగం క్రిందికే వస్తాయని వ్యాఖ్యానించారు భాష్యకారులు. యోగం సాంఖ్యాని కుపాయ **Means** మైతే సాంఖ్యం దాని కుపేయం **End.** రెండూ మోక్షమార్గంలో ఉన్నాయి కాబట్టి జన్మమరణాది చింత పెట్టుకోబని లేదు సాధకుడు.

అంచేత బుద్ధౌ శరణ మన్విచ్ఛ అని సలహా ఇస్తున్నాడు భగవానుడు. ఇలాటి బుద్ధియోగమే మనకు అభయాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టి దానినే శరణు వేడటం మంచిది. పరమార్థ జ్ఞానమే జీవిత పరమావధి అని దాన్ని అనుసరించి పోవటమే ఇక్కడ శరణాగతి. అలా కాక మొండిగా మానవుడు అనవసరమైన కర్మానుష్ఠానంతోనే యావజ్జీవమూ కాలం గడుపుతూ పోయాడో ఎంతో విలువైన కాలం వృధా చేస్తున్నాడు. కృపణాః ఫలహేతవః - అలాటి వాళ్లందరూ కృపణులంటున్నది గీత. కృపణులంటే శోచనీయులు. **Pitiable** అని అర్థం. ఎంచేత శోచనీయులు. ఫలహేతవః – ఫలం మీదనే కోరిక పెంచుకొని భోక్తృత్వ బుద్ధి వదలకుండా

Dr Dayananda Swamy ebooks


చేస్తుంటారు కాబట్టి ఫలానుభవానికి మరలా జన్మించక తప్పదు. జన్మిస్తే మరలా మరణించకా తప్పదు. ఇలా జన్మ మరణ పరంపరకు గురియైన వారు శోచనీయులు కాక మరెవ్వరు. కనుకనే కృపణులని పేర్కొనటం. సరిగా బృహదారణ్యకం చెప్పిన మాటకిది ప్రతిధ్వని. – యోవా ఏతదక్షరం గార్గి అవిదిత్వా ప్రైతి స కృపణః ఈ అక్షరమైన ఆత్మ తత్త్వాన్ని గుర్తించకుండానే కన్నుమూసిన ప్రతిమానవుడూ కృపణుడే సుమా అంటాడు యాజ్ఞవల్క్యుడు గార్గితో.

**బుద్ధి యుక్తో జహాతీహ – ఉభే సుకృత దుష్కృతే**

**తస్మా ద్యోగాయ యుజ్యస్వ – యోగః కర్మసు కౌశలమ్ – 49**

కాబట్టి ఇంతకూ మనమర్థం చేసుకోవలసిన దేమంటే సమత్వ బుద్ధి అనేది మామూలు కర్మాచరణ కన్నా ఎంతో గొప్పది. మామూలు కర్మ మోక్షమార్గానికి విజాతీయంగా సాగుతూ పోతే ఇది దానికి సజాతీయంగా సాగిపోయే వ్యవహారం. బుద్ధియుక్తో అలాంటి విశిష్టత ఇందులో ఉందని గుర్తించి ఆ మార్గంలోనే పయనించే సాధకుడు జహా తీహ ఉభే సుకృత దుష్కృతే. సుకృతం దుష్కృత మనే తేడా చూడడు. పుణ్యపాపాలు రెండింటినీ అవలీలగా వదిలేస్తాడు. ఒక పక్క కర్మ చేస్తూనే ఎలా వదిలేయగలడని సందేహించ పనిలేదు. కర్మానుష్ఠానం కాదు. కర్మయోగమిది. దానివల్ల సత్త్వం శుద్ధి అవుతుంది కర్మయోగికి. సత్త్వమంటే అంతః కరణం. అది ఎప్పుడు శుద్ధమయిందో అందులో జ్ఞానబీజాలు తప్పక అంకురిస్తాయి. దాని బలంతో సుఖదుఃఖాలు పుణ్యపాపాలనే ద్వంద్వాలకు వీడ్కోలు చెప్పగలడు సాధకుడు.

Dr Dayananda Swamy ebooks


కనుకనే తస్మాద్యోగాయ యుజ్యస్వ. ముందు నీవు ఇటూ అటూ చూడక బుద్ధి యోగం కోసమే కంకణం కట్టుకో. అదే నీకు మార్గం చూపుతుంది ఆత్మజ్ఞానానికి . యోగః కర్మసు కౌశలం. యోగమంటే ఏమనుకొంటున్నావో నీవు. కర్మసు కౌశలం - కర్మాచరణలో ఉండే చాతుర్యం నేర్పు. సిద్ధీ అసిద్ధీ ఏది కలిగినా ఒకటేనని ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలన్నీ సాగిస్తున్నావంటే ఎంత కౌశలమది. బంధన స్వభావ మున్న కర్మలన్నీ సమత్వ బుద్ధితో ఎప్పుడు నీవు చూచావో అప్పుడా స్వభావం నుంచి వాటి పాటికవే తప్పుకొంటాయి. అంతకన్నా కౌశల మేముంది. కోరలు తీసిన పాములయి పోతాయి కర్మలు. అహంకారమమ కారాలే కర్మ అనే సర్పాని కుండే కోరలు. అవి సమత్వబుద్ధితో లాగేశాడు యోగి. ఇక కర్మ నిన్నేమి చేయగలదు. ఉన్నా అది లేని దానితో సమానమే. ఇదీ కర్మయోగంలో ఉన్న సౌలభ్యం.

**కర్మజం బుద్ధి యుక్తాహి - ఫలంత్యక్త్వా మనీషిణః**
**జన్మ బంధ వినిర్ముక్తాః పదం గచ్ఛం త్యనామయమ్ - 50**

అసలు రహస్యమేమంటే బుద్ధి యుక్తా మనీషిణః కర్మయోగ మవలంబించి ఆ మార్గంలో పయనించే వారెప్పటికైనా మనీషు లవుతారు. మనీషి అంటే జ్ఞాని. చెప్పాము గదా కర్మయోగం చిత్తశుద్ధి నిస్తుందని - అది జ్ఞానోత్పత్తికి దారి తీస్తుందని. కర్మఫలం మీద దృష్టి ఉన్నంతవరకూ రాదది. ఫలం మీద దృష్టి వదలకుంటే అది అనుష్ఠానమే గాని యోగం గాదని ముందే స్పష్టం చేశాడు భగవానుడు. మరి యోగ మెప్పుడవుతుంది.

Dr Dayananda Swamy ebooks

ఫలం త్యక్త్వా కర్మ జన్యమైన ఫలాన్ని వదులుకొన్నప్పుడే. అది అనుకూలమే కావచ్చు. ప్రతికూలమే కావచ్చు. ఎలాటి ఫలితమది ఇచ్చినా దానికి తిలాంజలి ఇవ్వవలసిందే. అలాటి ఫలత్యాగముండి సమత్వబుద్ధి పనిచేసినవాడే తద్వారా ఆత్మజ్ఞానానికి నోచుకొంటాడు. నోచుకొన్నాడంటే వాడిక కర్మిగాదు జ్ఞాని.

మరి జ్ఞాని ఎప్పుడయ్యాడో జన్మబంధ వినిర్ముక్తాః ఇక వాడికి కర్మఫలమైన జన్మబంధం లేదు. జన్మైవ బంధః జన్మ బంధః అని అర్థం చెప్పారు స్వామివారు. జన్మ ఎత్తటమే బంధం మానవుడికి. జన్మించటం వల్లనే ఉపాధి ఏర్పడింది. దానితో జీవిస్తుంటాము ప్రారబ్ధ మున్నంత కాలమూ. అది తీరిపోగానే దేహ పాతమయి కన్నుమూస్తున్నాము. కాబట్టి మరణం కాదు. అసలు జన్మే బంధం. ముందు జన్మిస్తే గదా తరువాత మరణిస్తాము. జన్మించ కనేపోతే మరణమనే ప్రశ్నేముంది. అంచేత జననమరణాలనే సంసార బంధం తప్పించుకొని బయటపడతాడు జ్ఞాని. జీవించి ఉండగానే ముక్తుడయి పోతాడంటారు భగవత్పాదులు.

ఎవరు కర్మ యోగులా. కర్మయోగులే. కర్మయోగావస్థలో కాదు. వారు జ్ఞానయోగులుగా మారి ఆ తరువాత ముక్తి పొందుతారని అర్థం చేసుకోవాలి మనమిక్కడ. కనుకనే మనీషిణః అనే మాట ప్రయోగించాడు వ్యాసభట్టారకుడు. మనీషులయి పొందుతారట కర్మయోగులు. ఏమిటా పొందేది. పదం గచ్ఛం త్యనామయమ్ . అనామయమైన పదం. పదమంటే స్థానం - స్థితి - దశ. అది అనామయమట. ఆమయం లేనిదేదో అది

Dr Dayananda Swamy ebooks


అనామయం. ఆ మయమంటే వ్యాధి అని అర్థం. జనన మరణాదులైన ఉపద్రవాలే మానవుడికి పట్టుకొన్న ఏకైకమైన వ్యాధి. అది ఈ సమత్వబుద్ధి నవలబించిన కర్మయోగులకు క్రమంగా జ్ఞానోదయమై తత్ఫలితంగా ప్రాప్తిస్తుంది.

తద్విష్ణోః పరమంపద మని కఠోపనిషత్తు చెప్పిన మాట ఇది. దానినే అనుసరించి చెబుతున్నాడీ మాట వేదవ్యాసుడు. విష్ణోః పదమనగానే అది ఏదో పదం ఎక్కడో వైకుంఠంలో ఉందని మరలా భ్రాంతిపడ రాదు మనం. ఏదో గాదది మోక్షమే నని నిష్కర్ష చేసి చెప్పారు భగవత్పాదులు.

ఇక్కడ ఒక ధర్మసూక్ష్మం సెలవిస్తున్నారు కూడా ఆయన. బుద్ధి యోగా ద్ధనంజయ అనే చోట వ్యాసమహర్షి ప్రయోగించిన బుద్ధి యోగమనే మాట సమత్వబుద్ధి యోగమని ఇంతవరకూ మూడు శ్లోకాలలో మనం వ్యాఖ్యానించి చెప్పుకొన్నాము. సమత్వబుద్ధి కర్మయోగమే గదా. ఇంకా అది అప్పుడే జన్మబంధమెలా వదిలిస్తుందని శంకించి అది జ్ఞానయోగంగా మారి ఆ తరువాత మోక్షాన్ని ప్రసాదిస్తుందని వ్యాఖ్యానించ వలసి వచ్చింది మేము. అలా కాక బుద్ధి యోగమనే మాటకు జ్ఞానయోగమనే అర్థమే చెప్పుకొన్నా చెప్పుకోవచ్చు. అలాగైతే అది జ్ఞానమే గనుక సాక్షాత్తుగానే మోక్షదాయకం కాగలదు. కర్మయోగం జ్ఞానయోగంగా మారి అని డొంక తిరుగుడుగా చెప్పుకోనక్కర లేదప్పుడని ఇందులో సూక్ష్మం బయటపెట్టారాయన.

Dr.Dayananda Swamy ebooks

**యదా తే మోహ కలిలం - బుద్ధి ర్వ్యతి తరిష్యతి**

**తదాగంతాసి నిర్వేదం - శ్రోతవ్యస్య శ్రుతస్య చ - 51**

ఇంతకూ బుద్ధియోగమనే మాట మనం యోగపరంగా జ్ఞానపరంగా ఎలాగైనా చెప్పుకోవచ్చు. అయితే జ్ఞానపరంగానైతే అది సాక్షాత్తూ - యోగపరంగా అయితే జ్ఞానం ద్వారా పరంపరయా **Indirect** ముక్తిని ప్రసాదిస్తుందనే సూక్ష్మం మనం మరచిపోక పోతే చాలు. ప్రస్తుతం కర్మయోగం వల్ల సత్త్వశుద్ధి ఏర్పడి ఆ సత్త్వశుద్ధి వల్ల కలిగే సాంఖ్య బుద్ధి సాధకుడి కెప్పు డేర్పడుతుంది. దానికేమిటి నిదర్శనమని ప్రశ్న వస్తే దానికి సమాధాన మిస్తున్నది ఈ శ్లోకం. యదాతే మోహ కలిలం బుద్ధి ర్వ్యతి తరిష్యతి - మోహకలిల మంటే అజ్ఞానమనే కాలుష్యం. ఏమిటది ఎలా ఉంటుంది. అవివేక రూపంగా ఉంటుంది. వివేకమంటే ఇది ఆత్మ అది అనాత్మ అని వేరు చేసి చూడటం. అదే సాంఖ్యమని అర్థం చెప్పాము. అలా వివేచన చేయలేకపోతే ఆత్మే అనాత్మగా అనాత్మే ఆత్మగా కలగాపులగమయి కనిపిస్తాయి. అవే అహంకార మమకారాలు. సంసార మంతా ఇదే. ఇలాటి మోహకలిలాన్ని ఎప్పుడీ సాధకుడి బుద్ధి వ్యతితరిష్యతి పూర్తిగా దాటి బయటపడుతుందో అదీ నిదర్శనం జ్ఞానోదయ మయిందని చెప్పటానికి.

తదాగం తాసి నిర్వేదం - శ్రోతవ్యస్య శ్రుతస్యచ. అంతేకాదు. ఇంకా ఒకటి ఉంది లక్షణం దానికి. ఆత్మజ్ఞానమనేది నీకుదయించిం దంటే చాలు.

Dr Dayananda Swamy ebooks



ఇక నిర్వేదం. నీకే రోత పుడుతుంది. విరక్తి ఏర్పడుతుంది. ఎందులో విరక్తి. శ్రోత వ్యస్య. ఇంకా ఏదో ఉంది అది విందామని. శ్రుతస్యచ విన్న విషయం ఎంత గొప్పది - అది వినటమే నా భాగ్యమని . ఈ రెండంటిలోనూ నీకు వైరాగ్య మేర్పడుతుంది. ఎందుకంటే అవి రెండూ కనపడవప్పుడు నీకు. ఇదం సర్వం య దయమాత్మా అని సర్వమూ నీకు నీ స్వరూపంగానే దర్శన మిస్తున్నప్పుడీ విన్న భావాలెక్కడ ఉన్నాయి. వినవలసిన భావాలెక్కడ ఉన్నాయి. ఉన్నాయంటే అవి రెండూ ఆత్మకు వేరుగా ఉన్నాయా. ఆత్మగా ఉన్నాయా. ఆత్మగా ఉంటే నీకవి కనపడవు. కనుక ఆత్మ జ్ఞాన ముదయించనంత వరకే ఇది నేను శ్రవణం చేశాను- అది ఇంకా శ్రవణం చేస్తే బాగుండు ననే మాట. ఆ జ్ఞానమెప్పు డుదయించిందో ఇక శ్రుతమూ లేదు శ్రోతవ్యమూ లేదు. ఉన్నట్టు చూస్తున్నా అది వస్తువు కాదు ఆ భాస. ఆభాస అని చూస్తున్నప్పుడు దానిమీద రక్తి ఎలా ఏర్పడుతుంది. రక్తి లేదంటే విరక్తే. నిష్ఫలమై పోతాయని అర్థం వ్రాస్తారు గురువుగారు. ఫలమనేది స్వానుభవానికి వచ్చినప్పుడు అంతవరకూ తోడ్పడిన సాధనమిక నిష్ఫలమే గదా.

**శ్రుతి విప్రతి పన్నాతే - యదా స్థాస్యతి నిశ్చలా**
**సమాధా వచలా బుద్ధి - స్తదా యోగ మవాప్స్యసి - 52**

సరే కర్మయోగాన్ని అవలబించి కొంతకాలానికి మోహ కలిలమనేది దాటిపోయి కర్మయోగానికి పర్యవసానమైన పరమార్థ యోగాన్ని అందుకొంటాడు సాధకుడని గదా హామీ ఇచ్చాడు పరమాత్మ. అది

Dr Dayananda Swamy ebooks


ఎప్పుడందు కొంటాడు. ఎలా అందుకొంటాడని ఇప్పుడు ప్రశ్న వచ్చింది. దానికిస్తున్నది సమాధాన మీ శ్లోకం.

శ్రుతి విప్రతి పన్నాతే బుద్ధిః – శ్రుతు లంటే ఋగాది వేద వాఙ్మయం. అది ఒక సూపరు బజారు. అందులో అన్ని రకాల వస్తువులూ దొరుకుతాయి. దేనికేది సాధనమో **Means** దేనికేది సాధ్యమో **end** అవి కూడా ఎన్ని జాతులో వాటికి పరస్పరమున్న సంబంధమేమిటో – ఇవన్నీ బయటపెట్టటమే వాటి ఉద్యోగం. అందులో ప్రవృత్తిని బోధించేవి కొన్ని. నివృత్తిని బోధించేవి మరి కొన్ని. ఇవన్నీ వినే కొద్దీ ఆచరించే కొద్దీ నీ బుద్ధి పరిపరి విధాలుగాచెదిరిపోతుంది. గందరగోళమై పోతుంది. ఏది చేయాలో ఎందుకు చేయాలో తోచక ఆందోళన చెందుతుంది.

అలాటి బుద్ధి యదాస్థా స్యతి నిశ్చలా. ఎప్పుడైతే నిశ్చలా–చలనమే మాత్రమూ లేకుండా స్తిమితంగా స్థిరంగా నిలబడుతుందో – ఆ నిలబడట మెక్కడని. సమాధావచలా. సమాధిలో. సమాధి అంటే అర్థం చెబుతున్నారు భాష్యకారులు సమాధీయతే చిత్త మస్మి న్నితి సమాధిః ఆత్మా. ఎక్కడ మానవుడి చిత్తం నిలకడ చెంది కదలకుండా ఉండిపోతుందో అలాటి ఆత్మచైతన్యమే ఇక్కడ సమాధి అనే మాటకర్థం. మనస్సెప్పుడూ దానికి మూలమైన ఆత్మలోనే చేరిపోతుంది. ఆత్మే దాని కధిష్ఠానం **Basis.** మనస్సు దానిమీద ఆరోపితమైన పదార్థం. ఆరోపిత మెప్పుడే గాని దాని అధిష్ఠానంలోనే గదా చేరవలసింది. ఆదిలో అది అధిష్ఠానమే. అంతంలోనూ అధిష్ఠానమే. మధ్యలోనే అది వృత్తి రూపంగా ప్రసరించి అదికానట్టు అభినయిస్తున్నది.

Dr Dayananda Swamy ebooks



ఇంతెందుకు. ఒక కడవ బాన ముంత మూకుడు ఇలాటి మట్టి పాత్రలు మనమెన్నో చూస్తుంటాము. ఎక్కడి నుంచి వచ్చాయవి. ఏమిటి వాటి మూలపదార్థం. మొట్ట మొదట అవి మట్టే. చిట్ట చివరికవి మట్టే. మధ్యలో కూడా మట్టి అయినా దానికి భిన్నంగా భాసిస్తుంటాయి. అది కేవల మా భాసే. అర్థం చేసుకొంటే అందులో ఉన్నదంతా మట్టేగదా అనే నిశ్చయం కలుగుతుంది మనస్సుకు. అలా చూడనంత వరకూ వాటి నామరూపాది విశేషాలు మనస్సు నిటూ అటూ లాగుతుంటాయి. అదే విక్షేప **Distraction** మంటే.

ఇలాటి విక్షేప దోషమే ఉంది ప్రస్తుతం మానవుడి మనస్సుకు. అది ఈ చరాచర పదార్థాల వైపు చూస్తూ వాటివల్ల కలిగే ఆలోచనలు పెట్టుకోటం వల్లనే. మరి దేనివల్లా కాదు. దానికేమిటి మందు. ఇప్పుడు చెప్పినదే. పాత్రలన్నిటిలో వాటి మూల పదార్థాన్నే చూచినట్టు ఈ చిత్తవృత్తులలో కూడా శుద్ధ చైతన్యమే సద్రూపంగా చిద్రూపంగా వ్యాపించి ఉంది కాబట్టి ఏది చూచినా ఆ సచ్చిత్తులనే అధిష్ఠానాన్నే గుర్తు చేసుకొని దాన్నే దర్శిస్తూ పోవటమే. అలా నిరంతరమూ చూస్తూ పోవటమే ఇక్కడ సాధన. ఏకైక సాధన. ఇది కర్మ గాదు. ఉపాసన గాదు. కేవల జ్ఞాన యోగం **Realisation.** తదా యోగమవాప్స్యసి అలాటి నిర్వికల్పమైన ఆత్మస్థితి నందుకోటమే యోగమని సెలవిస్తున్నది గీత. అందుకొన్నందుకు తార్కాణ మా స్థితే మరేదీ గాదు.

Dr Dayananda Swamy ebooks

**స్థిత ప్రజ్ఞస్య కాభాషా - సమాధిస్థస్య కేశవ**
**స్థిత ధీః కిం ప్రభాషేత - కి మాసీత - వ్రజేత కిమ్ - 53**

అయితే ఇప్పుడిలాటి సమాధి ప్రజ్ఞ ఒక యోగికి కలిగిందో లేదో కలిగిన ఆ స్థిత ప్రజ్ఞుడి లక్షణాలెలాటివి అవి మనమెలా గుర్తించగలమని అర్జునుడు గురువు గారిని ప్రశ్నిస్తున్నాడు. స్థిత ప్రజ్ఞస్య కాభాషా అని. ఇక్కడ ఈ శ్లోకంలో నాలుగే నాలుగు ప్రశ్నలున్నాయి. కాభాషా – కిం ప్రభాషేత – కిమాసీత – వ్రజేత కిమ్మని. ఇతరులు ఆ స్థిత ప్రజ్ఞుణ్ణి ఏమని పిలుస్తారు. వాడే స్వయంగా ఏమి మాటాడుతాడు ఎలాగంటాడు. ఏది పొందుతాడు. ఇవీ ఆ నాలుగు ప్రశ్నలూ.

ఇంతకూ నాలుగింటికీ జవాబు వస్తే అది ఆ స్థిత ప్రజ్ఞుడి లక్షణం క్రిందికి వస్తుంది. ఇక్కడ ఒక వివరణ ఇస్తున్నారు భగవత్పాదులు. ఎవడైతే మొదటినుంచీ కర్మల వైపు మొగ్గు చూపక ఆత్మజ్ఞానమే జీవిత లక్ష్యంగా పెట్టుకొని అందులోనే కాలం గడుపుతుంటాడో వాడూ స్థిత ప్రజ్ఞుడే. అలాకాక చాలాకాలం కర్మయోగ మవలంబించిదాని ఫలితంగా చివరకు జ్ఞానం సంపాదించి అందులో స్థిరపడతాడో వాడూ స్థితప్రజ్ఞుడే. ఒకడు **Direct** అయితే – ఇంకొకడు **Department promotion** తో పైకి వచ్చిన ఉద్యోగి అని ఎప్పుడూ చెబుతూ ఉంటాను. ప్రజహాతి యదా అని ఇప్పుడు రాబోయే శ్లోకం దగ్గరి నుంచీ ఈ అధ్యాయం పరిసమాప్తమయ్యే వరకూ ప్రతి ఒక్క శ్లోకంలో స్థిత ప్రజ్ఞ లక్షణమూ వర్ణిస్తారు. సాధనమూ వర్ణిస్తారు వ్యాసభగవానులు.

Dr Dayananda Swamy ebooks


అసలీ అధ్యాత్మ శాస్త్ర వ్యవహారమే వేరు. ఇది మరి ఏ శాస్త్రంలో చూడబోము. ఇక్కడ ఏది లక్షణమో **Virtue** అదే సాధన **Endeavour** కృతార్థుడి విషయంలో అది లక్షణమైతే సాధకుడి విషయంలో అది ప్రయత్నం. సిద్ధి అనేది కలిగేసరి కంతవరకూ వేర్వేరుగా కనిపించిన లక్షణ సాధనాలు రెండూ కలిసి లక్షణంగానే దర్శనమిస్తాయి. అంటే అప్పటికే మన్నమాట. స్థిత ప్రజ్ఞత్వమనే సిద్ధిని దృష్టిలో ఉంచుకొని మొదటినుంచీ మానవుడు సాధన కుపక్రమించాలని తాత్పర్యం. అప్పుడే వాడి ప్రయాణం గమ్యాభిముఖంగా సాగుతుంది. ప్రక్కలకు పోదు. ఇటూ అటూ చెదరిపోదు.

**ప్రజహాతి యదా కామాన్ - సర్వాన్ పార్థ మనోగతాన్**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః - స్థిత ప్రజ్ఞస్తదోచ్యతే - 54**

ప్రజహాతి యదా కామాన్ - ఎవడి ప్రజ్ఞ స్థితమయి కదలకుండా నిశ్చలంగా ఉంటుందో వాడు స్థిత ప్రజ్ఞుడు. అలా స్థిత ప్రజ్ఞుడు కాకుంటే గత ప్రజ్ఞుడు కాక ఏమవుతాడు. చెదురుతుందంటే దానికి కారణం కామం. కామమంటే కోరికలు. అవి మనోగతమ్. మనసులో తిష్ఠ వేసుకొని కూచుంటాయి ప్రతివాడికీ. కోరికలైనా కావచ్చు అవి. కోరే పదార్థాలైనా కావచ్చు. రెండూ కామాలే. అవి అనేకం. కోరే మనసు ఏకమైనా కోరబడే పదార్థా లనేకం. అనేక మయ్యేసరి కందులో కొన్ని అనుకూలమైనవి దగ్గర పెట్టుకోవాలని - ప్రతికూలమైతే దూరం చేసుకోవాలని కలుగుతుంటుంది ఆలోచన. అది మనసును తిప్పుతుంటుం దెప్పుడూ.

Dr Dayananda Swamy ebooks

పైగా కోరినవన్నీ నెరవేరుతాయని చెప్పలేము. కోరనివి వచ్చి నెత్తిన పడవనీ చెప్పలేము. దానితో మనసు కారాటం ఆందోళన. మధన పడుతుంటుం దెప్పుడూ.

అలాంటప్పుడు మానవుడి ప్రజ్ఞ ఎలా స్థిరంగా నిలబడుతుందో చెప్పండి. పాదరసంలాగా అటూఇటూ పరుగెడుతూనే పోతుంది. కనుక ప్రజహాతి యదా ఈ కోరికలనే మానవుడు ఊచ ముట్టుగా త్రోచి వేయగలిగితే ధన్యుడు. అప్పుడు చెదరిపోయే ప్రశ్న లేదు కాబట్టి గత ప్రజ్ఞుడు కాక స్థిత ప్రజ్ఞుడని పించుకొంటాడు. అయితే కోరికలన్నీ వదిలేసి బ్రతకట మెలాగా అని ప్రశ్న వస్తుంది. ఏ కోరికా లేకపోతే ధనధాన్యాదులూ వస్తు వాహనాదులూ సంపాదించుకోలేము. తినలేము. ఉండలేము. బ్రతకలేము. శరీరం నిలబడాలంటే తినాలి. తాగాలి. అవి నడవాలంటే సంపాదించాలి. సంపాదించాలంటే సంపాదించాలనే సంకల్పముండాలి. ప్రయత్నముండాలి. కాబట్టి కామమనేది ఉండి తీరవలసిందే. కేవలం నిష్కామంగా బ్రతుకు సాగదని ప్రశ్న రావటం సహజమే.

దానికి జవాబిస్తున్నాడు గీతాచార్యుడు. ఆత్మన్యేవాత్మనా తుష్టః అని సర్వాన్ కామాన్ అన్ని కోరికలూ లేకుండా పోయినా భయం లేదు. నీకు సంతృప్తి లేకుండా పోదు. కోరికలు తీరితేనే సంతృప్తి అనుకోకు. సంతృప్తి బాహ్యమైన పదార్థాల వల్లనే అనుకొంటున్నావు. అది నీ భ్రాంతి. అయితే మరెలా కలుగుతుంది. ఆత్మన్యేవాత్మనా తుష్టః – ఆత్మవల్ల ఆత్మలోనే

Dr Dayananda Swamy ebooks


నీకు కలుగుతుందది. ఆత్మ అంటే ఏదోగాదు. సచ్చిద్రూపమది. ఉన్నదనే స్ఫురణే ఆత్మ అంటే. అది నీలోపలే గాదు. నీవెలపల కూడా నీ చూట్టూ ఉన్న చరా చర పదార్థాలలో కూడా - సమానంగా పరుచుకొని ఉందిప్పుడు. నేనున్నానని ఎలా చూస్తున్నావో నీవు - నీ చుట్టూ ఉన్న గృహారామక్షేత్రాదులనూ - నీ బంధుమిత్రాదులనూ అందరినీ అన్నింటినీ - ఉన్నాయనే చూస్తున్నావు. ఉండటమనే స్ఫురణ అంతటా వ్యాపించే ఉంది.

అప్పటికి నీవు కోరేవీ కోరనివీ అన్నీ ఆత్మలోనే ఉన్నాయి. ఫలానా అని నీవు పేరుపెట్టి కోరుతున్నావంటే ఆ పదర్థాంతో పాటు ఆత్మకూడా అక్కడే ఉంది. దానితో కలిసే ఉంది. అలాంటప్పు డొకటి నీకు లభిస్తే ఎంత. లభించకుంటే ఎంత. పదార్థం లభిస్తే ఆత్మే ఆ రూపంలో అనుభవానికి వస్తున్నదని చూడు. అది అభించకపోతే ఆ స్థానంలో కూడా ఆత్మ చెక్కు చెదరకుండా అలాగే అనుభవానికి వస్తున్నదని చూడు. అప్పుడనాత్మ పదార్థాల మీదినుంచి నీ దృష్టి వాటన్నిటిలో దాగి ఉన్న ఆత్మమీదనే పోయి పడుతుంది. పడితే ఇక నీకు లాభం నష్టమనే చింత ఏముంది. ఆత్మస్ఫురణ ఎప్పుడూ ఉంది గదా. అదే ఇస్తుంది నీకు తుష్టి. అలా ఇచ్చినవాడే స్థిత ప్రజ్ఞుడు.

నిజమే కాని అనాత్మ పదార్థాలను వదిలేయటం సాధ్యమా. భోజన భాజనాదులైనా చేయాలి గదా. దానికోసం ప్రాకులాట తప్పదు గదా. చేయ

Dr Dayananda Swamy ebooks

వద్దని నివారించటం లేదు మేము. అది కూడా ఆత్మ స్వరూపమే ననే దృష్టి విడవకుండా చేస్తూ పో. అలా ఆత్మ స్ఫృహతో కోరిన వనుభవిస్తూ పోతే ఎన్నో కోరవు జీవితంలో. జీవితావసరా లెంత వరకో అంతవరకే కోరుతావు. ఆత్మస్ఫూర్తి నిన్ను కంట్రోలు చేస్తుంటుంది. అసలే కోరిక లేకుండా బ్రతకమనీ చెప్పదది. కోరితే అన్నీ నాకే కావాలని అత్యాశ పెట్టుకోమనీ చెప్పదు. దానికి భంగం రాకుండా ఈ ప్రపంచంతో కనీసమైన సంబంధం పెట్టుకొని జీవించమని నీ నిత్య జీవితాన్ని ఒక అదుపులో ఉంచుతుంది. సముద్రస్నానం లాంటిదిది. అసలు సముద్రంలోకి దిగకుండా పోరాదు. పోతే అలాగే దిగుతూ పోరాదు. కాబట్టి ఆశ ఉండటం మంచిదే కాని అత్యాశా దురాశా పనికిరాదని చెప్పటమే ఇందులో ఉన్న ఆంతర్యం.

భగవత్పాదులు మాత్రమిక్కడ అనాత్మ విషయమైన కోరికలు పూర్తిగా వదిలేసి ఆత్మ స్ఫూర్తినే పట్టుకొని అందులోనే తృప్తి చెందాలని వ్రాస్తారు. త్యక్త పుత్ర విత్త లోకై షణః సన్న్యాసీ ఆత్మారామః ఆత్మ క్రీడః స్థిత ప్రజ్ఞః ఇదీ ఆయన వ్రాసిన అర్థం. పుత్ర విత్తలోక విషయాల మీద కోరిక ఏమాత్రమూ ఉండకూడదంటారు. ఆయన గారంటే పరమహంస పరివ్రాజకుడై వెళ్లిపోయాడు కాబట్టి గృహస్థుల ఇబ్బందులాయన పట్టించుకోడు. అవీ ఇవీ పోగు చేసుకొనే కోరిక ఉన్నంతవరకూ ఆత్మదృష్టి నీకు నిలవదంటా రాయన.

నిజమే కాని ఇక్కడ రెండు ప్రశ్నలున్నాయి. ఆత్మ స్ఫూర్తి సన్న్యాసంలో నేనా గార్హస్థ్యంలో లేదా అని ఒక ప్రశ్న. అలాగైతే సన్న్యాసా శ్రమంలో

Dr Dayananda Swamy ebooks


మాత్రం భోజన భాజనాది చింత అసలే లేదా అని మరొక ప్రశ్న. వీటికి జవాబు చెప్పటం కష్టం. కష్టమనే శారీరం కేవలం కర్మ కుర్వన్ననే శ్లోకం దగ్గర ఆయనగారే అనుమతి ఇవ్వవలసి వచ్చింది కామకర్మలకు. మరి ఎందుకలా వ్రాశారు గురువుగారు. చావుకు పెడితే లంకణాలకు దిగుతుందని సామెత. అంత కఠినంగా చెబితేగాని ప్రతి విషయంలో తల దూర్చే చాపల్యం మానుకోరీ మానవులని ఆయన మనసులో ఉన్నమాట.

**దుఃఖే ష్వను ద్విగ్నమనాః - సుఖేషు విగత స్పృహాః**

**వీత రాగ భయక్రోధః - స్థిత ధీ ర్ము నిరు చ్యతే - 55**

ఈ విధంగా ప్రాప్తమైన వాటితో తృప్తి పడుతూ అప్రాప్తమైన వాటి కోసం వెంపరలాడకుండా ఎక్కడి కక్కడ అంతటా ఆత్మచైతన్య ప్రకాశమే సమానంగా వెలిగిపోతున్నట్టు స్వానుభవానికి తెచ్చుకొంటూ జీవయాత్ర సాగించగలిగితే – వాడు నిజంగా స్థితప్రజ్ఞుడే సందేహం లేదు. ఎందుకంటే కోరికలనూ కోరే పదార్థాలనూ గాదు వాడు చూడడం. అవి ఏ వెలుగులో గోచరిస్తున్నాయో ఆ అధిష్ఠానమే అనుక్షణమూ దర్శిస్తుంటాడు. అలాంటి ఆత్మానుభవం గట్టిగా పట్టుకొన్నప్పుడాఖరు కెంత దుఃఖం ముంచుకు వచ్చినా కంగారు పడడు. దుఃఖే ష్వను ద్విగ్నమనాః –

ఆధ్యాత్మికాధి భౌతికాధి దైవికాలని దుఃఖం మూడు విధాలు. వీటికే తాపత్రయమని పేరు. అనుకోకుండా వచ్చి నెత్తిన పడుతుంటాయవి. అన్నీ

Dr Dayananda Swamy ebooks

మూకుమ్మడిగా వచ్చి పడ్డా ఆశ్చర్యం లేదు. అలాటి కష్టాలు దాపురించినప్పుడు అనుద్విగ్నమనాః - ఉద్విగ్నం కాదు వాడి మనస్సు. అంటే సంక్షోభం పాలుగాదు. అలాటి బలహీనత లేకుండా కాపాడుతుంది వాణ్ణి వాడి ఆత్మజ్ఞాన బలం. అనాత్మ కన్నా ఆత్మకు బలమెక్కువ. తనకంటే బలవత్తరమైనది ఎదురైతే అది తలవంచ వలసిందే. బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్ అని ప్రహ్లాదు డన్నాడంటే వాడికేది ఇచ్చిందా ధైర్యం. ఇందుగల డందులేడని సర్వత్ర పరచుకొని ఉన్న ఆత్మ జ్ఞాన బలమే గదా.

దుఃఖం ప్రాప్తించి నప్పుడు కుంగిపోవటమే గాదు. సుఖేషు విగత స్పృహః - సుఖమను భవించేటప్పుడు పొంగి పోడుకూడా స్థితప్రజ్ఞుడు. అది కూడా ప్రమాదమే. ప్రమాదమంటే పరాకు చెందట **Lack of attention** మని అర్థం. సుఖంలో దుఃఖంలో రెండు దశలలో కూడా మనసు పరాధీన మవుతుంది. పరవశమై పోతుంది. దుఃఖం ముంచుకు వస్తే దుఃఖాని కధీన మవుతుంది. సుఖంప్రాప్తిస్తే సుఖానికి వశమవుతుంది. అంతేగాని ఆ సమయంలో ఆత్మకు వశం కాదు. ఆత్మ తాలూకు స్మృతినే కోలుపోతుంది మనస్సు. దానితో సుఖదుఃఖాలు రెండూ ఆత్మనుంచి తప్పించి అనాత్మ క్షేత్రం వైపు లాగేస్తాయి దాన్ని. దానివల్ల అది సుఖదుఃఖాను భవంలో తలమునక లయిపోతుంది.

అలా తలమునక లయి పోనివాడే స్థితప్రజ్ఞుడు. ఆత్మజ్ఞాన మెప్పుడూ తొలగిపోదు వాడికి. సుఖదుఃఖాలు తొలగించినా తొలగదు. అంతేకాదు.

Dr Dayananda Swamy ebooks


వీతరాగ భయ క్రోధః - రాగమూ భయమూ క్రోధమూ ఇలాటి ప్రతి లోమ భావాలన్నీ అప్రయత్నంగా సెలవు తీసుకొంటాయి వాడి విషయంలో ఇందులో రాగం క్రోధమనేవి అనుకూల ప్రతికూల భావాలు. సుఖం మీద రాగం - దుఃఖం మీద క్రోధం అంటే ద్వేషమనేది కలగటం సహజం మానవులకు. వాటిలో సుఖం లభించక పోయినా దుఃఖం ప్రాప్తించినా భయమనే మూడవది పొంచి ఉంటుంది పెద్దపులి లాగా మనమీద దూకటానికి. అంచేత మానవ మాత్రులు తప్పించుకోలేని ఈ మూడింటి గుప్పిటిలో నుంచి తప్పించుకో గలవాడే స్థిత ప్రజ్ఞుడు. మామూలు మానవు డాత్మ జ్ఞాన బలం లేనివాడు కాబట్టి వాటి వలలో పక్షిలాగా తగులుకొంటాడు. జ్ఞాన బలమున్న వాడు వాటి విషయంలో ఉపేక్ష వహించి తన మోక్ష మార్గాని కడ్డు తగలకుండా చూచుకోగలడు.

**యః సర్వత్రా నభిస్నేహః - తత్త త్ప్రాప్య శుభాశుభమ్**
**నాభి నందతి న ద్వేష్టి - తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా - 56**

అర్జునుడు వేసిన నాలుగు ప్రశ్నలలో మొదటి ప్రశ్నకిప్పుడు చెప్పుకొన్న రెండు శ్లోకాలలో సమాధానం వచ్చింది. స్థిత ప్రజ్ఞుణ్ణి ఏమని వర్ణిస్తారు లోకులని గదా ప్రశ్న. దానికిప్పుడిచ్చిన సమాధానమేమిటి. దేనిమీదా కోరిక పెట్టుకోక సుఖదుఃఖాది ద్వంద్వాలకు కూడా తట్టుకొని నిలబడ్డ వాడని సమాధానం. పోతే ప్రస్తుతం రెండవదానికి వస్తున్నది జవాబు. యః ఎవడైతే సర్వత్ర - అన్ని విషయాలలోనూ అనభి స్నేహః

Dr Dayananda Swamy ebooks

అసక్తుడయి ప్రవర్తిస్తాడో అన్ని విషయాలంటే దేహ జీవితా దిష్వపి అని అర్థం వ్రాశారు గురువుగారు. ఆఖరుకు శరీరమూ జీవితమూ అని కూడా లెక్క చేయగూడదట. అదే లెక్కలేకుంటే వాడికి శుభాశుభా లొక లెక్కా. తత్తత్ప్రాప్య శుభాశుభమ్. అది మంచీ చెడ్డా అని కూడా పట్టించుకోడు. శుభాశుభాలను తానదే పనిగా ఆహ్వానించడు. కాని వాటి పాటికవి దైవికంగా ప్రాప్తిస్తుంటే కంగారు పడడు. అందులో రక్తి చెందడు విరక్తి చెందడు.

నాభి నందతి న ద్వేష్టి – సాధారణంగా ఏదైనా మనకు అనుకూలంగా జరిగితే ఎగిరి గంతులు వేస్తాము. దాన్ని ఎంతో సంతోషంగా స్వీకరిస్తాము. అది మనకు సమకూర్చిన వాణ్ణి ఎంతగానో అభినందిస్తాము. అలాగే ఎవరైనా మనకిష్టం లేని కష్టాన్ని తెచ్చి నెత్తిన పడవేస్తే ఎంత పనికి మాలిన వాడు వీడని కోపంతో వాణ్ణి ద్వేషిస్తాము. అలా తేడా ఎందుకు చూస్తాడు మానవుడు. అందులో ఆత్మ స్వరూపం చూడలేక పోతున్నాడు. అంచేత అవి రెండూ రెండుగా పరస్పర విరుద్ధంగా విషమంగా కనిపిస్తుంటాయి వాడికి. అంచేతనే భరించలేడు ఏది సంభవించినా. ఒక దానికి పొంగిపోతాడు. వేరొక దానికి కుంగిపోతాడు.

పోతే స్థితప్రజ్ఞుడైన మానవుడలా పొంగటం కుంగటం మానేసి విషమంగా కనపడే ఆ భావాలను రెండింటినీ సమంగా చూడగలడు. కారణం రెండింటిలో అధిష్ఠాన రూపంగా ఉన్న ఆత్మనే చూస్తుంటాడు

Dr Dayananda Swamy ebooks



వాడు. అధిష్ఠాన మెప్పుడూ సమమే. దానిమీద ఆరోపిత మైనదే విషమం. బంగారం సమంగానే వ్యాపించి ఉంది ఆభరణాలలో. ఆభరణాలే దేనికది వేరుగా కనిపిస్తాయి. అలాగే సువర్ణం లాంటి ఆత్మనే అన్ని పరిస్థితులలో గట్టిగా పట్టుకొన్నాడో అప్పుడిక తేడా లేదు. ఏదీ విలువ తక్కువదీ గాదు. ఎక్కువదీ గాదు. అన్నీ విలువైనవే. కారణం పరిస్థితులను కాదు వాడు చూడటం. తద్రూపంగా దర్శనమిచ్చే ఆత్మ తత్త్వాన్ని. అదే ఒక రోడ్డు రోలరులాగా అన్ని వైషమ్యాలనూ చదును చేసి ఏకంగా చూపుతుంది.

ఇప్పుడీ శ్లోకంలో రెండవ ప్రశ్నకు కూడా సమాధాన మిచ్చినట్టయింది. ఇదీ దీని తరువాతిదీ ఆ తరువాతదీ కూడా దీనిదే సమాధానం. ఏమిటిది. స్థితధీః కిమ్ ప్రభాషేత – స్థిత ప్రజ్ఞుడైన వాడు స్వయంగా ఏమి జరిగినా అభినందించడు. ద్వేషించడు. అదీ వాడి మాట. తేడా చూస్తే మాట. చూడకుంటే మాటేముంది. మనమే మాట. మాట మౌనంలో కలిసిపోయింది. హానోపాదానాలకు స్వస్తి చెప్పి ఏది జరిగినా అలా భాసిస్తున్నదని చూడటమే మౌనం. ఆత్మ మౌనం గదా. అందుకని చూపు కూడా మౌనమే.

**యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః**

**ఇంద్రియా ణీంద్రియా ర్థేభ్య - స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా - 57**

అందుకే మొదటి రెండు శ్లోకాల్లో ఉచ్యతే ఉచ్యతే అని క్రియా పదం వాడి ఆ తరువాత వచ్చిన శ్లోకాల్లో ఆ పదం లేకుండా మామూలుగా

Dr Dayananda Swamy ebooks

వ్రాశారు వ్యాసభగవానులు. ఒకరు వాణ్ణి గురించి మాటాడితే అది ఉచ్యతే వాడే వాణ్ణి గురించి అయితే మాటాడటమంటూ లేదు - మౌనమేనని మహర్షి ఆశయం. మాటాడక పోవటం వాచికమే గాదు. శారీరకం కూడానని వర్ణిస్తున్నాడిప్పుడు. యదా సంహరతే చాయమ్ - నివృత్తి తప్ప ప్రవృత్తి లేదు జ్ఞానికి. ప్రవృత్తి ఉంటేనే మాట. నివృత్తిలో మాటే ముంది. మౌనమే. ఎలాంటిదా నివృత్తి. ఇంద్రియాణీం ద్రియార్థేభ్యః - తన ఇంద్రియాలను వాటి విషయాలనుంచి ఉపసంహరతే వెనక్కు తీసుకొంటాడట.

ఇంద్రియాలంటే కన్నూ ముక్కూ చెవీ ఇలాంటి జ్ఞానేంద్రియాలూ - కరచరణాదులైన కర్మేంద్రియాలే గాక అంతరింద్రియమైన మనస్సు కూడా. వీటన్నిటికీ ఒక్కొక్క దాని కొక్కొక్క అర్థమని ఉంటుంది. కంటికి రూపం - చెవికి శబ్దం - మనస్సు కాయా విషయాలను గూర్చిన ఆలోచనలూ - ఇలాగ వీటికే విషయాలని **Objects** కూడా నామాంతరం. ప్రతిక్షణమూ ఈ ఇంద్రియార్థాలు మన ఇంద్రియాల నటూ ఇటూ లాగుతూనే ఉంటాయి. విరామమనేది ఎరగడు మానవుడు.

అలా నిర్విరామంగా వీటి వ్యవహారం సాగుతుంటే వాడి ప్రజ్ఞ ఎప్పుడూ స్థిరంగా నిలబడదు. గత ప్రజ్ఞుడే గాని స్థిత ప్రజ్ఞు డనిపించుకోలేదు. అలా అనిపించుకోవాలంటే వాటి నాయా విషయాల మీదికి పరుగెత్తకుండా

Dr Dayananda Swamy ebooks


వెనక్కు మళ్లించాలి. అది ఎలాగని అడిగితే కూర్మోంగానీవ అని గీతోపదేశం. కూర్మమంటే తాబేలు. దానికి రెండు లక్షణాలున్నాయి. తన పాదాలూ తలా బయటికి చాపగలదు. ఏద్దైనా అలికిడి అయితే మరలా లోపలికి తీసుకొని ముడుచుకొని పోగలదు. అప్పుడు దానికే ఉపద్రవమూ లేదు.

అలాగే ఒక జ్ఞాని కూడా తన ఇంద్రియాలను విషయాల మీదినుంచి వెనక్కు మళ్లించుకోగలిగి ఉండాలి. ముందుకూ పోవచ్చు ఇంద్రియాలు - వెనక్కూ రావచ్చు. ముందుకైతే ప్రవృత్తి. వెనక్కైతే నివృత్తి. విషయ ప్రవృత్తి ఎప్పటికైనా ప్రమాదం. అందులో నుంచి నివృత్తి నవలంబిస్తేనే ఎలాటి ప్రమాదమూ ఉండబోదు. ప్రవృత్తి చలనం. అదే మాట. మాట కూడా చలనమే గదా. మనసులో ఆలోచనా చలనమే - నోట వచ్చే మాట చలనమే. ఇంద్రియ వ్యాపారాలూ చలనమే. చలనమే మాట అన్నప్పుడు - అది ఆగిపోవట మచలత్వం - అదే మౌనం. అనాత్మ ప్రత్యయ తిరస్కారస్య పర్యవసానం మౌనమని బృహదారణ్యక భాష్యంలో సెలవిచ్చారాచార్యుల వారు. అనాత్మ భావ మిసుమంత కూడా కనపడక అంతా ఆత్మగా దర్శన మివ్వాలట. అదే మౌనమనే దాని కర్థం.

**విషయా విని వర్తంతే - నిరాహా రస్య దేహినః**

**రస వర్జం రసో ప్యస్య - పరందృష్ట్వా నివర్తతే - 58**

Dr Dayananda Swamy ebooks

ఇప్పుడొక అద్భుతమైన ధర్మసూక్ష్మం సెలవిస్తున్నారు భాష్యకారులు. విషయా లేవీ లోపలికి రానీయకుండా కూర్మం తన అవయవాలను లోనికి తీసుకొన్నట్టు తీసుకోవచ్చు జ్ఞాని కూడా. అలా వెనక్కు తీసుకొన్నప్పటికీ వాటి తాలూకు అభిలాష ఒకటి ఉంటుంది గదా. విషయాలు పోయినా విషయాల మీది చాపల్యమతని మనసులో వాసనారూపంగా చేరి లోలోపల వాణ్ణి పట్టి పీడించవచ్చు గదా. దానికేమిటి పరిహారమని ఆశంక. దానికిస్తున్నది సమాధాన మీ శ్లోకం.

విషయా వినివర్తంతే – నిరాహరస్య దేహినః – విషయాలంటే ఇక్కడ ఇంద్రియాలని అర్థం వ్రాశారాయన. నిరాహారస్య ఆహారమంటే అవి బాహ్యమైన శబ్దస్పర్శాదులు. వాటిని లోపలి కాహ్వానించకుండా వదిలేస్తే నిరాహారుడయి పోతాడు. ఎవడు దేహి. దేహ ధారి అయిన మానవుడు అలాటి వాడు జ్ఞానవంతుడే కానవసరం లేదు. ఒక హఠయోగి కూడా అలాగే ఇంద్రియాలను ప్రయత్నపూర్వకంగా అరికట్టి యోగ సమాధి నవలంబిస్తుంటాడు. మరివాడికీ ఈ జ్ఞానికీ ఏమిటి తేడా. బలవంతంగా ఇంద్రియాల నుప సంహరించటమే జ్ఞానమని చెప్పగలరా అని ప్రశ్న వస్తున్నదిక్కడ.

దానికి గీత ఇస్తున్న సమాధన మేమంటే రసవర్జమ్. రసమంటే రాగం. అంటే అనుభవించాలనే అభిలాష. చాపల్యం. హఠయోగి

Dr Dayananda Swamy ebooks


తాత్కలికంగా ఆపని చేసి కూచున్నా విషయ చాలప్యం పూర్తిగా తొలగిపోదు. కారణం వాడి కాత్మదర్శనం లేదు. ఆత్మ జ్ఞానం లేనంత వరకూ నీవెంత భీష్మించుకొని కూచున్నా వాసనారూపంగా విషయాభిలాష నిన్ను పురుగై తొలుస్తుంటుంది. కనుకనే రసవర్జం అంటున్నాడు గీతాచార్యుడు. యోగికి రాగమింకా మిగిలి ఉంటుంది. ఇంద్రియాలు వాడి కధీనమైనా తద్విషయమైన చాపల్యం మీద వాడి కదుపు లేదు. అది లోపల మెదులుతున్నంత వరకూ పామున్న ఇంట్లో కాపురమున్నట్టే. అదుపు తప్పితే ఎప్పటికైనా పడగ విప్పి కాటు వేసే ప్రమాదముంది.

పోతే ఆత్మ జ్ఞాని అయిన వాడికలాటి ఉపద్రవం కూడా ఉండబోదు. రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే - రసం లేదా రాగమనేది ఏ కొంచెం మిగిలినా పరం దృష్ట్వా - పరమాత్మ స్వరూప మెప్పుడూ అనుభవానికి వస్తుంటుంది కాబట్టి - దాని బలంతో దీన్ని ఊచముట్టుగా త్రోసి పారేయగలడు. ఆత్మచైతన్య మనేది ఒక అఖండమైన ప్రకాశం. అది ఎప్పుడూ వాడి దృష్టిపథంలో ఉండగా వాసనలని చెప్పు - సంస్కారాలని చెప్పు - అవి ఎలా చోటుచేసుకోగలవు. చీకటి లాంటివవి వెలుగులోకి చీకటి ప్రవేశించగలదా. ప్రవేశిస్తే ఏమవుతుంది. వెలుగే అయిపోతుంది. ఇక చీకటి ఎక్కడిది.

**యతతో హ్యపి కౌంతేయ - పురుషస్య విపశ్చితః**

**ఇంద్రియాణి ప్రమాథీని - హరంతి ప్రసభం మనః - 59**

Dr Dayananda Swamy ebooks

అయితే అలాటి స్థితప్రజ్ఞత ఏర్పడాలంటే దానికొక్కటే షరతు. ఆత్మచైతన్య మనేది దేదీప్యమానంగా ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉండాలి. అప్పుడే చీకటిలాంటి రసమనండి. రాగమనండి. వాసన ల నండి. చాపల్యమనండి. ఏదీ కనపడదిక. చీకటి కనిపిస్తే గదా భయపడటానికి. అంచేత ఇంతకూ మేము చెప్ప వచ్చేదేమంటే సమ్యగ్దర్శనాత్మికాయాః ప్రజ్ఞాయాః స్థైర్యం కర్తవ్య మని సలహా ఇస్తున్నారు గురువుగారు.

కాని సమ్యద్దర్శనం స్థిరంగా నిలుపుకోవాలంటే ఒక్కసారిగా అది అలవడటం కష్టం అడుగడుగునా ఇంద్రియాలు మన మార్గంలో దోపిడీ దొంగలలాగా అక్కడక్కడ పొంచి ఉంటాయి. అమాంతంగా వచ్చి పైనబడతాయి. అవి ఇటూ అటూ లాగుతూ పోతే ప్రజ్ఞా స్థైర్యమనేది కలలోని వార్త. మరేమి చేయాలంటారు. చెబుతున్నది గీత. యతతో హ్యాపి కౌంతేయ పురుషస్య విపశ్చితః - నీవెంత పురుషుడవైనా నీకెంత వివేక జ్ఞానమున్నా సమయానికది పనిచేయదు. ఇంద్రియాణి ప్రమాథీని - చక్షురాదీంద్రియాలు సామాన్య మైనవి కావు. బలవత్తర మైనవవి మథించి పారేస్తాయి. దేన్ని. మనః నీ మనస్సును. ప్రసభం. అది కూడా నీకు తెలియకుండానే లాగేస్తాయి. మరలా విషయప్రపంచంలో తీసుకుపోయి పారేస్తాయి. ప్రసభ మంటున్నాడు. వద్దని గీపెట్టుకొన్నా వినవు. బలవంతంగా హరంతి. ప్రక్కకు లాగేస్తాయి. పారేస్తాయి. దేన్ని. మనః చెప్పాము గదా నీమనస్సును.

Dr Dayananda Swamy ebooks


మనస్సు నని పేర్కొంటున్నది గీత. గమనించండి. శరీరంగాదు. కరచరణా ద్యవయవాలు గావు. చక్షురాదీంద్రియాలు గావు. మానవుడంటే వాడి మనస్సే. మన ఏవమను ష్యాణాం కారణం బంధ మోక్షయోః అన్నారు పెద్దలు. ఇటు బంధానికి గానీ అటు మోక్షానికి గానీ మనస్సే సాధనం. దాని విషయంలో పరాకుగా బతికామంటే అది బతుకే గాదు మానవుడికి. జీవచ్ఛవం లాంటి బ్రతుకది. గమ్యమే లేదా జీవితానికి. అంచేత దాని విలువ గుర్తించి దాన్ని అపురూపంగా వాడుకోగలగాలి మానవుడు. అలా వాడుకొంటే అది నీ మోక్షమార్గంలో నీకు ఎంతైనా సహాయపడుతుంది.

అది ఎలాగని అడుగుతావేమో. ఒక నదీ ప్రవాహాన్ని దాని ఇష్టానుసారంగా వదిలేస్తే పోయి సముద్రంలో కలుస్తుంది. నీకుపయోగ పడదు. దానికే పెద్ద ఆనకట్ట కట్టి పంటకాలువలు తీర్చి ప్రవహింపజేస్తే పొలం బాగా పండి ధాన్యం నీ చేతికి వస్తుందని ఇంతకుముందే పేర్కొన్నాము. అలాగే మనస్సును కూడా దాని పాటికి దాన్ని వదిలేస్తే ఎంత దూరమైనా వెళ్లిపోతుంది. ఎక్కడైనా పారేస్తుంది. మరి అది అదుపులోకి రావాలంటే దానికి ముందు చక్షురాది ఇంద్రియాల మీద నిగ్రహముండాలి మనకు. ఇంద్రియాలదుపు తప్పితే అవే మనస్సును కూడా దారి తప్పిస్తాయి. గుమాస్తాలు అధికారిని తప్పు త్రోవ పట్టించినట్టు మనస్సునవి అపమార్గం పట్టిస్తాయి. ఈనాటి టెర్రరిస్టుల లాంటివవి. ఎంత ఆఫీసరునైనా కిడ్నాపు

Dr Dayananda Swamy ebooks

చేసి ఎక్కడో అడవిలో పారేసినట్టు పారేస్తాయీ ఇంద్రియాలనే దుండగీంద్రు మనస్సనే అధికారి నీ సంసారమనే అరణ్యంలో.

**తాని సర్వాణి సంయమ్య - యుక్త ఆసీత మత్పరః**

**వశేహి యస్యేంద్రియాణి - తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా - 60**

కాబట్టి ఇంద్రియాలింత చెడ్డవి. ఎంత దారుణానికైనా తెగిస్తాయి. వాటి కా బల మిచ్చిం ది ఇంద్రియార్థాలే. శబ్ద స్పర్శాదులు. మాత్రా స్పర్శలని ఇంతకు పూర్వమే వర్ణించిందిగా గీత. వాటితో ప్రతిక్షణమూ లావాదేవీ పెట్టుకొంటూ పోతే ఏమవుతుంది. అదను చూచి విరుచుకు పడతాయి. బలవంతంగా మానవుణ్ణి తమకు బానిసను చేసుకొంటాయి. అంచేత అవి మనమీద దాడి చేయకముందే హుషారు పడాలి మనం.

ఎలాగ. తాని సర్వాణి సంయమ్య. వాటి పోకడ కనిపెట్టి ముందుగానే అదుపులో పెట్టుకోవాలి. అలా పెట్టుకోవాలంటే యుక్తః - ఏకాగ్రత ఉండాలి నీకు. ఒక దానిమీద లక్ష్యముంటే గాని మిగతా వాటిని నిర్లక్ష్యంగా చూడలేవు. అలా నిర్లక్ష్య దృష్టితో చూస్తేగాని అవి నీకు వశం కావు. ఆ సీత మత్పరః - అహం వాసుదేవః సర్వ ప్రత్యగాత్మా - పరోయస్య స మత్పరః - మత్పరః అనే దాని కర్థం వ్రాస్తున్నారు గురువుగారు. వసతి దీవ్యతీ తి వాసుదేవః - అస్తి భాతి. సచ్చిద్రూపంగా సర్వత్రా వ్యాపించి ఉన్న ఆత్మ స్వరూపుడే పరాయణం నాకు. న అన్యోఽహం తస్మాత్ - దానికన్నా

Dr Dayananda Swamy ebooks


నేను వేరుగా లేను. ఆ సచ్చిద్రూపమే నా స్వరూపమనే భావంతో ఆసీత - సమహితుడయి ఉండాలట మానవుడు.

వశేహి యస్యేంద్రియాణి - అలా ఉండ గలిగితే ఇంద్రియాలు లేవు ఏమీ లేవు. కుక్కలూ పిల్లుల లాగా అవి నీకు వశవర్తులయి మెలగుతాయి. తోకాడించలేవు. అసలు నీవైపు తేరి చూడటానికే భయపడతాయి. ఏపని అయినా నీవు చేయమంటే చేస్తాయి. లేదంటే మానేస్తాయి. నీ చెప్పు చేతలలో ఉంటాయి. వాటికి నీవు బానిస కావటం లేదు. అవే నీకు బానిస లయి బ్రతుకు తుంటాయి. అసలు వాటికి జ్ఞానమూ పాడా. జ్ఞానమనేది నీ సొమ్ము. నీకొక సంకల్పం కలిగి పురమాయిస్తేనే పనిచేస్తాయి. లేకుంటే చచ్చినట్టు పడి ఉంటాయి. అలాంటి వాటిని చూచి నీవు బెదిరి పోవట మేమిటి. వాటికి దాసోహ మనట మేమిటి. సిగ్గు చేటు. కాబట్టి అవి నీమీద గాదు నీవు వాటి మీద అధికారం కొనసాగించి నప్పుడే ప్రజ్ఞా ప్రతిష్ఠితా. ప్రజ్ఞ ప్రతిష్ఠ చెందుతుంది.

ఇది మనమింతకు ముందు పేర్కొన్న ప్రశ్నలలో మూడవదానికి జవాబు. కిమా సీత అని గదా మూడవ ప్రశ్న. స్థిత ప్రజ్ఞు డెలా ఉంటాడని అడిగితే ఇలా ఉంటాడని సమాధాన మిస్తున్నదీ శ్లోకం. యుక్త ఆసీత అని నిత్యమూ తన జాగ్రత్తలో తానుంటాడు.

Dr Dayananda Swamy ebooks


**ధ్యాయతో విషయాన్ పుంస - స్సంగ స్తేషూ పజాయతే**

**సంగా త్సంజాయతే కామః - కామా త్క్రోధోభిజాయతే**

**క్రోధా ద్భవతి స మ్మోహః - సమ్మోహాత్ స్మృతి విభ్రమః**

**స్మృతి భ్రంశా ద్బుద్ధినాశో - బుద్ధినాశా త్ప్రణశ్యతి - 61**

అసలీ ఇంద్రియాలేమిటి. ఇవి మనలను పట్టి చూడటమేమిటి. వీటి కింత ప్రభావమెక్కడి నుంచి వచ్చింది. ఎవరిచ్చారు. అవి అచేతనం - వాటి కేలాటి సంకల్ప శక్తీలేదని గదా పేర్కొన్నారు. మరి అలాంటప్పు డింత అనర్థాని కేమిటి మూలకారణ మని ప్రశ్న వచ్చింది. అది ఇప్పుడు పూస గుచ్చినట్లు వర్ణించి చెబుతున్నారు వ్యాసమహర్షి

ధ్యాయతో విషయాన్ పుంసః - పురుషుడే మూల మీ అనర్థాని కంతటికీ మరేదీ గాదు. అంతో ఇంతో జ్ఞానమున్నది వీడికే. వీడి మిడిమిడి జ్ఞానంతో ధ్యాయతః ఆలోచిస్తుంటా డెప్పుడూ. ఆలోచించటమే వీడి పని. అదైనా ఏది ఆలోచించాలో అది ఆలోచించినా మంచిదే. అలా కాదు. విషయాన్ శబ్ద స్పర్శాదులైన బాహ్య విషయాలను గురించే అన్ని ఆలోచనలూ. కన్ను రూపాన్నీ చెవి శబ్దాన్నీ నాలుక రుచులనూ ఇలాగా. అందులోనూ ఆలోచన చేసేది ఒకే ఒక మనస్సయితే దాని ద్వారాలు అయిదు. ఆ అయిదింటికీ కనిపించేవి శబ్దాదు లయిదని పేరే గాని అవి ఒక్కొక్కటీ అనంతానంతమైన అవతారా లెత్తి కమ్ముకొంటాయి.

Dr Dayananda Swamy ebooks



అలా కమ్మే కొద్దీ సంగస్తేషూ పజాయతే. వాటిలో తగులు కొంటాడు. అవి పొందాలనే ఆసక్తే అందులో తగులుకోటం. సంగా త్సం జాయతే కామః - ఆసక్తి ఏర్పడే కొద్దీ వల్లమాలిన కోరికలు గుఘ్బాలలాగా పరుగెడు తుంటాయి వాటి నెప్పుడెప్పుడు వాటేసుకొందామా అని. కామాత్ క్రోధోభి జాయతే కోరికలనేవి అక్కడి కాగవు. ఎలాగైనా అవి నాకే దక్కాలని మరెవరికీ దక్కగూడదని స్వార్ధం పెరుగుతుంది. కాని నీ పక్కవాడు కూడా స్వార్ధపరుడనే సత్యం నీవు మరచిపోతున్నావు. వాడూ తనకే కావాలని దానిమీద చేయి వేశాడో అది నీవు భరించలేవు. వాడిమీద కోపం పెంచుకొంటావు.

క్రోధా ద్భవతి సమ్మోహః కోపం బాగా పెరిగిపోయిందో సమ్మోహానికి వశమై పోతావు. కార్యాకార్య వివేకం కోలుపోవటమే సమ్మోహం. **Lack of Wisdom** యుక్తాయుక్త వివేక మెప్పుడు తొలగిపోయిందో స్మృతి విభ్రమః - నీకున్న స్మృతి కాస్తా నశిస్తుంది. స్మృతేమిటి. స్మృతి అంటే అర్ధం చెబుతున్నారు భగవత్పాదులు - శాస్త్రాచార్యోపదేశాహిత సంస్కార జనితమని. అంతకు ముందు ఎంతో కాలం శాస్త్రాధ్యయనం చేసి ఉంటావు. ఎంతోమంది సద్గురువుల నాశ్రయించి వారివల్లా అనుభవ రహస్యాలెన్నో గ్రహించి ఉంటావు. తద్వారా ఎంతో సంస్కారం పోగు చేసుకొని ఉంటావు. అది నీకు స్మృతి పథంలో మెదులుతూ ఉంటుంది. అది కాస్తా ఇప్పుడీ సమ్మోహం వల్ల ఏ మాత్రమూ పైకి రాక అడుగంటి పోతుంది.

Dr Dayananda Swamy ebooks

స్మృతి భ్రంశా ద్బుద్ధినాశః - అలాంటి బంగారంలాంటి ఆత్మస్మృతినే ఎప్పుడు కోలుపోయాడో మానవుడిక. వాడికి బుద్ధే పనిచేయదు. వివేచన చేసే శక్తే లేకుండా పోతుంది. బుద్ధి జీవుడని పేరు మానవుడికి. సృష్టిలో మరి దేనికీ లేని బుద్ధి అనే నిక్షేపం వీడికి ప్రసాదించాడు ఈశ్వరుడు. అమూల్యమైన ఆ ధనాన్ని జారవిడుచు కొన్నాడంటే ఏమని పేర్కొనాలి వాణ్ణి. బుద్ధినాశా త్ప్రణశ్యతి. బుద్ధి నశిస్తే ఇక మానవుడే నశించినట్టు. వాడిక లేడు. వ్రాస్తున్నారు భగవత్పాదులు వినండి.

తావదేవహి పురుషః యావదంతః కరణం తదీయం కార్యాకార్య వివేక యోగ్యం. తదయోగ్యత్వే నష్ట ఏవ పురుషో భవతి. అతస్త స్యాంతః కరణస్య బుద్ధేర్నాశా త్ప్రణశ్యతి. పురుషార్థా యోగ్యో భవ తీత్యర్థః. ఎంతవరకీ మానవుడి బుద్ధి కార్యాకార్య వివేచనా సమర్థమయి ఉంటుందో అంతవరకే వీడు మానవుడు. అలాంటి యోగ్యత వీడి బుద్ధికెప్పుడు నశించిందో అప్పుడే వీడు నష్టమయి పోయాడు. నష్టమయ్యాడంటే అసలే కన్నుమూశాడని కాదు. పురుషార్థ సాధనకే పనికి రాకుండా పోతాడు. అంటే బ్రతికి ఉన్నా చచ్చిన వాడితో సమానం.

**రాగద్వేష వియుక్తైస్తు - విషయా నింద్రియై శ్చరన్**

**ఆత్మవశ్యై ర్విధేయాత్మా - ప్రసాద మధిగచ్ఛతి - 62**

Dr Dayananda Swamy ebooks

మానవుని సకలానర్థాలకూ మూలమింతకూ విషయాభి ధ్యానమని వర్ణించింది గీత. దానివల్ల కలిగే నష్టం కూడా చెప్పింది స్పష్టంగా. పోతే ప్రస్తుతం దానికి భిన్నంగా మోక్ష కారణ మేమిటో ఆ విషయాన్ని వర్ణిస్తున్నది. రాగద్వేష వియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ - ఇంద్రియార్థాలైన శబ్ద స్పర్శాదుల ఆలోచనే అనర్థానికి కారణమని చెప్పామంటే అసలు ఆలోచనే మానేసి కూచోమని కాదు అర్థం. కాకపోయినా ఏ ఆలోచనా లేకుండా ఒక్క క్షణమైనా కూచోలేవు. ఆ విషయమిక చెప్పబోతుంది కూడా గీత. నీవొక వేళ అలా కూచుందా మనుకొన్నా కూచోనివ్వదు ప్రకృతి. నీచేత బలవంతంగానైనా పని చేయిస్తుంది. అంచేత అదిగాదు శాస్త్రం నీకు బోధించదలచిన విషయం.

అయితే మరేమిటి. విషయా నింద్రియైశ్చరన్ శబ్దస్పర్శాదులైన ఇంద్రియ విషయాల నింద్రియాలతో ఆలోచించు. అనుభవించు. కాదనలేదు. కాని రాగద్వేష వియుక్తైస్తు. ఆ ఇంద్రియాలను బాగా శుద్ధి చేసుకొని ఆ తరువాత అనుభవించు. సహజంగా అవి పరిశుద్ధమైనవి కావు. రాగద్వేషాలనే కాలుష్య ముంటుంది కావలసినంత. అవే నడుపుతుంటాయి మనస్సును గాని ఇంద్రియాలను గాని. అది వెనకాల జేరి ప్రేరణ చేస్తుంటే ఇవి విషయాల మీదికి లంఘిస్తుంటాయి. అంచేత అన్నిటికంటే ముందు మానవుడీ రాగద్వేషాలను కడిగిపారేయాలి. కడిగేస్తే పరిశుద్ధ మవుతాయి నీ అంతరింద్రియమూ బహిరింద్రియాలూ.

Dr Dayananda Swamy ebooks

పరిశుద్ధమైతే అప్పుడిక మనసు ధ్యానించినా పరవాలేదు. ఇంద్రియాలు విషయాల మీదికి ప్రసరించినా ఇబ్బంది లేదు. ఎంచేతనంటే ఆత్మవశ్యైః అవి నీకు వశమై ఉంటాయి. నిన్ను మించి పోవు. విధేయాత్మా అంతేకాదు - ఆత్మ కూడా నీకు విధేయమై మెలగుతుంది. ఆత్మ అంటే మనస్సని వ్రాస్తున్నారు భాష్యకారులు. అది నీవెలా నడిపితే అలా నడుచుకొంటుంది. అంటే ఏమని అర్థం. నీవీ విషయాలను గురించి ఆలోచించినా ఆ రూపంలో నీ ఆత్మే పరుచుకొని ఉన్నదని దర్శిస్తుంటావు. అదే ఈ శబ్దాది రూపాల్లో దర్శన మిస్తున్నట్టు ఎప్పుడు భావించావో అప్పుడిక విశేషాకారంగా కనిపించవవి. దేనిమీదా రాగం లేదు. దేనిపైనా ద్వేషం లేదు. అన్నీ నీకు సమానంగా భాసిస్తాయి.

అలా భాసిస్తే చాలు. ప్రసాద మధి గచ్ఛతి - ప్రసాదమంటే నిర్మలత్వం. స్వస్థత. అలాంటి స్తిమితతా నిర్లిప్తతా అధిగచ్ఛతి అందుకొంటుంది నీ అంతఃకరణం. ఇక్కడికి నాలుగవ ప్రశ్నకు కూడా సమాధానం వచ్చింది. వ్రజేత కిమ్మని గదా ఆ ప్రశ్న. ఏది పొందుతాడీ స్థిత ప్రజ్ఞుడని అడిగాడు అర్జునుడు. అధిగచ్ఛతి అనేది దానికి జవాబు. అధిగచ్ఛతి అంటే పొందుతాడనే అర్థం. ఏమిటా పొందేదంటే ప్రసాదం. నైర్మల్యం. రాగద్వేషాలు **Likes and Dislikes** రెండూ లేవు కాబట్టి ఉదాసీనంగా మారిపోతుంది మానవుడి మనస్సు. ఉదాసీనమే ఆత్మ స్వరూపం కనుక మనసప్పుడు మనసు కాదు. ఆత్మేనని భావం.

Dr Dayananda Swamy ebooks



**ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోప జాయతే**

**ప్రసన్న చేత సో హ్యాశు - బుద్ధిః పర్యవ తిష్ఠతే - 63**

ఇంతకూ ప్రసాదమనే గుణం మనసు కెప్పుడేర్పడుతుందో అప్పుడిక చెప్పనక్కర లేదు. సర్వదుఃఖానాం హాని రస్యోప జాయతే. అలాంటి జ్ఞానికిక ఏ దుఃఖమూ ప్రాప్తించదు. అన్ని దుఃఖాలూ అక్కడికి సమసిపోవలసిందే. ఆధ్యాత్మికాది తాపాలే గదా దుఃఖాలంటే. అవి ఏవీ వాడిమీద దాడి చేయవు. ఏమి కారణం. ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవ తిష్ఠతే. వాడి అంతఃకరణం ప్రసన్నమయి ఉంటుంది. అంటే స్వస్థత చెంది ఉంటుంది. స్వస్థత లేకపోవటానికి కారణం రజస్తమో మాలిన్యమే. దానివల్లనే ఆవరణ విక్షేపాలనే దోషాలు మనసు కేర్పడుతుంటాయి. అవి ఈ జ్ఞానికి పూర్తిగా క్షాళితమై పోయాయి కాబట్టి బుద్ధిః పర్యవ తిష్ఠతే ఆకాశంలాగా వాడి బుద్ధి అంతటా నిండిపోయి నిలకడ కలిగి ఉంటుంది. నిలకడ చెందిన బుద్ధి ఆత్మస్వరూపమే నంటారు భగవత్పాదులు.

బుద్ధి బుద్ధేగదా అది ఆత్మ ఎలా అవుతుందని చాలామంది కిక్కడ సందేహం. బుద్ధికీ ఆత్మకూ వస్తుతః భేదం లేదు. బుద్ధి జ్ఞానస్వరూపమే ఆత్మా జ్ఞాన స్వరూపమే. అయితే తేడా ఎంతవరకంటే బుద్ధిలో జ్ఞానం వృత్తిరూపంగా మారుతుంటుంది. అవి తరువాత వాసనలను సృష్టిస్తాయి. ఆ వాసనలు పొరలు పొరలుగా పేరుకు పోతుంటాయి బుద్ధిలో. వాసనలు పోవాలంటే బుద్ధి మొదట వృత్తిరూపంగా మారకూడదు. వృత్తులుగా

Dr Dayananda Swamy ebooks


మారకుండా పోవాలంటే అది - నేను కర్తనూ భోక్తనూ గాను కేవలం సాక్షి నేనని తన స్వరూపాన్ని తాను గుర్తు చేసుకోవాలి. అలా గుర్తు చేసుకొన్న మరుక్షణ మది ఆత్మే మరేదీ గాదు.

అంచేత సవికల్పమైన ఆత్మ మనసూ - నిర్వికల్పమైన మనసే ఆత్మ అన్నారు అనుభవజ్ఞులైన పెద్దలు. సవికల్పమైతే అది వాయువులాగా ఇటూ అటూ కదులుతూ ఉంటుంది.

అప్పుడా జ్ఞానం బుద్ధి. నిర్వికల్పమైతే కదలకుండా ఆకాశంలాగా స్తిమితంగా ఉండిపోతుంది. అప్పుడా జ్ఞానమాత్మ. కాబట్టి జ్ఞానరూపంగా చూస్తే ఒక్కటే. వేరుగాదు. అందుకే బుద్ధిరాత్మ స్వరూపే ణైవ నిశ్చలీ భవతి అని వర్ణించారు భాష్యకారులు.

**నాస్తి బుద్ధి రయుక్తస్య - నచాయుక్తస్య భావనా**

**న చాభావయతః శాంతి - ర శాంతస్య కుత స్సుఖమ్ - 64**

ఈ ప్రకారంగా మనసు ప్రసన్నమైతే చాలు. అదే కృతార్థత జీవితానికి. అలాంటి దశ సాధకుడికి అబ్బాలంటే మాటలుగాదు. మొదటినుంచీ అంచెలవారిగా సాధన చేస్తూ రావాలి. రాగద్వేషరహితమైన ఇంద్రియ వ్యాపారాలతో కేవల మవసరమైన ఇంద్రియార్థాలనే అనుభవిస్తూ పోవాలి. అలా అనుభవించేటప్పుడు ఇదంతా ఆత్మ చైతన్య ప్రకాశమే ఇన్ని రూపాలలో నా అనుభవానికి వస్తూ ఉందనే అఖండాత్మ భావన ఏమరగూడదు.

Dr Dayananda Swamy ebooks


ఆత్మ భావన అనేది అంత సులభంగా పట్టుపడదు. నాస్తి బుద్ధి రయుక్తస్య – సమాధి లేనివాడికది ఏమాత్రమూ అలవడదు. సమాధి అంటే ఏదో గాదు. తదేకాగ్రమైన దృష్టి. అప్పుడే సర్వత్రా పరుచుకొన్న ఆత్మ అనే అధిష్ఠానం **Base** వాడి దృష్టికి గోచరిస్తుంది. న చా యుక్త స్యభావనా అసలు ఏకాగ్రతలేని వాడికాత్మ జ్ఞానం తాలూకు అభినివేశమే కలగదు. అలాగే నచాభావయత శ్శాంతిః – జ్ఞానంలో అభినివేశం **Intensive feeling** పెట్టుకోని వాడికి శాంతి అసలే లేదు. అశాంతస్య కుతస్సుఖమ్. మరి శాంతికి నోచుకోని వాడు సుఖాన్ని ఎలా ఆశించగలడు. శాంతము లేక సౌఖ్యము లేదన్నారు పెద్దలు.

దీనిమీద భాష్యం వ్రాస్తున్నారు భగవత్పాదులు వినండి. ఇంద్రియాణాంహి విషయసేవా తృష్ణాతః నివృత్తి ర్యా తత్సుఖమ్. ఇంద్రియాల కాయా విషయాలను సేవిద్దామనే తృష్ణ వల్ల కలిగే సుఖం సుఖం కాదు. ఆ భావం నుంచి తొలగినప్పుడే సుఖం. అంతేగాని నవిషయ విషయా తృష్ణా. విషయాల వెంటపడి పోవటం కాదు. సుఖంగా కనిపిస్తున్నా విషయ జన్యమైన సుఖం సుఖం కాదు. దుఃఖమేవ హిసా అది కేవలం దుఃఖమే. ఎందుకంటే న తృష్ణాయాం సత్యాం సుఖ స్యగంధ మాత్ర మ ప్యుపపద్యతే. విషయాలు ఒకటి గాదు. రెండుగాదు. ఎడతెగకుండా మనలను భ్రమ పెడుతూనే ఉంటాయి. తృష్ణ కూడా దానితో పాటు

Dr Dayananda Swamy ebooks

ఎడతెగ కుండా పెరిగిపోతూనే ఉంటుంది. తృష్ణ అనేది తీరితే సరిపోయె గాని ఇలా తెగకుండా సాగుతూ పోతే శాంతి ఎలా లభిస్తుంది మానవుడికి - అని ప్రశ్నిస్తున్నారు ఆచార్యుల వారు. కనుక శాంతి సౌఖ్యాలకు నోచుకోవాలంటే ఇంద్రియాల కుండే విషయవాంఛలను ముందు అదుపులో పెట్టుకోక తప్పదు.

**ఇంద్రియాణాం హిచరతాం - యన్మనోను విధీయతే**

**తదస్యహ రతి ప్రజ్ఞాం - వాయుర్నావ మివాంభసి - 65**

లక్ష్యం మీద బుద్ధి కేకాగ్రత లేకపోతే ఆ బుద్ధికి ప్రసాద గుణమబ్బదని ఇంతకు ముందు పేర్కొన్నారు గదా. దానికి కారణమేమని ప్రశ్న వస్తే చెబుతున్నది గీత – ఈ ఇంద్రియాలే దానికి మూలకారణమని. ఎలాగంటే ఇంద్రియాణాం హి చరతాం యన్మనోను విధీయతే. చక్షురాదీంద్రియాలు వాటి వాటి క్షేత్రాలలో ప్రవర్తిస్తున్నప్పుడీ మనస్సు ఊరక కూచోదు. ఇది కూడా వాటి వెంటబడి పోతుంటుంది.

పడిపోవట మంటే ఏమిటి. ఇంద్రియ విషయా లైదే అయినా అనంత కోటి అవతారాలెత్తు తుంటాయవి. వాటినన్నింటినీ ఆ ఇంద్రియా లాకళించుకోవాలని చూస్తుంటే వాటి ద్వారా అన్నింటినీ అనుభవిస్తే బాగుండునని మనసు పరిపరివిధాల పోతుంటుంది. నిర్వికల్ప స్థితి తప్పి మనసెప్పటి కప్పుడు సవికల్పంగా మారిపోతుంది. నిర్వికల్పమంటే అది

Dr Dayananda Swamy ebooks



ఒకటే గాని ఈ వికల్పా లొకటిగాదు. అనేకం. రజ్జువు ఒకటే అయినా సర్పధారా దండాదులుగా వికల్పిత మయినప్పుడ నేక రూపాలు ధరించటం లేదా అది. అలాగే మనసు నానావిధాలుగా మారిపోతుంటుంది.

ఇలా ఎప్పటికప్పుడు మారిపోయే మనసు తన ఆత్మనెలా పట్టు కోగలదు. మనసే ఆత్మ అని చెప్పాము మంచిదే. కాని ఎప్పుడవుతుందాత్మ. ప్రసన్నమూ స్థిరమూ అయినప్పుడు. అలా కాకుండా అది ఎంత జ్ఞాన స్వరూపమైనా ఆత్మను పట్టుకోట మసాధ్యం. కారణ మాత్మ ఎప్పుడూ నిశ్చలమైన జ్ఞానం. మనసో చంచలమైన జ్ఞానం. జ్ఞానం జ్ఞాన మొకటే అయినా చలా చల లక్షణాలలో బ్రహ్మాండమైన తేడా వచ్చి పడింది.

కనుకనే తదస్య హరతి ప్రజ్ఞామ్. ఆత్మను పట్టుకోటం దేవుడెరుగు. ప్రజ్ఞనే అది సమూలంగా పెకలించి దూరంగా పారేస్తుంది. ఆత్మానాత్మ వివేక జ్ఞానమే ప్రజ్ఞ అంటే. అలాటి ప్రజ్ఞాధనం దీనికి దక్కకుండా పోతుంది. దానికి కారణం దొంగలతో చేతులు కలిపి ఇది గజదొంగ అయిపోవటమే. దొంగలెవరు. ఇంద్రియాలు. వాటి కధికారి అయిన మనసు తన హోదా కాపాడుకొంటే దొర అనిపించుకోగలదు గాని వాటి స్థాయికి దిగజారి తానూ దొంగ సొమ్ము పోగు చేసుకొంటే ఏమవుతుంది. దొంగ సొమ్ము దొంగ సొమ్మే. అది కొంప ముంచుతుం దెప్పటికైనా.

Dr Dayananda Swamy ebooks

ఇది ఎలాటిదంటే వాయుర్నావమి వాంభాసి. ఒక పడవ సముద్రంలో పయనిస్తున్నది. వాయువను కూలంగా వీస్తుంటే పరవాలేదు. తీరం దాకా క్షేమంగా వెళ్లగలదది. అలాకాక ప్రతికూలమైన ఝంఝా మారుతం వీస్తూంటుం దను కోండి. అది దాన్ని తీసుకుపోయి దూరంగా పారేస్తుంది లేదా సముద్రంలోనే ముంచి పారేస్తుంది. ఇక తీరం చేరే దేముందా నావ. అలాగే ప్రతికూల వాయువులయి కూచున్నాయి ఈ చక్షురా దీంద్రియాలు. ఆత్మ తీరాన్ని చేర్చటానికి బదులిది మనస్సనే నావ న నాత్మ ప్రపంచ సాగరంలో ముంచేస్తాయి.

**తస్మా ద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః**

**ఇంద్రియా ణీంద్రియార్థేభ్య - స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా - 66**

అంచేత ఇలాంటి ఉపద్రవం దాపురించకుండా మానవుడు క్షేమంగా ఈ సంసార సాగరంలో నుంచి బయట పడాలంటే ఆత్మాభిముఖంగానే సాగించాలి ప్రయాణం. అలా సాగించాలంటే దానికేకైక సాధనమైన మనస్సు నదుపులో పెట్టుకోవాలి. మనసు నదుపు చేయాలంటే అంతకు ముందీ ఇంద్రియాల నయిదింటినీ అరికట్టుకొంటూ రావాలి. తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః స్పర్శాదులే ప్రమాదకరం. వాటిలో ఈ ఇంద్రియా లెంతవరకో అంతవరకే గాని అతిగా ప్రవర్తించగూడదు.

Dr Dayananda Swamy ebooks



అలా ప్రవర్తించటం మూలాన్నే మనసును కూడా తమ వెంట లాక్కొని పోతున్నాయి. వాటి వెంటబడి పోతూ మనసు కూడా ఆత్మాజ్ఞానానికి దూరమయి దెబ్బతింటున్నది. కనుక ఇంద్రియార్థాల మీదికి విచ్చల విడిగా పరుగెత్తకుండా ముందు మన ఇంద్రియాలను వెనక్కు మళ్లించాలి మనం. లేకుంటే అవీ మన వశంలో ఉండవు. వాటి వెంట పరుగెత్తే మనసూ మన మాట వినదు. ఇది ఆ రెండూ విషయాల మీదికి పరుగెత్తిపోతే మానవుడికి కలిగే అనర్థం. పోతే ఆ రెండింటినీ నిగ్రహించ గలిగితే అదే మనకాత్మ జ్ఞానమనే ధనాన్ని పోగు చేసుకోటానికెంతైనా తోడుపడతాయి. అది గొప్ప పురుషార్థం.

ప్రస్తుత మీ రెండు శ్లోకాలలో దొరలిన భావాలు మనకు కఠోప నిషత్తులో వర్ణించిన సాధన మార్గాన్ని కండ్లకు కట్టినట్టు చూపుతున్నాయి. ఇంద్రియాలూ మనస్సూ మనకు ప్రతికూలంగా నడిస్తే ఎలా ఉంటుందో వర్ణించి - అవే అనుకూలమైతే ఎలా మనకుపయోగ పడతాయో బ్రహ్మాండంగా వర్ణిస్తుందుపనిషత్తు.

**యస్త్వ విజ్ఞాన వాన్ భవ - త్యయుక్తేన మనసా సదా**

**తస్యేంద్రియాణ్యవశ్యాని - దుష్టా శ్వా ఇవ సారథేః - 67**

ఇంద్రియాలనేవి గుఱ్ఱాలలాంటివి. అవి మన వశంలోలేక - మన మనసు కూడా వాటి వశంలోబడి పోయిందో దాని ఫలితమేమిటో తెలుసా.

Dr Dayananda Swamy ebooks

**నస తత్పద మాప్నోతి - సంసారం చాధి గచ్ఛతి**

సంసారమే వాడికి గతి - ఆ పరమ పదమందు కోటం కలలోని వార్త.

పోతే ఇక ఆ ఇంద్రియాలూ ఆ మనస్సే -

**యస్తు విజ్ఞాన వాన్ భవతి - యుక్తేన మనసా సదా**

**తస్యేంద్రియాణి వశ్యాని - సదశ్వా ఇవ సారథేః - 68**

ఇంద్రియాశ్వాలను వశంలో ఉంచుకొని తానూ సాధకుడైన జీవుడి కనుకూలంగా ప్రవర్తించిందో - అప్పుడెలాంటి సత్ఫలిత మేర్పడుతుందో తెలుసా.

**సోఽధ్వనః పారమాప్నోతి - తద్విష్ణోః పరమం పదమ్**

వాడీ సంసార మార్గానికి గమ్యమేదో అది అందుకొంటాడు. అదే వైష్ణవమైన మోక్షస్థానం. విష్ణువంటే ఇక్కడ విష్ణుదేవుడని కాదు. విష్ణ వ్యాప్తౌ అని ధాతువు. సర్వవ్యాపకమైన ఆత్మస్వరూపమే విష్ణువనే మాట కర్థం. అదే ఈ సాధకుడు తన స్వరూపంగా అనుభవానికి తెచ్చుకోగలడని భావం.

**యా నిశా సర్వ భూతానాం - తస్యాం జాగర్తి సంయమీ**

**యస్యాం జాగ్రతి భూతాని - సానిశా పశ్యతో మునేః - 69**

Dr Dayananda Swamy ebooks


ఈ విధంగా పంచేంద్రియ వ్యాపారాలనూ మనో వ్యాపారాన్నీ అన్నింటినీ బహిర్ముఖంగా ప్రసరించకుండా అంతర్ముఖం చేసుకొని తన ఆత్మ స్వరూపాన్ని తాను గుర్తించి అందులోనే నిలకడ చెందిన స్థిత ప్రజ్ఞుడికిక అజ్ఞాన మనేది ఏ కోశానా లేదు. అజ్ఞాన స్పర్శ కూడా లేని ఆస్థిత ప్రజ్ఞుడి వ్యవహారమెలా ఉంటుందో – మిగతా అజ్ఞులైన లోకులకూ వాడికీ ఉన్న తేడా ఏమిటో – ఇప్పుడు గీత మనకద్భుతంగా వర్ణించి చెబుతున్నది. యా నిశాసర్వ భూతానాం – తస్యాం జాగర్తి సంయమీ. మామూలు మానవుడేది రాత్రి అనుకొని చూస్తాడో – జ్ఞాని కది కేవలం పగలు. యస్యాం జాగ్రతి భూతాని – సానిశా పశ్యతో మునేః – మరి వాడేది పగలుగా భావిస్తాడో అది జ్ఞాని అయిన వాడికి రాత్రి. ఇదీ ఈ శ్లోకాని కర్థం.

ఎంత విడ్డూరంగా ఉన్నదీ భావం మనం వింటుంటే. అందరూ లోకంలోనే బ్రతుకు తున్నప్పు డొకడికి రాత్రి అయి మరొకడి కది పగలెలా అవుతుంది. అలాగే ఒకడికి పగలయి ఇంకొకడి కదే రాత్రి ఎలా అవుతుంది. లోకానుభవానికే విరుద్ధం గదా ఇది. పగలు పగలే రాత్రి రాత్రే. ఎవడికైనా అలాగే కనిపించాలి కాలం. ఒకడి కొకటీ ఒకడి కొకటీ కనిపించటమ సంభావ్యం.

Dr Dayananda Swamy ebooks

అయితే ఏమిటీ మాట. ఎందుకు చెప్పినట్టిది గీత. భగవద్గీత వంటి శాస్త్రగ్రంధమిలా పరస్పర విరుద్ధమైన భావం లోకులకు బోధించట మేమి బాగు. పగలు రాత్రి అనే శబ్దాల కిక్కడ అహో రాత్రా అని వాచ్యార్థం కాకుండా జ్ఞానమూ అజ్ఞానమని లక్ష్యార్థం **Metaphorical** చెప్పుకొంటే సరిపోతుందని దీనికి పరిహారం చెబుతారు కొందరు. కాని అది కూడా చెల్లే వ్యవహారం కాదు. ఎందుకంటే ఒకరికి పగలైనది ఒకరికి రాత్రి అన్నప్పుడు రాత్రి పగలనే రెండు భావాలూ ఇద్దరికీ ఉన్నట్టు చెబుతున్నది గీత. అప్పటికి ఇద్దరికీ జ్ఞానా జ్ఞానాలు రెండూ వర్తించవలసి ఉంటుంది. అలాంటప్పుడిక లౌకికుడి కంటే జ్ఞానికి విశేషమేముంది. ఓడిందెవడంటే గెలిచిందెవడని పండిత పామరు లిద్దరూ సమానమయి కూచున్నారు.

కాబట్టి అహో రాత్రాలనే మాటలకిక్కడ చెప్పవలసిన అర్థం జ్ఞాన మజ్ఞాన మని కాదు. మరేమిటి. రాత్రి అంటే పరమాత్మ తత్త్వ మన్నారు భగవత్పాదులు. రాత్రి లాగా అంతా మన కగమ్య గోచరం కాబట్టి పరమాత్మను రాత్రితో పోల్చటం జరిగింది. లోకులందరికీ ఇలా రాత్రిలాగా పరమాత్మ అంతుపట్టకపోయినా మహాజ్ఞానికి మాత్ర మాతత్త్వం పట్టపగలు లాగా ఎక్కడబడితే అక్కడ దర్శన మిస్తుంటుంది. ఇది ఎలాంటిదంటే ఒక గుడ్లగూబే ఉంది. దానికి పగటివేళ కండ్లు కనిపించవు. మనందరికీ ఎంతో

Dr Dayananda Swamy ebooks



స్పష్టంగా ప్రతి ఒక్కటీ కనిపిస్తున్నప్పుడే అది ఏ ఒక్కటీ చూడలేని దుర్దశలో ఉంటుంది. మనకు పగలైతే దానికదే రాత్రి.

అలాగే ఒక స్థితప్రజ్ఞుడి కెంతో స్పష్టంగా సూర్యరశ్మిలో మాదిరి కనిపించే ఆ బ్రహ్మ చైతన్యం - గుడ్ల గూబలలాంటి మందదృష్టిగల లోకులకే మాత్రమూ గోచరించటం లేదు. గుడ్లగూబకు సౌర తేజస్సే తమస్సులాగా భాసించినట్టు మనందరికీ ఆ బ్రహ్మ చైతన్య ప్రకాశమే అచేతనమైన జగత్తయి కూచుంది.

పోతే ఇక మన మందరమూ పగలని ఏది చూస్తామో అది బ్రహ్మవేత్తకు రాత్రి అట. దీని కేమి టర్థం. పగలంటే ఇక్కడ నిజంగా పగలు కాదు పగలని మనం భ్రమ పడుతున్నది. అది ఏదో గాదు. ఈనామ రూపాత్మకమైన ప్రపంచం. ఇది మన చుట్టూ పరుచుకొని కనిపిస్తుంటే నిజంగానే ఇది ఒకటుందని చూస్తూంటాము. అది కనిపిస్తూ మనం దాన్ని చూస్తూ ఉంటాము. కాబట్టి పగలనే మన నమ్మకం. వాస్తవంలో ఇది పగలుగాదు రాత్రి. అంటే మనమున్నాయని చూచే చరాచర పదార్థాలు నిజంగా లేవక్కడ. లేని ప్రపంచాన్నే మన అజ్ఞానం వల్ల ఉన్నట్టు దర్శిస్తున్నాము. దానితో వ్యవహరిస్తున్నాము.

ఇది ఎలాంటిదంటే ఒక స్వప్న దృక్కు అనుభవం వంటిదని సెలవిస్తారు భాష్యకారులు. స్వప్నంలో మనమెన్నో చిత్ర విచిత్రమైన దృశ్యాలు

Dr Dayananda Swamy ebooks


చూస్తుంటాము. ఎంతమందితోనో వ్యవహరిస్తుంటాము. అదంతా తాత్కాలికంగా పగలనే మనభావన. అంత మాత్రాన అది యధార్థమైన పగలు కాదు గదా. రాత్రి కాలాన్నే పగలుగా భ్రమపడి చూస్తుంటాడు స్వప్న దృక్కు. వాడిలా చూస్తున్నా ప్రక్కనే మేలుకొని పనులు చేసుకొనే వేరొకడి కది రాత్రి కాలమే. పగలు కాదు. ఇక్కడ కలగనే వాడికి రాత్ర పగలైనా మేలుకొన్న వాడికది ఎలా రాత్రి కాలమో - అలాగే అజ్ఞాని ప్రపంచమని చూస్తున్నది జ్ఞానికదంతా బ్రహ్మమే.

దీనిని బట్టి తేలిందేమంటే జ్ఞానికి బ్రహ్మమూ బ్రహ్మమే. ప్రపంచమూ బ్రహ్మమే. అజ్ఞానికి బ్రహ్మమూ ప్రపంచమే. ప్రపంచమూ ప్రపంచమే. అంటే జ్ఞాని కహోరాత్రాలూ బ్రహ్మమే కనిపిస్తుంటే అజ్ఞానికి ప్రపంచమే గోచరిస్తుంటుంది. వాడి కంతా బ్రహ్మమే. వీడికంతా ప్రపంచమే. ప్రపంచం కూడా వాడికి బ్రహ్మమే. బ్రహ్మం కూడా వీడికి ప్రపంచమే. బ్రహ్మ దృష్టితోనే బ్రతుకుతుంటాడు కాబట్టి ఎప్పుడూ జ్ఞాని జీవన్ముక్తుడైతే ప్రపంచదృష్టి ఎప్పుడూ వదలిపోదు కాబట్టి అజ్ఞాని జీవన్మృతుడు.

**ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం**

**సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్**

**తద్వాత్కామా యం ప్రవిశంతి సర్వే**

**సశాంతి మాప్నోతి న కామకామీ - 70**

Dr Dayananda Swamy ebooks



అంచేత స్థిత ప్రజ్ఞత అలవడాలంటే అది సామాన్యం కాదు. దానికే చాపల్యమూ పనికిరాదు. చాపల్యముంటే వాడు గత ప్రజ్ఞుడే. స్థితప్రజ్ఞుడు కాడు. చాపల్యమెప్పు డేర్పడుతుంది. అవీ ఇవీ కావాలని కామం చెలరేగి నప్పుడే. కామానికి మూలం అజ్ఞానం. ఆత్మ ఏదో దాన్ని పట్టుకోలేక దాని బదులనాత్మ ప్రపంచమే వాస్తవమని దీని వెంటబడి పోవటం. అదే కామ మదే చాపల్యం. అది ఉన్నంత వరకూ శాంతి లేదు మానవుడికి. ఎన్ని కోరిక లనుభవించినా ఇంకా కోరిక లుదయిస్తూనే ఉంటాయి. ఇక శాంతి ఎక్కడిది. శాంతే కావాలంటే శాంత స్వభావమైన నీ ఆత్మ స్వరూపంలోనే నీవు నిలకడ చెందాలి.

ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠమ్ సముద్రమ్ – హద్దు దాటకుండా తనలో తానే ప్రతిష్ఠితమైన మహాసాగరం లాంటిదినీ స్వరూపం. అలా ఒకచోట నిశ్చలంగా ఉన్నప్పుడే ఆపూర్యమాణం. అది జలంతో నిండిపోతుంటుంది. ఎక్కడివా జలాలన్నీ ఆపః ప్రవిశంతి. గంగా యమునా గోదావర్యాది నదులన్నీ ఎంతో దూరం నుంచి వచ్చి దానిలో కలిసిపోతుంటాయి. దాన్ని నింపేస్తుంటాయి. అది నదుల వెంట పరుగెత్తి పోదు. చెలియలి కట్ట దాటే ప్రశ్నే లేదు. దాని పాటికది స్థిరంగా ఉంటే అవే వచ్చి దానిలో కలుస్తుంటాయి.

Dr Dayananda Swamy ebooks

ఇది చాలా గొప్ప దృష్టాంతం స్థిత ప్రజ్ఞుడి జీవితానికి. తద్వత్కామాయం ప్రవిశంతి సర్వే స్థిత ప్రజ్ఞుడు కూడా తన పాటికి తాను బ్రహ్మ నిష్ఠలో కాలం గడుపుతుంటాడు. పిచ్చిగా కోరికల వెంట పరుగెత్తడు. అంతా బ్రహ్మమని చూచే వాడెక్కడికి పరుగెత్తుతాడు. ఎందుకోసం పరుగెత్తుతాడు. సముద్రంలాగా తనలో తాను నిలదొక్కుకొని కూచుంటాడు. అలా కూచుంటే వాడికి నిత్యావసరమైన భోజనభాజనాదులన్నీ ప్రారబ్ధం కొద్దీ వాటి పాటికవే వచ్చి ఒళ్లో పడతాయి. వాటికోసం వెంపరలాడడు సముద్రం వలెనే.

కనుక సశాంతి మాప్నోతి. అలాంటి బ్రహ్మనిష్ఠుడే నిత్యమూ శాంతి ననుభవించగలడు. అంతేగాని న కామకామీ. గుఱ్ఱాలలాగా పరుగెత్తే కోరికల వెంట పడిపోయే పామరుడు కాడు. వాడి కశాంతి తప్ప శాంతి అనే గంధం కూడా అబ్బదు. శాంతి అంటే మోక్షమని అర్థం వ్రాశారు భాష్యకారులు. కామమే బంధం. నిష్కామమే నిజంలో మోక్షం. కామ్యమైన పదార్థాలు కనపడుతుంటే అందులో తగులుకోటమే గదా బంధం. మరి అలాంటి వన్నీ బ్రహ్మాకారంగా చూస్తున్న జ్ఞానికి కామింపదగిన పదార్థమే కనపడనపుడు తగులుకోట మనే ప్రశ్నేముంది. తగులుకోటం లేకపోవటమే గదా మోక్షం. బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్ అని గదా ఆర్యోక్తి.

Dr Dayananda Swamy ebooks



**విహాయ కామాన్ య స్సర్వాన్ - పుమాం శ్చరతి నిః స్పృహః**

**నిర్మమో నిరహంకారః - సశాంతి మధిగచ్ఛతి - 71**

కాబట్టి మళ్లీ మళ్లీ గుర్తు చేస్తున్నాడు వ్యాసభగవానుడు మనకు. స్థితప్రజ్ఞుడైన వాడెలా ఉంటాడో - అది అందుకొనే వాడెలా ఉండాలో రెండూ వర్ణిస్తున్నాడు. ఎందుకంటే మొదటనే పేర్కొన్నారు భాష్యకారులు స్థితాప్రజ్ఞుడి కేది లక్షణమో సాధకుడికది ప్రయత్నమని. అంచేత సాధకుణ్ణీ సిద్ధుణ్ణీ ఇద్దరినీ మనసులో పెట్టుకొని వారిద్దరి వ్యవహారమూ సెలవిస్తున్నారు మహర్షి

విహాయ కామాన్ యస్సర్వాన్ - అన్ని కోరికలూ విసర్జించి పుమాంశ్చరతి నిస్పృహః - అవసరమైనవి మాత్రమే జీవితంలో అనుభవిస్తూ - ఆ అనుభవించేటప్పుడు కూడా వాటిమీద వల్లమాలిన అభిమానం పెట్టుకోకుండా - ఏదో ఒక మహాశక్తి ప్రసాదిస్తున్నదిది అనుభవిస్తున్నాను - ఇందులో నా ప్రజ్ఞ ఏమీ లేదని అహంకార మమకారాలు రెండూ వదిలేసి నిర్మమో నిరహంకారః అంటే ఏమన్న మాట. కర్తృత్వ భోక్తృత్వ బుద్ధి లేకుండా ఎవడిలా జీవితం గడుపుతూ పోతాడోవాడు కర్మయోగి. వాడికున్న ఈ నిష్కామకర్మ యోగమే క్రమంగా సత్త్వాన్ని శుద్ధి చేసి తద్వారా ఆత్మజ్ఞానోదయానికి దారి తీస్తుంది. ఇదే సాధకుడి కుండవలసిన ప్రయత్నం.

Dr Dayananda Swamy ebooks

పోతే ఇక సిద్ధుడైన వాడి వ్యవహారమెలా ఉంటుందో అది కూడా ఈ మాటలే మనకు బయటపెడుతున్నాయి. విహాయ కామాన్ య స్సర్వాన్ - అన్ని కోరికలూ నిశ్శేషంగా వదిలేస్తాడు జ్ఞాని. పోతే వాడికి జీవనమెలా నడుస్తుందని అడిగితే చెబుతున్నారు భగవత్పాదులు. జీవనమాత్రచేష్టా శేషః పర్యటతి. జీవనానికి కావలసినవి మాత్రం పెట్టుకొని తిరుగుతుండా లెప్పుడూ. లేకుంటే ఆ స్థలం మీద వ్యక్తుల మీద అభిమానమేర్పడే ప్రమాదముంది. నిస్పృహః - శరీర జీవనమాత్రేపి నిర్గతాస్పృహా యస్య. ఆ జీవితావసరాలను భవించేటప్పుడు కూడా వాటిమీద ఆసక్తి ఉండగూడదట.

అంతేగాదు. నిర్మమో నిరహంకారః - శరీర జీవనయాత్రా క్షిప్త పరిగ్రహేపి మమేద మిత్యభినివేశ వర్జితః - ఇదుగో ఈ సామగ్రి నేను కష్టపడి సంపాదించుకొన్నాను. ఇది నాది అనే అభినివేశం పనికిరాదు. అలాగే నిరహంకారః - విద్యావత్త్వాది నిమిత్తాత్మ సంభావనా రహితః - నేనింత బ్రహ్మ విజ్ఞాన సంపన్నుడను గదా నాకెవరు సాటి అనే విద్యావలేపం కూడా ఉండకూడదు. అలాంటి లక్షణాలున్నప్పుడే వాడు బ్రహ్మవేత్త. వాడే సర్వోప శమరూపమైన మోక్షసుఖాన్ని చూరగొనగలడు. మొదట చెప్పినవాడికీ గుణాలన్నీ ప్రయత్నపూర్వకంగా సాధించవలసినవైతే - రెండవవాడికి

Dr Dayananda Swamy ebooks


సిద్ధమైన లక్షణాలు. వాడు జిజ్ఞాసుడైతే వీడు జ్ఞాని. వాడు ముముక్షుడైతే వీడు ముక్తుడు. ఇదీ విషయం.

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ - నైనాం ప్రాప్య విముహ్యతి**
**స్థిత్వా స్యామంతకాలేపి - బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి - 72**

ఏషా బ్రాహ్మీస్థితిః - ఇప్పుడు వర్ణించిన దంతా బ్రహ్మమునకు సంబంధించిన స్థితి. అన్ని కర్మలూ వదిలేసి బ్రహ్మ స్వరూపంగా నిలిచిపోవటమే బ్రాహ్మీస్థితి అని పేర్కొంటారు గురువుగారు. ఆయనంటే పరమహంస కాబట్టి అలా ఉండగలిగారు. మరి గృహస్థులమైన మన బోటివారి సంగతేమిటి. మనం కర్మయోగులం గదా. కాబట్టి కర్మలను పూర్తిగా సన్న్యసించలేము. ఎప్పటికప్పుడు వాటిని బ్రహ్మాకారంగా దర్శించే అభ్యాసం చేస్తుండాలి మనం. ఇదీ బ్రాహ్మీ స్థితే.

నైనాం ప్రాప్య విముహ్యతి. ఇలాంటి పదవి నందుకో గలిగాడంటే జ్ఞాని - ఇక వాడి కజ్ఞాన మనేది దరిదాపులకు రాదు. జ్ఞానమనేది వెలుగులాంటిది. వెలుగున్నంత వరకూ చీకటి సమీపించగలదా ధైర్యమున్నదా దానికి. అంచేత తస్యకోమోహః అని ఈ శావాస్యం చెప్పినట్టు వాడికి మోహమే లేదు. నిత్యజాగ్రత్స్వ భావుడయి ఉంటాడు వాడు. ప్రమాదోవై మృత్యుః అన్నాడు సనత్సుజాతుడు. ఆత్మ స్వరూపస్థితిని మరచిపోవటమే - దాని విషయంలో పరాకు చెందటమే మృత్యువు.

Dr Dayananda Swamy ebooks

ఎప్పుడూ ఆత్మనే సర్వత్రా చూస్తూ ఏమరుపాటు లేనివాడికి మృత్యుభయ మేముంది.

జీవిత మధ్యంలోనే కాదిలా. స్థిత్వాస్యామంత కాలేపి. రేపు అవసానంలో కూడా ఈ స్థితినే ఏమరకుండా ఇందులోనే ఉండిపో గలిగితే బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి. వాడు నేరుగా బ్రహ్మ నిర్వాణాన్నే పొందగలడు. నిర్వాణమంటే దీపమారినట్టు ఆరిపోవటం. అలాగే ఆరిపోతాడిక ఏదీ మిగలదని చెబుతారు బౌద్ధులు. బౌద్ధుల నిర్వాణం కాదిది. వారి నిర్వాణం శూన్యంలోకైతే అద్వైతులది బ్రహ్మ చైతన్యంలోకి. అది శూన్యమైతే ఇది పూర్ణం. జ్ఞాని జీవన్ముక్తుడైతే విదేహ ముక్తుడవుతాడని కర్మయోగి జ్ఞాని దశనందు కొంటే జీవన్ముక్తుడవుతాడనీ - ఇందులో ఉన్న సూక్ష్మం.

ఇక్కడ అంతకాలమనే మాట కంత్యేవయసి అని అర్థం వ్రాశారు భాష్యకారులు. అది ఇంకా బాగుంది. మరణంలో బుద్ధే పనిచేయదు. తెలివి తప్పుతుంది. అది తప్పే లోపలనే అహం బ్రహ్మాస్మి అనే బ్రాహ్మీస్థితిలో ఉండగలగాలి సాధకుడు. అప్పటి కప్పుడలాటి స్థితి ఖట్వాంగుడిలాగా అలవరుచుకొన్నా ధన్యులమే మనం. అలాంటప్పుడు - కిము వక్తవ్యం

Dr Dayananda Swamy ebooks



బ్రహ్మచర్యా దేవ సన్న్యస్య యావజ్జీవం యో బ్రహ్మణ్యేవావ తిష్ఠతే.

బ్రహ్మచర్యంలో సన్న్యసించి జీవితాంతమూ బ్రహ్మ నిష్ఠలోనే ఉన్నవాడు.

బ్రహ్మసాయుజ్యం పొందటంలో ఆశ్చర్య మేమిటంటా రాయన.

**ఇతి**

**సాంఖ్యయోగః సమాప్తః**

Dr Dayananda Swamy ebooks

# 3. కర్మ యోగము

విషాద సాంఖ్య యోగాలు రెండూ అయి ప్రస్తుతం కర్మయోగమనే మూడవ అధ్యాయంలో ప్రవేశిస్తున్నాము. కానీ ఒక సందేహముంది చాలా మంది కిక్కడ. సాంఖ్యయోగంలోనే కర్మయోగాన్ని చాలావరకు వర్ణించాడు గదా వ్యాసభగవానుడు. దానితోనే గతార్థ మయినప్పుడు మరలా దాన్ని గురించి క్రొత్తగా చెప్పవలసింది ఏముంది. అలాకాదు. అది జ్ఞానమిది కర్మ అని వేర్వేరుగా చెప్పదలచారా. అలాంటప్పుడు సాంఖ్యయోగంలో జ్ఞానమే వర్ణించాలి గాని అందులో కర్మయోగ మనేది చొప్పించటం దేనికి కర్మయోగం కోసం ప్రత్యేకంగా మరొక అధ్యాయమే వ్రాస్తున్నారు గదా అని ప్రశ్న వస్తుంది.

Dr Dayananda Swamy ebooks



వాస్తవమే. పైకి చూస్తే అలాగే అనిపిస్తుంది. సాంఖ్యంలో ఆత్మ జ్ఞానానికి సంబంధించిన విషయమే ఉండాలి. దాని కదనంగా కర్మ ఎక్కడా ప్రస్తావించ గూడదు. ఇది మనందరి అభిప్రాయం. కాని వ్యాసమహర్షి అభిప్రాయం వేరు. ఆయన దృష్టిలో జ్ఞానమూ కర్మా ఒకదానితో ఒకటి తెగదెంపులు చేసుకొన్న విషయాలు కావు. మీదు మిక్కిలి రెండింటికీ చాలా సన్నిహితమైన సంబంధముంది. ఇంతకుముందే చెప్పాముక విషయం. కర్మయోగం చిత్తశుద్ధి ద్వారా ఆత్మజ్ఞానానికి దారి తీస్తుందని. అసలా మాటకు వస్తే జ్ఞానమే సాగితే అది కర్మ. కర్మ ఆగితే అది జ్ఞానం. జ్ఞానమంటే ఆత్మ. కర్మ అంటే అనాత్మ. ఒకటి స్వరూపమైతే మరొకటి దాని విభూతి. ఆత్మ విస్తారమే గదా అనాత్మ ప్రపంచం. కాకుంటే ప్రపంచమంతా పరమాత్మేననే మాట కర్థమేముంది.

అంచేత కర్మకూ జ్ఞానానికీ ఇంత ప్రగాఢమైన సంబంధముంది. జ్ఞానం సాధ్యం **End** కర్మ దానికి సాధనం **Means.** సాధ్య సాధన సంబంధముంది రెంటికీ. సాధనం లేకుండా సాధ్యమనేది సిద్ధించదు. సాధ్యమనేది లేకుంటే సాధన మనేదాని కర్థం లేదు. కర్మజ్ఞానాల కున్న ఈ ఆంతరంగిక సంబంధం బాగా గుర్తించినవాడు గనుకనే గీతాచార్యుడు మనకది గుర్తు చేయటానికే సాంఖ్యయోగంలో కర్మయోగాన్ని ప్రవేశపెట్టి రెంటినీ మిళితం చేసి చూపాడు. అలా చూపి మరలా దేని స్వరూప మెలాటిదో దేనికది విడగొట్టి చూపుతున్నా డిప్పుడు మొదట కర్మయోగమని

Dr Dayananda Swamy ebooks



తరువాత జ్ఞానయోగమని. ఇప్పుడీ మూడవ అధ్యాయం కర్మయోగమైతే దీని తరువాత నాలుగవది జ్ఞానయోగం. ఆ తరువాత ఈ కర్మయోగాన్ని జ్ఞానయోగంలో కలిపి ఒకే ఒక యోగంగా మార్చి చూపబోతాడు కర్మ సన్న్యాసమనే అయిదవ అధ్యాయంలో. కర్మయోగం చివరకు జ్ఞానయోగంలో చేరిపోవటమే కర్మ సన్న్యాసం. అప్పుడీ కర్మయోగంతో పరిపక్వమైన ఆత్మజ్ఞానమే అఖండంగా సాధకుడి అనుభవానికి రాగలదు. ఇదీ వ్యాసమహర్షి హృదయం. దాని కనుగుణంగానే నడుస్తున్న దాయన రచనా ప్రణాళిక.

ఇది ఇలా ఉండగా అర్జునుడి కిప్పు డున్నట్టుండి ఒక పెద్ద సందేహం పట్టుకొన్నది. అదేమిటంటే కర్మణ్యేవాధికారస్తే అని కర్మకే నీ వధికారివి కర్మే నీవు చేస్తూ ఉండమని నాకు పురమాయించాడు బావగారు. అలా పురమాయించి వెంటనే దూరేణ హ్యవరం కర్మ బుద్ధి యోగాత్. జ్ఞానం కన్నా కర్మ అనేది చాలా నికృష్ట మయిందని దాన్ని తీసిపారేశాడు. అలాంటప్పుడు ప్రశస్తమైన జ్ఞానమార్గమే నాకుపదేశించకుండా పనికిమాలిన దని ఒక పక్క తానే చెబుతూ అలాటి కర్మ చేయమని నాకు ఆదేశించటమేమిటి. ఎంత అన్యాయమిది అని అతని ఆక్షేపణ. ఈ అభిప్రాయంతోనే స్వామివారిని నిలదీసి అడుగుతున్నా డిప్పుడొక ప్రశ్న.

**జ్యాయసీ చే త్కర్మణస్తే - మతా బుద్ధి ర్జనార్దన**

**తత్కిం కర్మణి ఘోరే మాం - నియోజయసి కేశవ - 1**

Dr Dayananda Swamy ebooks



**వ్యామి శ్రేణేవ వాక్యేన - బుద్ధిం మోహాయసీవ మే**

**తదేకం వద నిశ్చిత్య - యేన శ్రేయోహ మాప్నుయామ్ - 2**

ఏమయ్యా బావగారూ. ఏమిటీ అన్యాయం. జ్యాయసీ చే త్కర్మణస్తే మతా బుద్ధిః - జ్ఞాన మనేది కర్మ కన్నా చాలా గొప్పదనే అభిప్రాయ మున్నట్టుంది నీకు. అలాంటప్పుడు నాకా జ్ఞానమే ఉపదేశించ రాదా. తత్కింకర్మణి ఘోరేమాం నియోజయసి. ఈ ఘోరమైన కర్మనే చేస్తూ పొమ్మని నాకెందు కీ కర్మమార్గాన్ని సిఫారసు చేస్తున్నావు. కర్మ ఘోరమెలా అయిందని అడుగుతావా. జాతస్యహి ధ్రువో మృత్యుః అని దానివల్ల జనన మరణాలు తప్పవు గదా. ఒక కర్మ మనం చేశామంటే దానికి ఫలితం లేకుండా పోదు. అది ఎప్పటికైనా మానవుడను భవించి తీరవలసిందే. అలాంటప్పు డింత దారుణమైన కర్మ ఎందుకు చెప్పావు నాకు.

ఇదంతా చూస్తే నీవు వ్యామి శ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహ యసీవమే - కలగా పులగం చేసి మాటాడుతున్నావా అని తోస్తున్నది నాకు. ఇలా డొంక తిరుగుడుగా చెప్పి నా బుద్ధిని కలవర పెడుతున్నావు. అనవసరంగా నన్ను పెడదారి పట్టిస్తున్నావు. ఎందుకిలా నన్ను తికమక పరుస్తావు. తదేకం వద నిశ్చిత్య - యేన శ్రేయోహ మాప్నుయామ్. కర్మో జ్ఞానమో ఏదో ఒకటి తేల్చి చెప్పు నాకు. కానీ ఒక్క విషయం గుర్తుంచుకో. ఏది చెప్పినా దానివల్ల నాకు మేలు జరగాలే గాని కీడు జరగకూడదు. కాబట్టి నిష్కర్ష చేసి చెప్పు. నీకే నిష్కర్ష లేనట్టుంది చూడబోతే. నిష్కర్ష నీకే లేనప్పుడు నాకేమి చెబుతావు. అంచేత ఇప్పుడైనా మించిపోయింది లేదు.

Dr Dayananda Swamy ebooks



బాగా ఆలోచించి బోధించ మంటున్నా డర్జునుడు. ఇప్పుడు దీనికి పరమాత్మ ఇచ్చే సమాధాన మేమిటో విందాం.

**లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా - పురా ప్రోక్తా మయానఘ**

**జ్ఞాన యోగేన సాంఖ్యానాం - కర్మయోగేన యోగినామ్ - 3**

లోకేస్మిన్ ఈ లోకంలో నివసించే మానవులందరికీ నేను పురా - సృష్ట్యాది లోనే ప్రోక్తా - బోధించాను సుమా. ఏమిటది. ద్వివిధా నిష్ఠా - రెండు విధాలైన నిష్ఠ - ఏమిటా రెండు విధాలని అడుగుతావేమో. జ్ఞానయోగేన సాంఖ్యానాం - సాంఖ్యబుద్ధి ఉన్నవారికి జ్ఞానయోగం బోధించాను. కర్మయోగేన యోగినాం. యోగ బుద్ధి ఉన్నవారికి కర్మయోగం బోధించాను. సాంఖ్యం యోగమనే మాట లింతకు ముందే వచ్చాయి. వాటి కప్పుడర్థం కూడా చెప్పాము. సాంఖ్యమంటే జ్ఞానమని - యోగమంటే కర్మ అని. అది సాంకేతిక భాష అయితే ఇప్పుడు దాని వివరణ వింటున్నాము. అప్పటికి సాంఖ్యయోగాలంటే ఏవో గావు. జ్ఞానకర్మలని అర్థం చేసుకొంటే చాలు సరిపోతుంది.

ఇక్కడ కేవలం జ్ఞానం కర్మ అని పేర్కొనటం లేదు భగవానుడు. రెండింటికీ ప్రక్కన యోగమనే మాటకూడా చేర్చి పేర్కొంటున్నాడు. జ్ఞానా లెన్నైనా ఉండవచ్చు. లోకజ్ఞానం దగ్గరి నుంచి ధర్మజ్ఞానం వరకు అన్నీ జ్ఞానాలే. అవి కావు మాకు కావలసింది. ఆత్మజ్ఞానం. అదే జ్ఞాన యోగం. అలాగే కర్మలు కూడా సవా లక్ష ఉండవచ్చు. సహజ కర్మలు - శాస్త్రోక్త కర్మలు - అందులో కూడా నిషిద్ధ కర్మలు - విహిత కర్మలు - కామ్యకర్మలు

Dr Dayananda Swamy ebooks



ఇలా ఎన్నైనా ఉండవచ్చు. అవి కాదు మాకు కావలసింది. జ్ఞానానికి పనికి వచ్చే కర్మ. అదే కర్మయోగం.

యోగమంటే కలయిక అని అసలైన అర్థం. ఇదీ యోగ మదీ యోగ మన్నారంటే రెండూ పరస్పర విరుద్ధం కావు. రెండూ కలిసి ఏకమే నని పరమాత్మ ఆశయం. కనుకనే ద్వివిధా నిష్ఠా రెండు నిష్ఠ లని ద్వివచనంలో చెప్పటం లేదు. నిష్ఠా అని ఏకవచనంలోనే పేర్కొంటున్నాడు. మరి ద్వివిధా ఏమిటి. అదే రెండు శాఖలుగా విభక్తమయి కనిపిస్తున్నది. ఒకటి ఉపాయమైతే మరొకటి ఉపేయం **Means and end.** కర్మనిష్ఠాయాః జ్ఞాన నిష్ఠా ప్రాప్తి హేతుత్వేన పురుషార్థ హేతుత్వం - న స్వాతంత్ర్యేణ అంటారు భగవత్పాదులు. ఇందులో కర్మనిష్ఠ జ్ఞాన నిష్ఠ కుపాయం. సత్త్వశుద్ధి ద్వారా అది జ్ఞానోత్పత్తికి తోడ్పడుతుంది. కనుక అది స్వతంత్రంగా తన పాటికి తాను మోక్షమనే ఫలాన్ని మన కందివ్వలేదు. పోతే జ్ఞానమలా కాక అది ఎప్పుడు దయించిందో అప్పుడిక దానికే ప్రతిబంధకం లేదు కాబట్టి తన పాటికి తాను స్వతంత్రంగానే మోక్షఫలాన్ని ప్రసాదించగలదు. ఇదీ వీటికున్న ఆంతరంగిక సంబంధం.

ఇప్పుడీ ఆంతర్య మర్థం చేసుకోలేక పోయా డర్జునుడు. అర్జునుడే గాదు మనబోటి వారు కూడా చాలమంది ఇక్కడ పొరబాటు పడుతుంటారు. పడి మన పొరబాటు భగవద్గీత కారోపిస్తుంటాము అదే ఇప్పు డర్జునుడి మాటల్లో వ్యక్త మవుతున్నది. దూరేణ హ్యవరం కర్మ అంటాడొక పక్క -

Dr Dayananda Swamy ebooks


మరొక పక్క కర్మణ్యేవాధికారస్తే అంటాడేమిటా ఈ కృష్ణ పరమాత్మ రెండు మాటలు మాటాడుతాడని. ఆయన మాటలు బాగా వివేచన చేసి చూచినా ఈ భ్రాంతి ఏర్పడేదిగా దసలు. అవరం కర్మ బుద్ధి యోగాత్తంటే సమత్వ బుద్ధి యుక్తమైన కర్మ కంటే ఫలాపేక్షతో కూడిన కర్మ నికృష్టమైన దని వ్యాఖ్యానించారు భాష్యకారులు. అది కృపణాః ఫలహేతవః అనే మాటలో స్పష్టంగానే మనకు తెలిసిపోతున్నది. అంతేగాదు. కర్మణ్యే వాధికారస్తే కర్మలోనే అధికారం నీకు అదే చేస్తుండమని అర్జునుడి కాయన బోధించాడంటే అది కూడా మామూలు కర్మానుష్ఠానం కాదు. కర్మయోగం. మా ఫలేషు కదాచన అనే తరువాతి మాటలో మనకది కూడా తేటపడు తున్నది.

ఇంతకూ ఏమిటి సారాంశం. కర్మ అనేది రెండు విధాలు. మామూలు కర్మానుష్ఠాన మొకటి. ఫల నిరపేక్షంగా చేసేదొకటి. మొదటిది అనుష్ఠానం. రెండవది యోగం. అనుష్ఠానంలో అహం మమ లుండి తీరుతాయి. యోగంలో అవి రెండూ ఉండవు. ఉంటాయి గనుక అది ఎంత శాస్త్రవిహితమైనా జ్ఞానానికి తోడ్పడదు. ఉండవు గనుకనే ఇది దానికి ఉపయోగ పడుతుంది. అలా ఉపయోగ పడుతుందనే అభిప్రాయంతోనే కర్మయోగం లోనే నీకధికార మదే చేస్తూపో. తప్పకుండా నీకది ఆత్మజ్ఞాన మందిస్తుంది. అలా కాక కేవలం శాస్త్రం చెప్పిందనే చేశావో అది యోగం కాదు. యోగం కాకుంటే అది నీకుపయోగ పడక పోగా సంసార బంధానికే

Dr Dayananda Swamy ebooks



దారి తీస్తుంది కాబట్టి దీనికన్నా అది చాలా నికృష్టమైనది దాని వైపు చూడవద్దని ఆదేశించాడు. ఇదీ భగవత్తాత్పర్యం. అందుకే అక్కడ కర్మ అని మాత్రమే గాక మాఫలేషు - కర్మఫల హేతుర్భూః అనే మాటలు దానికి తగిలించి చెప్పటం. కాగా ఇక్కడ దానికి యోగమనే మాట చేర్చి సూటిగానే కర్మయోగమనే మాట సెలవిచ్చారు. ఇక అర్జునుడు గాని మనం గాని అయ్యో కర్మ చేయమంటాడే జ్ఞానమెందుకు చెప్పడా అని పులవటం దేనికి. జ్ఞానాని కెలాగూ సాధనమేగా ఇది. ఇది ఎలాంటిదంటే నేను **I.A.S.** గదా వెంటనే నాకు కలెక్టరు ఉద్యోగ మెందు కివ్వరా అని అడిగినట్టుంది. కొంతకాలం ట్రైనింగుంటుంది దేనికైనా. అది అయితే ఎందుకివ్వరు తప్పకుండా ఇస్తారు. అలాగే కర్మయోగి కొంతకాలం నిష్కామంగా చేస్తూపోతే చిత్తశుద్ధి ద్వారా జ్ఞానాన్ని అందుకొంటాడు. ఏమిటింత తక్కువగా చూచారు నన్నని వాపోవటం దేనికి.

**నకర్మణా మనారంభా - న్నైష్కర్మ్యం పురుషోశ్నుతే**

**నచ సన్న్యసనా దేవ - సిద్ధిం సమధి గచ్ఛతి - 4**

అసలు ఉన్న విషయ మేమంటే అధ్యాత్మ మార్గంలో ఎవరూ తక్కువా గాదు. ఎక్కువా గాదు. మార్గంలో లేకుంటేనే తక్కువ. అది కేవలం యాంత్రికంగా చేసే కర్మకాండ. కాగా కర్మయోగ మలాంటిది గాదు. అది మార్గంలోనే ఉన్నది. జ్ఞానానికది విజాతీయం కాదు. సజాతీయం. ఉత్తమాధికారులకు కాకపోయినా మధ్యమాధికారుల కిది చాలా అవసరం. ఇది లేకపోతే జ్ఞానమనే దానికే నోచుకోలేడు మానవుడు.

Dr Dayananda Swamy ebooks


అంచేత జ్ఞానమే గదా ముఖ్యం ఈ కర్మదేనికని మానేసి కూచోరాదు. న కర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోశ్నుతే. కర్మల నాచరించకపోతే అసలు నీవు నైష్కర్మ్య మనేది ఆసించలేవు. నిష్కర్మ భావమే నైష్కర్మ్యం. అంటే జ్ఞానమని అర్థం. జన్మ జన్మల నుంచీ పోగైన పాపకర్మలన్నీ నశించి నీ సత్త్వం శుద్ధి కావాలంటే నిష్కామ రూపమైన కర్మ యోగం పాటించి తీరవలసిందే. జ్ఞాన ముత్పద్యతే పుంసాం క్షయా త్పాపస్య కర్మణః అని వ్యాస భగవానుడే సెలవిచ్చాడు. అప్పుడు యధా దర్శతల ప్రఖ్యే పశ్యత్యాత్మాన మాత్మని. అద్దంలో కనిపించినట్టుగా కనిపిస్తుంది నీ స్వరూపం నీకంటా డాయన.

కనుక కర్మ మానేయటం కాదు. మీదు మిక్కిలి కర్మారంభమే ఉపాయం నిష్కర్మ భావానికని సెలవిస్తారు భాష్యకారులు కూడా. నహ్యుపాయ మంతరేణ ఉపేయ ప్రాప్తి రస్తి. ఉపాయాన్ని పట్టుకోకుండా ఉపేయమెలా సిద్ధిస్తుందని అడుగుతారాయన. నహి సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి. కర్మలేవీ చేయనని సన్న్యసించినంత మాత్రాన నీకు జ్ఞానమనేది సిద్ధించదు. సిద్ధించదు సరిగదా ఉభయభ్రష్టుడ వయిపోతావు. సోమరిపోతు వని పించుకొంటావు. గమ్యం లేని ప్రయాణ మవుతుంది నీ బ్రతుకు. అలాగైతే పశుపక్ష్యాదుల జీవితానికీ మానవ జీవితానికీ తేడా ఏముంది.

మరి కర్మ సన్న్యాసమనే మాట ఎలా వచ్చింది. దాని కర్థమే లేదా. లేకుంటే గీతలో తరువాత 5 వ అధ్యాయంలో కర్మ సన్న్యాసమనే యోగం

Dr Dayananda Swamy ebooks



రాబోతున్నది గదా. అది ఎలా బోధించాడు పరమాత్మ అని ప్రశ్న వస్తుంది. వాస్తవమే బోధించాడు. కాదనలేదు. కాని దాని కర్థమేమిటో గురువుగారు చెబుతున్నారు వినండి. సన్న్యసనా దేవ కేవలా త్కర్మ పరిత్యాగ మాత్రా దేవ జ్ఞాన రహితాత్. జ్ఞానమనేది ఉదయించకుండానే కర్మలు పరిత్యజించట మని ఇక్కడ సన్న్యాసమనే మాట కర్థం. మరి జ్ఞానోదయమైన తరువాత చెప్పింది అక్కడ ఆ అధ్యాయంలో సన్న్యాసమనే మాట కర్థం. అక్కడ జ్ఞానంలో కర్మలు లయమవుతాయి. కాబట్టి విడిగా ఇక ఏ కర్మా కనపడదు జ్ఞానికి. కర్మలన్నీ జ్ఞాన స్వరూపంగానే దర్శన మిస్తాయని భావం.

**నహి కశ్చిత్ క్షణమపి - జాతు తిష్ఠ త్యకర్మకృత్**

**కార్యతే హ్యవశః కర్మ - సర్వః ప్రకృతి జైర్గుణైః - 5**

కాకపోయినా ఒక మాట గుర్తుంచుకోవాలి మనం. నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠతి అకర్మకృత్ - పని అనేది ఏ ఒక్కటీ చేయకుండా ఏ మానవుడు గానీ ఒక్క క్షణకాలం ఊరక కూచోగలడా. కూచోలేడు. శరీరంతో కాకపోతే వాక్కుతో - వాక్కుతో కాకపోతే మనస్సుతోనైనా చేస్తుంటాడు కర్మ. త్రికరణాలని గదా వీటికి పేరు. మనోవాక్కాయాలే త్రికరణాలు. కరణమంటే కర్మ చేయటానికి సాధనమని అర్థం. కర్మ సాధనాలు దగ్గర పెట్టుకొని నేనే కర్మా చేయనని భీష్మించుకొని ఎలా కూచోగలవు. అవి నిన్ను కూచోనిస్తాయా. ఒకటి కాకుంటే ఒకటి నిన్ను పురికొల్పుతూనే ఉంటుంది. ఆఖరుకు మనసైనా నిన్ను వదలి పెట్టదు.

Dr Dayananda Swamy ebooks

ఆలోచిస్తూనే ఉంటుం దను క్షణమూ. పోనీ నిద్రలో అది కూడా నిలిచిపోయింది గదా అంటావా. వృత్తి రూపంగా నిలిచిందే గాని వాసనా రూపంగా అక్కడే ఉంది. ఎక్కడికీ పోలేదది. ఒకవేళ తాత్కాలికంగా మనసు సెలవు తీసుకొన్నా ప్రాణమెక్కడికీ సెలవు తీసుకొని పోదు. అప్పుడూ శ్వాస ఆడుతూనే ఉంటుంది. లోపల రక్తం ప్రసరిస్తూనే ఉంటుంది. మన ప్రయత్నం లేకుండానే ఆయా ఇంద్రియాలు లోపల ఆయా పనులు చేస్తూనే ఉంటాయి. అది కర్మగాక మరేమిటి.

కాబట్టి కర్మ అనేది పూర్తిగా నూటికి నూరుపాళ్లూ ఆగిపోదు. నీవు దాని నాపలేవు. కార్యతే హ్యవశః కర్మ. ఆపటం నీ వశంలో లేదు. నీవే దాని వశంలో ఉన్నావు. సర్వః ప్రకృతిజై ర్గుణైః - ప్రకృతికి అధీనమై బ్రతుకుతున్నాడు ప్రతి ఒక్కడూ. ప్రకృతే నీ చేత బలవంతంగా నైనా పని చేయిస్తుంది. దానికి మూడు గుణాలున్నాయి. సత్త్వమూ రజస్సూ తమస్సూ అని. ప్రకృతి వల్ల ఏర్పడ్డవే ఆ గుణాలు. అవి మూడూ నిన్ను వదలిపెట్టవు. అవి నీ ఉపాధినెప్పుడూ ఆ పని చేయి ఈ పని చేయమని పురమాయిస్తూనే ఉంటాయి. నీకిష్టం లేకున్నా నీ చేత పని చేయించి తీరుతాయి. అందుకే చెబుతున్నాను ఏ పనీ చేయకుండా తప్పించుకోటం నీ వశంలో లేదని. ఇక్కడ సర్వః అనే మాట గమనించాలి మనం. సర్వః అంటే ప్రతి ఒక్కడూ నని గదా అర్థం. ప్రతి ఒక్కడూ నన్నప్పుడు పామరుడే కాదు. పండితుడు కూడా. అంటే ఆత్మజ్ఞాన ముదయించి అందులో స్థిరపడ్డ జ్ఞానికి కూడా తప్పదీ కర్మాచరణ అని చెప్పినట్టయింది.

Dr Dayananda Swamy ebooks


మరి కర్మికీ జ్ఞానికీ తేడా ఏమిటని ప్రశ్న వస్తుంది. దీనికి సంజాయిషీ ఇస్తున్నారు భగవత్పాదులు. అజ్ఞఇతి వాక్యశేషః - యతో వక్ష్యతి గుణై ర్యోన విచాల్యతే ఇతి - సాంఖ్యానాం పృథక్కరణాత్ అజ్ఞానా మేవ హి కర్మ యోగః న జ్ఞానినాం - సర్వః అంటే ఆత్మజ్ఞానం లేని ప్రతి ఒక్కడూనని అర్థం. సాంఖ్యులను వేరు చేసి చూపారు కాబట్టి కర్మ జ్ఞానికి లేదు. జ్ఞానినాంతు గుణై రచాల్య మానానాం స్వత శ్చలనాభావాత్ కర్మయోగో నోప పద్యతే. కారణ మేమంటే సత్త్వరజ స్తమో గుణాలు జ్ఞానియైన వాణ్ణి ఏ మాత్రమూ కదిలించలేవు. వాడికా స్వతహాగా చలించే అవసరం లేదు. జ్ఞానమనేది అచలం గదా. కాబట్టి వాడి విషయం కాదిది - అని జ్ఞాని నీ కర్మక్షేత్రం నుంచి తప్పించా డాయన.

కానికర్మ లేదంటే జ్ఞాని కసలే లేదని కాదు మన మర్థం చేసుకో వలసింది. శాస్త్రీయమైన కర్మకాండ లేదని. నిత్యనైమిత్తికాలు లేవు జ్ఞానికి. కామ్యనిషిద్ధా లెలాగూ ఉండవు. కానీ సహజమైన కర్మలుంటాయి వాడికి కూడా. అన్నపానాలూ - మనోవ్యాపారాలూ మాటలూ - ఆఖరు కుచ్ఛ్వాస నిః శ్వాసాలూ వాడికీ ఉంటాయి. అవి మాత్రం జ్ఞానీ తప్పించుకో లేడు. అలాంటప్పుడు ప్రకృతి గుణాల ధాటికి వాడేమి జవాబు చెప్పినట్టు. ప్రకృతి గుణాలు వాణ్ణి చలింప జేయవని భాష్యకారులు వ్రాసిన మాట కర్థమేమిటి అని అడగవచ్చు. గుణా లసలు పనిచేయవని గాదు. అవి వాణ్ణి పట్టి చూచినా వాడెప్పటి కప్పుడు తన ఆత్మజ్ఞాన బలంతో వాటిని

Dr Dayananda Swamy ebooks

లయం చేసుకొంటూ పోతాడు. జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసా త్తని తరువాత భగవద్గీతే చెప్పబోతున్నది. జ్ఞానమనేది ఒక అఖండ ప్రకాశం. కర్మ దానికొక చీకటిలాంటిది. చీకటి కమ్ముకొని వస్తుంటే వెలుగుదాన్ని ఎలా కబళిస్తుందో అలాగే కబళిస్తుంది జ్ఞానం కర్మను. దీనికే ప్రవిలాపనమని పేరు. చీకటి వెలుగులోకి వచ్చి వెలుగుగా మారినట్టే కర్మ కూడా జ్ఞానంలోకి వచ్చి జ్ఞానంగానే అనుభవానికి వస్తుంది జ్ఞానికి. ఇది ముందు ముందు బాగా వివరిస్తుంది గీత. ఇంతకూ భగవత్పాదు లుద్దేశించిన ధర్మ సూక్ష్మమిది.

**కర్మేంద్రియాణి సంయమ్య - య ఆస్తే మనసా స్మరన్**

**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా - మిథ్యా చార స్స ఉచ్యతే - 6**

కాగా ప్రతి ఒక్కడూ ఇలా జ్ఞాని భూమిక నందుకోలేడు కాబట్టి అలాటివాడు జ్ఞానోదయ మయ్యేవరకూ కర్మానుష్ఠానం గాక కర్మయోగం పాటిస్తూ పోవటం చాలా మంచిది. అది కూడా పాటించకుండా పోరాదు. అసలు కర్మే చేయనని భీష్మించుకోరాదు. అలా భీష్మించుకొన్నా ప్రయోజనం లేదు. బలవంతంగా నీచేత చేయిస్తాయి ప్రకృతి గుణాలని ఇంతకుముందే పేర్కొన్నాడు. ఎలాగూ చేయవలసి వచ్చినప్పుడది కావాలిది కావాలని ఐహికాముష్మిక ఫలాల కోసం వెంపర లాడటం దేనికి. అందుకోస మాయా కర్మలు చేయలేక సతమతమై పోవటం దేనికి. జ్ఞానోపకారకమైన కర్మ యోగాన్నే ఆచరిస్తూ తత్ఫలితంగా ఆత్మజ్ఞానమే ఆర్జించి సార్థకం చేసుకోవచ్చు గదా జీవితం.

Dr Dayananda Swamy ebooks



ఇంత చెప్పినా అర్థం చేసుకోక కర్మేంద్రియాణి సంయమ్య. ఎవడైతే కర్మేంద్రియాలైన వాక్పాణి పాదాదులను మాత్రం బలవంతంగా అరికట్టి ఆస్తే – ఊరక కూచున్నానని భావిస్తాడో. అలా భావిస్తున్నాడే గాని వాడు నిజంగా ఊరక కూచోలేదు. కేవలం నోటితో మాటాడటం లేదు. కాలూ చేయి కదపటం లేదు. అంతమాత్రమే. కాని మనసు మాత్రం పరుగెడుతూనే ఉంటుంది. కారణం కర్మేంద్రియాల నరికట్టగలిగాడే గాని వాడు జ్ఞానేంద్రియాలను కట్టేయలేదు. చక్షురాదులైన జ్ఞానేంద్రియాలు అలాగే పనిచేస్తున్నాయి. ఒకవేళ వాటిని కూడా నిగ్రహించా దనుకొందాము. అప్పటికీ అంతరింద్రియమైన మనస్సునేమీ చేయలేదు. అది జ్ఞానేంద్రియా లన్నింటికీ అధిపతి. అది చెప్పిన మాట వినదు.

వినక ఏమి చేస్తుందది. చెప్పాము గదా పరుగెడుతుందని. మనసా స్మరన్. మనసులో ఎప్పుడూ స్మరిస్తూనే ఉంటాడప్పుడు కూడా మానవుడు. జరిగిపోయినదీ జ్ఞాపకం చేసుకొంటుంటాడు. జరగబోయేవీ ప్రణాళికలు వేస్తుంటాడు. సరే జరుగుతున్న విప్పుడు చెప్పనే అక్కరలేదు. వీటికే ఇంద్రియార్థాలని పేరు. ఇంద్రియాలకు విషయాలే ఇంద్రియార్థాలు. కంటికి రూపం – చెవికి శబ్దం – నాలుకకు రుచి – ఇలాంటివి శబ్ద స్పర్శ రూపరసగంధా లంటారు శాస్త్రజ్ఞులు. వీటినే స్మరిస్తుంటా డెప్పుడూ మనస్సుతో. వీటన్నిటికీ అధిష్ఠానమైన ఆత్మను గాదు స్మరించటం. దానికి మారుగా అనాత్మ ప్రపంచాన్ని.

Dr Dayananda Swamy ebooks


మరి ఇంత పకడ్బందుగా కర్మేంద్రియా లన్నిటినీ ఇటూ అటూ కదలకుండా బంధించి ఆసనం వేసుకొని ఈ యోగి సాధించింది ఏమిటింతకూ. మనసుతో స్మరిస్తూ కూచోటమా. ఆ స్మరించటమైనా ఆత్మను గాక అనాత్మ భావాలను ధ్యానిస్తూ కూచున్నాడాయె. ఇక వాడలా కూచుంటే ఎంత కూచోకుంటే ఎంత. కర్మేంద్రియాలను కొన్నిటిని నిరోధించినంత మాత్రాన ఏమి ఫలం. మనసలాగే పని చేస్తున్నది గదా. దాని నరికట్ట లేక ఏదో పెద్ద ఘనకార్యం చేశాను నేను మహాయోగినని గొప్పలు చెప్పుకోట మర్థం లేని వ్యవహారం.

అంతేకాదు. విమూఢాత్మా - మిథ్యా చార స్స ఉచ్యతే. అలాటి వాడి ఆచారమది మిథ్యాచారం. అది ఏ గొప్ప ఫలితమూ సాధించలేని ప్రవర్తన. ఫలితాన్ని ఇచ్చేదయితే అది సదాచారం **Right Conduct** క్రిందికి వస్తుంది. అలాటిది కాని పక్షంలో అది మిథ్యాచారమే **Bogus.** దానికి కారణమేదో గాదు. విమూఢాత్ముడయి కూచున్నాడు వాడు. ఆత్మ అంటే అంతఃకరణ మన్నారు భాష్యకారులు. వాడి అంతఃకరణం లేదా మనస్సనేది చక్కగా పనిచేయటం లేదు. విమూఢమయి పోయింది. మొద్దుబారి మొండిగా తయారయింది. దాని మార్గంలో తాను పోవలసిందే గాని తన మార్గానికి రాదది. అలాటి మనస్సుకు జవాబు చెప్పలేక ఇక ఏ ఇంద్రియాల నరికట్టినా ఏమి ప్రయోజనం. మన ఏవ మనుష్యాణా మన్నట్టు మనస్సు వల్లనే గదా జీవిత లక్ష్యాన్ని సాధించవలసింది. అదే తన మాట విననప్పుడిక తానేది

Dr Dayananda Swamy ebooks


ఆచరించినా అది మిధ్యాచారం గాక సదాచార మెలా కాగలదు. సత్పదార్థం మీద లక్ష్యం లేదు గదా ఆ మనస్సుకు. దాని లక్ష్యమంతా అసద్రూపమైన నామరూప ప్రపంచమే. అలాంటప్పుడది కర్మయోగమెలా అవుతుంది. కర్మయోగానికే నోచుకోకపోతే అది జ్ఞానయోగాని కెలా తోడ్పడుతుంది.

**యస్త్వింద్రియాణి మనసా - నియమ్యారభతే ఽ ర్జున**

**కర్మేంద్రియైః కర్మయోగ - మసక్త స్స విశిష్యతే - 7**

అంచేత అది గాదు పధకం. మనస్సును విచ్చల విడిగా వదిలేసి బాహ్యమైన కర్మేంద్రియాలను మాత్రం తాత్కాలికంగా అరికట్టి కూచోటం కాదు. అది ఏమంత అసాధ్యం. ఎవడైనా చేయవచ్చు. ఎంతసేపైనా చేయవచ్చు. దానివల్ల వీసమెత్తు ప్రయోజనం లేదు జీవితానికి. జీవిత ప్రయోజనమే నీ వాసించే ట్టయితే ఇంద్రియాల నరికట్టట మెలాగా అని కాదు ఆలోచించ వలసింది. ఎప్పుడూ అదీ ఇదీ ఆలోచిస్తూ నీ ప్రాణం తీసే మనస్సు నరికట్టు చేతనైతే.

య స్త్వింద్రియాణి మనసా నియమ్య. మనసు నరికడితే చాలు. ఇంద్రియాలు వాటి పాటికవే కట్టుపడతాయి. మనసే గదా ఇంద్రియాల కధిపతి అని చెప్పాము. జ్ఞానేంద్రియాలకే గాదు. కర్మేంద్రియాలకు కూడా. అది సంకల్పిస్తేనే కన్ను చూస్తుంది చెవి వింటుంది. నోరు మాటాడుతుంది. కాలూ చేయీ ఆడుతుంది. మనసులో ఒకటి చేయాలనే ఇచ్ఛ లేకపోతే ఏ ఇంద్రియామూ ఏ పనీ పెట్టుకోలేదు. మనసు జారీచేసే ఉత్తరువును

Dr Dayananda Swamy ebooks


బట్టే నడుచుకొంటాయి. జ్ఞానేంద్రియాలైనా కర్మేంద్రియాలైనా ఏదైనా. కాబట్టి అన్ని ఇంద్రియ వ్యాపారాలకూ మూలం మనోవ్యాపారం.

అలాంటి కీలక స్థానమైన మనసు నీ అధీనంలోకి తెచ్చుకో మొదట. తెచ్చుకొంటే ఆ మనసు కధీనమై మెలగుతాయి ఇంద్రియాలన్నీ. ముందు జ్ఞానేంద్రియాలైన త్వక్చక్షుః శ్రోత్రాదులను అదుపులో పెట్టుకొన్న మనసు ఇక కర్మేంద్రియాలతో ఏ పనిచేసినా చేయవచ్చు. వాటిని ప్రత్యేకంగా నిగ్రహించుకో నక్కరలేదు. మనసు నిగృహీతమైతే చాలు. అవి నిగ్రహింప బడ్డట్టే. కాబట్టి వాటి నరికట్టే ప్రయత్నం మాని వాటి ద్వారా చేయవలసిన కర్మలన్నీ చేయటమే మంచిది. ఏమిటా కర్మ. మామూలు కర్మగాదు. కర్మయోగం. మామూలు కర్మ అయితే ఇంత పెద్ద మనోనిగ్రహ మక్కరలేదు. కర్మయోగానికే కావాలి ఆ శిక్షణ.

ఎలాంటిదా కర్మయోగం. అసక్త స్స విశిష్యతే - సక్తం కాకుండా చేసే కర్మ. ఫలం మీద ఆసక్తే సక్తి. అది లేకుండా చేస్తే అది అనాసక్తమైన కర్మయోగ మవుతుంది. దానివల్ల అహంకార మమకారాలు నశించి సత్త్వం శుద్ధి అవుతుంది సాధకుడికి. దానితో వాడు జ్ఞానోత్పత్తికి నోచుకొంటాడు. కాబట్టి విశిష్యతే అంటున్నది గీత. మనోనిగ్రహం లేక కేవలం వాగాదీంద్రియాలు కదలకుండా పట్టుకొని చేయవలసిన కర్మలు కూడా ఎగగొట్టి తిరగటం కన్నా మనసు నదుపులో ఉంచుకొని తద్ద్వారా కర్మేంద్రియాలతో నిష్కామంగా నీవు కర్మయోగ మాచరించటమే ఎన్నో రెట్లు విశేషం. అది ప్రాపంచికానికీ పారమార్థికానికీ రెంటికీ తప్పినదైతే

Dr Dayananda Swamy ebooks


ఇది ఇటు ప్రాపంచికమూ అటు పారమార్థికమూ రెండు ఫలితాలనూ యధాశక్తిగా మనకందించే మార్గం. అదీ దీని విశిష్టత.

**నియతం కురు కర్మ త్వం - కర్మ జ్యాయో హ్యకర్మణః**

**శరీర యాత్రాపిచ తే - న ప్రసిధ్యే దకర్మణః - 8**

అంచేత నియతం కురు కర్మ త్వమ్. అర్జునా నీవు నీకు నియతమైన కర్మ ఏదుందో - శాస్త్రం నీకు చేయమని ఏది విధించిందో అది నీవు చేస్తూ పో. కర్మ జ్యాయో హ్యా కర్మణః - ఏ కర్మా చేయకుండా మానేసి కూచోటం కన్నా ఏదో ఒక సత్కర్మ ఆచరించట మనేది చాలా గొప్పదనుకో. శరీరయాత్రాపి చతే న ప్రసిధ్యే దకర్మణః - కర్మ చేయకుండా ఊరక కూచున్నందువల్ల నీవు సాధించే ప్రయోజన మేదీ లేకపోవట మలా ఉంచు. అసలు నీ శరీరం కూడా నిలవదు నీవే పనీ పెట్టుకోకపోతే. శరీరం నిలవాలంటే అన్నపానాలైనా సేవించాలి గదా మానవుడు. ఒక బండికి ఇంధనం **Fuel** లాంటివవి. ఇంధనం లేకుంటే బండి ఎలా ఒక అంగుళం కూడా ముందుకు నడవదో అలాగే శరీరమనే బండి కూడా ఆహారం పడకపోతే ఎందుకూ పనికిరాదు.

అంతేకాదు. అన్నమయం హి సోమ్యమనః ఆపోమయః ప్రాణః అని చాటుతున్న దుపనిషత్తు. అన్నం తినకపోతే మనసు పని చేయదు. నీరు త్రాగకుంటే ప్రాణం పనిచేయదు. చేయదంటే రెండూ ఆగిపోతాయని అర్థం. అవి రెండూ ఆగిపోతే అది మరణమే మానవుడికి. ఇక బ్రతికే

Dr Dayananda Swamy ebooks


దేమిటి వాడు సాధించే దేమిటి. పరం మాట దేవు డెరుగు. ఇహ జీవితమే లేదు వాడికి. అంచేత ఇహంలో బ్రతకటానికైనా కర్మ చేయక తప్పదు.

ఎలాగూ తప్పదు గనుక ఆ చేసే కర్మ శాస్త్రం విధించిన సత్కర్మలే ఆచరించటం మంచిది. అది ఇహానికీ పరానికీ పనికి వస్తుంది. అంతేకాదు. కేవలం విహిత మని చేస్తే నీకు పితృలోకం తప్ప మరే ఫలితమూ లేదు. అదీ శాశ్వతం కాదు. మరలా నిన్ను తెచ్చి ఈ కర్మభూమి మీద పడేసేదే. అది నీ జీవిత సమస్యకు పరిష్కారం కాదు. కాబట్టి ఆత్మజ్ఞానానికి దోహదం చేసే కర్మ ఏదో అది ఆచరించట మింకా వాంఛనీయం. దానినే కర్మయోగ మని వర్ణిస్తూ వచ్చాము. అదీ నియతమే నీకు. అటూ ఇటూ చెదరిపోకుండా నీవు చేసే కర్మలన్నిటినీ జ్ఞానాభిముఖంగా తీసుకువెళ్లుతుంది గనుక నియతమది. అందులో కర్తృత్వ భోక్తృత్వ బుద్ధులు రెండూ క్షాళితమై పోతాయి కాబట్టి నియతమంటే నియతమది. జ్ఞానం వైపే తప్ప నిన్ను ప్రక్కకు పోనివ్వదు. అలాటి యోగమార్గంలో మానవుడు ప్రయాణం చేస్తున్నప్పు డిక శరీరయాత్ర కోసం వాడంతగా ప్రాకులాడ నక్కర లేదు. దానిపాటి కదే జరిగిపోతుంది. జ్ఞానమనే లక్ష్యం మీదనే దృష్టి పెట్టుకొని బ్రతుకు సాగిస్తుంటాడు కాబట్టి అదేవాడి కన్నీ సమకూరుస్తుంది. కాకపోయినా ప్రారబ్ధమనే దొకటి ఉన్నప్పుడు భయమేముంది. ఏది ఎప్పుడు ప్రాప్తించాలో అది వాడి ప్రారబ్ధ వశాత్తూ ప్రాప్తిస్తూనే ఉంటుంది గదా. దానితోనే తృప్తి చెందగలడు మానవుడు.

Dr Dayananda Swamy ebooks



**యజ్ఞార్థా త్కర్మణో న్యత్ర - లోకోఽయం కర్మ బంధనః**

**తదర్థం కర్మ కౌంతేయ - ముక్తసంగ స్సమాచర - 9**

అయితే ఇక్కడ ఒక చిన్న సందేహం. కర్మ అనేది ఏదైనా కర్మే గదా. అది నిషిద్ధ కర్మ కావచ్చు. విహిత కర్మ కావచ్చు. కామ్యం కావచ్చు. లేదా కర్మయోగమే కావచ్చు. అన్నీ కర్మలే. మనోవాక్కాయాలనే త్రికరణాలతో ఆచరించేవే. అన్నీ ప్రకృతి గుణాలతో ముడిపడి ఉన్నవే. అలాంటప్పుడిక మంచీ చెడ్డా అనే తేడా ఏముంది. అన్నీ మనలను బంధించి ఈ సంసార సాగరంలో పడదోసేవే గదా అని ఆశంక. దీనికి సమాధాన మిప్పుడీ శ్లోకం.

యజ్ఞార్థాత్ కర్మణః అన్యత్ర లోకోఽయం కర్మబంధనః - యజ్ఞం కోసమని చేసే కర్మ అయితే అది నిన్ను బంధించదు. మిగతా ఏ కర్మ అయినా నీకు బంధకమే నంటాడు పరమాత్మ. యజ్ఞ మేమిటి. యజ్ఞోవై విష్ణుః అని వ్యాఖ్యానించారు భాష్యకారులు. యజ్ఞమంటే ఈశ్వరుడని అర్థమట. ఎవరిని మనం యజిస్తామో **Worshipping** వాడు యజ్ఞం. ఎవడోగాదు వాడీశ్వరుడే. అంతేగాని అగ్నిష్టోమ జ్యోతిష్టో మాదులుగా విక్కడ యజ్ఞమంటే. అవి భౌతికమైన యజ్ఞాలైతే ఇది ఆధ్యాత్మికం **Spiritual sacrifice**. అలాంటి ఈశ్వరార్పణ బుద్ధితో నీవే పని చేసినా అది నిన్ను బంధించదు. ఇదే కర్మయోగం. కేవల కర్మాచరణ కాదు. కర్మాచరణ అయితే అందులో ఈశ్వరార్పణ బుద్ధి లేదు ఆచరించేవాడికి. ఉత్తమ లోకాలు రావాలని ఉత్తమ భోగాలను భవించాలని ఉత్తమ జన్మ రావాలని

Dr Dayananda Swamy ebooks


ఇలాంటి ఫలితం మీద ఉంటుంది. ఈశ్వరుడి కర్పించటం లేదు కాబట్టి అది వాణ్ణి బంధిస్తుందా కర్మ ఫలం.

అయితే మరి ఎలాగైతే బంధించదు కర్మ. యోగంగా మారినప్పుడే బంధించదు. స్వార్థం కోసం గాక ఈశ్వరార్పణ మంటూ చేస్తాడు వాడు ప్రతికర్మా. అప్పుడది వాడికి చెందదా ఫలం. మరి ఎవరికి చెందుతుంది. ఈశ్వరుడికా. వాడి కసలే అక్కర లేదది. ఎవరికీ దక్కకపోతే ఏమవుతుంది. నిరింధనమైన అగ్నిలాగా తనకుతానే ఆరిపోతుంది. లయమై పోతుంది. ఫల్గుతయా లీయతే ఇతి ఫలమని ఫలశబ్దానికి వ్యుత్పత్తి – నిరర్థక మయితే అక్కడికి సమసిపోక ఏమవుతుంది.

మరి జ్ఞానమనే ఫలముంది గదా కర్మయోగికి. నిరర్థకమెలా అవుతుంది. నిజమే. ఫలమంటే ఇక్కడ పితృలోక స్వర్గలోకాది ఫలం ఉత్తమ భోగాను భవ ఫలం.వాటి మీద దృష్టి లేదు కాబట్టి వాడికా ఫలమే లయ మవుతుంది. కాని జ్ఞానమనే ఫలం మాత్రం అలా లయమయి పోదు. అది ఆత్మ స్వరూపం కాబట్టి ఆత్మ అనేది సర్వదా సర్వత్రా ఉంది కాబట్టి అది ఫలస్వరూపమే. ఇక ఫలమనేది లయమయ్యే ప్రశ్నేముంది. ఆత్మ రూపంగా ఎప్పుడూ ఉంటుందది – క్రొత్తగా అందుకోవలసింది కాదు. అందే ఉన్నది. అంచేత తదర్థం కర్మ కౌంతేయ – ముక్తసంగ స్సమాచర. ఆ జ్ఞానమనే ఫలం కోసం మాత్రమే నీవు మరే స్వర్గాది ఫలాల మీద ఆసక్తి చూపకుండా కర్మయోగ మాచరిస్తూ పో అర్జునా. అది నీకు ఫలంగాని ఫలం జ్ఞానమనే మహాఫల మెప్పటికైనా అందజేస్తుం

Dr Dayananda Swamy ebooks



దంటాడు. అర్జునుడి కేమిటి మనకేమిటి ఇది అందరికీ చేస్తున్న మహోపదేశం.

**సహ యజ్ఞాః ప్రజాః సృష్ట్వా - పురోవాచ ప్రజాపతిః**

**అనేన ప్రసవి ష్యధ్వం - ఏషవో స్త్విష్ట కామధుక్ - 10**

కాకపోయినా అసలు యజ్ఞమనేది చేయకుండా ఏ మానవుడూ తప్పించుకోలేడు. భౌతికమైన యజ్ఞమైనా చేయాలి. ఆధ్యాత్మికమైనా చేయాలి. ఎందుకంటే యజ్ఞంతో సహా సృష్టించా డసలు మొదట ఈ మానవ జాతినా ప్రజాపతి. సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా - పురోవాచ. అలా సృష్టించి వారికి ఒక హుకుం జారీ చేశాడాయన గారు. అదేమిటంటే అనేన ప్రసవిష్యధ్వం. ఇదుగో ఈ యజ్ఞానుష్ఠానం ద్వారా మీరు సంతానాన్ని కంటూ పొండి. ఏషవో స్త్విష్ట కామధుక్ - అలా చేస్తే మీకీ యజ్ఞ కర్మే అన్ని కోరికలూ నెరవేర్చగలదు అని బోధించి పంపాడట ఈ కర్మభూమికి.

కర్మభూమి అంటేనే కర్మకు నిలయమైనది. ప్రజాపతి మనలను సృష్టించాడంటే అది కర్మ. మనమిక్కడ జన్మించామంటే కర్మ. మనసుతో ఆలోచిస్తూ పనులు చేస్తున్నామంటే కర్మ. తత్ఫలితంగా సుఖదుఃఖాలను భవిస్తూ జీవిస్తున్నామంటే కర్మ. మనకే పిల్లపాప లేర్పడుతున్నారంటే అదీ కర్మే. చివరికంతా వారి కప్ప జెప్పి మన శరీరాన్ని కూడా ఈ కర్మ భూమికే అంకితం చేసి కన్ను మూస్తున్నా మంటే అదీ కర్మగాక మరేమిటి. అంచేత మన జీవిత మాది మధ్యాంతాలంతా కర్మమయం. అదే యజ్ఞమనే మాట కిక్కడ అర్థం. జీవితమే ఒక మహాయజ్ఞం.

Dr Dayananda Swamy ebooks


ఇలాటి యజ్ఞం నిరంతరమూ మానవు డాచరించక తప్పదు. అలాటి మనస్తత్త్వంతోనే జన్మించాడు మానవుడు. అలాటి మనస్తత్త్వంతోనే బ్రతుకుతున్నాడు బ్రతికినంత కాలమూ. ఇక యజ్ఞం చేయక తప్పేదేముంది. కాని శాస్త్రమిప్పుడు మనకు చెప్పే సలహా ఏమంటే ఆ చేసే యజ్ఞం నీకు ఫలిత మివ్వాలంటే అది నీకు కావలసిన వన్నీ సమకూర్చాలంటే నీవు సుఖపడాలంటే ఒక మంచి మార్గముంది దానికి. అది ఏదోగాదు. నీకు తెలియని ఒక రహస్యం చెబుతున్నాను విను.

**దేవాన్ భావయ తానేన - తే దేవా భావయంతు వః**

**పరస్పరం భావయంతః - శ్రేయః పర మవాప్స్యథ - 11**

కర్మరూపమైన ఈ యజ్ఞం నీవు త్రికరణాలతో ఆచరిస్తున్నప్పుడు దేవాన్ భావయ తానేన. దేవతలనే వారొకరున్నారని గ్రహించి వారి ప్రీత్యర్థ మాచరిస్తూ పో. అలా వారి కోసమని ఆచరించావంటే తే దేవా భావయంతు వః - ఆ దేవతలు కూడా సకాలంలో వర్షాలూ అవీ కురిపించి పంటలు పండించి తద్ద్వారా నీకు సంతృప్తి కలిగిస్తారు. పరస్పరం భావయంతః - ఇలా ఒకరికొకరు మేలు చేస్తూ పోయారంటే దానివల్ల మీకే లాభం. దేవతానుగ్రహం వల్ల మీరు జీవితంలోనూ జీవితానంతరమూ సకల శ్రేయస్సులూ పొందగలరు. పరం శ్రేయః అన్నారు కాబట్టి చివరకు మోక్షమనే ఫలాన్ని కూడా అందుకోగలడు మానవుడు.

**ఇష్టాన్ భోగాన్ హి వో దేవా - దాస్యంతే యజ్ఞ భావితాః**

**తైర్దత్తా నప్రదాయైభ్యో - యో భుంక్తే స్తేన ఏవ సః - 12**

Dr Dayananda Swamy ebooks



ఈ దేవత లెవరండీ. వారిని మన మారాధించట మేమిటి - వారు మనకన్నీ ప్రసాదించట మేమిటని సందేహమా. అలాటి సందేహా లేవీ పెట్టుకోకండి. మీరీ భూలోకంలో బ్రతికే మానవులైతే వారీ భూలోకం కన్నా అతీతమైన భువస్సువరాది ఊర్ధ్వలోకాలలో నివసించే దివ్య శరీరధారులు. మీ మానవుల శక్తి కన్నా ఎన్నో రెట్లు అతీతమైన శక్తి వారిది. అలాటి శక్తి సంపన్నులను యజ్ఞభావితాః - యజ్ఞం ద్వారా మీరు సేవిస్తే వారు ప్రసన్నులై ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దా స్యంతే. మీకిష్టమైన సకల భోగాలనూ మీకు ప్రసాదించటానికి వారు సమర్థులు. తప్పకుండా ప్రసాదిస్తారు.

తై ర్దత్తా నప్రదాయైభ్యో - అయితే ఒక్కమాట. వారలా ప్రసాదించిన స్త్రీ పశుపుత్ర గృహక్షేత్రాది సంపద నంతా వారి ఋణం తీర్చకుండా కేవలం స్వార్థబుద్ధితో అనుభవిస్తూ పోయారంటే స్తేన ఏవసః - అది దొంగ బతుకే మానవులకు. దొర బతుకు కాదు. దొంగ బతుకెలా అయిందని అడుగుతారేమో. దేవస్వాపహారీ అని వ్రాస్తున్నారు భాష్యకారులు. దేవస్వమంటే దేవతల సొమ్ము. అది గదా వారిస్తే నీవు తింటున్నావు. ఇస్తేనే గదా తింటున్నానని అడగవచ్చు నీవు. తినటంలో తప్పులేదు. కాని వారు చేసిన దానికి మారు చేయకుండా అనుభవించటమే నీ తప్పు. అప్పుడది దొంగసొమ్మే గాని నిజాయితీగా నీవు గడించిన సొమ్ముగాదు. కాబట్టి దేవతల ఋణం తీర్చుకోనంత వరకూ ప్రతి మానవుడూ దొంగే. దొర అనిపించుకోలేడు.

Dr Dayananda Swamy ebooks



**యజ్ఞ శిష్టా శినస్సంతో - ముచ్యంతే సర్వ కిల్బి షైః**

**భుంజతే తే త్వఘం పాపాః - యే పచం త్యాత్మకారణాత్ - 13**

అలాకాక దొర బతుకే బతకాలనే ఆకాంక్ష ఉంటే మానవుడు తప్పించుకొని తిరగగూడదు జీవితంలో. పశుపక్ష్యాదుల బ్రతుకు బ్రతకగూడదు. ఈ మానవజన్మ నెవరు మనకు ప్రసాదించారో వారి ఋణం తీర్చుకొనే ప్రయత్నం చేయాలి. దేవహితం యదాయుః అని శాస్త్రవచనం. దేవతలే ఇచ్చారు మనకీ జన్మ. అందుకోసం వారికి ఋణపడి ఉన్నాము మనం. వారి ఋణం తీర్చుకొని ఆనృణ్యం పొందాలంటే యజ్ఞం చేయాలి వారి కోసం. యజ్ఞశిష్టా శినః సంతః - యజ్ఞం చేయగా ఏది శేషించిందో దాన్నే మనం స్వీకరించాలి. దాని కమృతమని పేరు. అతిథి భుక్తశేషానికి విఘస మనీ దైవదత్త శేషానికి అమృతమనీ శాస్త్రం పెట్టిన పేర్లు.

అలాటి అమృతాన్ని సేవిస్తే ముచ్యంతే సర్వ కిల్బిషైః - ఇక ఏ పాపఫలమూ అంటదు మానవుణ్ణి. అన్ని పాపకర్మల నుంచీ బయట పడతాడని మనకు శాస్త్ర మిచ్చే హామీ. ఏమిటా పాపాలంటే చెబుతున్నారు భగవత్పాదులు. చుల్ల్యాది పంచసూనాకృతైః ప్రమాదకృత హింసాది జనితైశ్చ అనేకైః అని. పేషణీ కుట్టనీ చుల్లీ ఉదకుంభీ చ మార్జనీ అని ఇవి అయిదు పాపాలు. ప్రతి దినమూ చేస్తూనే ఉంటారు గృహస్థులు. పిండి పిసికేటప్పుడూ - ధాన్యం దంచేటప్పుడూ - పొయ్యి రాజేసేటప్పుడూ నీళ్లలో కడవ ముంచేటప్పుడూ - చీపురు పెట్టి ఇల్లు ఊడ్చేటప్పుడూ - ఎన్నో సూక్ష్మజీవులు చనిపోతుంటాయి. అదంతా మనకు చుట్టుకొనే

Dr Dayananda Swamy ebooks



పాతకమే ఆ మాటకు వస్తే. ఈ అయిదు పాతకాలూ పోవాలంటే అయిదు యజ్ఞాలు చేస్తే సరిపోతుందన్నారు. అందులో దేవ యజ్ఞం చేస్తే అన్నిటికీ జవాబు. ఇదిగాక ఇంకా మన ఏమరుపాటు వల్ల జరిగే దోషాలేవి ఉన్నా అవీ ఊడ్చుకు పోగలనవి హామీ ఇచ్చారు.

కనుక యజ్ఞానుష్ఠానాని కింత ప్రభావమున్నది. అలాటి యజ్ఞకర్మ మానేసి యే పచంత్యాత్మ కారణాత్ - దేవతలకు నివేదించకుండా తన కడుపు నింపుకోటమే పరమార్థమని ఎవరు భావిస్తారో వారు భుజించేది అన్నం కాదు. తే త్వఘం భుంజతే పాపాః - మరేమిటంటారు. తాము చేసుకొన్న పాపాన్నే తాము భుజిస్తున్నారు. వంట చేసుకొని తింటున్నారని పేరేగాని అది వంటగాదు. పాపఫలం. వంటకం గాదది పాపమే. తిన్నా సుఖం లేదు. స్వార్థం కోసం ఏపని చేసినా అది ఫలిత మివ్వదని భావం.

**అన్నాద్భవంతి భూతాని - పర్జన్యా దన్న సంభవః**

**యజ్ఞా ద్భవతి పర్జన్యః - యజ్ఞః కర్మ సముద్భవః - 14**

**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి - బ్రహ్మా క్షర సముద్భవం**

**తస్మా త్సర్వ గతం బ్రహ్మ - నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ - 15**

అసలు యజ్ఞమంటే ఏమను కొంటున్నావు నీవు. ఏదో హోమకుండ మొకటి త్రవ్వి సమిధలు పోగు చేసి అగ్ని అక్కడ ఆధానం చేసి ఋత్విక్కులు మంత్రాలు చదువుతుంటే జరిపే ఒకానొక క్రియ మాత్రమేనని భావిస్తున్నావా. క్రియే అయితే కావచ్చు. కాని ఆ క్రియకు మూలమేదో తెలుసా. దాని ఆద్యంతాలు గుర్తిస్తే అది ఎంత పవిత్రమైనదో నీకు

Dr Dayananda Swamy ebooks


భాసిస్తుంది. అది ఎలాగో చెబుతాను వినమని దాని ప్రక్రియ అంతా వర్ణిస్తున్నాడిప్పుడు వ్యాసభట్టారకుడు.

అన్నాద్భవంతి భూతాని. అసలు అన్నం వల్ల ఏర్పడుతున్నాయీ సమస్త భూతాలూ. భూతాలంటే ఇక్కడ ప్రాణికోటి. ప్రాణులందరూ అన్నంవల్ల జన్మిస్తున్నారంటే ఏమిటర్థం. లోహిత రేతః పరిణతా దన్నాత్తని వివరిస్తారు భాష్యకారులు. శుక్రశోణితాలుగా మారిన ఆహారం వల్లనని అర్థం. మరి ఈ అన్నమెలా వచ్చింది. పర్జన్యా దన్న సంభవః - పర్జన్యమంటే మేఘమండలం. మేఘం వర్షిస్తే దానిచేత భూమి పదునై పంటలు పండితే దాన్ని భుజించటం వల్ల. మరి ఆ పర్జన్యమెలా వచ్చింది. యజ్ఞాద్భవతి - యజ్ఞం చేస్తే తయా రయిందట. అగ్నే ప్రాస్తాహుతి స్సమ్య గా దిత్య ముప తిష్ఠతే - అగ్నిలో హోమం చేసిన ద్రవ్య మావిరి రూపంగా సూర్యమండలం వైపు పయనిస్తే - ఆదిత్యా జ్జాయతే వృష్టిః - తేజస్సు చల్లబడి వర్షం కురిస్తే - వృష్టేరన్నం - వర్షం వల్ల అన్నం మనకు లభిస్తున్నదట. పోతే ఈ యజ్ఞానికేది మూలమని అడిగితే యజ్ఞః కర్మసముద్భవః - కర్మ వల్ల నంటారాయన. యజ్ఞం చేయటమనేది ఒక కర్మే గదా.

ఇక్కడి కాగలేదు ప్రశ్న. అది ఒక పరంపర **Series.** కర్మ అన్నారే అది ఎక్కడి నుంచి అని మరలా ప్రశ్న. కర్మ ఎక్కడినుంచో గాదు. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి. బ్రహ్మమంటే ఇక్కడ వేదమని అర్థం. వేదం చెబితే కర్మ లాచరిస్తున్నావు నీవు. లేకుంటే నీ విధ్యుక్త కర్మలేవో నీకు తెలియదు. కాబట్టి విహిత కర్మలన్నిటికీ మూలం వేదవాఙ్మయం. ఇక ఆవేదానికి ఏమిటి

Dr Dayananda Swamy ebooks



మూలమని ఆఖరి ప్రశ్న. బ్రహ్మాక్షర సముద్భవం. అక్షరం నుంచి వచ్చింది వేదమని సమాధానం. అక్షర మేమిటి. క్షరం కానిదేదో అది అక్షరం. పరమాత్మ తత్త్వమని అర్థం. పరమాత్మే అన్నిటికీ పరాయణం **Culmination** సాకాష్ఠా సా పరా గతిః అని చాటుతున్నది కఠోపనిషత్తు.

పరమాత్మ అన్నప్పుడిక ప్రశ్న లేదు. ఎందుకంటే అది సర్వవ్యాపకం. సర్వ వ్యాపకం పరమాత్మా లేక వేదమా అని మరలా ఒక సందేహ మేర్పడుతున్నది. ఎందుకంటే తస్మా త్సర్వగతం బ్రహ్మ అని ఒక వాక్యమిప్పుడు వినిపిస్తున్నది. వేదమే సర్వవ్యాపకమెలా అయింది. తస్య నిశ్వసి తం వేదాః పరమాత్మ నిః శ్వాసమే వేదమని గదా ఉపనిషత్తు చాటుతున్నది. దీనికిప్పుడు సంజాయిషీ ఇస్తున్నారు భాష్యకారులు వినండి.

యస్మాత్సాక్షా త్పరమాత్మాఖ్యాత్ అక్షరాత్ పురుష నిః శ్వాసవ త్సముద్భూతం బ్రహ్మ - తస్మాత్ సర్వార్థ ప్రకాశ కత్వా త్సర్వగతం. సర్వగతమైన పరమాత్మ నుంచి జన్మించి సర్వవిషయాలనూ అలాగే ప్రకాశింప జేస్తుంది గనుక వేదం కూడా సర్వగతమని సమర్థించా రాయన. ఎప్పుడిలా సర్వగత మయిందో నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం. నిత్యమూ యజ్ఞక్రియ నాశ్రయించి ఉందట వేదం. యజ్ఞాన్ని ఆశ్రయించటమేమిటి - యజ్ఞ విధి ప్రధానత్వా త్తంటాడు. యజ్ఞ విధానమే దానికి ప్రధానమట. కర్మ ప్రధానం వేదమని భావం.

**ఏవం ప్రవర్తితం చక్రం - నాను వర్తయ తీహ యః**

**అఘాయు రింద్రియా రామో - మోఘం పార్థ స జీవతి - 16**

Dr Dayananda Swamy ebooks

ఈ విధంగా వేదమూ అది బోధించే కర్మకాండా దానివల్ల నిత్యమూ సాగిపోయే ఈ లోకయాత్రా - ఇదంతా ఒక చక్రం లాంటిది. సంసార చక్రమిది. చక్రంలాగా తిరుగుతూ ఉంటుంది ఎప్పుడూ. అలా తిరుగుతూ ఉంటే పైది క్రిందికీ క్రిందిది పైకీ ఆ వృత్తి కాక తప్పదు. అంటే ఆది నుంచి అంతం అంతం నుంచి ఆది వలయాకారంగా వస్తూ పోతుంటాయని అర్థం. అప్పుడే ప్రతి ఒక్క మానవుడికీ అందులో ప్రవేశం. ఒకడా చక్రభ్రమణంలో పుట్టాడు బ్రతికాడు పోయాడంటే వాడితోపాటు పోదుగదా అది. దాని పాటికది తిరుగుతూ ఉండవలసిందే. అప్పుడే పుట్టేవాడు పుడుతుంటే పోయే వాడుపోతుంటే అందరికీ లభిస్తుంది అందులో అవకాశం.

ఏవం ప్రవర్తితం చక్రం. అయితే అది అచేతన మా సంసార చక్రం. సంసారి అయిన జీవుడు తిప్పితేనే అది తిరుగుతూ పోతుంది. అందుకే ప్రవృత్త మనకుండా ప్రవర్తిత మని వ్రాస్తున్నారు వ్యాసభగవానుడు. యజ్ఞ కర్మానుష్ఠానమే సంసారి అయిన మానవుడు దాన్ని త్రిప్పటం. నానువర్తయ తీహ యః - ఎవడలా తిప్పకుండా పోతాడో. అఘాయు రింద్రియారామః - వాడి జీవనం పాప జీవనం **Sinful Life**. ఎందుకంటే ఇంద్రియారాముడయి బ్రతుకుతుంటాడు వాడు. ఇంద్రియార్థాలు సేవించటమే వాడికి జీవిత పరమార్థం. చివరకు వాడు తనకూ

Dr Dayananda Swamy ebooks



ఉపయోగపడడు. లోకానికీ ఉపయోగపడడు. మోఘం పార్థ స జీవతి- పశుపక్ష్యాదుల లాగా వ్యర్థమైన బ్రతుకు బ్రతుకుతుంటాడు. ఏమి కారణం. శాస్త్రచోదితమైన కర్మలేవీ ఆచరించటం లేదు వాడు. ప్రతివాడూ ఏమంచి పనీ చేయక పశువులాగా తిండి తీర్థాలతోనే బ్రతుకు సాగించి చివరకు కన్ను మూస్తే ఈ శాస్త్రవిహితమైన కర్మలెందుకు. ఎవరు చేయాలవి. చేయకుంటే వాటికి ఫలిత మేముంది. ఫలితమే లేని బ్రతుకే అయితే మానవ జీవితమైతేనేమి అది క్రిమికీటకాదుల జీవితమైతే నేమి - ఇందుకేనా ఈ సంసారమనేది ఏర్పడింది. అసలీ సృష్టికే అర్థం లేకుండా పోతుంది.

తొమ్మిదవ శ్లోకం మొదలుకొని ఇప్పుడీ పదహారవ శ్లోకం వరకూ ఈ ఎనిమిది శ్లోకాలలో వర్ణించిన విషయమేమిటి - తద్వారా భగవద్గీత మనకు చేస్తున్న బోధ ఏమిటి - దానివల్ల మనకు కలిగే ప్రయోజన మేమిటని ప్రస్తుత మిక్కడ మనం సవిస్తరంగా విచారణ చేయవలసి ఉన్నది. యజ్ఞంతో సహా మానవుడు సృష్టి అయ్యాడని - దేవతలకు మనం ఋణపడి ఉన్నామని యజ్ఞం చేసి వారి ఋణం మనం తీర్చుకోవాలని - వారికి యజ్ఞఫల మర్పిస్తే వారు ప్రసన్నులయి మనకు కావలసిన వన్నీ ప్రసాదిస్తారనీ - ఇలా పరస్పరం సహకరించి నప్పుడే పరిశుద్ధుల మవుతామని - అలా కాక స్వార్థచింతనతో బ్రతికితే అంతకన్నా నికృష్టమైన జీవితం లేదనీ - వేదవాఙ్మయ మంతా ఇదే మనకు కర్తవ్యమని శాసిస్తున్నదని సాక్షాత్తూ పరమాత్మ నుంచి అది ఆవిర్భవించిందని అది కర్తవ్యమని విధించిన యజ్ఞకర్మ అనుష్ఠించి తీరాలని - దానివల్ల మేఘాలు వర్షించి మనకింత

Dr Dayananda Swamy ebooks

ఉపకారకమైన దేవతను యజనం చేయకపోతే అది మహాపచారమని - జగచ్చక్రమంతా దానిమీద ఆధారపడి ఉన్నప్పుడది ప్రతి ఒక్కడూ అనుసరించటం వాడి విధి అని కాకుంటే పురుషార్థానికి నోచుకోక పాడయిపోతాడని - ఎన్నో మనకు తెలియని విషయాలు బోధిస్తున్నది శాస్త్రం.

మానవుడికి తెలియని రహస్యం చెప్పటానికే వచ్చిందసలు శాస్త్రం. ప్రత్యక్షాను మానాల కతీతమైన క్షేత్రంలో శాస్త్రమే మనకు ప్రమాణం. కాదన లేదు. కాని ఇప్పుడింత చిలువలు పలువలు పెట్టి వర్ణించినదంతా ధర్మం క్రిందికి వస్తుంది గాని మోక్ష పురుషార్థం క్రిందికి రాదు. మోక్షమే జీవిత సమస్యకంతటికీ ఏకైక పరిష్కారం. సర్వమూ ఆత్మ స్వరూపమే ననేజ్ఞానమే గదా మోక్షం. అదే వాస్తవం. దానికి భిన్నంగా ఇకఏది చెప్పినా అదీ అభాసే. వాస్తవం కాదు. ధర్మార్థ కామాలు మూడూ ఇలాటి ఆభాస క్రిందకే వస్తాయి. ఉందంటే ఉంది. లేదంటే లేదు. అదీ అభాస అంటే. వస్తుతంత్రం కాదది బుద్ధితంత్రం. **Notional** అర్థకామా లైహికం కాబట్టి అది ఆభాస అయితే కావచ్చు. ధర్మ మా ముష్మికం కదా - అది కూడా మిథ్యాభూత మేనా అని శంకించ బని లేదు. త్రిగుణాత్మకమైన ప్రతి ఒక్కటీ అసత్యమే. త్రైగుణ్య విషయా వేదా అని గీతే చాటుతున్నది. వేదవాఙ్మయమే త్రిగుణాత్మకమని నిర్ణయించి నప్పుడిక అది బోధించే దేవత లెక్కడున్నారు. వారి కోసం చేసే యజ్ఞాలెక్కడ ఉన్నాయి. అంతా వట్టిదే.

మరి అంతా వట్టిదే అయితే ఇంతదూరం శాస్త్రం మనకిదంతా ఏకరువు పెట్టటం దేనికని ప్రశ్న వస్తుంది. దీనికి వేదాంతులు చేసే

Dr Dayananda Swamy ebooks


పరిష్కార మేమంటే సర్వమూ ఆత్మ స్వరూపమనే జ్ఞాన ముదయించిన వాడి కిదేదీ లేదు. స్వర్గం లేదు. దేవతలు లేరు. వారికీ మానవులు ఋణపడటం లేదు. - అది తీర్చుకోటానికి యజ్ఞాదులు చేయనక్కర లేదు. అసలది బోధించే వేదాలు లేవు. అదంతా ఆత్మ స్వరూపమే వాడికి.

పోతే అలాటి అఖండాత్మ జ్ఞానమింకా ఉదయించ నంతవరకూ వాడి దృష్టిలో ఉందీ వ్యవహారమంతా. అందుకే దీనికి వ్యావహారిక సత్యమని పేరు పెట్టారు వేదాంతులు. భేదదృష్టితో వ్యవహరిస్తున్నంత వరకూ ఉన్నట్టు చూస్తాడు కాబట్టి వ్యావహారికం. వ్యావహారికమే గాని పారమార్థికం కాదిది. రజ్జు సర్పం లాంటిది. సర్పమని భ్రమించినంత వరకే సర్పం మనకు యథార్థం. రజ్జు వనేజ్ఞానం కలిగితే చాలు అది ఎగిరి పోతుంది. ఒక స్వప్నంలాంటిదని కూడా అనుకోవచ్చు. స్వప్న ప్రపంచ మిప్పుడు సత్యమా కాదా చెప్పండి. అది ఎంత కాలముందని చూస్తామో అంత కాలమూ అది సత్యమే. మెళకువ వచ్చిందో అంతా అబద్ధమే. అలాగే ధర్మ పురుషార్థానికి సంబంధించిన ఈ వర్ణన కూడా ఒక వ్యావహారిక సత్యమే. పారమార్థికం కాదు. పరమార్థ మాత్మ స్వరూపమే. అలాటి ఆత్మ జ్ఞాన ముదయించిందో ఇది లేదు. అంతా స్వప్నంలాగా తేలిపోతుంది.

అయితే మరి పారమార్థికమైన దృష్టితో దీని నెలా సమన్వయిస్తారని అడిగితే కొంత లోతుకు దిగి చూడాలి మనం గీతా హృదయం. అన్నమంటే పృథివి. పర్జన్యమంటే జలం. యజ్ఞమంటే అగ్నిహోత్రాదికంతో ముడిపడి ఉంది కాబట్టి అది తేజస్సు. కర్మ అంటే చలనాత్మకం కనుక వాయుతత్త్వం.

Dr Dayananda Swamy ebooks

బ్రహ్మమేమిటి. బ్రహ్మమంటే అన్నిటి కన్నా పెద్దది ఆకాశతత్త్వం. మొత్తం మీద అన్నం దగ్గరినుంచి బ్రహ్మందాకా పంచభూతాలు ఆరోహణ క్రమంలో కలిసి వచ్చాయి. మరి ఆకాశ మెక్కడి నుంచి. అక్షరం నుంచి. అక్షరమంటే పరమాత్మేనని గదా పేర్కొన్నారు భగవత్పాదులు. అప్పటికి సర్వగతం బ్రహ్మ అంటే వేదం కాదది పరమాత్మ. అది సర్వగతమైనా యజ్ఞంలో ప్రతిష్ఠితమయి ఉంది. యజ్ఞమంటే తేజస్తత్త్వమని గదా చెప్పాము. తేజస్సు జీవుడే. జీవుడికి తైజసుడని పేరు. పరమాత్మ సర్వత్రా ఉన్నా అది గుర్తించే యోగ్యత ఉన్నవాడు జీవాత్మ. కనుక జీవుడి బుద్ధిలోనే పరమాత్మ ప్రతిష్ఠితుడయి ఉన్నాడనే భావమిది.

ఇప్పుడే మయింది. పంచభూతాలూ పరమాత్మ స్వరూపమే పాంచభౌతికమైన ప్రపంచమూ పరమాత్మే. అలాంటప్పు డిహమూ పరమూ ఇహంలో ఉండే మానవులూ - పరంలో ఉన్నారను కొనే దేవతలూ - వీరు వారిని గూర్చి యజ్ఞాలు చేయటం - వారు దానికి సంతోషించి వర్షాలు కురిపించటం - ఈ కలాపమిక ఎక్కడిది. ఇది కూడా ఆత్మస్వరూపమే. పారమార్థికంగా చూస్తే ఇక ఏదీ లేదు. అంతా ఆ భాసేనని తేలిపోతుంది.

అయితే ఒక్కమాట. ఎంత ఆ భాస అయినా అది ఎంత వ్యావహారికమైనా దాని వెనకాల పారమార్థికం పొంచి ఉంటుంది. అసలా మాటకు వస్తే పారమార్థికమే వ్యావహారికంగా భాసిస్తున్నది. అందుకే దాన్ని వ్యావహారిక మని పేర్కొన్నారు. సూర్యరశ్మేగదా ఎండమావులుగా

Dr Dayananda Swamy ebooks


భాసిస్తున్నది. రజ్జువే గదా సర్పంగా చెలామణి అవుతున్నది. కనుక తన పాటికి తాను అసత్యమైనా ఇది - తన కాధారమైన సత్యాన్ని అందుకోటానికి తోడ్పడుతుంది. అదీ దీనిలో ఉన్న సుగుణం. అందుకే అసతోమా సద్గమయ అన్నది శాస్త్రం.

ఈ దృష్టితో మళ్లీ మన మర్థం చేసుకొన్నామంటే భగవద్గీత ఇంతకు ముందు చేసిన వర్ణన అంతా మరొక రూపంగా సమన్వయ మవుతుంది. అది జ్ఞాన దృష్టితో చేసిన దైతే ఇది యోగదృష్టితో చేసే సమన్వయం. కర్మయోగి ఇంకా జ్ఞాని భూమిక నందుకోలేదు. అందుకోటానికి సాధన చేస్తున్నాడు. అది ఎలా చేయాలో వర్ణిస్తున్నది గీత. కేవల మీ క్షణభంగురమైన లోకమే ప్రమాణమని గాక జీవితగమ్యాన్ని బోధించే శాస్త్రప్రమాణాన్ని నమ్మాలి మొదట. నమ్మితే మనకు కనిపించే ఈ లోకమూ ఈ మానవులే గాక వీటి కతీతమైన ప్రకృతి శక్తు లున్నాయని - అవి మనలనూ మన జీవితాలనూ నడుపుతున్నాయని తెలుస్తుంది. ఆ శక్తులే దేవతలు. మనం వ్యష్టిరూపులమైతే అవి సమష్టి రూపం. వ్యష్టి కెప్పుడూ సమష్టి అనేది ఒకటి ఉందనే స్పృహ ఉండాలి. ఈ వ్యష్టి జీవితానికి మూలం కాబట్టి తనజీవితమే ఒక యజ్ఞంగా భావించి తాను జీవితంలో చేసే ప్రతి పనీ దాని ఫలితమూ తన కోసమని ఆసించకుండా ఆ విశ్వశక్తులకే **Cosmic Powers** సమర్పణ చేయాలి. అంటే నిష్కామంగా కర్మ చేస్తూ పోవాలి. యజ్ఞ శిష్టామృత మంటే నిష్కామ కర్మ యజ్ఞమను కొంటే తత్ఫలితంగా ఈ కర్మయోగి ఎప్పటికైనా సర్వాత్మ భావమనే అసలైన అమృతాన్నే అంటే

Dr Dayananda Swamy ebooks



మోక్షాన్నే ఆస్వాదించగలడు. ఉట్టికెక్కి తరువాత స్వర్గమన్నట్టు మొదట ఈ మానవుడనే వ్యష్టి పరమాత్మ శక్తి శకలాలైన దేవతలనే సమష్టి జీవుల నాశ్రయిస్తే తరువాత ఆ బలంతో సమస్త సృష్టీ పరమాత్మ తత్త్వమని దర్శించే మహాశక్తినే స్వాధీనం చేసుకోగలడు. అంటే అర్థం అంతవరకూ కర్మయోగిగా శిక్షణ పొందుతూ వచ్చిన సాధకుడు అభ్యాస బలంతో క్రమంగా జ్ఞానయోగిగా మారిపోగలడు. అదే అమృతత్వమదే మోక్షమని తాత్పర్యం. అప్పుడిది వ్యావహారిక మది పారమార్థికమనే విభాగరేఖ చెరిగిపోయి సృష్టి రేఖాకారంగా కాక చక్రాకారంగా కనిపిస్తుంది. ఆది మధ్యాంతాలు మూడూ ఏకంగా భాసించటమే చక్రం. అది అందుకొనే ప్రయత్నమే చక్రావర్తనం. సాధకుడికది ప్రయత్నమైతే సిద్ధుడికది లక్షణమని గదా పేర్కొన్నాము. కనుక ఇద్దరికీ అది ఆవశ్యకమే.

**యస్త్వాత్మరతి రేవ స్యా - దాత్మ తృప్తశ్చ మానవః**

**ఆత్మన్యేవ చ సంతుష్ట - స్తస్య కార్యం న విద్యతే - 17**

ఇంతవరకూ చెప్పింది యోగి జీవితమైతే ఇక జ్ఞాని జీవితమెలాంటిదో వర్ణిస్తున్నది గీత. కర్మయోగి సాధకుడు. జ్ఞాని సిద్ధుడు. సాధకుడికే ప్రయత్నం. సిద్ధుడికి ప్రయత్నం కాదది లక్షణం. సాధకుడు చేస్తుంటాడు. సిద్ధుడు చూస్తుంటాడు. తయో రేకః పిప్పలం స్వా ద్వత్తి - అనశ్న న్న న్యో భి చాకశీతి అని గదా ఇరువురికీ తేడా వర్ణించింది శ్వేతాశ్వతరం. ఇందులో జ్ఞాన సాధన ఎలాంటిదో చూచాము. ఇప్పుడు సాధన దశ గడచి సిద్ధుడైన జ్ఞాని వ్యవహారం చూడబోతాము.

Dr Dayananda Swamy ebooks



యస్త్వాత్మ రతి రేవస్యాత్ – ఆత్మజ్ఞాన నిష్ఠుడు వీడు. ఆత్మలోనే రతి వీడికి – అందులోనే నిరంతరం రమిస్తుంటాడు. శబ్దాదులైన బాహ్య విషయాలలో కాదు. అసలు బాహ్య మాభ్యంతరమని ప్రశ్నే లేదు గదా. అంతా ఆత్మగానే అనుభవానికి వచ్చే వాడికేది బాహ్యమేది ఆంతరం. ఆత్మ తృప్తశ్చ మానవః – ఆత్మలోనే ఉండటం గాక ఆత్మతోనే తృప్తి చెందుతాడు. అన్నపానాదులతో గాదు. అవి ఇక సేవించడని గాదు. సేవిస్తున్నా వాటి ననాత్మగా **Object** గాక ఆత్మగానే దర్శిస్తుంటాడు. ఆత్మన్యేవ చ సంతుష్టః – అంతేకాదు. బాహ్యమైన వాంఛలేవైనా తీరితే మానవుడి కది సంతోషం. అలాటి సంతుష్టి జ్ఞానికి బాహ్యార్థాలేవీ లేవు కాబట్టి తన స్వరూప నిష్ఠలోనే తనకు లభిస్తుంటుంది.

ఎవడైతే ఇలా ఆత్మారాముడయి జీవిస్తుంటాడో వాడు స్థిత ప్రజ్ఞుడైన జ్ఞాని. తస్య కార్యం నవిద్యతే. వాడిక చేయవలసిన దంటూ ఏదీలేదు. చేయ వలసిందంటే శాస్త్రం విధించిన నిత్యనైమిత్తికాది కర్మలు. అవి యాంత్రికంగా కొంతకాలం చేసి ఆ తరువాత వాటిని నిష్కామంగా ఆచరించి చిత్తశుద్ధి సంపాదించి శుద్ధమైన మనస్సుతో శ్రవణ మననాదులు చేసి చివరకు గదా ఆత్మజ్ఞానం ఆర్జించి ఈ స్థితికి వచ్చాడు. అలాంటివాడు మరలా వెనక్కు రావటమేమిటి. కర్మకాండ పెట్టుకున్నాడంటే మరలా వెనక్కు రావటమే గదా. పైగా వెనకా ముందూ పైనా క్రిందా వెలపలా లోపలా అంతా బ్రహ్మమే అది స్వరూపమేనాయె. బ్రహ్మ పశ్చాత్ బ్రహ్మపురస్తాత్తనే ఉపనిషద్బోధ జ్ఞానికి జీవిత విధానమే అయిపోయింది. ఇక కర్మ చేయమన్నా చేయలేదు. కర్మ వాడికి జ్ఞానమే.

Dr Dayananda Swamy ebooks



**నైవ తస్య కృతేనార్థో - నాకృతే నేహ కశ్చన**

**నచాస్య సర్వ భూతేషు - కశ్చి దర్థ వ్యపాశ్రయః - 18**

ఇదం సర్వం యదయ మాత్మా అని సర్వమూ వాడి దృష్టి కాత్మగానే సాక్షాత్కరించి నప్పుడిక నైవ తస్యకృతే నార్థః - ఒక కర్మ ఆచరించటం వల్ల వాడాసించే ప్రయోజనమేదీ లేదు. నాకృతే నేహ కశ్చన. అలాగే ఒక పని చేయ నందువల్ల మోసం లేదు. అంటే ప్రత్యవాయాది దోషాలు అంటవు. కర్మిష్ఠుడి కైతే విహిత కర్మలు చేయకపోతే అంటుతుందది. అలాగే కర్మయోగికైనా నిష్కామంగా కర్మ పాటించకపోతే జ్ఞానప్రాప్తి అనే ప్రయోజనం కలగకుండా పోతుంది. ఆ రెండు దశలూ దాటి మూడవ స్థాయి కెదిగినవాడు కాబట్టి జ్ఞానికటు హానీ లేదు. ఇటు లాభమూ లేదు.

అంతేకాదు. న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థ వ్యపాశ్రయః - స్థావర జంగమాలలో దేనిని గాని ఒక ప్రయోజనం సాధించటాని కాశ్రయించ వలసిన అవసరం కూడా లేదు వాడికి. అలాటి అవసరమే కొంచెమున్నా దాని కోసమొక పనిపెట్టుకోక తప్పదు. అంతా బ్రహ్మమని అది తనస్వరూపమనే అభేద భావమెప్పుడూ ఎక్కడబడితే అక్కడ సర్వత స్సంప్లు తోదకంగా చూస్తున్నవాడి కెవరితో గాని దేనితో గాని అవసర మేముంది. అది కూడా వాడి స్వరూపం కన్నా వేరుగా లేదు గదా.

**తస్మా దసక్త స్సతతం - కార్యం కర్మ సమాచర**

**అస క్తో హ్యాచరన్ కర్మ - పరమాప్నోతి పూరుషః - 19**

Dr Dayananda Swamy ebooks



అంచేత ఇంతకూ చెప్పవచ్చే దేమంటే నీవు కర్మిష్ఠుడవా - కర్మయోగివా - జ్ఞానివా - ఎవడవో తేల్చుకో మొదట. నా దృష్టిలో నీవు కేవలం కర్మిష్ఠుడవే. అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలియదా అన్నట్టు నీసంగతి నాకు తెలియదా. యోగానికే ఎదగలేదు నీవింకా. జ్ఞానమెలా ఆసించగలవు. జ్ఞానవిషయం నేనెంత వర్ణించినా నీకది అప్పుడే వచ్చి ఒళ్లో పడదు. అది నీవందుకో వాలంటే ముందు దానికి కావలసిన శిక్షణ పొందాలి నీవు. అది ఏదో గాదు. కర్మయోగం.

అంచేత ఏమిటా అందరికీ జ్ఞానం చెప్పి నాకు మాత్రమే కర్మ చెప్పి ఘోరమైన కర్మక్షేత్రంలో పారేస్తున్నాడా ఈ పెద్దమనిషి అని నీవు నన్ను ఆక్షేపించనక్కర లేదు. నేను నీకు మంచే చేస్తున్నాను. చెడ్డ చేయటం లేదు. కేవల కర్మ చెబితే చెడ్డే. అది జ్ఞానాని కుపకరించదు. జ్ఞానానికి తోడ్పడే కర్మయోగం బోధిస్తున్నాను. ఇప్పటికి నీ యోగ్యతను బట్టి నీకు నేను బోధించ వలసింది అదే.

తస్మా దసక్త స్స తతం కార్యం కర్మ సమాచర - కర్మ చేస్తూ ఉండు. కాని ఏది కర్తవ్యమో అదే చేయి. కామ్యనిషిద్ధాలు వదిలేసి నిత్యనైమిత్తికాలే పాటిస్తూ పో. అది కూడా ఫలితాన్ని ఆసించకుండా అనాసక్తితో అనుష్ఠించు. ఫలకామనే నిన్ను దెబ్బ తీస్తుంది. అది నీకోసమని చూడకు. ఈశ్వరార్పణ బుద్ధితో అసక్తో హ్యాచరన్ కర్మ. స్వార్థ బుద్ధి లేకుండా చేశావంటే - పరమాప్నోతి పూరుషః - ఎప్పటికైనా సత్త్వం శుద్ధి అయి జ్ఞానం సంపాదించి చివరకు మోక్షమే పొందగలవు.

Dr Dayananda Swamy ebooks

**కర్మణైవ హి సంసిద్ధి - మాస్థితా జనకాదయః**

**లోక సంగ్రహ మేవాపి - సంపశ్యన్ కర్తు మర్హసి - 20**

కర్మ అనగానే నీవు లిక్కి పడతావేమిటి - తక్కువగా భావిస్తావేమిటి. కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః - పూర్వం జనకా శ్వపత్యాది సుక్షత్రియు లందరూ కర్మ యోగంతోనే తరించారు. సమ్యగ్దర్శన మనేది చిత్తశుద్ధి వల్ల గాని రాదు. అది కర్మయోగం వల్లగాని ఏర్పడదు. అలా సాధించిన వారే వారంతా.

అలా సాధించి సిద్ధులైన తరువాత కూడా వారుకర్మ మానుకోలేదు. లోక సంగ్రహమే వాపి సంపశ్యన్ - లోక సంగ్రహమని ఒకటున్నది. లోకులు దారి తప్పి పెడదారి తొక్కుతుంటే వారిని దారిలో పెట్టటానికి లోకసంగ్రహమని పేరు. సాధన మార్గ ముపదేశించి లోకోద్ధరణ చేయాలన్న మాట. నేను సిద్ధుడ నయ్యానిక నా కితరులతో పనేముందని ఊరక కూచోరాదు. స్వయం తీర్ణః పరాంస్తారయతి అన్నారు. తాను తరించి మరొకరిని తరింపజేయాలి. దీని కధికారమని **Deputation** అలాంటి వారి కాధికారిక పురుషులని పేరు. అలాంటి వారే జనకాదులు. మరి ఇంతకు ముందు చెప్పినవారో. వారు ఆత్మారాములు. వారికి లోకంతో పని లేదు.

ఏదైనా ప్రారబ్ధాధీనం మన జీవిత వ్యవహారం. ప్రారబ్ధమెలా తిప్పితే అలా నడుస్తుంటుంది. కొందరి కితరుల నుద్ధరించే పనిచెబుతుంది. మరికొందరి కాత్మోద్ధరణ చాలు ఏకాంతంగా బ్రతకమని సలహా నిస్తుంది.

Dr Dayananda Swamy ebooks



మొత్తం మీద ఇద్దరూ సిద్ధపురుషులే. గోవింద భగవత్పాదులు ఆత్మారాములైతే శంకర భగవత్పాదు లాధికారికులు. ఆ గురుశిష్యులలోనే చూస్తామీ రెండు తెగలూ. ఇలాటి వారే జనకాది రాజన్యులు. కాబట్టి నీవు కూడా సాధకుడవైనా చేయవలసి ఉంటుంది కర్మ. సిద్ధుడవైనా చేయవలసి ఉంది. కర్మ చేస్తే చెడిపోతామే పడిపోతామే అనే భీతాహ ముండ గూడదు నీకు. అంతా ఆత్మకోస మాత్మ స్వరూపమేననే భావమున్నప్పుడు పడే దేముంది. చెడే దేముంది. కర్మ లేక పోయినా యోగంగా ఆచరిస్తూపో.

**యద్యదాచరతి శ్రేష్ఠ - స్తత్త దేవేతరో జనః**

**సయత్ప్రమాణం కురుతే - లోకస్తదను వర్తతే - 21**

అయితే లోక సంగ్రహ మన్నారే. అది ఎందుకు పెట్టుకోవాలి సాధకుడు. వాడి పాటికి వాడు సాధన చేస్తూ పోవచ్చు గదా. ఇతరుల జోలి దేనికి అని ప్రశ్న వస్తే దానికి సమాధాన మిస్తున్నాడు. యద్యదా చరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః – ఉత్తముడైన మానవుడేది మార్గమని నడిస్తే అదే మార్గంలో ఇతరులు కూడా నడుస్తారు. స యత్ప్రమాణం కురుతే – లోక స్తదను వర్తతే – అంతేకాదు. వాడేది ఆదర్శంగా చూపుతాడో లోకాని కదే జీవిత గమ్యమని భావించి లోకులు దాని వైపే పయనిస్తారు కూడా.

ఇది మానవ మనస్తత్త్వాన్ని ఎంతో మధించి వ్రాస్తున్నాడు వ్యాసమహర్షి. గతాను గతికో లోకః – లోకమొక గొర్రె దాటు. ఎవరేది చేస్తే అది చేస్తుంది. చాలా వరకు మూఢుడీ మానవుడు. స్వతంత్ర ప్రజ్ఞ లేదెవరికీ. అది కనిపెట్టి వారిని చెడ్డమార్గంలో ప్రవేశ పెడతా డొక్కొక్కడు.

Dr Dayananda Swamy ebooks

తాను చెడి పదిమందిని చెడగొట్టే బాపతువాడు. అలాటి వాడి మాట వింటారు. వాడి మార్గమూ అనుసరిస్తారు లోకులు. పోతే అలా కాక అన్నివిధాలా శ్రేష్ఠుడైన మహానుభావుడూ ఉంటా డొక్కొక్కడు. వాడు తానా చరించి లోకు లందరినీ అలాగే ఆచరించమని బోధిస్తాడు. వాడి మాటా వింటారీ లోకులు. అందరూ కాకపోయినా కొందరైనా వీణ్ణి అనుసరించి బాగుపడవచ్చు. కాబట్టి గొప్పవాడెప్పుడూ లోకాన్ని పెడదారి పట్టించడు. మంచి మార్గంలోనే తీసుకు పోతాడు.

ఇది ఎంత గొప్ప సుభాషితమంటే ఈనాటి సాంఘిక రాజకీయ నైతిక ధార్మిక వైయక్తిక వైజ్ఞాని కాధ్యాత్మికాది అన్ని రంగాలలో మనకు కండ్లకు కట్టినట్టు కనపడే సత్యం. మంచి చెప్పే వాడున్నాడు. చెడ్డ చెప్పే వాడున్నాడు. అందులో చెడ్డకు మంచి అనే రంగు పూసి లోకులను తమ దారికి తిప్పుకొనే వాళ్లే నూటికి తొంభయిమంది తరుచుగా అన్ని రంగాలలో కనిపించేది. **Cheap popularity** కోసం ప్రయత్నించే నాయకులందరూ వారే. అయితే వారు గీత చెప్పిన శ్రేష్ఠులు గారు. శ్రేష్ఠమ్మన్యులూ శ్రేష్ఠాభాసులూ. అలాటివారి మాటలను నమ్మి బేలుపడే వారే ఎక్కువమంది అయినా నిజంగా శ్రేష్ఠులయిన వారు కూడా లేకపోలేదు. ఎక్కువ మంది కాకున్నా కొంతమందైనా వారి మార్గంలో నడుచుకోని వారూ లేకపోలేదు. అలాంటి వారే ఆధ్యాత్మిక రంగంలో నలుగురికీ దర్శకులైన మహానాయకులు. వారి ననుసరిస్తేనే బాగుపడుతుందీ లోకం. నీవూ అదే అవలంబించు అర్జునా. అర్జునా అనే సంబోధన ఆనాటి అర్జునుడికే గాదు. మనకూ కూడా ఇది గొప్ప హెచ్చరిక. సార్వజనీనమైన సందేశమిది.

Dr Dayananda Swamy ebooks



**నమే పార్థాస్తి కర్తవ్యం - నమే కర్మఫలే స్పృహా**

**నాన వాప్త మవాప్తవ్యం - వర్త ఏవ చ కర్మణి - 22**

**యది హ్యహం న వర్తేయ - జాతు కర్మణ్య తంద్రితః**

**మమ వర్త్మాను వర్తంతే - మనుష్యాః పార్థ సర్వశః - 23**

**ఉత్సీదేయు రిమే లోకాః - నకుర్యాం కర్మ చే దహం**

**సంకరస్య చ కర్తాస్యామ్ - ఉపహన్యా మిమాః ప్రజాః - 24**

ఇంకా బోధిస్తున్నాడు కృష్ణ భగవానుడు. అది కూడా ఎవరి జీవితానికో గాదు. తన జీవితానికే అన్వయించి చెబుతున్నాడు. ఎప్పుడే గాని దానిమీద దీనిమీద నెపం పెట్టి చెప్పే దానికన్నా తన స్వానుభవమే ఆవిష్కరి స్తున్నప్పు డెదుటి వారి కా చెప్పే మాట మీద నమ్మకం బాగా కలుగుతుంది. అంతవాడే అలా నడుచు కొంటున్నప్పుడు మనం కూడా అలా నడుచుకోటంలో తప్పేముంది. అలాగే ప్రవర్తించటం మంచిదనే నిశ్చయం కూడా ఏర్పడుతుంది.

ఏమి టిప్పుడు కృష్ణుడి వ్యవహారం. నమే పార్థాస్తి కర్తవ్యమ్ - అర్జునా నేను చేయ వలసిన దంటూ ఏదీ లేదు లోకంలో. నమే కర్మఫలే స్పృహా. ఒకటి చేయటమంటే దాని ఫలిత మాసించిగదా చేస్తాము. అలాటి ఫలాపేక్ష కూడా లేదు నాకు. నాన వాప్త మవాప్తవ్యమ్. పైగా ఇంతవరకూ నాకు లేనిదైతే దాన్ని ఆసించి చేయవలసి ఉంటుంది ప్రయత్నం. అన్ని కోరికలు నాకు ప్రాప్తించే ఉన్నప్పుడిక ఏది ప్రాప్తించాలని చేయాలి కర్మ. వర్త ఏవచ కర్మణి - అయినా నేను పనులు పెట్టుకొంటూనే ఉన్నానా లేదా. మీ అందరి పనులూ నేను పెట్టుకొంటూనే ఉన్నాను గదా అంటాడు.

Dr Dayananda Swamy ebooks



అన్నీ సమకూరినా నేను చేస్తున్నానంటే కర్మయోగికి చేస్తున్న ఉపదేశమిది. సర్వజ్ఞుడనైన నేనే కర్మ నాచరిస్తుంటే నీబోటి వాడాచరించక పోవటమేమిటి. తప్పకుండా కర్తవ్యం నీవు చేయాలని ఆదేశమిది. అంతే కాదు. అటు కర్మిష్ఠులకూ ఇటు జ్ఞానులకు కూడా కర్మాచరణ తప్పదని కూడా సూచనే. కర్మిష్ఠుడైతే యోగబుద్ధితో చేయాలని జ్ఞాని అయితే లోకసంగ్రహార్థం చేయాలని సలహా. అది తన జీవితానికే ముడిపెట్టి చెప్పట మొక చమత్కారం.

అంతేగాక ఇక్కడ ఒక రహస్యముంది. ఆయన పరమాత్మ అనే భావం కొట్టవచ్చినట్టు కనపడుతున్నదీ మాటల్లో. పరమాత్మ సర్వవ్యాపకుడూ కూటస్థుడూ గనుక ఆయనకే కర్మా లేదు. ఏ కర్మ స్పృహా లేదు. ఏ కోరికా తీరక పోవట మంటూ లేదు. ఆప్త కాముడూ. ఆత్మ కాముడూ అకాముడూ అని వర్ణిస్తున్న దుపనిషత్తు. అంతేకాదు. ఇలా ఉండిపోవట మూ పరమాత్మ స్వరూపమైతే అన్ని పనులూ చేస్తూపోవట మాయ న విభూతి. అనేజ దేకం జవనో గ్రహీతా అని శాస్త్రం చెప్పినట్టు స్వామి వారి ద్విపాత్రాభినయం ధ్వనిస్తున్నది.

పైగా యదిహ్యహం న వర్తేయ జాతు కర్మ ణ్యతంద్రితః – జాగ్రత్తగా నేనే పనీ చేయకుండా తప్పించుకొని కూచున్నానే అనుకో. మమ వర్త్మాను వర్తంతే మనుష్యాః – అంతవాడే అలా కూచున్నాడు గదా మనం మాత్రమెందుకు పెట్టుకోవాలీ కర్మలన్నీ. ఎగగొట్టి తిరిగితే తప్పేమిటట – అని లోకులందరూ నామార్గాన్నే అవలంబించి సోమరులయి పోయినా పోవచ్చు. అంతేకాదు.

Dr Dayananda Swamy ebooks



ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహం - నేనే పనిమానేసి బద్ధకించానంటే అసలీ లోకాలే తల్లకిందులయి పోతాయి. నష్టమయి పోతాయి. సంకరస్యచ కర్తాస్యామ్ - ధర్మ సాంకర్య మేర్పడి పెద్ద విప్లవమే సంభవిస్తుంది. అంతేగాక ఈ ప్రజా నీకాన్నంతా నేనయి చెడగొట్టిన వాణ్ణవుతాను. ఉపహన్యా మిమాః ప్రజాః - నామూలంగా ప్రజలందరూ నశిస్తారు.

ఏమిటీ మాటలు. ఏమిటి పరమాత్మ తాత్పర్యం. శ్రేష్ఠుడైన వాడేది ధర్మమని ఆచరిస్తే అలాగే అందరూ పాటిస్తారని మొదట చెప్పాడే. దాని కిదంతా వ్యాఖ్యానం. వివరణ. అంచేత ఒక రంగంలో నాయకత్వం వహించే వాడికెలాంటి బాధ్యత ఉందో ఉండాలో మనకు గుర్తు చేస్తున్నాడు భగవానుడు. పోతే ఇంకా ఇందులో ఉన్న ఆంతర్య మేమంటే ఈశ్వరుడే కర్మ చేయటమనే బాధ్యత పెట్టుకోకపోతే ప్రపంచ సృష్టి ఎలా జరగాలి. ప్రజాజీవిత మెలా సాగాలి. సృష్టి స్థితిలయాలే గా ఈశ్వర కార్యం ఈశ్వరుడే సృష్టి చేయకుంటే మనకు యోగమే ముంది జ్ఞాన మేముంది. ఎవరేది సాధించాలి. సాధించి ఏ సిద్ధి పొందాలి. అంతా అసత్కల్పమే అయిపోతుంది. అంతా అసత్తనేది పారమార్థిక సత్యమే అయినా వ్యావహారిక సత్యంగా ఈ జగత్తనే దొకటి జీవుడొకడూ వాడి జీవితమొకటీ కనిపిస్తున్నాయి గదా. అవి కనిపిస్తున్నవి గనుకనే వాటిని తాత్కాలికంగా పట్టుకొని కర్మ జ్ఞానయోగాలనే మోక్షమార్గంలో కృషి చేసి ఎప్పటికైనా ఆ పారమార్థికమైన ఈశ్వరత్వాన్ని అందుకోవాలీ మానవు డప్పుడే ఈ మానవ జీవితం సార్థక మవుతుందనే భగవదాశయం కూడా తొంగి చూస్తున్న దిందులో.

Dr Dayananda Swamy ebooks

**సక్తాః కర్మ ణ్యవిద్వాంసో - యథా కుర్వంతి భారత**

**కుర్యాద్విద్వాం స్తథా - సక్త - శ్చికీర్షు ర్లోక సంగ్రహమ్ - 25**

అసలు కర్మయోగమని చెప్పామే అది చాలా మంచి శిక్షా మార్గం సాధకుడికి. సాధించవలసింది చివర కాత్మజ్ఞానమే అయినా అది కర్మయోగం ద్వారానే కలగాలి. మరో మార్గం లేదు. కర్మయోగమన్న మాత్రాన అది కర్మానుష్ఠానమని ఎప్పుడూ భ్రమపడరాదు. అనుష్ఠానం జ్ఞానానికే మాత్రమూ తోడ్పడదు. కారణ మందులో సమష్టి దృష్టి లేదు. వ్యష్టి చింతనే ఉంటుంది అందులో. నేను అనే అహంకారమూ నాకోసమనే మమకారమూ తప్పనిసరి కర్మాచరణలో. అది వదలకుండానే ఎంతో పట్టుదలతో చేస్తుంటాడు వాడా పని. సమష్టి జ్ఞానం లేదు కాబట్టి వాడు విద్వాంసుడు కాడు. అవిద్వాంసుడు. అజ్ఞాని.

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి - ఇలాంటి అజ్ఞాని అయినవాడు తన విధ్యుక్త కర్మలెలా ఫలాసక్తితో క్రమం తప్పకుండా చేస్తాడో. కుర్యాద్విద్వాం స్తథా సక్తః - జ్ఞాని అయిన వాడు కూడా అలాగే అనాసక్తితో అంత పట్టుదలగా సాగించాలి కర్మయోగం. కర్మయోగమైనా కావచ్చు ఇది. జ్ఞానయోగమైనా కావచ్చు. కర్మయోగమైతే ఈశ్వర దృష్టి వదలకుండా చేసి చివరకాత్మ జ్ఞానం సంపాదిస్తాడు. అలా కాక ఆత్మజ్ఞాని అయితే ఈశ్వరుడు కూడా తన కాత్మ స్వరూపుడే కాబట్టి సర్వత్రా ఆత్మనే చూస్తూ ప్రారబ్ధం తన కప్పగించిన కర్మ ఎంతో అంత సాధిస్తూనే ఉంటాడు. మొత్తం మీద ఇద్దరూ అనాసక్తులే.

Dr Dayananda Swamy ebooks



చికీర్షు ర్లోక సంగ్రహమ్. ఇప్పుడీ జ్ఞాని కేవల మనాసక్తుడే గాక లోక సంగ్రహార్థం కూడా కర్మ చేయవచ్చు. కర్మయోగికి **Port folio** లేదు. జ్ఞాన యోగికి మాత్రమే ఇది. ఎందుకంటే కర్మయోగి కర్మ సత్త్వశుద్ధికీ జ్ఞానప్రాప్తికే చేస్తుంటాడు. వాడికదే ప్రయోజనం. జ్ఞానికిక శుద్ధి ప్రాప్తి అనే ప్రమేయం లేదు కాబట్టి వాడి ప్రయోజనమిక లోక సంగ్రహమే. ఇదీ మనమిక్కడ గుర్తుంచుకో వలసిన సూక్ష్మం.

**న బుద్ధి భేదం జనయే - దజ్ఞానాం కర్మ సంగినామ్**

**జోషయే త్సర్వ కర్మాణి - విద్వాన్ యుక్త స్సమాచరన్ - 26**

ఇంకొక మాట. జ్ఞాని అయిన వాడు లోకసంగ్రహం చేసే పని పెట్టుకొన్నప్పు డొక విషయం గుర్తుంచుకో వలసి ఉంది. చేయమన్నారు గదా అని మూకుమ్మడిగా అందరినీ తన మార్గానికి బలవంతంగా మరల్చటానికి పూనుకోగూడదు. తాను చెప్పింది వినేవారుంటారు. పెడచెవిని బెట్టే వారుంటారు. లోకులందరిదీ ఒకే స్వభావం కాదు గదా. ఎవరి మతం వారిదే. అందులో కొంతమంది తమ మతమెంత రెటమతమైనా అదే కరెక్టని వాదించే వారుంటారు. అంతకుమించి మంచి చెప్పినా ఆలకించే వివేచన ఉండదు వారికి.

కనుకనే భగవానుడు జ్ఞానులను హెచ్చరిస్తున్నాడు. న బుద్ధి భేదం జనయే దజ్ఞానాం కర్మసంగినాం. తమకేది హితమో తెలియక యావజ్జీవం హోష్యామి అని కర్మానుష్ఠానం లోనే తల మునక లయిన వారి జోలికి వెళ్లవద్దు. మంచో చెడ్డో వారొక లక్ష్యం పెట్టుకొని జీవితానికి అదే

Dr Dayananda Swamy ebooks



మార్గమని నమ్ముతున్నారు. అలాంటి వారి బుద్ధిని ప్రక్కకు త్రిప్పటానికి ప్రయత్నించవద్దు. ప్రయత్నించినా దానివల్ల ప్రయోజనం లేదు. ఎప్పటికీ మారరు వారు.

జోషయే త్సర్వకర్మాణి విద్వాన్ యుక్తః - వారేది పట్టుకొని చేస్తుంటే అదే భేష్ అలాగే చేస్తూపో అదే మంచిదని ఆమోదించటం మంచిది. నీవు జ్ఞానివే గదా. అది నీవరకే ఉంచుకో. ఆ జ్ఞానం అక్కరలేని వాడి మీద అది బలవంతంగా వేసి రుద్దవద్దు. కొంతకాలానికి ప్రాప్తముంటే వాడికే బుద్ధి మారుతుంది. అప్పుడు నీ బోధ వినటానికి వాడే నీ దగ్గరికి పరుగెత్తి వస్తాడు. ఆకలి లేనివాడి కన్నం పెట్టి ఏమి సుఖం. అలా చేస్తే రెండు నష్టాలు. చెవిటి వాడికి శంఖూదినట్లు నీ జ్ఞాన బోధకు విలువ లేకుండా పోవటమొకటి. వాడేమిటా ఏవేవో చెప్పి నన్ను పెడదోవ పట్టిస్తున్నాడే వీడని నీమీద కారాలు మిరియాలు నూరటమొకటి. కన్నుపోయే కాటుక పెట్టుకోట మెప్పుడూ పనికిరాదు.

ఇదీ ఎంతో గొప్ప ఉపదేశం గీతలో. ఇది ఈనాడు మత ప్రచారం ధర్మప్రచారం చేయటం ఒక ఫాషనుగా పెట్టుకొని సతమతమయ్యే ప్రతి ప్రచారకుడికీ పెద్ద హెచ్చరిక. ప్రచారం కాదు మనకు కావలసింది. విచారం. విచారం లేని ప్రచారం పునాది లేని కట్టడం లాంటిది. ఎప్పటికీ నిలవదు.

**ప్రకృతేః క్రియమాణాని - గుణైః కర్మాణి సర్వశః**

**అహంకార విమూఢాత్మా - కర్తాహ మితి మన్యతే - 27**

**తత్త్వవిత్తు మహాబాహో - గుణకర్మ విభాగయోః**

**గుణా గుణేషు వర్తంత - ఇతి మత్వాన సజ్జతే - 28**

Dr Dayananda Swamy ebooks



కాకపోయినా నీవు వారినీ వీరినీ మూకుమ్మడిగా మార్చి పారేయాలని ఎందుకింత తాపత్రయం. నీవు ఎంత పోరాడినా మారే యోగ్యత ఉన్నవాడే మారుతాడు గాని అలాటి యోగ్యత లేని వాడెప్పుడూ మారబోడు. ఎందుకంటే ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి. నీవొకటి గుర్తించటం లేదు. ప్రకృతి గుణాలని మూడున్నాయి.సత్త్వరజస్తమస్సులు. అవి కార్యకరణ రూపంగా మనలో ప్రవేశించాయి. కార్యమంటే శరీరం. కరణమంటే మనః ప్రాణేంద్రియాలు. ఎవడే పని చేసినా వాడు గాదా పని చేయటం. అది లౌకికమే కావచ్చు. శాస్త్రీయమే కావచ్చు. కర్మలన్నీ చేస్తున్నదీ ప్రకృతి గుణాలైన ఇంద్రియాలే అవి చేస్తున్న కర్మలు కూడా ఆ గుణాలే.

అలా గుణాలూ గుణాలూ తమలో తాము లావాదేవీ పెట్టుకొని సతమత మవుతుంటే అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే తనకేమీ సంబంధం లేకపోయినా ఈ మానవుడు తానే వాటి కన్నిటికీ కర్తనని అపోహ పడుతున్నాడు. ఏమి కారణం. అహంకార విమూఢాత్మా. కార్యకరణ సంఘాతాత్మ ప్రత్యయః అహంకారః అని భాష్యం. కార్యమైన శరీరమూ - కరణమైన మనః ప్రాణాలూ - ఇవే నేను అని వాటితో తాదాత్మ్యం చెందాడు పుట్టినప్పటి నుంచీ ఈ మానవుడు. చెందేసరికి అవి చేస్తున్న పనులు తానే చేస్తున్నానని వాటి కర్తృత్వ మనవసరంగా తన మీది కారోపించు కొన్నాడు. అంచేత అవి ఎలా తిప్పుతుంటే అలా తిరుగుతుంటాడు. అవి నీవు కర్తవంటే కర్త అవుతున్నాడు. భోక్తవని చెబితే భోక్త అవుతున్నాడు. అలాంటప్పుడు నీవు కర్తవుగావు. భోక్తవుగావు.

Dr Dayananda Swamy ebooks



సాక్షి మాత్రుడవు సాక్షి రూపమైన ఆత్మను పట్టుకోమని వాడికెంత బోధించి ఏమి ప్రయోజనం

మరి తత్త్వవేత్త కైతే నీవు చెప్పనే అక్కరలేదు. తత్త్వ విత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః – ప్రకృతి గుణాలేవో అవి సాగించే కర్మలేవో బాగా వివేచన చేసి చూడగలవాడే తత్త్వవేత్త. అలాటివాడు తాను వాటికి సాక్షినని భావిస్తాడేగాని కర్తనని భోక్తనని కలలో కూడా బోల్తాపడడు. గుణాగుణేషు వర్తంతే ఇతి మత్వా – ప్రకృతి గుణాలు ఇంద్రియాలుగా మారి ఆయా కర్మలుగా మారిన ఆ గుణాలతోనే గుడుగుడు గుంచ మాడుతున్నాయి. మనకేమి సంబంధమని వివేక బుద్ధితో దర్శించగలడు. నసజ్జతే – అలా దర్శిస్తూ తన సాక్షి భావమెప్పుడు గుర్తించాడో అప్పుడిక వాడు వాటిలో తగులుకొనే ప్రసక్తే లేదు. సక్తుడు కాడు వాడు. ముక్తుడు.

**ప్రకృతే ర్గుణ సమ్మూఢాః - సజ్జంతే గుణ కర్మసు**

**తా నకృత్స్నవిదో మందాన్ - కృత్స్నవి న్నవిచాలయేత్ - 29**

అసలు విషయ మేమంటే ప్రపంచ మంటేనే అది త్రిగుణాత్మకం. మానవుడూ వాడి బుద్ధీ త్రిగుణాత్మకమే. అందులోనూ రజోగుణ ప్రధానుడు మానవుడు. రజస్సు చలనాత్మకమైన గుణం. కనుకనే మనసెప్పుడూ చలిస్తుంటుంది. ఆ పనీ ఈ పనీ చేయాలని ప్రాకులాడు తుంటుంది. ప్రకృతే ర్గుణ సమ్మూఢాః – ప్రకృతి గుణాలు వారి బుద్ధి నిటూ అటూ తిప్పి స్తిమితత లేకుండా చేస్తుంటాయి. సజ్జంతే గుణ కర్మసు – అంచేత వాడసలు విషయ మాలోచించ లేడు. అలాటి సామర్థ్యం కోలుపోయాడు

Dr Dayananda Swamy ebooks



మానవుడు. కోలుపోయి ఇంద్రియాలూ వాటి వ్యాపారాలే పరమార్ధమని వాటిలోనే తలదూర్చి అందులోనే తలమునక లవుతుంటాడు.

తాన కృత్స్న విదో మందాన్ - లోకంలో మూప్పాతిక మంది మానవులీ కోవకు చెందినవారే. మందబుద్ధులు. పూర్తిగా విషయం తెలియదు వారికి. తమకు తెలిసినదే సర్వమూ నని భ్రమ పడుతుంటారు. అలాగే బ్రతుకుతుంటారు. వారికి తెలిసిందేమిటి. కర్మాచరణమే మరేదీ గాదు. పామరంగా బ్రతికేవారైతే నిషిద్ధాలూ కామ్యకర్మలూ వీటితోనే సరి పుచ్చుకొంటారు. కొంచెం పైస్థాయి కెదిగితే నిత్య నైమిత్తిక కర్మలతో కాలం వెళ్లబుచ్చుతుంటారు. ఆత్మ జ్ఞానం లేకపోవటమే దీనికంతటికీ మూలం కర్మలూ కర్మఫలమూ - వీటిమీదనే దృష్టి. ప్రజ్ఞ ఉంది గాని అది మంద ప్రజ్ఞ అంటారు భగవత్పాదులు.

కృత్స్న వి న్న విచాలయేత్. అలాటివారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవరు. తత్త్వవేత్త. జ్ఞాని అని అర్థం. వాడే కృత్స్నవిత్. అంటే సంపూర్ణంగా జగత్తత్త్వం జీవితతత్త్వం తెలిసినవాడు. ఏమిటది. సర్వమూ ఆత్మస్వరూపమనే అద్వైత దృష్టి. వాడేగదా సిద్ధపురుషుడని చెప్పాము. ప్రారబ్ధం తీరి దేహపాతమయ్యే వరకూ ఆత్మారాముడు కాకపోయినా అధికారిక పురుషుడైన వాడు లోకోద్ధరణ చేయాలని గదా పేర్కొన్నాము. అలా చేయాలిగదా అని కనిపించిన ప్రతి వాడికీ తత్త్వబోధ చేస్తూ పోగూడదు. ఎందుకంటే జిజ్ఞాసువులైతే వాడి బోధ కొంతవర కందుకోగలరు గాని కర్మిష్ఠులకది ఎంత మాత్రమూ నచ్చదు. రెచ్చిపోతారు కదా. అంచేత అలాటి పామరుల జోలికెప్పుడూ పోరాదు. వారినసలు కదప గూడదు.

Dr Dayananda Swamy ebooks

అంటే వారికున్న బుద్ధిని చలింప చేయగూడదు. అది కర్మకూ తప్పి జ్ఞానానికీ తప్పి ఉభయభ్రష్టమై పోతుంది. అసలు నీవెవరు నాకు చెప్పటానికని ఎదురు తిరిగినా తిరుగుతుంది. ఇది ఈనాటి మతప్రచారకుల కందరికీ ఎంతో గొప్ప హెచ్చరిక.

**మయి సర్వాణి కర్మాణి - సన్న్యస్యాధ్యాత్మ చేతసా**

**నిరాశీ ర్నిర్మమో భూత్వా - యుధ్యస్వ విగత జ్వరః - 30**

అయితే అలాటి మందబుద్ధు లిక బాగుపడే అవకాశమే లేదా అంటే ఉంది. ఒకరిమాట కాదనకుండా విన్నా బాగుపడతారు. అలాకాక దైవికంగా వాడికే కర్మ చేసి చేసి కొంతకాలానికి విసుగుపుట్టి సరియైన దారికి వచ్చినా బాగుపడతారు. ఆ సరియైన మార్గ మేమిటని అడిగితే ఇప్పుడు బయట పెడుతున్నాడు పరమాత్మ.

మయి సర్వాణి కర్మాణి స్సన్యస్య - నామీదనే నీవు చేసే కర్మలన్నీ పారేయి. కర్మలు పారేయటమంటే అవి చేస్తున్నాననే కర్తృత్వ బుద్ధీ - వాటి ఫలం నాకనుకూలించాలనే భోక్తృత్వ బుద్ధీ - రెండూ నని అర్థం. మరి ఈ రెండు బుద్ధులూ పోవాలంటే వాటి కతీతమైన గొప్ప బుద్ధి ఏర్పడాలి నీకు. అదేదో గాదు. అధ్యాత్మ చేతసా. వివేకబుద్ధి. అంటే జ్ఞానం కాకపోయినా కర్మయోగం. అహంకర్తా ఈశ్వరాయ భృత్యవ త్కరోమి నేను కర్తనుగాదు. ఈశ్వరు డొకడున్నాడు. వాడు నాచేత చేయిస్తుంటే ఒక భృత్యుడిలాగా చేస్తున్నాను అనే బుద్ధి ఇది.

కనీస మిలాటి బుద్ధి ఉన్నా మంచిదే. అయితే ఇది కూడా అప్రయత్నంగా సిద్ధించేది కాదు. నిరాశీ ర్నిర్మమో భూత్వా - అహం

Dr Dayananda Swamy ebooks

మమలు రెండూ ఉండకూడదు. నేను చేస్తున్నానని గాని ఇదే నాకు లభించాలని గాని కర్తృత్వ భోక్తృత్వాలు పైన బెట్టు కోరాదు. అవే గదా జీవభావం. లోకులకూ కర్మిష్ఠులకూ అవి రెండూ అవశ్యంగా ఉంటాయి. వాటికి క్రమంగా స్వస్తి చెబితే గాని ఆత్మ జ్ఞానానికి నోచుకో రెవ్వరూ. కర్మయోగ మనేది అటు కర్మానుష్ఠానానికీ ఇటు ఆత్మ జ్ఞానానికీ ఒక వంతెన లాంటిది. ఇది దాటిపోతే జ్ఞానం. దాటకుంటే అనుష్ఠానం. దాటే ప్రయత్నం చేస్తున్నా నీకు భయం లేదు. యుధ్యస్వ విగతజ్వరః - సంసారతాపం నీమీద అంతగా దాడి చేయ దర్జునా దానితో పొరాడి నీవు గెలవగలవని హామీ ఇస్తాడు భగవానుడు. కారణం జ్ఞానమనే జీవితలక్ష్యం వాడికి దగ్గర దగ్గరగా కనపడు తుంటుంది.

**యేమే మతమిదం నిత్య - మను తిష్ఠంతి మానవాః**

**శ్రద్ధావంతో నసూయంతో - ముచ్యంతే తేపి కర్మభిః - 31**

**యే త్వేత దభ్యసూయంతో - నాను తిష్ఠంతి మే మతం**

**సర్వజ్ఞాన విమూఢాంస్తాన్ - విద్ధి నష్టా న చేతసః - 32**

కర్మలు మానవద్దు - తప్పకుండా చేయాలి మానవుడు. అయితే అనుష్ఠానం గాదు యోగమని ఇంతదూరం నేను వర్ణించి చెప్పానుగదా పైగా ప్రమాణం కూడా చూపి చెప్పాను. యేమే మత మిదం నిత్యమను తిష్ఠంతి. అలాంటప్పుడిది పెద్దలు చెబుతున్నారు గదా ఆచరిస్తే మంచి జరుగుతుందని శ్రద్ధావంతః అనసూయంతః శ్రద్ధా ళువులయి అసూయా బుద్ధి లేకుండా ఏ మానవులు నాఈః ఆదేశాన్ని మన్నిస్తారో అలాగే

Dr Dayananda Swamy ebooks

అనుసరిస్తారో వారందరూ ముచ్యంతే తేపి కర్మభిః – తప్పకుండా కర్మబంధం నుంచి తప్పుకొని బయట పడతారు. కర్మలంటే ధర్మ మధర్మం కూడా నంటారు గురువుగారు. నిజంలో రెండూ బంధమే. ఒకటి ఇనుప సంకెల. మరొకటి బంగారు సంకెల. ఏదైతేనేం. సంకెళ్లు సంకెళ్లే.

ఇక్కడ ముచ్యంతే అన్నాడంటే వ్యాసభట్టారకుడు అసలైన ముక్తి కాదిది. అసలైన ముక్తి జ్ఞానం వల్లనే. కర్మయోగం వల్ల ముక్తి అంటే అది సత్త్వ శుద్ధి అయి జ్ఞానోదయమైతే క్రమంగా చివరకు కలిగేదని అర్థం చేసుకోవాలి మనం. ఇదైనా భాగవతమైన మతాన్ని తూచా తప్పక పాటించే వారి మాట. వారు శ్రద్ధాభక్తి తత్పరులూ – అసూయావర్జితులూ అయిన కర్మయోగులు.

పోతే యేత్వేత దభ్యసూయంతో నాను తిష్ఠంతి మేమతం – ఎవరలా కాక అసూయా పరులయి శ్రద్ధాసక్తు లణు మాత్రమైనా లేక నేను బోధించిన మార్గంలో నడచుకోరో తాన్ విద్ధినష్టా న చేతసః – అలాంటి అవివేకులే జ్ఞానానికీ నోచుకోక ఎందుకూ పనికిరాక పాడయిపోతారని తెలుసుకోమంటాడు భగవానుడు. అనుభవజ్ఞుడు చెప్పింది వినాలి బాగుపడాలి గాని నాకొకడు చెప్పేదేమిటి నేను వాడి మాట వినేదేమిటని పొగరున బడితే ఏమవుతాడు మానవుడు. తనకు తెలియదు. ఒకరు చెబితే వినడు. ఇక శ్రేయస్సు కలగాలంటే ఎలా కలుగుతుంది. రెంటికీ చెడ్డరేవడై పోతాడలాటివాడు. ఇది అప్పుడే గాదిప్పుడు కూడా. సార్వకాలికమైన సత్యమిది.

Dr Dayananda Swamy ebooks


**సదృశం చేష్టతే స్వస్యాః - ప్రకృతేః జ్ఞానవానపి**

**ప్రకృతిం యాంతి భూతాని - నిగ్రహః కిం కరిష్యతి - 33**

ఎందుకండీ ఈ మానవులు మీ మాట వినటం లేదు. ఎందుకు గాను మీరిచ్చిన సలహా పాటించక స్వధర్మానికి స్వస్తి చెప్పి పరధర్మాన్ని పట్టుకు పోతున్నారు. మీ మార్గంలోనే సర్వమానవులూ బ్రతుకుతున్నారని మీరే చెప్పారు గదా. అలా మీ మార్గంలోనే ఉండి మీరంటే భయం లేకుండా ఎలా బ్రతుకుతున్నారని అడిగితే భగవానుడు మనకు సమాధాన మిస్తున్నాడు.

ప్రతివాడికీ వాడి ప్రకృతి అని ఒకటి ఉంటుంది. ప్రకృతిర్నామ పూర్వకృత ధర్మాధర్మాది సంస్కారః వర్తమాన జన్మాదా వభివ్యక్తః అని అర్థం చెప్పారు భాష్యకారులు. ప్రకృతి అంటే ఇది త్రిగుణాత్మకమైన మూల ప్రకృతి కాదు. ఇంతకు ముందు జన్మలలో మనం చేసుకొన్న పుణ్యపాపకర్మల తాలూకు సంస్కారం **Impression.** అది ఇప్పుడీ జన్మలో ప్రారబ్ధ రూపంగా బయటపడి మనమీద పని చేస్తుంటుంది.

అంచేత వస్తుతః మానవులంతా భగవన్మార్గంలోనే బ్రతుకుతున్నా వాళ్ల బుద్ధి కలా తోచటం లేదు. ప్రారబ్ధ కర్మ అలా తోచనివ్వదు. తోచనివ్వక ఏం చేస్తుంది. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి - వారి నా మార్గానికి తప్పిస్తుంది. ఎవడి ప్రారబ్ధానికి తగినట్టే వాడు నడచుకొంటాడు. అలాగే ఆలోచిస్తాడు. అలాగే మాటాడుతాడు. అలాగే ప్రవర్తిస్తాడు. అంతకు పయి ఆలోచన రానేరాదు. ఆలోచనే రాక పోతే ఇక మాటా నడతా అనే మాటేముంది. అవీ దానికి తగినట్టే ఏడుస్తాయి. పోనీ ఇది అజ్ఞానికే

Dr Dayananda Swamy ebooks

గాని జ్ఞానికి లేదనటానికి వీలులేదు. అజ్ఞానీ జ్ఞాని అనే తేడా లేదు. ఎవడికీ తప్పదు ప్రారబ్ధ ప్రభావం. ప్రకృతిం యాంతి భూతాని. సమస్త మానవులూ. మానవులే కారు. ఆ మాటకు వస్తే పశుపక్ష్యాదులు కూడా. అయితే సాధన మార్గాన్ని గూర్చి మాటాడుతున్నాము కాబట్టి ప్రస్తుతం వాటి విషయం మనకక్కర లేదు. మానవులంతా తమలో తాము ప్రారబ్ధాని కధీనులయి బ్రతుకుతున్నవారే. నిగ్రహః కిం క రిష్యతి. నిగ్రహం నిగ్రహమంటే ఏమి పనిచేస్తుందా నిగ్రహం. అంటే అర్ధం. నీవిలా నడుచుకో అలా నడుచుకో. అహం మమలు పెట్టుకోకుండా కర్మయోగ మవలంబించు. శ్రవణ మననాదులు చేసి జ్ఞాన యోగ మవలంబించు అని ఇలా శాస్త్రమూ పెద్దలూ మానవుడి కెంత బోధించినా ఏమి ప్రయోజనం. ప్రారబ్ధమనే అడ్డు తొలగనంత వరకూ అది ఎలా ఫలిత మిస్తుంది.

మొత్తం మీద ప్రారబ్ధ మా ప్రయత్నమా మన జీవితాన్ని నడిపేదని ఒక పెద్ద ప్రశ్న వచ్చిందిప్పుడు. అంతా ప్రారబ్ధాన్ని బట్టే జరుగుతున్నది. మనమేమీ చేసేది లేదంటారు కొందరు. అలా కాదు. ప్రారబ్ధానికి కొంతవరకే బలం. దాన్ని మించిన బలం ప్రయత్నాని కుంది. అది మాన వద్దంటారు మరి కొందరు. ఇలా రెండు విభిన్నమైన అభిప్రాయా లున్నాయి లోకంలో. వీటిలో ఏది కరెక్టు ఏది కాదని ప్రశ్న రావటం సహజమే. దీన్ని ప్రస్తుతం భగవద్గీత ఎలా పరిష్కరిస్తుందో చూతాము.

**ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే - రాగ ద్వేషౌ వ్యవస్థి తౌ**

**తయో ర్న వశ మా గచ్ఛే - త్తౌ హ్యస్య పరిపంధినౌ - 34**

Dr Dayananda Swamy ebooks



ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ - ప్రతి ఇంద్రియానికీ ఇంద్రియార్థాలని ఉంటాయి. అర్థాలన్నా విషయాలన్నా తన్మాత్రలన్నా ఒకటే. ఏవోగావవి. శబ్ద స్పర్శ రూప రస గంధాలు. పంచభూతాల తాలూకు బంట్రోతులివి. వీటి ద్వారానే పాంచ భౌతికమైన ప్రపంచంతో సంబంధం మనకు. ఇలా ఇంద్రియాలకూ ఇంద్రియార్థాలకూ వ్యవహారం జరుగుతుంటే అందులో రాగమూ కలగవచ్చు. ద్వేషమూ కలగవచ్చు. ఒకటి కావాలని అభిమానించటం రాగం - అక్కరలేదని త్రోసివేయటం ద్వేషం. **Likes and dislikes.** ఇవి అవశ్యం భావి అన్నారు భాష్యకారులు. తప్పనిసరిగా ఉంటాయి.

అయితే ఇది ఇక ఇంతేనా మన బ్రతుకని బేజారయి పోగూడదు మానవుడు. ఇంతవరకూ ఇది ప్రారబ్ధమైతే - ఇక ప్రయత్నమేమిటో చెబుతున్నా మంటున్నది గీత. తయోర్న వశ మాగచ్ఛేత్. ఆ కలిగే రాగద్వేషాలకు వశమయి పోగూడదు మానవుడు. ఎలాగంటే ప్రకృతి లేదా ప్రారబ్ధ - మనేది సర్వస్వతంత్రం కాదు. దానికొక హద్దున్నది. అది ముందు మన మనస్సులో రాగద్వేషాలనే భావాలను కల్పిస్తుంది. ఆ రాగద్వేషాలు తరువాత మనల నొక కార్యానికి పురికొల్పుతాయి. పురికొల్పితే దాని కనుగుణంగా మన మా పనిలో ప్రవేశిస్తాము. తత్ఫలితంగా సుఖదుః ఖాలను భవిస్తుంటాము.

అలా కాక మనసులో రాగద్వేషాలు పొటమరించినప్పుడే వాటిని త్రుంచి వేయగలిగితే చాలు. ఇక అవి పనికి పురికొల్పట మనేది జరగదు. పని చేయకపోతే ఫలితమనే దానికే ఆస్కారం లేదు. రాగద్వేషాలను

Dr Dayananda Swamy ebooks


రెచ్చగొట్టే వరకే ప్రారబ్ధానికి హద్దు. అంతకు మించి మన ప్రవర్తన వరకూ ప్రభావం చూపలేదది. మనమా పనిలో ప్రవర్తించనూ వచ్చు. మానుకోనూ వచ్చు. అది మన విమర్శ మీద ఆధారపడి ఉంటుంది. ఈ విమర్శే మానవ ప్రయత్నం. ప్రతిపక్ష భావన అనిపేరు పెట్టారు దీనికి భాష్యకారులు. రాగద్వేషాలకు ప్రతిపక్ష ముదాసీనత. అది మనచేతిలో ఉంది. అంచేత మానవుడు బుద్ధి జీవుడయినందుకు తన వివేక జ్ఞాన ముపయోగించుకొని ఏది హితమో ఏది అహితమో ఆలోచించి పనిచేస్తూ పోవాలి. లేకుంటే రాగద్వేషాలు చెప్పినట్టు చేసి దెబ్బతినవలసి వస్తుంది. తేహ్యస్య పరి పంథినౌ. అసలీ రాగద్వేషాలే మన పాలిటికి దొంగలు. దారి దోపిడీ దొంగలు. పరిపంథులంటే అదీ అర్థం. తస్కరా వివపథి అని వ్రాశారు గురువుగారు. శ్రేయోమార్గంలో అడ్డుతగలటమే అవి చేసే తస్క రత్వం. తస్కరులేమి చేస్తారు. మన దగ్గర ఉన్న డబ్బూ డాలకం దోచుకొంటారు. ఇక్కడ కూడా అదే. మానవుడి కంతో ఇంతో ఉన్న జ్ఞాన ధనాన్ని కాజేస్తాయి ఈ రాగద్వేషాలనే గజదొంగలు. ఇదీ విషయం.

ఇవి రెండూ చాలా విలువైన శ్లోకాలు. ప్రారబ్ధమా ప్రయత్నమా అని మీమాంస వస్తే అంతా ప్రారబ్ధమూ గాదు. అంతా ప్రయత్నమూ గాదని జవాబు. ప్రారబ్ధం గతానికి సంబంధించినదైతే ప్రయత్నం భవిష్యత్తుకు చెందినది. మన మిప్పుడు భూతంలో లేము. భవిష్యత్తులో లేము. వర్తమానంలో బ్రతుకుతున్నాము. కర్తా భోక్తా అన్నారు మనలను. భోక్తలం కాబట్టి ప్రారబ్ధ ఫలమిప్పు డను భవిస్తుంటాము. కర్తలం కూడా గనుక భవిష్యత్ఫలమైన జ్ఞానానికీ మోక్షానికీ ప్రయత్నిస్తుంటాము. అది

Dr Dayananda Swamy ebooks



జరిగింది అనుభవించే వరకే. ఇది జరగబోయేది అనుసరించే వరకే. అలా కాకుంటే ఎప్పటికీ లేదు మనకు మోక్షం. ప్రయత్నానికే ఆస్కారం లేకపోతుంది. అసలింతకు ముందు ప్రయత్నం లేకుండా ప్రారబ్ధం మాత్రమెలా తయారయింది. కనుక ప్రారబ్ధ ఫలంగా ఇప్పుడీ వర్తమాన జన్మలో కష్టసుఖా లను భవిస్తున్నా మరలా ప్రయత్నం చేసి తత్ఫలమైన ఆత్మజ్ఞానం కూడా అందుకోవచ్చు మానవుడు. వర్తమాన మనేది సంగమ స్థానం రెండింటికీ. మానవుడు కర్తా భోక్తా కూడా కాబట్టి భయం లేదు. ఒకవైపు ప్రారబ్ధ ఫల మను భవిస్తుంటాడు. మరొకవైపు జ్ఞానఫలమైన ప్రయత్నం సాగిస్తుంటాడు. రెంటికీ అవకాశముంది. ఇదీ గీత చేసే పరిష్కారం.

**శ్రేయాన్ స్వధర్మో విగుణః - పరధర్మాత్ స్వనుష్ఠితాత్**

**స్వధర్మే నిధనం శ్రేయః - పరధర్మో భయావహః - 35**

అయితే మరి పురుష ప్రయత్నమనేది చేయమని బోధించారు గదా. అది ఎలా చేయాలా ప్రయత్నం. అసలేమి చేయాలని ప్రశ్న వచ్చిందిప్పుడు. దానికి సమాధాన మిస్తున్నదీ శ్లోకం. శ్రేయాన్ స్వధర్మో విగుణః - లోకంలో ప్రతి వ్యక్తికీ స్వధర్మ మనే దొకటి ఉంటుంది. ధర్మంచర అని ప్రతివాడికీ వాడి వాడికి తగిన ధర్మం విధించింది శాస్త్రం. పిల్లల మొదలు పెద్దల వరకు - బ్రహ్మచారి మొదలు సన్న్యాసి వరకు - బ్రాహ్మణుడు మొదలు శూద్రుడి వరకు అందరికీ వారికి వారాచరించిన వలసిన ధర్మాలంటూ ఉన్నాయి. అందులోనూ ఎవరి ధర్మం వారిదే. వాడే చేయాలా ధర్మం. మరొకడు చేసేది కాదు. అసలు చేయగూడదు. వాడు చేస్తేనే

Dr Dayananda Swamy ebooks

శ్రేయోదాయకమది. అది విగుణమని మానేయగూడదు - గుణం లేని దేదో అది విగుణం. వాడి దృష్టిలో గుణం లేదని భావిస్తున్నాడు గాని నిజంలో గుణం లేనిది కాదది. గుణం లేనిదైతే శ్రేయస్సు కలగదు దానివల్ల. కాబట్టి విగుణమని అపోహ పడకుండా ఆచరించాలెవడి ధర్మం వాడు.

పరధర్మాత్ స్వనుష్ఠితాత్ - అంతేగాని పరులకు విధించిన ధర్మంలో తాను వేలు పెట్టరాదు. దీనికంటే అది ఎంతో బాగుంది నాకు అదే అనుకూలమని దాని వెంటబడరాదు. స్వనుష్ఠితాత్. అది తాను ఎంత నేర్పుతో అనుష్ఠించినా ఫలిత మివ్వదు. సత్ఫలితం లేకపోగా దుష్ఫలిత మిచ్చినా ఇవ్వవచ్చు. ఇంతెందుకు. స్త్రీ ధర్మం పురుషుడు చేసినా తప్పే. పురుషుడి ధర్మం స్త్రీ చేసినా తప్పే. ఒక విద్యార్థి ధర్మం విద్యాభ్యాసం. అది మానేసి రాజకీయాల్లో తిరిగా డనుకోండి. సరియైన వయసులో చదువు కోక పాడయిపోతాడు. ఒక ఉపాధ్యాయుడు చదువు చెప్పటం మానేసి వ్యాపారం కూడా చేస్తూ పోయాడనుకోండి. ఉద్యోగంలో నుంచి తీసేస్తారు. అలాగే ఒక కూలివాడు కూలిపని మానినా తప్పే. యజమాని కూలిపనికి దిగినా తప్పే. ఎవడి పనివాడు చేయటమే మంచిది. అలా చేస్తూ పోతే అందరూ తమ తమ కృషి చేసి సామూహికంగా సమాజాభ్యుదయానికి తోడుపడవచ్చు. వ్యక్తిగతమైన జీవితమూ నిరాటంకంగా సాగిపోగలదు.

స్వధర్మే నిధనం శ్రేయః - స్వధర్మ మాచరిస్తూ అందులో దైవికంగా కన్నుమూశాడే అనుకోండి. అయినా వచ్చిన ఉపద్రవ మేమీ లేదు. ఎప్పుడైనా ఎక్కడైనా ఏ పని చేస్తున్నా కాలం దీరితే కన్నుమూయ వలసిందే.

Dr Dayananda Swamy ebooks



ఏదో పనికిమాలిన పని నెత్తినబెట్టుకొని అందులో ప్రాణాలు పోగొట్టుకోటం కన్నా తన విధ్యుక్త ధర్మం తాను చేస్తూ మరణించినా అది ప్రశస్తమే. నలుగురూ అభినందిస్తారు. తనకూ ఆత్మసంతృప్తి. అంతేగాని పరధర్మో భయావహః – ఇతరులకు విధించిన ధర్మం తనదిగా భావించి అది తాను ఎంత గొప్పగా చేశానని సంతోషించినా ఎవరూ మెచ్చరు. తనకూ అది క్షేమం కాదు. మీదు మిక్కిలి భయావహమే ఎప్పటికైనా.

అర్జునుడికిది పెద్ద హెచ్చరిక. క్షత్రియుడికి యుద్ధం చేయడం ప్రజలను కాపాడటమే ధర్మం. అది మానేసి సన్న్యాసి ధర్మం స్వీకరించి పారిపోదామని చూస్తున్నా డర్జునుడు. తాత్కాలికంగా తప్పించుకు పోయినా అది తనకూ మేలుగాదు. ఇతరులకూ గాదు. పరుగెత్తి పోయాడు పిరికిపంద అని నలుగురూ చీ కొడుతారు తోడి క్షత్త్రియ వీరులు. శమదమాది సంపత్తి లేకుండా వీడికి సన్న్యాస మేమిటని అంతకన్నా నిరసిస్తారు మిగతా సన్న్యాసులు.

ఇంతవరకూ ధర్మ పురుషార్థాన్ని బట్టి చెప్పామీ శ్లోకాని కర్థం. పోతే మోక్ష పురుషార్థ దృష్ట్యా కూడా చెప్పవచ్చు. అది ఇంకా చమత్కారంగా ఉంటుంది. ధర్మమంటే అది ప్రవృత్తి రూపమైనా కావచ్చు. నివృత్తిరూపమైనా కావచ్చు. ప్రవృత్తి అయింది. ప్రస్తుతం నివృత్తి ధర్మం వినండి. విగుణః అంటే గుణరహితం నిర్గుణమని అర్థం. అదే స్వధర్మం. ఆత్మ తాలూకు ధర్మం. దానినే శ్రవణమన నాదులతో అవలంబిస్తూ పోవాలి సాధకుడు.

Dr Dayananda Swamy ebooks


అది తప్ప విడిచి పరధర్మం పెట్టుకోరాదు. అనుష్ఠించరాదు. ఆత్మకు పరమనాత్మ ప్రపంచం. దానిలో తల దూర్చి అందులో తల మునక లవటం పనికి రాదని భావం.

స్వధర్మే నిధనం శ్రేయః - ఆత్మజ్ఞాన నిష్ఠలోనే కన్ను మూసినా అది శ్రేయస్సే. వాడి ఉపాధికే గాని మరణం వాడికి లేదు. మృతుడని పేరేగాని వాడమృతుడే. అంతేగాని పరధర్మో భయావహః - ఆత్మజ్ఞానంలో కృషి చేయక యావజ్జీవమూ ప్రాపంచికంగా బ్రతుకు సాగించేవాడి మనుగడ ఎప్పటికీ ప్రమాదకరమే. దేహమే నేననే అభిమానం వదలి పోలేదు కాబట్టి పోయినా మరలా జన్మ ఎత్తవలసిందే. సంసార బాధలు పడవలసిందే. మరలా మరణించ వలసిందే. మరలా జన్మించ వలసిందే. ఇక భయావహం గాక మరేమిటి.

**అథ కేన ప్రయుక్తోఽయం - పాపం చరతి పూరుషః**

**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ - బలా దివ నియోజితః - 36**

ఇంతకూ విషయ ధ్యానమూ - రాగద్వేషాలూ - ధర్మాతిక్రమణమూ - ఇదంతా మానవుడి అధః పతనానికే మూలం. మొదటి నుంచీ భగవద్గీత మనకు చేస్తున్న ప్రబోధ మిదే. దీని నిలాగే అనుసరిస్తూ పోతే పతనమే గాని ఉత్పతనమనే దాని కెప్పుడూ నోచుకోలేదు మానవుడు. పతనం లేనప్పుడే ఉత్పతనం. మరి పతన మెప్పుడు లేకుండా పోతుంది. పతనానికి మూలకారణ మేదా అని పరిశోధించి దాన్ని వివేచనా బలంతో నిర్మూలించ గలిగినప్పుడు. ఏమిటా మూలకారణ

Dr Dayananda Swamy ebooks



మని ప్రశ్నిస్తున్నా డిప్పు డర్జునుడు. అనర్థానికి మూలమేదో తెలిస్తే గాని దాన్ని నిర్మూలించే ఉపాయ మన్వేషించి పట్టుకోలేడు మానవుడు.

అథకేన ప్రయుక్తోయం - పాపం చరతి పూరుషః - అసలొక మానవుడు పాపకార్యాలు చేస్తున్నాడంటే ఎందుకు చేస్తున్నాడు. ఎవరు చేయిస్తే చేస్తున్నాడు. అనిచ్ఛన్నపి. ఒకొక్కప్పుడు వాడు చేయాలని కోరకుండా చేస్తుంటాడు. బలాదివ నియోజితః - ఇష్టం లేకుండానే అధర్మానికి మొగ్గు చూపుతున్నాడంటే ఏదో శక్తి వెనకాల జేరి వాణ్ణి ముందుకు బలవంతంగా తోస్తున్న దనిపిస్తుంది. ఏమిటా శక్తి. ఎందుకలా పురమాయిస్తున్న దని ప్రశ్న. ప్రతి ఒక్కరికీ మనలో కలిగే సందేహమే ఇది. ముందు వెనక లాలోచించకుండా మనమొక పని చేస్తుంటాము. ఆ సమయంలో బుద్ధి పని చేయదు మనకు. మనశక్తిని మించిన దుష్టశక్తేదో మన వెనకాల పనిచేస్తున్న దని తోస్తుంది. ఏమిటది.

**కామ ఏష క్రోధ ఏష - రజో గుణ సముద్భవః**

**మహాశనో మహాపాప్మా - విద్ధ్యేన మిహ వైరిణమ్ - 37**

జవాబిస్తున్నాడు పరమాత్మ. ఏదో గాదది. దుష్టశక్తి కామమే. క్రోధమే. కామోకార్షీ న్మన్యుర కార్షీత్తని వేదవాక్యం. కామం చేయిస్తున్నది క్రోధం చేయిస్తున్నది మానవుడి చేత ప్రతి పనీ. మరేదీ గాదు. ఇంతకూ కామమా క్రోధమా అని అడిగితే రెండుగావని ఒకటే నని ఏకవచనంలో చెబుతున్నది గీత. రెండుగా కనిపించినా రెండుగావవి. నిజంలో రెండూ కలిసి ఒక్కటే. కామమే. దానికేదైనా అడ్డు తగిలితే క్రోధంగా మారుతుంది. అనుకూలిస్తే కామం. ప్రతికూలిస్తే కోపం. రాగద్వేషాలే ఈ కామక్రోధాలు మరోభాషలో.

Dr Dayananda Swamy ebooks


ఇంతకూ కామమను. క్రోధమను. ఇది రజోగుణం వల్ల ఏర్పడుతున్నది మానవులకు. రజోగుణం చలానాత్మకం. ఇది మానవుడికి ప్రత్యేకమైన గుణం. ఎప్పుడూ చలిస్తూనే ఉంటుంది మానవుడి బుద్ధి. రజోగుణం కామాన్ని ప్రేరణ చేస్తే అది పురుషుడి బుద్ధిని రెచ్చగొడుతుంది. దానితో అదీ ఇదీ కావాలని ప్రాపంచికమైన విషయాల మీదికి దాడి చేస్తుంది మనస్సు. అందులో తాను కోరింది కోరినట్టు లభిస్తే ఆనందం. లేకుంటే ఎక్కడ లేని కోపం. ఆందోళన. హడావుడి. చివరకు ఫలితం లేకపోగా కోపం మితిమీరి పోయి మనస్సును కుంగదీస్తుంది. స్తిమితత తప్పిస్తుంది.

మహాశనో మహాపాప్మా. మహాశనమీ కామం. ఎంత ఆహుతి పెట్టినా కడుపునిండదు దానికి. అది ఒక పెద్ద రాక్షసి. ఇంకా కావాలి కావాలనే గాని చల్లారేది గాదా కామానలం. అనలమని మంచిపేరే పెట్టారు. అలమంటే చాలు ననే భావం. అలాంటి తృప్తి లేదు గనుక అనలమన్నారు అగ్నిని. ఎన్ని కట్టెలు వేసినా ఇంకా మండుతూనే ఉంటుంది. అలాగే ఎన్ని కోరికలు తీరినా ఇంకా కావాలనే కోరుతుంటుంది మానవుడి బుద్ధి. తృప్తి అనేది ఎరగదు. మహాపాప్మా. తృప్తి ఎప్పుడు లేదో అప్పుడది ఎన్ని పాపాలకైనా ఒడిగడుతుంది.

విద్ధ్యేన మిహ వైరిణమ్. కనుక ఈ కామమే మానవుడికొక పెద్ద శత్రువు. గర్భ శత్రువు. మనతో పాటే పుట్టిందిది. యావజ్జీవమూ మనలను వెంటాడుతూనే ఉంటుంది. చివరకు మనతోపాటే అస్తమిస్తుంది. అస్తమిస్తుందని మాట సామెతే గాని నిజంగా అస్తమించదు. వృత్తిరూపంగా లేకపోయినా వాసనారూపంగా వెంటాడుతుంది. సూక్ష్మశరీరంలో

Dr Dayananda Swamy ebooks



మనతోపాటు లోకాంతరాలకు వస్తుంది. అక్కడి నుంచి జన్మాంతరాలకూ తరిమి కొడుతుంది. మరలా మన మీ కర్మభూమిలో జన్మిస్తే ఇక్కడ మళ్లీ వృత్తి రూపంగా ప్రత్యక్ష మవుతుంది. ఎంత శత్రుత్వాన్ని సాధిస్తున్నదో చూడండి మనమీద ఈకామ పిశాచి.

**ధూమేనా వ్రియతే వహ్ని - ర్యథా దర్శో మలేన చ**

**యథో ల్బేనా వృతో గర్భ - స్తథా తేనేద మావృతమ్ - 38**

**ఆవృతం జ్ఞానమేతేన - జ్ఞానినో నిత్య వైరిణా**

**కామరూపేణ కౌంతేయ - దుష్పూరేణాన లేన చ - 39**

ఇది ఒక పొగలాంటిది కామం. పొగ అనేది నిప్పులో నుంచే వస్తుంది. నిప్పులో నుంచి వచ్చి నిప్పునే కప్పివేస్తుంది. ధూమేనా వ్రియతే వహ్నిః – పొగ తాను చల్లగా ఉండి కూడా వేడిగా ఉన్న నిప్పును కప్పుతున్న దంటే ఎంత ఆశ్చర్యం. యథా దర్శోమలే నచ. అలాగే ఒక ఆదర్శముంది అద్దం. అది సహజంగా పరిశుద్ధమే. కాని మలేన – దుమ్ము ధూళి పడిందంటే దాని మీద నల్లగా బూజరగా మారిపోతుంది. యథోల్బేనా వృతో గర్భః – అలాగే మాతృగర్భంలో ఉన్న శిశువు కనపడకుండా ఆవరిస్తుంది ఉల్బం. ఉల్బమన్నా జరాయువన్నా ఒకటే. గర్భసంచి అని అర్థం. అది ఒక పొరలాంటిది. అది చుట్టూ చేరి శిశువును కప్పుతుంది. తథా తేనేద మావృతం. అలాగే కామమనే దట్టమైన పొర కప్పేసింది మన జ్ఞానాన్ని.

Dr Dayananda Swamy ebooks


జ్ఞానమనేది నిప్పులాంటిది. జ్ఞానాగ్ని అని గీత పెట్టిన పేరు. అగ్ని ఎలా వెలిగిపోతుందో ఆ వెలుగులో చీకటి ఎలా తొలగిపోతుందో జ్ఞాన ప్రకాశ మజ్ఞాన మనే అంధకారాన్ని పారదోలగలదు. కాని అది ఆ పని చేయకుండా పొగలాంటి కామం దానికి ప్రతిబంధకమయి కూచుంది. అలాగే అద్దంలాగా శుభ్రమయింది మన జ్ఞానం. నిర్మలమైన అద్దంలో పదార్థమెలా చక్కగా ప్రతిఫలించి కనిపిస్తుందో అలాగే నిరాకారమూ నిర్మలమూ అయిన మన జ్ఞానంలో కూడా పరమాత్మ తత్త్వం చక్కగా స్ఫురించవచ్చు. అలాటి అవకాశ మెంతైనా ఉంది. కాని కామం తెచ్చి పెట్టిన రజస్తమస్సులనే మాలిన్యం దాన్ని కప్పివేసింది. అలాంటప్పుడు పరమాత్మను చూసే శక్తి దానికెలా అబ్బుతుంది. అబ్బదు.

ఇక్కడ ఒక సూక్ష్మ మేమంటే అగ్ని గాని ఆదర్శం గాని వస్తుతః - సమర్థమైనవే. కేవలం ధూమమూ మాలిన్యమూ వాటిని ఆవరించటం వల్ల సామర్థ్యం లేనట్టు కనిపిస్తున్నాయి. కాని అది ఆవరించి నప్పటికీ అంతర్గతంగా శక్తి లేకుండా పోలేదు వాటికి. కేవలం బహిర్గతమయి కనపడటం లేదంత మాత్రమే. మాలిన్యాన్ని తుడిచి వేసినా అగ్నిని బాగా ప్రజ్వలింప చేసినా వెంటనే ప్రతి బంధకాలు తొలగిపోయి జాజ్వల్యమానంగా ప్రకాశించగలవు. అయితే జరాయువు పిండాన్ని కప్పినట్టు కప్పితే మాత్రమప్పుడే తొందరపడి సుఖం లేదు. వేచి ఉంటే కొంతకాలాని కా పొర దానిపాటికదే తొలగిపోయి శిశువు బయట పడుతుంది. అప్పటికీ జరాయు వాశిశువును మాఫీ చేయదు.

Dr Dayananda Swamy ebooks



తాత్కాలికంగా కవచం లాగా పని చేస్తుందంత మాత్రమే. అలాగే పరిశుద్ధమైన జ్ఞానాన్ని అజ్ఞానమనే ఉల్బం పొరలాగా కప్పి ఉన్నా శ్రవణ మననాదులు చేస్తూ పోతే కొంతకాలాని కది గూడా విరిసి పోతుంది.

అయితే అంతవరకూ దాని ధాటి తట్టుకోటం కష్టం. ఎందుకంటే నిత్యవైరి అది. ఎవరికి. అజ్ఞానికా. కాదు. జ్ఞానికి కూడా. ఆ మాటకు వస్తే జ్ఞానికే నంటారు స్వామివారు. ఎందుకంటే జ్ఞానికి మొదటి నుంచీ తెలుసు ఇది నన్ను అనర్థానికి పురికొల్పుతున్నదని. ప్రారబ్ధం కొద్దీ దానివల్ల కష్టాల పాలవుతుంటాడు కూడా. తెలిసినవాడికే కష్టం. తెలియని వాడికేముంది. ఎలాగంటే అజ్ఞాని అయిన వాడు దాన్ని శత్రువుగా గాక తనకెంతో ఆప్తమిత్రుడని చూస్తాడు కామాన్ని. చివరకది తన్ను కష్టాల పాలు చేస్తే అప్పుడు బాధపడతాడు దీన్ని నమ్ముకొని దెబ్బతిన్నానని. కాబట్టి అజ్ఞానికి నిత్యవైరి కాదది. జ్ఞానికే నిత్యవైరి. అంతంలోనే దెబ్బతిని గుర్తిస్తాడు అజ్ఞాని. ఆద్యంతాలలో కూడా గుర్తిస్తూ పోతాడు జ్ఞాని. కాబట్టి వీడికే అది నిత్యవైరి అంటారాయన.

ఇదే కామమనే పిశాచి. ఆవృతం జ్ఞానమేతేన. జ్ఞానం బయట పడకుండా దాన్ని కప్పివేస్తుందిది. దుష్పూరేణ అనలేనచ - దుష్పూరమూ అనలమూ కూడా ఇది - దుష్పూరమంటే దాని కడుపు ఎంత తిండి పెట్టినా నిండదు. అనలం కూడా. అనలమంటే ఏదో అర్థం చెప్పామింతకు ముందే. ఇక నాకేమీ అక్కరలేదు - ఇది చాలు ననే ప్రశ్న లేదు. ఎంత ఉన్నా తృప్తి లేదు మానవుడికి. ఇంకా పోగు చేసుకోవాలనే కాంక్ష. లోభమే

Dr Dayananda Swamy ebooks

మానవుడి గుణమని బృహదారణ్యక మెప్పుడో చెప్పింది అందుకే మాగృధః అని హెచ్చరించిం దీశావాస్యం. కస్యస్విద్ధనం – అంతా నీ దేనీ విభూతే అయినప్పు డెందుకాశ పడతావని చీవాట్లు పెట్టింది.

**ఇంద్రియాణి మనోబుద్ధి - రస్యాధిష్ఠాన ముచ్యతే**

**ఏతైర్విమోహయ త్యేష - జ్ఞాన మావృత్య దేహినమ్ - 40**

అయితే ఇంత మనల నలజడి పాలు చేస్తున్నదంటే దీనికింత బలమెలా వచ్చింది. పరిశుద్ధమైన జ్ఞానాన్నే ఇది ఆవరిస్తున్న దంటే ఎంత ధైర్యం దీనికి. దేని ఆసరా చూచుకొని ఇది మనమీద దాడి చేస్తున్నదని ఇప్పుడు ప్రశ్న. దాని కిస్తున్నది గీత సమాధానం. ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే. పంచేంద్రియాలూ వాటికధి పతియైన మనస్సూ – దానికి పైన ఉన్న బుద్ధీ – ఇవీ దానికి నిలయం. ఇందులో మనసంటే సంకల్ప వికల్పాత్మక మైన వృత్తులు. బుద్ధి వృత్తులను లోపల ఉంచుకొన్న జ్ఞానం. విజ్ఞానమని కూడా పేరు దానికి – ఇది వృత్తులను తనలో దాచుకొన్నది గనుక పరిశుద్ధమైన జ్ఞానం కాదు. సమయం చూచి వృత్తులను బయట పెడుతుంది. ఇదుగో ఈ ఏడూ కామమనే పిశాచిని తిండిపెట్టి పోషిస్తున్నాయి. వీటి ఆశ్రయం చూచుకొని అది విజృంభిస్తున్నది.

ఏతైర్వి మోహయ త్యేష జ్ఞాన మావృత్య దేహినమ్. వీటి బలంతో అది మొదట మానవుడి వివేక జ్ఞానాన్ని కప్పి వేస్తుంది. తరువాత వాడికి వ్యామోహం కల్పించి విమూఢుణ్ణి చేస్తుంది. అలాంటప్పుడే మనం జాగ్రత్త వహించాలి. అది విజృంభించటం ప్రారబ్ధం కొద్దీ జరుగుతుంటే మానవుడు

Dr Dayananda Swamy ebooks


చేతులు ముడుచుకొని కూచోరాదు. తాను మరలా ప్రయత్నం కొద్దీ దాన్ని తల పైకెత్తే లోపలనే త్రుంచి పారేయాలి. లేకుంటే దశరథ మహారాజు గతి పడతాడు. దశరథుడు తెలివైన వాడే. బుద్ధిమంతుడే. కాని ఏమి ప్రయోజనం. దూరం నుంచి శబ్దం మాత్రం విన్నాడేగాని అది దేని తాలూకు శబ్దమో విమర్శించి చూడలేదు. అది ఏనుగు చేసిన శబ్దమేనని ఎందు కనుకోవాలి. ఏనుగేనని ఎవరు చెప్పారు. ప్రారబ్ధం చెప్పిందా మాట. కాని అది చెబితే మాత్రం తాను విమర్శించుకో నక్కర లేదా. ఏ మాత్రం విమర్శ చేసినా వెంటనే బాణం ప్రయోగించేవాడు కాదు. ఆ ముని కుమారుడు మరణించేవాడు కాదు. కాబట్టి ప్రారబ్ధం ప్రేరణ చేసినా మంచి చెడ్డలు విమర్శించి చూచే ప్రయత్నం మానవుడి కర్తవ్యం. అలా విమర్శించుకొని చూస్తే ప్రారబ్ధానికి జవాబు చెప్పగలమని బోధిస్తున్న దిప్పుడీ శ్లోకం.

**తస్మాత్త్వ మింద్రియాణ్యాదౌ - నియమ్య భరతర్షభ**

**పాప్మానం ప్రజహిహ్యేనం - జ్ఞాన విజ్ఞాన నాశనమ్ - 41**

త్వక్చక్షుః శ్రోత్రజి హ్వా ఘ్రాణాలనే అయిదూ - వాక్పాణి పాద పాయూపస్థలనే అయిదూ - ఈ పదింటికీ ఇంద్రియాలని పేరు. త్వమింద్రియా ణ్యాదౌ నియమ్య. ఈ ఇంద్రియాల నన్నింటినీ ముందుగా నీవదుపులో ఉంచుకోవాలి. అవి అదుపులో ఉంచుకొని పాప్మానం ప్రజహి హ్యేనమ్. అన్ని పాపకార్యాలకూ మూలమైన ఈ కామపిశాచిని చంపి పారేయి. దాన్ని ఏమాత్ర ముపేక్షించినా శ్రీరాముడు తాటకను చంపుదామా

Dr Dayananda Swamy ebooks

లేదా అని సంకోచించినట్టే. జ్ఞానయజ్ఞానుష్ఠాన మార్గానికది అడ్డం. కాబట్టి దాన్ని బ్రతకనివ్వ గూడదు. ఈడ్చి పారేయ వలసిందే ఆత్మారామ పదవి నందుకోవాలంటే.

ఏమి కారణం . అది మనకు చేసే మహోపద్రవ మలాంటిది. జ్ఞాన విజ్ఞాన నాశనం. మనకున్న సర్వధనాన్ని అది అపహరించాలని చూస్తున్నది. ఏమరి ఉన్నామంటే అంత పనీ చేస్తుంది. మనం బికారులమయి పోతాము. పురుషార్థానికే నోచుకోలేము. ఏమిటా ధనం. జ్ఞానం విజ్ఞానం. శాస్త్ర జన్యమైనది జ్ఞానం దాని అనుభవం విజ్ఞానం - అని వ్రాశారు స్వామివారు. అది మనస్సూ బుద్ధీ బాగా పనిచేస్తుంటే గాని గడించలేమా ధనాన్ని మనం. ఇంద్రియాల ద్వారా గాని వాటి కా ద్రవ్యం రవాణా గాదు. తద్ద్వారా పోగైన ఆ మొత్తాన్ని కాజేస్తున్నదీ కామం. అంచేత దాన్ని ఉపేక్షించ రాదు సాధకుడు. కూకటివేళ్లతో సహా పెళ్లగించి పారేయాలి.

**ఇంద్రియాణి పరాణ్యాహు - రింద్రియేభ్యః పరం మనః**

**మనసస్తు పరా బుద్ధి - ర్యో బుద్ధేః పరతస్తు సః - 42**

అది ఎలా సాధించాలా కార్యమంటే సలహా ఇస్తున్నది గీత. ఇంద్రియేభ్యః పరే హ్యర్థా అర్థే భ్యశ్చపరం మనః అని కఠోపనిషత్తు చెప్పిన వరుసలోనే వర్ణించి చెబుతున్నది. ఇంద్రియాణి పరాణ్యాహుః - స్థూలమైన బాహ్యమైన పరిచ్ఛిన్నమైన ఈ శరీరం కంటే సూక్ష్మమూ వ్యాపకమూ ఆభ్యంతరమూ అయినవి మన ఇంద్రియాలు. అంచేత అవి పర మన్నారు.

Dr Dayananda Swamy ebooks


పరమంటే ఇంతకన్నా ఉత్కృష్ట మైనవని అర్థం. ఇంద్రియేభ్యః పరం మనః – అలాటి ఇంద్రియ వర్గం కన్నా ప్రకృష్టమైనది మనస్సు. ఎందుకంటే ఆలోచనాత్మకమది. మనసు ఆలోచిస్తేనే ఇంద్రియాలు పనిచేస్తాయి. కనుక అది వీటి కన్నా గొప్పది. మనసస్తు పరాబుద్ధిః – మనసుకన్నా గొప్పది మానవుడి బుద్ధి . అది నిశ్చయాత్మకమైన జ్ఞానం. దానివల్లనే మనోవృత్తు లేర్పడుతున్నాయి.

పోతే యో బుద్ధేః పరతస్తు సః – ఈ బుద్ధి కన్నా అతీతమైన తత్త్వ మొకటి ఉన్నదని గుర్తించాలి మానవుడు. ఏమిటది. దేహం దగ్గరి నుంచి బుద్ధి వరకున్న ఈ కలాపాన్నీ ఇవి చేసే వ్యాపారాలనూ అన్నింటినీ గమనించి చూస్తున్న ద్రష్ట. వీటికి సాక్షి **Witness** అయిన జ్ఞానం. కేవల జ్ఞానమే అది. అది వృత్తిగాదు. వృత్తులకు ఆశ్రయమిచ్చేది గాదు. ఆ వృత్తులను కూడా గమనిస్తున్నది. ద్రష్టే దృశ్యం కాదది. దానికే ఆత్మ అని పేరు. అన్నిటికీ వెనకాల ఉండి వీటి వ్యవహారాన్ని చూస్తుంటుంది. కాబట్టి ప్రత్యగాత్మ **The Inner self** అని కూడా అంటారు దాన్ని. అదే మన అసలైన స్వరూపం. ఇప్పుడు వర్ణించిన సామగ్రి అంతా స్వరూపం కాదు. స్వరూపమది అయితే దాని ఉపాధు **Media** లివన్నీ.

**ఏవం బుద్ధేః పరం బుధ్వా - సంస్త భ్యాత్మాన మాత్మనా**

**జహి శత్రుం మహాబాహో - కామరూపం దురాసదమ్ - 43**

పోతే ఇప్పుడింతకూ మనం చేయవలసిన కర్తవ్యమేమిటో బయట పెడుతున్నదీ శ్లోకం. ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా – బుద్ధికి కూడా అతీతమై

Dr Dayananda Swamy ebooks

దానికి కూడా సాక్షియైన మనయీ ఆత్మను మనం మొదట ఫలానా అని పట్టుకోవాలి. మొదట ఇంద్రియాలను గదా అదుపులో పెట్టుకోమని చెప్పింది గీత. ఇప్పుడేమిటి మొదట ఆత్మను గుర్తించమని సలహా ఇస్తున్నదని సందేహించవచ్చు. అది నియమ్య - ఇది బుద్ధ్వా. ఇంద్రియాలను నిగ్రహించుకోమని మాత్రమే ఉందక్కడ. తెలుసుకోమని లేదు. తెలుసుకోకపోతే అరికట్ట లేము వాటిని. తెలుసుకోవలసిన దాత్మ తత్త్వాన్ని. ఆత్మతత్త్వాన్ని బుద్ధ్వా ముందు తెలుసుకొని తరువాత ఇంద్రియాలను నియమ్య నిరోధించాలని అర్థం చేసుకోవాలని గీతా హృదయం.

ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోటమే మిగతా వాటిని అదుపులో పెట్టు కోటానికి సాధనం. ఆ కొమ్మ పట్టుకొని గాని ఈ కొమ్మ వదిలేయటానికి లేదు. ముందు వదిలేయటం కాదు. పట్టుకోటం. కాబట్టి బుద్ధేః పరం బుధ్వా - సంస్తభ్యా త్మాన మాత్మనా - ఊరక పట్టుకొన్నామంటే పట్టుకొన్నామని గాదు. సళ్లుగా పట్టుకొంటే మళ్లీ ప్రమాదం. కామమెంత గట్టిగా పట్టుకొన్నదో మనల నంత కన్నా గట్టిగా పట్టుకోవా లాత్మను మనం. ఎలాగని. ఆత్మనా ఆత్మానం. బాగా పదునెక్కి ఏకాగ్రమూ పరిశుద్ధమూ అయిన బుద్ధితో దాన్ని జారిపోకుండా పట్టుకోవాలి. అంటే ఇదే మన స్వరూప మింతకన్నా ఏదీ కాదని దృఢ నిశ్చయంతో ఉండాలి.

జహి శత్రుం మహాబాహో - కామరూపం దురాసదం. అలా ఉంటే చాలు. అదే మనం చేయవలసిన సాధన. ఆ బలంతో నీవా గర్వ శత్రువైన

Dr Dayananda Swamy ebooks



కామాన్ని సమూలంగా నిర్మూలించ గలవు. నీకది తప్ప లోకంలో శత్రువు లెవరూ లేదు. ఏ శత్రువైనా కామరూపుడే. కామం ద్వారానే శత్రువవు తున్నాడు వాడు నీకు. కామం లేకుంటే ద్వేషం లేదు. కామక్రోధాలు రెండూ లేకుంటే శత్రువులే కానరారు. అంతశ్శత్రువులని పేరు వీటికి. వీటి ఆ భాసే బయట నీకు శత్రువర్గంగా భాసిస్తున్నది. అంచేత ఆత్మజ్ఞాన బలంతో దాన్ని మట్టుపెట్టు. అలా కాకుంటే దురాసదమ్. దాని దరి చేరలేవు నీవు. తేరి చూడలేవు. అంత భయంకర మది. ఒక్క ఆత్మ జ్ఞాన బలం తోనే అది బలహీనమై తేలిపోతుంది. అంతవరకూ అనాత్మ కామంగా కనిపించే కామ మప్పుడు తన వేషం మార్చుకొని ఆత్మ కామమనే వేషాంతరంలో నీకు దర్శన మిస్తుంది. విశ్వానికి అమిత్రుడు గాక విశ్వానికే మిత్రుడయి సాధకుడి మోక్షమార్గానికి దివ్యమైన ప్రకాశాన్ని అందిస్తుంది.

**ఇతి**

## కర్మ యోగః సమాప్తః

Dr Dayananda Swamy ebooks


# 4. జ్ఞాన యోగము

మూడు యోగాలయి ఇప్పుడు నాలుగవ దానిలో ప్రవేశిస్తున్నాము. దీనిపేరు జ్ఞానయోగం. ఇంతకుముందు జరిగింది కర్మయోగ మైతే ఇది జ్ఞానయోగం. కర్మ జ్ఞానం - ఒకటి ప్రవృత్తి మరొకటి నివృత్తి. ఇవి రెండే వేద వాఙ్మయం మానవలోకాని కంతటికీ చేస్తున్న బోధ. వేదవ్యాసుడు కూడా దానినే అనుసరించి మనకు బోధిస్తున్నాడు. సాంఖ్యయోగంలో రెంటినీ కలిపి చెప్పాడు. మళ్లీ విడగొట్టి చూపుతున్నాడు. అందులో కర్మయోగంలో కర్మను వర్ణిస్తూ వచ్చాడు. ఇప్పుడు జ్ఞానయోగంలో అలాగే జ్ఞానాన్ని వర్ణించబోతున్నాడు. ఆ తరువాత మళ్లీ కర్మను జ్ఞానంలో కలిపేసి అంతా జ్ఞానంగానే చూపబోతాడు కర్మ సన్న్యాసమనే అయిదవ అధ్యాయంలో.

Dr Dayananda Swamy ebooks



ఏమిటీ గారడీ అనిపిస్తుంది పైకి చూస్తే పాఠకులందరికీ. కాని నేను ముందే చెప్పాను. కర్మజ్ఞానాలని పేరేగాని రెంటికీ మన మను కొన్నంత తేడా లేదని. తేడా లేదనే సత్యం మనకు సూచించటానికే మహర్షి రెండింటికీ సాంఖ్యంలోనే ప్రవేశం కల్పించాడు. అది మరలా వేరు చేసి చూపుతూనే సన్న్యాస యోగంలో కర్మ సమాంతంగా జ్ఞానంలో కలిపి చూపబోతున్నాడు. ఇంతకూ వ్యాసహృదయ మేమిటో మనమర్థం చేసుకోవాలి. అది వేద హృదయమే. వేరుగాదు. వేదం మొదట మొదట ప్రవృత్తి రూపంగా నడచినా చివరకు నివృత్తి ధర్మంలో అంతమయి పోతున్నది. కనుకనే ఉపనిషత్తులకు వేదాంతమని పేరు వచ్చింది. అది జ్ఞానమే. కర్మ జ్ఞానంతో సమాప్త మవుతుందని వేద తాత్పర్యం అదే గీతా తాత్పర్యం కూడా.

ఇంతకూ జ్ఞానం స్వరూపం కర్మ దాని విభూతి. దృష్టి జ్ఞానం సృష్టి కర్మ. జ్ఞానం విస్తరిస్తే కర్మ. కర్మ ఆగిపోతే జ్ఞానం. కదలకుండా షెడ్డులో ఉన్న కారు జ్ఞాన మనుకొంటే షెడ్డు విడిచి కదలిపోయే కారు కర్మ. రెండు వస్తువులు లేవక్కడ. ఉన్న వస్తు వొక్కటే. దాని భంగిమలు **Phases** రెండు. కాబట్టి కర్మ జ్ఞానాలు రెండూ నీవూ నేనూ భావిస్తున్నట్టు బద్ధశత్రువులు కావు. రెండూ ఏకమే ఒక విధంగా. ఒకటి ఉపాయమైతే **Means** మరొకటి ఉపేయం **End.** కర్మ జ్ఞానాని కుపాయం. కర్మయోగమనే శిక్షణ లేకుండా జ్ఞానాన్ని అందుకోలేము. జ్ఞానాన్ని అందుకొన్నామంటే కర్మ జ్ఞానంగా మారిందని అర్థం. ఆ మాటకు వస్తే

Dr Dayananda Swamy ebooks



జ్ఞానానికి ముందే గాదు తరువాత కూడా కర్మ తప్పదు. ముందు ప్రయత్న రూపమైతే అది - తరువాత జ్ఞానికది ప్రవర్తన రూపం. వాడి జీవితమే అవుతుందది. వాడి చూపులో జ్ఞానం చేతలో కర్మ. ఎంత జ్ఞాని అయినా చేయకుండా ఉండలేడు గదా కర్మ. జీవితాంతమూ చేయవలసిందే. అయితే జ్ఞానమనే వెలుగులో చేస్తుంటాడు కాబట్టి ఆ వెలుగు ప్రసరించి అది కూడా వెలుగుగా మారిపోతుంది. ఇదే కర్మ ణ్య కర్మ - అకర్మణిచ కర్మ. తరువాత రాబోతుంది శ్లోకం.

ఇలాంటి అవినాభావ సంబంధ ముండటం మూలాన్నే గీతాచార్యుడు వాటి రెండింటినీ ఒకటిగా భావించి ఒకే యోగమని సెలవిస్తున్నాడు మనకు. సాంఖ్యయోగంలోనే రెండింటి ప్రస్తావనా వచ్చింది కాబట్టి ఈ శాస్త్రం కూడా అక్కడికి పరిసమాప్త మయినట్టు భావించి వంశ కథనం చేస్తున్నా డిప్పుడు కృష్ణ భగవానుడు. వంశమంటే ఇది గురు శిష్య సంప్రదాయం. **Tradition** సంప్రదాయమంటే బ్రహ్మజ్ఞానాన్ని గురువు శిష్యుడికి అందజేయటం. అది పరంపరగా రావాలి. దీనికే ఆగమమని కూడా పేరు పెట్టారు. ఆగమమంటే రావటమనే గదా అర్థం.

**ఇమం వివస్వతే యోగం - ప్రోక్త వానహ మవ్యయం**

**వివస్వాన్ మనవే ప్రాహ - మను రిక్ష్వాకవే బ్రవీత్ - 1**

**ఏవం పరంపరా ప్రాప్త - మిమం రాజర్షయో విదుః**

**సకాలేనేహ మహతా - యోగో నష్టః పరంతప - 2**

Dr Dayananda Swamy ebooks



ఇమం వివస్వతే యోగం ప్రోక్త వానహ మవ్యయమ్. ఇదుగో అర్జునా ఈ యోగాన్ని నేను మొదట సూర్యుడి కుపదేశించాను. అవ్యయమైన యోగమిది. చూచారా భగవానుడి మాట. యోగమని ఏకవచనంలో పేర్కొంటున్నాడు. ఒకవేళ విషాదం గాక పోయినా సాంఖ్యం కర్మ రెండు యోగాలు గదా గడచిపోయా యిప్పటికీ. రెండు యోగాలు జరిగిపోతే తాను చెప్పింది ఒకే యోగమంటా డేమిటి. భగవత్పాదు లేమంటున్నారో తెలుసా. యోయం యోగః అధ్యాయ ద్వయే నోక్తః రెండధ్యాయాలలో చెప్పిందీ ఒకే యోగమది ఏదోగాదు. జ్ఞాననిష్ఠా లక్షణః కర్మయోగోపాయః – కర్మయోగమనే సాధనంతో కూడిన జ్ఞానయోగ మంటాడాయన. గంగా యమునల లాగా అది ఒకే ఒక ప్రవాహం. జ్ఞాన ప్రవాహం. అందుకే సాంఖ్యబుద్ధి యోగ బుద్ధి అని రెండింటికీ బుద్ధి అనే మాట తగిలించాడు చివర. బుద్ధి అంటే జ్ఞానమే.

ఇలాటి జ్ఞానయోగాన్ని మొట్టమొదట కృష్ణభగవానుడే సూర్యునికు పదేశించాడట. నిజమే నారాయణం పద్మభువమ్మని గదా గురుపరంపర. సాక్షాత్తూ నారాయణుడే గదా కృష్ణుడు. ఆ నారాయణుడు ఉపదేశించాడు సూర్యనారాయణుడికి. ఎలాంటి దాయోగం అవ్యయం. వ్యయమంటే మారిపోయేది. నశించిపోయేది. అది భౌతికమైతే జరుగుతుంది గాని అభౌతికమైన జ్ఞానాని కా బాధ లేదు. నిత్యనూతన మది పరమాత్మలాగా. కాగా ఆ సూర్యుడు మరలా గురుస్థానంలో కూచొని మనవే ప్రాహ.

Dr Dayananda Swamy ebooks

వైవస్వతుడనే మనువుకు బోధించాడట. మానవులకు మూలపురుషుడు మనువు. ఆ మనువు ఇక్ష్వాకవే అబ్రవీత్ - ఇక్ష్వాకువనే కుమారుడికి చెప్పాడట.

ఇక్కడ సూర్యుడు - మనువు - ఇక్ష్వాకు వనే మాటల కంత రార్థం చెప్పినా చెప్పుకోవచ్చు. వివస్వంతుడంటే బాగా వెలిగిపోయే బుద్ధితత్త్వం. మనువంటే మనస్తత్త్వం. ఇక్ష్వాకు ఇక్షువులాగా మధురమైన శబ్ద స్పర్శాదుల వెంటబడిపోయే ఇంద్రియ తత్త్వం. వీటికి జ్ఞానబోధ అబ్బిందంటే అవి మానవుడి మార్గాని కడ్డు తగలకుండా మోక్షపురుషార్థానికి సాధనాలుగా పనిచేస్తాయని భావం. ఏవం పరంపరా ప్రాప్త మిమం రాజర్షయో విదుః - ఇలా గురుశిష్య పరంపరగా లభించిన ఈ జ్ఞానయోగం రాజర్షులు మాత్రమే గ్రహించ గలిగారు మొదటినుంచీ అంటాడు పరమాత్మ.

రాజర్షులేమిటి. రాజాచ ఋషిశ్చేతి రాజర్షిః - రాజయి ఋషి అయిన వాడెవడో వాడు రాజర్షి. విశ్వామిత్రుడి లాంటివాడు. జనకుడిలాంటి వాడు. ఇందులో ఒక గంభీరమైన భావమిమిడి ఉంది. అది భాష్యకారులే వివరించారు. జగత్పరిపాల యిత్రూణాం క్షత్రియాణాం బలాధానాయ. తేన యోగ బలేన యుక్తాః సమర్థా భవంతి బ్రహ్మ పరిరక్షితుమ్ - బ్రహ్మ క్షత్రే పరిపాలితే జగ త్పరి పాలయితు మలమ్. దేశాన్ని పరిపాలించ వలసినవారు క్షత్రియులు. వారికి కేవలం దేహబలముంటే చాలదు. దాని కతీతమైన బుద్ధిబల ముండాలి. అది యోగం వల్ల గాని రాదు. అలాంటి యోగబల ముంటే వారు న్యాయంగా నిష్పక్షపాతంగా నిర్లిప్తంగా పరిపాలించ

Dr Dayananda Swamy ebooks



గలరు దేశాన్ని. వారు బ్రహ్మాన్ని కాపాడితే అది దేశాన్ని కాపాడుతుంది. బ్రహ్మ క్షత్రియులకే ఉందా సామర్ధ్యమంటారాయన. బ్రహ్మమేమిటి క్షత్రమేమిటి.

బ్రాహ్మణుడు జ్ఞాన శక్తికీ క్షత్రియుడు క్రియాశక్తికీ సంకేతాలు. శరీర మెలాంటిదో దేహ మలాంటిది. మనస్సూ ప్రాణం కలిసి పని చేయకపోతే శరీరం పనిచేయదు. ఇందులో మనస్సు లాంటివాడు బ్రాహ్మణుడు సలహా ఇస్తుండాలి. ప్రాణంలాంటి క్షత్రియ జాతి తదనుగుణంగా పాటించాలి. అప్పుడే ఇంద్రియాలనే ప్రజలు తమ తమ కర్తవ్యం పాటిస్తారు – శరీరమనే దేశం కూడా సుభిక్షమై రాణిస్తుంది. అందుకే మొదటి నుంచీ బ్రాహ్మణులే మంత్రులయి రాజులకు సలహా ఇస్తూ వచ్చారు. వారి సలహా మేరకు వీరు దేశాన్ని పాలిస్తూ వచ్చారు. అలా కాకుంటే కేవలం రాజులేగాని వారు రాజర్షులు కాలేరు. రాజనే మాటలో క్షత్రియత్వమూ. ఋషీ అనే మాటలో బ్రాహ్మణత్వమూ తొంగిచూస్తున్నది. ఇది భారతీయులకే గాదు యవన దేశీయులకు కూడా ఉంది ఈ అభిప్రాయం. **Philosopher Kings** అని వారు పెట్టిన పేరు. రాజు జ్ఞాని అయి ఉండాలి. లేకుంటే నిర్లిప్తంగా నిష్పక్షపాతంగా చేయలేడు పాలన నిరంకుశంగా స్వార్ధపరుడయి చేసి తాను చెడి ప్రజాజీవితాన్ని చెడగొడతాడు.

అంచేత బ్రహ్మ క్షత్ర అనే మాట లిక్కడ జాతిపరంగా తీసుకోరాదు. గుణపరంగా భావించాలి. యస్య బ్రహ్మచ క్షత్రంచ ఉభే భవత ఓ దనః

Dr Dayananda Swamy ebooks



అని కఠోపనిష ద్వాణి. జ్ఞాని అయినవాడికి బ్రహ్మ క్షత్రాలు రెండూ ఆహార మవుతాయట. ఏమిటీ మాటకర్థం. జాతిపరంగా చెబితే ఏమైనా బాగుంటుందా. బ్రహ్మ అంటే మనస్సనీ క్షత్ర అంటే ప్రాణమనీ అర్థం చెప్పుకోవాలి. అవి రెండూ జ్ఞానికి లయమయి పోవాలని అర్థం. అప్పటికి జ్ఞాన క్రియాశక్తులకు ప్రతీకలే బ్రాహ్మణ క్షత్రియ జాతులు. జ్ఞానం సలహా ఇస్తుంటే ప్రాణమూ ఇంద్రియాలూ నడుచుకోవాలి. అందుకే అంటున్నాడు పరమాత్మ మొదటి నుంచీ క్షత్రియులకే బోధిస్తూ వచ్చానీ యోగమని.

అయితే ఏమి సుఖం. అది చాలా కాల మలాగే పనిచేసింది. సకా లేనేహ మహతా యోగో నష్టః - కాలం గడచిన కొద్దీ బ్రహ్మ క్షత్రియ జాతులు రెండూ ధార్మికమైన బలం కోలుపోవటం మూలాన వారి మధ్య నడిచే ఈ యోగం కూడా బలం కోలుపోయి సంప్రదాయం చివరకు విచ్ఛిన్నమయంది. నష్టమయిందంటే పూర్తిగా అభావమయి పోయిందని గాదు. లుప్త మయిందని అర్థం.

**సఏవాయం మయా తేద్య - యోగః ప్రోక్తః సనాతనః**

**భక్తోసి మే సఖాచేతి - రహస్యం హ్యేత దుత్తమం - 3**

కేవలం లుప్త మయింది గనుకనే మరలా నేను దానిని పైకి తీసి స ఏవాయం తేద్య యోగః ప్రోక్తః పురాతనః - పురాతనమైన ఆ యోగాన్నే నీకు బోధ చేస్తున్నా నంటాడు కృష్ణభగవానుడు. చాలాకాల మనుస్యూతంగా నడుస్తున్న ఒకానొక సంప్రదాయం మధ్యలో మానవుల అశ్రద్ధ వల్ల

Dr Dayananda Swamy ebooks



తెగిపోతే దాన్ని ప్రత్యుద్ధరణ చేయటాని కందరికీ ఉండదు సామర్థ్యం. భూత భవిష్యత్తుల నాకళించుకోగల దివ్యదృష్టి ఉండాలా వ్యక్తికి. వాడే ఋషి. క్రాంతదర్శీ మహర్షిః అన్నారు. దేశకాలాల నతిక్రమించి చూడగలవాడే ఋషి. యుగాంతేం తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః లేభిరే తపసా పూర్వమని పెద్దలు చెప్పిన మాట. కాలగర్భంలో కలిసి గుప్తమైన రహస్యాలను బయటపెట్టటానికి గొప్ప దర్శన సామర్థ్యముండాలి. అది తపశ్శక్తి వల్ల గాని సాధ్యం కాదు. విశ్వామిత్రాదులు మంత్ర ద్రష్ట లయ్యారంటే దానికిదే హేతువు.

అలాంటప్పుడు యోగేశ్వరేశ్వరుడైన పరమాత్మ దార్శనికుడు కావటంలో ఆశ్చర్యమేముంది. ఎంత గుప్తమైన విశ్వరహస్యమైనా చూడగలడు చెప్పగలడు. దీన్నిబట్టి మరొక సత్యం కూడా తెలుస్తున్నది మనకు. సృష్టిలో ప్రతి ఒక్కటీ ఉన్నదేగాని లేనిది గాదు. మహా అయితే అవ్యక్తంగా ఉన్నది వ్యక్త మవుతున్నది. అంత మాత్రమే. దర్శించే సామర్థ్య మున్న వాడి కది వ్యక్త మవుతుంటుంది. అది లేని వాడికెప్పటికీ అవ్యక్తం గానే ఉండిపోతుంది. అభావమంటూ ఏదీలేదు. అంతా సద్రూపుడైన పరమాత్మే అయినప్పు డ సద్రూప మొకటి ఉండటాని కాస్కారమెక్కడిది.

అంచేత పరమాత్మ ఇప్పుడా నష్టమైన యోగాన్ని బయటపెడుతున్నా దర్జునుడి కంటే అర్జునుడికా యోగ్యత ఉందా. ఉంది గనుకనే చెబుతున్నానంటాడు. భక్తోసి మేసఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్.

Dr Dayananda Swamy ebooks


నీవు నాకు భక్తుడవు. ఆప్తమిత్రుడవు. అందుకే ఇది ఎంత రహస్యమైనా నీకు నేను బోధిస్తున్నానంటాడు. గుహ్యమనీ రహస్యమనీ పేరు అధ్యాత్మ జ్ఞానానికి. అలాటి జ్ఞాన మందివ్వాలంటే అందుకొనే వాడెలాటి వాడయి ఉండాలి. భక్తుడూ సఖుడూ అయి ఉండాలట. నాభక్తాయ కదాచన అని చివర ఫలశ్రుతిలో కూడా వస్తుందీ భక్తి అనే మాట. ఇక్కడ ఒక రహస్యముంది. జీవుడీశ్వరుడే వాస్తవంలో. అయినా కానేమో ననే అజ్ఞానం మూలంగా దూరమయ్యాడు. నిజంలో దూరమవలేదు. సఖా అనే మాటకర్థమది. ద్వాసు పర్ణా సయుజా సఖాయా. సఖ అంటే కలిసి మెలిసి ఉన్నాయని అర్థం. జీవ చైతన్య మీశ్వర చైతన్యమే. రెండూ ఎప్పుడూ కలిసే ఉన్నాయి. అయినా దూరమనే భావంలో ఉన్నాడు కాబట్టి ఈ జీవుడు విభక్తు డయ్యాడా ఈశ్వర చైతన్యంతో. అది పోవాలంటే మరలా భక్తుడవ్వాలి. అంటే నేనా ఈశ్వరుణ్ణే ననే ఐక్యాను సంధానం చేసుకోగలగాలి. అదే భక్త అనే మాట కర్థం. ఇందులో సఖ అనేది ఉన్న సత్యాన్ని చెబుతుంది. భక్త అనేది దాన్ని అందుకొనే యోగ్యత చెబుతుంది. అర్జునుణ్ణి ఇలా సంబోధిస్తున్నాడంటే కృష్ణుడతనిలో అవి ఉన్నాయనో లేక ఇంతవరకూ లేకున్నా ఇక మీదటనైనా ఉండాలనో ఏదైనా కావచ్చు.

**అపరం భవతో జన్మ - పరం జన్మ వివస్వతః**

**కథమేత ద్విజానీయాం - త్వ మాదౌ ప్రోక్తవాని తి - 4**

అయితే మనమంత పెద్ద క్రెడిట్టివ్వ నక్కర లేదర్జునుడికి. అతడు

Dr Dayananda Swamy ebooks



మనమనుకొన్న మొదటి శ్రేణికి చెందినవాడు కాడు. రెండవ దానికి చెందినవాడే. అతడనే కాదు. మనబోటి అర్జునుల దృష్టి కూడా ఇలాంటిదే. అదేమిటో అతడడిగే ప్రశ్నలోనే ఇప్పుడు బయట పడుతున్నది - ఏమిటా ప్రశ్న. అపరం భవతో జన్మ. బావగారూ మీ జన్మ చూద్దామా - ఇటీవలి కాలంలో దేవకీ వసుదేవులకు బందిఖానాలో జన్మించిన వారు మీరు. మరి మీరు సూర్య భగవానుడికి బోధించానని పేర్కొన్నారే ఆ సూర్యుడెప్పటి వాడు. పరం జన్మ వివస్వతః - మీకంటే నాకంటే ఎంతో కాలం ముందే పుట్టి అప్పటినుంచీ లోకాన్ని వెలిగిస్తూ ఉన్నవాడు. మీది అపరమైతే అతనిది పరం. ఇప్పటి జన్మమీది అప్పటి జన్మ ఆయనది.

కథమేత ద్విజానీయాం త్వమాదౌ ప్రోక్త వానితి - మరి ఇది ఎలా నేనర్థం చేసుకోవా లంటారు. ఇటీవల జన్మించిన మీరు మీకంటే పూర్వ మెప్పుడో జన్మించిన వివస్వంతుడికి జ్ఞానోపదేశం చేశానని చెప్పట మది ఎలా సాధ్యం. పైగా అది మరలా గుర్తుచేసుకొని నాకు బోధిస్తున్నా నంటారేమిటి. నాలాగే మీరూ జన్మించారు గదా. అనాది కాలం నుంచీ బోధ చేస్తూ వచ్చాననే మాట కర్థమేమిటి అని ప్రశ్నిస్తున్నా డర్జునుడు.

అర్జునుడిలా అడిగాడంటేనే అతనికి కృష్ణుడి మీద ఎలాటి అభిప్రాయముందో మన మిట్టే గ్రహించవచ్చు. కృష్ణుడంటే అతని దృష్టి కొక మానవుడు. మహా అయితే మానవులలోనే ఒక గొప్ప తెలివి తేటలున్న వ్యక్తి. అంతమాత్రమే గాని మానవోపాధిలో తిరుగుతూ చేస్తూ ఉన్న

Dr Dayananda Swamy ebooks


పరమాత్మ అనే భావం లేదు. అతనికే లేదంటే ఇక శిశుపాల జరాసంధాదుల మాట చెప్పేదేముంది. ఎక్కడో లేరు వారంతా. మనమే. మనలోనే అర్జునులూ ఉన్నారు. శిశుపాలాదులూ ఉన్నారు. కొంద రాస్తికులైతే కొందరు నాస్తికులు. నాస్తికు లసలే లేడు పరమాత్మ అంటే ఆస్తికులున్నాడు గాని అతడీ కనిపించే వ్యక్తి గాదు. ఎక్కడో మనకతీతమైన లోకాలలో ఉన్నాడని భావిస్తుంటారు. ఇదుగో మన బోటి అర్జునులంతా ఇలాటి ఆస్తికులే.

**బహూని మే వ్యతీతాని - జన్మాని తవ చార్జున**

**తాన్యహం వేద సర్వాణి - నత్వం వేత్థ పరంతప - 5**

అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని అందరికీ ఇప్పుడు సమాధాన మిస్తున్నాడు భగవానుడు. బహూనిమే వ్యతీతాని జన్మాని తవచ నాయనా నీకూ నాకూ కూడా ఎన్నో జన్మలు గడచిపోయా యిప్పటికి. చూచారా ఈమాట. మానవుల లాగే భగవానుడు జన్మిస్తూనే ఉన్నాడంటే మనలాగే ఆయనా జన్మ తప్పించుకోలేక పోతున్నాడనే గదా. అలాంటప్పు డాయనకూ మానవులకూ తేడా ఏముంది. ఇది ఒక ప్రశ్న.

మరొక ప్రశ్న ఏమిటంటే అసలు దేవుడేమిటి. జీవుడేమిటి. ఎవరికీ లేవు జనన మరణాలు. ఇది స్వయంగా ఆయన చెప్పిన మాటే. నత్వేవాహం జాతునాస మనే చోట ఏమన్నాడు. నేనూ నీవూ ఈ దుర్యోధనాదులూ మొదటి నుంచీ ఉంటూనే ఉన్నాము. ఇక మీదా ఉండబోతామని చెప్పాడా లేదా. అంటేఎవరికీ జనన మరణాలు లేవనేగా.

Dr Dayananda Swamy ebooks



అలాంటప్పుడి దేమిటీ మాట. ఇద్దరికీ లేవన్న వాడిప్పు డిద్దరికీ జన్మ లున్నాయంటా దేమిటి. దీని కాయనే ఇస్తున్నాడు సమాధానం. రెండు ప్రశ్నలకూ సమాధానమిది. తాన్యహం వేద సర్వాణి - నత్వం వేత్థ పరంతప జన్మలు ఎన్ని గడచిపోయినా ఎన్ని జన్మలెత్తానో అవి ఎలా గడచిపోయాయో - అదంతా నాకు ఒక స్వప్న చిత్రంలాగా కండ్లకు కట్టి నట్టు కనిపిస్తుంది. నత్వం వేత్థ - నీకు మాత్రమది లేశ మాత్రం కూడా గోచరం కాదు. కారణ మేమంటే భగవత్పాదులు బయట పెడుతున్నారు ధర్మా ధర్మ ప్రతిబద్ధ జ్ఞాన శక్తిత్వాత్ - ధర్మా ధర్మ రూపమైన కర్మల తాలూకు వాసనలడ్డు పడుతున్నాయి జీవుడి జ్ఞానానికి. అంచేత భూత భవిష్యత్తులను దర్శించే యోగ్యత లేదు దానికి - అందుకే వీడు జీవుడయ్యాడు. జ్ఞానం లేకకాదు. ఉండి కూడా అది చాలా పరిమితం.

పోతే దేవుడి విషయమలా కాదు. అహం పునః నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావత్వాత్ అనావరణ జ్ఞానశక్తిః అంటారు భాష్యకారులు. ఈశ్వరుడు బుద్ధుడే గాక నిత్యముక్తుడు. అంటే ఆయన జ్ఞానం శరీరం మేరకే పరిచ్ఛిన్న మయినది గాదు. దేశకాలాలనే ఆవరణలు లేవు దానికి. ముక్తం. వాటి అవధులు దాటిపోయి సర్వవ్యాపక మైనది. అంచేత జన్మలెత్తినా వాటి జ్ఞానముంది ఈశ్వరుడికి.

అలాంటప్పు డీశ్వరుడిది జన్మ అంటావా. ఎప్పుడూ జ్ఞాన మున్నప్పు డెలా జన్మిస్తాడు. ఎలా మరణిస్తాడు. జ్ఞానం కోలుపోతేనేగా జన్మా మరణం

Dr Dayananda Swamy ebooks


సంభవించేది. అది మన విషయంలో మనం చూస్తూనే ఉన్నాము. అఖండంగా జ్ఞానం ప్రకాశిస్తున్నప్పు డీ శ్వరుడి విషయంలో ఎలా చెల్లుతుంది. అయినా జన్మించా నంటాడేమిటి. జన్మ కాదది. ఆభాస మరణం కాదది. అదీ ఆ భాసే. అందుకనే జీవుడిది జన్మ అయితే ఈశ్వరుడిది అవతారమన్నారు. వీడిది మరణమైతే ఆయనది నిర్యాణమన్నారు పౌరాణికులు. తెలిసి వచ్చాడు ఈశ్వరుడు. తెలియక వచ్చాడు జీవుడు. తెలిసి వచ్చాడు గనుకనే తెలిసే పోతాడాయన. తెలియక వచ్చాడు గనుక తెలియకుండానే పోతాడీ మానవుడు. ఇంతకూ జ్ఞానాజ్ఞానాలలో ఉన్నదున్న తేడా అంతా. ఇదుగో ఈ తేడా ఉండటం మూలాన్నే దేహినోస్మిన్ యథాదేహే అనే తరువాతి శ్లోకంలో జీవుడికి జనన మరణాలు తప్పనిసరి అని చెప్పాడు పరమాత్మ. అయితే అంతకు ముందు నత్వేవాహమనే శ్లోకంలో ఆమాట ఎందుకు చెప్పాడు ఎవరికీ జనన మరణాలు లేవని. దానికింతకు పూర్వమే సమాధాన మిచ్చి ఉన్నాము. ఒకటి ప్రత్యగాత్మ దృష్టితో చెప్పిన మాట అని - మరొకటి జీవాత్మ దృష్టితో చెప్పినదని. కాబట్టి ఇక ప్రశ్న లేదు.

**అజోపి సన్నవ్య యాత్మా - భూతానా మీశ్వరోపిసన్**

**ప్రకృతిం స్వా మధిష్ఠాయ - సంభవా మ్యాత్మ మాయయా - 6**

సరే బాగానే ఉంది పరిష్కారం. కాని ఒక సందేహం. ఈశ్వరుడికి జీవుడిలాగా జనన మరణాలు లేవని గదా సిద్ధాంతం చేశారు. అలాంటప్పుడీ

Dr Dayananda Swamy ebooks


కృష్ణస్వామి ఉన్నట్టుండి దేవకీ వసుదేవుల కెలా జన్మించాడు. ఆయన నీలమేఘ శ్యామల కోమలమైన ఈ దేహాన్ని ఎలా ధరించాడు. దానితో ఇంతకాల మెలా జీవించగలుగు తున్నాడు. ప్రజ్ఞానం బ్రహ్మ అన్నట్టు కేవల జ్ఞాన స్వరూపుడు గదా పరమాత్మ అంటే శుద్ధ బుద్ధ ముక్త స్వభావమని మీరే గదా వర్ణించారు. అలాంటప్పుడీ నామరూపాది కలాపమంతా ఎక్కడిదా తత్త్వానికి.

దీనికి సమాధానమే ఈ శ్లోకం. వాస్తవమే. ఈ ప్రశ్న రావటంలో ఆశ్చర్యం లేదు. కాని అంతకన్నా ఆశ్చర్యమేమంటే అజోపి సన్ - నాకు జన్మ లేకపోయినా జన్మిస్తాను. అవ్యయాత్మా - వ్యయం లేకపోయినా అంటే మరణం లేకపోయినా మరణిస్తాను. అలాగే భూతానా మీశ్వరోపి సన్ - సమస్త ప్రపంచానికీ ఈశ్వరుడనైనా అనీశ్వరుడైన జీవుడిలాగా జీవిస్తూనే ఉంటాను. కారణ మేమిటో తెలుసా. ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామి. నాకొక ప్రకృతి ఉంది. అది త్రిగుణాత్మిక. అది నాదే. నేనే. నాశక్తే కాబట్టి నాకు వేరుగాదది. నాకెప్పుడూ అధీనం. అలాటి ప్రకృతిని అధిష్ఠాయ స్వాధీనం చేసుకొని నాకిష్ట మయినప్పుడు సంభవామి - జన్మిస్తుంటా. ఒక దేహం ధరిస్తుంటా. అయితే అది నిజ మనుకోకండి మరలా. ఆత్మమాయయా. అది నా మాయ.

మీయతే అనయా ఇతిమాయా అని వ్యుత్పత్తి. దేని ద్వారా పరమాత్మ తన్ను తాను కొలిచి పారేస్తున్నాడో అది మాయ. తన స్వరూపాన్నే తాను

Dr Dayananda Swamy ebooks

కొలవట మేమిటి. అగ్ని తన్ను తాను కాల్చుకొంటుందని చెప్పినట్టుంది. కనుకనే దాని నాభాస అన్నారు. అంటే అర్ధం. ఒకటి జరగకపోయినా జరిగినట్టు భాసించటమే ఆ భాస. ఒక స్వప్నంలాగా. ఒక ఇంద్రజాలం లాగా. అలాటిదే పరమాత్మ కృష్ణరూపంగా అవతరించటం. అలా జీవించటం. మరలా నిర్యాణమయి పోవటం. మనదీ మాయా మయమే ఆ మాటకు వస్తే. అయినా యధార్ధమని భావిస్తున్నా మీ జనన మరణాలు. అంచేత మనపాలిటికి యధార్ధమే అయి కూచున్నాయి. కారణం అనాది కాల ప్రవృత్తమైన మన అజ్ఞానం. ఈ అజ్ఞానం వదలకనే మనలాగా సర్వజ్ఞుడైన దేవుడికి కూడా జనన మరణాలంట గట్టి మానవుడిలాగే భావిస్తున్నాము మాధవుణ్ణి కూడా. కాబట్టి ఈశ్వరుడిది జన్మ అయినా జన్మ కాదు. మనబోటి జీవుడిది జన్మకాక పోయినా జన్మే. ఇదీ విషయం.

**యదా యదాహి ధర్మస్య - గ్లాని ర్భవతి భారత**

**అభ్యుత్థాన మధర్మస్య - తదాత్మానం సృజామ్యహమ్ - 7**

అయితే మరలా ఒక ఆశంక. ఈశ్వరుడు జన్మించట మనేది సత్యం కాదు. అది కేవల మాభాసేనని గదా వర్ణించారు. మాయా శక్తిని వశం చేసుకొని అయినా ఆయన గారీ కర్మ భూమికి దిగి రావలసిన అగత్యమేమిటి. పోనీ తన చేతిలో లేదు. ఎవరో సృష్టిస్తే వచ్చాడను కొందామా అంటే ఎవరూ గాదు తన్నుతానే సృష్టించుకొన్నాడని గదా వర్ణిస్తున్నారు. అసలింత ప్రయత్న మా పరమాత్మ ఎందుకు చేయవలసి వచ్చింది. ఏమిటాయన దీనివల్ల ఆసించే ప్రయోజనమని ఇప్పుడు ప్రశ్న.

Dr Dayananda Swamy ebooks


దీనికిస్తున్నది సమాధాన మీ శ్లోకం. యదాయదా హి ధర్మస్యగ్లా నిర్భవతి - అభ్యుత్థాన మధర్మస్య - లోకంలో ధర్మమనేది ఎప్పుడడు గంటి పోతుందో అప్పుడు. అధర్మం పైకి వచ్చి ధర్మాన్ని ఎప్పుడు దెబ్బ తీస్తుందో అప్పుడు - తదాత్మానం సృజామ్యహమ్. ఎప్పుడెప్పుడీ రెండు పద్రవాలూ లోకంలో సంప్రాప్తిస్తాయో అప్పుడప్పుడంతా నేను నన్ను సృష్టించు కొంటా నంటాడు పరమాత్మ. ఏమిటిది.

ఇందులో రెండున్నాయి మనం గ్రహించవలసిన సత్యాలు. అధర్మం పైకి వచ్చి ధర్మం దెబ్బ తినటం ఒకటి. భగవానుడు తన్ను తానే సృష్టించు కొని లోకంలోకి రావటమొకటి. ధర్మమూ అధర్మమనే భావాలు మానవ జాతికే మరి దేనికీ లేదీ సృష్టిలో. అచేతనాలైన పృధివ్యాదులకు గానీ వాటితో తయారైన భౌతిక పదార్థాలకు గానీ లేదు. అలాగే చేతనాలైనా క్రిమి కీటకాలు మొదలుకొని పశుమృగ పక్ష్యాదులకు కూడా లేదీ చింత. పోతే మరెవరికి. ఒక్క మానవులకే. ఎందుకని. కర్మ కధికారి వీడొక్కడే. అవి చేయవా కర్మ. చేస్తాయి. కాని వాటికిది విధి ఇది నిషేధమనే తేడా లేదు. బ్రతుకు తెరువే వాటి లక్ష్యం. అందుకు కావలసిన కర్మ ఏదైనా చేస్తుంది. అక్కర లేదో మానేస్తుంది. స్వార్థమే నడుపుతుంది వాటి జీవితాన్ని. శాస్త్రం కాదు. ఆచార్య పురుషులు కారు. వాసనా జ్ఞానమే తప్ప వాటి కిది మంచి ఇది చెడ్డ అనే వివేక జ్ఞానం లేదు. కర్మ జీవులవి - బుద్ధి జీవులు కావు. కర్మఫలమను భవించటానికే జన్మించాయి. మరలా పెద్దలు చేసే బోధ విని ఏది జీవిత గమ్యమో అది గుర్తించి అలా నడుచుకోటానికి

Dr Dayananda Swamy ebooks


జన్మించ లేదవి. అలాటి బుద్ధి బలం లేదు. అది ఉన్నవాడు మానవుడే. కాబట్టి వీడికే ఈ ధర్మా ధర్మ విచారం.

ఇందులో తనకూ ఇతరులకూ హితమైన కర్మ ధర్మం. తనకు మాత్ర మనుకూలమయి ఇతరులకు హాని చేసేది అధర్మం. అధర్మమైనా సరే పాటించి తన స్వార్థాన్ని పొందటమే ధ్యేయంగా పెట్టుకొని బ్రతికాడంటే మానవుడు కొంత కాలానికదే అందరూ పాటిస్తూ పోతే లోకంలో ధర్మం పూర్తిగా దెబ్బ తింటుంది. అధర్మం ప్రబలిపోతే ధర్మం బలహీనపడక ఏమవుతుంది. దీనికే ధర్మ విప్లవమని పేరు. దీనివల్ల మానవుడు పశు మృగప్రాయంగా బ్రతుకుతుంటాడు. అప్పుడు మానవ జన్మకు అర్థం లేకుండా పోతుంది. ప్రపంచ సమస్యకు పరిష్కార మేమిటిక. ఎవడు చేయాలది. ఉన్న మానవు డొక్కడూ ఇలా పాడయిపోతే ఇక ఈ లోక వ్యవస్థను కాపాడవలసిన బాధ్యత ఎవరిది.

మానవుణ్ణి ఎవడు సృష్టించాడో మొదట వాడిదే ఆ బాధ్యత. సృష్టించిన నేరానికి దాని స్థితిని కాపాడవలసిన వాడు కూడా వాడే. వాడంటే ఎవడో కాదు. పరమాత్మే. అంటే మానవుడి బుద్ధి కతీతమైన జ్ఞానైశ్వర్యాలు రెండూ పరిపూర్ణంగా ఉన్నవాడు. సంకుచిత బుద్ధితో మానవజాతి ధర్మాన్ని దెబ్బ తీస్తుంటే దాన్ని నిలబెట్టవలసింది పరిపూర్ణ జ్ఞానమున్న పరమాత్మే గదా. అది ఎలా ఉద్ధరిస్తుంది ధర్మాన్ని. అధర్మాన్ని నిర్మూలించి ధర్మాన్ని స్థాపించాలంటే అది ఈ లోకానికి దూరంగా ఎక్కడో ఉండి పోతే అది సాధ్యమా. కనుకనే దిగిరావాలది. అదే

Dr Dayananda Swamy ebooks


అవతారం. కావచ్చు. ఎలా అవతరిస్తా డాయన. ఎవరైనా సృష్టిస్తేనా లేక తనపాటికి తానేనా.

ఇదుగో ఇది మరొక సత్యం. ఆత్మానం సృజామ్యహ మంటున్నాడు. తను తానే సృష్టించు కొంటాడట. మనబోటి మానవుల సృష్టి లాంటిది కాదిది. తల్లిదండ్రులు సృష్టిస్తే మనం సృష్టి అయ్యాము. మనపాటికి మనం కాదు. కాని పరమాత్మ అలా కాదు. ఆయనే సృష్టి కంతా మూలం కాబట్టి ఆయనను సృష్టించే తల్లిదండ్రు లెవడూ లేరు. ఉండటానికి వీలులేదు. మరి సృష్టి ఎలా. తన్ను తానే సృష్టించుకోగలడు. ఎలాగని. తాను తండ్రి – తన మాయా శక్తి తల్లి – తానంటే అఖండ చైతన్యం ఇది నిమిత్త కారణం తండ్రి. మాయ అంటే అఖండమైన దాని శక్తి. ఇది ఉపాదాన కారణం. తల్లి. ఈ రెండూ నిరాకారం గనుక తండ్రిగాని తండ్రి తల్లిగాని తల్లి. ఒకటి తాను వేసే ప్రణాళిక. మరొకటి దాని కనుగుణమైన నిర్మాణం. రెండూ కలిసి తానే గనుక తన్ను తానే సృష్టించుకోగలడు. శక్తిని వశం చేసుకొన్న వాడే చేయగలడు. మనం దానికి వశమై కూచున్నాము. గనుక మనమేదీ చేయలేము. గారడీడు లాంటి వాడాయన అయితే గారడీ చూచే వాళ్లం మనం. మనకు చేతగాదా సృష్టి. వాడికి చేతనవుతుంది. వాడే తాను తానుగానే ఉండి మరొక గారడీ వాణ్ణి తనలాంటి వాణ్ణే సృష్టిస్తాడు. అలాగే సృష్టించుకొన్నాడు భగవానుడు. అవే రామకృష్ణా

Dr Dayananda Swamy ebooks


ద్యవతారాలు. నిర్గుణుడైతే అవతరించలేడు. సగుణుడైతే అవతరించగలడు. అదే ఇప్పుడీ కృష్ణావతారం.

**పరిత్రాణాయ సాధూనాం - వినాశాయ చ దుష్కృతాం**

**ధర్మ సంస్థాపనార్థాయ - సంభవామి యుగే యుగే - 8**

ఇంత ప్రయత్నం చేసి నిర్గుణమైన పరమాత్మ సగుణమైన రూపం ధరించి ఈ లోకంలో అవతరిస్తున్నాడంటే ఏమిటి ప్రయోజనమని అడిగావే. ఆ ప్రయోజనమేదో స్వయంగానే చెబుతున్నాడు. పరిత్రాణాయ సాధూనామ్. సత్పురుషులను రక్షించటానికీ. వినాశాయచ దుష్కృతామ్. అలాగే దుర్జనులైన వారిని శిక్షించాటానికే నట ఆయనజన్మ. దుష్టులను శిక్షిస్తేగాని శిష్టుల నాయన రక్షించలేడు. అలా జరిగితేగాని ధర్మసంస్థాపనార్థాయ - ధర్మాన్ని ప్రతిష్ఠించలేడు లోకంలో.

ఇందులో దుష్టులెవరో గాదు. స్వార్థబుద్ధితో అధర్మపరులై బ్రతికే మానవులు. వీరే రాక్షసులు. శిష్టులెవరో గారు. స్వార్థ చింత లేకుండా నలుగురికీ మేలు చేసే ధర్మమార్గంలో జీవించే వారు. వీరే దేవతలూ ఋషులూ. భగవానుడు దుష్టశిక్షణ చేస్తున్నాడన్నా శిష్టరక్షణ చేస్తున్నాడన్నా అర్థం మానవులలోని దుష్టబుద్ధిని పోగొట్టి శిష్టమైన బుద్ధిని ప్రసాదిస్తాడని. రాజస తామసాలేగదా అసుర సంపద. అది నిర్మూలిస్తే ఇక మిగిలిపోయింది సత్త్వగుణమే. అదే దైవ సంపద. శిష్టమంటే మిగిలి పోయిందనే అర్థం.

Dr Dayananda Swamy ebooks



దీనితో పురాణ కధలన్నీ మనకర్థమయి పోయాయి. పురాణాలన్నీ తరుచుగా దేవ దానవ జాతులూ వారు పరస్పరం చేసిన యుద్ధాలూ అందులో వారికి కలిగే జయాపజయాలూ ఇలాంటి కధలే గదా వర్ణిస్తాయి. అందులో కూడా దానవుల బలమే ఎక్కువయి దేవతలు బలహీనమయి పరుగెత్తి పోయి విష్ణుదేవుని శరణువేడటమూ - ఆయన మత్స్యాది రూపాలలో ఏదో ఒక రూపంలో అవతరించి రాక్షసుల ఆగడా లరి కట్టి దేవతలనూ ఋషులనూ కాపాడటమూ. ఈ భావాలన్నీ వర్ణించాయంటే అందులో ఇదే అంతరార్థం. విష్ణువంటే స్థితి కర్త అయిన ఈశ్వరుడే. ఆయన చేసిన రాక్షస సంహార మధర్మ నిర్మూలనమే. దేవముని సంరక్షణ మాయన చేసిన ధర్మ ప్రతిష్ఠాపనమే.

సంభవామి యుగే యుగే. ఇది ప్రతియుగంలోనూ జరుగుతూ ఉండే వ్యవహారమే. స్థాపించిన ధర్మమే మరలా కాలాంతరంలో అధర్మం వల్ల దెబ్బ తింటుంది. దెబ్బ తిన్న ధర్మాన్ని మళ్ళీ మళ్ళీ నిలబెడుతుండాలి. అందుకే యుగే యుగే అంటున్నాడు. ఇల్లు మరమ్మత్తుకు వస్తే ఎప్పటి కప్పుడెలా చేసుకోవాలో అలాగే ప్రపంచమనే మందిరం కూడా కూలిపో కుండా మరమ్మతు చేయవలసిన అవసరముంది. అది కూలదోసే వాళ్ల దుశ్చర్య లరికడితే గాని ప్రతిష్ఠ చేయలేడు. తన ఉద్యమానికి సహకరించే వాళ్లను కలుపుకొంటేగాని అది ఫలోన్ముఖం కాబోదు. దేవకార్య సముద్యతా అన్నట్టు దేవకార్యమేదో గాదు. శిష్టులైన మానవుల కార్యమే. అది ధర్మ

Dr Dayananda Swamy ebooks



ప్రతిష్ఠాపన వల్లగాని జరగదు. దానికి నడుము కట్టటమే భగవదవతారం. అదే ఆయన ఉద్యమం. అది మాటి మాటికీ జరగవలసిందే తప్పదు.

అయితే అవతారా లే యుగంలో జరిగాయి. కృత త్రేతా ద్వాపరాలలో జరిగాయని పురాణాలు వర్ణించటమే గాని మనం చూడలేదు దేన్నీ. కల్క్యవతారమా. కలియుగాంతంలో వస్తుందని చెప్పటమే. అదీ మనమిప్పుడు చూచేది కాదు. పోనీ దుష్టులు లేరా ఇప్పుడంటే లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. మరి వీరిని శిక్షించటాని కింతవరకూ ఏ అవతరమూ రాలేదే అని ఇప్పటి వాళ్లకు పట్టుకొన్న ఆలోచన. ఒక్కమాట. ధర్మమంటే ఏదోగాదు. ధార్మికుడి గుణమే వాడి ప్రవర్తనే ధర్మం. అలాగే అధర్మం కూడా అధార్మికుడి గుణం. వాడి ప్రవర్తన. అందులో అధర్మపరుడైన మానవు డికి హితబోధ చేసి వాడి గుణాన్నీ వాడి ప్రవర్తననూ మార్చే ప్రయత్నమే భగవాను డవతరిస్తాడని చెప్పే మాట కర్థం. ఆ భగవాను డెవరో గాదు. ఆ అవతారమేదో గాదు. లోకంలో మన మక్కడక్కడా దర్శించే సాధుసజ్జనులే. ఆచార్య పురుషులే. యద్యదాచరతి శ్రేష్ఠః అని గీత వర్ణించిన ఉత్తమ మానవులే. భగవత్స్వరూపులే వారు. భగవద్విభూతి సంజాతులే. యద్యద్వి భూతి మత్సత్త్వ మని భగవానుడే స్వయంగా విభూతి పాదంలో వర్ణించ బోతున్నాడు. కాబట్టి ఇదీ మనమిందులో గ్రహించవలసిన అంతరార్థం.

**జన్మ కర్మ చమే దివ్యం - ఏవం యో వేత్తి తత్త్వతః**

**త్యక్త్వా దేహం పునర్జన్మ - నైతి మామేతి సోర్జున - 9**

Dr Dayananda Swamy ebooks



అయితే మమవర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః మానవు లందరూ నా మార్గంలోనే ఉన్నారని భగవానుడే మనకు కితాబిచ్చాడు గదా. పైగా నత్వేవాహం జాతు నాసమ్. నాకే గాదు మీ బోటి మానవులకు కూడా జనన మరణాలు లేవని అంతకన్నా పెద్ద కితాబిచ్చాడు గదా. అలాంటప్పుడీ దుష్టులేమిటి. శిష్టులేమిటి. అధర్మం వల్ల ధర్మం దెబ్బ తినటమేమిటి. అది మరలా ఉద్ధరించటానికి తానవతరించట మేమిటి. దీని కర్థమేమిటి అని ఇప్పుడొక ఆక్షేపణ.

ఆక్షేపణకు సమాధాన మిస్తున్న దిప్పుడీ శ్లోకం. మన ప్రశ్నకు తగినట్టే ఉన్నది పరమాత్మ సమాధానం. ఏమంటున్నాడో తెలుసా ఆయన. జన్మ కర్మచ మే దివ్యం. నేను జన్మించానని ఎవరన్నారు. నేనీ దుష్టశిక్షణా శిష్టరక్షణాది కర్మలన్నీ చేస్తూ వచ్చానని ఎవరన్నారు. అంతా వట్టిదే. అది మీ మానవుల భావనే. జన్మించినట్టు కనిపిస్తున్నదే గాని నీకు నేనసలు జన్మించలేదు. అలాగే ధర్మ సంస్థాపన చేస్తున్నట్టు నీకనిపిస్తున్నదే గాని నేనసలు ఏ స్థాపనా చేయటం లేదు. కారణం అది దివ్యం. మర్త్యం కాదు. దీవ్యతీతి దేవః - దేవస్య సంబంధి దివ్యం. ఏది వెలిగి పోతుంటుందో అది దివ్యం. ఎప్పుడూ అలా వెలిగిపోయేది జ్ఞానమే. అది ఇప్పుడు మన దగ్గరా ఉందా జ్ఞానం. కాని దివ్యం కాదు. ఎంచేత. మర్త్యమైన శరీరంతో ప్రాణంతో కలిసి వెలుగు తగ్గిపోయింది. మర్త్యం వెలగదు. అది జడమైన పదార్థం. తనపాటికి తాను వెలిగే స్వభావం లేదు దానికి. మన జ్ఞానంలోనే అది మనకు స్ఫురిస్తున్నది. కాని శోచనీయమైన విషయమేమంటే అదే

Dr Dayananda Swamy ebooks



నేనని దానితో తాదాత్మ్యం **Identity** చెందింది ఈ జ్ఞానం. అంచేత స్వతహాగా దివ్యమైనా అది తన దివ్యత్వాన్ని కోలుపోయి ముప్పాతిక భాగం మర్త్యమై పోయింది. ఇదే జీవాత్మ.

కాగా అలా మనః ప్రాణ దేహేంద్రియాదులతో చేతులు కలపని జ్ఞానం పరిపూర్ణమైన జ్ఞానం. అదే పరమాత్మ. ఏవం యో వేత్తి తత్త్వతః అయినా జ్ఞానం పరిపూర్ణమైనా పరిచ్ఛిన్నమైనా జ్ఞానజాతి ఒకటే గనుక ఈ పరిచ్ఛిన్నమైన మన జ్ఞానమే ఆ పరిపూర్ణమైన పరమాత్మే నేనని గుర్తించి దానితో ఏకం కాగలిగితే చాలు. జీవాత్మ పరమాత్మ అయిపోతాడు. క్రొత్తగా అవటం కాదది. అంతకుముందే పరమాత్మ అయి ఉంటేనే అలా కాగలడు. అంతకు ముందే అయితే ఇక కావటం దేనికి. అయ్యానని గుర్తులేక. ఎందుకు లేదు. మర్త్యమైన దేహేంద్రియాదులే నేనని తాదాత్మ్యం చెందటం వల్ల. అంచేత అది నేను కాదని భావిస్తే చాలు. ఎలా భావించాలి. ఇది నేనని భావిస్తే చాలు అది నేను కాకుండా పోతాను. దీనికే ప్రత్యభిజ్ఞ **Recognition** అని పేరు. మరలా తన పూర్వ స్వరూపాన్ని తాను గుర్తు చేసుకోటం. ఇది ఎలాంటిదంటే స్వప్నం చూచేవాడు తన స్వరూపాన్ని తాను మరచిపోయి మరొక శరీరాన్ని తానని భావించి మరలా మెలకువ రాగానే అంతకుముందు నుంచీ ఉన్న జాగ్రచ్ఛరీరమే తన అసలు శరీరమని గుర్తు చేసుకోటం లాంటిది. అలా చేసుకొంటే చాలు తానే అయిపోయాడది. అలాగే తన అఖండ జ్ఞానాన్ని మరలా ఈ ఖండ జ్ఞానం గుర్తిస్తే చాలు. ఖండ రూపంగా భాసించే జీవుడఖండ రూపమైన పరమాత్మే కాగలడు.

Dr Dayananda Swamy ebooks



బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి. బ్రహ్మమే తానని గుర్తిస్తే చాలు బ్రహ్మమే అయిపోతాడీ జీవుడని ఉపనిషత్తు ఘోషిస్తున్నది. అనుష్ఠానం లేదిక్కడ. జ్ఞానమే అయిపోవటం.

త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి - మామేతి. అలా అయిపోయాడంటే వాడే ఇక బ్రహ్మం గనుక బ్రహ్మానికి జన్మ ఎలా లేదో దేహ బంధమెలా లేదో అలాగే బ్రహ్మభూతుడైన జీవుడికీ లేవు. ప్రారబ్ధం తీరి ఈ దేహాన్ని వదిలేశాడంటే ఇక మరలా ఒక జన్మ ఎత్తటంగాని శరీరాన్ని ధరించటంగాని ఉండబోవు. జన్మను పొందటానికి మారుగా పరమాత్మ నైన నన్నే పొందుతాడని హామీ ఇస్తున్నాడు కృష్ణభగవానుడు. ఇప్పుడర్థ మవుతుంది మనకు ఎవరికీ జననమరణాలు లేవు అని ఎందుకు చెప్పాడో పరమాత్మ. గుర్తిస్తే లేదని అర్థం చేసుకోవాలి మనం. గుర్తించే జ్ఞానికి లేవని. గుర్తించని అజ్ఞానికే ఉన్నాయి. అది కూడా వాస్తవం కాదు. ఆభాసగానే. అంతేకాదు. మరలా ఈ బంధం లోనుంచి బయటపడాలంటే ఏ కర్మానుష్ఠానమో ఏ ఉపాసనో ఏ యోగాభ్యాసమో కాదు మార్గం. కేవలమా పరిపూర్ణ జ్ఞానమే నా స్వరూపం - ఈ శరీరాది సంఘాతం కాదనిపూర్తిగా అవగాహన చేసుకోటమే ఏకైక సాధనమని కూడా తేటపడుతున్నది.

**వీతరాగ భయక్రోధా - మన్మయా మాము పాశ్రితాః**

**బహవో జ్ఞాన తపసా - పూతా మద్భావ మాగతాః - 10**

Dr Dayananda Swamy ebooks



పోతే ఈ జ్ఞాన యోగమిప్పుడు క్రొత్తగా ఆవిర్భవించింది కాదు. ఎప్పటినుంచో అను స్యూతంగా వస్తున్నది. బహవః - ఎంతోమంది పూర్వం వీగరాగ భయక్రోధాః - రాగ ద్వేషాలూ వాటి వల్ల ఏర్పడే భయోద్వేగాలూ - వీటన్నిటికీ స్వస్తి చెప్పి కేవలం సత్త్వ గుణ సంపన్నులయి మన్మయాః - ఈశ్వరా భేదదర్శినః అని అర్థం వ్రాస్తున్నారు స్వామివారు. ఈశ్వర స్వరూపులమే మేమని అభేద భావనతో మాముపాశ్రితాః - కేవల జ్ఞాన నిష్ఠులయి జ్ఞాన తపసాపూతాః - జ్ఞానమే ఒక తపస్సుగా ఆచరించి దానితో పూతాః పరిశుద్ధులయి మద్భావ మాగతాః - మద్భావమంటే ఈశ్వర భావం మోక్షమని భాష్యం. మోక్షమే పొందగలిగారట వారందరూ. జ్ఞానంతోనే ముక్తులయి పోయారు. మోక్షానికి సాధనం పరమాత్మ జ్ఞానం తప్ప మరేదీ లేదని ఘంటా పథంగా చెబుతున్నది గీత.

మరి తపస్సంటున్నదే అదేమిటి. జ్ఞానమే తపస్సు మరేదీ గాదు. ఇతర తపోనిరపేక్ష జ్ఞాననిష్ఠా ఇత్యస్య లింగం జ్ఞాన తపసా ఇతి విశేషణం అని భాష్యం వ్రాస్తున్నారు గురువుగారు. మిగతా తపస్సు లెన్నైనా మీరు విని ఉండవచ్చు గ్రంథాలలో. అవి ఏవీ మోక్షానికి సాధనాలు కావు. ఇక్కడ జ్ఞాన తపస్సంటున్నది గీత గుర్తించండి. ఇదే నిదర్శనం మనకు జ్ఞానేతరమైన తపస్సేదీ మార్గం కాదని. అవి శరీరేంద్రియ శోషణానికేతప్ప మోక్షానికి పనికిరావు. హఠయోగం క్రిందికి వస్తాయవి. మహా అయితే అణి మా ద్యష్ట సిద్ధు లార్జించటానికి తోడుపడవచ్చు. అది యోగమే

Dr Dayananda Swamy ebooks



గాని జ్ఞానం కాదు. నహి జ్ఞానేన సదృశం పవిత్రమని చెప్పబోతుంది గీత. జ్ఞానమొక్కటే పూతం పవిత్రం. అదే అన్ని మాలిన్యాలనూ కడిగివేస్తుంది. మిగతావన్నీ మాలిన్యాన్ని అంతకంతకు పోగు చేస్తాయి. అదే రజస్తమో గుణ ప్రభావం. ఆవరణ విక్షేపాలు వాటి వల్లనే. తన్మూలంగా మానవుడి జ్ఞాన మావృతమూ విక్షిప్తమూ **Veiled and Distracted** అవుతుందే తప్ప పరిశుద్ధ మవదు. పరిశుద్ధ మవక పోతే పరిపూర్ణమయి వ్యాపించలేదు. అలాంటప్పుడది సర్వవ్యాపకమైన పరమాత్మ జ్ఞానంగా ఎలా భాసించగలదు. జన్మ కర్మ బంధం నుంచి ఎలా విముక్తి నాసించ గలదు. కనుక జ్ఞానా దేవతు కైవల్యం. జ్ఞాన తపస్సే అసలైన తపస్సు. అదే మోక్షదాయకం.

**యే యథా మాంప్ర పద్యంతే - తాంస్త థైవ భజామ్యహం**

**మమ వర్త్మాను వర్తంతే - మనుష్యాః పార్థ సర్వశః - 11**

అయితే ఇప్పుడొక అభియోగం **Allegation** వచ్చింది పరమాత్మ మీద. మన్మయా మాము పా శ్రితాః అన్నాడాయన. అంటే ఏమన్న మాట. తన్ను ఆశ్రయించిన వారికే మోక్షమనే ఫల మందిస్తున్నాడు. మిగతా వారు తన్నాశ్రయించటం లేదు కాబట్టి వాళ్ల నోట కరక్కాయే నంటున్నాడు. ఇది ఏమి న్యాయం. భగవానుడికి అందరూ సమానమే గదా. ఆయనకీ పక్షపాత బుద్ధి ఏమిటి.

నిజమే అందరూ ఆయనకు కావలసినవారే. అదే అంటున్నాడు కూడా మమవర్త్మాను వర్తంతే మనుష్యాః - ప్రతి ఒక్క మానవుడూ నా

Dr Dayananda Swamy ebooks


మార్గంలోనే ఉన్నాడర్జునా. అందరూ నాకాశ్రితులే కాని వచ్చిన ఇబ్బం దేమిటంటే నేను వారిని ఆ శ్రితులుగా భావిస్తున్నానే గాని వారు నన్నలా భావించటం లేదు. మరెలా భావిస్తున్నా రంటారు. యే యధామాం ప్రపద్యంతే - ఒక్కొక్క రొక్కొక్క విధంగా భావిస్తున్నారు నన్ను.

అంచేత నాదృష్టికి తగినట్టు వారు లేరు కాబట్టి తాంస్త థైవ భజామ్యహం - వారి దృష్టికి తగినట్టే నేను తయారవుతాను. ఎలాగా అని అడిగితే చెబుతున్నారు భాష్యకారులు. యే యత్ఫలార్థి తయా మాంప్రపద్యంతే - తాంస్తత్ఫల దానేన అనుగృహ్ణామి - ఎవరే ఫలం కావాలని నన్ను పట్టుకొంటారో వారికా ఫలమే అనుగ్రహిస్తాను. తేషాం మోక్షం ప్రత్యన ర్థిత్వాత్ - వారికి మోక్షఫల మక్కర లేదు. నహి ఏకస్య ముముక్షుత్వం ఫలార్థిత్వంచ యుగప త్సంభవతి. ముముక్షుత్వమూ - కర్మఫలార్థిత్వమూ ఏకకాలంలో రెండూ ఒక్కడికే కలగవు గదా - అంచేత యే ఫలార్థినః తాన్ ఫలప్రదానేన - ఎవరు ఫలార్థులై ఒక పని చేస్తుంటారో వారికా ఫలమిచ్చి - యే యధోక్త కారిణస్తు అఫలార్థినః ముముక్షవశ్చ - తాన్ జ్ఞాన ప్రదానేన - ఎవరు ఫలార్థులు కారో కేవలం మోక్షం మీదనే దృష్టి పెట్టుకొని నిష్కామంగా కర్మయోగం పాటిస్తారో వారికి జ్ఞానం ప్రసాదించి - యేజ్ఞానినః సన్న్యాసినః ముముక్షవశ్చ - ఎవరు జ్ఞానవంతులయి అన్నీ పరిత్యజించి మోక్షానికి సిద్ధంగా ఉన్నారో తాన్ మోక్షప్రదానేన - వారికి మోక్షమిచ్చి - అలాగే ఆర్తాన్ ఆర్తి హరణేన -

Dr Dayananda Swamy ebooks



ఇదేదీ మాకు అందుబాటులో లేదు కేవల మీ సంసార బాధలు పడలేక నిన్ను కీర్తిస్తుంటాను దేవా అని ఆర్తులైన మానవులకు వారి ఆర్తిహరణం చేస్తూ - ఇలా వారి వారి ప్రపత్తిని బట్టి నేను అనుగ్రహిస్తుంటానే గాని నేనుగా స్వతంత్రించి వారికక్కర లేకపోయినా ఇవ్వటమంటూ ఉండదంటాడు భగవానుడని వ్రాస్తాడాయన.

అయితే మమవర్త్మాను వర్తంతే అని ఎలా అన్నారు మీరు. అందరూ మార్గంలోనే ఉన్నప్పుడందరూ మీ అనుగ్రహానికి పాత్రులేగదా. అంటే పాత్రులే కాని అందరూ ఒక్కటే కోరటం లేదు. నన్ను ఎవరేది కోరితే వారి కది ఇస్తాను. ఇవ్వకుండా పోను. అందరూ మోక్షం కోరితే మోక్షమే ఇవ్వగలను. కాని కోరటం లేదు గదా. రహస్యమే మంటే నాకందరూ కావలసిన వారే గాని అందరూ నన్ను కావాలను కోటం లేదు. నాది కావాలను కొంటున్నారు. నన్ను కావాలనుకుంటే నేనే దక్కుతాను వారికి. వారే జ్ఞానులు. అలాకాక నాది కావాలని ఆశ్రయిస్తే నన్ను మానేసి నాదే వారికిస్తాను. వీరే కర్మిష్ఠులూ ఉపాసకులూ వగైరా. నాకు మాత్రం నేనూ నేనే నాదీ నేనే. ఇదీ ఇందులో దాగి ఉన్న రహస్యం. అది గుర్తించిన వాడు జ్ఞాని. లేనివాడు అజ్ఞాని.

**కాంక్షంతః కర్మణాం సిద్ధిం - యజంత ఇహా దేవతాః**

**క్షిప్రంహి మానుషే లోకే - సిద్ధి ర్భవతి కర్మజా - 12**

Dr Dayananda Swamy ebooks


అయితే ఒక చిన్న ప్రశ్న. అడుగుతున్నారు గురువుగారు. రాగద్వేషాలు లేనివాడు గదా ఈశ్వరుడంటే. వాడు మానవులందరికీ అన్ని కోరికలూ తీర్చటానికి సమర్థుడు గదా. అలాంటప్పుడు సర్వమూ వాసుదేవుడనే జ్ఞానం సంపాదించి ప్రతి ఒక్కడూ మోక్షమే కోరి ఆ పరమాత్మ నెందుకు పట్టుకోటం లేదు. అని అడిగితే ఇప్పుడీశ్వరుడే ఇస్తున్నాడు సమాధానం.

కాంక్షంతః కర్మణాం సిద్ధిమ్. సాధారణంగా మానవులలో ముప్పాతిక మంది కొక బలహీనత ఉంది. అదేదో కాదు. ఏదేదో కోరిక పెట్టుకొంటారు. ఆ కోరికలకు అనుగుణంగా ఆయా కర్మ లాచరిస్తుంటారు. వాటికి తగిన ఫలితం వెంటనే వచ్చి ఒళ్లో పడితే బాగుండునని ఎక్కడలేని ఆశ పెట్టుకొని బతుకుతుంటారు. యజంత ఇహ దేవతాః – తామాసించిన ఫలం తమకు కలగాలంటే అది తనుకంద జేయవలసిన వారు దేవతలేనని వారెక్కడో లోకాంతరాలలో ఉండి కనిపెట్టి చూస్తున్నారని వారికోసం యజ్ఞయాగాదులు చేస్తే అవి తమకు అనుగ్రహిస్తారని వారిని సేవించలేక సతమత మవుతుంటారు.

క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా అసలొక రహస్య మేమంటే ఆయా కర్మ లాచరిస్తూ పోతే ఈ మానవలోకంలో సిద్ధి అనేది చాలా శీఘ్రంగా కలుగుతుంది. అంతవరకూ హామీ ఇవ్వగలను. అంత త్వరగా ఫలితం కలుగుతుంది. అది దేవతలే ప్రసాదిస్తారనీ శాస్త్రం చెబుతున్నది. తమ బుద్ధులకు కూడా అలాగే తోస్తుంటుంది మానవులకు.

Dr Dayananda Swamy ebooks



అందుకే ఆయా కామ్యకర్మల వెంటబడి పోతుంటారు నూటికి తొంభయి మంది. ఇక వారికి నేనెక్కడ కనపడతాను. నాబదులు దేవతలే వారికి గోచరిస్తుంటారు. నన్నాయా దేవతల రూపంలో పట్టుకొంటున్నారే గాని నన్ను నన్నుగా భజించటం లేదు. దానికి కారణం వారి మనస్సులను కలవర పెట్టే ఆయురారోగ్య పుత్ర పౌత్ర ధనకనకాది విషయ వాంఛలే. అవి మనసులో మెదులుతున్నంత వరకూ నేను కనిపించను వారికి. నేనే కనిపించక పోతే నన్ను ఆశ్రయించి నావల్ల సర్వమూ నేనేననే జ్ఞానం గడించాలనే కోరిక ఎలా ఏర్పడుతుంది వారికి. ఏర్పడకుంటే ఎంత సర్వసమర్థుడనైనా నేను వారికెలా ప్రసాదించగలనని ప్రశ్నిస్తాడు పరమాత్మ. ఆకలి లేని వాడి కన్నం పెట్టలేము గదా. అలాంటి వ్యవహారమిది.

ఇంతకూ ఆయా విషయాల మీద అభిలాష ఉన్నంతవరకూ అది పరమాత్మ దర్శనాని కడ్డు తగులుతుంటుంది. అభిలాష తీర్చే వాడెవడో వాడే పరమాత్మ వారి దృష్టికి. అది ఆయా దేవతల రూపంలో వాడికి భాసిస్తుంటుంది. వారిని కూడా ఆత్మగాగాక అన్యంగా విషయంగా చూస్తుంటాడు. కాబట్టి వీడి విషయ వాంఛలకు తగినట్టే విషయ రూపులైన ఆ దేవతలు కూడా తమ కోసం నీవాచరించే కర్మలకు ముగ్ధులయి వీడికా కర్మఫల మంద జేస్తుంటారు. ఇదే ప్రవృత్తి ధర్మంలో ఉండే వ్యవహారమంతా. ఇంతకూ ఫలం కోసం చేసేదంతా కర్మే. జ్ఞానం కోసమని చేసేది కర్మగాదు. కర్మయోగం. అందులో విషయచింత **Objective**

Dr Dayananda Swamy ebooks


లేదు. కాబట్టి విషయ రూపమైన అనుష్ఠానమూ లేదు. విషయంగా భావించే దేవతలూ లేరు.

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం - గుణకర్మ విభాగశః**

**తస్య కర్తార మపి మాం విద్ధ్య కర్తార మవ్యయమ్ - 13**

అయితే ఏమిటీ వింత. మానవ జన్మ ఎత్తి అంతో ఇంతో జ్ఞానవంతుడైన మానవుడే ఎందుకింత అన్యాయంగా ప్రవర్తిస్తున్నాడు. అంతా భగవత్స్వరూపమే నని ఎందుకు గుర్తించలేక పోతున్నాడు. నేనీ పనిచేస్తే వారు సంతోషించి నా కోరికలన్నీ నెరవేరుస్తారని ఎందుకు కలగంటున్నాడు. ఎందుకోస మిన్ని కర్మలు చేయలేక సతమత మవుతున్నాడని ప్రశ్న వస్తున్నది. దీనికిప్పుడు సమాధాన మిస్తున్నాడు చూడండి పరమాత్మ.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం - గుణకర్మ విభాగశః - అసలు సంగతేమంటే మానవు లందరినీ నేనే సృష్టించినా అందరూ ఒకే విధంగా సృష్టి కాలేదు. అందులో నాలుగు తరగతు లున్నాయి. వాటికి వర్ణాలని పేరు. కొందరు బ్రాహ్మణులు. కొందరు క్షత్రియులు. మరికొందరు వైశ్యులు. ఇక కొందరు శూద్రులు. అందరూ నాసృష్టే అయినా అందులో ఈ తేడా ఏర్పడింది. తేడాగా ఎందుకు సృష్టించారని నన్నడుగుతారేమో. నా తప్పేమీ లేదందులో. మరి ఎవరిది తప్పు. గుణకర్మ విభాగశః - వారి వారి గుణాలూ - కర్మలూ ఇవి రెండే దానికి కారణం.

Dr Dayananda Swamy ebooks



గుణ కర్మ లంటే వ్యాఖ్యానిస్తున్నారు భాష్యకారులు. సత్త్వ రజస్తమో గుణాలే ఇక్కడ గుణాలు. ఆ గుణాల కనుగుణంగా శాస్త్రం వారి వారికి విధించినవి కర్మలు. బ్రాహ్మణుడికి శమదమాదులు తపః స్వాధ్యాయాదులూ - క్షత్రియుడికి శౌర్యతేజః ప్రభృతులూ. వైశ్యుడికి కృషి గోరక్షాదులూ - శూద్రుడికి శుశ్రూషాదులూ - ఇలాటివి.

కాని మన ప్రశ్నకు పూర్తిగా రాలేదు సమాధానం. వారి వారి గుణకర్మలే **Character ant Conduct** కారణంగాని వైషమ్యానికి నేను గాదని ఎంత తప్పించుకొందా మనుకొన్నా తప్పించుకోలేదు పరమాత్మ. ఎందుకంటే మానవుణ్ణి సృష్టించింది తానేనని ఒప్పుకొన్నాడు. అలా ఒప్పుకొంటూనే వారి గుణకర్మలకు నేను బాధ్యుణ్ణి కానంటున్నాడు. ఇది న్యాయమేనా. మానవుణ్ణి సృష్టించాడంటే వాడి గుణాలూ కర్మలూ కూడా తానేగా సృష్టించినవాడు. తానుగాక మరెవ రున్నారు వాటిని సృష్టించటానికి. ఈ ప్రశ్న వస్తుందని ముందుగా పసిగట్టాడో ఏమో తస్య కర్తార మపిమాం విద్ధ్యకర్తార మవ్యయ మని మరలా తప్పుకొంటున్నాడు. అసలు వాణ్ణి నేను సృష్టిస్తేగదా వాడి గుణకర్మలకు నేను బాధ్యత వహించేది. వాణ్ణే అసలు నేను సృష్టించలేదు. దానికి నేను కర్తనే కాను. మరి కర్తనని ఇంతకు ముందే గదా ఒప్పుకొన్నారు. చాతుర్వర్ణ్యం మయా సృష్టమని మీరేగా నాలుగు వర్ణాలనూ స్వయంగా సృష్టించానని ఒప్పుకొన్నది. ఇంతలో మాట మారుస్తా రేమిటి. సర్వజ్ఞుడూ సర్వశక్తుడూ అయినవాడు మాట మార్చవచ్చునా.

Dr Dayananda Swamy ebooks


దీనికి జవాబు భగవానుడూ చెప్పడు. భగవత్పాదులూ చెప్పరు మౌనంగా ఉండిపోయారు. అలా మౌనం వహించి పద్దెనిమిదవ అధ్యాయంలో ఉన్నట్టుండి మళ్లీ నోరు విప్పుతా రిద్దరూ. ఏమని బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాంచ పరంతప - కర్మాణి ప్రవిభక్తాని - స్వభావ ప్రభవైర్గుణైః - ఈ శ్లోకం చివరి పాదంలో ఉంది జవాబు. కర్మలూ గుణాలనూ బట్టి వచ్చాయి. గుణాలెలా వచ్చాయి. స్వభావ ప్రభవైః - వారి స్వభావాన్ని బట్టి వచ్చాయట. స్వభావ మేమిటి. జన్మాంతర కృత సంస్కారః ప్రాణినాం వర్తమాన జన్మని స్వకార్యాభిముఖ త్వేన అభివ్యక్తః అని అక్కడ దానికర్థం చెబుతారు భాష్యకారులు. మానవుల జన్మాంతర కృత సంస్కారమే **Past impression brought forward to the present life** స్వభావమనే మాట కర్థం. పరమాత్మ మానవుణ్ణి సృష్టించాడంటే దాన్ని బట్టే సృష్టించాడు గాని నిరంకుశంగా తన పాటికి తను సృష్టించలేదు. కాబట్టి వారి వారి స్వభావ దోషమే గాని ఇది పరమాత్మ దోషం కాదు.

స్వభావ దోషమని పేర్కొన్నామే. అందులో ఇంకా ఒక లోతైన భావం మనకు స్ఫురిస్తున్నది. దానివల్ల ఏర్పడ్డాయన్న నాలుగు వర్ణాలూ ఎక్కడో బాహ్యంగా లేవసలు. ఆ మాటకు వస్తే అవి ఈ జీవాత్మగా చెలామణీ అయ్యే మన లోపలనే ఉన్నాయి. విమర్శ చేసి చూస్తే మనలోనే ఉన్నాయి నాలుగు వర్ణాలూ. అవేమిటంటే శూద్రుడు మన శరీరం. పరిచర్య

Dr Dayananda Swamy ebooks


చేయటమే దీని లక్షణం. పరిచర్య అంటే మిగతా మూడు వర్ణాల వారికీ సేవ చేయటమనిగాదు. ఇక్కడ పరి అంటే అంతటా చర్య అంటే తిరగటం. సర్వత్రా తిరుగుతున్నదీ శరీరమే గనుక శరీరం శూద్రుడు. అలాగే ప్రతివాడిలో వైశ్యుడున్నాడు. కొనుగోలు అమ్మకం ఇవేగదా వైశ్యుడు చేసే పని. వైశ్యుడు మన ఇంద్రియాలే. జ్ఞానేంద్రియాలు బాహ్యమైన శబ్ద స్పర్శాదుల జ్ఞానం కొని తెస్తుంటాయి లోపలికి. అలా అందించిన సరకు మరలా బయటపెట్టి అమ్ముతుంటాయి వాగాదులైన కర్మేంద్రియాలు. ఈ వ్యాపారం వల్ల కలిగే లాభనష్టాలు జీవుడను భవిస్తుంటాడు.

పోతే ఇక క్షత్రియు డెవరో తెలుసా మనలో. ప్రాణం. అది ఎప్పుడూ కనిపెట్టి చూస్తుంటుంది కాపాడుతుంటుందీ శరీర సామ్రాజ్యాన్ని. క్షతం నుంచి కాపాడటమే క్షత్రియ లక్షణం. క్షతమంటే దెబ్బ. అది తగలకుండా రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నది మనలో ప్రాణవాయువే గదా. కనుక అదే క్షత్రియుడు. కాగా ఇక ఇవి అన్నీ అయిన తరువాత బ్రాహ్మణుడెవరో చెప్పమంటారా. అది మనలో ఉన్న మనస్సే. జ్ఞానానికి నిలయమది. మనసు లేకపోతే ఆలోచనలేదు. ఆలోచించే స్వభావం మనసుకే ఉంది. చక్కగా ఆలోచించి సలహా ఇచ్చి మిగతా అన్నింటినీ నడిపేది అదే.

ఈ నలుగురూ కలిసి ఏక కుటుంబంగా ఒకే ఒక శరీర మనే రాష్ట్రంలో బ్రతుకుతున్నారు. శరీరం లేకుంటే ఆధారం లేదు వీటికి. కనుక శూద్రుడుండి తీరాలి. ఇంద్రియాలు లేకుంటే ప్రపంచంతో సంబంధమే

Dr Dayananda Swamy ebooks


తెగిపోతుంది. కనుక వైశ్యుడుండాలి. ప్రాణం లేకుంటే అసలు జీవితమే లేదు. కనుక క్షత్రియు డుండాలి. కాని చిత్రమేమంటే శరీరమూ - ఇంద్రియాలూ - ప్రాణమూ ఇవన్నీ ఎన్ని ఉన్నా - ఇటు ప్రపంచ జ్ఞానం గాని అటు పరమాత్మ జ్ఞానం గాని వీటిలో దేనికీ లేదు. అది ఒక్క మనసుకే ఉన్నదా సామర్థ్యం. అదే బ్రాహ్మణుడంటే. బ్రహ్మ జ్ఞానాని కధికారి వాడే. అదే జీవితాని కంతటికీ గమ్యం. అందుకోసమే ఉందీ మనస్సు. దానికి సహకరించటానికే ఉన్నాయి శరీర ప్రాణేంద్రియాలు మూడూ. ఈ మూడింటి తోడ్పాటుతో మనసు బ్రహ్మజ్ఞాన మార్జించి ఆదృష్టితో చూస్తే ఇటు శరీర సృష్టీ లేదు అటు విశ్వ శరీర సృష్టీ లేదు. అంతా బ్రహ్మమయం గానే అనుభవానికి వస్తుంది.

అందుకేనేమో నేను సృష్టించినా యధార్థంగా సృష్టించ లేదని చాటుతున్నాడు పరమాత్మ. వ్యావహారికంగా సృష్టి జరిగిందని చెప్పకపోతే దేహేంద్రియాది సామగ్రి నుపయోగించుకొని మనసు జ్ఞాన సాధనకు నడుము కట్టదు. కనుక తాత్కాలికంగా జరిగిందని చెప్పాడు. జ్ఞానాన్ని ఆర్జించిన తరువాత చూడబోతే అసలు సృష్టే మాఫీ అయి అంతా తన స్వరూపంగానే అనుభవానికి వస్తుంది కాబట్టి పారమార్థికంగా సృష్టే అసలు జరగలేదు - నేను చేయలేదని చాటుటం. కనుక వ్యావహారికంగా పారమార్థికంగా ఎలా చూచి చెప్పినా చెప్పుకోవచ్చు చాతుర్వర్ణ్యమనే మాట కర్థం.

Dr Dayananda Swamy ebooks



కాకపోయినా వర్ణాలనేవి బ్రహ్మ క్షత్రియ వైశ్యశూద్రులని భావించి ఏమిటందరూ మానవులే గదా. ఎందుకీ భేదభావమని నీ వాక్షేపించినా వర్గభేదాన్ని కాదన లేవు గదా. ఒకే మానవ జాతిలో కొందరు విద్యావంతు లుంటారు. వారు బ్రాహ్మణు లనుకో. తప్పు లేదు. ప్రజాపాలకులైన మంత్రులూ దేశాధ్యక్షులూ ఉంటారు. వారే క్షత్రియులని భావించు. మరి వాణిజ్యమూ పరిశ్రమలూ చేసి ఆర్థికాభివృద్ధికి తోడ్పడే వర్గమొకటి ఉంటుంది. వారే వైశ్యులను కోండి. అలాగే కాయకష్టం చేసి యంత్రాగారాలలో పరిశ్రమ చేసి-సేద్యం వడ్రంగం - మొదలైన పనులు చేసే పనివాళ్లుంటారు. వారే శూద్రులని భావిస్తే చాలు. ఏ గొడవాలేదు. అందరూ ఒకే పని చేయలేరు. ఎవరి పనివారు చేస్తేనే దేశాభ్యుదయం సిద్ధిస్తుంది. **If not caste system class system prevails in society.** ఒకటి **Learned class** విద్యావంతులు. ఒకటి **Ruling class** వారే క్షత్రియులు. మరొకటి **Business men or Industrialists** వారే వైశ్యులు. ఇంకొకరు **Labourers or working community** వారే శూద్రులను కొంటే పేచీ లేదు గదా. నామ్ని కో దోషః అన్నారు భగవత్పాదులు. పేరులో ఏముంది. కాబట్టి వర్ణ విభాగమను. వర్గ విభాగమను. అది గాదు పరమార్థం. పరమార్థ మవి భక్తమైన సత్యం. దాన్ని అందుకొనే మార్గం విభాగం. విభాగం ద్వారానే అవిభాగమైన గమ్యాన్ని అందుకోవాలి. **From Diversity to unity** ఇదే గొప్ప సూత్రం. భగవానుడి మాటల్లో ధ్వనించే బ్రహ్మాండమైన సందేశమిది.

Dr Dayananda Swamy ebooks


**నమాం కర్మాణి లింపంతి - నమే కర్మఫలే స్పృహా**

**ఇతి మాం యోభి జానాతి - కర్మభి ర్నస బధ్యతే - 14**

కాకపోయినా అసలెందుకు నీకీ కాకదంత పరీక్ష. నేను సృష్టించానని చెప్పినా సృష్టించలేదని చెప్పినా-అదీకాదు వారి వారి స్వభావమే సృష్టించిం దని చెప్పినా - అంతా అబద్ధమే. వాస్తవం కాదు. కారణం సృష్టి అనేది ఏదైనా అది మాయా మయమే గదా. ఒక మాయావి ఎలా తన ఇంద్రజాల మహేంద్రజాలంతో ఒక గంధర్వ నగరాన్ని ఆకాశంలో కల్పిస్తాడో అలాంటి కల్పన ఈ సమస్త ప్రపంచమూ. ఉందంటే ఉందది లేదంటే లేదు. ప్రతీతి సిద్ధమే గాని **Apparent** అది వస్తు సిద్ధం **Actual** కాదు. ప్రపంచ సృష్టే అసత్య మైనప్పుడిక మానవసృష్టి మాత్రం అసత్యం గాక సత్యమెలా అవుతుంది. చేతన సృష్టీ కాదు అచే తన సృష్టీ కాదు. ఏదీ సత్యం కాదు. అంతా అసత్కల్పమే.

మరి అసత్యమైనప్పు డెందు కింత చిలువలు పలువలు పెట్టి వర్ణించటం పరమాత్మ. బ్రాహ్మణాది వర్ణాలను నేనే సృష్టించానని - నేను గాదు వారి స్వభావం సృష్టించిందని ఎందుకిన్ని మాటలు. నిజమే. కాని ఒక లోతైన అంతరార్థ ముంది ఇలా వర్ణించటంలో. అదేమిటంటే మనబోటి మానవుల దృష్టితో ఒకమాట చెప్పి తరువాత తన దృష్టితో మరొక మాట చెబుతున్నాడు పరమాత్మ. మరొక విధంగా చెబితే తాను సృష్టించానని చెప్పటం వ్యావహారిక సత్యమైతే సృష్టించలేదని చెప్పటం పారమార్థిక

Dr Dayananda Swamy ebooks



సత్యం. అద్వైతంలో ఎక్కడ పూర్వాపర విరోధమున్నట్టు కనిపించినా అది నిజమైన వైరుధ్యం కాదు. ఒకటి లోక దృష్టి ననుకరించి చెప్పేమాట. మరొకటి శాస్త్ర దృష్టితో దాన్ని కాదని త్రోసిపుచ్చుతూ చెప్పేమాట. రెండు మాటలూ ఒకరి మాటలు గావు. ఒకటి లోకం మాట. ఇంకొకటి శాస్త్రం మాట.

దీన్నిబట్టి ఇప్పుడు మనమర్థం చేసుకోవలసిం దేమంటే అసలు సృష్టి జరిగినట్టు నీవూ నేనూ చూస్తుంటే అలా చూడకండి అది మీ సమస్యకు పరిష్కారం కాదు. మీకు తోచినట్టు ఊహిస్తుంటారే గాని అది యథార్థం కాదు. యథార్థమైనది పరమాత్మ చైతన్యమే. అది కర్తగాదు. భోక్త కాదు. కేవలం సాక్షిభూతమే. అదే నా స్వరూపమనే దృష్టితో పట్టుకొన్నారంటే మీరూ నాలాగే సాక్షిగా మారిపోతారు. అప్పుడీ ప్రపంచమూ లేదు - మానవుడూ లేడు. వారి గుణకర్మలూ లేవు. అంతా వాసుదేవ స్సర్వమితి అన్నట్టు అనాత్మ అంతా ఆత్మ రూపంగానే మీకు అనుభవానికి రాగలదు. అదే ఈ సమస్యకు పరిష్కారమని చాటటమే ఇందులో దాగి ఉన్న పరమాత్మ ఆశయం.

అదే ఇప్పుడు బయటపెడుతున్నాడు. నమాం కర్మాణి లింపంతి. నమే కర్మఫలే స్పృహా. నాకే కర్మలూ లేవు. వాటితో అసలు నాకు సంబంధమే లేదు. అసలు నాకు కావలసిన ప్రయోజన మేదైనా ఉంటే గదా కర్మ చేయటం. కర్మఫలం మీదనే నాకు కాంక్షలే నప్పుడెలా చేయగలనే

Dr Dayananda Swamy ebooks


కర్మ అయినా - ఇతిమాం యోభిజానాతి - అని ఈ విధంగా ఎవడు నన్ను గుర్తిస్తాడో అర్ధం చేసుకొంటాడో. కర్మ భి ర్న స బధ్యతే - అలాంటివాడినే కర్మా బంధించదు. కర్మఎలా బంధిస్తుందస లెవడినైనా. నేనీ కర్మ చేస్తున్నాననే కర్తృత్వంతో ఫలానా ఫలితం కోసమనే భోక్తృత్వంతో - ఈ రెండింటితోనే బంధిస్తుంది. కర్తనూ కాను భోక్తనూ కాననే సాక్షి భావంతో చూస్తే ఎలా బంధ మవుతుందది. చూస్తే అంటే ఎవరిని చూస్తే చూచి అంటున్నాడు పరమాత్మ. నన్ను అంటున్నాడు. అంటే పరమాత్మ నలా చూడాలనా లేక నన్ను అని ఎవడి ఆత్మను వాడలా చూడాలనా. ఏదైనా ఒకటే. పరమాత్మ నలా చూడటమంటే తన్ను తానలా చూడటమే. పరమాత్మ అంటే పరిపూర్ణ చైతన్యమే గదా. దాన్ని చూస్తున్నప్పుడీ జీవచైతన్యం కూడా పరిపూర్ణ దృష్టితోనే గదా చూడవలసింది. రెండూ అలా పరిపూర్ణమైతే ఇక రెండెలా కాగలవవి. ఒకే ఒక చైతన్యం. అఖండ చైతన్యం. నదీ జలమూ జలమే. సముద్ర జలమూ జలమే. నదీ జలం సముద్ర జలాన్ని చూచిందన్నా మనుకోండి. ఏమిటి దాని అర్ధం. నది సముద్ర మయిందనే గదా. అలాగే యోభి జానాతి. ఎవడలా పరమాత్మను భావిస్తాడో ఆ భావనతోనే వాడు పరమాత్మ అయ్యాడని భావం. అప్పటికి పరమాత్మ భావన పెట్టుకొని చూడండి. అప్పుడిక మీకు సృష్టి చింతన లేదు. గుణకర్మ చింతన లేదు. పరిమితమైన జీవ చైతన్యాన్ని పరిపూర్ణమైన ఈశ్వర చైతన్యం వైపు మళ్లించాటానికే ఈ వర్ణన అంతా అని అర్ధం

Dr Dayananda Swamy ebooks



చేసుకోవాలి. చేసుకొంటే సృష్టి వర్ణన చేసినా సృష్టి విషయంలో లేదు తాత్పర్యం. జీవేశ్వరైక్యంలో. అందుకే సృష్టి వర్ణన భ ంగ్యంతరంగా తోడుపడుతున్నది.

**ఏవం జ్ఞాత్వా కృతం కర్మ - పూర్వైరపి ముముక్షుభిః**

**కురు కర్మైవ తస్మాత్త్వం - పూర్వైః పూర్వతరం కృతమ్ - 15**

ఏతావతా తేలిన సారాంశమేమంటే సృష్టిని గూర్చిగాదు నీవు ఆలోచించ వలసింది. మిధ్యాభూతమైన సృష్టి దేనికి నీకు. దీనికధిష్ఠానమైన పరమార్థమేదో దాన్ని అన్వేషించి పట్టుకోవాలి. అది ఆత్మస్వరూపమే. వస్తు సిద్ధంగా సర్వత్రా సర్వదా ఉన్నదదే. దాన్ని గ్రహించుటయే జ్ఞానయోగం. అందుకోసం ప్రయత్నించటమే కర్మయోగం. నేను దేనికీ కర్తను గాను భోక్తను గానని దృఢంగా నమ్మి ఆభావంతో కర్మలు ఆచరించటమే కర్మయోగం. ఏవం జ్ఞాత్వా. ఈ విధంగా తెలుసుకొని అంటున్నది గీత. ఏవిధంగా తెలుసుకోవాలి. కర్తనూ భోక్తనూ గానని జ్ఞానానికి ముందూ తెలుసుకోవాలి. జ్ఞానోదయమైన తరువాతా తెలుసుకోవాలి. ముందు తెలుసుకొని చేయటం జ్ఞానం కోసమైతే తరువాత తెలుసుకోటం జ్ఞాన నిష్ఠ కోసం. అటూ ఇటూ ఉంది కర్మ. అటు ప్రయత్న రూపంగా ఇటు ప్రవర్తన రూపంగా.

కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః మోక్షం కావాలని కోరేవాడు ముముక్షువు. అలాంటి ముముక్షువు లంతా మొదటి నుంచీ ఇలా కర్మ

Dr Dayananda Swamy ebooks


లేదనకుండా ఆచరిస్తూ వచ్చిన వారే. ఎవరూ కర్మ మానేయ గూడదు. యద్యనాత్మజ్ఞః త్వం తదా ఆత్మశుద్ధ్యర్థమ్. నీకింకా ఆత్మజ్ఞాన ముదయించక పోతే చిత్తశుద్ధి కోసమైనా చేయాలి కర్మ. తత్త్వవిచ్చేత్ లోక సంగ్రహార్థమ్. జ్ఞానివైతే లోకోద్ధరణ కోసమైనా చేసి తీరాలి. జ్ఞానానికీ కర్మే. జ్ఞానంలోనూ కర్మే. రెండువైపులా కర్మ అనే పదును పెట్టిన జ్ఞానమనే ఖడ్గమిది.

అందుకేనీకు చెబుతున్నా నర్జునా. కురు కర్మైవ తస్మాత్త్వం. నీవూ కర్మే చేసి తీరాలి. పూర్వైః పూర్వతరం కృతమ్. నీ మొహాన్నే పొద్దుపొడవ లేదు. అనాది నుంచీ మనపూర్వులూ వారికన్నా పూర్వులూ ఇలాగే చేస్తూ వచ్చారు. నీవూ వారి మార్గంలోనే నడుస్తున్నావు గాని క్రొత్తగా ఏమీ సృష్టించటం లేదు. సాధించటం లేదు. సాధిస్తానను కొన్న జ్ఞానం కూడా అంతకు ముందున్నదే. ఉన్నదే మరచి పోయి మరలా గుర్తు చేసుకొంటున్నావు. అందుకోసం సత్త్వాన్ని శుద్ధి చేసుకొనే ప్రయత్నం కర్మయోగమైతే గుర్తు రావటం జ్ఞానయోగమైతే దాని బలంతో మరలా కర్మ చేయటం విజ్ఞాన యోగం. అంత మాత్రమే.

**కిం కర్మ కిమకర్మేతి - కవయో ప్యత్ర మోహితాః**

**తత్తే కర్మ ప్రవక్ష్యామి - యద్ జ్ఞాత్వా మోక్ష్యసే - శుభాత్ -16**

అసలు కర్మా కర్మా అని వాపాటకంగా మాటాడుతుంటాడు ప్రతి ఒక్కడూ. కర్మ అంటే ఏమిటో తెలిసే మాట్లాడుతున్నాడా అని నాకను మానం. ఎందుకంటే కింకర్మ - కిమ కర్మేతి - ఏది కర్మ ఏది కర్మకాదని

Dr Dayananda Swamy ebooks



ఎవరూ నిష్కర్ష చేసి చెప్పలేక పోతున్నాడు. కవయోప్యత్ర మోహితాః - ఎంతో మేధావంతులైన మానవులకు కూడా అంతుపట్టక బుర్ర చెడగొట్టుకొంటున్నారు. ఏదో తెలిసినట్టు చెబుతుంటారేగాని వారు చెప్పేదేమిటో వారికే స్పష్టంగా తెలియదు.

అంచేత మాటగాదు మనకు కావలసింది. మాట ఏమి చెబుతుందో ఆ భావం. అది మహాపండితుల మని విర్రవీగే వారికే తెలియదు కాబట్టి నీబోటి వాడికి తెలియకపోవటంలో ఆశ్చర్యం లేదు. అసలు ఎప్పటికీ తెలియకపోతే ఆ జీవితానికి ప్రయోజనం లేదు. తెలియక పశుప్రాయంగా జీవించి ఏమి సుఖం. పురుషార్థానికే నోచుకోలేవు. కనుక తత్తే కర్మ ప్రవక్ష్యామి. కర్మ అంటే అసలేమిటో నీకు నిష్కర్ష చేసి చెబుతాను విను.

కర్మ అనే దాని స్వరూపమిద మిత్థమని నీవు నిశ్చయంగా తెలుసు కొంటే గాని ఆ మార్గంలో నీవు ప్రయాణం చేయలేవు. ప్రయాణిస్తే గాని ఎప్పటికైనా జీవిత గమ్యం చేరలేవు. యద్జ్ఞాత్వా - దాని విషయమంతా ఆకళించుకొని తదనుగుణంగా నడచుకొన్నప్పుడే మోక్ష్యసే అశుభాత్ అమంగళమైన ఈ సంసార సాగరంలోనుంచి అవలీలగా నీవు బయట పడగల వర్జునా అని హెచ్చరిస్తున్నాడు భగవానుడు. ఇది మనందరికీ చేసే హెచ్చరికే.

**కర్మణో హ్యాపి బోద్ధవ్యం - బోద్ధవ్యంచ వికర్మణః**

**అకర్మణశ్చ బోద్ధవ్యం - గహనా కర్మణో గతిః - 17**

Dr Dayananda Swamy ebooks

కర్మ అంటే ఏమిటో తెలియాలి మొదట వికర్మ. అంటే ఏమిటో తెలియాలి. అలాగే అకర్మ అంటే కూడా ఏమిటో తెలియాలి మానవుడికి. ఎందుకంటే గహనా కర్మణోగతిః - కర్మా కర్మల స్వరూపం ఫలానా అని తేల్చుకోటం చాలా కష్టసాధ్యమైన విషయం.

ఏమిటింతకూ భగవానుడి వివక్షితం **Intention.** కర్మ - అనేది ఒకటిగాదు. కర్మ వికర్మ అకర్మ అని అది మూడు విధాలు. అందులో కర్మ అంటే శాస్త్రం నీకూ నాకూ విధించినది. నిత్య నైమిత్తికాది విధులు **Dos.** వికర్మ అంటే శాస్త్రం నిషేధించినవి **Donts.** కలంజ భక్షణాదులు. మరి అకర్మ అని ఇంకొక టున్నది. అదేమిటి. ఏపనీ చేయక ఊరక కూచోటం. అది విధీ గాదు. నిషేధమూ కాదు. తూష్ణీమాసన మన్నారు భగవత్పాదులు.

ఎందుకీ వివరణ ఇవ్వవలసి వచ్చిందంటే చెబుతున్నారా యన కర్మ నామ దేహాది చేష్టా - కర్మ అంటే దేహేంద్రియాదుల చలనమే గదా. అకర్మ నామ తదక్రియా తుష్ణీ మాసనమ్. - అకర్మ అంటే అలా కాలూ చేయీ కదిలించకుండా మౌనంగా మొద్దులాగా ఉండిపోవట మిది లోకంలో మనందరికీ తెలిసిన విషయమేగదా. కింతత్ర బోద్ధవ్యం. ఇందులో క్రొత్తగా తెలియవలసిన దేముందని అనుకోవచ్చు మనం. అలాకాదు. కర్మ అంటే లౌకికం కాదు. సహజ కర్మ కాదది. శాస్త్రవిహితమైన కర్మ. అకర్మ అంటే అదీ ఇదీ ఏ పనీ చేయకుండా కూచోటమనే లౌకికమైన స్థితి కాదు. విహిత కర్మలు పాటించక పోవటమని దాని తాత్పర్యం.

Dr Dayananda Swamy ebooks



**కర్మణ్య కర్మయః పశ్యే దకర్మణి చ కర్మ యః**

**సబుద్ధి మాన్ మనుష్యేషు - సయుక్తః కృత్స్న కర్మకృత్ - 18**

అయితే కర్మాదుల స్వరూపమేమిటో అసలు వాటి తత్త్వం లేదా యాధాత్మ్యమేమిటో బోధిస్తానన్నారు. అది బాగా మాకు వివరించి చెప్పండని అడిగితే చెబుతున్నాడు భగవానుడిప్పుడు. ఇది చాలా అద్భుతమైన శ్లోకం. అద్భుతమైన భావం. కర్మ ఏమిటో నూటికి నూరు పాళ్లూ పరిష్కారం చేసి మన ముందు పెడుతున్నది భగవద్గీత.

ముందు మామూలుగా శబ్దార్థం చెప్పుకొంటూ పోదామీ శ్లోకానికి. కర్మ ణ్య కర్యయః పశ్యేత్ - ఎవడైతే కర్మలో అకర్మను చూడగలడో - అలాగే అకర్మణి చ కర్మయః - అకర్మలో కర్మనే చూస్తూపోతాడో. సబుద్ధిమాన్ మనుష్యేషు - వాడీ మానవులందరిలో చాలా బుద్ధిమంతుడు. బుద్ధిమంతుడే కాదు. వాడే యోగి సయుక్తః - కృత్స్న కర్మకృత్ - అంతే కాదు. అన్ని కర్మలూ చేసినవాడూ వాడే. ఇదీ దీని శబ్దార్థం.

ఇది ఇలా చెబితే ఏమర్థమయింది మనకు. అర్థం కాకపోగా ఏమిటూ ఈ అవకతవక ప్రసంగమని పి స్తుంది ఎవడికైనా. ఎందుకంటే కర్మ కర్మే అకర్మ అకర్మే - కర్మ అకర్మ కాదు. అకర్మ కర్మ కాదు. కర్మ అంటే ఒక పనిచేయటం - అకర్మ అంటే పనిచేయకుండా మానటం. పనిచేస్తే మానటం లేదు. మానుకొన్నచోట చేయటమూ లేదు. అన్యోన్య విరుద్ధమైన భావాలివి. అలాంటప్పుడు కర్మలో అకర్మను చూడట మేమిటి. అకర్మ అని చెబుతూ

Dr Dayananda Swamy ebooks


దానిలో కర్మను చూడటమేమిటి. పైగా ఇదే అర్థం లేని ప్రసంగ మనిపిస్తుంటే ఇంతకన్నా అర్థం లేని దలా చూచేవాడే జ్ఞాని వాడే మహాయోగి వాడే సకల కర్మానుష్ఠాన దక్షుడని గొప్ప చేసి వర్ణించటం.

కాబట్టి అక్కడ ఉన్నదున్నట్టు బాహ్యార్థం చెప్పుకొంటే సరిపోయే వ్యవహారం కాదిది. యా నిశా సర్వభూతానా మనే శ్లోకానికెలా వ్యాఖ్యానం చేశామో అలాగే దీని అంతరార్థమేదో దాన్ని వ్యాఖ్యానించి చెప్పుకోవలసి ఉంది. అప్పుడే శ్లోకభావం శ్రోతల మనసులో బాగా నాటుకొంటుంది. కర్మ వికర్మ అకర్మ అని మొదట మూడు శాఖలుగా విభజించి చెప్పాడు పరమాత్మ. పోతే ఇప్పుడా మూడింటిలో వికర్మ అనేది తప్పించి రెండే బయట పెడుతున్నాడు. ఒకటి కర్మ. మరొకటి అకర్మ. చేసేది కర్మ చేయక మానేసేది అకర్మ. ఒకదానిలో ఒకటి చూడటమంటే ఏమిటర్థం. ఒకదానిలో గాదు. ఒకదాన్ని మరొక దాన్ని గానని అర్థం చేసుకోవాలి మనం. అంటే ఏమన్న మాట. కర్మ నకర్మగా అకర్మను కర్మగా. కర్మ జరుగుతుంటే ఏమీ జరగటం లేదనీ - ఏ కర్మా జరగకున్నా అక్కడ ఒక కర్మ జరుగుతూనే ఉందనీ దర్శించాలట.

ఒక ప్రశ్న. జరుగుతుంటే జరగలేదని ఎలా అనుకోవాలి. జరగ కున్నా జరుగుతున్నదని ఎలా భావించాలి. దీనిమీద ఎంతో దీర్ఘమైన విచారణ సాగించారు భగవత్పాదులు. కాని అది చాలా సాంప్రదాయికమైన సాంకేతికమైన విచారణ. నలుగురికీ అంతుపట్టే వ్యవహారం కాదు. అన్నీ

Dr Dayananda Swamy ebooks



కలియబోసుకొని దీని తాత్పర్యమేమిటో చెబుతాను వినండి. ఇక్కడ కర్మ అకర్మ అనేది శాస్త్రవిహితమైన కర్మ అని అలాంటి విహిత కర్మలు మానేసి కూచోటమని అర్థం కాదు. మరేమిటంటే శాస్త్రీయమైన లౌకికమైన ఏ కర్మ అయినా కర్మే. అలాగే అందులో ఏ కర్మ చేయకున్నా అది అకర్మే. ఇదీ మొదట మనం గ్రహించవలసిన అంశం.

పోతే ఇక కర్మను కర్మ కా ద కర్మ అని - అకర్మను అకర్మ గాదు కర్మ అని చూడటం దగ్గర వస్తున్నది పేచీ. ఇది సమర్థించటానికి భాష్యకారు లెంత ప్రయత్నించినా అది అంత తృప్తికరంగా లేదు నా మనస్సుకు. ఒకవిధంగా శంకరా నంద చేసిన వ్యాఖ్యలో కొంత ఆధారం దొరుకుతుంది మనకు. అదేమిటంటే కర్మ కర్మే. పోతే అకర్మ అంటే కర్మ కానిదేదో అది జ్ఞానమని అర్థం. అప్పటికి కర్మ నకర్మగా చూడటమంటే కర్మను జ్ఞానంగా చూడటం. కర్మ ఏదోగాదు జ్ఞానమే నని భావించాలి. అలాగే అకర్మను కర్మగా చూడటమంటే జ్ఞానాన్ని కర్మగా భావించటం. జ్ఞానమే ప్రసరిస్తే అది కర్మ అనీ - కర్మ ప్రసరించకుంటే అది జ్ఞానమనీ అర్థం చేసుకోవాలి సాధకుడు.

అప్పటికి జ్ఞానానికీ కర్మకూ తేడా లేదు. జ్ఞానం స్వరూపమైతే కర్మ దాని విభూతి. కర్మ విభూతి అయితే జ్ఞానం దాని స్వరూపం. రెంటికీ విరోధ మేముంది. జ్ఞానం నిశ్చలమైన సముద్ర మనుకొంటే కర్మ చలిస్తూ ఒడ్డు దాకా వచ్చే తరంగమని భావిస్తే సరిపోలేదా. అచలమైనా చలమైనా

Dr Dayananda Swamy ebooks

రెండూ జలమే గదా. అచలమే చలించి తరంగ మయింది. చలమైన తరంగమే అచలమై మరలా సముద్ర మని పిస్తున్నది.

అలాగే నీవు మనసుతో ఏది ఆలోచిస్తున్నా నోటితో ఏది మాటాడుతున్నా శరీరంతో ఏది చేస్తున్నా ఆ కర్మలన్నీ అచలమైన జ్ఞానమే అలా చలించి బయట పడుతున్నదని - ఈ చలనాలన్నీ మరలా ఎక్కడి నుంచి వస్తున్నాయి వీటి స్వరూపమేమిటా అని చూస్తే అవన్నీ జ్ఞానమాడే నాటకమేనని భావిస్తే అంతా నీ ఆత్మ చైతన్యమే. అంతకన్నా క్రొత్తగా ఏమున్న దక్కడ. తదేజతి తన్నైజతి - అది కదులుతుంది - కదలదు అని ఈశావాస్యం చెప్పిందంటే ఈ దృష్టితోనే చెప్పింది. కదల దన్నప్పు డది జ్ఞానం. కదులుతుంద న్నప్పుడది కర్మ. రెండూ రెండు వేర్వేరు పదార్థాలు కావు. ఒకే పదార్థం తాలూకు రెండు ముఖాలు **Phases** రెండు దశలు **Stages**. దీనికే సంస్థానమని **Constitution or formation** అని పేరు పెట్టారు భగవత్పాదులు. యథాసర్పః కుండలీ భవతి అన్నారాయన. ఒక సర్పం కుండలాకారంగా కనిపిస్తుందొకప్పుడు. అదే దండాకారంగా ప్రాకిపోతుం దొకప్పుడు. రెండూ దాని భంగిమలేగాని ఆ ప్రాణి మాత్రమొక్కటే. ఒకదాని కొకటి విరుద్ధం కాదు. స్వరూపంలో రెండూ సమన్వయ మవుతాయి.

అలాగే ఆత్మ పదార్థం తాలూకు రెండు భంగిమ లివి. ఒకటి జ్ఞానం మరొకటి కర్మ. బొమ్మా బొరుసులాగా ఒకే ఒక ఆత్మ తత్త్వమనే

Dr Dayananda Swamy ebooks


నాణానికివి రెండు ముఖాలు. జ్ఞానం దాని స్వరూపం కర్మ దాని విలాసం. లేదా విస్తారం **Expansion.** సూర్యమండలం లాంటిది జ్ఞానం. దానిలోనుంచి బయటికి వచ్చి ప్రపంచమంతా వ్యాపించే వెలుగులాంటిది కర్మ. ఇప్పుడా మండలానికీ దాని వెలుగుకూ తేడా ఉందా. మండలమే దాని ప్రకాశం. ప్రకాశమే సూర్యమండలం. కాని మండలం స్థిరంగా ఒకేచోట ఉంది. దాని ప్రకాశం సర్వత్రా ప్రసరిస్తూ ఉంటుంది. అలాగే జ్ఞానం స్థాయిగా ఉంది. దాని ప్రకాశం లాంటి కర్మ సర్వత్ర విస్తరించి నీకు కనిపిస్తుంది. ఆలోచనగా మాటగా శరీరాది చేష్టగా ఇటూ అటూ ప్రసరిస్తున్నది. అదే ఈ ప్రసరించేది. ఈ ప్రసరిస్తున్నదదే. ఒకే ఆత్మ చైతన్యం ద్విపాత్రాభినయం చేస్తూ కనిపిస్తున్నదొక మహానటుడిలాగా. అదే చూస్తూ ఉన్నదదే చేస్తూ ఉన్నది.

ఇలాటి అఖండ భావన ఉన్న వాడెంత బుద్ధిమంతుడయి ఉండాలి. రెండింటిలో ఏ ఒకటి వదిలేసి మరొకటి పట్టుకొన్నా అది బుద్ధిమంతుడి లక్షణం కాదు. సర్వత్రా ఆత్మను చూడాలి. సర్వాన్నీ ఆత్మగా చూడాలి. అప్పుడే అది బుద్ధి కుశలత. అంతేకాదు. యోగకుశలత కూడా అదే. యోగమంటే సమాధి. ఏకాగ్రత. దీన్ని వేరుగా దాన్ని వేరుగా చూస్తే అది ఏకాగ్రత కాదు. వ్యగ్రత **Distraction.** రెంటినీ కలిపి పట్టుకొన్నప్పుడే ఏకాగ్రత. అదే సమాధి. సమంగా ఆధి అంటే ఉంచటమని అర్థం. మనస్సును రెండింటి మీద సమానంగా ఉంచటం. రెండూ ఒకటేనని

Dr Dayananda Swamy ebooks

భావించటం. అంతే కాదు. కృత్స్నకర్మకృత్ ఒకటి కూడా బీరు పోకుండా అన్ని పనులూ చేసినవాడూ వాడేనట. స్వరూప భావనలోనే అన్ని కర్మలూ ఇమిడి ఉన్నాయి కాబట్టి అవి చేసినా సరే చేయకున్నా సరే. చేసినట్టే అవుతుంది. జలం తరంగంగా ప్రసరించినా ప్రసరించకపోయినా రెండూ జలదృష్టితోనే చూచేవాడి కాజల స్వరూపంలోనే రెండూ కలిసి వస్తాయా లేదా. అలాగే జ్ఞానదృష్టితో చూచేవాడికి జ్ఞానమూ జ్ఞానమే కర్మా జ్ఞానమే. తేడా కనిపించదు.

ఇక్కడ బుద్ధిమాన్ అనేచోట జ్ఞానమూ – యుక్తః అనేచోట యోగమూ – కర్మకృత్ అనేచోట కర్మా – మూడూ ఒకడిలోనే ఉన్నాయని వర్ణించటం వల్ల ఎవడు జ్ఞానవంతుడోవాడే సమాధి శాలీ వాడే కర్మ శాలీ కర్మసమాధులు జ్ఞానంకన్నా అన్యంగా లేవని అర్థమవుతున్నది. అంతేకాదు. జ్ఞానంతో చేసిందే అసలైన సమాధి. జ్ఞానంతో చేసిందే అసలైన కర్మ. జ్ఞానమనే పునాది లేకుంటే వాటికస్తిత్వం లేదనీ తెలిసిపోతున్నది. అంతేకాదు. ఏ కర్మ చేసినా అది జ్ఞానదృష్టి వదలకుండా చేస్తేనే ఫలితమిస్తుంది. ఏ సమాధి యోగమైనా జ్ఞానదృష్టితో అవలంబి స్తేనే దానికి విలువ వస్తుందని కూడా బోధపడుతున్నది. అసలు జ్ఞానమే వస్తువు. మిగతావన్నీ దాని ఆ భాస. ఆ భాస వస్తువు కన్నా వేరుగా లేనట్టే జ్ఞానం కన్నా వేరుగా కర్మ లేదు సమాధి లేదు. అవి కూడా జ్ఞాన స్వరూపమే దాని సంస్థానమే ననేది అసలైన సత్యం. ఇది సర్వం కర్మాఖిలం పార్థజ్ఞానే పరిసమాప్యతే అనే శ్లోకం దగ్గర ఇంకా చక్కగా తెలిసిపోతుంది మనకు.

Dr Dayananda Swamy ebooks



**యస్య సర్వే సమారంభాః - కామ సంకల్ప వర్జితాః**

**జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణం - తమాహుః పండితం బుధాః - 19**

అంత దూరం దేనికి. అసలిప్పుడే నిరూపణ చేస్తున్నదా విషయమీ శ్లోకం మనకు. సమారంభాః అంటే ఏది ఆరంభిస్తామో అది. కర్మలని అర్థం. సర్వే సమారంభాః - మనం చేసే సమస్త కర్మలు. సమస్తమంటే మానసిక వాచిక కాయిక కర్మలన్నీ. యస్య ఎవడికైతే. కామ సంకల్ప వర్జితాః - కామసంకల్పాలు రెండూ లేకుండా పోతాయో. కామానికి మూలం సంకల్పం. కామ జానామి తేమూలం సంకల్పాత్కిల జాయసే అని మహాభారతం. సంకల్పం కారణమైతే కామం దానికి కార్యం. మొదట ఒకటి పొందాలనే సంకల్ప మేర్పడుతుంది. దానివల్ల ఆ పదార్థాన్ని పొందే కోరిక జన్మిస్తుంది. **The Thought and Desire to possess a thing.** ఇవి రెండే కర్మకు ప్రాణం. ప్రచోదకం. ఇవి లేకుండా పోతే ఆ కర్మకూ ఫలితం లేదు. ముధైవ చేష్టా మాత్రా అన్నారు గురువుగారు. ఒక యాంత్రికమైన చేష్ట **Mere function** అది.

ఒక జ్ఞాని తన దైనందిన జీవితంలో ఏ కర్మ ఎప్పుడు చేసినా అలాంటి యాంత్రికమైన వ్యాపారమది. అది వాడి జ్ఞాన ప్రకాశంలో కదిలే నీడలాంటిదే ఆ కర్మ. కనుక జ్ఞానం కన్నా దానికి స్వతంత్రమైన సత్తా **Existance** లేదు. జ్ఞాన సత్తాయే దాని సత్తా. అంచేత ఏ కర్మ చేసినా నిష్కామంగా చేస్తాడు కాబట్టి జ్ఞాని కది ఫలితమివ్వదు. ఇవ్వలేదు.

Dr Dayananda Swamy ebooks



దానివల్ల మంచీ లేదు. చెడూ లేదు. ఫలమే దానికి బలం. అది లేనినాడు కర్మ నిర్వీర్యమై పోతుంది. జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం. ఆత్మజ్ఞానమనే అగ్ని దాన్ని కాల్చి బూడిద చేసింది. కాబట్టి కర్మా భాసే గాని అది కర్మ అనిపించుకోదు. వాడి దృష్టిలో అది జ్ఞానమే. కనుకనే తమాహుః పండితం బుధాః - బుధులంటే బ్రహ్మవేత్తలట. బ్రహ్మవేత్తలు గనుకనే అలాటి వాణ్ణి పండితుడని అభినందిస్తుంటారు. పండా ఆత్మ విషయాబుద్ధిః అని మొదటనే నిర్వచించారు భగవత్పాదులు. ఆత్మజ్ఞాన మున్నవాడే పండితుడు. ఎక్కడ ఉందా ఆత్మ. ఎక్కడ బడితే అక్కడ - ఎప్పుడంటే అప్పుడు. ఏదంటే అది. దేశకాల వస్తువులన్నీ ఆత్మే. అదే బ్రహ్మం. అలాంటి జ్ఞానికిక కర్మ ఎక్కడ ఉంది. అది కూడా ఆత్మలోనే చేరి ఆత్మగానే ఉండాలి గదా. అందుకే దగ్ధకర్ములు వారంతా.

**త్యక్త్వా కర్మ ఫలాసంగం - నిత్య తృప్తో నిరాశ్రయః**
**కర్మ ణ్యభి ప్రవృత్తోపి - నైవ కించి త్కరోతి సః - 20**

అయితే జ్ఞానికసలు కర్మే లేదా. కర్మ చేయకుండా ఎవడు గానీ ఒక్క క్షణమైనా ఉండలేడని గదా పూర్వం వర్ణించారు. మరి జ్ఞానికి కూడా శరీర మనః ప్రాణేంద్రియాది కరణ వర్గముంది గదా. కరణాలు **Instruments** న్నంత వరకూ కర్మ అనేది తప్పదు గదా. అలాంటప్పుడు దగ్ధ కర్ముడెలా కాగలడు జ్ఞాని అని ప్రశ్న వచ్చింది.

వాస్తవమే. ఉపాధి ఉన్నంత వరకూ కర్మ సంబంధం తప్పదు. అందుకే కర్మ చేస్తుంటాడు జ్ఞాని. మరి కర్మ దగ్ధమెలా అయిందని గదా

Dr Dayananda Swamy ebooks



ప్రశ్న. కర్మ కాదు దగ్ధమయింది. కర్మఫలం. అది కర్తృత్వముంటేనే ఏర్పడుతుంది. దానికి కామం మూలం. జ్ఞాని కదిలేదు. కామాన్ని మొక్కలోనే త్రుంచి వేశాడు వాడు. అంచేత కర్తృత్వం పోయింది. కర్తృత్వం పోతే భోక్తృత్వం కూడా తొలగిపోతుంది. రెండు కోరలూ పెరికి వేసిన కాలసర్ప మప్పుడు కర్మ. యాంత్రికంగా జరగటమేమో జరుగుతుంటుంది. కాని ఫలితంలేదు. కాబట్టి జరిగినా జరగని దానితో సమానమే. ఇందులో జరుగుతున్నది కాబట్టి జ్ఞాని కూడా అందరితో పాటు కర్మ చేస్తున్నాడనీ చెప్పవచ్చు. ఫలితం లేక నిర్వీర్యమయి పోయింది కాబట్టి చేసినా చేయటం లేదనీ చెప్పవచ్చు. ఇదీ సమాధానం.

అందుకే వర్ణిస్తున్నాడిప్పుడు త్వక్త్వా కర్మ ఫలాసంగం. కర్మఫలం తనకనుకూలమైనా ప్రతికూలమైనా జ్ఞాన దృష్టితో చూస్తుంటాడు కాబట్టి దాన్ని పూర్తిగా వదిలేసి నిత్య తృప్తః - వదిలేసినా నిత్యమూ తనలోతాను తృప్తిగా కాలం గడుపుతూ నిరాశ్రయః - పురుషార్థాన్ని పొందటానికని ఏసాధనాన్నీ పట్టుకోకుండా ఎవడు నిరామయంగా కనిపిస్తాడో వాడు నిజమైన ఆత్మజ్ఞాని.

కర్మణ్యభి ప్రవృత్తోపి. అలాంటి జ్ఞాని ప్రారబ్ధం కొద్దీ జీవితంలో ఎప్పుడే కర్మలో ప్రవర్తించినా ప్రవర్తించవచ్చు గాక. నైవకించి త్కరోతి సః - అలా ప్రవర్తించినట్టు ఆ పనిచేస్తున్నట్టు నీకు కనిపిస్తుందేగాని నిజంలోవాడు ప్రవర్తించటంలేదు. ఏ కర్మా చేయటమూ లేదు. అంతా ఆ

Dr Dayananda Swamy ebooks



భాస. ఒక నాటకం. ఆభాస అయినా చేస్తున్నాడుగదా. ఎందుకా చేయటం. దానివల్ల ఏమిటి ప్రయోజనం. ఏదీ లేదు వాస్తవానికి. అయినా అడుగుతున్నావు కాబట్టి రెండే ప్రయోజనాలు కర్మకు. ఒకటి వాడా ప్రారబ్ధం వాడి ద్వారా అలా పని చేస్నున్నది. దాని బాకీ అలా తీర్చుకొంటున్నాడు. మరొకటి వాడా కర్మమూలంగా జిజ్ఞాసు లోకాన్నైనా ఉద్ధరిస్తుంటాడు. ఒకటి ప్రారబ్ధఫలానుభవం.ఇంకొకటి లోక సంగ్రహం. ఇంతే.ఇంకొక ప్రయోజన మంటూ లేదు. ఇది కూడా ఇతరుల దృష్టికే వాడి దృష్టికి కాదు.

**నిరాశీర్యత చిత్తాత్మా - త్యక్తసర్వ పరిగ్రహాః**

**శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ - 21**

ఇతరుల దృష్టికే గాని జ్ఞాని దృష్టికేదీ లేదంటున్నారు. కాని మాకనుమానమే. ఉపాధి ఉన్నంతవరకూ కర్మ అనేది లేకుండా పోదెవడికైనా. కర్మ వల్లనే ఏర్పడ్డదది. కర్మ కోసమే ఉన్నది. అది ఉన్నంత వరకూ కర్మ చేయక తప్పదు గదా. కర్మ తప్పదంటే కర్మకు తాను కర్తృత్వం వహించకా తప్పదు గదా. మరి సాక్షి అనే మాట కర్ధమేముంది. జ్ఞానం లేదని చెప్పము గాని జ్ఞానంతో పాటు కర్మ కూడా ఉందని చెప్పండి. లేదంటే అది అనుభవ విరుద్ధం. ఎవరికి. లోకానికే కాదు. జ్ఞానికే. దీనికేమిటి మీరిచ్చే సంజాయిషీ అంటే ఇస్తున్నాడిప్పుడు.

Dr Dayananda Swamy ebooks



నిరాశీర్యత చిత్తాత్మా - త్యక్త సర్వ పరిగ్రహః - చిత్తమూ ఆత్మా రెండూ వాడి వశంలో ఉంటాయి. చిత్తమంటే అంతఃకరణం. ఆత్మ అంటే కార్యకరణ సంఘాత మీ శరీరమన్నారు భాష్యకారులు. ఇవి రెండే కర్తలే కర్మకైనా. కేవల చిద్రూపమైన ఆత్మ కాదు. అవి కూడా నిరాశీ-ఏ కోరికా లేకుండా పనిచేస్తుంటాయి. అంతేకాదు. బాహ్యమైన పరిగ్రహం సామగ్రి కూడా ఏదీ అక్కడ లేదా జ్ఞానికి. ఉన్నా అది తన చైతన్యానికి బాహ్యంగానే చూస్తుంటాడు. ఇంత నిర్లిప్తంగా శారీరం కేవలం కర్మ కుర్వన్ - కేవలం శరీరం నిలవటానికెంత మాత్రం చాలునో అంత మాత్రమే పెట్టుకొని చేస్తుంటాడా కర్మ. ఇలా ఆ కొంచెం కర్మా చేస్తున్న మాత్రాన నాప్నోతి కిల్బిషమ్. కర్మ ఫలమాలిన్యం వాడి నంటదు. ఫలకామన లేకుండా గదా చేస్తున్నాడు. ఎలా అంటుతుంది. మరి ఆ చేయటమే అదొక యాంత్రికమైన చేష్ట అని ముందే చెప్పాము. ఒక యంత్రం తిరుగుతుంటే దానికా క్రియ గాని దాని ప్రయోజనం గాని ఎలా సోకదో అలాగే దీనికీ.

ఇదే భగవత్పాదులు తన స్వానుభవాన్ని ఆవిష్కరిస్తూ వర్ణిస్తున్నారు. అహం కరోమీతి అభిమానవర్జితః శరీరాది చేష్టామాత్రం లోక దృష్ట్యా కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్ - భిక్షాటనాది కర్మ లాచరిస్తున్నా జ్ఞాని అది ఒక కర్మగా చూడడు. కాగా కర్మకు తాను కర్త అనుకోడు. అలా అనుకొనేవారు వాడికి మారుగా లోకులని చెబుతారు భగవత్పాదులు. కామః కర్తా నాహం కర్తా అన్నట్టు వాడికి తన ఉపాధులే కర్తగాని తాను కర్త గాదు. అంత అంటీ ముట్టకుండా జరుగుతుంది వాడి దైనందిన జీవితం.

Dr Dayananda Swamy ebooks



**యదృచ్ఛా లాభ సంతుష్టో - ద్వంద్వాతీతో విమత్సరః**

**సమస్సిద్ధా వసిద్ధౌచ - కృత్వాపి న నిబధ్యతే - 22**

అయినా కర్మ కర్మేగదా తాను కర్తృత్వం వహించకుండా అది ఎలా జరుగుతుంది. అంతో ఇంతో సంకల్పమనేది ఉంటుందిగదా. నిజమే. ఉంటుంది గాని అది నామ మాత్రం. ఉందంటే ఉంది. లేదంటే లేదు. యదృచ్ఛాలాభ సంతుష్టః - ఏది ఎప్పుడు తన కయాచితంగా లభిస్తే అదే తనకు లాభమని దానితోనే సంతృప్తి పడతాడు. ద్వంద్వాతీతః - అంతే కాదు. లాభం కలగలేదే నష్టం వచ్చిందే అని విమత్సరః మాత్సర్యంలేదా బుద్ధికి. సమస్సిద్ధా వసిద్ధౌచ - కారణం. ఒకటి సిద్ధించినా సిద్ధించక పోయినా రెండింటినీ సమానంగానే స్వీకరించగలడు.

అలాంటప్పుడే కర్మ చేస్తేనేమట. కర్తృత్వం లేని కర్మ అది. కర్తృత్వం లేదంటే దానికి ప్రతియోగి అయిన భోక్తృత్వం కూడా తొలగిపోయింది. అంచేత రెండు కోరలూ లాగేసిన కాలసర్పం కర్మ. అది ఎలా కాటు వేయగలదు. కృత్వాపి న నిబధ్యతే. పని చేసినా చేయనివాడే. ఆ దృష్టితో ఉన్నప్పుడా కర్మ వాడినే మాత్రమూ బంధించలేదు. కర్తృ భోక్తృ సంసర్గమే బంధం. అవి రెండూ సాక్షిరూపంగా మారినప్పుడు బంధకమే కాదు జ్ఞానికి. భగవత్పాదు లింతకుముందు కన్నా ఇంకా విపులంగా వర్ణిస్తున్నారు జ్ఞాని దినచర్యను.

Dr Dayananda Swamy ebooks



కర్మా దా వకర్మా దిదర్శీ యధాభూతాత్మ దర్శన నిష్ఠః సన్ శరీరస్థితి మాత్ర ప్రయోజనే భిక్షాటనాది కర్మణి శరీరాది నిర్వర్త్యే నైవకించి త్కరోమ్యహం - గుణా గుణేషు వ ర్తంతే ఇత్యేవం సదా సంపరి చక్షాణః ఆత్మనః కర్తృత్వా భావం పశ్య న్నై వ కించి ద్భిక్షాటనాది కర్మ కరోతి - లోక వ్యవహార సామాన్య దర్శనేన తు లౌకికైః ఆరోపిత కర్తృత్వే భిక్షాటనాది కర్మణి కర్తా భవతి - స్వానుభవేన తు శాస్త్ర ప్రమాణాది జనితేన అకర్తైవ.

కేవలం తన శరీరాదులైన ఉపాధులు భిక్షాటనాది కర్మ లాచరిస్తుంటే ఆత్మ స్వరూపమంటే ఏదో గుర్తించి అందులోనే పాదుకొని ఉన్నవాడు కాబట్టి ఇంద్రియ గుణాలేవో అవి ఆయా శబ్ద స్పర్శాది ప్రకృతి గుణాలతో సంబంధం పెట్టుకొంటున్నాయి గాని నేనుగా ఏమీ చేయటం లేదీ కర్మ అని ప్రతిక్షణమూ సావధానంగా గమనిస్తూ భిక్షాటనాదులు చేస్తున్నాఅది ఒక కర్మగా దానికి తాను కర్తగా ఎప్పుడూ భావించడు. అసలు తానది చేయనూ చేయడు. మరి అది ఎవరు చేస్తున్నారంటే లోక సామాన్య దృష్టిలో తానే చేస్తున్నట్లు కనిపిస్తుంటాడు. కాని శాస్త్ర ప్రమాణ జనితమైన స్వానుభవ దృష్టితో ఏమాత్రమూ తాను చేయటం లేదు. ఇది కేవలమూ భగవత్పాదుల స్వానుభవమే.

**గత సంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః**

**యజ్ఞాయా చరతః కర్మ - సమగ్రం ప్రవిలీయతే - 23**

కావచ్చు. కర్మ తాను చేయనీ తన ఉపాధులు చేయనీ. ఒక కర్మ అంటూ జరిగినప్పు డవశ్యంగా దానికొక ఫలమంటూ కలిగి తీరుతుంది

Dr Dayananda Swamy ebooks



గదా. ఫలమన్నప్పుడు ఫల భోక్త ఒకడుండి తీరాలి. ఫలం ఫలాన్నే అనుభవించదు. అనుభవం లేకపోతే అసలు ఫలమనే దానికర్థం లేదు. అలాంటప్పుడు జ్ఞాని భోక్త కాకుండా ఎలా తప్పించుకో గలదని ప్రశ్న. దానికి సమాధాన మిది.

గతసంగస్య. ఆసక్తి ఏమాత్రమూ లేదు కర్మఫలం మీద. ముక్తస్య - ఫలాసక్తి లేకుంటే చాలు ముక్తుడే. కర్మ వాణ్ణి బంధించలేదు. జ్ఞానావస్థిత చేతసః - దానికి కారణం వాడు నిరంతరమూ తన స్వరూపమైన జ్ఞానంలోనే నిలదొక్కుకొని కూచున్నాడు. ఆత్మ సంస్థం మనః అన్నట్టు మనస్సు ఇటూ అటూ పరుగెత్తకుండా ఆత్మలోనే నిశ్చలంగా చేరిపోయింది. అయినా కర్మ చేస్తున్నాడు గదా వాడంటావు. చేస్తున్నాడు నిజమే. కాని యజ్ఞా చరతః అదివాడు యజ్ఞార్థం చేస్తున్న కర్మ. యజ్ఞోవై విష్ణుః అని ఇంతకు పూర్వమే వచ్చిందీ భావం. యజ్ఞమంటే ఈశ్వరుడు. ఈశ్వరుడికే సమర్పణమంటూ నిర్లిప్తంగా సాగిస్తుంటాడే పని అయినా. అలా వదిలేశాడు వాడా కర్మ ఫలం. ఈశ్వరుడి కర్పించాడు గదా అంటే వాడసలే పట్టించుకోడది. మరి రెంటికీ చెడ్డ ఆ కర్మఫలమిక ఏమవుతుంది. ఏమయ్యే దేమిటి. సమగ్రం ప్రవిలీయతే. అగ్రంతో సహా లయమై పోయింది. కర్మ కగ్రమేమిటి. ఫలం. అది అక్కడికక్కడే కర్మతోపాటు సమసి పోతుం దంటున్నది గీత.

ఇక్కడ ఒక ధర్మసూక్ష్మం మనం గుర్తించవలసి ఉంది. జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణ మంటున్నది గీత - యజ్ఞా యాచరతః అంటున్నది. అలాగే శారీరం కర్మ కుర్వన్నంటున్నది. అంటే జ్ఞానికి కర్మ అనేది దగ్ధ మయిందని

Dr Dayananda Swamy ebooks



ఒక మాట. అలా కాదు కర్మ చేస్తూ ఉంటాడని ఒక మాట. దీన్ని బట్టి కొందరు శాస్త్రజ్ఞులే ఏమని సిద్ధాంతం చేశారంటే జ్ఞానమూ కర్మా రెండూ ఎప్పుడూ ఉంటాయని అలా ఉంటేనే మోక్షమని కర్మ లేకుండా కేవల జ్ఞానం వల్లనే మోక్షం సిద్ధించదని తీర్మానించారు. దీనికి జ్ఞాన కర్మ సముచ్చయ వాదమని పేరు. కాని అద్వైత విద్యా సార్వభౌముడైన శంకర భగవత్పాదులిది అంగీకరించరు. జ్ఞాన ముదయిస్తే దానికిక కర్మసాహాయ్య మక్కర లేదు. అది స్వతంత్రంగానే మోక్షదాయకమని ఆయన సిద్ధాంతం.

మరి య జ్ఞాయాచరతః కర్మ - శారీరం కర్మ అని జ్ఞానికి కూడా కర్మ చెబుతున్నది శాస్త్రం. దానినెలా సమర్థిస్తారు శంకురులని అడిగితే ఆయన దానికిచ్చే సమాధానమిది. ఈ కర్మ శాస్త్ర చోదితమైన కర్మ కాదు. ప్రారబ్ధ కర్మ అంటాడాయన. జ్ఞానకర్మ సముచ్చయంలో చెప్పే కర్మ శాస్త్రవిహితమైన కర్మకాండ. జ్ఞానోదయమైన వాడికా శాస్త్రీయమైన కర్మ అక్కర లేదు. అసలు పనికిరాదు. పోతే ప్రారబ్ధవశాత్తూ నడిచే కర్మ మాత్రం అది తీరేవరకూ నడుస్తూ పోవలసిందే. అయితే అది జ్ఞానబలంతో నిర్వీర్యమై పోతుంది కాబట్టి ఉన్నా ఇబ్బంది లేదు. యాంత్రికమైన చర్యే అది. లేదా తన జ్ఞానమే అలా ప్రసరిస్తున్నట్టు జ్ఞాన విభూతిగానే చూస్తాడు జ్ఞాని. అది కూడా వాడి దృష్టికి జ్ఞానమే కర్మ కాదు. శాస్త్రీయమైన కర్మా అసలేలేదు. ఈ ప్రారబ్ధ కర్మా ఉన్నా అది కర్మకాదు జ్ఞానమే. కనుక రెండూ జ్ఞానాగ్నిలో దగ్ధమైనవే. ఇది భగవత్పాదులు చేసిన గొప్ప సమన్వయం.

Dr Dayananda Swamy ebooks

## బ్రహ్మార్పణం - బ్రహ్మహవి - ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం

## బ్రహ్మైవ తేన గంతవ్యం - బ్రహ్మ కర్మ సమాధినా - 24

ఏతావతా తేలిన సారాంశ మేమంటే కర్మాజ్ఞానం లౌకికుడి జీవితంలో వేరు వేరుగా కనిపించ వచ్చుగాని జ్ఞాని జీవితంలో మాత్రమవి వేరుగావు. జ్ఞానమూ జ్ఞానమే. కర్మా జ్ఞానమే. రెండూ కలిసి ఒక్కటే. గంగా యమునలు రెండూ కలిసి ఒకే ప్రవాహం. అలాగే జ్ఞానకర్మలు రెండూ కలిసి ఒకే ఒక జ్ఞాన ప్రవాహంగా సాగిపోతుంది జ్ఞాని జీవితం. ఎంచేతనంటే అనుక్షణమూ ఏ కర్మ చేసినా జ్ఞాని దాన్ని కర్మ అని చూడదు. అది కూడా తన జ్ఞానమేనని భావిస్తాడు. జ్ఞాన స్వరూపమైన బ్రహ్మమే సర్వత్రా సర్వదా పరచుకొని ఉన్నట్టు దర్శిస్తాడు. అదే ఒక యజ్ఞం జ్ఞానికి. బ్రహ్మయజ్ఞం.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః - ఆ యజ్ఞంలో అర్పణమూ హవిస్సూ అని వేరుగా లేవు. అర్పణమంటే మంత్రం. హవిస్సంటే మంత్రం చెబుతూ హోమం చేసే పదార్థం. అవి రెండూ బ్రహ్మమే వాడి దృష్టిలో. బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం. మరి అగ్నిహోత్ర మేదని అడిగితే అదీ బ్రహ్మమే. అందులో హోమం చేసే యజమానుడు కూడా బ్రహ్మమే. హవన క్రియ కూడా బ్రహ్మమే. బ్రహ్మైవ తేన గంతవ్యం. హోమం చేసి దాని మూలంగా ఆ కర్తకు లభించే ఫలం స్వర్గాది లోకాలు కూడా బ్రహ్మమే. ఇంతకూ బ్రహ్మకర్మ సమాధినా. ఆ కర్మా అందులో ఆశ్రయించిన ఏకాగ్రతా అంతా బ్రహ్మమే.

Dr Dayananda Swamy ebooks



ఒక జ్ఞాని చేసే ప్రతి కర్మా అది ఒక పవిత్రమైన యజ్ఞంతో సమానం. భౌతికమైన యజ్ఞంలో అర్పణాదులైన యజ్ఞాంగా లెన్ని ఉన్నాయో అవన్నీ పరమార్థ దర్శి అయిన జ్ఞానికి ఆధ్యాత్మికంగా బ్రహ్మ స్వరూపమే మరేదీగాదు. అంచేత ఇదంతా బ్రహ్మమేనని గుర్తించే జ్ఞాని కది కర్మే గాదు. జ్ఞానంగానే అనుభవానికి వస్తుంది. కర్తృ క్రియా కారక ఫలాది భేద బుద్ధి ఉన్నప్పుడే అది కర్మ. అవన్నీ బ్రహ్మమేనని అభేద బుద్ధితో ఎప్పుడు చూచాడో అప్పుడా జ్ఞాని దృష్టి కదంతా బ్రహ్మమే గాని కర్మ కాదు. దృష్టిని బట్టిగదా సృష్టి.

ఇక్కడ కొందరు మరొక విధంగా వ్యాఖ్యానిస్తున్నారీ శ్లోకాన్ని. యద్ బ్రహ్మ తదర్పణా దీని. బ్రహ్మైవ కిల అర్పణా దినా పంచ విధేన కారకాత్మనా వ్యవస్థితం సత్ తదేవ కర్మ కరోతి – తత్రన అర్పణాది బుద్ధి ర్నివర్త్యతే – కింతు అర్పణా దిషు బ్రహ్మ బుద్ధి రాధీయతే – యథా ప్రతిమాదౌ విష్ణ్వాది బుద్ధిః – అని భగవత్పాదులు వారి వాదాన్ని వర్ణిస్తున్నారు. ఏది బ్రహ్మమో అదే అర్పణాదులు. బ్రహ్మమే మంత్ర హవిరగ్ని యజమాన స్వర్గాది రూపంగా ఉంటూ అదే ఈ పనులన్నీ చేస్తున్నది. అక్కడ అర్పణాది బుద్ధిని తొలగించటం లేదు శాస్త్రం. మీదు మిక్కిలి వాటిలో బ్రహ్మ బుద్ధి నారోపిస్తున్నది. ఇది ఎలాటిదంటే విగ్రహాదులలో విష్ణ్వాది బుద్ధి నారోపించటం లాంటిది.

ఇది వినటానికెంతో రమణీయంగా ఉందిగాని ఇది సరియైన వ్యాఖ్య కాదు. ఎందుకంటే బ్రహ్మం అర్పణాదులని చెప్పినా అర్పణాదులు బ్రహ్మమని

Dr Dayananda Swamy ebooks


చెప్పినా అది సామానాధి కరణ్యమే. రెండింటినీ ఏకమని చెప్పటానికి సామానాధికరణ్య **Equation** మని పేరు. అందులో అర్పణాదులన్నీ బ్రహ్మ స్వరూపమని భావించటమే సమంజసం గాని బ్రహ్మ మర్పణాదులుగా భావించటం కాదు. కారణ మేమంటే మొదటి దానిలో ఇవన్నీ బ్రహ్మంలో లయం చేసి బ్రహ్మమనే ఏకైకమైన తత్త్వాన్నే భావించవచ్చు. అలా కాక ఆ బ్రహ్మమే ఈ రూపాలలో కనిపిస్తున్నదంటే ఏకైకమైన తత్త్వమనేక రూపాలుగా భావించవలసి వస్తుంది. అనేకత్వం సమస్యేగాని పరిష్కారం కాదు. పరిష్కార మెప్పుడూ ఏకంగా భావించటమే. అందుకే జీవజగత్తులను బ్రహ్మాకారంగా దర్శించమని చెబుతుందే గాని శాస్త్రం బ్రహ్మాన్ని జీవజగత్తులుగా చూడమని బోధించదు. జీవ జగద్భావన ఇప్పుడే ఉందిగా మనం దరికీ ఇప్పుడు క్రొత్తగా బోధించటందేని కా విషయం మనకు శాస్త్రం. అలా బోధించినా అది మన సమస్యకు పరిష్కారం కాదుగా. అనేక త్వమే మనకున్న సమస్య. సమస్య పోగొట్టటమే శాస్త్ర కర్తవ్యం. అంతేగాని దాన్ని ఇంకా పెంచి పోషించటం కాదు. కనుక మేము చెప్పిందే సరియైన వ్యాఖ్య అంటారు స్వామివారు.

**దైవమేవాపరే యజ్ఞం - యోగినః పర్యుపాసతే**

**బ్రహ్మాగ్నావ పరే యజ్ఞం - యజ్ఞేనైవో ప జుహ్వతి - 25**

ఇలాంటి సరియైన చక్కని రాజమార్గంలో అర్థం చేసుకోలేక ఒక్కొక్క రొక్కొక్క యజ్ఞాన్ని పట్టుకొని ఊరేగుతున్నారు. అవన్నీ కర్మ యజ్ఞాలూ

Dr Dayananda Swamy ebooks



ద్రవ్య యజ్ఞాలే సమ్యగ్దర్శనాని కంతగా పనికిరావని త్రోసిపుచ్చుతున్నా డిప్పుడు భగవానుడు. దైవమే వాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే. కొందరు కర్మిష్ఠులు దేవతల ప్రీత్యర్థం తాము చేసే జ్యోతి ష్టోమాగ్ని ష్టోమాదులే యజ్ఞమని వాటి నాచరిస్తున్నారు. మరికొందరు బ్రహ్మ చైతన్యాన్నే ఒక అగ్నిహోత్రంగా భావించి అందులో బుద్ధీంద్రియ ప్రాణ దేహాది సంఘాతాన్ని అభిమానించే తన జీవాత్మ భావాన్ని తామే యజ మానులయి ఆహుతి చేయటమే యజ్ఞమని భావిస్తున్నారు. అనగా సోపాధికమైన జీవాత్మను నిరుపాధికమైన పరమాత్మగా దర్శించటానికి ప్రయత్నిస్తున్నారు. ఇది మాత్రం దైవ యజ్ఞాదులలో చేరేది కాదు. అయినా వాటిలో చేర్చి చెప్పట మెందుకంటే బ్రహ్మార్పణం బ్రహ్మహవిః అనే జ్ఞానయజ్ఞ మెంత గొప్పదో చూపటానికీ దాన్నే సాధకుడైన వాడు పాటించాలని చాటటానికీ నంటారు భగవత్పాదులు.

పోతే ఇక కావలసినన్ని ఉన్నాయి యజ్ఞమనే పేరిట లోకు లాచరిస్తున్నవి. అవి మాత్రం కేవలం క్రియారూపమైనవే. భౌతికమే. ఆత్మజ్ఞాని కుపయోగపడేవి కావు.

**శ్రోత్రా దీనీంద్రియా ణ్యన్యే - సంయమాగ్నిషు జుహ్వతి**

**శబ్దాదీన్ విషయా నన్యే - ఇంద్రియాగ్నిషు జుహ్వతి - 26**

Dr Dayananda Swamy ebooks



శ్రోత్రాదులంటే త్వక్చక్షుః శ్రోత్ర జిహ్వాఘ్రాణాలనే ఇంద్రియాలు. వాటికి సంబంధించినవే శబ్ద స్పర్శ రూపరసగంధాలనే విషయాలు. **Objects.** ఇంద్రియాలు వాటి వాటి విషయాలలో వదిలేస్తే విచ్చల విడిగా సంచరిస్తుంటాయి. మన అదుపులో ఉండవు. మనలనూ లాగేస్తాయి ఆ విషయాలలోకి. అలా కాకుండా వాటి వ్యాపారాల నరికట్టి సంయమమనే అగ్నిలో హోమం చేస్తారట కొందరు. వారికదే యజ్ఞం. సంయమమంటే నిగ్రహ **Control** మని అర్థం.

శబ్దాదీన్ విషయానన్యే ఇంద్రియాగ్నిషు జుహ్వతి - అలా కాక మరికొందరు శబ్దాదులైన విషయాలనే పట్టుకు వచ్చి ఇంద్రియాలనే అగ్నిహోత్రంలోనే హోమం చేయటానికి యత్నిస్తారట. మొదటిది లోపలి ఇంద్రియ వ్యాపారాలు బయటికి రాకుండా చూడటమైతే రెండవది బయటి విషయాలను లోపలికి తీసుకొనే ప్రయత్నం. అయితే ఇంద్రియ వ్యాపార మసలే సాగకపోతే ఎలాగా అది సంభవమా అనే ప్రశ్న వస్తే సాగవచ్చు. కాని శ్రోత్రా దిభి ర విరుద్ధ విషయగ్రహణం హోమం మన్యంతే. ఆయా ఇంద్రియాలు నిషిద్ధమైన విషయాల మీదికి పోకుండా నిరోధించటమే గాని అవిరుద్ధమైన వాటి విషయంలో ప్రవర్తించ వచ్చునని రాజీ చేశారు భాష్యకారులు.

Dr Dayananda Swamy ebooks



**సర్వాణీంద్రియ కర్మాణి - ప్రాణ కర్మాణి చాపరే**

**ఆత్మ సంయమ యోగాగ్నౌ - జుహ్వతి జ్ఞానదీపితే - 27**

సర్వాణీంద్రియ కర్మాణి ప్రాణ కర్మాణి - పంచేంద్రియాలూ తమ తమ వ్యాపారాలు సాగిస్తూనే ఉంటాయి. అవి ఇంద్రియ కర్మలు. అలాగే ప్రాణకర్మ లున్నాయి. ఆకుంచన ప్రసారణ గమనా దానాది క్రియలు. వీటన్నిటినీ కొందరు ఆత్మ సంయమ యోగాగ్నౌ ఆత్మ నిగ్రహమనే యోగమే ఒక హోమకుండంగా భావించి అందులో లయం చేయటానికి యత్నిస్తుంటారు. జ్ఞాన దీపితే - ఇలా చేస్తున్నామనే జ్ఞానంతో బుద్ధిపూర్వకంగా చేస్తుంటారు. జ్ఞానమే వారి బుద్ధి కా ప్రకాశాన్ని అందిస్తుంది. అలా చేయటమే వారికొక యజ్ఞం.

**ద్రవ్యయజ్ఞాః తపోయజ్ఞాః - యోగ యజ్ఞా స్తథా పరే**

**స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞాశ్చ - యతయ స్సంశిత వ్రతాః - 28**

కొందరైతే ద్రవ్య యజ్ఞం చేశామని సంతోషిస్తుంటారు. తీర్థ క్షేత్రాదులలో పాత్రులైన వారికి పదిమందికి యజ్ఞమనే పేరుతో ద్రవ్యాన్ని వినియోగించటం ద్రవ్యయజ్ఞం. మరికొందరు తపోయజ్ఞ మాచరిస్తుంటారు. తపస్సంటే కృచ్ఛ్ర చాంద్రాయణాదులు. కాయశోషణం ఇంద్రియ శోషణం నిరాహార దీక్షా ఇలాంటిదంతా తపస్సు - అదే ఒక యజ్ఞమని భావిస్తారు వారు. ఇంకా కొందరు యోగయజ్ఞం చేస్తుంటారు.

Dr Dayananda Swamy ebooks


ప్రాణాయామ ప్రత్యాహా రాదికమైన యోగాభ్యాసమే యజ్ఞం వారి పాలిటికి. మరికొందరైతే స్వాధ్యాయ మొకటీ. జ్ఞానమొకటీ ఇవే యజ్ఞానుష్ఠానమని తలపోస్తారు. ఋగాది శాఖలలో ఏదో ఒక శాఖను అధ్యయనం చేస్తూ పోవటం స్వాధ్యాయ యజ్ఞం. పోతే తామభ్యసించే శాస్త్రం తాలూకు అర్థమేమిటో దాని పరిజ్ఞానం గడిస్తే అది జ్ఞానయజ్ఞం.

వీరందరూ యతయః సంశిత వ్రతాః - యతులు. యతన మంటే ప్రయత్నం. వారు వారు పట్టుకొన్న మార్గాలలో చక్కగా పరిశ్రమ చేస్తుంటారు. అంతేగాక సంశితవ్రతాః చాలా పదునైన తీవ్రమైన సంయమంతో అనుష్ఠిస్తుంటారా యజ్ఞాన్ని వారు. **Method in madness** అన్నారు. తాము చేసేది యజ్ఞమా కాదా అని గాదు. యజ్ఞమనే నమ్ముతున్నారు. తమ నమ్మకాని కనుగుణంగా నడుచుకొంటున్నారు - నిజాయితీగా. అందులో ఎలాటి భేషజం లేదు. మోసం లేదు.

**అపానే జుహ్వతి ప్రాణం - ప్రాణే పానం తథాపరే**

**ప్రాణాపాన గతీ రుద్ధ్వా - ప్రాణాయామ పరాయణాః - 29**

ఇంకా కొందరు పాటించే యజ్ఞ మెలాంటిదో వర్ణిస్తున్నది గీత. అపానం ప్రాణమని ఉన్నాయి రెండు. ప్రాగ్గ మనవాన్ ప్రాణః - అర్వాగ్గమన వానపానః అని వాటి నిర్వచనం. బయటికి పోయేగాలి ప్రాణం - లోపలికి వెళ్లేగాలి అపానం. అంటే ఉచ్ఛ్వాసనిః శ్వాసాలు. అందులో

Dr Dayananda Swamy ebooks



ప్రాణవృత్తి నపానంలోనూ అపానవృత్తిని ప్రాణంలోనూ హోమం చేయాలి. ప్రాణాపాన గతీరుద్ధ్వా - అలా చేసి ప్రాణా పాన గతులను అంటే ఉచ్ఛ్వాస నిశ్శ్వాస క్రియలను రెంటినీ ఆపేయాలి. అప్పుడు వాయువు లోపలికీ రాదు. వెలపలికి పోదు. రాకపోకలు నిలిచిపోతాయి.

అలా నిలిచిపోతే ఏమవుతుందది. కుంభాకారంగా మారుతుంది. అంటే వాయువును లోపలనే కుంభిస్తారు యోగులు. అలాగే కుంభక వృత్తి సాగిపోతే ప్రాణాయామ మంటారు దాన్ని. ప్రాణమంటే జీవితం. ఆయామ మంటే ఎడతెగకుండా సాగటం. జీవనకాలం ఆగకుండా ఎక్కువకాలం సాగించవచ్చు. **To extend life time** ఇది ఒక రకమైన హఠయోగం. మరణాన్ని జయించటాని కిదే మార్గమని భావిస్తారు యోగులు.

**అపరే నియ తాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి**

**సర్వేప్యేతే యజ్ఞ విదో - యజ్ఞక్షపిత కల్మషాః - 30**

ఇంకా కొందరున్నారు మహానుభావులు. నియతాహారాః ఆహార నియమం బాగా పాటిస్తారు వారు. అసలు తినక పోవటం కాదు నియమమంటే. తింటే అతిగా తినటమూ కాదు. ఎంతో అంతే తింటారు. యుక్తాహారం లేదా మితాహారం పాటిస్తారు వీరు. అలా పాటిస్తూ వారు ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి - ప్రాణాలను ప్రాణాలలో హోమం చేస్తారు.

Dr Dayananda Swamy ebooks


అంటే అర్థం. పంచ ప్రాణాలలో ఒక్కొక్క వాయు విశేషాన్ని ఈ నియమ పాలనతో జయించి దానిలో మిగతా వాయువు లన్నింటినీ కలుపుతూ వస్తారు. కలపటమంటే అందులో మిగతా వన్నీ చేరిపోయినట్టు భావించటమే.

సర్వేప్యేతే యజ్ఞవిదః - ఇప్పుడింత వరకూ వర్ణించిన వారందరూ యజ్ఞవేత్తలే. యజ్ఞమంటే ఏదో తెలిసిన వారే. తామెలా భావించారో అంతవరకే ఆ తెలియటం. ఆ మాత్రం తెలిసి చేసినా అదీ ఒక నియమమే. మంచి పనే. కొంతవరకు సాధనే. కాబట్టి యజ్ఞ క్షపిత కల్మషాః - తాము చేసిన యజ్ఞమామేరకు వారి శరీర మనోమాలిన్యాన్ని ప్రక్షాళన చేసి వారికా మాత్రం ఫలితమిచ్చి తీరుతుంది. నహికాల్యాణ కృత్ అని గీత తరువాత చెప్పబోతుం దొక సత్యం. ఏదైనా మంచి పనిచేస్తే అది వృధా పోదు. సంపూర్ణమైన మోక్షఫలం గాక పోయినా ఎంతోకొంత ఫలిత మివ్వకపోదు. యక్షా నురూపో బలిః అన్నారు భగవత్పాదు లొకచోట. ఏ దేవతకు తగిన బలి దానికర్పిస్తారట. అలాంటిదే ఇదీ.

**యజ్ఞశిష్టా మృత భుజో - యాంతి బ్రహ్మ సనాతనం**

**నాయం లోకో స్త్యయ జ్ఞస్య- కుతోన్యః కురుసత్తమ - 31**

యజ్ఞ శిష్టామృత భుజః - ఏ యజ్ఞమైనా చేయి నీవు. దానికి తగిన ఫలిత ముంటుందని పేర్కొన్నాము. దాని కమృతమని పేరు పెట్టారు పెద్దలు.

Dr Dayananda Swamy ebooks


మృతం కానిదేదో అది అమృతం. చావకుండా బ్రతికి ఉండేది. యజ్ఞం పోయినా యజ్ఞ ఫలం పోదు. యజ్ఞమనేది ఒక క్రియ. క్రియ చేసినంత సేపే కనపడుతుంది. చేసి ముగిస్తే ముగిసిపోతుంది. అంటే క్రియగా కనపడదిక. నశిస్తుంది. అందుకే యజ్ఞమనే కర్మ మృతమై పోతుంది. కాని యజ్ఞానంతరం శిష్టమైన దలా పోదు. శిష్టమంటే మిగిలిపోయేదని అర్థం. యజ్ఞంలాగా తొలగిపోకుండా మిగిలిపోతుంది గనుక అది అమృతం. యజ్ఞం మృతమైనా యజ్ఞఫల మమృతం. ఎక్కడ ఉంటుందది - నీకు కనపడకుండా దాగి ఉంటుంది. దీనికే అదృష్టమని అపూర్వమని పేరు పెట్టారు మీమాంసకులు. యజ్ఞం చేసిన యజమానుడి అనుభవానికి రావా లెప్పటికైనా ఆ ఫలం. మృతమైతే ఎలా వస్తుంది. అయితే మరి వీడు మృతుడవు తున్నాడు గదా అంటే వీడూ మృతుడు కాడు. వీడి స్థూల శరీరమే మరణిస్తుంది. వీడికి మరణం లేదు. శరీరమిక్కడ దగ్ధమవుతున్నది కాబట్టి వీడూ పోయాడని భావిస్తున్నాము. కాని ఈ జీవుడు సూక్ష్మ శరీరంలో కూచొని బయటకి పోతాడు. కర్మ వీణ్ణి నడుపుతూ పోతే లోకాంతరాలకు వెళ్లి అక్కడ కర్మఫలం కొంత అనుభవించి మరలా కర్మశేష మను భవించటానికి జన్మిస్తాడు. అంచేత ఫలానుభవ మున్నంత వరకూ వీడి కర్మా ఫలమూ అమృతమే. దాన్ని అనుభవించే వీడూ అమృతుడే.

Dr Dayananda Swamy ebooks

అయితే అమృతుడని పేర్కొన్నాము గదా అని వీడు అప్పుడే ముక్తుడయి పోయాడని బోల్తా పడరాదు. జీవ భావం వదలనంత వరకూ మోక్షమెలా వస్తుంది. మరి అమృత మనే మాట కర్థమేమిటి. వాసనామయమైన యాత్ర ఎప్పుడూ ఉంటుంది. అది చేసే జీవుడూ ఉంటూనే ఉంటాడు కాబట్టి అమృతమన్నారు. అంత మాత్రమే. అందుకే ఆపేక్షిక మమృతత్వ మంటారు భగవత్పాదులు దీన్ని. మరి నిజమైన అమృతత్త్వం ఇలాంటి యజ్ఞాది కర్మల వల్ల వచ్చేది కాదు. కేవలమాత్మ జ్ఞానం వల్లనే రావాలది. ఈ యజ్ఞమూ యజ్ఞ కర్త అయిన జీవుడూ - వాడాసించే యజ్ఞఫలం స్వర్గాది లోకాలూ - మరలా వాడెత్తే జన్మలూ - అందులో వాడి కేర్పడే ఉపాధులూ - ఇటు పిండాండమూ. అటు తనకు భిన్నంగా చూచే బ్రహ్మాండమూ - ఈ మొత్త మిన్ని రూపాలలో లేదు. అంతా కలిసి నా ఆత్మ చైతన్యమే దాని విలాసమే దాని విభూతే ఇదంతా -అని దర్శించటమే ఆత్మజ్ఞానం. ఇక వాడికి మృతి ఎక్కడిది. తనకు భిన్నమైన పదార్థముంటే గదా దాని మూలంగా మరణంగానీ జననంగానీ. అంతా ఏకైకమైన ఆత్మగా అనుభవానికి వస్తున్నప్పుడది మృతం కాదు అమృతమే. ఆత్మ అజరమూ అమరమూ గదా. అంచేత అసలైన ముఖ్యార్థంలో అమృతత్వమిది.

పోతే కర్మ మీమాంసకుల మృతమని వర్ణిస్తున్నది ముఖ్యం కాదు. గౌణం **Secondary** . గౌణమైతే వారూ వీరిలాగే బ్రహ్మ సాయుజ్యం

Dr Dayananda Swamy ebooks



పొందుతా రంటున్నదే గీత దానికేమి చెబుతారు సమాధానం. ఏమన్నదీ గీత. యజ్ఞం వల్ల ఏర్పడ్డ ఫలం మరణించదు. అది అమృతం. దాన్ని అనుభవించే సోమయాజులు కూడా సనాతనమైన బ్రహ్మతత్త్వాన్నే అందుకొంటాడన్నది – అప్పటికి వారికి కూడా అమృతత్వం మోక్షమనేది వచ్చినట్టే గదా. దానికి మా గురువుగారి మాటల్లో వినండి సమాధానం. సనాతనం బ్రహ్మ అంటే నిత్యసిద్ధమైన **Eternal** ఆ పరమాత్మ తత్త్వమే మేము కాదనలేదు. యాంతి గచ్ఛంతి. వీరు గూడా దాన్ని పొందుతారు. అదీ కాదనటం లేదు. అయితే ఒక తిరకాసుం దిక్కడ. ఆ పొందటానికి వీరికుండ వలసిన యోగ్యత ఏమిటి. వీరాబ్రహ్మాన్ని పొందటాని కెంత కాలం పడుతుం దనేది మన మాలోచించాలి. ముముక్ష వశ్చే త్కాలాతిక్రమాపేక్షయా అని రెండు మాటలు విసిరారక్కడ స్వామివారు. వెంటనే రాదా అమృతత్త్వమీ యజ్ఞానుష్ఠాతలకు. చాలాదీర్ఘకాలం పడుతుంది. అది కూడా అసలైన అమృతత్వం మీద వీరికపేక్ష ఉంటే. దీర్ఘ కాలమేమిటి. కొన్ని జన్మలు కర్మానుష్ఠానంలో మరికొంత కాలము పాసనలతో గడచి ఆ తరువాత కర్మయోగులయి సత్త్వశుద్ధీ ఏకాగ్రతా ఏర్పడితే ఆ బలంతో శ్రవణ మననాదులు చేసి గాని ఆత్మజ్ఞానం సంపాదించలేరు. అందుకే బహూనాం జన్మనా మంతే అన్నది గీత. అంతేగాని జ్ఞానులలాగా వీరికి వెంటనే రాదు మోక్షం. అది కూడా ముముక్ష ఉంటేనే కర్మఫల బుభుక్ష ఉన్నంత వరకూ ముముక్షకు నోచుకోలేరు.

Dr Dayananda Swamy ebooks


ఇంత ఉన్నది తేడా ఇద్దరికీ. అంటే ఏమన్న మాట. కర్మ కర్మ మార్గంలో ఉండగానే నీకు మోక్షమివ్వదు. అది క్రమంగా జ్ఞానంగా మారినప్పుడే తద్ద్వారా మోక్షమనేది సిద్ధిస్తుంది. అయితే ఒక్కమాట. ముందు ఉట్టికెక్కి తరువాత స్వర్గానికి. ఉట్టి ఎక్కటం లాంటివీ యజ్ఞాలన్నీ మరీ బేహోదాగా పశుప్రాయంగా బ్రతికితే ఏ ఫలితమూ లేదు జీవితానికి. ఏదో ఒక ఆదర్శం పెట్టుకొని బ్రతికితేనే అది సఫలమైన జీవితం. అది మొదట క్రియారూపంగా నడచినా తరువాత వారి పాటికి వారికే విసుగుపుట్టి అసలైన ఆత్మజ్ఞానానికే ప్రయత్నిస్తారు. అంతవరకూ మనమెంత హితబోధ చేసినా వారి బుర్రకెక్కదు. చేసేది మంచిపనే గదా అని వాణ్ణి వదిలేయాలి. వారే కొంతకాలానికి దారికి వస్తారు.

అలా ఎప్పటికీ రాని మానవుడు వేరే ఉన్నాడు. వాడు జ్ఞాని కాడు. కర్మి కాడు. నాయం లోకోస్త్య యజ్ఞస్య - కుతోన్యః - కురు సత్తమ ఇప్పుడు చెప్పిన యజ్ఞాలలో ఏ యజ్ఞమూ చేయక మామూలుగా పశుప్రాయంగా బ్రతుకు సాగించేవాడి కిటు ఇహమూ లేదు. అటు పరమూ లేదు. ఇహ జీవిత మిక్కడే వాడు కన్ను మూస్తే నశిస్తున్నది. పరాని కసలు వాడే ప్రయత్నమూ చేయలేదు కాబట్టి అదీ దక్కకుండా పోతున్నది. పురుషార్థానికే తరంగాని పురుషుడు వాడు.

**ఏవం బహువిధా యజ్ఞా - వితతా బ్రహ్మణో ముఖే**

**కర్మజాన్ విద్ధితాన్ సర్వా - నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే - 32**

Dr Dayananda Swamy ebooks


అందుకే మానవ జీవితాని కేదో ఒక గమ్యం చూపటానికే శాస్త్రం మొదట మన అధికార తారతమ్యాన్ని బట్టి ఆయా కర్మ లుపదేశించింది. వితాతా బ్రహ్మణో ముఖే - బ్రహ్మ మంటే ఇక్కడ వేదమని అర్థం. ముఖమంటే ద్వారం Medium వేదం ద్వారా బహువిధా యజ్ఞా వితతాః - అనేక విధాలైన యజ్ఞయాగాది కర్మలు సవిస్తరంగా వర్ణించబడ్డాయి. వాటి వాటి ఫలితాలు కూడా వేదమే వర్ణించి చెప్పింది. జ్యోతిష్టో మేన స్వర్గకామో యజేత - జ్యోతిష్టోమ యాగం చేస్తే నీకు స్వర్గం లభిస్తుందని చెబుతున్నది. ఇలాంటి వెన్నో కర్మలూ వాటి ఫలశ్రుతులూ.

అయితే ఇవన్నీ ఆచరిస్తూ పోతే చాలు. ఇక జ్ఞానమక్కర లేదు. స్వర్గంలాగే మోక్షం కూడా వచ్చి ఒళ్లో బడుతుందని మాత్రమెప్పుడూ బోల్తా పడరాదు. ఎందుకంటే మోక్షం కర్మవల్ల రాదు. దానికి కావలసిన సాధనం జ్ఞానమెక్కటే. మరి ఈ యజ్ఞయాగాది క్రియలో. కర్మ జాన్ విద్ధితాన్ సర్వాన్ - ఇవన్నీ కర్మజన్యాలు. కాయిక వాచిక మానసికమైనవే ఏ కర్మలైనా. అవి కూడా అచేతనమైనవీ. విశేష రూపమైనవీ. చలనమే విశేషం. మనసూ వాక్కూ - శరీరమూ చలించకుండా ఏ కర్మ అయినా చేయగలవా. ఇలా చలనాత్మకమైన యజ్ఞయాగాది కర్మలు ఆత్మను పట్టుకోటానికెలా సాధనంకాగలవు. నిర్వ్యాపారోహి ఆత్మా. ఆత్మ అంటే అది పరిపూర్ణమైన సర్వవ్యాపకమైన జ్ఞానం. నిరాకారమూ వ్యాపకమూ ఎప్పుడయిందో

Dr Dayananda Swamy ebooks


దానికిక చలనం లేదు. అచలోయం సనాతనః అని గీతోపదేశం. అలాంటి అచలమైన తత్త్వాన్ని చలించే మనసు ఎలా పట్టుకోగలదు. అదే పట్టుకోలేకపోతే శారీరకమైన ఈ యజ్ఞయాగాది కర్మలెలా అందుకోగలవు. ఇవీ చలనాత్మకమే గదా. అందుకే కర్మజాన్ అంటే అనాత్మ జాన్ అని అర్థం వ్రాశారు భాష్యకారులు. కర్మ జ్ఞానానికి విజాతీయం. జ్ఞాన మాత్మ అయితే అది అనాత్మ. కాబట్టి జ్ఞానప్రాప్తి కది ద్వారం కాదు.

ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే. ఇది తెలిస్తేనే నీకు మోక్షమంటున్నది గీత. జ్ఞాత్వా అన్నదేగాని కృత్వా అనటం లేదు. ఒకపని చేసి గాదు మోక్షం. తెలిసి. ఏమని తెలిసి - నమద్వ్యా పారా ఇమే - ఇవి నా వ్యాపారాలు కావు. నాకూ వీటికీ సంబంధం లేదు. నిర్వ్యాపారోహ ముదాసీనః - నిర్వ్యాపారంగా ఉదాసీనంగా ఉన్న శుద్ధ చైతన్యమే నా స్వరూపమని ఇత్యేవం జ్ఞాత్వా - ఇలాగా తనస్వరూపాన్ని తాను గుర్తించటమే మోక్ష సాధనం. అంతేగాని స్వరూప జ్ఞానం లేకుండా అవీ ఇవీ తద్దినాలు నెత్తిన పెట్టుకొని మోక్షాన్ని కూడా వాటితోనే కొట్టేయ గలమని అపోహ పడటం కాదు. అస్మా త్సమ్యగ్దర్శనాత్ మోక్ష్యసే సంసార బంధనాత్తని సాగదీశారు భాష్యకారులు. ఆత్మస్వరూపమెలా ఉందో అలా గుర్తించటమే సమ్యగ్దర్శనం. దానివల్లనే సంసార బంధం నుంచి తప్పుకోగల వంటాడాయన. మరి యజ్ఞాది కర్మలో అది ఒక విధంగా ఉంటే ఇవి మరొక విధంగా దాన్ని భావిస్తాయి. కనుకనే వీటివల్ల మోక్షం లేదని చాటటం.

Dr Dayananda Swamy ebooks


**శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ - జ్ఞానయజ్ఞః పరంతప**

**సర్వం కర్మాఖిలం పార్థ - జ్ఞానే పరి సమాప్యతే - 33**

మరి ఈ యజ్ఞాలన్నీ ఏదో ఒక ఆదర్శం పెట్టుకొని చేసే మంచి కార్యాలే గదా. అవి పనికిరావని చాటటం దేనికి. ఎలా పనికిరావని ప్రశ్న వస్తున్నది. దానికి జవాబిది. శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ - ఇవన్నీ ఎన్నైనా చెప్పు. అవి కేవలం ద్రవ్యయ జ్ఞాలే. **Material Sacrifices.** యజ్ఞకుండం - సమిధలూ అగ్నిహోత్రాలూ - ఇలాంటి యజ్ఞంగాలన్నీ జడపదార్థాలు. ద్రవ్యాలే గాక ఆ చేసే క్రియకూడా జడమే. ఒకటి కదలని జడమైతే మరొకటి కదిలే జడం. అవి శుద్ధమైన చైతన్యాన్ని అందివ్వగలవా మనకు. ఆత్మజడం గాదు. చేతనం. అది చలం కాదు. అచలం.కాగా ఇలాటి ద్రవ్యయజ్ఞా లేమిటి. అలాటి ఆత్మజ్ఞానాన్ని మనకు ప్రసాదించట మేమిటి - అసంభవం.

కనుకనే ద్రవ్యమయమైన యజ్ఞం మోక్షసాధనానికి తోడుపడలేదు. మరి ఏది మోక్షసాధనం. జ్ఞానయజ్ఞం. ద్రవ్యయజ్ఞం ఫలారంభకమైతే జ్ఞానయజ్ఞం ఫలారంభకం కాదంటారు గురువుగారు. ఫలమంటే స్వర్గాదులూ అక్కడ కలిగే భోగాలూ. అవి యజ్ఞం చేయనంతవరకూ ఎక్కడా సిద్ధంగా లేవీ సృష్టిలో. చేస్తే క్రొత్తగా తయారవుతా యట. అంచేతనే యజ్ఞ ఫలాన్ని అపూర్వ మంటారు కర్మ మీమాంసకులు. పూర్వం లేని

Dr Dayananda Swamy ebooks



[illegible] ఆరంభ మయిందని అర్థం. అందుకే మామూలు యజ్ఞాలన్నీ [illegible]రం భాకాలు. అనుభవిస్తే ఆ ఫలం ఖర్చయి పోతుంది కూడా. అయితే [illegible]క్షణం స్వర్గాది లోకాల నుంచి ఉద్వాసన చెబితే వచ్చి మరలా భూమి మీద పడే ప్రమాదం కూడా ఉంది వాటిలో.

పోతే ఇలాటి ఉపద్రవం లేనిది జ్ఞానయజ్ఞ మొక్కటే. జ్ఞానమే యజ్ఞమిక్కడ. యజ్ఞంగాని యజ్ఞం. ఇది వాటిలాగా ఫలారంభకం కాదు. ఎందుకుగాదు. అవి స్వర్గమనే ఫలాన్ని తయారుచేసినట్టే ఇది కూడా మోక్ష ఫలాన్ని తయారు చేస్తుంది గదా. పొరబాటు. మోక్షమనేది స్వర్గాదుల లాగా తయారయ్యేది కాదు. సిద్ధ మయింది. సాధ్యంకాదు. నీవు గుర్తించినా గుర్తించకున్నా దాని పాటికది వస్తు సిద్ధంగా ఉన్నది. మరి జ్ఞానం చేసే పనేమిటి. ఉన్నదే నీ అజ్ఞానం వల్ల మరుగు పడి ఉంటే దాని తాలూకు జ్ఞానం సంపాదించి చూస్తే ఉన్నదే మరలా దర్శన మిస్తున్నది. చీకట్లో నీవు గుర్తించకున్నా లేక సర్పమని మరొక రూపంగా గుర్తించినా అక్కడ ఉన్నది రజ్జువే. అదినీవు సర్పమని చూస్తున్నంతవరకూ మరుగున పడి ఉందంత మాత్రమే ఎప్పుడు దీపం పెట్టి చూచావో అప్పుడది బయటపడి కనపించింది. అది నీవున్నదని తెలుసుకొన్నావే గాని క్రొత్తగా సృష్టించ లేదు కదా. **It is only Discovery not creation.** అలాగే ఇక్కడా మోక్షమనేది క్రొత్తగా సృష్టి అయ్యేదికాదు. అజ్ఞానంలో కనపడక జ్ఞానంలో దర్శన మిస్తున్న దంత మాత్రమే.

Dr Dayananda Swamy ebooks



అందుకే ద్రవ్య యజ్ఞాలన్నింటి కంటే జ్ఞాన మనే ఈ యజ్ఞమే శ్రేయం. చాలా ప్రశస్తమైనదీ శాశ్వత ఫలదాయక మైనదీ స్వర్గాదుల లాగా నశించేది కాదు మోక్షఫలం. అంతకు ముందు నుంచీ సిద్ధమైన తత్త్వమది - ఒకప్పుడు క్రొత్తగా తయా రయింది కాదు. తయారు కాని పదార్థానికి వినాశ మేముంది. ఉత్పత్తి వినాశాలే ఆద్యంతాలు. ఆద్యంతాలున్న వెప్పుడూ ఆది మధ్యాంతాలు లేని దానిలో చేరిపోవలసిందే. అదే చెబుతున్నదిప్పుడు గీత. సర్వం కర్మాఖిలం. ఎన్ని వందలు వేలయినా చేయి నీవు అవి చేస్తే తయారవుతాయి. అది వాటి జన్మ. ఫలాను భవంతో సమసి పోతాయి. అది వాటి కంతం. మరి జ్ఞాన మలా ఒకప్పుడు జన్మించింది కాదు. జన్మించకపోతే నశించే ప్రశ్నే లేదు. అనంతం కాబట్టి సకల కర్మలూ జ్ఞానంలో సమసి పోవలసిందే.

జ్ఞాన మొక మహాసాగరమైతే కర్మలన్నీ గంగాది నదీ ప్రవహాలు. నదీనాం సాగరో గతిః అన్నారు. ఏనది ఎక్కడ జన్మించినా అది అక్కడా ఇక్కడా ప్రవహిస్తూ పోయి చివరకు సముద్రంలో కలవ వలసిందే. అదే వాటికి గమ్యం. అలాగే యజ్ఞాది కర్మలన్నిటికీ గమ్యం చివరకీ ఆత్మజ్ఞానమే. యావానర్థ ఉదపానే - జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి. అని ఇంతకు ముందు నుంచీ చెబుతూనే ఉంది గీత. కర్మానుష్ఠానం కర్మయోగానికి దారితీస్తే - అది సమాధికి తీస్తే అది తుదకు జ్ఞానంలోనే లయ మయి పోతున్నది.

Dr Dayananda Swamy ebooks


కర్మ - భక్తి - యోగం - అనే ప్రశ్నేలేదు. అన్నీ క్రియలే. జ్ఞానం క్రియగాదు వస్తువు. క్రియ వస్తువులోనే ఉదయిస్తుంది. వస్తువునే పట్టుకొని సాగిపోతుంది. చివరకు వస్తువులోనే అంతమవుతుంది. ఇంతెందుకు మన జ్ఞాన మొక వస్తువు దానిలో నుంచే వృత్తులు దయిస్తున్నాయి. అవి మానసికంగా వాచికంగా కాయికంగా సాగుతున్నాయి. అవి క్రియాత్మకమైన ప్రాపంచిక పదార్థాలతో సంబంధం పెట్టుకొంటున్నాయి. చివరకు సుఖ దుఃఖాది ఫలాలుగా మారుతున్నాయి. అవి మరలా మన జ్ఞానానికే అనుభవానికి వస్తున్నాయి. అనుభవిస్తే అవి మన జ్ఞానంలోనే లయమయి పోతున్నాయి. అవి వృత్తిరూపంగా ఉదయించక ముందూ ఉంది జ్ఞానం. అవి మరలా వచ్చి తనలో కలిసి పోతున్నప్పుడూ ఉంది. అవునా లేదా చెప్పండి. కాబట్టి కర్మలన్నీ జ్ఞానంతో సమాప్త మయ్యేవే.

**తద్విద్ధి ప్రణి పాతేన - పరి ప్రశ్నేన సేవయా**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం - జ్ఞానిన స్తత్త్వదర్శినః - 34**

కాబట్టి ఎప్పటికైనా జీవితంలో సాధకుడైన వాడు చేయవలసిన కర్తవ్యమా కర్మలూ ఈ ఉపాసనలూ - యోగాభ్యాసాలూ - కావు. అవి ఎన్ని చేసినా వాటి వల్ల జీవిత సమస్య పరిష్కారం కాదు. స్వర్గాదిలోకాలకు పోయి ఉత్తమ భోగా లనుభవించినా మరలా ఉత్తమ జన్మలెత్తి ఉత్తమమైన జీవితం సాగించినా సంసారమేగాని అది సాయుజ్యం కాదు సమస్య

Dr Dayananda Swamy ebooks



పరిష్కరించుకోక పోగా ఇంకా నెత్తికి తెచ్చుకొంటున్నాడు మానవుడు. కాబట్టి కర్మోపాసనాదులు కర్తవ్యం కాదు జీవితానికి కర్తవ్యం జ్ఞాన సముపార్జనమే.

అది ఎలా ఆర్జించాలా జ్ఞానమని అడిగితే సమాధానమిస్తున్నాడు గీతాచార్యుడు. ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శిన: - జ్ఞానులైన వారే నీకు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు. జ్ఞానం లేనివాడి కెవడివ్వాలి జ్ఞానం జ్ఞానమున్న వాడే. డబ్బులేని వాడికి డబ్బున్న వాడే గదా దానం చేస్తాడు. తృణమో పణమో. లేని వాడేమి చేస్తాడు. వాడికే లేకుంటే వీడికేమివ్వగలడు అలాగే జ్ఞానవంతుడే ఇవ్వాలి జ్ఞాన ధనాన్ని. అయితే జ్ఞానం మాత్రముంటే చాలదు వాడికైనా జ్ఞానిన స్తత్త్వదర్శినః జ్ఞాన మనేది కేవలం సిద్ధాంత జ్ఞానమైతే ప్రయోజనం లేదు. సిద్ధాంతం **Theory** దృష్టాంతమయి **Exprience** ఉండాలి. అదే తత్త్వదర్శనం తత్త్వాన్ని ముఖాముఖిగా చూచి ఉండాలి వాడు. అది పరోక్షమైతే ఇది అపరోక్షం. రెండూ జ్ఞానమే. రెండూ జ్ఞానంలో రెండు భూమికలు. రెండూ ఉన్నప్పుడే ఆ జ్ఞానం పరిపూర్ణం. ఇలాంటి పరిపూర్ణ జ్ఞాన సంపన్నుడే సద్గురువు. వాడే తన్నాశ్రయించిన శిష్యులకు ఉపయోగ పడగలడు.

ఇదుఃగో ఇలాంటి గురువును పట్టుకోవాలి సాధకుడు. అలాంటి సద్గురువు లెందరో ఉండరు. చాలా అపురూపం కనుక ఏ బాబానో గూబానో పట్టుకొని వాడే మనల నుద్ధరిస్తాడని బోల్తాపడక అసలైన ఆచార్యపురుష

Dr Dayananda Swamy ebooks


డెవడా ఎక్కడ దొరుకుతాడా అని వాడికోస మన్వేషణ చేసి పట్టుకోవాలి. వాడు నీ దగ్గరికి రాడు. నీవే వాడి దగ్గరికి వెళ్లాలి. అంగడి వాడు మన ఇంటికి రాడు. మనమే అంగడికి వెళ్లి కావలసిన సరుకు కొనితెచ్చుకోవలసి ఉంటుంది. అలాగే తద్విద్ధి - అలాంటి మహానుభావుడి వద్దకు వెళ్లు ప్రణిపాతేన - వినయ విధేయతలతో వాడి కాళ్ల మీద పడు. పరిప్రశ్నేన ఊరక పడటం వరకే గాదు వాడెందుకు వచ్చావు బాబూ అని అడిగితే నీవు నీ సందేహాలన్నీ అడిగి తెలుసుకో. ఎలా ఉంటాయా సందేహాలంటే అనుకరించి మాటాడు తున్నారు భాష్యకారులు. కథం బంధః కథం మోక్షః - కావిద్యా కాచా విద్యా - బంధమెలా వచ్చింది. మోక్షమెలా వస్తుంది మనకు. మోక్షానికి కావలసిన విద్య ఎలాంటిది. దానికి దూరం చేస్తున్న అవిద్య ఏమిటి. ఇలా అడగటమే గాక వాటికాయన వివరణ ఇచ్చే వరకూ తొందర పడి వెళ్లిపోక అను దినమూ ఆయనను వదలి పెట్టకుండా తన మీద అనుగ్రహం కలిగే వరకూ సేవిస్తూ పోవాలి.

అలా చేస్తూ పోతే నీ కార్యదీక్ష చూచి ప్రసన్నుడయి నీకు జ్ఞానోపదేశం చేయగలడా గురువు. గురువు జ్ఞానవంతుడే కావచ్చు. ఎలాంటిదా జ్ఞానం. మొదటి కోవకు చెందిందా. రెండవ దానికి చెందినదా పరోక్షమా అపరోక్షమా. వ్రాస్తున్నారు భగవత్పాదులు. జ్ఞానవంతోపి కేచిత్ తత్త్వదర్శన శీలాః అపరేతున. జ్ఞానులయి కూడా కొందరు తత్త్వాన్ని గూర్చి విన్న వారే

Dr Dayananda Swamy ebooks



గాని కన్న వారు గాక పోవచ్చు. కన్న జ్ఞానమే అపరోక్షం ఎలా ఉంటుందది. ఇంతకు పూర్వం చెప్పి ఉన్నారు. భగవత్పాదులు సమ్యక్ ప్రమాణ జనితా పరమార్థ దర్శన లక్షణా బుద్ధిః అని. సమ్యక్ప్రమాణం వల్ల కలగాలట అది. అసమ్యక్ప్రమాణం వల్లకాదు. రజ్జువును రజ్జువేనని చూస్తే అది సమ్యక్ దాన్నే సర్పమని చూస్తే అది అసమ్యక్. అలాగే బ్రహ్మతత్త్వాన్ని ఆత్మగానే దర్శించాలి. అనాత్మ రూపమైన ప్రపంచంగా దర్శించ గూడదు - అలా ఆత్మ స్వరూపంగా దర్శిస్తున్నవాడే అసలైన గురువు వాడిదే ప్రామాణికమైన జ్ఞానం. తైరుప దిష్టం జ్ఞానం కార్యక్షమం భవతి అంటారు గురువు గారు. అలాంటి వారు పదేశిస్తేనే నీకా జ్ఞాన ముపయోగ పడుతుంది. అసలైన తత్త్వాన్ని అనుభవానికి తెస్తుంది. కనుక సద్గురువు నెన్నుకోటంలో జాగ్రత్త పడాలి శిష్యులు జ్ఞాన విజ్ఞానాలు గురువు కుండవలసిన లక్షణా లైతే ప్రణిపాత ప్రశ్నసేవాదులు శిష్య లక్షణాలు.

**యద్ జ్ఞాత్వాన పునర్మోహ - మేవం యాస్యసి పాండవ**

**యేన భూతా న్యశేషేణ - ద్రక్ష్యస్యాత్మ న్యథో మయి -35**

మరి వారుపదేశించేది మనం గ్రహించేది జ్ఞానమైనా ఎలాంటి జ్ఞాన మనుకొంటున్నారు. ఏ జ్ఞాన మంటే ఆ జ్ఞానం కాదు లోక జ్ఞానమా అదికాదు. కళాజ్ఞానమా అది కాదు. భౌతిక శాస్త్ర జ్ఞానమా అది కాదు. ఆఖరుకు ధర్మ జ్ఞానమా అదీ గాదు. ఎందుకు కాదు. ఇవన్నీ విశేష జ్ఞానమే

Dr Dayananda Swamy ebooks



సామాన్య జ్ఞానం కావు. విశేషాల తాలూకు జ్ఞానం జన్మిస్తుంది – నశిస్తుంది. ఎప్పటికీ ఉండేదిగాదు. మరి ఏ జ్ఞానమైతే శాశ్వతం. ఆత్మ జ్ఞానమొక్కటే అలాంటిది. ఆత్మ ఎలా రాదో పోదో నిత్యసిద్ధమో **Eternal** దానికి సంబంధించిన జ్ఞానం కూడా అలా నిత్య సిద్ధమే. ఇలాంటి జ్ఞానమే బోధిస్తారు సద్గురువులు మనకు.

అలాంటి బోధనందు కొన్నందు కే మిటి మనకు కలిగే ఫలితం. ఎప్పుడూ ఫలితాన్ని బట్టే విలువ వస్తుంది పదార్థానికి. మామూలు జ్ఞానం వల్ల కలిగే మామూలు ఫలితం కాదు. మహాఫల మన్నారు పెద్దలు దీన్ని. యద్ జ్ఞాత్వా న పున ర్మోహమేవం యాస్యసి – ఆ ఒక్క జ్ఞాన మార్జిస్తే చాలు మళ్లీ ఇలాంటి వ్యామోహం తొంగిచూడదు మన జీవితంలో అజ్ఞానమనే పిశాచి పూర్తిగా ఉచ్చాటన మయి పోతుంది. ఇక మన కేసమస్యా ఉండబోదు. అవిద్యాకామ కర్మలేగా సమస్యలు. వాటివల్లనేగా కారణ సూక్ష్మ స్థూల శరీరాలు మూడూ వచ్చి చుట్టుకొన్నాయి మనలను. అదేగా సంసార బంధం ఆత్మజ్ఞానం లేకనే అవి బలంగా వచ్చి మీదబడ్డాయి. ఇప్పుడాజ్ఞాన భాస్కరుడు దయించాడు. ఇక మనలనీ అవిద్యాంధకారమేమి చేయగలదు. ఉంటేగా చేయటానికి. పటా పంచెలయి పోతుంది.

అంతేకాదు యేన భూతా న్యశేషేణ ద్రక్ష్యస్యాత్మని ఇది ప్రతిలోమంగా మనకు కలిగే ఫలితమైతే అనులోమంగా మనకు సిద్ధించే

Dr Dayananda Swamy ebooks



ఫల మేమిటో తెలుసా. సమస్త భూతాలనూ అవి ప్రాణులే కాదు. జడ పదార్థాలే కాదు మొత్తం చేతనాచేతన ప్రపంచాన్నే బాహ్యంగా కాక నీ స్వరూపంలోనే చేరి పోయినట్టు నీవు చూడగలవు. నీతో ఏకమై పోయినట్టు భావించగలవు నీలోనా గాదు. ఆ మాటకు వస్తే నాలో కూడా అలాగే చూడగలవంటాడు పరమాత్మ. నీలోనా నాలోనా అని ప్రశ్న వస్తే నీవేమిటి నేనేమిటి అంతా కలిసి ఉన్న దొకే నేను గదా అలా భావించమని సలహా అథోమయి అంటే అర్థమిది. దీన్ని బట్టే తార్కాణ మవుతున్నది మనకు జీవేశ్వరు లిద్దరూ ఒక్కటేనని. క్షేత్ర జ్ఞేశ్వరైకత్వం సర్వోపనిషత్ప్రసిద్ధం ద్రక్ష్యసి అని వివరించారు భాష్యకారులు.

**అపి చేదసి పాపేభ్యః - సర్వేభ్యః పాపకృత్తమః**

**సర్వం జ్ఞాన ప్లవేనైవ - వృజినం సంతరిష్యసి - 36**

కాగా ఇలాంటి ఆత్మ జ్ఞానం సద్గురూపదేశం వల్ల ఏమానవుడు శ్రవణం చేసి మననం చేసి తరువాత స్వయంగా తాను తన పాటికి నిది ధ్యాస సాగించి ఆత్మసాక్షాత్కారం పొందగలడో వాడి జన్మ సఫలం. వాడు కృతార్థుడు ఇక వాడంతకు ముందు జన్మలలో ఎన్ని పాపాలైనా చేసి ఉండవచ్చు అపిచేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ఎన్నెన్నో పాపకార్యాలు చేసి పాపాత్ములలో అతి పాపాత్ముడని పించుకొని ఉండవచ్చు నీవు. సర్వం జ్ఞాన ప్లవేనైవ వృజినం సంతరిష్యసి. ఆ పాపాలనే మహా సాగరాన్ని

Dr Dayananda Swamy ebooks

అవలీలగా దాటి పోగలవు. ఎలాగ. జ్ఞాన ప్లవేనైవ. బ్రహ్మజ్ఞానమే ఒక పెద్ద పడవ. అందులో ఎక్కి కూచున్నావంటే ఎంత విశాలమైన సాగరమైనా – ఎంత తుఫాను గాలి కది కలగుండు పడినా – అది నిన్నేమీ చేయలేదు. నీవెక్కి కూచున్న నౌక భౌతికం కాదు బలహీన పడటానికి అభౌతికమైన జ్ఞాననౌక ఇది. భౌతిక శక్తు లేవీ దాని కవరోధం కల్పించ లేవు. చీకటి పొరల లాగా ఎక్కడి కక్కడ విరిసిపోతాయి.

ఇక్కడ పాపమనే మాటకు పుణ్యమని కూడా అర్థం చెప్పుకో మంటారు భగ వత్పాదులు. ఎందుకంటే అవిద్యా కామకర్మలే పాపాలంటే పడగొట్టే దేదో అదీ పాపమన్నా పాతక మన్నా అర్థం. సంసారంలో పడగొట్టింది మొదట అవిద్య తరువాత దాని వల్ల పడ్డాము మనం కామంలో అది పడగొడితే మళ్లీ పడ్డాము కర్మలో. అది పడగొడితే పడుతున్నాము మరలా జన్మలో. ఇలా కర్మ జన్మకూ జన్మ కర్మకూ దారి తీస్తున్నప్పు డది ధర్మమైనా అధర్మమైనా రెండూ ఒక్కటే. రెండూ పడగొట్టే బాపతే. రెండూ మహా పాపాలే. అందుకే జన్మతః మనం పాపుల మయ్యాము. పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః అంటే అర్థ మిదే. అలాంటి పాపాలన్నీ ఇప్పుడీ జ్ఞానాగ్నిలో పడి భస్మీ పటలం కాక తప్పదు. అలా కాక పోతే జ్ఞానమనేది ఉదయించి ప్రయోజనం లేదు. మోక్షాని కసలు ఆశేలేదు.

**యథై ధాంసి సమిద్ధోగ్నిః - భస్మసా త్కురుతేర్జున**

**జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి - భస్మసాత్కురుతే తథా -37**

Dr Dayananda Swamy ebooks


అయితే జ్ఞానం పుణ్యపాప కర్మలన్నింటినీ దగ్ధంచేస్తుందని గదా వర్ణించారు. అది ఎలా చేస్తుందని అడిగితే వివరిస్తున్నారు వ్యాస భట్టారకులు. జ్ఞాన మనేది ఒక బ్రహ్మాండంగా మండుతూ ఉన్న అగ్ని హోత్రం బాగా మండుతున్న అగ్ని జ్వాల ఎన్ని దుంగలనూ దూలాలనూ దానిలో పడేసినా ఎలా కాల్చి భస్మం చేయగలదో అలాగే ఈ ప్రజ్వలించే జ్ఞానాగ్ని కూడా కర్మలనే సమిధల నెన్నిటినైనా కాల్చి బూడిద చేయగలదు.

జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి భస్మసాత్కురుతే అన్నారు బాగానే ఉంది. కర్మలను జ్ఞానం భస్మం చేస్తుందంటే ఎలా చేస్తుందది. కట్టెల లాగా కర్మలనేవి కనపడవు గదా. నిజమే. భస్మం చేయట మంటే ఇక్కడ కర్మలను కాల్చి పారేయటం. బీజాలు మరలా మొలకెత్త కుండా వాటి శక్తిని లాగేయటమని అర్థమట. ఒక పొట్ల విత్తనమో జొన్న విత్తనమో నేలలో నాటితే ఎప్పటికైనా మొలకెత్తుతుంది. దాన్నే బాణలిలో వేసి వేయిస్తే ఇక మొలకెత్తదు. మొలకెత్తే స్వభావం పోతుంది దానికి. అలాగే సంచిత కర్మ- ఆగామికర్మా – మరలా జన్మ అనే అంకుర మేర్పడ కుండా జ్ఞానోదయ మయ్యేసరి కభావమయి పోతాయి. అంటే జ్ఞానంలోనే చేరి జ్ఞాన స్వరూపంగా మారి పోతాయి. అలాంటప్పుడిక పునర్జన్మ అనే అంకురోత్పత్తి కవకాశమేది. ఇదీ దీనితాత్పర్యం.

సరేగాని జ్ఞానికి సర్వకర్మలూ తొలగి పోతే శరీరమనే ఉపాధీ దానితో చేసే కర్మా ఏమయిందని ప్రశ్న. దానికి జవాబిచ్చారు భాష్యకారులు.

Dr Dayananda Swamy ebooks


...ర్వాత్ యేన కర్మణా శరీరమారబ్ధం తత్ర్ప వృత్తఫలత్వా దుపభోగేనైవ ...యతే - ఇప్పుడున్న ఈ శరీరమే కర్మతో ప్రారంభయిందో ఆ ప్రారబ్ధ ...ర్మ మాత్రం తొలగి పోదు. అది ప్రవృత్త ఫలం ఫలమేర్పడిందీ పాటికే. ...బట్టి ఫలాను భవంతోనే గాని అది క్షీణించదు అనుభవం పూర్తి కాగానే ...నికిక ఐహిక జీవితం లేదు. అంతవరకూ జీవన్ముక్తుడు. అప్పటినుంచీ ...దేహ ముక్తుడు.

మరి అలాంటప్పుడు సర్వ కర్మలనే మాట కర్ధమేమిటి. యాని అప్రవృత్త ఫలాని జ్ఞానోత్పత్తేః ప్రాక్కృతాని జ్ఞాన సహ భావీనిచ అతీతా నేక జన్మాంతర కృతానిచ తాన్యేవ సర్వాణి భస్మసాత్కురుతే అని వివరణ ...చ్చారాయన. అది ఎలాగంటే ఇంకా ఫలిత మారంభం కాని కర్మలు మూడున్నాయి. జ్ఞాన ముదయించక ముందు ఈ జన్మలో చేసినవి ఒకటి. జ్ఞానంతో పాటు ఈ జన్మలోనే చేస్తున్న కర్మలొకటి అలాగే పూర్వ జన్మలలో చేసిన కర్మలొకటి ఇందులో పూర్వం చేసిన వాటికి సంచిత మని పేరు. జ్ఞాన దృష్టితో చేస్తున్న వాటి కాగామి అని పేరు. ఇదుగో ఈ సంచితాగా మికర్మలే సర్వ కర్మలనే మాట కర్ధం. వాటిని మాత్రం జ్ఞానం నిర్వీర్యం చేసి పారేస్తుంది. ఇక పునర్జన్మ భయం లేదు జ్ఞానికి.

**నహి జ్ఞానేన సదృశం - పవిత్ర మిహ విద్యతే**

**తత్స్వయం యోగ సంసిద్ధః - కాలేనాత్మని విందతి - 38**

Dr Dayananda Swamy ebooks



ఇంతకూ జ్ఞానమనేది చాలా గొప్ప విలువైన పదార్థం. మిగతా జ్ఞానాల లాంటిది కాదది. కర్మల లాంటిది కాదు. భౌతికమైన ద్రవ్యాల లాంటి దసలే కాదు. నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే దానికి సాటియైనదీ లేద.ు పవిత్రమైనదీ లేదు సృష్టిలో ఆత్మ జ్ఞానమే గదా జ్ఞాన మిక్కడ ఆత్మకు సాటి మరి ఏమున్నది. అది ఏకమే వాద్వితీయం. దానికి సాటి చెప్పవలసిందే దైనా ఉంటే అది ఇక అనాత్మ ప్రపంచమే. అది ఆత్మకు వేరుగా అసలే లేదు గదా. ఇక దానికి సాటి ఏది చెబుతావు. అలాగే పవిత్రం కూడా జ్ఞానం. పావనమైనదీ అదే. పావనం చేసేదీ అదీ. పావన మంటే శుద్ధం. శుద్ధం బుద్ధ మన్నారు దాన్ని నిరాకారమూ సర్వవ్యాపకమూ అయిన జ్ఞానం శుద్ధంగాక మలిన మెలా కాగలదు. ఆకాశం లాగా ఎప్పుడూ నిర్మల మైన తత్త్వమది. తాను నిర్మలం కావడమే గాక తనకు భిన్నమైన దాన్ని కూడా నిర్మలం చేయగలదు. భిన్నమైన అనాత్మ ప్రపంచం వస్తుసిద్ధంగా అసలు లేకపోయినా ప్రతీతి సిద్ధంగా **Apparant** ఉంది. అది కూడా జ్ఞానోదయమైతే ఒక స్వప్నంలాగా విరిసిపోతుంది. అదే శుద్ధి చేయట మంటే.

అయితే ఈ జ్ఞాన మెలా లభిస్తుంది మనకు. తత్స్వ్యయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విందతి. ఆచార్యుడు మనకెంత బోధించినా మనం దాని నందుకొనే ప్రయత్నం చేయనంతవరకూ సిద్ధించదది. కనుకనే

Dr Dayananda Swamy ebooks



చెబుతున్నాడు యోగసంసిద్ధః కొంత కాలం కర్మయోగమూ సమాధి యోగమూ అవలంబించి చిత్త శుద్ధి నార్జించాలి సాధకుడు. అప్పుడే జ్ఞానానికి యోగ్యత. అది కూడా జిజ్ఞాసకూ ముముక్షకూ దారితీస్తే శ్రవణ మనన ధ్యానాదులు అభ్యసించి తత్ఫలితంగా సంపాదించ గల మా జ్ఞానం. కాలేన అంటున్నది గీత. తొందరపడ గూడదు. అభ్యసిస్తూ పోతే కాల క్రమేణా అదే పరి పాకానికి వచ్చి జ్ఞానం నీకు సిద్ధిస్తుంది. ప్రయత్నం వల్లనే పనులు జరుగుతాయి గాని ఊరక ఆశపడితేగాదు.

**శ్రద్ధా వాన్ లభతే జ్ఞానం - తత్పర స్సంయతేంద్రియః**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి - మచిరేణాధి గచ్ఛతి - 39**

ప్రయత్నం వల్లనే పని జరుగుతుంది. జ్ఞానమనేది సిద్ధించటానికి కూడా ప్రయత్న మవసర మన్నారు. అంతకు ముందు చెప్పారు గదా ప్రణి పాతేన పరిప్రశ్నేన అని. అదికాక ఇంకా ప్రయత్నమేమిటి నిజమే అదీ ప్రయత్నమే కాదనలేదు. కాని అది మాత్రమే చాలదు. బాహ్యమైన క్రియ అది. సాధకుడి లక్షణం కాదు. అందులో మోసమున్నా ఉండవచ్చు. పది మంది మెచ్చుకోవాలని ప్రదర్శన చేసినా చేయవచ్చు. చివర కాషాఢ భూతిలాగా గురువు గారి సొమ్మేదైనా దోచుకొని పారిపోయినా పోవచ్చు. అదే అంటున్నారు జగద్గురువులు కూడా. ప్రణిపాతాదిస్తు బాహ్యః అనైకాంతి కోపి భవతి - మా యావి త్వాది సంభవాత్ - బాహ్యమైన ప్రణి పాతాది

Dr Dayananda Swamy ebooks


క్రియలు యాంత్రికంగా చేయవచ్చు. అలా చేసే వారందరూ నిజాయితీ పరులని చెప్పలేము. ఆషాఢభూతులు కూడా ఉండవచ్చు వారిలో. కనుక జ్ఞాన మనే ఫలం తప్పకుండా లభిస్తుందని చెప్పలే మంటారాయన.

మరి తప్పకుండా లభించే మార్గ మిక ఏమిటని అడిగితే గీత వర్ణిస్తున్నది. శ్రద్ధావాన్ లభతే అని. శ్రద్ధా - తత్పరత్వమూ ఇంద్రియ నిగ్రహమూ ఈ మూడు లక్షణాలూ ఉంటే సాధకుడికి అవశ్యంగా లభిస్తుంది ఆత్మజ్ఞానం జ్ఞానం కోసమే గురూప సదనం చేయటం శ్రద్ధ. ఎలాగైనా సంపాదించాలనే పట్టుదల తప్ప మరేదీ అక్కరలేదని దాని మీదనే దృష్టి పెట్టుకొని అదే లోకంగా బ్రతకటం తత్పరత్వం. మరి దాన్ని ప్రక్కకు లాగే ఏ విషయాలమీదికీ మనసు గాని ఇంద్రియాలు గాని పరుగెత్త కుండా వాటి నదుపులో ఉంచుకొనే ప్రయత్నం సంయమం **Restraint.**

ఇవి మూడూ అలవరుచుకొంటే మాత్రం జ్ఞానం లబ్ధ్వా. ఆత్మజ్ఞానం అవశ్యంగా ఉదయిస్తుంది. అది గురువు గారి ఉపదేశం మూలాన్నే అంటే గురూపదేశం ప్రణిపాతాదుల వల్లనే కాదు. ముఖ్యంగా ఈ మూడింటి వల్లనే ఫలిస్తుందని అర్థం. అయితే ప్రణి పాతాదు లక్కరలేదా అంటే లేదనము మేము. దీని కవి అనుషంగికం **Aceessory** ఇవి ఉంటే అవి తప్పకుండా పట్టు పడతాయని భావం. అయితే ఇంత ప్రయాసపడి మనం జ్ఞానం సంపాదిస్తే మనకు కలిగే ఆ మహాఫలమేమిటి. పరాం శాంతి

Dr Dayananda Swamy ebooks



మచిరేణాధి గచ్ఛతి అంటున్నది గీత అత్యంత శాంతి యుతమైన మోక్షాన్ని చవిచూడవచ్చు సాధకుడు. అది కూడా కాలాంతరంలో కాదు. కలుగుతుందో లేదోనని సందేహించబనిలేదు. అచిరేణ వెంటనే. జ్ఞానం లభించిందో లేదో శాంతి కూడా అప్పుడే లభిస్తుంది. కర్మకూ జ్ఞానానికీ ఇదే ముఖ్యమైనతేడా కర్మ ఫల మిప్పుడేరాదు. ఎప్పుడో చచ్చిన తరువాత మరి జ్ఞాన ఫలమో ఇప్పుడే ఇక్కడే. ఇదీ జ్ఞానంలో విశేషం.

**అజ్ఞాశ్చా శ్రద్ధ ధానశ్చ - సంశయాత్మా వినశ్యతి.**

**నాయం లోకోస్తిన పరో - న సుఖం సంశయాత్మనః - 40**

పోతే ఈ విషయంలో ఎలాంటి అపనమ్మకమూ పెట్టుకో నక్కరలేదు జ్ఞాన సాధకుడు. అనుమానం ప్రాణ సంకట మన్నారు. చాలా పాపిష్ఠ మైనది అనుమానం నమ్మకముండాలి ఏ విషయంలోనైనా. లేకుంటే దాన్ని దీక్షతో మనం సాధించలేము అజ్ఞానీ - అవిశ్వాసీ - సంశయాళూవూ - **Agnostic - Heretic Sceptic** అని పేర్కొంటారు. ఒకటి తెలియనివాడు అజ్ఞాని. తెలిసినా దాని విషయంలో నమ్మకం లేనివాడు అవిశ్వాసి. అసలది ఉందా లేదా అని ఎప్పుడూ డోలాయ మానంగా బ్రతికేవాడు సంశయా త్ముడు.

ఇది లోకంలోనే కాదు. ఆత్మ విషయంలో కూడా ఇదే వరస. ఆత్మ అంటే ఏమిటో ఎలా ఉంటుందో తెలియని వాడజ్ఞుడు. దాన్ని అసలు

Dr Dayananda Swamy ebooks


నమ్మని వాడ శ్రద్ధ ధానుడు. ఎటూ తేల్చుకోలేక సతమత మయ్యేవాడు సంశయాళువు. ముగ్గురూ ముగ్గురే ఎవడూ దాన్ని భేదించ లేదు. గ్రహించలేదు. తరించలేదు. **Positive** కాదది **Negetive Approach.** ఉత్తర ధ్రువం వైపు వెళ్ల వలసినవాడు దక్షిణ ధ్రువం వైపు వెళ్లి ఏమిసుఖం ఉత్తరాన ఏ కొండలున్నాయో నదులున్నాయో పట్టణాలున్నాయో చూడలేదు. ఆనందించలేదు. అలాగే వీరూ తత్త్వమేమిటో గుర్తించలేక దానికి దూర దూరంగానే పారిపోతారు. దూరంగా పోతే ఏమవుతుంది. సంసార సాగరంలోనే తల మునకలయి ఎప్పటికీ చేరలేరు జీవిత గమ్యం.

అందుకే శాపం పెడుతున్నది గీత. నాయం లోకోస్తి న పరః అని. ఇహమూలేదు పరమూ లేదలాంటి మానవుడికి - అందులోనూ సంశయాత్ముడికి. న సుఖం సంశయాత్మనః - వాడికైహిక సుఖమూ లేదాముష్మిక సుఖ మంత కన్నాలేదు. సంశయాత్మా వినశ్యతి. అనుమానం పెను భూత మన్నట్లు వాడి అనుమానమే ఒక దయ్యమయి వాణ్ణి చివరకు రూపు మాపుతుంది. ఎలా గంటే అజ్ఞుడి కంత హాని లేదు. తనకు తెలియక పోయినా తెలిపితే ఎప్పటికైనా తెలుసుకొంటాడు. అశ్రద్ధా ళువూ అంత పాపాత్ముడు కాడు సహేతుకంగా సోదాహరణంగా బోధిస్తే చాలు నమ్ముతాడు పోతే కొంత ఇటూ కొంత అటూ ప్రసరించే మనస్సున్నవాడి కెలా చెప్పినా ఎంత చెప్పినా మళ్లీ మళ్లీ ప్రశ్నలు వేస్తూ పోతాడేగాని నిశ్చయం

Dr Dayananda Swamy ebooks



చేసుకో లేదు మనస్సుకు. అందుకే పాపిష్ఠః సంశయః అని గురువుగారు త్రోసిపుచ్చుతారు.

**యోగసన్న్యస్త కర్మాణం - జ్ఞాన సంఛిన్న సంశయం**

**ఆత్మవంతం న కర్మాణి - నిబధ్నంతి ధనంజయ. - 41**

సరే నిస్సం శయ మయింది మనస్సు – నిశ్చయ జ్ఞాన మేర్పడింది. జ్ఞానంకలిగిన తరువాత మరలా కర్మలు చేయవచ్చా. పైగా కర్మ చేయ కుండా ఒక్క నిమిషమైనా నిలకడగా కూచోలేడు గదా మానవుడు. మరి జ్ఞానంతోపాటు కర్మ ఉండవచ్చా. అని అడిగితే సమాధాన మిస్తున్నది గీత. యోగ సన్న్యస్తకర్మాణం యోగమంటే ఇక్కడ జ్ఞానయోగం. పరమార్థ దర్శన లక్షణేన యోగేన అని అర్థం చెప్పారు భాష్యకారులు. ఆత్మ జ్ఞాన ముదయిస్తే చాలు. సూర్యోదయమైతే చీకటిలాగా కర్మ విరిసి పోతుంది - నిలవలేదు. సన్న్యసించ వలసిందే కర్మలు. మరి నహి కశ్చిత్ క్షణమపి అనే గీతా వాక్యాని కర్థమేమిటి.

ఇక్కడే ఉందొక సూక్ష్మం అది ఇంతకు ముందే వర్ణించాము అయినా సందర్భం వచ్చింది కాబట్టి వివరించాలి. కర్మా జ్ఞానం రెండూ రాజీ పడతాయా లేక పేచీ పడతాయా అని ప్రశ్న వచ్చింది. రాజీ పడవు ఎప్పుడూ పేచీయే నంటారు భగవత్పాదులు. జ్ఞాన కర్మ సముచ్చయ మొప్పు కోరాయన. అలాగైతే కర్మ యోగం బుద్ధి యోగం రెండూ ఒక్కటే ఏకం

Dr Dayananda Swamy ebooks



సాంఖ్యంచ యోగంచ - అని చెప్పే వ్యాసవాక్య మెలా చెల్లుతుందని మరలా ప్రశ్న. కర్మ అంటే నిత్యనైమిత్తికాదులైన శాస్త్రీయ కర్మలున్నాయి. అందులో అహంకార మమకారాలు కొట్టివేసి సమత్వ బుద్ధితో నిర్లిప్తంగా చేసే కర్మలున్నాయి. ఇందులో శాస్త్రోక్త కర్మలను మనసులో పెట్టుకొని చెప్పిన మాట భగవత్పాదుల మాట రెంటకీ సముచ్చయం పనికిరాదని. ఆ దృష్టితో అది కరెక్టు. పోతే అవే సమత్వబుద్ధితో నిష్కామంగా చేసే కర్మలను దృష్టిలో పెట్టుకొని చెప్పిన మాట వేద వ్యాసుని మాట జ్ఞానం కర్మా రెంటికీ పేచీ లేదని. అలాంటప్పుడు జ్ఞానంతో పాటుండవచ్చు కర్మ. లేదా కర్మ యోగం. శాస్త్రీయమైన దనుష్ఠానమైతే ఇది యోగం. యోగం జ్ఞానానికి విరోధి గాదు. మీదు మిక్కిలి సహకారి. కాబట్టి సన్న్యస్త కర్మాణ మంటే శాస్త్రీయ కర్మ స్నన్యాసమని అర్థం. అంతేగాని కర్మయోగం కాదు. ప్రారబ్ధ కర్మలూ కావు.

జ్ఞాన సంఛిన్న సంశయం ఇలాంటి సమన్వయ రూపమైన ఆత్మజ్ఞాన మెప్పుడేర్పడిందో ఇక ఎలాంటి సందేహాలూ ఉండబోవు. అన్నీ సంఛిన్నం. పటాపంచెలయి పోవలసిందే. పోతే ఇక మిగిలింది ఆత్మైకత్వమే. ఆత్మవంతం. ఆత్మా అనాత్మా అనే తేడా లేకుండా అంతా అలికేసినట్టు ఆత్మగానే చూస్తుంటాడు జ్ఞాని. అనాత్మ గంధం కూడా లేదు కాబట్టి పరాకు చెందే ప్రసక్తే లేదు. అప్రమత్తంగా జీవితం సాగిస్తుంటాడు. కర్మాణిన నిబధ్నంతి - అలాంటి జ్ఞానికే కర్మా అంటదు. అంటకనే పోతే వాణ్ణి కట్టి

Dr Dayananda Swamy ebooks



వేయటమసంభవం. బద్ధుడు కాడు వాడు ముక్తుడు. కర్మ లసలే ఉండవా అంటే ఉంటాయి. అయితే చచ్చిన పాములు. గుణ చేష్టారూపంగా నడుస్తుంటాయి. అవి ఉన్నా ప్రతీతి మాత్రమే **Apparant** గాని వాస్తవం **Actual** కావు.

**తస్మా దజ్ఞాన సంభూతం - హృత్స్థం జ్ఞానాసినా త్మనః**

**ఛిత్త్వైనం సంశయం - యోగ - మాతిష్ఠోత్తిష్ఠ భారత - 42**

అంచేత ఇక నీకు చెప్పేదేమీ లేదు. నీవు చేయ వలసిన పని ఒకటే. అజ్ఞాన సంభూతం హృత్స్థం సంశయం – అజ్ఞానం వల్ల ఏర్పడి నీ మనసులోనే తిష్ఠవేసుకొన్న ఈ సంశయమనే దయ్యాన్ని ఛిత్వా సమూలంగా ఛేదించి పారేయి. ఛేదించాలంటే సాధ్యమా అని దిగులు పడకు – జ్ఞానాసినా ఆత్మ జ్ఞానమే ఒక తీక్షణ దీర్ఘ కరవాలం. ఆ ఖడ్గంతో నరికిపారేయి దాన్ని. సమూలంగా నిర్మూల మయి పోతుంది. పోతుందా అని మరలా సందేహించకు. అది వాస్తవం కాదు ఆ భాస. జ్ఞానం లేనంత వరకే అస్తిత్వం దానికి. జ్ఞానముద యించిందో సూర్యోదయమైతే తమస్సులాగా విరిసిపోక తప్పదు. యోగమాతిష్ఠోత్తిష్ఠ – అలా దాన్ని ముందు నిర్మూలించి తరువాత ఏకర్మ అయినాచేయి. అది నిన్ను బంధించదు. జ్ఞానంతో చేసిన కర్మ కర్మకాదు. మరేమిటి. జ్ఞాన విభూతి జ్ఞానం స్వరూపం కర్మదాని విభూతి ఇక వైరుధ్యమే ముంది. రెండూ నీ స్వరూపంగానే నీకు అనుభవానికి

Dr Dayananda Swamy ebooks



రాగలవు. అదే ఏకాత్మ భావం - ఇది నీవు ఉత్తమాధికారి వైతే చెప్పేమాట. లేక మధ్యమాధికారివా. అయితే యోగ మాతిష్ఠ - ఆ ఏకాత్మ భావం కోసం ముందు కర్మ యోగ మభ్యసిస్తూ ఉండు కొంత కాలం. అది క్రమంగా జ్ఞానానికి దారితీస్తుంది. ఇదే జ్ఞానయోగం

**ఇతి**

**జ్ఞాన యోగః సమాప్తః**

Dr Dayananda Swamy ebooks



# 5. కర్మ సన్న్యాస యోగము

ఇప్పటికి నాలు గధ్యాయా లయి ప్రస్తుత మయిదవ అధ్యాయంలో ప్రవేశిస్తున్నాము. దీని పేరు కర్మసన్న్యాస యోగం. సన్న్యాస మంటే వదిలేయటమే కాదు. ఉంచటమని కూడా అర్థం చెప్పుకొన్నాం. జ్ఞానంతో కర్మను వదిలేయమని ఒక అర్థమైతే జ్ఞానంతో కర్మను చేర్చి రెండింటినీ ఏకంగా చూడటమని మరొక అర్థం. అసలా మాటకు వస్తే జ్ఞానమూ కర్మా - ఇవి రెండే ఉన్నాయి సృష్టిలో. పరమాత్మ జ్ఞాన స్వరూపుడైతే ఆయన సృష్టించిన ఈ ప్రపంచమంతా కర్మ స్వరూపం. అచలమైనది జ్ఞానమైతే దాని చలనం కర్మ. పరమాత్మ చలించకపోతే ప్రపంచ మెలా ఏర్పడింది. ప్రపంచమంటే బాహ్యమైన బ్రహ్మాండమే **Macro** కాదు. ఆంతరమైన పిండాండం **Micro** కూడా. అది సమష్టి. ఇది వ్యష్టి. రెండూ పరమాత్మ

Dr Dayananda Swamy ebooks



సృష్టే. సృష్టి అంతా చలనాత్మకమే - మనమున్న ఈ భూగోళం దగ్గరినుంచీ అన్ని గోళాలూ బ్రహ్మాండమైన వేగంతో తిరుగుతున్నాయనే గదా చెబుతున్నారు నేటి శాస్త్రజ్ఞులు. ఇక చలించనిదంటూ ఏముంది. అణువు మొదలు ఆకాశందాకా చలనమే.

ప్రపంచమే చలిస్తున్నపు డందులోనే బ్రతుకుతున్న మన శరీరాలు మాత్రం చలించకుండా ఎలా ఉంటాయి. రైలుబండి చలిస్తుంటే బండిలో కూచున్న మన శరీరాలు చలించక ఏమవుతాయి. నిశ్చలంగా ఉన్నట్టు కనిపించినా అది కనిపించే వరకే. ఎంత చలిస్తున్నదంటే ఈ ప్రపంచ మేమీ చలించటం లేదనేంత వేగంగా చలిస్తున్నది. చలించటం లేదనే భావం స్థితి అయితే చలిస్తున్నదనే భావం గతి. మనలో కూడా చూడండి. మనలో నేననే స్ఫురణ ఒక్కటీ జ్ఞానమైతే - దానికి గోచరిస్తున్న మనసూ - ప్రాణమూ ఇంద్రియాలూ శరీరమూ - ఇదంతా చలనాత్మకమైన కర్మే. అలాగైతే సమష్టి మీద పరమాత్మ జ్ఞానమైతే - దానికుపాధి అయిన విశ్వ శరీరమంతా కర్మే.

అంచేత సృష్టినంతా ఒక్కసారి సింహావలోకనం చేసి చూచామంటే నేను నాది అని రెండే రెండు భాగాలు చేయవచ్చు. చేస్తే నేననే భాగం జ్ఞానం. నాదనే భాగమంతా కర్మ. ఇవి రెండే దర్శనమిస్తాయి మనకు. ఇంతకన్నా అదనంగా మరొక భావమంటూ నీవెంత దుర్భిణీ వేసుకొని చూచినా చూడలేవు. అయితే ఇందులో ఉన్న ఒక రహస్యమేమంటే ఇవి రెండుగా కనిపిస్తున్నా వాస్తవంలో రెండు గావు. ఒకే ఒక తత్త్వం **Entity.**

Dr Dayananda Swamy ebooks



అది ఏదోగాదు. జ్ఞానం. దీనికే ఆత్మ అని పేరు పెట్టారు వేదాంతులు. అది మన శరీరంలో ఉంది. శరీరం వెలపల సర్వత్రా ఉన్నది. శరీరం మేరకే పరిమితమని భావిస్తే అది జీవాత్మ. సర్వత్రా అదేనని భావిస్తే పరమాత్మ. అంతే తేడా. రెండూ నేను నేననే స్ఫురిస్తుంటాయి. పోతే ఈ ఆత్మకు గోచరించేదంతా అనాత్మ అని పేర్కొన్నారు. అదే ఈ పిండ శరీరమూ. ఆ బ్రహ్మాండ శరీరమూ. కాని చమత్కార మేమంటే ఈ అనాత్మ పైకి అలా కనిపిస్తున్నదే గాని విమర్శించి చూస్తే అది కూడా ఆత్మే వాస్తవంలో. ఆత్మే అనాత్మ ప్రపంచంగా భాసిస్తున్న దన్నమాట. సముద్రమే తరంగ బుద్బుదాలుగా భాసిస్తే ఎలా ఉంటుంది. సముద్రం తన పాటికి తానచలం. తరంగాదులుగా చలం. రెండూ వస్తుతః జలమే. అలాగే ఆత్మ తన పాటికి తాను అచలం. పృథి వ్యాదులుగా శరీర మనః ప్రాణాదులుగా చలం. ఇందులో అచలం స్వరూపమైతే చలం దాని విభూతి **Expansion or Manifestation.** మరొక భాషలో చెబితే స్వరూపం జ్ఞానం. దాని విభూతి కర్మ. స్వరూపం కంటే విభూతి వేరుగానట్టే జ్ఞానం కంటే కర్మ వేరుగాదు. సువర్ణమూ ఆభరణంలాగా రెండూ ఒక్కటే.

ఈ దృష్టితో చూస్తే మనకర్థ మవుతుం దిప్పుడు వేదవ్యాస మహర్షి ప్రణాళిక ఏమిటో. ఆయన రచించిన భగవద్గీతలో ఎన్నో అధ్యాయాలు రచించినట్టు కనిపించినా అన్నీ కలిసి ఎన్నో కావు. ప్రతి ఒక్కటీ జ్ఞానకర్మ ప్రపంచమే. వాటి వర్ణనమే. పేర్లు మారుతుంటాయి. విషయమొక్కటే

Dr Dayananda Swamy ebooks



కాని ఒక్కటే అయినా మనబోటి మందబుద్ధుల కది ఆకళింపుకు రావటం కష్టం. ఎందుకంటే శాస్త్ర సిద్ధాంతం వేరు. లోకానుభవం వేరు. మన అందరి అనుభవంలో జ్ఞానం వేరుగా కర్మ వేరుగా భాసిస్తున్నాయి. మనలోనే చూడండి. మనస్సు జ్ఞానమయ మైతే ప్రాణం కర్మ మయం. చక్షురాదులు జ్ఞానేంద్రియాలైతే వాగాదులు కర్మేంద్రియాలు. ఇంతెందుకు. నేననే భావం జ్ఞానమైతే నాదైన దంతా కర్మమయంగా చూస్తున్నాము మనం. రెండూ ఏకమనే అద్వైత భావం మన కేర్పడడం లేదు. కాని వాస్తవంలో ఉన్నదక్కడ అద్వైతమే. మహావాక్యాలా సత్యమే చాటుతున్నాయి మనకు. ఇదం సర్వం యదయ మాత్మా. ఈ కనిపించే ప్రపంచమంతా ఆత్మ స్వరూపమే. అయ మాత్మా బ్రహ్మ. ఈ జీవులందరూ ఆత్మ స్వరూపులే. ప్రజ్ఞానం బ్రహ్మ. అఖండమైన జ్ఞానమే ఉంది. దానికి గోచరించే జ్ఞేయం లేనే లేదు. జ్ఞేయ మేమిటి. కర్మే గదా. అప్పటికి కర్మ కర్మగా లేదు. అది కూడా వాస్తవంలో జ్ఞానమే ననే అద్వైత సత్యం బోధ పడటం లేదా. అయితే అది నీ కవగాహనకు రాలేదంటావు. రావటం లేదు గనుకనే తెచ్చుకోమని బోధిస్తున్నది శాస్త్రం. ఎందుకని. తెచ్చుకోకపోతే ఆత్మానాత్మలను వేరు చేసి చూస్తుంటావు. అలా చూస్తున్న వరకూ సంసారమనే సమస్యకు పరిష్కారం లేదు. ఏకంగా దర్శిస్తేనే పరిష్కారం.

ఇది గమనించే వ్యాస మహర్షి మొట్టమొదట సాంఖ్యయోగంలోనే జ్ఞానం చాలా దూరం చెప్పి తరువాత అందులోనే కర్మను కూడా జోడించి

Dr Dayananda Swamy ebooks



...పాడు. అది మామూలుగా చూచే మనబోటి లోకుల కర్థమయిందో ...ని సందేహించి లోకదృష్టి ననుసరించి రెండింటినీ విడగొట్టి ...పాడు మళ్లీ. కర్మయోగమనే అధ్యాయంలో కర్మ స్వరూపాన్ని - జ్ఞాన ...గమనే అధ్యాయంలో జ్ఞాన స్వరూపాన్ని - వివరించి చెప్పాడు. అలా ...డగొట్టే సరి కదే వాస్తవమని భ్రాంతి పడతామేమోనని మళ్లీ ఇప్పుడా ...ండింటినీ కలిపి సమన్వయం చేసి చూపుతున్నాడు. మొదట ఏకత్వాన్ని ప్రస్తావించి మధ్యలో అనే కత్వాన్ని వర్ణించి చివరకు మరలా ఏకత్వాన్ని ప్రతిపాదించటమే శాస్త్రమర్యాద. **From Synthesis to synthesis via Analysis** అని ఎప్పుడూ చెబుతుంటాను నేను. ఉపనిషత్తు బోధనా మార్గ **Method ology** మిదే. ఏకమేవాద్వితీయమని మొదట ఏకత్వాన్ని చాటి చెప్పింది ఛాందోగ్యం. మధ్యలో తత్తేజ అసృజత - అప అసృజత - అన్న మసృజత - అని అనే కత్వాన్ని చాటుతుంది. చివరకు సయఏషోణిమా. ఐతదాత్మ్య మిదం సర్వం తత్సత్యం స ఆత్మా - అని ఏకాత్మ భావాన్నే నిరూపిస్తుంది. మరి ఆయన వేదవ్యాసుడు కదా. వేదంలో ప్రక్రియనే **Method** అనుసరించి బోధిస్తున్నాడు మనకు. ఏమిటి కర్మ సన్యాసం. అంటే ఏమిటర్థం. కర్మ జ్ఞానాని కన్యమనే భావాన్ని వదులుకో. దాన్ని జ్ఞానంతాలూకు విభూతి అనే భావంతో జ్ఞానంలోనే చేర్చుకో. అలా భావిస్తే ఇక జ్ఞానకర్మలు పరస్పర విరోధులు కావు - ఏకమేననే అద్వైత దృష్టి గట్టి పడుతుంది సాధకుల మైన మనకు. ఇది కర్మ సన్యాసమనే నామ కరణంలో దాగి ఉన్న పరమ రహస్యం. ఇది ఇంత రహస్యమయ్యే సరి కర్థం చేసుకోలేక అడుగుతున్నా డిప్పుడర్జునుడు.

Dr Dayananda Swamy ebooks

**సన్న్యాసం కర్మణాం కృష్ణ - పునర్యోగం చ శంససి**

**యచ్ఛ్రేయ ఏతయో రేకం - తన్మే బ్రూహి సునిశ్చితమ్ - 1**

కృష్ణా ఏమిటీ అన్యాయం. సన్యాసం కర్మణాం - కర్మలను సన్న్యసించమనీ చెబుతావు. పునర్యోగంచ శంససి. మరలా కర్మలా చరించమనీ చెబుతావు. ఇది పరస్పర విరుద్ధం కాదా. ఇంతకూ ఆచరించ మంటావా కర్మ - వదిలేయ మంటావా. సన్న్యాస మంటే వదిలేయటం. యోగమంటే ఆచరించటం . రెండూ ఒకే వ్యక్తి ఒకే మారు చేయలేడు గదా. రెండూ మాకు బోధిస్తా వేమిటి. ఏదీ ఎక్కడ బోధించాడు కృష్ణుడు. ఇంతకు ముందు అధ్యాయంలో చివరిసారిగా బోధించింది అదే.యోగ సన్న్యస్తకర్మాణమనే శ్లోకంలో సన్యాసం చెప్పాడు. ఛిత్త్వైనం సంశయం యోగమా తిష్ఠ అనే చోట మరలా యోగం చెప్పాడు. అందుకు ప్రశ్నిస్తున్నా డర్జునుడు - రెండూ చెబుతా వేమిటి ఏదో ఒకటి చెప్పమని.

యచ్ఛ్రేయ ఏతయో రేకం. ఏదో ఒకటి బోధించుమాకు. అది కూడా మాకు శ్రేయస్సు కలిగించేదయి ఉండాలి. ఏది ప్రశస్తమో అదే ఆచరించాలి మానవుడు. దానివల్లనే ఫలిత ముంటుంది. పనికి రాని దాచరిస్తే కాదు. అంచేత కర్మానుష్ఠాన మా కర్మ పరిత్యాగమా - ఏది సిఫారసు చేస్తావు మాకు. దేనివల్ల మాకు సత్ఫలిత ముంటుంది. తన్మే బ్రూహి సునిశ్చితం.ని ష్కర్షగా తేల్చి చెప్పుమాకు. ఫలితమివ్వకపోతే నీవు బోధించి ఏమి సుఖం. ఇలా నిలదీసి అడిగితే చెబుతున్నా డిప్పుడు భగవానుడు.

Dr Dayananda Swamy ebooks


**సన్న్యాసః కర్మయోగశ్చ - నిఃశ్రేయస కరావుభౌ**

**తయోస్తు కర్మ సన్న్యాసా - త్కర్మయోగో విశిష్యతే - 2**

సన్న్యాసమూ యోగమూ అనే మాటలెవరూ సరిగా అర్థం చేసుకోటం లేదు. సన్న్యాసమంటే అన్ని కర్మలూ మానుకొని ఊరకకూచోట మనుకొంటు న్నారు. అలాగే యోగ మంటే అన్ని కర్మలనూ శాస్త్రీయ మైనవీ స్వాభావికమైనవీ సకలమూ నెత్తిన పెట్టుకోటమని భావిస్తున్నారు. అదీ తప్పే ఇదీ తప్పే. పూర్తిగా మానేయటం కాదు సన్న్యాసమంటే. అది శాస్త్రోక్తమైనా లౌకికమైనా అహంకార మమకారాలు లేకుండా జ్ఞానం కోసమని చేయాలి కర్మ. అదే సన్న్యాసం మా దృష్టిలో. కర్తృ భోక్తృబుద్ధిని సన్న్యసించటం సన్న్యాసం గాని అసలు కర్మనే సన్న్యసించటం కాదు. ఫలిత మాసించకుండా నిర్లిప్తంగా నిష్కామంగా కర్మ చేయటం. అలా చేయటమే కర్మ యోగం కూడా. చేస్తుంటావు కాబట్టి కర్మయోగం. ఫలితం మీద దృష్టి లేకుండా చేస్తావు కాబట్టి సన్న్యాసం. కనుక రెండుగా పైకి కనిపిస్తున్నా వైరుధ్యం లేదు రెంటికీ. రెండూ కలిసి ఒక్కటే. గంగా యమునల లాగా ఒకే నదీ ప్రవాహం.

ఎటు వచ్చీ మేము వర్ణించిన రీతిలో అర్థం చేసుకొంటే తేడా రాదు. అలాకాక ముక్కకు ముక్కగా పట్టుకొంటే వస్తుంది తేడా. సన్న్యాస మంటే కర్మలనే పరిత్యజించాలని భావిస్తే పొరబాటే. కాకపోయినా అన్ని కర్మలూ ఎలా సన్న్యసిస్తావసలు. ఏపనీ చేయకుండా ఒక్క క్షణమైనా కూచోగలవా.

Dr Dayananda Swamy ebooks



అది అసంభవమని గీత చెబుతున్నది గదా.అలాగే కర్మలు చేయటమంటే ఫలకామనతో చేయమని ఎవరు చెప్పారు నీకు. ఫలాసక్తి లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో చేయటమని ఎందుకు భావించరాదు. అందుకే అసలు కర్మ అని గాక కర్మ యోగమని పేర్కొంటున్నాడు పరమాత్మ. అర్జునుడు కర్మణామని కేవలం కర్మ శబ్దాన్నే ఉదాహరిస్తే కృష్ణుడు యోగమని దానికొక తోక తగిలించి పేర్కొన్నాడు. అంటే ఏమిటర్థం. కేవలం కర్మ అని మాత్ర మనుకొంటే అది అను ష్ఠానం. అందులో కర్తృత్వ భోక్తృత్వ బుద్ధి తొలగక పోవచ్చు. అదే అనుష్ఠానం కాక యోగంగా భావించి చేస్తే మాత్ర మహంమమ బుద్ధి ఉండదా కర్మలో. అప్పుడది జ్ఞానానికి తోడు పడుతుంది. ఫలదృష్టి వదిలేసి కర్మ ఆచరిస్తాడు కాబట్టి సన్న్యాసమూ అయింది యోగమూ అయింది. సన్న్యామంటే సన్న్యాసం - యోగమంటే యోగమది.

అయితే అర్జునుడెందుకు కంగారుపడ్డాడు. అతడు సన్న్యాసమంటే కర్మలనే సన్న్యసించట మనుకొన్నాడు. కర్మ ఫలమని భావించ లేదు. అలాగే కర్మ చేయటమంటే సంకల్పించి చేసే అనుష్ఠాన మనుకొన్నాడు. నిష్కామంగా సాగించే యోగమని భావించలేదు. అందుకే అతని భ్రాంతి పోగొట్టటానికే భగవానుడది ఇంతగా వివరించవలసి వచ్చింది. ఇది ఆయన చెప్పింది చెప్పినట్టు గ్రహించగలిగితే ఆ అర్జునుడే గాదు. ఈ నాడు మన బోటి అర్జునులం కూడా కర్మ విషయంలో సన్న్యాస విషయంలో ఇక మీదట భ్రాంతి పడం. ఎందుకంటే ఇప్పటికే లోకంలో చాలామంది కుంది ఈ

Dr Dayananda Swamy ebooks



అపోహ. సన్న్యాసమంటే అన్ని కర్మలూ ఎగగొట్టి కాషాయాలు కట్టుకొని పారిపోవటమని లేదా చేస్తే నిత్యనైమిత్తికకామ్య కర్మలన్నీ తూచా తప్పకుండా యాంత్రికంగా పాటిస్తూ అలా పాటించటం మూలంగా పరమ పవిత్రుల మయ్యామని - తాత్కాలికంగా నేడో రేపో స్వర్గానికి టిక్కెట్టు తీసుకొని పోయి అక్కడ దేవేంద్ర భోగాలను భవించగలమని.

ఇలాంటి అపోహ లన్నింటికీ ఇది ఒక పెద్ద అడ్డుకట్ట. కర్మ లెగగొట్టి సన్న్యసించినా రాదు - లేక గుడ్డిగా ఆచరించినా రాదు మోక్షం మానవుడికి. రెండూ రెండు కొసలు. కొసలలో కాదది. మధ్యే మార్గంలో ఉంది. ఫల త్యాగంతో కర్మ నొక యోగంగా ఆచరించి నప్పుడవి రెండూ కలిసి నిః శ్రేయస మనే ఒకే ఒక గొప్ప ఫలితమిస్తాయి. అది స్వర్గాది భోగాలు కాదు. ఉత్తమ జన్మ ప్రాప్తి గాదు. ఆత్మ జ్ఞాన రూపమైన నిఃశ్రేయసం. మోక్షమని అర్థం. దేని కంటే శ్రేయస్సు లేదో అది నిఃశ్రేయసం. ధర్మపురు షార్థం శ్రేయస్సే గాని నిఃశ్రేయసం కాదు. నిఃశ్రేయసం నివృత్తి ధర్మమైన మోక్షమొక్కటే. ఫలం గాని ఫలమది. ఆత్మ స్వరూప జ్ఞానమే మోక్షం. క్రొత్తగా పొందేది గాదది స్వర్గంలాగా. సిద్ధమైన దానిని గుర్తించటమే.

తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే. అంచేత తొందరపడి కర్మలు సన్న్యసించటమే సన్న్యాసమని పొరబాటుపడి ఎక్కడికీ పరుగెత్తి పోకు. అలా పరుగెత్తి పోతే ఇంటి కూటికీ దోవ కూటికీ చెడిపోతావు. కర్మా లేదు నీకు జ్ఞానమూ లేదు. రెంటికీ చెడ్డ రేవడివి నీవు. కాబట్టి

Dr Dayananda Swamy ebooks


కర్మలను వదిలేయటం కాదు నీవు చేయవలసింది. చేసే ప్రతి కర్మా నేను గాదు చేయటమని కర్తృత్వాన్ని వదిలేసి చేస్తుండు. అలాగే ఫలితం నాకు తప్పకుండా ప్రాప్తించాలనే భోక్తృత్వాన్ని కూడా మానేసి చేయి. అప్పుడా కర్మ యోగంగా మారి నీకు చిత్తశుద్ధి ద్వారా మోక్షఫలాన్నే ప్రసాదిస్తుంది. కనుక సన్న్యాసం కన్నా యోగం మేలు. తెలియక చేసే సన్న్యాసం కంటే తెలిసి చేసే యోగం నీకు ఫలప్రదం. ఇదీ పరమాత్మ బోధ మనకు.

**జ్ఞేయస్స నిత్య సన్న్యాసీ - యో న ద్వేష్టి న కాంక్షతి**

**నిర్ద్వంద్వో హి మహాబాహో - సుఖం బంధా త్ప్రముచ్యతే - 3**

అసలు సన్న్యాసమనే భావమింత దూరం వివరించి చెప్పినా ఇంకా మనలో చాలామందికి జిడ్డు వదలటం లేదు. పరిత్యాగమే సన్న్యాసమనే భ్రాంతిలో ఉన్నారు. విషయం తెలియకుండా పరిత్యజించి పోతే మాత్రం ప్రయోజన మేముందని ఆలోచించరు. చెబుతున్నది వినండి భగవద్గీత. జ్ఞేయస్స నిత్య సన్న్యాసీ. వదిలేసి పోయేవాడు గాదట సన్న్యాసి. వాడు సన్న్యాసేగాని నిత్య సన్న్యాసి కాదు. కాషాయం కట్టినా కట్టకున్నా కర్మ మానేసినా చేసి నా నిత్యమూ సన్న్యాసి అనిపించుకొనే మహానుభావు డొకడున్నాడు. ఎలా ఉంటాడు వాడు.

యోన ద్వేష్టి - న కాంక్షతి. వాడొకరిని ద్వేషించడు - ఒకరిని ప్రేమించడు. ఒకటి కావాలని కోరడు. అక్కరలేదని త్రోసి పుచ్చడు. రాగద్వేషాలు లేవు వాడికి. రాగద్వేషాలనేవి ఉపలక్షణం ద్వంద్వాల కన్నిటికీ.

Dr Dayananda Swamy ebooks


నిర్ద్వం ద్వోహి. అసలే ద్వంద్వాలూ లేవు వాడికి. సుఖదుఃఖాలూ లాభనష్టాలూ - పుణ్యపాపాలూ మా నావమానాలూ. ఇలాటి వేవీ వాడు దరిదాపులకు రానీయడు. అయితే ఎలా బ్రతుకుతాడని అడుగుతావా. ప్రారబ్ధవశాత్తూ ఎప్పుడేది లభిస్తే దానితోనే జీవయాత్ర సాగిస్తుంటాడు. అందని ద్రాని పండ్ల కర్రులు చాచడు. చేతికందిన దానిని జారవిడవడు. యదృచ్ఛా లాభ సంతుష్టుడు వాడు.

ఇది కర్మయోగ మిచ్చిన బలం వాడికి. కనుకనే వాడు యోగే గాక సన్న్యాసి కూడానని ప్రశంసిస్తున్నది గీత. ప్రశంస మాత్రమే గాదు. యధార్థం కూడా. ఎందుకంటే ప్రశంస మాత్రమే అయితే ఫలితం కలుగుతుందని గారంటీ లేదు. నీ విం(ద్రుడు చంద్రుడన్నంత మాత్రాన ఆ రాజుగా రింద్రుడూ కాడు చంద్రుడూ కాడు. కేవల మది పొగడ్త మాత్రమే. అలాంటిది కాదిక్కడ ఫలితం కూడా కలిగి తీరుతుంది. ఏమిటది. సుఖం బంధా త్ప్రముచ్యతే. సంసార బంధం నుంచి అనాయాసంగా బయటపడతాడు వాడు. కర్మయోగం సత్త్వశుద్ధి నిస్తే అది కర్మఫల సన్న్యాసానికి దారితీస్తే - తద్ద్వారా ఏకాగ్రత ఏర్పడితే - దానివల్ల శ్రవణ మననాదులు సాగిస్తే - చివర కన్నింటికీ పర్యవసానంగా మోక్ష సామ్రాజ్యానికే పట్టాభిషిక్తుడు కాగలడు. కనుక నిత్యసన్న్యాసి కర్మయోగేనని జ్ఞేయః గ్రహించాలి మనం.

Dr Dayananda Swamy ebooks



**సాంఖ్యయోగౌ పృథ గ్బాలాః - ప్రవదంతి న పండితాః**

**ఏక మ ప్యాస్థిత స్సమ్య - గుభయో ర్విందతే ఫలమ్ - 4**

ఇప్పు డున్నట్టుండి పేర్లు మార్చి పారేస్తున్నాడు పరమాత్మ. సాంఖ్యయోగౌ అని మరి రెండు కొత్త మాటలు పట్టుకు వచ్చాడు. సన్న్యాసం కర్మయోగమని చెబుతూ చెబుతూ ఈ మాటలేమిటి. పరవాలేదు. ఇందులో సాంఖ్యమనే మాట సన్న్యాసమే. యోగమనే మాట కర్మయోగమే. మరేవో గావు. పిల్లీ మార్జాల మన్నట్టు రెండూ ఒకటే. ఇంతకూ ఆయన మనకు చెప్పదలచిన విషయమేమిటి. సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి - నపండితాః - సన్న్యాస కర్మ యోగాలు రెండింటినీ వేరుగా చూస్తున్నారు చెబుతున్నారు చాలామంది లోకంలో. అలా చూచే వారందరూ బాలాః - మూఢులు. ఏమీ తెలియని అజ్ఞానులట. మరి జ్ఞానులెవరు. న పండితాః అలా వేరుగా గాక రెండూ ఒకటేనని గ్రహించిన వారెవరో వారే పండితులట.

రెండూ ఒకటే ఎలా అవుతాయని అడిగితే రెండూ చివరకు మనకందించే ఫలమొకటే గదా అంటారు భగవత్పాదులు. జ్ఞానానికొక ఫలం కర్మకొక ఫలమంటూ వేరుగాలేవు. రెండూ కలిసి ఒకే ఒక మోక్ష ఫలాన్ని మన కిస్తున్నాయి. కర్మయోగం జ్ఞానం ద్వారా ఇస్తే - జ్ఞానం సాక్షాత్తుగా అందిస్తుంది. ఒకే మార్గంలో మొదటి మజిలీ యోగం. రెండవ మజిలీ జ్ఞానం. మొదటిది ఉపాయం. రెండవది ఉపేయం. ఉపాయ

Dr Dayananda Swamy ebooks



ముపేయాని కందిస్తే - ఉపేయం మోక్షాని కందిస్తుంది. ఇదీ వరస. ఇదంతా చివరకు మోక్షంతో సమాప్త మవుతున్నది. కనుక ఫలదృష్ట్యా కర్మా జ్ఞాన మొక్కటే. తేడా లేదు. ప్రయాణంలో రెండుగా కనిపించినా పర్యవసానంలో రెండు గావవి. ఒక్కటే తత్త్వం.

ఏక మప్యాస్థిత స్సమ్య - గుభ యోర్విందతే ఫలమ్ - వాటిలో ఏ ఒక్కటైనా చక్కగా మనసు పెట్టి దీక్షగా ఆచరిస్తూ పోతే చాలు. రెండింటి ఫలితమూ పొందవచ్చు. రెండింటికీ ఫలితం మోక్షమది ఒక్కటే. అది కర్మయోగం చక్కగా ఆచరించచినా లభిస్తుంది. జ్ఞానమభ్యసిస్తూ పోయినా ప్రాప్తిస్తుంది. అయితే ఒకటి జ్ఞానం ద్వారా ఇస్తుందా ఫలితం. ఇంకొకటి సరాసరి ఇస్తుందది. ఎలా ఇచ్చినా మోక్షం మోక్షమే. అందులో తారతమ్యం లేదు.

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం - తద్యోగైరపి గమ్యతే**

**ఏకం సాంఖ్యంచ యోగంచ - యః పశ్యతి సపశ్యతి - 5**

అందుకే సాంఖ్యమనీ యోగమనీ పేరేగాని రెండూ ఒకటే. సాంఖ్యులైన వారికే స్థానం లభిస్తుందో చివరకు కర్మయోగులకు కూడా అదే దక్కుతుంది. యత్సాం ఖ్యైః ప్రాప్యతే స్థానం - తద్యోగైరపి గమ్యతే అంటే అర్థమిది. స్థానమంటే ఫలమిక్కడ. ఏమిటది. మోక్షమని ఇంతకు ముందే వర్ణించాడు. అయితే ఒకచోట సన్న్యాసమని ఒకచోట యోగమని అంటాడేమిటి పరమాత్మ. మాట మార్చటంలో ఉద్దేశమేమిటి. ఏ ఉద్దేశమూ లేదు. రెండూ ఒకటే. ఒక దానికొకటి పర్యాయ పదాలు **Synonymns**

Dr Dayananda Swamy ebooks



ఇంతెందుకు. సాంఖ్యం - జ్ఞానం - సన్న్యాసం - ఇవి మూడూ ఒకటి. కర్మ - కర్మ యోగం - యోగం ఇవి మూడూ ఒకటి. అందుకే మార్చి మార్చి వాడుతుంటుంది భగవద్గీత వీటిని. మనం మాత్రం గాబరా పడగూడదు. పిల్లి మార్జాలం బిడాలమనే మాటలు విని కంగారు పడతామా. మూడూ కలిసి చెప్పే అర్థమొక్కటే నని గ్రహించినప్పుడు సందేహమేముంది అలాగే ఇదీ.

ఇంతకూ కర్మయోగం జ్ఞానయోగమే నన్నమాట సాంఖ్యయోగాలంటే. వాటి రెండింటికీ ఫలిత మొక్కటే - అది మోక్ష మంటున్న దిప్పుడు గీత. అయితే జ్ఞానాన్ని వదిలేసి కర్మయోగం పట్టుకొంటే సరిపోతుందా. అలాగే కర్మయోగాన్ని మానేసి జ్ఞానయోగంతో సరిపుచ్చుకోవచ్చా - అని ప్రశ్న వస్తుంది. అలా కాదు. జ్ఞాన ముదయించాలంటే కర్మయోగం కావాలి. కర్మ శిక్షణ - జ్ఞాన ముద్యోగం. శిక్షణ పొందితే గాని ఉద్యోగం దొరకదు. కాబట్టి కర్మ సాధనం జ్ఞానానికి. అది లేకుండా ఇది రాదు. దాని అవసరముంది దీనికి. అలాగే జ్ఞాన ముదయించిన తరువాత మోక్షం లభిస్తుంది గదా ఇక కర్మ దేనికి అంటే - అప్పుడు జ్ఞానికి కూడా కావలసి ఉంది కర్మ. ఎందుకని. జ్ఞానికింకా శరీరమనే ఉపాధి ఉంది గదా. ఉపాధి ఉన్నంతవరకూ కర్మ తప్పదు.

అయితే జ్ఞాన ముదయించి ఏమి సుఖమని అడగవచ్చు. అది జరుగుతున్నా దాన్ని వాడు జ్ఞానదృష్టితో చూస్తుంటాడు. కాబట్టి బంధకం కాదు వాడికి. మీదు మిక్కిలి జ్ఞానే పరిసమాప్యతే అని భగవానుడే చెప్పినట్టు

Dr Dayananda Swamy ebooks



ఎప్పటికప్పుడు లయమవుతూ పోతుంది జ్ఞానంలో. అయితే అప్పుడిక కర్మ జ్ఞాన మనే తేడా లేదు. అంతా జ్ఞానాత్మకంగానే అనుభవానికి వస్తుంది. జ్ఞానం తన స్వరూపంగా **Essence** కర్మ దాని విభూతిగా **Expansion** దర్శన మిస్తుంటుంది. ఇది జ్ఞానకర్మ సముచ్చయమని భ్రాంతి పడరాదు మరలా. అది అనుష్ఠాన రూపమైన కర్మ. ఇది కేవల మను ష్ఠానం కాదు. యోగం. అంటే జ్ఞానం కోసం చేసేదొకటి - జ్ఞాని అయి చేసేదొకటి. రెండు విధాలీయోగం. జ్ఞానం కోసం చేసేది ప్రయత్నం. అదీ యోగమే. జ్ఞాని అయి చేసేది ప్రవర్తన. అదీ యోగమే. ఇందులో ఏదీ జ్ఞానాని కడ్డు తగలదు. అసలవి రెండూ కలిసి కాపురం చేస్తేగదా. జ్ఞానం కోసమని చేసే కర్మయోగం జ్ఞానోదయానికి పూర్వం కాబట్టి అక్కడా అవి రెండూ కలవటానికి వీలులేదు. పోనీ జ్ఞానానంతర మంటారా. అప్పుడా జ్ఞాని చేసే ప్రతి కర్మా జ్ఞాన మయమై పోతుంది కాబట్టి జ్ఞానానికి వేరుగా కర్మ కనపడనే కనపడదు. ఇక అప్పుడూ కలిసే ప్రసక్తి లేదు. కనుక అహం మమలు వదలని అనుష్ఠాన కర్మ నుద్దేశించి చెప్పిన మాట జ్ఞానకర్మ సముచ్చయం. యోగరూపమైన కర్మను గాదు.

అంచేత ఏకం సాంఖ్యంచ యోగంచ - సాంఖ్యమూ యోగమూ - అంటే అర్థం-జ్ఞానమూ కర్మ. రెండూ ఏకమే ఒక్కటే. తేడా లేదని భావించాలి. అలాచూడాలి. యః పశ్యతి. ఎవడయితేఅలా చూడగలడో. పశ్యతి. వాడే చూపు బాగా పనిచేస్తున్నవాడు. మనమూ చూస్తున్నాము

Dr Dayananda Swamy ebooks



గదా వాడే చూస్తాడని చెప్పటమేమిటి. మనమూ చూస్తున్నాము నిజమే.కళ్లతో చూస్తున్నాము మనము. చూస్తే ఏమి కనిపిస్తుంది.ఈ ప్రపంచం. అది అనాత్మే గాని ఆత్మ గాదు. మరి ఆత్మ ఏమిటి. సత్తాసామాన్యం. అంతా అలికేసినట్టు ఆకాశంలాగా నిరాకారంగా వ్యాపకంగా కనపడాలి. అదీ సామాన్యం. ఇది ఫలానా అది ఫలానా అని విశేషంగా కనపడగూడదు. అలాంటప్పుడది జ్ఞానం ఇది కర్మ అది అచలం ఇది చలనం అని తేడా ఎలా చూడగలిగావు. అలా చూస్తే అది చూపుగాదు మాదృష్టిలో. ఫలానా అని విశేషాకారంగా కాక అన్ని విశేషాలనూ కరగదీసి సామాన్యంగా మార్చుకొని ఏకంగా చూడాలి. అదే మేము చూపని చెప్పటం. నిర్వికల్పమైన దృష్టి ఇది. లోకులు భావించే సవికల్ప దృష్టి కాదు. ఫలైకత్వాత్ సపశ్యతి సమ్యక్పశ్యతి అని అర్థం వ్రాస్తున్నారు గురువుగారు. మార్గంలో రెండుగా కనిపించినా ఫల సిద్ధిలో ఏకమే కర్మ జ్ఞానాలు.

ఇక్కడ ఇంకొక సూక్ష్మమున్నది మనం గుర్తుంచుకోవలసింది. లోకే స్మిన్ ద్వివిధానిష్ఠా జ్ఞాన యోగేన సాంఖ్యానామ్ – కర్మ యోగేన యోగినా మని ఇద్దరికీ రెండు విభక్తం చేసి చెప్పాము మార్గాలని ముందు వర్ణించాడు భగవానుడు. ఇప్పుడేమో రెండు కావవి రెండూ ఒకటిగా చూడాలంటు న్నాడు. రెండు మాటలూ ఒకదాని కొకటి విరుద్ధంగా లేవా అనిపించవచ్చు. విరుద్ధంకావు వాస్తవం. ఎందుకంటే ఉపాయంగా ఒకటి ఉపేయంగా ఒకటీ చెప్పాడక్కడ. అందుకోసం రెండుగా వేరు చేసి చూపవలసి వచ్చింది.

Dr Dayananda Swamy ebooks



పోతే ఇక్కడ అలాకాదు. రెండూ కలిసి ఇచ్చే ఫలితం చివర కొక్కటే అది ఒక్కటి. అంచేత ప్రయత్న దృష్ట్యా వేరయినా ఫల దృష్ట్యా వేరుకావు - ఏకమే నని చెప్పవలసి వచ్చింది. ప్రయత్నం ఫలితంలో కలిసి వస్తుంది. కాబట్టి ఎప్పుడూ ఏకమే తత్త్వం. అందుకే ద్వివిధానిష్ఠా అని ఏకవచనంలోనే ప్రయోగించాడు నిష్ఠా అనే మాట. రెండు నిష్ఠలు కావవి. ఒకే నిష్ఠ. దానికి రెండు భూమికలు **Stages.** అదీ ద్వివిధా అంటే.

**సన్న్యాసస్తు మహాబాహో - దుఃఖ మాప్తు మ యోగతః**

**యోగయుక్తో ముని ర్బ్రహ్మ - నచిరేణాధి గచ్ఛతి - 6**

ఈ రహస్యాన్నే ఇంకా చక్కగా వివరించి చెబుతున్నది గీత. సన్న్యాసస్తు మహాబాహో సన్న్యాసమంటే ఏమను కొంటున్నావు నీవు. అది జ్ఞానం. సవికల్పం కాదు. నిర్వికల్పమైన ఆత్మజ్ఞానం. అది ఊరక వచ్చి ఒళ్లో బడుతుందను కొంటున్నావా. మామూలు జ్ఞానమే పడదలా. ఇక అన్ని పదార్థాల లోపలా వెలపలా వ్యాపించి ఉన్న సామాన్య జ్ఞానమెలా సిద్ధిస్తుంది. అయితే మరి ఎలా కలుగుతుం దంటారు. ఏదైనా ప్రయత్నిస్తేనే ఫలితం. ప్రయత్నం లేకుండా ఫలమేర్పడే ట్టయితే అందరమూ మూకుమ్మడిగా ముక్తులమయి పోవచ్చు. ఏదీ ఎవరి కున్నదా అనుభవ మిప్పుడు. దుఃఖ మాప్తు మయోగతః - అయితే మరెందుకు లేదు. ప్రయత్నం లేక.

ఏమిటా ప్రయత్నమని అడుగుతావా. కర్మయోగం. కర్మయోగ ముపాయం. అహం మమలు వదిలేసి చేసే ప్రతి కర్మాయోగమే. అది

Dr Dayananda Swamy ebooks



ప్రయత్న పూర్వకంగా ఆచరించకపోతే దుఃఖ మాప్తుం - జ్ఞాన భూమిక నందుకోట మసాధ్యం. అయితే అది ఎప్పుడు సాధ్యపడుతుందని అడుగుతావా. యోగయుక్తః - వైదికేన కర్మ యోగేన ఈశ్వర సమర్పిత రూపేణ ఫలనిరపే క్షేణ యుక్తాః అని వ్యాఖ్యానిస్తున్నారు భగవత్పాదులు. ఏకర్మ అయినా చేయి. ఈశ్వరార్పణ బుద్ధితో ఫలనిరపేక్షంగా చేస్తే అది యోగం. దాన్ని పాటిస్తూ పోయేవాడు యోగయుక్తుడు. అలాంటివాడే మునిః - మనన శీలుడు. ఈశ్వర స్వరూపాన్ని ఎప్పుడూ మనసుకు తెచ్చుకొంటూ తదేక భావన కలిగి ఉంటాడు.

బ్రహ్మ నచిరేణ అధిగచ్ఛతి. వాడు బ్రహ్మాన్ని అందుకోగలడు. అలా అందుకోటానికి కూడా ఎంతోకాలం పట్టదు. నచిరేణ అనతి కాలంలోనే శీఘ్రంగానే సాధించగలడు. బ్రహ్మమేమిటి. బ్రహ్మ స్వరూపమా - మోక్షమా - అని ప్రశ్న వస్తే స్వామివారు వివరణ ఇస్తున్నారు శబ్దానికి. కర్మయోగి పొందే బ్రహ్మం మీరూమేమూ ఊహించే పరమాత్మ కాదు. సన్న్యాసస్తు మహాబాహో అని ఇంతకు ముందే పేర్కొన్నాడే అది. ఏమిటది జ్ఞానం. పరమార్ధ జ్ఞాన నిష్ఠా లక్షణ మని అర్ధం చెప్పారు. న్యాస ఇతి బ్రహ్మే - బ్రహ్మోహి పరః అని శ్రుతి వాక్యాన్ని కూడా ఉదాహరిస్తాడీ సందర్భంలో ఆయన. ఇంతకూ కర్మయోగం బాగా పాటిస్తూ పోతే ఆ శిక్షణ ఫలిస్తే తత్ఫలితంగా కర్మయోగి అందుకొనే పదం పరమార్ధ జ్ఞానమని పేర్కొంటారు స్వామివారు. కర్మజ్ఞానానికీ జ్ఞానం మోక్షానికీ దారి తీస్తుంది. ఇదీ వరస. అంటే కర్మజ్ఞానం ద్వారా మోక్షమనే ఫలితమిస్తుంది గాని స్వతంత్రంగా

Dr Dayananda Swamy ebooks



కాదని అర్థం చేసుకోవా లంటారాయన. అందుకే యోగయుక్తో మునిర్బ్రహ్మ అధిగచ్ఛతి అంటే బ్రహ్మ శబ్దానికి పరమాత్మ అని గాక పరమాత్మ జ్ఞానమని అర్థం చెప్పవలసి వచ్చిందాయన.

**యోగ యుక్తో విశుద్ధాత్మా - విజితాత్మా జితేంద్రియః**

**సర్వభూతాత్మ భూతాత్మా - కుర్వన్నపి న లిప్యతే - 7**

కర్మయోగం జ్ఞాన యోగాని కుపాయమనే మాటి మాటికీ చాటి చెబుతున్నది. ఇంతకు ముందూ వచ్చిందీ మాట. ఇప్పుడూ వచ్చింది. స్వామి వారు వ్రాస్తున్నారు. యదాపునరయం సమ్యగ్ జ్ఞాన ప్రాప్త్యు పాయత్వేన అని. సమ్యగ్ జ్ఞానోదయ మేర్పడాలంటే దానికి పూర్వ రంగం కర్మ యోగమే మరేదీ కాదంటున్నా రాయన. అలాంటి కర్మయోగ మవలంబించి కొంత కాలం శిక్షణ పొందితే విశుద్ధాత్మా దానివల్ల విశుద్ధ మవుతుంది వాడి ఆత్మ.

ఆత్మ విశుద్ధం కావట మేమిటి. ఆత్మ అంటేనే శుద్ధమైనది గదా. శుద్ధమైన దొకటీ అశుద్ధమైన దొకటీ రెండున్నాయా ఆత్మలు. శుద్ధే కావలసి వస్తే అసలది ఆత్మ ఎలా అయింది. కాకపోయినా సాకారమూ పరిచ్ఛిన్నమూ అయితే గదా శుద్ధి పొందటానికి. ఆత్మ అంటే అది జ్ఞాన స్వరూపం. జ్ఞానాని కాకార మంటూ లేదు. ఆకాశం లాంటి దది. ఆకాశం లాగే వ్యాపకం కూడా. నిరాకారమే వ్యాపిస్తుంది గాని సాకారమైన దెప్పుడూ వ్యాపించదు. ఆకాశమే అలాంటి దయినప్పుడు దానికి కూడా సాక్షియైన

Dr Dayananda Swamy ebooks



ఆత్మ ఏమిటి. శుద్ధం కాకపోవట మేమిటి. నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావమని గదా వర్ణించింది శాస్త్రం దాన్ని. అలాంటప్పుడు విశుద్ధాత్మా అనే మాట కర్థమేమిటి.

ఇదుగో ఇక్కడే మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆత్మా ఆత్మ అని చాలాసార్లు వస్తున్నదామాట ఈ శ్లోకంలో. ఇదే గాదు. ఇక మీదట కూడా ఉద్ధరేదాత్మ నాత్మానం – బంధురాత్మా త్మనస్తస్య – యేనాత్మైవాత్మనా జితః – పదేపదే ఈ మాట మనకు భగవద్గీత నూరి పోస్తూనే ఉంటుంది. ఇన్నిమార్లు పునరుక్తి చేస్తున్నదంటే దానికి మనమనుకొన్న అర్థం ఒక్కటే అర్థమనుకొంటే సుఖం లేదు. గీతాచార్యుడి దృష్టిలో ఆత్మ అనేదొకటి గాదు. చాలా ఉన్నాయి. అదేమిటి ఇన్ని ఆత్మ లెక్కడి నుంచి వచ్చాయని మనమాశ్చర్య పడనక్కరలేదు. వాస్తవంలో ఇన్ని లేవు. ఉన్నదొకే ఒక ఆత్మ. కాని అలాటి జ్ఞానమున్న వాడికే అది ఏకమనే సత్యం బోధపడు తుంది. అది లేని అజ్ఞానుల దృష్టికా ఒక్క ఆత్మే అనేక రూపాలు ధరించి ఎన్నో ఆత్మలుగా దర్శన మిస్తుంటుంది. అనాత్మను కూడా ఒకడాత్మ అని భ్రమించవచ్చు. దానికే భూతాత్మ అని పేరు. ఒకడీ దేహమే ఆత్మ అనుకోవచ్చు. ఇంకొకడికి బుద్ధే ఆత్మ. విజ్ఞానాత్మ అని పేరు దానికి. ఇంకొకడి దృష్టికి కర్తా భోక్తా అయిన జీవుడే ఆత్మగా భాసిస్తుంటాడు. అదే జీవాత్మ. ఇవన్నీ ఆత్మాభాసలే గాని అసలైన ఆత్మకాదు. అసలైన ఆత్మ ప్రత్యగాత్మ. అది వీటిన్నిటికీ సాక్షి. కేవల జ్ఞానమే అది జ్ఞాతా కాదు

Dr Dayananda Swamy ebooks



జ్ఞేయమూ కాదు. జ్ఞాతే అయితే జీవాత్మ అవుతుంది. జ్ఞేయమైతే భూతాత్మ అవుతుంది. అవన్నీ ఆత్మచేత గ్రహించబడేవి గాని గ్రహించేది గాదు. గ్రహించేది కూడా కాదా మాటకు వస్తే. కేవల గ్రహణమాత్రమే. స్ఫురణ మాత్రమే **Pure consciousness**.

మరి అలాంటప్పుడు శాస్త్రం కూడా ఎందుకిన్ని ఆత్మలను వర్ణించి చెప్పటం. అది తన దృష్టితో కాదు. లోకదృష్టి ననుసరించి చెబుతున్నది. మీరెక్కడి కక్కడ చూచి అదే ఆత్మ అని భ్రమ పడుతున్నారు. అందుకే అసలైన ఆత్మఏదో మరుగుపడి పోయింది మీదృష్టికి. కనుక వీటన్నిటినీ శోధించి లోలోపలికి వెళ్లి చూడండి. అప్పుడసలైన ఆత్మ ఏదో మీకు ప్రకటమై కనిపిస్తుందనే సత్యాన్ని బయట పెట్టటాని కిన్ని అసద్రూపమైన ఆత్మల నుదాహరిస్తున్నది గీతా శాస్త్రం.

కాబట్టి విశుద్ధాత్మ అంటే విశుద్ధ సత్త్వః అని అర్థం వ్రాశారు గురువుగారు. సత్త్వమంటే అంతః కరణం. అది నీవు ఆత్మ అని గ్రహిస్తున్నావు. అది కాదు ఆత్మ. దాన్ని బాగా శుద్ధి చేసుకొని చూడు అని బోధిస్తున్నది గీత. శుద్ధి చేసుకొంటే ఏమవుతుంది. విజితాత్మా అంటున్నది గీత. ఇక్కడ ఆత్మ అంటే దేహమని అర్థమట. మనస్సు శుద్ధి చెంది నీకు స్వాధీనమయితే దేహం కూడా నీవు చెప్పిన మాట వింటుంది. అవి రెండూ ఎప్పుడు నీవశంలో ఉంటాయో ఇక ఇంద్రియాల దేముంది. జితేంద్రియః - దశేంద్రియాలూ నీ చెప్పుచేతలలో ఉండక తప్పదు.

మనః ప్రాణదేహేంద్రియా లధీన మవుతాయంటే దేని కధీనం. ఆత్మకు. ఆత్మ కధీన మవటమంటే ఆత్మ వేరుగా ఎక్కడో ఉండి ఇవి వీటి

Dr Dayananda Swamy ebooks

పాటికివి ఎక్కడో ఉండి అది చెప్పిన మార్గంలో ఇవి నడుచుకొంటాయని గాదు మరలా. ఈ అనాత్మ ప్రపంచమంతా దానికతిరిక్తంగా ఎక్కడో ఉంటే గదా. ఇదం సర్వం యదయమాత్మా . ఈ కనిపించేదంతా వస్తుతః-ఆత్మేనని చాటుతున్న దుపనిషత్తు. అలాంటప్పుడివి దానికి వేరుగా ఎక్కడున్నాయి. కేవలమస్తి భాతి అని జ్ఞానంతో చూస్తే ఎక్కడాలేవివి. ఆత్మ గానే మారి పోయాయి.పోతే అప్పుడాత్మ అనాత్మ అనే విభాగం చెరిగిపోయి అంతా ఆత్మే వ్యాపిస్తుంది. కాబట్టి సర్వ భూతాత్మ భూతాత్మా. సమస్త భూతాలకూ ఆత్మ భూతమవుతాడు జ్ఞాని. సర్వేషాం బ్రహ్మాదీనాం స్తంబ పర్యంతానాం భూతానాం ఆత్మ భూతః ఆత్మా ప్రత్యక్షతయా యస్య అని విరిచి అర్థం చెప్పారు భగవత్పాదులు. లోకంలో కనిపించే అన్ని చరాచర పదార్థాలూ ఉపాధులైతే ఆ ఉపాధుల రూపంలో కనిపిస్తున్నది తన ఆత్మ చైతన్యం గానే దర్శిస్తాడు జ్ఞాని. అనాత్మ తన విభూతి **Expansion.** ఆత్మ తన స్వరూపం **Substance.** సముద్రానికి జలం స్వరూపమైతే తరంగ బుద్బుదాదులు దాని విభూతి. అవి ఆ జలాని కంటే భిన్నంగా లేవుకదా. అలాగే చైతన్యానికి భిన్నంగా మరేదీ లేదీ సృష్టిలో. శరీరమనః ప్రాణాదులూ లేవు. బాహ్యామైన వస్తుజాలమూ లేదు.

అలాంటప్పు డిక ఆత్మ కద్ద మేముంది. అడ్డమీ నామరూపాలే దానికి. అవి కూడా ఇప్పుడాత్మగానే దర్శిస్తున్నాడు. కాబట్టి జ్ఞాని - కుర్వన్నపి నలిప్యతే. వాడే పని చేసినా దానిఫలితం వాడినంటదు. ఆ కర్మ -దాని ఫలమూ - అవి రెండూ కూడా ప్రపంచంతో పాటు తన స్వరూపంగానే మారి పోయాయి వాడికి. ఇక కర్మేమిటి. కర్మఫల మేమిటి. అంటట

Dr Dayananda Swamy ebooks

మేమిటి. ప్రతి వాడి ఆత్మా వాడి ఆత్మే. ప్రతి వాడూ అనాత్మగా భావించేది కూడా వాడికాత్మే. ఆత్మ తప్ప అనాత్మే లేదు వాడి దృష్టిలో. ఇక బంధమేముంది. అంతా మోక్షమే. ఇందులో కుర్వన్ అన్నప్పుడు కర్మ. నలిప్యతే అన్నప్పుడు జ్ఞానం. కర్మ సాగుతున్నా అది జ్ఞానమే. జ్ఞానం సాగితే కర్మ. కర్మ ఆగితే అది జ్ఞానం. రెండూ చెట్టపట్టాలు పట్టుకొని పక్క పక్కనే నడుస్తుంటాయి. రెండుగా గాదు. ఒకటిగా.

**నైవకించి త్కరోమీతి - యుక్తోమన్యేత తత్త్వవిత్**

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ - అశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ - 8**

**ప్రలప న్విసృజన్ గృహ్ణన్ - ఉన్మిష న్నిమిషన్నపి**

**ఇంద్రియాణీంద్రి యార్థేషు - వర్తంత ఇతిధారయన్ - 9**

అసలు కర్మ జ్ఞాన మని ఎందు కంటున్నావు నీవు.రెండున్నాయా వాస్తవంగా. రెండు లేవసలు. ఉన్న దొక్క జ్ఞానమే. అదే కర్మగా భాసిస్తున్నది. జ్ఞానం వస్తువైతే కర్మ అనేది దాని ఆభాస. జలం వస్తువు తరంగ మాభాస. ఆ భాస వస్తువు కంటే అన్యంగా లేదు. జలమే తరంగ రూపంగా చలిస్తుంటే దాన్ని కర్మ అన్నావు.చలించకపోతే జ్ఞానమన్నావు. చలించకుంటేనే గాదు. తరంగ రూపం ధరించినా ఆ ధరించింది జలమే. కాదని తీరం దాకా పోతున్నా ఆ పోతున్నదీ జలమే. అలాగే జ్ఞానం ధరించిన అవతారాలే నామరూపాలు. వాటి ద్వారా ఏర్పడుతున్న క్రియలు కూడా జ్ఞానం చేస్తున్న క్రియే. అప్పటికి తరంగమూ దాని చలనమూ జలాని కన్యంగా లేనట్టే -

Dr Dayananda Swamy ebooks


ఆ యా చరాచర పదార్థాలూ - వాటి కదలికలూ కూడా జ్ఞానానికి వ్యతిరిక్తంగా లేవు.

లేవు గనుకనే కదలకున్నా జ్ఞానమే. కదలినా అది జ్ఞానమే. ఎటు వచ్చీ ఇలాంటి అఖండ జ్ఞాన దృష్టి బలంగా ఉండాలి సాధకుడికి. ఉంటే వాడే పని చేస్తున్నా చేయని వాడే. నైవ కించిత్కరోమీతి. నేనే పనీ చేయటం లేదనుకోవాలట. ఎవడు. యుక్తోమన్యేత తత్త్వవిత్. అసలైన ఆత్మ స్వరూపమేదో గుర్తించినవాడు. ఎలా గుర్తిస్తాడు. యుక్తః - కర్మయోగం పరిపాకానికి వస్తే. అప్పుడు ఆ జ్ఞానం వాడి కారూఢమవుతుంది. ఆ రూఢమైతే వాడు చేసే ఏ కర్మా కర్మ గాదు . జ్ఞానమే.

ఏ కర్మా అంటే ఏమిటర్థం. ఎన్నో ఉన్నాయి ప్రతి దినమూ ప్రతి క్షణమూ మానవుడు చేసే కర్మలు. అవి శాస్త్రోక్తమే కానక్కరలేదు. సహజంగా సాగి పోయే లౌకిక కర్మలు కూడా. శారీరక కర్మలు కూడా. మనోవాక్కా యాలలో ఏ కదలిక కలిగినా అది కర్మే. జ్ఞాని అయిన వాడు తన దిన చర్యలో ఎప్పుడెలాటి కర్మ జరుగుతున్నా అది తాను చేశానని చేస్తున్నానని భావించరాదు. ఏమిటది. ఎలాంటిది. వర్ణిస్తున్నాడు పశ్యన్ చూస్తున్నా. శృణ్వన్ వింటున్నా - స్పృశన్ తాకుతున్నా - జిఘ్రన్ - మూర్కొంటున్నా - అశ్నన్ తింటున్నా - గచ్ఛన్ నడుస్తున్నా స్వపన్ నిద్రిస్తున్నా - శ్వసన్ - గాలి పీలుస్తున్నా వదులుతున్నా ప్రలపన్ - మాటాడుతున్నా - ఉత్సృజన్ - మల మూత్రాదులు విసర్జిస్తున్నా - గృహ్ణన్

Dr Dayananda Swamy ebooks


- పట్టుకొంటున్నా - ఉన్మిష న్నిమిషన్నపి - కండ్లు మూస్తున్నా తెరుస్తున్నా ఇలాంటివీ కర్మలంటే.

ఇందులో చూడండి. శరీరానికి చెందిన వున్నాయి. ప్రాణానికీ ఇంద్రియాలకు చెందినవీ ఉన్నాయి. గృహ్ణన్ అనటంలో మనస్సుకు సంబంధించిన కర్మలూ ఉన్నాయి. బాహ్య ప్రపంచంలో శబ్ద స్పర్శాదులతో సంబంధం లేకుండా అవి ఏర్పడవు కాబట్టి ఇటు పిండాండమే గాక అటు బ్రహ్మాండం కూడా కలిసి వస్తున్నాయి ఈ జాబితాలో. అందులో కూడా శాస్త్రీయమూ లౌకికమూ అనే విభాగం చూపకుండా ఏకరువు పెట్టింది. కాబట్టి గీత అనాత్మ క్షేత్రంలో జరిగే ప్రతి చలనమూ కర్మగానే భావించి చెబుతున్నట్టుంది.

ఇప్పుడీ కర్మలన్నీ ప్రతిక్షణమూ జరుగుతుంటే ఆ జరుపుతున్నది నేను అని తన మీద కర్తృత్వం పెట్టుకో గూడదు జ్ఞాని. కర్తృత్వం పెట్టుకొంటే భోక్తృత్వం కూడా తన మెడకే చుట్టుకొంటుంది. అప్పుడు తాను తత్త్వవేత్త అనిపించుకోలేడు. అయితే ఒక ప్రక్క పశ్యన్ శృణ్వన్ అని తానే చేస్తూ తనకు కర్తృత్వం లేదని భావించట మెలాగా. తాను గాక ఆ పనిచేస్తున్న దెవరంటారు. ఎవడో చెబుతునప్పుడు గీత. ఇంద్రియాణీంద్రి యార్థేషు వర్తంత ఇతి. ఆయా ఇంద్రియాలాయా ఇంద్రియ విషయాలలో ప్రవర్తిస్తున్నాయని భావిస్తుండాలట మనం. ఇంద్రియాలంటే చక్షురాదులైన జ్ఞానేంద్రియాలూ - వాగాదులైన కర్మేంద్రియాలూ - రెండు జాతులు. అంతేకాదు. అంతరింద్రియాలైన మనః ప్రాణాలు కూడా. అప్పటికి మనలో కలిగే ప్రతి కదలికా మనం చేస్తున్నది గాదు. మనమంటే మన ఆత్మ. అది పరిశుద్ధమైన చైతన్యం. అందులో ఏ కర్మా లేదు. అది కేవలం జ్ఞానం.

Dr Dayananda Swamy ebooks



పోతే కర్మ ఏమిటిక. దాన్ని సాగిస్తున్న దేది. మన ఇంద్రియాలూ - వాటి చుట్టూ ఉన్న ఇంద్రియార్థాలూ. ఇవి రెండూ త్రిగుణాత్మకాలు. వాటిలో జరుగుతున్నది కర్మ. అది ఒక దానితో ఒకటి లావాదేవీ పెట్టుకోటమే కర్మ.

అవి లేకపోతే కర్మ లేదు. ప్రకృతి గుణాలు లేకపోతే అవి లేవు. ప్రకృతి లేకపోతే గుణాలు లేవు. చైతన్యమనే సాక్షి లేకపోతే ప్రకృతి లేదు. చైతన్య శక్తే ప్రకృతి. శక్తి శక్తిమతో రభేదః అని సిద్ధాంతం. శక్తి అనేది జడం కాబట్టి స్వతస్సిద్ధం కాదు. స్వతస్సిద్ధం చైతన్య రూపమైన ఆత్మే. కనుక ఇంతకూ తేలిందేమిటి. ఆత్మ కన్నా దాని శక్తి వేరుగాదు. శక్తి కన్నా దాని గుణాలు వేరుగావు. ఆ గుణాల కన్నా మనః ప్రాణాదులూ - వాటికి గోచరించే విషయ ప్రపంచమూ వేరుగాదు. అదే వేరు గాకపోతే వాటిలో కలిగే చలనమంత కన్నా భిన్నం కాదు. అంటే ఏమన్న మాట. జ్ఞానమే చివరకు కర్మగా మనకు దర్శన మిస్తున్నది. అచలమే చలం గనుక ఈ చలాన్ని మరలా అచలమని భావించటమే మనం చేయవలసిన సాధన. అదే ధారయన్ అనే మాట కర్థం. ఆ ఏకైకమైన ఆత్మ చైతన్యమే మొదటి భూమిక నుంచి చివరి భూమికదాకా వ్యాపించి ఉన్నట్టు దర్శించటమే ధారణ. ఇదే అద్వైత ధ్యానం. నిదిధ్యాసన

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి - సంగం త్యక్త్వా ధనంజయ**
**లిప్యతే న స పాపేన - పద్మ పత్ర మివాంభసా - 10**

అయితే ఒక్కమాట. జ్ఞాన భూమిక నందుకొనే వరకూ కర్మయోగ మవలంబించి తీరవలసిందే తప్పదు. జ్ఞాన ముదయించిన తరువాత

Dr Dayananda Swamy ebooks



కూడా కర్మ ఎక్కడికీ పోదు. మహా అయితే దాన్ని జ్ఞాన విభూతిగా దర్శించమని శాస్త్రం చెబుతుంటే అసలింకా జ్ఞానమే కలగకుండా కర్మ మానేద్దా మనుకొంటే చెల్లుతుందా. అది నేల విడిచిన సాము. ఇటుకర్మకూ అటు జ్ఞానానికీ నోచుకోక దెబ్బ తింటావని హెచ్చరిస్తున్నా డిప్పుడు భగవానుడు.

కర్మ కోసమని గాదు కర్మ. జ్ఞానం కోసమని సాగించు. ఎలా సాగించాలి - దాని విధాన మేమిటని అడుగుతావా. బ్రహ్మణ్యాధాయ కర్మాణి . బ్రహ్మానికే అర్పించు నీవు చేసే కర్మలన్నీ. బ్రహ్మమంటే సచ్చిద్రూపం. రూపంగాని రూపమది. అంచేత సర్వవ్యాపకం. పరిపూర్ణం. ఎటు వచ్చీ అలా పరిపూర్ణం కాని వాడవు నీవే. నీవు చేసే కర్మ అంతకన్నా పరిపూర్ణం కాదు. పరిమితమైన జ్ఞానంతో నీవే కర్మ చేసినా అది పరిమితమే. అందుకే నేను చేస్తున్నానని నీవు నీవనుకొన్నట్టు గానే అదీ - తయారవుతుంటాయి. ఆ నేను చేస్తున్నా ననుకోటమే కర్తృత్వ బుద్ధి. అది నిన్ను నీ ఉపాధి మేరకే తగ్గించి బ్రహ్మానికి దూరం చేసింది. ఆ భావంతో తగ్గిపోయి నీవు చేసేది నీకన్నా తగ్గిపోయి ఇంకా దూరమయింది దానికి. ఇక అది నీకిచ్చే ఫలితమెలా పరిపూర్ణమవుతుంది. అదీ పరిమితంగానే లభిస్తుంది నీకు. కొంత మంచీ కొంత చెడ్డా. ఏదైనా కావచ్చు. ఎంత మోతాదులోనైనా కావచ్చు. నీవు కోరిందే జరుగుతుందనీ చెప్పలేము. కోరకున్నా జరగదనీ చెప్పలేము. అవి రెండూ సమస్యే నీకు. పరిష్కారం కాదు.

అయితే ఏమిటి పరిష్కార మార్గం. కర్మ కాదు. కర్మయోగ మవలంబించు. నీవు చేసే ప్రతి పనీ నేను గాదు చేయటమనుకో. మరి

Dr Dayananda Swamy ebooks



ఎవరు చేస్తున్నారను కోవాలి. ఆబ్రహ్మమే నాద్వారా చేస్తున్నదని భావించు. కర్తృత్వం నీకు లేదప్పుడు. వాడి మీద పడుతుంది. పడితే వాడికి దెబ్బగదా. కాదు. వాడు బ్రహ్మం. అంటే సర్వవ్యాపకం. - నిరాకారం. వాడికి దెబ్బేమిటి. నదీనాం సాగరః అన్నట్టు ఏది మీద పారేసినా అది వాడిలో లయమయి పోతుంది. సమసిపోతుంది. ఇక వాడి స్వరూపానికి వేరుగా అది కనిపించదు. నీవు పరిమితుడవు. కాబట్టి దాన్ని వేరుగా చూస్తావు. కనుక నీకది బంధకం. పరిపూర్ణుడు కాబట్టి వాడు వేరుగా చూడడు. కాబట్టి బంధకం కాదు. అంచేత బ్రహ్మణ్యాధాయ కర్మాణి - కర్మలన్నీ వాడిమీద పారేయి. వాడంటే పరిపూర్ణమైన జ్ఞానం. జ్ఞానంలో కర్మలను పారేయటమంటే ఇదే కర్మ సన్న్యాసం. సన్న్యాసమంటే అర్థమయిందా. కర్మ చేయక పోవటం కాదు. చేసే కర్మను జ్ఞానంగా భావించాలి. ఆ భావనే సన్న్యాసం. అంతేగాని ఇలాటి అఖండ భావన లేకుండా కేవలం కాషాయాలు కట్టుకొని పరుగెత్తి పోవటం కాదు. అలాటి భావనతో సన్న్యసిస్తే సంగం త్యక్త్వా. సంగం లేదిక నీకు. కర్మతోనూ సంగం లేదు. కర్మ ఫలంతోనూ లేదు. కర్తృత్వ భోక్తృత్వాలు రెండూ ఎగిరి పోతాయి. అంటే అహం మమలనే రెండు కోరలూ పెరికేశావు కర్మ సర్పానికి. అప్పుడది రబ్బరు పాములాంటిది. కరోతియః - కర్మ చేసినా చేయటం కాదది. కర్మ అని గాక చేష్ట అని పేరు పెట్టాడు దానికి వ్యాసభగవానుడు. యుక్త చేష్ట స్య కర్మసు అనేచోట కనపడుతుందది. అప్పుడది కర్మగా కనిపిస్తున్నా వాస్తవంలో జ్ఞానమే. అహం మమలు లేని కర్మ జ్ఞానమనే నటుడు ఆడే ఒక నాటకం. నాటకమెలా అబద్ధమో కర్మా ఒక అబద్ధమే. అబద్ధమనే ముసుగులో ఉన్న మహావీరుడు కేవలం జ్ఞాన స్వరూపమైన పరమాత్మే.

Dr Dayananda Swamy ebooks


ఇలా నిర్లిప్తమైన చిత్తంతో సాధకుడే కర్మ చేసినా లిప్యతే న సపాపేన. దానివల్ల కలిగే పుణ్యపాపాలు వాడినంటవు. పుణ్యం కూడా పాపం క్రిందనే జమ కడతారాచార్యులవారు. ఒకటి బంగారు సంకెల. మరొకటి ఇనుపసంకెల రెండూ నిన్ను బంధించేవే. తేడా ఏముంది. ఎలా సోకదో చెబుతున్నాడు. పద్మ పత్ర మివాంభసా కనుక నిస్సంగ బుద్ధితో ఏకర్మ చేసినా దానికి ఫలితం లేదు. నిన్నుసోకదు. ఒక తామరాకు మీద నీటి బొట్టు పడ్డా అది దాన్ని ఎలా సోకదో అలా. పైకి అంటినట్టే కనిపిస్తుంటుంది. కాని దగ్గరికివెళ్ళి ఆకు మీద పడ్డ బొట్టు విదిలించి తడివిచూస్తే ఎక్కడా నీ చేతికి తడి తగలదు. అలాగే తామరాకు లాంటి నీ మనసుకు కూడా కర్మ ఫల మంటదు. ఎవడు కర్తనని భావిస్తాడో వాడికే అంటుతుందది. నీవు కర్తవే అనుకోకపోతే ఎలా అంటుతుంది. కర్త కాని వాడు భోక్త కూడా కాబోడు.

**కాయేన మనసా బుద్ధ్యా - కేవలై రింద్రియైరపి**
**యోగినః కర్మ కుర్వంతి - సంగం త్యక్త్వాత్మ శుద్ధయే - 11**

కనుకనే కర్మ అనేది తక్కువగా చూడకూడ దెవ్వడూ. మోక్షసాధనలో మొదటి మెట్టు కర్మయోగమే. అది నీసత్త్వాన్ని శుద్ధి చేస్తుంది. అహంకార మమకారాలే మాలిన్యం మానవుడి మనస్సుకు. రజస్తమో గుణ ప్రభావమది. అది వదలనంత వరకూ ఆత్మ జ్ఞానానికే ఆశలేదు. ఇక మోక్షాని కేముంది. మరి మనో మాలిన్యం పూర్తిగా క్షాళితమై పోవాలంటే కర్మ యోగమే మార్గం.

అందుకే యోగినః కర్మకుర్వం తి - కర్మ చేసే వారంతా యోగ బుద్ధితో తాము చేసే కర్మలన్నీ చేస్తూ పోతారు. కర్తృత్వ భోక్తృత్వాలను

Dr Dayananda Swamy ebooks

వదిలేసిన సమత్వ బుద్ధే యోగ బుద్ధి. అలాంటి వారికే యోగులని పేరు. వారు పాటించేది కర్మ యోగం. ఎందుకోసం పాటిస్తారు వారు కర్మలంటే చెబుతున్నాడు ఆత్మశుద్ధయే. ఆత్మను శుద్ధి చేసుకోటానికట. ఆత్మేమిటి దానికి శుద్ధేమిటి. మళ్లీ మన మిక్కడ బోల్తాపడకూడదు. అసలైన ఆత్మకాదిది. దానికి నకిలీ. మనస్సు. దీనికే సత్త్వమని కూడా నామాంతరం. అహంమమలనే మాలిన్యం పట్టింది దేనికి. మానవుడి మనస్సుకు. అందువల్లనే పరిశుద్ధమైన ఆత్మ అక్కడే ఉన్నా మనకు కనపడటం లేదు. మరుగు పడి పోయింది.

అయితే మరి దేనితో చేయాలి కర్మ. కర్మ అన్నప్పుడు దానికి కావలసిన సామగ్రి కూడా ఉండాలి గదా. దానికే కరణమని పేరు. కరణమేమిటి అవి ఎక్కడ ఉన్నాయి. ఏమిటి ఎక్కడ ఉన్నాయని అడగక్కరలేదు. నీదగ్గరే ఉన్నాయి - ఎప్పుడూ నిన్ను అంటి పెట్టుకొనే ఉన్నాయి. కాయేన - మనసా - బుద్ధ్యా కేవలైరింద్రి యైరపి. శరీరమూ - మనస్సు బుద్ధి ఇంద్రియాలు.

ఇవే కరణాలు. పనిముట్లు. ఇవి నీ దగ్గరే ఉన్నాయి. వీటితోనే నీవే పని చేసినా చేస్తుంటావు. ఇవి లేకుండా కర్మ చేయట మసాధ్యం. కనుక డాక్టరు తన పరికరాలను శుద్ధి చేసుకొన్నట్లు నీవు వీటిని శుద్ధి చేసుకో. అలా చేసుకొని ఏ కర్మ అయినా చేస్తూపో. నిన్నది బంధించదు. ఇక్కడ కేవలైః అనే మాట ఒక్క ఇంద్రియాలకే గాదు. శరీరం దగ్గరి నుంచీ అన్ని కరణాలకూ వర్తిస్తుం దంటారు భగవత్పాదులు. కేవలమంటే ఏమిటో దాని కర్థం చెబుతున్నారు వినండి ఆయన. మమత్వ వర్జితైః - సర్వవ్యాపారేషు

Dr Dayananda Swamy ebooks


మమత్వ వర్జనాయ. శరీరాదులతో దేనితో చేసినా నాకోసమనే మమత్వ బుద్ధి ఉంటుంది సహజంగా. అది వదిలేసి చేయాలట పని. అది ఎలాగని అడిగితే వివరిస్తున్నారు. ఈశ్వరాయైవ కర్మకరోమి - నమమ ఫలాయ ఇతి మమత్వ బుద్ధి శూన్యైరింద్రియైరపి. మమత్వమనే దెప్పుడూ బుద్ధిలోనే ఉంటుంది. అదిపోగొట్టు కోవాలన్నా బుద్ధితోనే పోగొట్టుకోవాలి. బుద్ధి కది లేకుండా పోవాలంటే మరో బుద్ధి అలవడాలి. అదే ఈశ్వరార్పణ బుద్ధి. చిన్న రేఖ పెద్దది కావాలంటే దాన్ని పొడిగిస్తూ పోవాలి. అప్పుడు చిన్నది కనపడదు. దాని స్థానంలో పెద్దదే కనిపిస్తూంటుంది. అలాగే అహంమమలు వర్జించి పనిచేస్తే చిన్నదైన జీవ బుద్ధి అతి పెద్ద దైన ఈశ్వర బుద్ధి స్థాయికెదిగే అవకాశముంది. కాబట్టి ఈశ్వరుణ్ణి కర్మ ఎలా బంధించదో వాడికీ కర్మ బంధకం కాదని తాత్పర్యం.

**యుక్తః కర్మఫలం త్యక్త్వా -శాంతి మాప్నోతి నైష్ఠికీమ్**
**అయుక్తః కామకారేణ - ఫలేసక్తో నిబధ్యతే - 12**

అందుకే అటుతిప్పి ఇటు తిప్పి అనేక విధాలుగా బోధిస్తున్నాడు పరమాత్మ మనకు కర్మయోగ ప్రభావాన్ని.యుక్తుడూ అయుక్తుడూ నని ఇద్దరే ఉన్నారు మానవులలో. యుక్తుడంటే యోగ యుక్తుడు. ఇంతకు ముందే అక్కడ కూడా వర్ణించింది వాడి స్వరూపాన్ని గీత. ఏ పని చేసినా ఈశ్వరాయ కర్మకరోమి న మమ ఫలాయ - ఇత్యేవం సమాహితః. నా కన్నా అనంతమైన ఒక మహాశక్తి ఉంది. ఈశ్వర చైతన్యం. అదే నాచేత చేయిస్తున్న దీ పనులన్నీ. దానికి నేనొక భృత్యుడను -ఒక సేవకుడు స్వామి కార్యమెలా చేస్తూపోతాడో - అలాగే నేను కూడా నాకోసం కాదీ కర్మ

Dr Dayananda Swamy ebooks



చేయటమంతా. ఆ ఈశ్వరుడి కోసమేననే దివ్యస్మృతితో చేస్తూ పోయేవాడు యుక్తుడు.

అటాంటి దృష్టితో చేస్తే కర్మఫలం త్యక్త్వా - కర్మ ఫలం వాడినంటదు. ఎందుకంటే త్యక్త్వా. దాని మీద అభిలాష లేదు వాడికి. అక్కర లేదనుకొన్నాడు. మరి జీవన మెలాగా. ఏది చేసినా ప్రారబ్ధం కొద్దీ ఏది వాడికి ప్రాప్తవ్యమో అది ఎలాగూ ప్రాప్తిస్తుంది. కనుక జీవనం సాగిపోతూనే ఉంటుంది. దాని కవరోధం కలగదు. కనుక ఆందోళన పడడు. కర్తృత్వం తాను పెట్టుకోలేదు గదా. ఇక అనుకూలమూ ప్రతికూలమూ అనే చింతే ముంది. అనుకూలమే జరగాలి ప్రతికూలం జరగకూడదని భావించినప్పుడే చింత. అది లేకుంటే నిశ్చింతే ఆ మనస్సుకు.

మనసు నిశ్చింత మయితే చాలు. నిశ్చలతత్త్వేజీవన్ముక్తిః అన్నారు. శాంతి మాప్నోతి నైష్ఠికీమ్. శాంతి అనేది చెప్పకుండానే లభిస్తుంది వాడికి. శాంతి అంటే మోక్షమని అర్థం వ్రాశారు భాష్యకారులు. సంసార తాపత్రయ మున్నంతవరకూ అశాంతే. అదిపోతే కలిగే శాంతి మోక్షం గాక మరే దవుతుంది. అందులోనూ నైష్ఠికీమంటున్నది గీత. నిష్ఠాయాం భవామ్ - సత్త్వశుద్ధి జ్ఞాన ప్రాప్తి సర్వకర్మ సన్న్యాస జ్ఞాన నిష్ఠా క్రమేణ అని వివరించారు భగవత్పాదులు. ఎలాంటి శాంతి అట. నైష్ఠికీ. జ్ఞాన నిష్ఠ వల్ల కలిగే శాంతి. అది ఎలా లభిస్తుందా నిష్ఠ. దీని కొక క్రమ ముందంటా రాయన. మొట్టమొదట కర్మ యోగంతో ప్రారంభ మవుతుంది సాధనం. తరువాత సత్త్వశుద్ధి. దానివల్ల సర్వమూ ఆత్మ స్వరూపమేననే జ్ఞాన ముదయిస్తుంది. ఉన్నదంతా జ్ఞానమే అయితే ఇక కర్మలేదు. అంటే శాస్త్రోక్త కర్మలదే పనిగా చేయ నక్కరలేదు. మానేయాలి. పోతే ప్రారబ్ధవశాత్తూ

Dr Dayananda Swamy ebooks



సాగే సహజకర్మలున్నా జ్ఞాన దృష్టిలో ఎప్పటికప్పుడు సమసిపోతాయి. కాబట్టి ఉన్నా లేనట్టే. కర్మ నిష్కర్మ అవుతుంది. అదే సన్న్యాసం. అది కూడా జ్ఞానాత్మకంగానే అనుభవానికి వస్తుంది. కాబట్టి కర్మయోగ మవలంబించే వాడికిక కలిగే మహాఫలమిది. వాడు యుక్తుడు.

అలాకాక అయుక్తుడని పేర్కొన్నామే వాడీ మోక్షమనే మహాఫలాన్ని ఏ జన్మకూ ఆసించలేడు. జ్ఞానానికే నోచుకోలేదు వాడు. ఇక మోక్ష మేమిటి. కలలోని వార్త. మరి వాడికి కలిగే దేమిటి. ఏమిటనే ప్రశ్నేముంది. అయుక్తః కామకారేణ. అయుక్తుడు వాడు. కర్మను యోగంగా అభ్యసించే నేర్పులేదు. కేవలం యాంత్రికంగా ఆచరిస్తుంటాడు. అదీ అహంమమలు వదలకుండా అలా వదలకుండా చేస్తే అది కామకార మంటారు. ఇష్టానుసారంగా చేయట మవుతుంది. శాస్త్రవిహితం గదా ఇష్టానుసార మెలా అవుతుంది. ఎంత విహిత కర్మ అయినా అహం కరిష్యే అనే సంకల్పం లేకుండా మమ ఫలాయ అని ఫలాభిమానం లేకుండా చేయడు గదా. ఫలం మీద ఇష్టముంది కాబట్టి ఇష్టాను సారమే అదీ.

అయితే ఏమిటి నష్టం. వాడు కోరిన స్వర్గాదులే లభిస్తాయి గాని లభించ వలసిన మోక్షఫలం వాడు కోరటం లేదు కాబట్టి లభించదు. అంతకన్నా నష్టమేముంది. అదే పెద్దనష్టం. తాత్కాలికంగా స్వర్గాది భోగాలను భవించి మరలా వచ్చిపడ వలసిందే కర్మభూమిలో. ఇక పరిష్కార మేముంది జీవిత సమస్యకు. కనుక ఫలేసక్తో నిబధ్యతే - ఫలాభిమానమే వాణ్ణి బంధిస్తుంది. బంధకమే కర్మానుష్ఠానం మోచకం కాదు. మోచకం

Dr Dayananda Swamy ebooks



కావాలంటే అదే అనుష్ఠానంగా గాక యోగంగా మారాలి. మారితే అది అంచెలవారిగా నీకు మోక్షఫలాన్ని అందిస్తుంది.

**సర్వ కర్మాణి మనసా - సన్న్యస్యాస్తే సుఖం వశీ**

**నవద్వార పురే దేహీ - నైవ కుర్వ న్న కారయన్ - 13**

ఇలాంటి కర్మ యోగం ద్వారా చివరకు జ్ఞాన యోగమనే భూమిక నందుకొని అందులో నిలదొక్కు కొన్నవాడు జ్ఞాన నిష్ఠుడు. అలాంటి జ్ఞాన నిష్ఠుడి వ్యవహారమెలా ఉంటుందని అడిగితే దానికి సమాధాన మిస్తున్నది గీత. సర్వకర్మాణి సన్న్యస్య. అన్ని కర్మలూ సన్న్యసిస్తా డట వాడు. అన్ని అంటే ఏమిటా అన్ని. నిత్యం నైమిత్తికం కామ్యం ప్రతిషిద్ధంచ తాని సర్వాణి కర్మాణి. నిత్య నైమిత్తికకామ్యాలు మూడూ శాస్త్రం విధించినవి. ప్రతి షిద్ధా లనేవి శాస్త్రం నిషేధించినవి. విధి నిషేధాలు రెండూ వదిలేయాలి జ్ఞాని. పరిశేష న్యాయంగా ప్రారబ్ధవశాత్తూ జరిగే కర్మలు వదిలేయటం సాధ్యం కాదు కనుక అవి మాత్రం సాగిపోతుంటాయి. అయితే ఎప్పటికప్పుడు కర్మలో అకర్మను చూస్తుంటాడు కాబట్టి కర్మ గాదది. జ్ఞానమే వాడి దృష్టికి. కనుక చేయకుండా కొన్నీ చేస్తూ కొన్నీ మొత్తానికన్నీ సన్న్యసించినట్టే. సన్న్యసిస్తే ఎక్కడికి పోతాయవి. - జ్ఞానంగా మారిపోతాయి. కనుక కర్మగా వదిలేశాడు. జ్ఞానంగా ఉంచుకొన్నాడు. సన్న్యాస శబ్దానికి త్యాగమూ నిక్షేపమూననే రెండర్థాలూ సరిపోయా యిప్పుడు. ఇదే కర్మ సన్న్యాసమనే మాట కసలైన అర్థం.

అయితే కర్మలన్నీ ఎలా సన్న్యసించాలి. సన్న్యసించి ఎక్కడ కూచోవాలి జ్ఞాని. మనసా సన్న్యస్య. మనసుతో సన్న్యసించాలి.మనసా

Dr Dayananda Swamy ebooks



వివేక బుద్ధ్యా అని అర్థం వ్రాస్తున్నారు స్వామివారు. ఏది ఆత్మ స్వరూపమో దాన్ని అనాత్మ భూతమైన దేహేంద్రియాది సంఘాతం నుంచి వేరు చేసి పట్టుకోటమే వివేకం **Discrimination**. అలాంటి ఆత్మ జ్ఞాన బలంతో చూస్తే చేసే కర్మలన్నీ జ్ఞానంగానే దర్శన మిస్తాయి కాబట్టి కర్మలుగా వాటిని సన్న్యసించినట్టే వాడు.

మరి సన్న్యసించి ఎక్కడుంటాడు వాడు. నవద్వారేపురే ఎక్కడేమిటి నవద్వార పురమైన ఈ శరీరంలోనే. ఎలా ఉంటాడో తెలుసా. సుఖం వశీ. దేహేంద్రియ మనః ప్రాణాదుల నన్నింటినీ తన వశంలో ఉంచుకొని సుఖంగా ఉంటాడు. ఎవడు దేహీ. దేహ మున్నవాడు దేహి. దేహముంది వాడికి. దేహంలోనే ఉంటాడు. వాడు జ్ఞాని కదండీ. జ్ఞాని కూడా దేహం ధరించి దేహంలోనే ఉండేట్టయితే అజ్ఞానికీ వాడికీ తేడా ఏముంది. అజ్ఞాను లైన లోకులందరూ దేహధారులే దేహమున్నవారే. వారందరూ ఉన్నది వారి వారి దేహంలేనే. అటాంటప్పు డింత కష్టపడి జ్ఞానం సంపాదించి ఏమి ప్రయోజనం. పామరుడిలాగా పండితుడు కూడా దేహంలోనే ఉన్నాడని పించుకొంటే వాడు జ్ఞాని ఎలా అయ్యాడని ఆ శంక వస్తుందిక్కడ.

దీనికి భాష్యకారు లిచ్చే సమాధానం వినండి - ఎంత అద్భుతంగా ఉందో. సర్వోహి దేహీ సన్న్యాసీ అసన్న్యాసీవా దేహే ఏవ ఆస్తే అత్ర అనర్థకం విశేషణమ్. మొదట ఆక్షేపణ ఏమిటో పేర్కొంటున్నా డాయన. ప్రతి ఒక్క మానవుడూ వాడు కర్మలు సన్న్యసించినా సన్న్యసించకున్నా మొత్తానికి దేహంలోనే కూచున్నాడు గాని ఇంకెక్కడా లేదుగదా. అలాంటప్పుడీ మాటేమిటి దేహ ఆస్తే అంటున్నారు. ఇలా ఆక్షేపించి దాని కాయనే సంజాయిషీ ఇస్తున్నారు. ఏమని. యస్తు అజ్ఞః దేహీ దేహేంద్రియసంఘాత

Dr Dayananda Swamy ebooks



మాత్రాత్మదర్శీ స సర్వోపి దేహే భూమౌ ఆసనే వా ఆసే ఇతిమన్యతే. బాబూ దేహమే నేను అని భావించే వాడికీ దేహీ అనిపేరే. అది నాది అని భావించేవాడికీ దేహీ అని పేరే. దేహమే నేనయి పోయినవాడు తాను దేహంలో ఉన్నానని అనుకోలేడు. ఒక ఇంట్లోనో ఒక గదిలోనో ఒక కుర్చీలోనో కూచున్నట్టు దేహంలో కూచున్నానని చస్తే చూడలేడు. కారణ మేమంటే దేహమే వాడయిపోయాడు. ఇక దేహంలో ఎలా ఉండగలడు. ఇల్లే నేనను కొంటే ఇంట్లో ఉండగలనా. ఇల్లు నీకు అన్యమని భావిస్తేనే ఇంట్లో ఉండగలవు. అలాగే దేహం నీకు అన్యమని భావిస్తేనే దేహంలో ఉండగలవు. అలా భావించటం లేదు అజ్ఞాని. కనుక వాడు దేహంలో ఉన్నాడని చెప్పరాదు.

మరి ఎవడైతే చెప్పగలం. జ్ఞాని అయితే చెప్పగలం. జ్ఞాని దేహమే నేనని దానితో ఏకమైపోడు. నేనని కాక నాదని చూస్తాడు వాడు. గనుక ఒక ఇంట్లో ఉన్నట్టు దేహంలో ఉండటంకూడా వాడికి సాధ్యం. దేహాది సంఘాత వ్యతిరిక్తాత్మ దర్శినస్తు దేహే ఆసేఇతి ప్రత్యయః ఉపపద్యతే. వాడికి చెల్లుతుంది దేహంలో ఉన్నాననే మాట. కారణం దానికి తన స్వరూపం విలక్షణమని చూస్తున్నాడు వాడు. అయితే తనకు విలక్షణమని చూడగలవాడు దానిలోనే ఎందుకు కూచోవలసి వచ్చింది. ప్రారబ్ధ ఫలకర్మ సంస్కార శేషాను వృత్త్యా దేహ ఏవ విశేష విజ్ఞానోత్పత్తేః అని సమాధాన మిస్తారు భాష్యకారులు. ఎంత జ్ఞాని అయినా ప్రారబ్ధ కర్మ ఫల శేషముంది వాడికి – దానివల్ల క్షుత్పిపాసాది విశేష జ్ఞాన మేర్పడుతుంది జీవితంలో. అందుకోసం వాడూ దేహంలో ఉండవలసి వచ్చింది. ఉన్నా దానితో తాదాత్మ్యం చెంద డజ్ఞాని లాగా. అంచేత ఉన్నా లేనట్టే. ఎక్కడ. నవ ద్వార

Dr Dayananda Swamy ebooks



పురంలో. నవద్వారా లేమిటి. రెండు కళ్లూ రెండు చెవులూ రెండు ముక్కు పుటాలూ– ఒక నోరూ –ఇవి ఏడు. పోతే మూత్ర పురీషద్వారాలు రెండూ. వెరసి తొమ్మిది.

అయితే కూచోటం వరకేనా పురంలో. ఏమైనా పనిపెట్టు కొంటూ కూడా ఉంటాడా. ఏపనీ పెట్టుకోడు. చేయడు. నైవకుర్వన్నకారయన్ అంటున్నది గీత. ఒక పని తానుగా చేయడట. దేహేంద్రియాదుల చేత చేయించడట నైవ కుర్వన్న కారయన్. మరి చేయటమూ చేయించటమంటే అవి తనకు మధ్యలో సంక్రమిస్తే వదిలేస్తాడా. లేక అసలు సహజంగానే తనకవి లేవా అని ప్రశ్న వచ్చింది. వస్తే మధ్యలో రావటం కాదు. సహజంగానే ఆత్మకవి లేవంటున్నారు ఆచార్యులవారు. ఎలా చెప్పగలరని అడిగితే మొదటనే చెప్పింది గదా గీత అవికార్యోయముచ్యతే – ఏ వికారమూ లేదాత్మకని సమాధాన మిస్తాడు. అంతేకాదు. శరీర స్థోపి కౌంతేయ నకరోతి నలిప్యతే. శరీరంలో ఉన్నా ఆత్మ ఏపనీ చేయటం లేదు. చేయటంలేదు గనుకనే ఏ కర్మ ఫలమూ దానినంటదని తరువాత రాబోయే శ్లోకాన్ని కూడా ఉదాహరించి సమాధాన పరుస్తారాయన. మరి కర్మలేమిటి. ఎవడు చేస్తున్నాడవి. చేసినా చేయక పోవట మేమిటని ప్రశ్న వస్తే దానికిప్పుడు గొప్ప పరిష్కారం చేస్తున్నది భగవద్గీత.

**నకర్తృత్వం నకర్మాణి - లోకస్య సృ జతి ప్రభుః**

**నకర్మ ఫల సంయోగం - స్వభావస్తు ప్రవర్తతే - 14**

Dr Dayananda Swamy ebooks


అసలు కర్మ కర్మ అంటున్నావు. నీవు కర్తృత్వమనేది పెట్టుకొంటే గాని కర్మ అనేది చేయలేవు. చేస్తేగాని ఏర్పడదు కర్మ. కర్మ ఏర్పడితే గాని కర్మ ఫలమనేది తయారు గాదు. కర్మ ఫలం తయారయితే గాని దానితో నీకు సంబంధ మేర్పడదు.కర్మఫల మను భవిస్తున్నావంటే అంతకు ముందే ఆ ఫలమేర్పడి ఉండాలి. ఫల మేర్పడాలంటే కర్మ అనేది నీవు చేసి ఉండాలి. కర్మనీవు చేయాలంటే నేను కర్తనని కర్తృత్వమనే భావం నీవు నీమీద పెట్టుకొని ఉండాలి. నీవు కర్తవే గాకపోతే కర్మ ఎలాచేస్తావు. కర్మ చేసుకోకపోతే ఫలిత మెక్కడిది. ఫలమే లేకుంటే నీ కనుభవమెలా కలుగుతుంది.

అదే చెబుతున్న దిప్పుడు గీత. న కర్తృత్వం నకర్మాణి న కర్మ ఫలసంయోగం – లోక స్య సృజతి ప్రభుః– నీకసలు కర్తృత్వమూ లేదు – కర్మలూ లేవు – కర్మ ఫలమైన సుఖదుఃఖాలతో జననమరణాలతో లోకాంతర జన్మాంతరాలతో దేనితో కూడా సంబంధమే లేదు. ఎవరైనా సృష్టిస్తే గదా ఇవన్నీ ఏర్పడేది. లోకస్య నసృజతి ప్రభుః – లోకులకివి తయారుచేసి వాడి నెత్తిన పడేయలే దెవరూ. పడేయాలంటే అంతకు ముందెవ రుండాలి. ప్రభుః ఆత్మ చైతన్యం. ఆత్మ అంటే అది శుద్ధ చైతన్యం **Pure consciouness** –నిరాకారమూ నిశ్చలమైనది చైతన్యం. నిరాకారం గనుక సర్వవ్యాపకం. అది తప్ప మరొక అనాత్మ పదార్థమంటూ లేదు. ఏకమేవా ద్వితీయం. మరి జీవజగత్తు లేమిటి. ఎక్కడినుంచి వచ్చాయివి.

ఆత్మే సృష్టించిందంటావా. ఆత్మ ప్రభువే. ప్రభవతీతి ప్రభుః దేనికైనా సామర్థ్య మున్నదేదో అది ప్రభుః– సృష్టించినా సృష్టించవచ్చు. కాని

Dr Dayananda Swamy ebooks


సృష్టించదు. కారణం తనకు భిన్నంగా ఏదీ చూడలేదది. చూడకున్నా సృష్టించే సామర్థ్యముంది గదా అని అడగవచ్చు. భిన్నంగా ఏదీ లేదు. అయినా సామర్థ్యముంది గనుక సృష్టిస్తుందంటే అది వాస్తవమైన సృష్టి గాదు. సృష్టి గాని సృష్టి. దాని దృష్టే దాని సృష్టి. దృష్టి వేరు తాను వేరూ కాదా ఆత్మ. దృష్టి తానే తన స్వభావమే. ఆ స్వభావమే తన పాటికి తానుంటూనే మరొక పదార్థంలా కూడా భాసించగలదు. ఆ మరొకటి వస్తువు గాదు. ఆ భాస. వస్తువే రూపాంతరం ధరించి కనిపిస్తే ఆ భాస. అద్దంలో మన నీడ కనిపిస్తుం దనుకొండి. అది వాస్తవమా. వాస్తవంగా ఉన్నది నాముఖమే. అదే ప్రతి ముఖంగా భాసిస్తున్నది. అలాగే ఆత్మే అనాత్మగా భాసిస్తున్నది నీకూ నాకూ.

అదే జీవుడూ వీడి కర్తృత్వమూ. వీడు చేసే కర్మలూ – వాటి కేర్పడే సుఖదుఃఖాది ఫలమూ – లోకాంతర జన్మాంతరాలూ – అంతా ఒక పెద్ద ఆభాస. నాటకం. వాస్తవం కాదు. వాస్తవం కాకున్నా ఎలా ఏర్పడిం దంటారా. అది ఆ వస్తు స్వభావ మని జవాబు. అదే జవా బిస్తున్నాడు మహర్షి. స్వభావస్తు ప్రవర్తతే. ఆత్మ తాలూకు స్వభావమే అలా అనాత్మ ప్రపంచంగా భాసిస్తున్నది. అంతేగాని ఆత్మ తానుగా ఏదీ కాలేదు. చేయలేదది. అయినా మనమెందు కిలాంటి భావాలు నెత్తినపెట్టుకొని నేను కర్తనూ భోక్తనని తాపత్రయ పడుతున్నామని అడుగవచ్చు. అదీ ఆత్మ స్వభావమే నంటాడు మహర్షి. ఇందులో ఏ ఆత్మ స్వభావమేది. పరమాత్మ స్వభావమా జీవాత్మస్వభావమా. ఇది నాస్వభావ మదే ఇన్ని రూపాలలో భాసిస్తున్నదనే జ్ఞానంతో చూడగలిగితే అది పరమాత్మ. అలాంటిజ్ఞానం లేక ఇదంతా నాకు భిన్నంగా ఏదో ఉండి నాకిలా కనిపిస్తూ – నన్ను కష్ట

Dr Dayananda Swamy ebooks



సుఖాలపాలు చేస్తున్నదని చూస్తే అది జీవాత్మ. రెండాత్మలున్నాయని కాదు మరలా. ఒకే ఆత్మ విద్య ఉన్నదైతే పరమాత్మ. విద్యను కోలుపోయి అవిద్యావంతమైతే జీవాత్మ. మొదటి దశలో దానికీ కర్తృత్వాదు లేవీ లేవు. రెండవ దశలో అన్నీ ఉన్నాయి. కనుకనే అవిద్యాలక్షణా ప్రకృతిః మాయా ప్రవర్తతే. అవిద్యాలక్షణమైన మాయే ఈ కలాపమంతా నడుపుతున్నది గాని ఆత్మకు సంబంధం లేదని అర్థం చెబుతారు భాష్యకారులు. ఒకే మాయాశక్తి పరమాత్మ దగ్గర విద్య. జీవుడి దగ్గర అవిద్య.మాయను వశీకరించుకొన్న చైతన్య మీశ్వరుడు. మాయకు వశమైన చైతన్యం జీవుడు. ఆ మాయే అప్పుడు జీవుడికి విద్య అయికూచుంది. అవిద్య అంటే అజ్ఞానం. నేనీశ్వరుడనే అని గుర్తించక పోవటం.

**నా దత్తే కస్యచి త్పాపం - న చైవ సుకృతం విభుః**

**అజ్ఞానే నావృతం జ్ఞానం - తేన ముహ్యంతి జంతవః -15**

ఇలా మన జ్ఞానాజ్ఞానావస్థ వల్లనే ఈ జీవేశ్వర భేద మేర్పడుతున్నది గాని అసలు వస్తు సిద్ధంగా ఉన్న దొక్క ఈశ్వర చైతన్యమే. ఆకాశం లాగా నిరాకారమైన చైతన్యంలో జీవేశ్వరులనే తేడా అసలెలా ఏర్పడగలదు. ఘటాకాశ మొకటి మహకాశ మొకటి రెండుంటాయా ఆకాశాలు. రెండు ముక్క లయిందా ఆకాశం. అలాగే చిదాకాశం మాత్రంరెండు భాగాలవుతుందా. అయితే అది చైతన్యమే కాదు. కాబట్టి వస్తుసిద్ధంగా జీవుడూ ఈశ్వరుడూ అనే భేదం లేదు. రెండూ కలిసి కేవలం పరిశుద్ధమైన ఆత్మ స్వరూపమే. దానికి వ్యతిరిక్తంగా వేరొకటేదీ లేదు. జీవేశ్వరులనే తత్త్వాలు రెండేర్పడటమే అసంభవం.

Dr Dayananda Swamy ebooks



మరి ఇలా జీవుడనే వాడే లేడన్నప్పుడు వీడు పుణ్యాత్ముడు - మహాభక్తుడు వీడీశ్వరుడికి - వీడు పాపాత్ముడు ఈశ్వర ద్వేషి అని - జీవులలో తేడా చూడటం ఎంత తెలివి తక్కువ. నీవొక వేళ అజ్ఞాన వశాత్తూ తేడా చూచినా అలా మాటాడినా ఉన్నదొకే ఒక ఈశ్వర చైతన్యం. దాని కేలాటి అజ్ఞానమూ లేదు గదా. దానికీ పుణ్యపాప విచారమెలా ఉండగలదు. కనుకనే నా దత్తే కస్యచి త్పాపం. ఎవరి పాపన్నీ అది దగ్గర చేర్చుకోదు. నచైవ సుకృతం విభుః - ఎంత విభువైనా అది ఎవరి సుకృతాన్నీ నెత్తిన పెట్టుకోదు. తనకా పుణ్యపాపాలు స్వయంగా లేవు. అది శుద్ధ బుద్ధ ముక్త స్వభావం. మరొకడి పుణ్యపాపాలా అవి తనకు విలక్షణంగా ఎప్పుడూ చూడదది. వస్తుసిద్ధంగా ఏ ద్వంద్వాలూ లేవు దానికి. నిర్ద్వంద్వంగా ఉన్న వస్తువు తానే.

అలాంటప్పుడీ పుణ్యపాపాది ద్వంద్వా లెక్కడివి. వాడికి స్వతహాగా లేక వేరొకడు వాడికి భిన్నంగా ఎవడూ లేకపోతే ఇవి ఎలా ఏర్పడ్డట్టు. ఎవరు వీటికాశ్రయ మిచ్చి నట్టు. ఎవరో గాదు. జంతవః - మానవులే. పశువులూ మృగాలే గదా జంతువులు. కాదు. జన్మించిన ప్రతి ప్రాణీ జంతువే. మానవుడు కూడా పశుపక్ష్యాదుల లాగా జన్మించినవాడే గదా అంచేతనే ద్విపాజ్జంతువులు మానవులు. మిగతా పశుపక్ష్యాదులలాగా వీరూ జన్మ ఎత్తినా వీరి కొక విశేషముంది. అది జ్ఞానం. కాని ఆ జ్ఞానం విశేష జ్ఞానమేగాని సామాన్య జ్ఞానం కాదు. ఎక్కడి కక్కడ వేరుచేసి ఇది ఫలానా అది ఫలానా అని చూడటం విశేష జ్ఞానం. అలాగే చూస్తు న్నారు మానవులందరూ. ఇది భార్య - ఇది బిడ్డలూ - ఇదీ ఇల్లూ - ఇది

Dr Dayananda Swamy ebooks



వాకిలీ - ఇది ధనమిది ధాన్యమిది సుఖమిది దుఃఖమిది జన్మ ఇది మరణ మిది ఇహమిది పరమని - ఎక్కడి కక్కడ విభక్తమయి పోయింది మన జ్ఞానం.

దీనికే అజ్ఞాన మని పేరు పెట్టారు వేదాంతులు. జ్ఞానం లేదని గాదు అజ్ఞానమంటే. ఉండి కూడా విభక్త మైనదని ఇలాటి పరిచ్ఛిన్నమైన జ్ఞానానికే అజ్ఞాన మని పేరు. ఇప్పుడీ అజ్ఞానం లేనివాడు లేడీ ప్రపంచంలో. లౌకికుడేమిటి. శాస్త్రజ్ఞుడేమిటి. కర్మిష్ఠుడేమిటి. ఉపాసకుడేమిటి. భక్తుడేమిటి. యోగీశ్వరుడేమిటి. అందరూ ఇది ఇలాంటిదది అలాంటిదని వికల్పించి చూచేవారే. అలా చూచినంత వరకూ అజ్ఞానేనా వృతం జ్ఞానం. ప్రతివాడి జ్ఞానమూ అజ్ఞానం చేత మరుగుపడి పోతున్నది. ఈ విశేషజ్ఞానం వాడికున్న సామాన్యజ్ఞానాన్ని కాస్తా కప్పి వేసింది. జ్ఞానమంటే సామాన్య జ్ఞానం. సర్వత్రా సర్వదా సర్వ పదార్థాలలోనూ వ్యాపించి ఉన్న ఆత్మ స్వరూపం. అది పుణ్యం పాపమని వికల్పించి చూడటం వల్ల సవికల్పంగా మారి నిర్వికల్పమైన దాని అసలు స్వరూపం పైకి కనపడకుండా పోయింది. దాని బదులు మనకెప్పుడూ ఈ సవికల్పమైన జ్ఞానమూ సవికల్పమైన ప్రపంచమే దర్శన మిస్తున్నాయి. ఇందులో సవికల్ప జ్ఞానమే జీవుడు. సవికల్పమైన జ్ఞేయమే జగత్తు. ఆ జీవుడీ జగత్తును చూస్తుంటే వాడి దృష్టి కిది పుణ్యపాపాది ద్వంద్వాత్మకంగానే గోచరిస్తుంటుంది గాని తద్విలక్షణంగా ఎలా కనిపిస్తుంది. అందుకే తాను కర్త గాకున్నా కర్తనని తనకే కర్మలూ లేకున్నా ఉన్నాయనీ సుఖదుఃఖాది కర్మ ఫలం

Dr Dayananda Swamy ebooks

లేకున్నా ఉన్నదనీ భ్రాంతి పడుతున్నాడు. అందుకే అది కేవలం నీ భ్రాంతే గాని అసలు వాస్తవంగా లేవని మరలాచాట వలసి వచ్చింది గీత. ఏమని నకర్తృత్వం - నకర్మాణి నా దత్తే కస్య చిత్పాపం నచైవ సుకృతమని.

**జ్ఞానేనతు తదజ్ఞానం - యేషాం నాశిత మాత్మనః**

**తేషా మాదిత్యవత్ జ్ఞానం - ప్రకాశయతి తత్పరమ్ - 16**

అయితే ఇప్పుడొక ప్రశ్న. చేసే ప్రతి కర్మా ఈశ్వరుడి కప్పజెప్పి ఈశ్వరార్పణ బుద్ధితో పనిచేస్తూ పొమ్మని మీరేగదా సలహా ఇచ్చారు కర్మయోగంలో. మరి ఇప్పుడేమిటి ఇలా మాటాడుతారు. ఈశ్వరుడేదీ పట్టించుకోడు. నీవు మంచి చేశావో చెడ్డ చేశావో ఆయన ఏదీ దగ్గరికి తీసుకో దంటా రేమిటి. ఆయన ఏదీ తీసుకోకపోతే ఆయన మీద పారేయట మనే మాట కర్థ మేముంది. మనమూ కాదని త్రోసిపుచ్చి - ఆయనా తనకక్కర లేదని త్రోసేస్తే మరి కర్మయోగి చేసే కర్మ లేమయి పోతాయి. ఎక్కడికి పోతాయని ఆ శంక.

దీనికి జవాబింతకు ముందిచ్చాడు. ఇప్పుడివ్వ బోతున్నాడు. అజ్ఞానేనా వృతం జ్ఞానమనే దింతకు ముందుగా ఇచ్చిన సమాధానం. అజ్ఞానం వదలక నీవను కొంటున్నావు నీకు భిన్నంగా ఒక ఈశ్వరు డున్నాడని. నీవున్నాడని ఊహించిన ఆ ఈశ్వరుడి కప్ప చెబుతున్నావు నీవు చేసే కర్మలూ వాటి ఫలమూ. అక్కడ ఒక ఈశ్వరుడు వస్తుతః నీకు వేరుగా ఉన్నాడని కాదు. నీ ఊహలో ఉన్నాడు వాడు. కాబట్టి అప్పజెబు తున్నాననే ఊహతోనే వాడి కప్పగిస్తున్నావవి. ఊహలోనే గాని వస్తుసిద్ధంగా వాడు నీకు వేరుగా లేడు. కాబట్టి నాదత్తే కస్యచి త్పాపం. వాడెవరి పుణ్యపాపాలూ

Dr Dayananda Swamy ebooks

స్వీకరించటం లేదు. ఉంటే గదా స్వీకరించటానికి. అప్పటికి రెండూ కరెక్టే. అజ్ఞాన దృష్టిలో అది కరెక్టే - జ్ఞానదృష్టిలో ఇదీ కరెక్టే. ఏమిటా కరెక్టు - నీవప్పు జెప్పటమూ. అప్పగించినా వాడంగీకరించక పోవటమూ. ఇదీ పరిష్కారం.

ఇందులో అజ్ఞాన దృష్టితో చేసిన పరిష్కారమేదో అది ముందు శ్లోకంలో చెప్పి ఇప్పుడీ శ్లోకంలో జ్ఞానదృష్టితో చేయబోయే పరిష్కారమేదో వర్ణిస్తున్నాడు మహర్షి. జ్ఞానేన తు తదజ్ఞానం - యేషాం నాశిత మాత్మనః - అజ్ఞానానికి జ్ఞానమే విరుగుడు. జ్ఞానమ నే దొక వెలుగు. వెలుగు వస్తే చీకటి విరిసి పోయినట్టే జ్ఞానోదయమైతే అజ్ఞానమిక బలాదూరు కాక తప్పదు. అది నాశితం. పూర్తిగా నష్టమయి పోతుంది. ఆత్మనః - ఆత్మకసలు అజ్ఞానమే లేదు. ఆత్మ అంటే అది జ్ఞాన స్వరూపం. మరి ఎక్కడిదీ అజ్ఞానం. జ్ఞానమనేధి ఉదయించక అదే నీకు అజ్ఞానంగా అనుభవానికి వస్తున్నది. అంటే సామాన్య జ్ఞానమే నీవీ శరీరాద్యుపాధుల మేరకు చూచేసరికి విశేషజ్ఞాన రూపంగా భాసిస్తున్నది. అదే అజ్ఞానమని పేర్కొనటం మేము.

అది ఇప్పుడు నేను పాధిరహితమైన చైతన్యమాత్రుడను గదా అని ఎప్పుడీ సాధకుడు గుర్తించాడో - అప్పుడు చీకటి లాగా విరిసిపోయింది. విశేషరూపంగా కనిపించిన జ్ఞానం సర్వవ్యాపకమైన సామాన్యజ్ఞానంగా సాక్షాత్కరిస్తుందని అర్థం. తేషాం ఆదిత్యవత్ జ్ఞానం. ఎలా సాక్షాత్కరి స్తుందది. ఒక ఆదిత్య మండలం లాగా పైకి వచ్చి కనిపిస్తుంది. అలా పైకి వచ్చిందంటే చాలు. ప్రకాశయతి తత్పరం - ఆదిత్యుడెలాగా సమస్త

Dr Dayananda Swamy ebooks

రూప ప్రపంచాన్నీ తన వెలుగులో ప్రకాశింపజేస్తాడో అలాగే ఈ అఖండ జ్ఞానం కూడా ఆ పరమాత్మ తత్త్వాన్ని మరలా ఉన్నదున్నట్టు మనకు ప్రత్యక్షంగా బయటపెట్టి చూపుతుంది. జీవాత్మ తానే పరమాత్మననే సత్యాన్ని స్వానుభవానికి తెచ్చుకొంటాడని భావం.

అలా తెచ్చుకొన్నప్పు డిక జీవుడూ లేడు. ఈశ్వరుడూ లేడు. రెండింటికీ బదులున్న దొకే ఒక ఆత్మ చైతన్యం. అది అఖండం గనుక అందులో జీవచైతన్య మీశ్వర చైతన్యమనే ద్వైతాని కాస్కారం లేదు. అలాంటప్పుడిక జీవుడేమిటి. కర్మ ఏమిటి. అది ఈశ్వరార్పణ బుద్ధితో చేయటమేమిటి. అంతా హుళక్కే. అలాంటప్పుడు నకర్తృత్వం న కర్మాణి అని జీవుడెగిరి పోయాడు. నా దత్తే కస్యచి త్పాపమని ఈశ్వరుడెగిరి పోయాడు. జీవేశ్వరు లనేవి రెండూ సాపేక్ష **Relative** మైన భావాలు. ఒకదాన్ని బట్టి ఒకటి. ఇదుంటే అది. అదుంటే ఇది. అంతా ఆత్మ స్వరూపమనే పరిపూర్ణ జ్ఞానం లేనందువల్లనే తయారయిందీ భేద భావం. అలాటి జ్ఞానమెప్పుడు దయించిందో నిరపేక్షమైన **Absolute** ఆ వెలుగులో సాపేక్షమైన ఈ భావాలు రెండూ లయం కాక తప్పదు.

**తద్బుద్ధయ స్తదా త్మాన - స్తన్నిష్ఠా స్తత్పరాయణాః**
**గచ్ఛం త్యపున రా వృత్తిం - జ్ఞాన నిర్ధూత కల్మషాః - 17**

అయితే ఒక్కమాట. యేషాంతేషా మని ఒక షరతు విధించింది గీత. ఎవరైతే అలా జ్ఞాన మార్జించి జ్ఞాను లనిపించు కొన్నారో వారికే ఆభాగ్యం. ఎవరంటే వారికి గాదు. కాదని శాపం పెట్టటం లేదు మేము మరలా. తగిన శిక్షణ పొంది మోక్షమార్గంలో పయనించే సాధకుల కెప్పటికైనా అది లభించటం ఖాయం. కొంతకాలం కర్మ యోగ

Dr Dayananda Swamy ebooks



మవలంబించి చిత్త శుద్ధి గడించి తరువాత ఆత్మజ్ఞాన మార్జించి అనాత్మగా చూస్తూ వచ్చిన కర్మ కలాపమంతా ఆ జ్ఞానంలో సన్న్యసించి అంతా ఏకంగా ఒకే ఒక ఆత్మ స్వరూపంగా చూడగలిగితే కర్మయోగి జ్ఞానయోగి కాక ఏమవుతాడు.

కాబట్టి మొదటి నుంచీ మోక్ష మార్గంలో శిక్షణ పొందుతూ రావాలి సాధకుడు. అందులో మొదటి మజిలీ తద్బుద్ధయః - దాని మీదనే బుద్ధి పెట్టుకొని బతకాలి. దానిమీదనంటే సర్వవ్యాపకమైన ఆత్మ తత్త్వం మీద. తదాకారమైన వృత్తి ఏర్పడటమే తద్బుద్ధి. **The Thought of the universal self.** అది ఏర్పడిం దనుకోండి. ఏర్పడ్డా అది నాకు దూరంగా పరోక్షంగా ఉదయించి ప్రయోజనం లేదు. పరోక్షంగా భావించే తత్త్వాన్ని అపరోక్షంగా తన స్వరూపంగా దర్శించాలి. తదాత్మానః అంటే అదీ అర్థం. అదే తానయిపోవాలి. లేకుంటే అది తన కనాత్మ అవుతుందే **Object** గాని ఆత్మ **Subject** గా అనుభవానికి రాదు. అనుభవ స్వరూప మాత్మ.

పోతే అనుభవానికి వచ్చినా సరిపోదు. ఎప్పుడూ ఎడతెగకుండా ఉండాలా అనుభవం. లేకుంటే మెరుపు మెరిసినట్టు కలిగి తొలగిపోయే ప్రమాదముంది. తొలగితే మరలా గాఢాంధకారమే. అనాత్మ ప్రపంచమే మన పాలిటికి అంధకారం. ఆత్మ ప్రకాశమెప్పుడూ నిలిచి ఉంటేనే అది తొలగిపోయేది. లేకుంటే దాడి చేస్తుంది మనమీద. అంచేత తన్నిష్ఠాః అంటున్నది గీత. ఆ ప్రకాశమలాగే నిలుపుకోవాలి సాధకుడు. దీనికే నిదిధ్యాసన అని పేరు. తద్బుద్ధి అనేది శ్రవణ మనుకొంటే తదాత్మత్వం మనన మనుకొంటే తన్నిష్ఠా అనేది ధ్యానమనుకోవచ్చు. విజాతీయ భావం

Dr Dayananda Swamy ebooks



చేత మరుగుపడని సజాతీ యాత్మ భావన తైలధారలాగా ప్రసరిస్తూ ఉండటమే అద్వైతులు చెప్పే ధ్యానం.

అలా నిలుపుకొనే ప్రయత్నమెక్కడ ఆగిపోతుందో అప్పుడది సాధన కాదిక సిద్ధి. ఆత్మానుభవ మాత్మాను భవమే. అనాత్మ ఎప్పుడూ తొంగిచూడదు. బ్రాహ్మీస్థితి అని భగవద్గీత ఇంతకుముందు పేర్కొన్నదిదే. దీనినే వర్ణిస్తున్న దిప్పుడు తత్పరాయణాః అని. అయనమంటే స్థానం లేదా స్థితి. **State of Experience** పరమంటే ప్రకృష్టం. అన్నిటికన్నా చివరిసారిగా కలిగేది **Final.** అదీ పరాయణమనే మాట కర్థం. అచలమైన కూటస్థమైన పదవి. ఇక దానికి పాటు పోటు లుండవు. రాకపోకలు కానరావు. దీనితో సాక్షాత్కారమనే ఫలసిద్ధి కూడా వర్ణించిన ట్టయింది గీత. ఆ పాటికి కర్మయోగంతో ఆరంభమైన సాధకుడి ప్రయాణం జ్ఞాన భూమిక కూడా దాటిపోయి విజ్ఞాన యోగం లేదా అపరోక్షానుభవంలో పర్యవసానం చెందుతుంది. చెందితే గచ్ఛం త్యపునరా వృత్తిమ్. ఇకవారికి పునరావృత్తి అనే ప్రసక్తి లేదు. మరలా వచ్చి ఈ సంసారంలో పడే భయం లేదు. ముక్తులయి పోతారు. కారణం జ్ఞాన నిర్ధూత కల్మషాః - అఖండమైన ఆత్మ స్వరూపాన్ని పట్టుకొన్నారు. అందులోనే కూచున్నారు. ఆ దృష్టితోనే చూస్తున్నా రను క్షణమూ ఈ అనాత్మ ప్రపంచాన్ని. ఎప్పటికప్పు డనాత్మ ఆత్మగా దర్శన మిస్తుంటుంది వారికి. ఇదీ జ్ఞానమంటే. అది వారి కల్మషాన్ని నిర్ధూతం చేసి పారేసింది. అవిద్యా కామకర్మలే కల్మషం. అది ఈ ఆత్మ విద్యా ప్రకాశంలో తమస్సులాగా సర్వవినాశ మయింది. ఇక మోక్షం గాక బంధ మెక్కడిది వారికి. నిత్యముక్తులు వారు. బ్రతికుంటే జీవన్ముక్తులు. ప్రారబ్ధం తీరి శరీరం పతనమైపోతే విదేహముక్తులు.

Dr Dayananda Swamy ebooks


**విద్యావినయ సంపన్నే - బ్రాహ్మణే గవి హస్తిని**

**శుని చైవ శ్వపాకేచ - పండితా స్సమ దర్శినః - 18**

సరే – జీవితాంతంలో వాడు ముక్తుడయి పోతాడు. మరలా వెనక్కు వచ్చే ప్రశ్నే లేదని చెప్పారు. బాగానే ఉంది. అలాంటి సిద్ధి కలగాలంటే అది ఒక్కసారిగా లభించేది గాదు. పైగా క్రొత్తగా సంప్రాప్తమయ్యేది గాదు. మొదటి నుంచీ ఉండాలది. అంతకుముందు లేనిది క్రొత్తగా వచ్చిందని చెప్పాడంటే ఎలా వచ్చిందో అలా తొలగిపోయే ప్రమాదముంది. లేనిదిరాదు ఉన్నది పోదని గదా గీతా సిద్ధాంతం. అలాంటప్పుడు జ్ఞాని జీవిత మంతమయి పోయే టప్పుడే గాక జీవిత కాలంలో కూడా అదే స్థితిలో ఉండి తీరాలి. ఉంటాడా. ఉంటే ఎలా ఉంటాడు. లోకంలో నలుగురి మధ్యా జీవిస్తున్నప్పుడు వాడి దైనందిన జీవితమెలా నడుస్తుంటుంది. వాడి దృష్టి ఈలోక వ్యవహారంలో బడి ఎలా నలిగిపోకుండా బ్రహ్మాకారంగానే సాగి పోతుంటుంది వర్ణించగలరా అని అడిగితే వర్ణించి చెబుతున్న దిప్పుడు గీత.

ఆత్మ జ్ఞాన ముదయించి వాడి అజ్ఞానం చీకటిలాగా విరిసిపోయిం దని ఎప్పుడు చెప్పామో అప్పుడిక నామరూపాలనే చీకటి పిసరు మిగలకూడదు వాడికి. అంతా వెలుగే. తానూ వెలుగే తాను చూచేదీ వెలుగే. జ్ఞానమే ఇక్కడ ప్రకాశం. అది తనలోనూ చూస్తుంటాడు. తనకు కనిపించే ప్రపంచంలోనూ చూస్తాడు. సర్వత్రా పరుచుకొని కనిపిస్తుందది. అంతటా సమానంగా వ్యాపించి ఉంటుందది. పండితా స్సమదర్శినః – అలా సమంగా వ్యాపించిన ఆ చైతన్య జ్యోతిని దర్శిస్తాడు గనుకనే వాడు సమదర్శి. అప్పుడేవాడు పండితుడు. పండా ఆత్మ విషయా బుద్ధిః అని

Dr Dayananda Swamy ebooks



ఇంతకు ముందే నిర్ణయించి ఉన్నారు భాష్యకారులు. ఆత్మనే సర్వత్రా చూడగలిగితే వాడు పండితుడు.

ఆత్మను చూడట మేమిటి. సర్వత్రా అస్తి భాతి ఉన్నది కనిపిస్తున్నదని ప్రతి పదార్థంలోనూ ఉండటమూ - ఉండటమనే స్ఫురణా - ఇవి రెండే చూస్తూ పోవాలి. నీవు చూస్తే అవి లేవు. అవి ఉంటే నీవు చూస్తున్నావని తెలుసుకో. చరాచర పదార్థాలు విషమంగా ఉండవచ్చు. మానవులు పశువులు కారు. పశువులు పక్షులుగావు. అవి వృక్షాలు గావు. వృక్షాలు పాషాణ మృత్తికాదులు గావు. ఒకదాని కొకటి విజాతీయం. సంబంధమే లేదు. సామాన్యమే లేదు. అంతా వైషమ్యమే. కాని సొమ్ము లన్నింటిలో బంగారం లాగా వాటిన్నిటిలో ఒకటి అనుస్యూతంగా పరుచుకొని ఉన్న పదార్థాన్ని చూడవచ్చు. కాని చూడం సాధారణంగా. కారణం. మనకా అలవాటు లేదు. స్ఫురించే పదార్థాలనే చూస్తూ పోతాము గాని అవన్నీ ఏ స్ఫురణలో ఉండి కనిపిస్తున్నాయో ఆ స్ఫురణ మీదికి పోదు మన దృష్టి. ఏమి కారణం. ఇవి సాకారమైతే అది నిరాకారం. ఇవి విషమంగా కనిపిస్తుంటే అది వీటిలో వ్యాపించి ఉన్న సమం. ఇవన్నీ ఉన్నాయనే స్ఫురణే **Awareness** అది. మరేదోగాదు. అదే ఆత్మ. అది నాలో ఉంది నేననే భావంతో. నేను చూచే వాటిలోనూ ఉంది - నాదనే భావంతో. జీవజగత్తులు రెండూ సూర్యరశ్మిలాగా కమ్ముకొని ఉందది. నిరాకారం గనుక పట్టుకోలేక పోతున్నాడు మనబోటి పామరుడు. ఒకటి చూడాలంటే దాని చూపు పెట్టుకొని చూస్తేనే అది కనపడుతుంది. తాడనే దృష్టి ఉన్నవాడికే త్రాడు కనిపిస్తుంది గాని పామని చూచేవాడికి తాడెలా కనిపిస్తుంది. పాము కనిపిస్తుంది. మనమందరమూ ఇప్పుడలాగే చూస్తున్నాము. సమంగా

Dr Dayananda Swamy ebooks


వ్యాపించి ఉన్నదాన్ని గాక దాన్నే విషమమైన చరాచర పదార్థాలుగా చూస్తున్నాము. కనుక అక్కడే ఉన్నా సమం మరుగుపడి పోయి అదే విషమంగా దర్శన మిస్తున్నది. అంటే సర్వవ్యాపకమైన ఆత్మ చైతన్యమే ఆయా వ్యక్తులుగా ఆయా రూపాలుగా భాసిస్తున్నది.

కాగా ఆత్మ జ్ఞాన మున్న పండితుడలా చూడడు. వాడీ విషమమైన సృష్టిలోనే సమాన్ని స్పష్టంగా చూడగలడు. విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే. విద్యా వినయ సంపత్తి ఉన్న ఒక సద్బ్రాహ్మణుడిలో ఏది చూస్తాడో అదే గవి ఒక గోవులో చూస్తాడు. హస్తిని – ఒక ఏనుగు శరీరంలో చూస్తాడు. అంతేకాదు. శుని ఒక కుక్కలో చూస్తాడు. శ్వపాకేచ ఆ కుక్క మాంసం వండుకొని తినే చండాలుడిలో కూడా అదే చూస్తాడు. అదే అంటే ఆసమాన్నే. సమమంటే ఏమిటి. సమంగా పరుచుకొన్న ఆత్మ తత్త్వాన్ని. సత్తాస్ఫూర్తులుగా సర్వత్రా వ్యాప్తమయి ఉందది. సర్వత్ర అంటే ఎక్కడని. చెప్పాడుగా బ్రాహ్మణుడు – గోవూ – గజమూ – శ్వానమూ – శ్వపాకుడని. ఇవన్నీ వేర్వేరు శరీరాలు. వేర్వేరు వ్యక్తులూ – భావాలూ – చేష్టలూ – ఎంతో విషమమైన పదార్థాలు. అవి ఎంత విషమమైనా విషమం కాని దొకటి వాటిలోనే చోటు చేసుకొని ఉంది. అదే ఉండటమనే స్ఫూర్తి. ఇవి స్ఫురించే పదార్థాలైతే అది కేవలం వీటిలో ఉన్న స్ఫురణ అది మాత్రమే పట్టుకొన్న వాడికి తేడా రాదు. అన్నీ సమానమే అవుతాయి. అయినా అవి కూడా ఉన్నాయిగదా అని అడగవచ్చు. సత్తా స్ఫూర్తులు లాగి వేస్తే అవి కేవలమా భాస అయి పోతాయి. వాస్తవంగా కనిపించవు. బంగారం లాగేస్తే నగల రూపాలూ వాటి వైవిధ్యమూ కనిపిస్తుందా నీకు. లాగేయట మంటే ఇక్కడ

Dr Dayananda Swamy ebooks


అధిష్ఠానం **Basis** మీదనే చూపు పెట్టటం. అప్పుడా రోపితమైన నామరూపాది పదార్థాలన్నీ తద్రూపంగానే దర్శనమిస్తాయి.

ప్రస్తుత మీ న్యాయాన్ని బట్టి చూస్తే బ్రాహ్మణుడు మొదలు చండాలుడి వరకూ వారిలో సచ్చిత్తులే **Existance and Awareness** కనిపిస్తుంటాయి పండితుడి దృష్టికి. వారి శరరాదులు కనిపించవు. విశేషాలన్నీ సామాన్య దృష్టితో చూచినప్పుడు సామాన్య రూపంగానే దర్శనమిస్తాయి. తరంగ బుద్బుదాది విశేషాలు విశేషదృష్టితో గాక జలమనే సామాన్య దృష్టితో చూస్తే జలం గాక మరేమిటి. అలాగే ఆత్మ దృష్టితో చూస్తే అనాత్మ ప్రపంచమెక్కడ ఉంది. అంతా ఆత్మే అయితే అలా చూడగలిగి ఉండాలి. వాడే జ్ఞాని అలాంటి జ్ఞాని అన్నింటిలో సమత్వాన్నే చూస్తాడు. అన్నింటినీ సమంగా చూస్తాడని కాదు అన్నింటిలో సమాన్ని చూస్తాడని అర్థం.

**ఇహైవ తై ర్జిత స్సర్గః - యేషాం సామ్యే స్థితం మనః**

**నిర్దోషం హి సమం బ్రహ్మ - తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః - 19**

లో అన్నారు గా అన్నారు. రెంటికీ ఏమిటి తేడా. సమం బ్రహ్మ. అది వస్తువు. అసలున్న పదార్థం. విషమంగా కనిపించే పదార్థాలన్నింటిలో ఉన్నదది. బ్రాహ్మణుడి దగ్గరి నుంచీ చండాలుడి వరకూ అన్ని ఉపాధులనూ వ్యాపించి ఉంది. కాని చిత్ర మేమంటే అదే ఆయా ఉపాధుల రూపంలో విషమంగా భాసిస్తున్నది. అది వస్తువైతే ఇది ఆభాస. ఆభాసలో ఉంది తేడా వస్తువులో లేదు. ఈ తేడా యే దోషం. ఇలాంటి దోషం సమంగా వ్యాపించిన బ్రహ్మంలో లేదు. కాబట్టి అది నిర్దోషం. అంచేత వస్తు దృష్టితో

Dr Dayananda Swamy ebooks



చూచే జ్ఞాని వస్తువైన బ్రహ్మాన్నీ బ్రహ్మమనే చూస్తాడు. దాని ఆభాస అయిన ప్రపంచాన్నీ బ్రహ్మంగానే చూస్తాడు. చూస్తాడే గాని వ్యవహరించడు. ఎందుకంటే ఆభాసలు వ్యావహారికంగా కనిపిస్తుంటాయి. వాటిలో వైషమ్యం కూడా వ్యావహారికంగా ఉంటూనే ఉంటుంది. కనుక సమదర్శినః అంటున్నాడు వ్యాసమహర్షి సమవర్తినః అనటంలేదు. లోకులందరూ జ్ఞానులు కారు. కాబట్టి వారికెప్పుడూ కనిపిస్తుంటుంది వైషమ్యం. వాడు బ్రాహ్మణుడూ చదువుకొన్న వాడూ - వీడు చండాలుడూ పరమ పామరుడూ అనే తేడా కొట్ట వచ్చినట్టు కనపిస్తుంది. మరి గోవూ గజము శునకమూ అయితే చెప్పనక్కరలేదు.

పోతే అది కూడా సమదృష్టితో చూస్తున్నా జ్ఞాని ప్రారబ్ధవశాత్తూ లోక దృష్టి ననుసరించ వలసివస్తుంది గనుక వ్యవహారంలో అలా నడుచుకోరాదు. సాంకర్య మేర్పడుతుంది. కనుకనే చెబుతున్నాడు మహర్షి యేషాం సామ్యేస్థితం మనః అని. మనసు మాత్రమే సామ్యావస్థలో నిలిచి ఉండాలి జ్ఞానికి. మనసంతా బ్రహ్మాకారమయి పోవాలి. అలా అయిపోతే ఎలా చూచినా ఎలా ప్రవర్తించినా అది బ్రహ్మమే వాడి దృష్టికి అలాంటప్పుడిక వాడీ సృష్టిని జయించాడనే అనుకోవచ్చు. ఇహైవ తైర్జిత స్సర్గః - సర్గః అంటే సృష్టి. ఇహైవ అంటే ఇక్కడే. జీవించి ఉండగానే సృష్టి రహస్యాన్ని ఛేదించి పట్టుకొన్నాడు వాడు. సృష్టి అంటే వైషమ్యం. అది చూడటం లేదు జ్ఞాని. బ్రహ్మాకారంగా భావిస్తున్నాడు. కనుక జయించాడనే అర్థం. దాటి పోడన్నమాట. వైషమ్యం లేనిదే గదా బ్రహ్మం వీడి దృష్టి కూడా అలాంటిదే అయింది గదా. అంచేత వీడూ బ్రహ్మంలోనే ఉంటాడు. బ్రహ్మం గానే

Dr Dayananda Swamy ebooks


ఉంటాడు. మరి ప్రపంచం మాటేమిటి. అది విషమంగదా. నిజమే. ఎంత విషమమైనా బ్రహ్మాని కది తన శక్తిగా భాసిస్తే – వీడి కది కేవల మాభాసగా కనిపిస్తుంటుంది. కాబట్టి ఎవరూ వస్తువని భావించరు కాబట్టి ఎవరికీ లేదీ ప్రపంచం. ఉన్నదల్లా అలా చూడలేని లౌకికుడికే.

**నప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య - నో ద్విజే త్ప్రాప్య చాప్రియం**

**స్థిర బుద్ధి రసమ్మూఢో - బ్రహ్మ విద్బ్రహ్మణి స్థితః - 20**

ఇంతకూ బ్రహ్మ జ్ఞాని అయిన వాడుపాధు లన్నింటిలో సమానంగా పరుచుకొన్న బ్రహ్మాన్నే దర్శిస్తూ శరీరాదులైన ఉపాధులన్నీ ఆ భాసగా చూస్తాడు కాబట్టి వాడికిక ఏ బాధా లేదు. ఉన్న బ్రహ్మం తన స్వరూపమే కాబట్టి దాని వల్ల బాధలేదు. ఆభాస వస్తువేకాదు కాబట్టి దానివల్లా లేదు. మంచీ చెడ్డా సుఖం దుఃఖ మనే ద్వంద్వాలేవీ వాణ్ణి బాధించవు. ద్వంద్వాలే గదా విషమం.సమమైన బ్రహ్మాన్నే చూస్తున్నవాడికి విషమమనే భావమెక్కడిది. విషమం లేకపోతే సుఖదుఃఖాలనే ద్వంద్వాలసలే లేవు వాడి దృష్టిలో అదే చెబుతున్న దిప్పుడు గీత న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య – నో ద్విజే త్ప్రాప్య చాప్రియ మ్మని. లోకులందరూ తమ కిష్టమైనది లభిస్తే ఆనందిస్తారు. కష్టమైనది ప్రాప్తిస్తే కంగారు పడతారు. కారణం. వారు విషమంగా చూస్తుంటారు రెండిటినీ. కాని వీడలా చూడటం లేదు గనుక అనుకూలమైన దానికి మురిసిపోడు. ప్రతికూలమైతే బెదిసిపోడు. పోడని కాదు.అలా పోకుంటేనే వాడు జ్ఞాని. రెండింటిలోనూ సమమైన బ్రహ్మతత్త్వాన్నే దర్శిస్తాడు కాబట్టి మోద విషాదాలనే ప్రసక్తి లేదు జ్ఞానికి.

Dr Dayananda Swamy ebooks


మరి అలా ఉండాలంటే సామాన్యం గాదు. ఆ పాటికి స్థిరత్వ మేర్పడాలి వాడి బుద్ధికి. సర్వభూతేషు ఏకః సమః నిర్దోషః ఆత్మా అని అర్థం వ్రాస్తున్నారు స్వామివారు. సమస్త పదార్థాలలోనూ ఉన్నదొకే ఒక ఆత్మ అది నిర్దోషమూ సమమూ - అది నా స్వరూపమే ననే స్థిరమైన బుద్ధి ఉండాలి వాడికి. అప్పుడే అసమ్మూఢః - ఏవిధమైన సమ్మోహం లేదు వాడికి - అంటే అజ్ఞానం లేదని అర్థం. సమం విషమంగా భావించటమే అజ్ఞానం. ఈ కనిపించే వైషమ్యం కూడా వాస్తవంలో సమమైన బ్రహ్మమేనని గుర్తించక పోవటం. గుర్తిస్తేనే వాడు బ్రహ్మవిత్ - బ్రహ్మజ్ఞాని. అంతే కాదు. బ్రహ్మణి స్థితః అంటున్నది గీత. బ్రహ్మంలోనే పాదుకొని ఉన్నాడు జ్ఞాని. మిగతా లోకులు లోకవ్యవహారంలోనైతే వీడు బ్రహ్మతత్త్వంలో ఉన్నాడు. స్వప్న ప్రపంచ మొకడు చూస్తుంటే అదే జాగ్రద్దశగా మరొకడు చూస్తున్నాడు. యా ని శా సర్వభూతా నా మనే శ్లోకభావ మిక్కడ తొంగి చూస్తున్నది. లోకులకు విషమమైనది జ్ఞానికి సమం. జ్ఞానికి సమంగా కనిపించేది వారికి విషమం. ఒకరిది ప్రపంచం మరొకరిది పరమాత్మ.

**బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా - విందత్యాత్మని యత్సుఖం**

**స బ్రహ్మయోగ యుక్తాత్మా - సుఖమక్షయ మశ్నుతే - 21**

ఇందులో ఏది కావాలి నీకని అడుగుతున్న దిప్పుడు గీత. బాహ్య ప్రపంచంవల్ల కలిగే సుఖమే కావాలా నీకు. దానితోనే తృప్తి పడతావా లేక బ్రహ్మ నిష్ఠలో పొందే సుఖం కావాలా. మొదటిది తాత్కాలికమైన సుఖమైతే రెండవది అక్షయమైన సుఖం ప్రాపంచికమైన సుఖం తాత్కాలికంగా నీకు

Dr Dayananda Swamy ebooks

సుఖ మనిపించినా పోను పోనది దుఃఖానికే దారితీస్తుంది. దుఃఖంలేని సుఖమంటూ లేదు లోకంలో. అందుకే దుఃఖాలయ మశాశ్వతమని చాటుతుంది గీత.

అది అశాశ్వత మని గ్రహించినవాడు బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా బాహ్యమైన శబ్దస్పర్శాదులలో పడిపోడు. ఆత్మా అంటే ఇక్కడ మనస్సని అర్థం. వాడి మనస్సు తగులుకోదు బాహ్య విషయాలలో. మనసే కదా ప్రధానం దేనికైనా. ఏ అనుభవమైనా మనసుకే ప్రపంచాను భవమైనా దానికే ఆఖరుకు బ్రహ్మానుభవమైనా దానికే. మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః అని గదా శాస్త్రోపదేశం. కాబట్టి మనసు బాహ్య విషయాలలో కాదు సక్తం కావలసింది. సక్తమైతే అది బంధకమే ఆ సుఖం. సుఖం లేదా అంటే లేదని గాదు. విందత్యాత్మని యత్సుఖం. ఎంతో కొంత పొంద వచ్చునీవు. కాని అది కొంతే. అనంతం గాదు. ఎందుకంటే పిండికొద్దీ రొట్టె అన్నారు. అసలా బాహ్యపదార్థాలే పరిచ్ఛిన్నం. అల్పం. తాత్కాలికం. మరి వాటివల్ల కలిగే సుఖ మనల్పం శాశ్వత మెలా అవుతుంది.

అంచేత అది ఎప్పటికీ ఆసించడు జ్ఞాని. వాడికి బాహ్యమైన శబ్ద స్పర్శాదులు కనిపించవు. వాటి వల్ల కలిగే సుఖమంత కన్నా కనిపించదు. అవి కనిపించేది మిగతా లోకులకే. వారికి ప్రపంచం తప్ప దాన్ని మించి మరొక పరమార్థ మంటూ లేదు. కనుక ఆ పొందే అల్పమైన ఆనందమే వారి పాలిటికి బ్రహ్మానందం. పోతే ఈ జ్ఞాని కలాకాదు. వీడికి బ్రహ్మం తప్ప మరేదీ కనిపించదు. బ్రహ్మమూ బ్రహ్మమే వాడి దృష్టికి ప్రపంచమూ బ్రహ్మమే. సబ్రహ్మయోగ యుక్తాత్మా. బ్రహ్మంతోనే యోగం వాడికెప్పుడూ.

Dr Dayananda Swamy ebooks

బ్రహ్మంతో యోగ మంటే అది సమాధి. వ్యవహారంలో కూడా బ్రహ్మమే. కాబట్టి ఎప్పుడూ సమాధే. దానితో యుక్తమైన ఆత్మవాడిది. వాడి అంతః కరణ మెప్పుడూ బ్రహ్మ భావనతోనే నిండి ఉంటుంది. ఇక ప్రపంచ దృష్టికి చోటెక్కడిది.

చోటు లేకపోతే ఉన్న దంతా బ్రహ్మమే. బ్రహ్మమనేది బాహ్య ప్రపంచం లాగా పరిమితం కాదు. అల్పంకాదు. తాత్కాలిక మంత కన్నా కాదు. దేశకాలా వధులు లేవు దానికి. అలాంటి బ్రహ్మాన్ని పట్టుకొన్నాడు వీడు. పట్టుకొన్నాడు కాదు. బ్రహ్మ మయమయి పోయింది వాడి మనస్సు. కనుక బ్రహ్మ మెలా ఉందో వీడూ అలాగే ఉండిపోతాడు. ఎలా ఉంది బ్రహ్మం. విజ్ఞాన మానందం బ్రహ్మ అన్న దుపనిషత్తు బ్రహ్మం జ్ఞాన స్వరూపం. అలాగే వాడూ జ్ఞాన స్వరూపుడు. అది ఆనందాత్మకం వీడిదీ ఆనందమే ఎలాంటి ఆనందమది. సుఖ మక్షయ మశ్నుతే అని హామీ ఇస్తున్నది గీత. క్షయం లేని ఆనందం శాశ్వతమైనది. బ్రహ్మం శాశ్వత మయినప్పు డానంద మశాశ్వత మెలా అవుతుంది. అలాంటి శాశ్వతానంద మీ బ్రహ్మీభూతుడైన జ్ఞానికీ లభించి తీరుతుంది. అందుకే సాధకుడైన ప్రతివ్యక్తీ ఎలా ఉండాలో చెబుతున్నారు భాష్యకారులు. తస్మాత్ బాహ్య విషయ ప్రీతేః క్షణి కాయాః ఇంద్రియాణి నివర్తయే దాత్మని అక్షయ సుఖార్థీ. క్షణికమైన బాహ్య విషయప్రీతికి అర్రులు చాచకుండా మానవుడు అక్షయమైన బ్రహ్మానందమే కోరినవాడైతే తన ఇంద్రియాలను వాటి నుంచి ఎప్పటికప్పుడు వెనక్కు మళ్లించుకోవా లంటారాయన.

Dr Dayananda Swamy ebooks



**యేహి సంస్పర్శజా భోగా - దుఃఖయోనయ ఏవ తే**

**ఆద్యంత వంతః కౌంతేయ - న తేషు రమతే బుధః - 22**

బాహ్య విషయాలతోడి సాంగత్యం తాత్కాలికమైన అల్పమైన సుఖాన్ని ఇస్తాయని మాత్రమే గాదు వాటి నుంచి మనసు మళ్లించ వలసిందని హెచ్చరించటం ఇంకా ఒకటుంది వాటిలో కానరాని దోషం. దుఃఖ యోనయ ఏవతే - దుఃఖాన్నే చివరకుతెచ్చి నెత్తిన పడేస్తాయవి. సుఖాభాసేకాని నిజమైన సుఖం కాదది. కారణం. అవే అసలు ఆభాస. ఏవి. యే హి సంస్పర్శజా భోగాః - ఇవేవో కనిపిస్తున్నాయి విషయాలు. వీటితో నా ఇంద్రియాలు సంపర్కం పెట్టుకొంటున్నాయి. వీటి మూలంగా నేను భోగ మనుభవిస్తున్నాను- అని మానవుడు మురిసి పోతున్నాడే అవి.

అవన్నీ అసలు వాస్తవం కావు అవీ కావూ వాటితో మన ఇంద్రియాల కేర్పడే స్పర్శలూ కావు. ఈ చక్షురాదీంద్రియాలూ కావా మాటకు వస్తే. ఈ మొత్తం కలాపమంతా వట్టిదే. వీటి అన్యోన్యవ్యవహార మంత కన్నా వట్టిదే. ఏమి కారణం. ఇవన్నీ ఆభాసే గాని వస్తువుకాదు. వస్తువు స్వతః ప్రమాణమైన ఆత్మ చైతన్యమొక్కటే. తతిమాది ఏదినీవు చూస్తున్నా చేస్తున్నా ఇది దాని తాలూకు ఆభాసే. అది వెలుగైతే ఇది దాని నీడ నీడ వాస్తవ మవుతుందా కనపడుతున్నా వాస్తవం కాదు. ఒక పక్షి పైన పోతుంటే దానినీడ క్రింద నేలమీద కనిపిస్తుంటుంది. అది ఉందంటావా అక్కడ దాని వల్ల ప్రయోజన ముందంటావా. అలాంటిదే శబ్దస్పర్శాది విషయ ప్రపంచం. వస్తు సిద్ధం కాదిది. ప్రతీతి సిద్ధం **Apparent notional.**

Dr Dayananda Swamy ebooks



అందుకే ఎప్పటికప్పుడు మారుతుంటుంది. నీ బుద్ధి మారుతుంటే అదీ మారుతుంటుంది. బుద్ధి ఎందుకు మారటం.దాన్ని నడిపే దొకటున్నప్పు డది మారక ఏ మవుతుంది. ఏమిటా నడిపేదంటే అవిద్య అన్నార్థు భాష్యకారులు. బాహ్యావిషయాలకూ అదే కారణం. వాటితో సంబంధం పెట్టుకొన్న ఇంద్రియ వర్గానికే అదే మూలం. దానివల్ల తయారైనవే ఈ రెండూ. అవిద్యాకృత మంటారాయన ఇవి రెండూ. అందుకే ఆద్యంతవంతః - ఆదీ అంతమూ ఉంది వీటికి. పుట్టక ముందు లేవివి. పోతే అసలే కనపడవు. మన ఇంద్రియాలూ ఇంతే.మనం చూచే శబ్దాదులూ ఇంతే.ఏవ అనటాన్ని బట్టి ఇహంలోనే కాదు పరంలో కూడా వీటి బ్రతుకింతేనని చాటుతున్నారు భగవత్పాదులు. అంతేకాదు. ఆదీ అంత ముంటుంది వీటికంటే ఇంకొక అర్థం కూడా చెబుతారాయన. ఇంద్రియాలకు విషయాలతో సంబంధ మేర్పడితే అది ఆది. వాటితో సంబంధం తెగిపోతే అది అంతం. తన్నిమిత్తంగా దానివల్ల కలిగే అనుభవం కూడా తెగిపోతున్నది గనుకనే ఆద్యంతాలు రెండూ తప్పంటారు. అంటే మధ్యకాలంలోనే వాటికస్తిత్వం.

ఇలాంటి క్షణ భంగురమైన సుఖాల వెంటబడి పోతున్నారంటే అత్యంత మూఢానామేవ విషయే షు రతిః యధాపశు ప్రభృతీనా మని చీవాట్లు పెడుతున్నారు గురువుగారు. ఎందుకిలా విషయాల వెంటపడిపోతు న్నారంటే అసలైన వస్తువేదో దాని జ్ఞానం లేక.అదే అవిద్య. అజ్ఞానం. పోతే వస్తువేదో దాన్ని గుర్తించిన వాడు జ్ఞాని. నతేషు రమతే బుధః - జ్ఞాని

Dr Dayananda Swamy ebooks


అయిన వాడెప్పుడూ ఆభాసరూపమైన ఇంద్రియ విషయాలలో రమించడు. అంటే నిమగ్నమయి పోడు. అవగత పరమార్థతత్త్వః అని వర్ణించారు భాష్యకారులు. అసలైన తత్త్వమేదో పట్టుకొన్నాడు జ్ఞాని. పట్టుకోటమంటే స్వానుభవానికి కూడా తెచ్చుకొన్నాడు. అప్పుడేవాడు బుధుడు వాడికీ విషయప్రపంచం విషయంగా కనిపించదు. విషయిగా కనిపిస్తుంది. అంటే ఆత్మగానే దర్శనమిస్తుంది. ఇక విషయ వాంఛ ఎక్కడిది వాడికి. ఆకాశపుష్పమది.

**శక్నోతీ హైవ యస్సోఢుం - ప్రాక్శరీర విమోక్షణాత్**
**కామక్రోధో ద్భవం వేగం - సయుక్తః ససుఖీ నరః - 23**

శ్రేయోమార్గానికి ప్రతికూలమూ సకలా నర్థాలకూ హేతుభూతమూ దుర్నివారమూ అయినదీ విషయ సుఖాభిలాష అనే దోషం. దీన్ని నివారించాలంటే ఎంతో బ్రహ్మ ప్రయత్నం చేయవలసి ఉందంటారు భాష్యకారులు ఏమిటా ప్రయత్న మది ఎలా చేయాలని అడిగితే జవాబిస్తున్నది గీత. ప్రాక్ శరీర విమోక్షణాత్ - శరీరం రేపు ప్రారబ్ధం తీరి పడిపోయే లోపలనే జాగ్రత్త పడాలి ప్రతి ఒక్కడూ. మరణ మనే హద్దు ఎందుకు చెప్పటమంటే ఆ తరువాత ఏదీ సాధించలేడు మానవుడు. అసంభవం. జీవించి ఉండగానే చేయాలి ఏ ప్రయత్నమైనా. జీవిస్తున్నంత వరకూ అవశ్యం భావీహి కామక్రోధోద్భవోవేగః- కామ క్రోధాలంటే రాగ ద్వేషాలు. అవి మహా ప్రబలమైన శత్రువులు. వాటి ధాటి తట్టుకోటం మహాకష్టం. అది మనసులో ఏర్పడుతుంది ముందు. కామంగానీ క్రోధం గానీ మనసులోనే గదా కలిగేది. చిత్తవృత్తులవి. అవి మనసులో ఉన్నంత వరకూ

Dr Dayananda Swamy ebooks


లోలోపల పురుగులయి తొలుస్తుంటాయి. తరువాత అవి బహిర్గత మయ్యాయో ఇక వాటి వేగమింతా అంతా కాదు. శరీరం గగుర్పొడుస్తుంది. కండ్లు విప్పారు తాయి. ముఖం వికసిస్తుంది. మనసు చలిస్తుంటుంది. ఇది కామం వల్ల కలిగే వేగం. పోతే క్రోధమింత కన్నా దారుణం. శరీరం కంపించి పోతుంటుంది. చెమట పడుతుంది. కళ్లు ఎఱ్ఱ పడుతాయి. పెదవులు గట్టిగా కరవటమూ పండ్లు కొరకటమూ ఒకటేమిటి. ఎంతో ఉంది క్రోధానికి వేగం.

ఇలాంటి కామక్రోధో ద్భవం వేగం - కామ క్రోధాల ఆర్భాటాన్ని శక్నోతీహైవ యస్సోఢుమ్ - మనసు హద్దులు దాటి బయట పడక ముందే హుషారు పడి మనసులోనే వాటిని త్రుంచి పారేయాలి. మొక్కలోనే తుంచాలిగాని మానుగట్టిన తరువాత ఏమీ చేయలేము. ఇహైవ. అది కూడా బ్రతికుండగానే సాధించాలి మానవుడు. అది ప్రతి మానవుడికీ కర్తవ్యం కామ క్రోధ వేగాన్ని సహనంతో జయించటమే అది. అయితే ఒకటి త్రోసివేయాలంటే మరొకటి పట్టుకొనే త్రోసి వేయగలం. అలాగే ఇక్కడ కూడా రాగద్వేషాల ప్రభావాన్ని అణగ దొక్కమని సలహా ఇచ్చారు బాగానే ఉంది. అది ఏ బలంతో చేయాలాపని. ఆత్మ బలమే బలం. బలమెక్కడి నుంచీ కొని తెచ్చుకొనేది కాదు. కారణ మేమంటే ఎక్కడి నుంచి తెచ్చుకొన్నా అది అనాత్మ ప్రపంచంలో నుంచే గదా తెచ్చుకోవలసింది. అనాత్మ ప్రపంచమంతా కామక్రోధాదులకు నిలయమే అయికూచుంది. అలాంటప్పుడది మనకు ఇచ్చే బలమేమి బలం. బలం కాదది ఇచ్చేది

Dr Dayananda Swamy ebooks


బలహీనత. కనుక వాటి ధాటి నెదిరించి నిలబడేది ఆత్మబలమే. ఆత్మబల మెప్పుడూ ఉంది. కాని దాన్ని గుర్తించేవరకూ పనిచేయదది. కాబట్టి ఆత్మ ఉందనుకొని సుఖంలేదు. దాని తాలూకు జ్ఞానం కావాలి మనకు. ఆత్మ జ్ఞాన బలమే ఆత్మ బలం. అదే జవాబు చెబుతుంది కామక్రోధ బలానికి. చెబితే ఇక అంతా సుఖమే. సయుక్తః ససుఖీనరః – అలాంటి మహాజ్ఞాని కెప్పుడూ సుఖమే. అది ఎప్పుడూ ఎడ బాయ కుండానే ఉంటుందాత్మ జ్ఞానం. యుక్త అంటే అదే అర్థం. ఎప్పుడది నిత్యసిద్ధమో ఆ జ్ఞానం – దానివల్ల కలిగే సుఖం కూడా నిత్యసిద్ధమే. యుక్తుడూ వాడే సుఖీవాడే. జ్ఞానికే సుఖం మరెవరికీ గాదు.

**యోఽంతస్సుఖోఽంతరారామ - స్తథాంత ర్జ్యోతి రేవయః**

**సయోగీ బ్రహ్మ నిర్వాణం - బ్రహ్మభూతోఽ ధి గచ్ఛతి - 24.**

అనాత్మ ప్రపంచం వల్ల లేకుంటే జ్ఞాని కీలాంటి సుఖ మొక్కడి నుంచి లభిస్తుంది. ఎలా లభిస్తుంది. మరెక్కడినుంచీ వచ్చే అవకాశమే లేదు గదా. నిజమే పామరుడి దృష్టి క లాగే అనిపిస్తుంది. అనాత్మ తప్ప పామరుడి కాత్మ అనే దొకటి ఉందనే తెలియదు. కనపడేదే ఉంటుంది గాని కనపడని దెలా ఉంటుందని వాడి ఆలోచన. కాని కనపడే దాని కాధారం కనపడని ఆత్మేనని వాడికర్థం కాదు. కనేది లేకుండా కనపడే దుంటుందా. ఉండకనే పోతే కనిపిస్తుందా.కనేది ఎప్పుడూ జ్ఞానమే. జ్ఞాన ప్రకాశంలోనే కనిపిస్తున్నదీ మొత్తం ప్రపంచం మనకు. లేకుంటే అంధకార బంధురం. ఏదిగానీ ఉందని చెప్పలేము. ఏదుందని చెప్పినా దాని కొక ప్రమాణ ముండాలి. ప్రమాణాన్ని బట్టే ప్రమేయాని కస్తిత్వం. ప్రమాణ

Dr Dayananda Swamy ebooks



మెప్పుడూ జ్ఞానమే. అది ప్రత్యక్షమైనా అనుమానమైనా ఆ గమమైనా ఏదైనా జ్ఞానమే. ఆ జ్ఞానమే ఆత్మ.

అలాటి ఆత్మలో లేని సుఖం దాని వల్ల భాసించే అనాత్మలో ఎక్కడిది. అగ్నికే ఉష్ణ గుణం లేకపోతే దాని సంపర్కం వల్ల జలాని కది సంక్రమిస్తుందా. అగ్నికది స్వాభావిక మైతే జలానికి సాంక్రామికం. లేదా ఆరోపితం. అలాగే ఆత్మలో లేని గుణం అనాత్మ ప్రపంచానికి రాదు. ఆత్మ ఆనంద స్వరూపం. దాని గుణం కూడా కాదు. స్వరూపమే సుఖం. అలాంటి సహజమైన సుఖాన్నే పొందగలడు యోగి. ఎందుకంటే వాడాత్మనే అనుభవానికి తెచ్చు కొన్నాడు. ఆత్మానుభవ ముందంటే సుఖానుభవం కూడా ఉన్నదనే అర్థం. కనుక సుఖమనేది ఎక్కడ ఉందా అని వెతుక్కో నక్కరలేదు వాడు. వాడి సుఖం అంతస్సుఖం. యోంత స్సుఖః - లోపలే ఉంది సుఖం వాడికి. అదే వెలపల పదార్థాల మీద కూడా పడుతున్నది. సూర్యరశ్మి మండలంలోనే గాక బయటి ప్రపంచమంతా వ్యాపించినట్టు, అలా పడే సరికీ శబ్దాది విషయాల వల్లనే కలుగుతున్నదా సుఖమని వీటికోసం వెంపరలాడుతు న్నాడు తెలియని మానవుడు. కస్తూరి మృగం తన దగ్గరే కస్తూరి ఉందని తెలియక గడ్డి పొదలు వాసన చూచి నట్టంటాడు కబీరు దాసు.

జ్ఞాని అలా తెలియని వాడు కాదు. వాడీ విషయ సుఖం దేని మూలంగా కలుగుతున్నదో ఆ మూలాన్ని పట్టుకొన్నాడు. ఆత్మే మూలం దీనికి. కనుక ఆత్మలోనే ఉండి ఆత్మ సుఖాన్నే అనుభవిస్తాడు జ్ఞాని. అంతరారామః - అంతే కాదు. అంతరా రాముడు కూడా వాడు ఆరామమంటే క్రీడ. ఆట. ఆత్మతోనే క్రీడిస్తుంటాడట. ఇది భాష్యకారుల

Dr Dayananda Swamy ebooks


మాట. ఆరామ మంటే క్రీడ అనే కాదు. విశ్రాంతి అని కూడా అర్థమే. ఆత్మలోనే విశ్రమిస్తుంటాడని చెప్పినా చెప్పవచ్చు. ఉన్నదంతా ఆత్మే అయినప్పుడెక్కడ విశ్రమించాలి వాడాత్మలోగాక.

తథా అంత ర్జ్యోతి రేవయః – అంతేగాక అంతరాత్మే వాడికి జ్యోతి. చైతన్య ప్రకాశమే ప్రకాశం. సౌరప్రకాశం కాదు. చంద్ర ప్రకాశం కాదు. అగ్నిప్రకాశం కాదు. తమేవ భాంత మనుభాతి సర్వం.

ఆత్మ చైతన్యం ప్రకాశిస్తుంటేనే దాని ననుసరించి ఇవి కూడా ప్రకాశిస్తాయి. సూర్య చంద్రాదుల చేతన పదార్థాలు. అచేతనానికి స్వతహాగా లేదు ప్రకాశం. చైతన్యం సప్లై చేస్తేనే. చైతన్య మలా కాదు. స్వయంగానే ఉంటుంది దానికి ప్రకాశం. ప్రకాశమేమిటి. ఉన్నాననే ప్రజ్ఞా స్ఫురణే ప్రకాశమంటే. మొదట నేనున్నాననే స్ఫురణే ఉంది నాకు సహజంగా. ఆతరువాత నాకు కనిపించే సమస్తమూ ఉందని చూస్తున్నాను. ఇందులో నేనున్నాననే స్ఫురణ సహజమైన స్ఫురణ . దాని వెలుగులో చూస్తే కనిపిస్తున్నది కాబట్టి ఈ ప్రపంచానికది సహజం కాదు. కృత్రిమం.

అలాంటి కృత్రిమ ప్రపంచం వల్ల కలిగే సుఖమే సుఖమని నీవు భావించినప్పుడు సహజమైన ఆత్మ సుఖమను భవించే వాడెలా భావిస్తాడో చెప్పు. కృత్రిమం కాబట్టి ఇది ఇంకా తాత్కాలికం. సహజం కాబట్టి అది శాశ్వతం. చైతన్య మెప్పుడూ ఉంటుంది కాబట్టి దాని ప్రకాశమూ ఎప్పుడూ ఉంటుంది. దానివల్ల కలిగే సుఖమూ విశ్రాంతీ ఎప్పుడూ ఎడతెగకుండా అనుభవానికి వస్తూనే ఉంటాయి జ్ఞానికి.

Dr Dayananda Swamy ebooks



బ్రహ్మ భూతోధిగచ్ఛతి. బ్రహ్మ భూతుడు వాడు. బ్రహ్మమే అయిపోయాడు. కనుకనే అధిగచ్ఛతి. ఎప్పుడూ అందుకొంటూనే ఉంటాడు. ఏమిటది. బ్రహ్మ నిర్వాణం. నిర్వృతే నిర్వాణం. అంటేమోక్షమని అర్థం వ్రాశారు భగవత్పాదులు. బ్రహ్మ నిర్వాణమది.బ్రహ్మభావంలోనే లభిస్తుందది. వాడు బ్రహ్మ భావం పొందాడు. కాబట్టి మోక్షం కూడా దానితో పాటే అందుకొన్నాడు. మోక్షం వేరూ బ్రహ్మం వేరూ కాదు వేదాంతులకు. బ్రహ్మమే మోక్షం. మోక్షమంటే విడుదల. దేనిలో నుంచి. సంసారంలో నుంచి. సంసారమంటే సుఖదుఃఖానుభవమే. సుఖం కూడా తాత్కాలికమే కాబట్టి వాస్తవానికదీ దుఃఖమే. కనుక దుఃఖంలో నుంచి బయట పడటమే మోక్షం. అది బ్రహ్మ జ్ఞానం వల్లనే. కాబట్టి బ్రహ్మ జ్ఞానికెప్పుడూ సుఖమే. ఎప్పుడూ మోక్షమే. దుఃఖ స్పర్శకూడా లేదు. అది కూడా ఎప్పుడో మరణానంతరం కాదు. జీవించి ఉండగానే నంటారు భగవత్పాదులు. జీవితంలో దాని అనుభవం లేకపోతే రేపు మరణానంతరం కలుగుతుందని గ్యారంటీ ఏమిటి. కనుక జీవన్నేవ బ్రహ్మ భూతః సన్నధిగచ్ఛతి - ప్రాప్నోతి అని వర్ణిస్తారాయన.

**లభంతే బ్రహ్మ నిర్వాణం - ఋషయః క్షీణ కల్మషాః**

**ఛిన్న ద్వైధా యతాత్మానః - సర్వభూతహితే రతాః- 25**

మరి ఇలాంటి జీవన్ముక్తు లెవరైనా ఉన్నారా లోకంలో . మనకు కనిపిస్తారా అని సందేహ ముండవచ్చు మీకు. అలాంటి పిచ్చి పిచ్చి సందేహా లేవీ పెట్టుకోకండి. సంశయాత్మా వినశ్యతి. ఎప్పుడూ అనుమానాలు

Dr Dayananda Swamy ebooks



పెట్టుకొనే వాడేదీ నమ్మడు. చూచినా నమ్మడు. చూడకున్నా నమ్మడు. చూడనిది కాదంటాడు. చూచింది అది కాదులే పొమ్మంటాడు. కాని వాస్తవ మేమంటే వాడు నమ్మినా నమ్మకపోయినా ఉన్నారు లోకంలో అలాంటి మహానుభావులు. అప్పుడూఉన్నా రిప్పుడూ ఉన్నారు. అయితే వారిని నీవు పోల్చుకోలేవు. కారణం నీవు వారి స్థాయి కెదిగి చూడలేవు. స్థాయి కెదగటమంటే వారి లక్షణా లెలాంటివో వాటి అవగాహన అంతకంతకూ అలవరుచుకోటం. ఎలా ఉంటాయి వారి లక్షణాలంటే వర్ణిస్తున్నది గీత.

ఋషయః క్షీణ కల్మషాః– ఋషులు వారు. ఋషి అంటే గడ్డాలు మీసాలు పెంచుకొని కళ్లు మూసుకొని గుహల్లో కూచొని ధ్యానం చేసేవారు గారు. సమ్యగ్దర్శినః – ఉన్న దున్నట్టు దర్శించేవారు. అన్నిటికీ అధిష్ఠాన **Basis** మేదో దాన్నే గమనిస్తున్నవారు. అలాంటి ఆత్మతత్త్వమే చూస్తున్నా రంటే వారికిక ఏ కల్మషమూ లేదు. ఏ దోషమూ లేదని అర్థం. దోషమంటే వైషమ్యదృష్టి. అంతా సమంగా చూస్తున్న వాడికి వైషమ్య మేముందని. వైషమ్య మెప్పుడు లేదో ఛిన్న ద్వైధాః. ఇక సందేహమే లేదు వారికి. నిశ్చయ జ్ఞానంతో ఉంటారు. అంతేకాదు – మనోనిశ్చయ మేర్పడిందంటే యతాత్మానః ఇంద్రియాలు వారినిటూ అటూలాగే ప్రశ్న ఉండబోదు. అంతేకాదు. సర్వభూతహితే రతాః – సర్వమూ ఆత్మగానే చూస్తుంటారు కాబట్టి ఏ ప్రాణిని చూచినా దాని హితమే కోరుతారు. అహితం చేయాలని లవలేశ మనిపించదు. వైషమ్యదృష్టితో చూస్తేనే వీడు మనవాడు పరాయివాడ

Dr Dayananda Swamy ebooks



నేతేడా. అంతా సమమైన ఆత్మగానే దర్శించేవాడి కలాంటి విభేదమెలా ఏర్పడుతుంది.

ఇప్పుడిలాంటి దైవగుణ సంపన్నులూ ఆత్మ జ్ఞాన సమన్వితులూ లేరంటారా లోకంలో. మనుష్యాణాం సహస్రేషుఅని నూటికి కోటికొక్కరైనా ఉండకపోరు. చాలా అరుదైతే కావచ్చుగాని అసలే లేరని కొట్టివేయరాదు. అలాంటి మహనీయుణ్ణి గుర్తు పట్టే తాకతు నీకూ నాకూ లేకపోవచ్చు . అంతేకాని వాడే లేడనరాదు. ఉంటాడెవడో ఒకడు. వాణ్ణి గుర్తించే వాడూ ఉంటాడెవడో ఒకడు. గుర్తించాలంటే ఎలా గుర్తించాలో చెప్పింది మనకు శాస్త్రం. ఇలాంటి లక్షణా లెవరిలో నీకు కనపడతాయో వాడు బ్రహ్మ వేత్త జీవన్ముక్తుడని అర్థంచేసుకోమని. వాడివాడి లక్షణాలను బట్టే అర్థం చేసుకోవలసి ఉంటుందెవడి నైనా. అవే మనకు పట్టి ఇస్తాయి వాడి స్వరూప మెలాంటిదో వాడున్న స్థితి ఎలాంటిదో.

**కామక్రోధ వి యుక్తానాం - యతీనాం యత చేతసాం**

**అభితో బ్రహ్మ నిర్వాణం - వర్తతే విదితాత్మనామ్ - 26**

అసలెందుకు వచ్చిందీ సందేహం నీకు. లోక దృష్టితో చూస్తే అన్నీ సందేహాలే . జ్ఞాన దృష్టికే సంశయమూ లేదు - రజ్జు దృష్టికి రజ్జువే కనిపిస్తుంది. అదే సర్ప దృష్టితో చూస్తే సర్పమే కనిపిస్తుంది. ఇందులో ఆశ్చర్య మేముంది. పదార్థమొకటే. అదే తెలిసిన వాడి దృష్టి కొకవిధంగా తెలియని వాడి దృష్టికి మరొక విధంగా గోచరిస్తుంది. బ్రహ్మ తత్త్వం

Dr Dayananda Swamy ebooks



కూడా ఇంతే. బ్రహ్మమే ఇదంతానని చూచేవాడికి ప్రపంచమంతా బ్రహ్మమే. అలా చూడలేని వాడికా బ్రహ్మం కూడా ప్రపంచమే.

అలా బ్రహ్మాకారంగా చూడటానికే సమ్యగ్దర్శనమని పేరుపెట్టారు భాష్యకారులు. సరియైన చూపుతో చూడమని అర్థం. వారే విదితాత్ములు. ఆత్మ అంటే ఏమిటో నూటికి నూరు పాళ్లూ అనుభవానికి తెచ్చుకొన్న వాళ్లు. అలాంటి విదితాత్ములకు ముందు చెప్పిన బ్రహ్మ నిర్వాణమనేది దూరంగా ఎక్కడో లేదు. ఎక్కడికో వెళ్లి అందుకోవలసిందీ కాదు. ఎక్కడబడితే అక్కడే ఉందది. అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే అని హామీ ఇస్తున్నది గీత. అభితః అనే మాటకు రెండర్థా లున్నాయి. సర్వత్రానని ఒక అర్థం. అభి ముఖంగా **Face to face** నని మరొకఅర్థం. దేశకాల వస్తువులనే తేడా లేకుండా అంతటా దర్శనమిస్తూనే ఉంటుందది ఆకాశంలాగా. ఇది జడాకాశమైతే అది చిదాకాశం.ఆకాశాన్ని కూడా వ్యాపించిన చైతన్యం. పోతే అంతటా పరుచుకొని ఉన్న ఆ బ్రహ్మ చైతన్యమే ఎటు చూస్తే అటు ఎదురుపడి కనిపిస్తుంది కూడా. ఏ మాత్రమూ మరుగుపడకుండా ఆకాశంలాగా బయట పడి కనిపిస్తుంటుంది. చేయి వేస్తే తగులుతుంది.

అంతేకాదు. భగవత్పాదు లింకొక గొప్ప అర్థం కూడా చెబుతారు. అభితః అనే పదానికి ఉభయతః అని అర్థం చెప్పారాయన. ఉభయతః అంటే రెండు దశలలోనూ అని అర్థం. ఏమిటవి. జీవతాం మృతానాంచ. జ్ఞాని జీవించి ఉన్నప్పుడూ అదే అనుభవం. మరణించినతరువాతా అదే అనుభవం. మరణానికి ముందూ వెనకా అనే తేడా లేదు బ్రహ్మానుభవానికి.

Dr Dayananda Swamy ebooks



ఎప్పుడూ బ్రహ్మదర్శనమే. జీవించి ఉండగా జీవముక్తి. జీవితానంతరం విదేహ ముక్తి. అసల నంతరమనే ప్రశ్న లేదు. ఎందుకంటే మరణం జ్ఞాని దృష్టిలో లేదు.జ్ఞాని బ్రహ్మమే అయినప్పుడు మరణ మెక్కడిది. జ్ఞాన ముంటే మరణం రాదు. మరణం జ్ఞానం తొలగినప్పుడే. తొలగటమనే ప్రసక్తిలేదు బ్రహ్మ జ్ఞానానికి. అది మనకున్న విశేషజ్ఞానం లేదా వృత్తి జ్ఞానం కాదు. సామాన్య జ్ఞానం. శరీరమనః ప్రాణాదులైన ఉపాధుల మీద ఆధారపడేది కాదా జ్ఞానం. ఇవి ఉన్నా లేకున్నా అది అఖండంగా వెలుగుతూనే ఉంటుంది. అప్పుడే అది సామాన్య జ్ఞాన మనిపించు కోగలదు. అలాంటి పరిపూర్ణ జ్ఞాన సంపన్నుడు వాడు. ఇక జీవిస్తే నేమి మరణిస్తేనేమి. తేడా రాదు. మరణం లేదనిచెప్పి మరలా మరణిస్తే అంటున్నారేమిటని శంకించవచ్చు. మరణం వాడి జ్ఞానానికి కాదు. ఆ జ్ఞానానికి జ్ఞేయ భూతమైన **Known** శరీరాది సంఘాతానికి. దాన్ని కూడా జ్ఞాన స్వరూపంలోలయం చేసుకొని చూస్తుంటాడు వాడు. కాబట్టి వాడికి శరీరాదులు కనిపించవు. కనిపించినా తన స్వరూపానికా భాసగా కనిపిస్తుంటాయి. కాలిపోయిన కాగితాల కట్టలాగా కనిపిస్తున్నా ఉపయోగం లేనివవి. ప్రారబ్ధం తీరితే అవి కూడా పతనమై అప్పటినుంచీ వస్తురూపంగానే అనుభవానికి వస్తుంటాయి జ్ఞానికి. కనుక జ్ఞాని ఎప్పుడూ ఒకే దశలో ఉంటాడు. జీవితమూ మరణమనే తేడా దృశ్యమైన ఉపాధికేగాని దృగ్రూపుడైన వాడికి లేదు.

అయితే ఇలాంటి మహోన్నతమైన దశ నందుకోవాలంటే సామాన్యం కాదు. కామక్రోధ వియుక్తానాం - యతీనాం - యత చేత

Dr Dayananda Swamy ebooks


సామంటున్నది గీత. మూడు లక్షణాలలో ఆపాటికే శిక్షణ పొంది ఉండాలి వాడు. కామక్రోధాలు రెండూ జయించి ఉండాలి. అది ఒకటి. నిత్యమూ యతనం లేదా ప్రయత్నం సాగిస్తూ ఉండాలి జ్ఞానార్జనకు. రెండు అంతేకాదు యతచేతసా మంటున్నాడు. మనసెప్పుడూ తదాకారంతోనే నిండిపోవాలి మూడు - అప్పుడే అది పరిపాకానికి వస్తుంది. వస్తే ఇక తొలగిపోయే భయమే లేదు. ప్రారబ్ధం కొద్దీ తొలగినట్టు కనిపించినా ప్రత్యనుసంధాన బలంతో ఎప్పటికప్పుడు ప్రత్యక్ష మవుతూనే ఉంటుంది.

ఇక్కడ రెండు సూక్ష్మాలున్నాయి మనం బాగా లోతుకు దిగి తేల్చుకో వలసినవి. ఒకటి కామక్రోధాలనే మాట. రెండవది బ్రహ్మమూ ఆత్మా అనే మాట. మొదట కామక్రోధాల విషయ మాలోచిద్దాం. కామక్రోధాలంటే ఏవోగావు. రాగద్వేషాలకే మారుపేరని చెప్పాము. ఇచ్ఛా ద్వేషాలన్నా అవే. ఈ జంట పదాలు మూడూ పదే పదే వినిపిస్తుంటాయి మనకు భగవద్గీతలో ఇంతకుముందూ వచ్చాయివి. ఇప్పుడూ వస్తున్నాయి. ఇక మీదటా వస్తాయి. ఎందుకు వీటి కింత ప్రాధాన్య మిస్తున్నది గీత. ఇవి రెండూ ఉన్నంత వరకూ అసలు నీవు సాధనే చేయలేవని శాపం పెడుతున్నది.

ఏమి టిందులో ఉన్న రహస్యం. సంసారమే మానవుడికున్న ఏకైక సమస్య. అది ద్వంద్వాత్మకం. ద్వంద్వాలంటే ఒకటి అనుకూలం. ఒకటి ప్రతికూలం **Opposites.** సుఖదుఃఖాలూ జయాపజయాలూ. లాభనష్టాలూ పుణ్యపాపాలూ. చివరకు జనన మరణాలూ - ఇహపరాలూ - పూర్వోత్తర జన్మలూ - ఇవన్నీ ద్వంద్వాలే. కాని చిత్రమేమంటే ఇన్ని విధాలుగా కనిపిస్తున్నా ఇవి పరిగణించటానికే పనికి వస్తాయి గాని లోతుకు దిగి

Dr Dayananda Swamy ebooks

విమర్శిస్తే ఇన్ని లేవు ద్వంద్వాలు. వాస్తవంలో ఇవన్నీ కలిసి రాగద్వేషాలనే ద్వంద్వంలోనే చేరిపోతాయి. ఎలాగని అడుగుతారేమో. సుఖదుఃఖాలలో సుఖం మీద రాగం మనకు. దుఃఖం మీద ద్వేషం. అలాగే లాభమంటే రాగం. నష్టమంటే ద్వేషం. జయం మీద రాగం. అపజయం మీద ద్వేషం. ఏ ద్వంద్వమైనా చూడు నీవు. ఒకటి అనుకూలమైతే ఒకటి ప్రతికూలం. అందులో అనుకూలం మీద రాగం మనకు ప్రతికూలం మీద ద్వేషం. అవునా కాదా. కాబట్టి ప్రపంచమంతా ద్వంద్వాత్మకమైతే అది అనుకూల ప్రతికూలాలైతే అది మరలా ఏదో గాదు రాగద్వేషాలే. లేదా కామక్రోధాలే. అంటే ఏమన్నమాట. ప్రపంచమంతా కామక్రోధాత్మకమే చివరకు.

కాబట్టి అనాత్మ ప్రపంచ సమస్య పరిష్కారం కావాలంటే ఈ కామక్రోధాలకు జవాబు చెప్పట మొక్కటే మార్గం. అవి మనలను వెంటాడుతున్న వరకూ సమస్య తప్పదు. అందుకే ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వ మోహేన భారత సర్వభూతాని సమ్మోహం సర్గేయాంతి పరంతప అని ఘంటాపథంగా చాటుతున్నది భగవద్గీత. ఇచ్ఛాద్వేషాలనే ద్వంద్వ మొక్కటే అసలు మనకున్న ద్వంద్వం. మరేద్వం ద్వమూ లేదు. దానివల్ల ఏర్పడిందే మోహం లేదా అజ్ఞానం. అది సర్వ మానవులకూ జన్మతోనే సంప్రాప్త మయిందట. అంచేత రాగద్వేషాలనే ద్వంద్వం మనలను వెంటాడుతుంటే దాన్ని సాధకుడైన వాడు వేటాడి నిర్మూలించవలసి ఉంది. లేకుంటే సంసారమే తప్ప సాయుజ్యానికి నోచుకోలేడు. అందుకే గీత

Dr Dayananda Swamy ebooks


కర్మ - సమాధి - జ్ఞానయోగు లందరినీ మాటి మాటికీ ఇలా హెచ్చరించి చెప్పటం. ఇంతకూ జీవితంలో అనుకూల ప్రతికూలాలు రెండింటినీ ఉదాసీన భావంతో చూడాలని - అలా చూడటమే సమదర్శన మని - సమమంటే అది బ్రహ్మ స్వరూపమే గనుక బ్రహ్మానుభవం దాని వల్లనే మన మాసించగలమని వ్యాసమహర్షి హృదయం.

పోతే ఇక రెండవ అంశం బ్రహ్మమూ ఆత్మా అనేమాట. బ్రహ్మమని ఒకచోట ఆత్మ అని ఒకచోట మార్చి మార్చి ప్రయోగిస్తుంటాడు మహర్షి. ఇప్పుడీ శ్లోకంలోనే చూడండి. అభితో బ్రహ్మ నిర్వాణం - వర్తతే విదితాత్మనామ్. బ్రహ్మమూ ఆత్మా అని రెండు మాటలూ వినపడుతున్నాయి. పైగా ఆత్మ జ్ఞానం గడించామంటే బ్రహ్మ నిర్వాణమే పొందగల మంటాడు.రెండూ ఒకటైతేనే అది చెల్లుతుంది. రెండూ ఒకటైతే రెండు మాట లెందుకు వాడవలసి వచ్చింది. దీనికి సమాధాన మేమంటే రెండింటికీ ఒకటే అర్థం. పిల్లి మార్జాలమని రెండు శబ్దాలు ప్రయోగించినా అవి రెండూ చెప్పే అర్థమొకటే గదా. అలాగే ఇక్కడా. బ్రహ్మమంటే అన్నిటి కన్నా పెద్దదని అర్థం. అన్నిటికన్నా పెద్ద దన్నిటినీ తనలో ఇముడ్చు కొంటుంది. ఇముడ్చుకోటమే గాక అన్నీ తన స్వరూపంలో లయం చేసుకొంటుంది. అందుకే బృహత్వా దృృంహణత్వా ద్బర్హణ త్వా ద్బ్రహ్మ అని నిర్వచించారు బ్రహ్మ శబ్దాన్ని.

అయితే అలాటి పదార్థమేమిటి అది ఎక్కడ ఉంటుందని అడిగితే నీవు - అది ఏదోగాదు ఆత్మేనన్నారు. ఆత్మేమిటి. నేను అనే స్ఫురణే ఆత్మ. నేననే స్ఫురణే దాని స్వరూపం **Substance**. అది ఇప్పుడు నాలోనే

Dr Dayananda Swamy ebooks


ఉన్నదా స్ఫురణ. కాని శరీరం మేరకే పరిమితమై ఉన్నది. పరిమితంగాక పరిపూర్ణమైతే అదే బ్రహ్మం. పరిమితం కావటం కూడా ఉపాధుల వల్ల అలా భాసిస్తున్నదే గాని వస్తుతః అది పరిపూర్ణమే. కనుక ఆత్మ బ్రహ్మమే. బ్రహ్మమైనా అది నేననే స్ఫురణే కాబట్టి బ్రహ్మ మాత్మే. పరోక్షంగా చూస్తే బ్రహ్మం. అపరోక్షంగా భావిస్తే ఆత్మ. అయ మాత్మా బ్రహ్మ అని మహావాక్యం. దానికిలాగే వ్యాఖ్యానం చేశారు భగవత్పాదులు. కాబట్టి బ్రహ్మమూ ఆత్మ వేరుగావు. ఒకదాని కొకటి పర్యాయ పదాలు **Synonyms.** కనుకనే సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ యో వేదనిహితం గుహాయాం అని మొదట బ్రహ్మమనే మాట ప్రయోగించి - తస్మా దేత స్మా దాత్మనః ఆ ఆత్మనుంచే తేజోబన్నాది సృష్టి జరిగిందని రెండింటినీ ఏకం చేసి వర్ణించింది తైత్తిరీయోపనిషత్తు. కనుక ఇదీ వీటి విషయంలో మనం చెప్పుకోవలసిన సమాధానం. ఇంతకన్నా ఏమీ లేదు.

**స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ - చక్షుశ్చైవాంతరే భ్రువోః**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా- నాసాభ్యంతర చారిణౌ - 27**
**యతేంద్రియ మనోబుద్ధి ర్ముని ర్మోక్ష పరాయణః**
**విగతే చ్ఛా భయక్రోధో - యస్సదా ముక్త ఏవ సః - 28**

ఇంతవరకూ సమ్యగ్దర్శనులైన జ్ఞానులకు కలిగే సద్యోముక్తిని వర్ణించారు. దానికి సాధనమైన కర్మయోగాన్ని కూడా వర్ణించింది గీత. సమస్తమూ ఈశ్వరార్పణ చేసి నిష్కామంగా కర్మ లాచరిస్తే అది క్రమంగా సత్త్వశుద్ధి చేసి జ్ఞానానికి దారితీస్తే తరువాత కర్మలను కూడా జ్ఞాన దృష్టితో చూచి జ్ఞానంతోనే వాటిని సన్న్యసించట మెలాగో అలాటి కర్మసన్న్యాసం

Dr Dayananda Swamy ebooks


కూడా వర్ణించి చెప్పింది. అయిదధ్యాయాలలో చెప్పిందీ జ్ఞానకర్మలే. పోతే ఇప్పుడీ జ్ఞానమూ కర్మా రెండే గాక మరొక యోగం కూడా పేర్కొంటున్నది గీత. ఏదోగాదది ధ్యానం. కర్మయోగం జ్ఞానానికి బహిరంగ మైతే **External** ఈ ధ్యాన యోగం జ్ఞానాని కంతరంగ **Internal** మని చెబుతారు భగవత్పాదులు. కర్మ బాహ్యంగా కనపడు తుంటుంది అందరికీ. ధ్యానమలా కనపడదు. ఇది కేవలం మానసికమైన వృత్తి **Function.** వృత్తిగాని వృత్తి. కనుక కర్మయోగం కన్నా బలవత్తర మైనది. కర్మయోగం గట్టిపడితే ధ్యానయోగంగా మారుతుంది. ధ్యానయోగ మింకా బలం పుంజుకొంటే జ్ఞానయోగంగా పరిణమిస్తుంది. ఇదీ వరస. చివరకు జ్ఞానమే ఇవ్వాలి మోక్షం. ఇవేవీ గావు. కర్మ ధ్యాన యోగాలు కేవలం మనస్సుకు శిక్షణ మాత్రమే. ఒకటి చిత్తానికి శుద్ధీ **Purification** మరొకటి ఏకాగ్రతా **Concentration** ప్రసాదిస్తాయి. అదే జ్ఞానం కాదు. జ్ఞానమనేది ప్రమాణం **Congnition** కర్మా ధ్యానం ప్రమాణాలు కావు. ప్రమాణమే ప్రమేయం **To be cognised** తాలూకు అనుభవాన్ని అందజేస్తుంది. ప్రమేయ మిప్పుడు మనకు బ్రహ్మం. అది ఇదమిత్థమని పట్టి ఇచ్చేది ప్రమాణభూతమైన జ్ఞానమే గాని కర్మాదులు గావు. ఇది సుఖమని అనుభవానికి రావాలంటే జ్ఞానంవల్లనే గదా రావాలి. సుఖాకార వృత్తే జ్ఞానం. అలాగే బ్రహ్మాకార వృత్తి కూడా జ్ఞానమే. కర్మ అలాటి వృత్తిగాదు. ధ్యాన మంత కన్నా కాదు. అవి ఇలాటి వృత్తి కలగకపోతే దాని కవరోధం కల్పించే చెత్తా చెదారం ప్రక్కకు తోసివేస్తాయి. అంతమాత్రమే. కర్మ అహంమమ లనే చెత్తను తొలగిస్తే ధ్యానం ఆవరణ విక్షేపాలనే చెత్తను త్రోసి పారేస్తుంది. అప్పుడా

Dr Dayananda Swamy ebooks


మనసులో బ్రహ్మాకార వృత్తి ఉదయిస్తుంది. అది బ్రహ్మాన్ని చూపుతుంది. ఆ వృత్తే జ్ఞానం అదే ప్రమాణం. అందులో ప్రతిఫలించే బ్రహ్మమే ప్రమేయం. అంచేత కర్మధ్యానా లుపాయమైతే జ్ఞానమనేది ఉపేయమన్నారు భగవత్పాదులు.

ప్రస్తుతం ధ్యానయోగమనే ఉపాయ మెలా టిదో అది ఎలా మన మవలంబించాలో వర్ణిస్తున్నది గీత. స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ - స్పర్శలంటే శబ్దాదులు. వాటిని ముందు బయటికి పంపించాలి. అవి అసలు బయటనే ఉన్నాయి. కాని శ్రోత్రాదులైన ఇంద్రియాల ద్వారా వచ్చి మనసులో ప్రవేశిస్తుంటాయి. వాటిని మరలా మనసులో నుంచి బయటికే త్రోసివేయాలి. త్రోసి వేయటమంటే వాటిని ఫలానా అని మనసులో ఆలోచించక పోవటమే. ఆలోచించకుంటే అవి మనసుకు రావు. పోతే చక్షుర్దృష్టిని భ్రూమధ్యంలో ఉంచా లంటున్నది గీత. కంటిచూపు అటూ ఇటూ ప్రసరించకుండా ఒకేచోట నిలపాలని అర్థం. కనుబొమ్మల మధ్య ఉన్నది సుషుమ్నానాడి. కుడి ఎడమలలో ఇడా పింగళా అనే నాడులు ప్రసరిస్తుంటాయి. దేనిమీద చూపు పెట్టినా అది విషమమే. సమం కాదు. సమం భ్రూమధ్యమే. రెండు కండ్ల చూపులూ ఒకే చూపుగా మారి అది భ్రూమధ్యాన్ని చూస్తే ఆకాశమే కనిపిస్తుంది. అంటే శూన్యంగా మారుతుంది. రూపాలేవీ కనిపించవు.

అంతేకాదు. ప్రాణాపానాలు న్నాయి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. అవి రాకపోకలు చేస్తుంటే వాటి మీద పోతుంది మనసు. కనుక సమౌకృత్వా. వాటిని కదలకుండా కుంభకం చేయాలి. ఆపు చేయగలిగి ఉండాలి.

Dr Dayananda Swamy ebooks


అప్పుడు యతేంద్రియ మనోబుద్ధిః - బాహ్యంగా వీటి నేకాగ్రం చేయగలిగితే మనసూ బుద్ధీ ఇంద్రియాలూ ఇవి కూడా అదుపులోకి వచ్చి నిశ్చలమయి పోతాయి. బయటా లోపలా ఏ వృత్తీ ఉదయించదు. ఇదంతా ఎందుకీ కసరత్తంటే మునిర్మోక్షపరాయణః - మోక్షమనే ప్రయోజనాన్ని సాధించటానికి దాని కిదంతా పూర్వరంగం - **Preparation** ఇది మౌనానికి దారితీస్తే అది మోక్షానికి మార్గం చూపుతుంది. ముని భావమే మౌనం. మననం చేసేవాడే ముని. ఆత్మ స్వరూపాన్ని నిరంతరమూ భావన చేయటమే మననం. అదే బ్రహ్మాకార వృత్తి - అదే జ్ఞానం. అది కలిగిందో ఇక వాడు ముక్తుడే. సదా ముక్త ఏవ సః - ఎందుకంటే వాడికెప్పుడూ సమమైన బ్రహ్మమే కనిపిస్తుంటుంది. సమ మన్నప్పు డిక విషమమనే మాట లేదు. ఏమిటా విషమం. ఇచ్ఛా భయక్రోధాలు. ఇచ్ఛా క్రోధాలంటే రాగద్వేషాలే. అవే నీకు సమమైన తత్త్వాన్ని విషమంగా చూపుతుంటాయి. దానివల్లనే భయం కూడా. సంసారమంటే భయమే గదా మరి. భయం దేనివల్ల వైషమ్యం వల్ల. అది దేనివల్లా. రాగద్వేషాల వల్ల. అది ఎలా పోవాలి. సమదర్శనం వల్లనే పోవాలి. అదే బ్రహ్మాకార వృత్తి. ఇదీ ఇందులో ఉన్న అంతర్యం.

**భోక్తారం యజ్ఞతపసాం - సర్వలోక మహేశ్వరం**

**సుహృదం సర్వభూతానాం - జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి - 29**

అందుకే జ్ఞాత్వా అంటున్నది గీత. జ్ఞానమే ప్రమాణం. దానితోనే పట్టుకోవాలి జ్ఞేయమైన బ్రహ్మాన్ని. ఎలా ఉంటుందా బ్రహ్మమనే జ్ఞేయం. భోక్తారం యజ్ఞతపసాం - యజ్ఞమంటే ఇక్కడ కర్మ. తపస్సంటే జ్ఞానం. యస్య జ్ఞాన మయం తపః అన్నది ముండకోపనిషత్తు. మరి యజ్ఞమంటే

Dr Dayananda Swamy ebooks



కర్మయోగమనే అర్థం చెప్పింది గీత. కాబట్టి మామూలు యజ్ఞయాగాలని మామూలుగా చేసే తపశ్చర్య అని భ్రాంతి పడరాదు. మానవు డేకర్మ చేసినా మనసులో ఏ విషయాన్ని భావించినా – వాటికీ జీవుడు కర్త గాడు. భోక్తా కాడు. అన్నిటికీ కర్తా భోక్తా ఈశ్వరుడే. ఆయనే సర్వలోక మహేశ్వరుడు. అలా భావన చేస్తూ పోవాలి మానవుడు. అలా చేస్తే వీడి జీవభావ మెగిరి పోతుంది. ఈశ్వర భావమెలాంటిదో దర్శనమిస్తుంది. అది ఈ పిండ శరీరాన్నే గాక విశ్వ శరీరాన్ని అంతటినీ అధిష్ఠించి ఉన్నట్టు కూడా అనుభవానికి వస్తుంది.

అంతేకాదు. సుహృదం సర్వభూతానాం – సమస్త భూతాల హృదయంలో కూడా అదే తిష్ఠ వేసుకొని కూచున్నట్టుగా కూడా స్ఫురిస్తుంటుంది. మొత్తం మీద అటు బ్రహ్మాండాన్ని ఇటు పిండాండాన్ని రెండింటినీ వ్యాపించి జీవుడు చేసే ప్రతి చేష్టనూ ప్రతి ఆలోచననూ వ్యాపించి ఒకే ఒక ఈశ్వర తత్త్వముందనే అద్భుతమైన సత్యాన్ని గుర్తించటమే జ్ఞానం. ఇలాటి జ్ఞానంతో అలాటి జ్ఞేయాన్ని స్వానుభవానికి తెచ్చుకోగలిగితే ఇంకేమి కావాలి మానవుడికి. జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి. అలా నన్ను పట్టుకొంటే శాంతి అనేది తప్పకుండా లభిస్తుందని హామీ ఇస్తున్నాడు భగవానుడు. శాంతి అంటే సర్వసంసారో పరమమని అర్థం వ్రాస్తున్నారు భాష్యకారులు. సంసారమనే సమస్య అక్కడికి తీరిపోతుందంట. అంటే మోక్షం కరతలామలకంగా అనుభవానికి వస్తుందని తాత్పర్యం.

**ఇతి**

## కర్మసన్న్యాస యోగః సమాప్తః

Dr Dayananda Swamy ebooks



# 6. ఆత్మ సంయమ యోగము

అయిదధ్యాయాలు దాటి వచ్చి ప్రస్తుత మాత్మ సంయమమనే ఆరవ అధ్యాయంలో ప్రవేశించాము. దీని కాత్మ సంయమమని పేరు పెట్టటంలో ఎంతైనా ఉంది అంతరార్థం. సంయమమంటే నిగ్రహించటం. అరికట్టటం - అదుపులో ఉంచుకోటమని మామూలుగా చెప్పుకొనే అక్షరార్థం. దేన్ని అదుపులో ఉంచుకోవాలని ప్రశ్న వస్తే ఆత్మనని చెబుతున్నది గీత. ఆత్మ అంటే ఏమిటాత్మ. మనకున్న ఆత్మ ఒక్కటే. అది చైతన్య స్వరూపం. నేనే. నేననే స్ఫురణ మాత్రమే అది. మరేదీ గాదు. అలాటి ఆత్మను అదుపులో పెట్టటమేమిటి. అదే అన్నింటినీ అదుపులో పెడుతున్నదా మాటకు వస్తే. మొదట నేను అని అనుకొంటే గాని తరువాత మరేదైనా ఉందని అనుకోలేము. మరొకటి ఉందని చూస్తున్నప్పుడు కూడా నేననే దాని స్పర్శ లేకుండా దేన్నీ గమనించలేము మనం. ఇంతెందుకు. ఇది ఇల్లు

Dr Dayananda Swamy ebooks



ఇది వాకిలి - ఇది భార్య - ఇది సంతాన - మిది సుఖమిది దుఃఖమని పేర్కొంటున్నప్పు డవన్నీ ఎవరికి చెందిన వని అడిగితే ఏమని జవాబిస్తావు. ఇదంతా నాదనే గదా అంటావు. నేననే భావ ముండకపోతే నాదనే మాట ఎలా అనగలిగావు. కాబట్టి నేనూ నేనే. నాదీ నేనే. అంతా నేననే భావంతోనే పట్టుకొంటున్నావు - దాన్ని వదిలేసి నిన్నూ పట్టుకోలేవు. నీదీ పట్టుకోలేవు. అంతా రామమయ మన్నట్టు అంతా అహంతామయం.

ఇలాంటి అహంతా లేదా నేననే స్ఫురణలోనే సమస్తమూ నీకు స్ఫురిస్తున్నప్పుడు దాన్ని వశంలో పెట్టుకొనట మేమిటి అని ప్రశ్న. ఆత్మ అంటే ప్రత్యగాత్మ అని గాదిక్కడ అర్థం. ఇంకా ఉన్నాయి ఆత్మలు చాలా. భూతాత్మా ఆత్మే. దేహాత్మా ఆత్మే. ప్రాణాత్మా ఆత్మే. బుద్ధ్యాత్మా ఆత్మే. అహంకార మనే కర్త్రాత్మా ఆత్మే. ఇన్ని ఆత్మ లున్నాయి. ఉన్నాయంటే స్వతహాగా లేవవి. నేననే భావమున్న దొక్కటే. దానినే ప్రత్యగాత్మ అంటారు. మిగతా ఇప్పుడు చెప్పినవన్నీ ప్రత్యక్ **Intro** కావు. పరాక్ **Extro.** ఆత్మాభాస లివి. అసలైన ఆత్మకావు. నేననే జ్ఞాన ప్రకాశం దేహేంద్రియ మనః ప్రాణాదుల మీద పడి వాటినే నేనని భావించి వ్యవహరిస్తున్నాము మనం. మన ఈ వ్యావహారికమైన దృష్టిని బట్టి అసలైన ఆత్మ కాకున్నా ఆత్మ అని లోకదృష్టి ననుకరించి పేరు పెట్టి చెబుతున్నది శాస్త్రం కూడా వీటన్నిటినీ. ఇలాటి నకిలీ ఆత్మల మూలంగానే అసలైన మన ప్రత్యగాత్మ నిదమిత్థ మని మనం గుర్తించ లేకపోతున్నాము. కాబట్టి ఇదుగో ఈ ఆత్మగాని

Dr Dayananda Swamy ebooks



ఆత్మల నన్నింటినీ అదుపులో పెట్టుకోవాలి మొదట సాధకుడు. ఆత్మకు భిన్నంగా ఇవి ఉన్నాయని భావించకూడదు. అదీ అదుపు చేయటమే - అసలైన దాన్ని పట్టుకోవాలంటే ఇవి దాని దారి కడ్డు తగలగూడదు గనుక దానికడ్డు లేకుండా చేసుకోటం కూడా అదుపు చేయటమే. ఆత్మ సంయమ మంటే ఇది.

ఇప్పుడు దీనిమీద ఆధారపడి ఉంది మన ప్రయాణమంతా. మోక్షమార్గంలో గదా మన ప్రయాణం. దానికి కావలసింది కేవలమాత్మ జ్ఞానమే అయినా అది కలగాలంటే దేహేంద్రియాదు లడ్డు రాగూడదు. మీదు మిక్కిలి మన పురోగతి కంత కంతకు తోడు పడాలివి. సహజంగా శత్రువులూ కావవి మిత్రులూ కావు. నీవు వాటిని చూచే చూపును బట్టి ఉంటుంది వాటి వ్యవహారం. ఆత్మ దృష్టితో చూస్తే అవి మిత్రులే నీకు. అనాత్మ దృష్టితో చూచావో గర్భ శత్రువులు. కనుక బలవన్మాఘ స్నానంగా వాటిని నిగ్రహించటం కాదు నీవు చేయవలసింది. అలా చేస్తే అవి రెచ్చి పోతాయి. అది గాదు ఆత్మ సంయమనం. ఆత్మ తత్త్వమనే గమ్యం వైపు నీవు పయనిస్తూ వాటి నా గమ్యం వైపు నీతోపాటు తీసుకువెళ్ల గలిగి ఉండాలి నీవు. అదే అసలైన ఆత్మ సంయమం.

అది ఎలాగో చక్కగా వివరించటానికే వచ్చిందీ అధ్యాయం. జరిగిపోయిన అధ్యాయా లన్నిటికీ ఇదే మూలం. ఇదే పునాది. మనః ప్రాణేంద్రియాదులు నీ మాట విని నీతో పాటు సాగి వస్తేనే నీవు ఆత్మా నాత్మ వివేచన చేయగలవు. అలాటి సాంఖ్యం జరిగినప్పుడే అనాత్మ

Dr Dayananda Swamy ebooks



రూపమైన కర్మ నాత్మ రూపమైన జ్ఞానం గడించటానికి కర్మయోగంగా మార్చుకొని పాటించగలవు. కర్మయోగంలో ఉత్తీర్ణుడ వైనప్పుడే ఆత్మను గుర్తించే జ్ఞానయోగం నీకు ఒంట బడుతుంది. జ్ఞానం ఒంట బట్టిందంటే అంతవరకూ కర్మగా సాగిన అనాత్మ కూడా ఆత్మగానే భాసించి కర్మలన్నీ జ్ఞానంలో సన్న్యసించటమనే కర్మ సన్న్యాసయోగ మాకళింతకు వచ్చి తీరుతుంది. అదే జీవిత సమస్య అయిన విషాద యోగానికి భరత వాక్యం పలుకుతుంది. అంచేత ఇది చాలా ముఖ్యమైన కీలకస్థాన మీ ఆత్మ సంయమమనే ఆరవ అధ్యాయం గీతలో. అందుకే నేమో దాని ప్రాశస్త్య మెలాటిదో ప్రారంభంలోనే కీర్తిస్తున్నాడు వ్యాసభగవానుడు.

**అనాశ్రితః కర్మఫలం - కార్యం కర్మ కరోతి యః**

**స సన్న్యాసీచ యోగీచ - న నిరగ్ని ర్న చాక్రియః - 1**

చేసే కర్మల ఫలితాన్ని ఆసించకుండా ఎవడైతే చేయవలసిన కర్మలన్నీ మానేయకుండా చేస్తుంటాడో - స సన్న్యాసీ చ. వాడే అసలైన సన్న్యాసి. యోగీచ. వాడే అసలైన యోగీ కూడా నని చాటుతున్నది గీత. సన్న్యాస మన్నా యోగమన్నా లోకుల కేవేవో అభిప్రాయాలున్నాయి. గృహస్థాశ్రమం సన్న్యసించి పరుగెత్తి పోవటం సన్న్యాసమని - బాహ్యమైన కర్మకాండ వదిలేసి కేవలం కండ్లు మూసుకొని ధారణా ధ్యాన సమాధు లవలంబించి కూచోటం యోగమని మనకు కొన్ని అపోహ లున్నాయి. ఇలాటి అపోహలన్నీ త్రోసి పుచ్చుతున్న దిప్పుడు భగవద్గీత. కర్మలన్నీ సన్న్యసించి

Dr Dayananda Swamy ebooks



పోవటం కాదు సన్న్యాసం. కర్మలుచేస్తూనే ఉండాలి. కాని అనాశ్రితః కర్మఫలం. కర్మాచరణ వల్ల కలిగే స్వర్గాది భోగాలూ – జన్మాంతర సుఖాలూ – ఏలాటి ఫలం మీదా నీకు ఆసక్తి ఉండగూడదు. నిష్కామంగా ఆచరించాలి కర్మ. అలాటి నిష్కామ కర్మ యోగమే నిజంలో సన్న్యాసమనే మాట కర్థం.

అలాగే యోగమనేది కూడా కేవలం యోగులు చెప్పే అష్టాంగ యోగాభ్యాసం కాదు. యోగులు చెప్పేది సమాధి. ఇది సమాధి గాదు వ్యవహారం. కర్మ ఫల మాసించక పోవటం సన్న్యాసమైతే ఫలాసక్తి లేకుండా కర్మ చేయటం యోగం. అప్పటికి సన్న్యాసం కర్మ ఫలంలోనే గాని కర్మలో గాదు. యోగం వ్యవహారంలోనే గాని సమాధిలో గాదు. మొత్తానికి ఫలాసక్తి లేకుండా సన్న్యాసి అయ్యాడు. కర్మ మానేయకుండా చేస్తుంటాడు కాబట్టి యోగి అయ్యాడు మానవుడు. సన్న్యాసీచ యోగీచ సన్న్యాసీ వాడే యోగీ వాడే. రెండు బిరుదులూ వాడికే ప్రదానం చేస్తున్నది గీత.

మరి రెండూ కర్మయోగికే అయితే లోకంలో సన్న్యాసులూ యోగులూ అని చెలామణీ అయ్యే వారంతా ఏమయి పోవాలని అడిగితే వాడు సన్న్యాసీ కాదు. యోగీ కాదు పొమ్మంటున్నది గీత న నిరగ్ని ర్నచా క్రియః – అగ్ని కార్యం చేయనివాడు నిరగ్ని. గృహస్థాశ్రమంలోనే అగ్నిహోత్రాలు. అవి చేయనివాడైతే వాడు గృహస్థుడుగాడు సన్న్యాసి అంటారు మాములుగా. అలాగే అక్రియః శారీరకంగా ఏ కర్మా పెట్టుకోక మానసికంగా ధ్యానం చేసేవాడు అక్రియుడు. వాడే యోగి. మామూలుగా లోకవ్యవహారాన్ని

Dr Dayananda Swamy ebooks



బట్టి వాడు సన్న్యాసి వీడు యోగి అని చెలామణి కావచ్చు. కాని అది నామమాత్రమే. యాంత్రికమైన ప్రవర్తన అది. ఆత్మ జ్ఞానానికి తోడ్పడే అనులోమ మార్గం **Positive** కాదది. ప్రతిలోమం **Negative.** ఫలాన్ని సన్న్యసించకుండా కేవలం కర్మ మాత్రం సన్న్యసిస్తే అది జ్ఞానానికెలా తోడ్పడుతుంది. అలాగే అసలు ప్రయత్నమే మానేసి కూచుంటే అది ఎలా సహాయ పడుతుంది. కర్మ చేయవలసిందే – చేసే ప్రతి కర్మా అనాసక్తంగా చేయవలసిందే. అప్పుడే అది అహం మమలనే సంకుచిత దృష్టి తొలగించి నీకు సాక్షి రూపమైన ఆత్మను పట్టుకోటానికి దోహదం చేస్తుంది. అంతేగాని కర్మ కర్మ కోసం గాదు. సన్న్యాసం సన్న్యాసం కోసం గాదు. జ్ఞానం కోసం కర్మా, జ్ఞానం కోసమే సన్న్యాసమని భావించాలి మనం. అలా కాకపోతే సన్న్యాసం తీసుకొంటే చాలు వాణ్ణి జ్ఞాని అనీ – హఠయోగాదులతో కాలం గడపినా చాలు వాణ్ణి జ్ఞాని అనీ – అనవసరంగా కనపడ్డ ప్రతి సన్న్యాసినీ యోగినీ కొండమీద కూచో బెట్టవలసి వస్తుంది. అది మహాపరాధం. కనుక వీరందరూ కారు. వాడే అసలు సన్న్యాసి అయినా యోగి అయినా. వాడే దానికి తగినవాడని తేల్చి చెబుతున్నది శాస్త్రం.

**యం సన్న్యాస మితి ప్రాహుః - యోగం తం విద్ధి పాండవ**

**నహ్యసన్న్యస్త సంకల్పో - యోగీ భవతి కశ్చన - 2**

అంతేకాదు. డొంక తిరుగుడుగా చెప్పటం దేనికి. సూటిగా బాహాటంగానే చెబుతాము. సన్న్యాసం యోగమనే భావాలు మరెక్కడా

Dr Dayananda Swamy ebooks



పెట్టుకో నక్కరలేదు. ఎక్కడా లేవవి వాస్తవంలో. మేము వర్ణించిన లక్షణాలున్న వాడే సన్న్యాసి - వాడే యోగి కూడా. ఇంకెక్కడైనా ఆ మాటలు నీకు వినిపించినా అలాటి వ్యక్తులు నీకు కనిపించినా వారి విషయంలో అవి ఔపచారికమే **Secondary** గాని ముఖ్యార్థంగా **Primary** మీరు భావించ నక్కర లేదంటున్నాడు మహర్షి. ఇంకా ఒక విశేషం కూడా ఉంది మనం గుర్తుంచుకోవలసింది. సన్న్యాసం యోగమని మేము రెండు మాటలు చెప్పినా అవి రెండూ వేర్వేరు గావు. ఒకటి సన్న్యాసం వేరొకటి యోగమని గాదు మా ఉద్దేశం. రెండూ కలిసి ఒక్కటే. ఒకదాని కొకటి పర్యాయాలు. ఏది సన్న్యాసమో అదే యోగం. ఏది యోగ మంటున్నామో అదే సన్న్యాసం. రెండు లక్షణాలున్న వాడూ ఒక్కడే. వాణ్ణే సన్న్యాసి అనవచ్చు. వాణ్ణే యోగి అనవచ్చు. యం సన్న్యాస మితి ప్రాహు ర్యోగం తం విద్ధి - సన్న్యాసమని దేన్ని పేర్కొంటున్నావో యోగం కూడా అదేనని తెలుసుకో మంటున్నది గీత.

యోగం సన్న్యాసమెలా అవుతుంది. ఒకటి వదిలేయటం మరొకటి చేయటం గదా. రెండూ ఒకటెలా అవుతాయి. అంటే సమాధాన మిస్తున్నాడు గీతాచార్యుడు. నహ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన. యోగి కూడా ఆ మాటకు వస్తే సన్న్యసించాడు గనుక సన్న్యాసే. ఏమి సన్న్యసించా డంటారు. సంకల్పాన్ని. నేను చేస్తున్నాననే కర్తృత్వ బుద్ధి ఒక సంకల్పమైతే దీని ఫలం తప్పకుండా నేనుభవించాలనే భోక్తృత్వ బుద్ధి మరొక సంకల్పం.

Dr Dayananda Swamy ebooks



ఇలాటి సంకల్పాలు రెండూ వదిలేశాడు కాబట్టి యోగి వాస్తవంలో సన్న్యాసే. సన్న్యాసి అంటే వదిలేస్తున్నాడు కాబట్టి సన్న్యాసి. అయినా కర్మ చేస్తుంటాడు కాబట్టి యోగి. కర్మఫలం సన్న్యసిస్తాడు కాబట్టి మామూలు సన్న్యాసి కాడు. కార్యమైన కర్మ చేస్తుంటాడు కాబట్టి మామూలు యోగి కాడు వీడు. ఇద్దరి కంటే విలక్షణమైన మూడవ మార్గం వీడిది. ఇందులో ఇంకా విశేష మేమంటే కర్మ చేయటం చేయక పోవటం కాదు ముఖ్యం. చేయకుండా విడిచిపెట్టిన మాత్రాన సన్న్యాసం కాదు. చేయమన్నారు గదా అని ఫలాసక్తి వదలకుండా చేస్తే యోగమూ కాదు. మరేమిటి. సంకల్పమేదీ ఉండగూడదు. అయినా కర్తవ్యమైన కర్మ వదులుకో గూడదు. దీనిబట్టి పరుగెత్తి పోవటం కాదు సన్న్యాసం. గుడ్డిగా చేస్తూ పోవటం కాదు యోగం. లేదా అదీ మానేసి ధారణా ధ్యానాదుల్లో మునిగి పోవటమూ కాదు. అనాసక్తుడై చేస్తుండాలి మానవుడు. అనాసక్తిలో సన్న్యాసముంది. చేయటంలో యోగముంది. సంకల్ప త్యాగం లేకుండా కర్మ చేయటం లేదు కాబట్టి సన్న్యాసమూ యోగమూ రెండూ ఒకటే వాడి విషయంలో.

ఇది ఎలాటిదంటే ఏకం సాంఖ్యంచ యోగం చయః పశ్యతి స పశ్యతి అన్నాడే పంచమాధ్యాయంలో అది గుర్తుకు తెస్తున్నదీ శ్లోక భావం. విమర్శించి చూస్తే అక్కడ చెప్పిందీ ఇక్కడ చెప్పిందీ రెండూ ఒకటేనా అని తోస్తుంది భావుకుడైన వాడి మనస్సుకు. సాంఖ్యం యోగం రెండూ చెప్పి అవి రెండూ ఒకటేనని చాటుతున్నా డిక్కడ. ఏమి టింతకూ వ్యాస

Dr Dayananda Swamy ebooks


హృదయం. కర్మా జ్ఞానమూ పైకి భిన్నంగా కనిపిస్తున్నా వాస్తవంలో రెండూ ఒకే ఒక తత్త్వమని. అందులో సాంఖ్యమంటే జ్ఞానం. యోగమంటే కర్మ. అలాగే మరొక భాషలో ఇక్కడ సన్న్యాసమంటే జ్ఞానం. యోగమంటే కర్మ జ్ఞానమంటే మరలా ఏదో గాదు. సర్వమూ నా స్వరూపమే ననే ఆత్మ జ్ఞానం. మరి కర్మ అంటే కూడా ఏదో గాదు. ఆ జ్ఞానం తాలూకు ప్రసరణే దాని విభూతే. దాని విస్తారమే. సూర్యమండలం జ్ఞాన మనుకొంటే దానిలో నుంచే బయటికి వచ్చి సర్వత్రా వ్యాపించిన సూర్య ప్రకాశమే కర్మ. రెండూ అవినాభూతంగా ఓతప్రోతంగా కలిసి ఒకే ఒక ఆత్మతత్త్వం. అచలంగా ఉన్న ఆత్మే చలించి అనాత్మగా భాసిస్తున్నది. కనుక అనాత్మ ప్రపంచం కూడా ఆత్మే నిజానికి. అంచేత అనాత్మ అని దాని నన్యంగా చూడక అందులో కూడా ఆత్మనే దర్శిస్తూ పోవాలని అదే అద్వైత ధ్యానమని సాధకులకు బోధించటమే వ్యాసమహర్షి ఆశయం.

**ఆరురుక్షో ర్మునే ర్యోగం - కర్మ కారణముచ్యతే**

**యోగారూఢస్య తస్యైవ - శమః కారణముచ్యతే - 3**

ఇలాటి మహోన్నతమైన అద్వైత భావం ఒక్కసారిగా అందుకోటం సాధకులకు కష్టమని తెలుసు మహర్షికి. ఎవరో ఉత్తమాధికారికి తప్ప మిగతా మంద మధ్యమాధికారులకు తగినంత శిక్షణా అభ్యాసమూ అవసరమని కూడా తెలుసు నాయనకు. అందుకే ఆయన మొదటనే జ్ఞానమనే మాట బయటపెట్టకుండా యోగమూ కర్మా అని అభ్యాస మార్గ

Dr Dayananda Swamy ebooks


ముపదేశిస్తున్నాడు మనకు. ఇక్కడ యోగమంటే ధ్యానయోగమని అర్థం చెబుతారు భగవత్పాదులు. కర్మ అంటే బాహ్యమైన ఇంద్రియ వ్యాపారాలని అర్థం. ఇందులో ఆరురుక్షు వొకడైతే - ఆరూఢుడొకడు. కొండ శిఖరాన్ని ఎక్కేవా డారురుక్షువు. ఎక్కి అక్కడ కూచున్నవా డారూఢుడు.

ఇక్కడ కొండ శిఖరం లాంటిది ధ్యానయోగం. ఆరూఢుడి స్థానమది. ఆస్థానం వాడు చేరాలంటే అంతకుముందు వాడుదాన్ని చేరే ప్రయత్నం చేస్తూ పోవాలి. అది ఆరురుక్షుడి వ్యవహారం. ఏదో గాదది కర్మయోగం. కర్మయోగం జ్ఞానానికి బహిరంగమైతే సమాధి యోగం దాని కంత రంగమని గదా పూర్వం మనకు సూచన చేశారు గురువుగారు. ఉట్టికెక్కితే తరువాత స్వర్గానికి. ముందు కర్మయోగి ధ్యానయోగాన్ని అందుకొంటే తద్వారా వాడు క్రమంగా జ్ఞానయోగాన్ని పొందగలడు. కనుకనే చెబుతున్నది గీత. ఆరురుక్షోర్మునే ర్యోగం కర్మ కారణం. ధ్యానయోగాన్ని అందుకోవాలని కాంక్షించే మునికి కర్మయోగమే సాధనమట. ముని అని పేర్కొనటంలో ఏమిటర్థం. ముని అంటే కర్మఫల సన్న్యాసి అని అర్థం చెప్పారు భాష్యకారులు. కర్మఫలాన్ని సన్న్యసించి కేవలం యోగం కోసమే కర్మ చేస్తూ పోయే కర్మయోగే ముని. అలాటివాడు తప్పకుండా కొంతకాలానికి ధ్యానయోగమనే భూమిక నందుకోగలడు.

అందుకొంటే అంతవరకూ ఆరురుక్షువైన సాధకుడప్పుడిక ఆరురుక్షువు కాదు. ఆరూఢుడవుతాడు. అయితే యోగారూఢస్య త స్యైవ

Dr Dayananda Swamy ebooks


శమః కారణ ముచ్యతే. ధ్యానయోగ మారోహించిన తరువాత ఇక వాడే కర్మ అదేపనిగా చేస్తూపో నక్కర లేదు. బాహ్యమైన శరీరేంద్రియ వ్యాపారాలన్నీ మానేసి వాటినుంచి వైదొలగి అంతరింద్రియమైన మనస్సుకే పనిచెప్పటం మంచిది. ఆ వైదొలగటానికే శమమని పేరు. శమమంటే ఉపశమనం లేదా ఉపరమం. మానుకోటమని అర్థం. యావద్యావ త్కర్మభ్యః ఉపరమతే తావ త్తావ న్నిరాయాసస్య జితేంద్రియస్య చిత్తం సమాధీయతే - ఎంతెంత బాహ్య వ్యాపారాలనుంచి తప్పుకొంటాడో సాధకు డంతంత అనాయాసంగా ఇంద్రియాలు వాడికి వశమవుతాయి. అంతేకాదు. ఇంద్రియాలు చెదిరిపోకుంటే మనస్సు కూడా లక్ష్యం మీదనే నిలకడ చెందుతుంది. తధా సతి స ఝటితి యోగా రూఢో భవతి. అలా నిలిస్తే వాడు వెంటనే యోగారూఢ పదవినందు కోగలడు అని వర్ణిస్తారు భగవత్పాదులు. అంతేగాక నైతాదృశం బ్రాహ్మణ స్యాస్తి విత్తం - తతస్తత శ్చోపరమః క్రియాభ్యః అని వ్యాసప్రోక్తమైన సుభాషితం కూడా ఒకటి ఉదాహరిస్తారు. కర్మల నుంచి నివర్తించటం కన్నా బ్రహ్మజ్ఞాన సాధకుడి కింకొక ధనమంటూ వేరేలేదట.

**యదా హి నేంద్రియా ర్థేషు - న కర్మ స్వను షజ్జతే**

**సర్వ సంకల్ప సన్న్యాసీ - యోగారూఢ స్తదో చ్యతే - 4**

ఇంతకూ యోగారూఢుడని ఎప్పుడనిపించు కొంటాడీ సాధకుడు. అయినందు కేమిటి నిదర్శనమని ప్రశ్న వచ్చింది. దానికిప్పుడిస్తున్నాడు

Dr Dayananda Swamy ebooks


సమాధానం వేదవ్యాసుడు. యదాహి నేంద్రియా ర్థేషు న కర్మ స్వనుషజ్యతే. ఇంద్రియార్థాలని ఒక అయిదున్నాయి. అవే శబ్ద స్పర్శ రూపరసగంధాలు. పంచభూతాల దూతలివి. ఇవి వచ్చి మన పంచేంద్రియాలను పట్టుకొంటాయి. వాటినీ ఇంద్రియాలు పట్టుకొంటాయి. వీటిలావా దేవీ ఇలా సాగుతున్నంత వరకూ ఉపశమనం లేదు సాధకుడికి. ఈ గందరగోళంలో ఏదీ సాధించ లేడు మానవుడు. వలలో తగులుకొన్న పక్షిలాగా వాటి పాశంలో పడిపోతాడు.

అంతేకాదు. అవి ఎప్పుడు వీణ్ణి ప్రపంచంవైపు లాగేస్తున్నాయో అప్పుడు శాస్త్రోక్తమైనవీ లౌకికీమైనవీ అన్ని కర్మలూ నెత్తిన పెట్టుకొంటాడు. అది మరలా ఒక పాశం వాడి పాలిటికి. శబ్ద స్పర్శాదులలో పడి అక్కడి నుంచి వాటి ననుభవించాలనే అభిలాషతో ఆయా కర్మలన్నీ చేయలేక సతమత మవుతుంటాడు. అది అక్కడి కాగక ఫలానుభవం వరకూ వీణ్ణి ఈడ్చుకొని పోతుంది. కర్మ చేస్తే దానికి ఫలితముండాలి గదా. ఫలితమేర్పడితే అది మంచో చెడ్డో అనుభవించక తప్పదు గదా.

అంచేత ఇంద్రియార్థాలలో వాటి కోసం పెట్టుకొనే కర్మలలో ఇంత మహోపద్రవం పొంచి ఉందని - అది తన సాధన మార్గాని కెప్పుడూ ప్రతిబంధకమే నని ముందుగా పసిగట్టి జాగ్రత్త పడాలి సాధకుడు. ఏమిటా జాగరూకత. అటు ఇంద్రియార్థాలైన శబ్దాదులలోనూ - తన్నిమిత్తంగా పెట్టుకొనే ఆయా నిత్యనైమిత్తిక కామ్యాది కర్మలలోనూ నానుషజ్జతే -

Dr Dayananda Swamy ebooks


ఏమాత్రమూ పడిపోగూడదు. పడ్డా వెంటనే తప్పించుకొని బయటపడాలి. అది ఎప్పుడు సాధ్యమంటే చెబుతున్నాడొక ఉపాయం వ్యాసభగవానుడు. సర్వ సంకల్ప సన్న్యాసీ. మనసులో ఎప్పుడే సంకల్పం కలిగినా సరే. అన్ని సంకల్పాలనూ ఎప్పటికప్పుడు కూకటి వేళ్లతో పెరికి పారేయాలి. సర్వాన్ అనే మాటకు ఇహాముత్రార్థ కామహేతూన్ అని వివరణ ఇచ్చారు స్వామివారు. ఒక ఐహికమే గాదు. ఆముష్మికమైన స్వర్గభోగాల మీద కూడా ఉండగూడదు కామం. కామానికి మూలం సంకల్పం. కామ జానామితే మూలం - సంకల్పాత్కిల జాయసే. కామాలన్నీ ఆయా పదార్థాలను సంకల్పించి నప్పుడే కలుగుతుంటాయి. ఇహం నుంచి పరందాకా ఉంది వాటి క్షేత్రం. అంచేత దృష్టమైన ఐహికమను. అదృష్టమైన ఆముష్మికమను. ఏదైనా కామమే. దానికి నిమిత్తం మానవుడి సంకల్పమే.

అంచేత సంకల్పం చేయకుంటే కామం లేదు. కామం లేకుంటే కర్మ లేదు. సయధా కామో భవతి తత్క్రతు ర్భవతి - యత్క్రతు ర్భవతి - తత్కర్మ కురుతే - యత్కర్మకురుతే - తత్ఫల మభిసంధత్తే అన్నారు. ఏది చేయాలని కోరితే అది చేస్తాడు. ఏది చేస్తే దాని ఫలమను భవించక తప్పదు మానవుడు. చేయాలనే కోరిక ఎప్పుడేర్పడుతుంది. దానికి ముందు తద్విషయమైన సంకల్పం లేదా అభిప్రాయ **Intention** మేర్పడితే. కనుకనే సర్వసంకల్ప సన్న్యాసీ - అన్ని సంకల్పాలూ అనర్థహేతువులే కాబట్టి మంచీ చెడ్డా అని చూడకుండా అవి ఉదయిస్తున్నప్పుడే త్రోసిపారేయాలని సలహా

Dr Kuna Dayananda Swamy ebooks



అలాటి అనర్థం తొలగిపోవాలంటే నిరాడంబరంగా బ్రతక గలిగి ఉండాలి. అది ఎలాగంటే చెబుతున్నాడు. బ్రహ్మచారి వ్రతే స్థితః - బ్రహ్మచారి కుండే వ్రతమేదో అది పాటించాలి. గురు శుశ్రూష - భిక్షాటనంతో కడుపు నింపుకోటం - ఇలాటి జీవిత విధానం అనుసరించాలి. అప్పుడు బాహ్యా చింత చాలావరకు తగ్గిపోతుంది. కాని ఇది ప్రతిలోమమే. అనులోమంగా చేయవలసిన పని ఒకటున్నది. మన స్సంయమ్య - మనసులోని వృత్తులన్నిటినీ ఉపసంహరించుకోవలసి ఉంటుంది. అలా చిత్తవృత్తు లుప శమించాలంటే మచ్చిత్తః నామీదనే నీ మనస్సు నిలపమంటాడు పరమాత్మ. సమష్టి చింతన పెట్టుకొంటేనే వ్యష్టి తాలూకు ఆలోచన లుపశమిస్తాయి. యుక్త ఆసీత మత్పరః అని కూడా ఒక నియమం చెబుతున్నాడు. మచ్చిత్తః అన్నాడు గదా మళ్లీ మత్పరః అని చెప్పటం దేనికి.

దాని అర్థం వివరిస్తున్నారు భాష్యకారులు. అహంపరో యస్య సోయం మత్పరో భవతి. పరమాత్మే ఎవడికి పరాయణమో. వాడు మత్పరుడు. పరమాత్మ తప్ప మరో లోకం లేనివాడని అర్థం ఎందుకంటే కశ్చి ద్రాగీస్త్రీ చిత్తః నతు స్త్రియ మేవ పరత్వేన గృహ్ణాతి. ఒక కాముకుడుంటాడు లోకంలో. వాడు స్త్రీ చిత్తుడైతే కావచ్చు గాని స్త్రీనే తన సర్వస్వంగా భావించక పోవచ్చు. మరేది భావిస్తాడు. ఒక రాజుగారినో ఒక దేవతనో కూడా అలాగే గొప్పగా భావించినా భావిస్తాడు. ఇక్కడ వీడలా కాదు. అయం తు మచ్చిత్తః మత్పరః

Dr Kuna Dayananda Swamy ebooks


నామీదనే దృష్టి వాడికి. నేనే పరాయణం. మరే లోకమూ లేదు. అందుకే మచ్చిత్తః మత్పరః అని రెండు మాటలూ ప్రయోగించిందట గీత. ద్విర్బద్ధం సుబద్ధం భవతి అని ఒక మాట ఉన్నది. రెండు మార్లు దిమ్మిసా చేస్తే బాగా గట్టి పడుతుందంటారు. అలాగే రెండూ కలిపి చెబితే ఇక వాడి కదే తప్ప మరే దృష్టీ లేదని మనకు బాగా బోధపడు తుందంటారు భగవత్పాదులు. యుక్త ఆసీత. ఇంతకూ అలా నిశ్చలంగా ఏకాగ్రంగా మనసు పెట్టుకొని ధ్యానం చేయాలి యోగి. ఇదీ తాత్పర్యం.

**యుుంజన్నేవం సదాత్మానం - యోగీ నియత మానసః**
**శాంతిం నిర్వాణ పరమాం - మత్సంస్థా మధిగచ్ఛతి - 15**

అంతా అయిన తరువాత ఇప్పుడు యోగఫలమేదో అది వర్ణిస్తున్నది గీత. ఫలసిద్ధి అయ్యే వరకూ అభ్యాసం. అభ్యాసమేదో మొదటి నుంచీ వర్ణిస్తూనే వచ్చాడు. ఆసన మనీ దేహధారణ మనీ - ఇంద్రియ నిగ్రహమనీ - మనస్సమాధానమనీ - ఇవన్నీ అభ్యాసం క్రిందికే వస్తాయి. అందులో కూడా మనసు నిశ్చలంగా నిలపటం ప్రధానం. మిగతా దేహ ధారణాదులన్నీ దానికంగాలు. పోతే సాంగో పాంగంగా జరిగిన ఈ సాధన కంతటికీ ఫలితమేమిటని ప్రశ్న వచ్చింది. దానికి సమాధాన మిస్తున్నదీ శ్లోకం. యుంజన్నేవం సదాత్మానం యోగీ నియత మానసః - ప్రతిక్షణమూ నియమం తప్పకుండా ఇలా యోగాభ్యాసం చేస్తూ మనసును కూడా ఒకే లక్ష్యం మీద నిలిపి దాన్ని కూడా స్వాధీనం చేసుకోవచ్చు యోగి. మరి దాని వల్ల అతడు సాధించే ఫలమేమిటి.

Dr Kuna Dayananda Swamy ebooks



అది ఏదోగాదు. అంతా ఇంతా గాదా ఫలం. మహాఫలమది. ఏమిటది. శాంతిం నిర్వాణ పరమాం. నిర్వాణమంటే మోక్షమని వ్రాస్తున్నారు గురువుగారు. మోక్షమే చివరి మెట్టు. అది నిర్వాణ పరమాం. దేనికి చివర. శాంతిం – శాంతికి. వాడికి కలిగే శాంతి ఎలాంటి శాంతి అంటే మోక్షమే దానికి పర్యవసానం. అంతకన్నా గొప్ప శాంతి లేదు. అన్ని వ్యాపారాలూ వ్యవహారాలూ అక్కడి కాగిపోవలసిందే. ఇక కోరవలసిందేదీ లేదు. ఇక ఆగక ఏమవుతాయి. అయితే ఎక్కడ ఉందా శాంతి. ఎవరిస్తారు. అది బాహ్య జగత్తులో లేదు. అనాత్మ ప్రపంచానికి చెందినది కాదు. ఎంచేత. అనాత్మ అంతా ఆత్మ తాలూకు ఆ భాసే. అది వస్తువుగాదు. ఆత్మే వస్తువు **Reality.** అది ఇప్పుడు నీదగ్గరే ఉన్నా అనాత్మ భూతమైన దేహేంద్రియాదులతో కలిసి కలుషితమై సంకుచితమై ఉంది. కనుకనే నిర్వాణ పరమమైన శాంతి లేదు. అసలైన శాంతి కావాలంటే ఈ కలుషితమైన తగ్గిపోయిన ఆత్మ పరిశుద్ధమైన పరిపూర్ణమైన ఆత్మను పట్టుకోవాలి. ఇది జీవాత్మ అయితే అది పరమాత్మ. మత్సంస్థా మధిగచ్ఛతి నాకు సహజమైన శాంతినే యోగి పొందగల దంటున్నాడు. పరమాత్మకు సహజమా శాంతి. జీవాత్మకు కాదా అని అడగవచ్చు. వీడికీ సహజమే. రెండాత్మలు లేవు. ఉన్నదొకే ఆత్మ. ఒకే ఆత్మ అయినప్పుడు సహజమేమిటి. అసహజమేమిటి. వాస్తవమే. కాని సహజమైనా ఉపాధులతోడి సాంగత్యం వల్ల అశాంతి పాలయింది. ఉపాధులు కూడా అజ్ఞానం వల్లనే.

Dr Kuna Dayananda Swamy ebooks



జ్ఞానముదయిస్తే అజ్ఞానం పోతుంది. అజ్ఞానం పోతే ఉపాధులూ కనపడవు. అప్పుడు శాంతి తనకు సహజమేనని గుర్తు వస్తుంది. అందుకే అలాటి ఆత్మజ్ఞానం సంపాదించటానికే ఇంత అభ్యాస ప్రయాస యోగికి. తనకు సహజంగా ఉన్నదాన్ని గుర్తు చేసుకోటమే ఇంతకూ. లేనిదాన్ని సాధించటం కాదు.

**నాత్యశ్న తస్తు యోగోస్తి - న చైకాంత మన శ్నతః**

**న చాతి స్వప్న శీలస్య - జాగ్రతో నైవ చార్జున - 16**

సిద్ధ సాధన మంటారు దీన్ని వేదాంతులు. ఆత్మ జ్ఞానం సిద్ధమే మనకు. క్రొత్తగా సాధించ వలసింది లేదు. అయినా అజ్ఞానవశాత్తూ దూరమయినట్టు భావిస్తున్నాము. అలాటి అపోహ ఉన్నంత వరకూ దాన్ని సాధించే ప్రయత్నం చేయక తప్పదు. ఫలిత మబ్బిన తరువాతనే ప్రయత్న మక్కర లేదని తెలిసేది. అంతవరకూ తాత్కాలికంగా ప్రయత్నమనేది చేయక తప్పదు. అదే మొదటి నుంచీ చెబుతూ వచ్చింది. అది ఎక్కడ మానేస్తారో - మానేస్తే వస్తుసిద్ధంగా ఉన్నా ఆత్మ స్వరూపం మానవుడి అనుభవానికి రాదే ఎలాగా - అని మన బదులు తాపత్రయ పడుతున్నది శాస్త్రం. కనుకనే ఫలితం చెప్పక ముందూ ఫలితం చెప్పిన తరువాత కూడా ప్రయత్నానికే ప్రాధాన్యమిచ్చి దాన్ని పదే పదే వర్ణిస్తూ పోతుంది.

ఇప్పుడలాగే వర్ణిస్తున్నది మళ్లీ - ఆ వర్ణించటంలో కూడా ప్రతిలోమంగా వర్ణిస్తుంది మొదట. దాన్నే తరువాత అనులోమంగా కూడా

Dr Kuna Dayananda Swamy ebooks



ఏకరువు పెడుతుంది. నాత్యశ్నతస్తు యోగోస్తి - యోగం నీకు ఫలిత మివ్వాలంటే అతిగా భోజనం చేసినా ఇవ్వదు. నచైకాంత మనశ్నతః అలాగని అసలే ఆహారం తినటం మానేసినా ఇవ్వదు. రెండూ అతి చేష్టలే. నిరాహారం పనికి రాదు. అధికాహారం పనికిరాదు. ఆహారం తీసుకోవలసిందే యోగి. కాని మితంగా హితంగా తీసుకోవాలి. ఆకలి తీరటాని కెంతో అంతే. అదీ సాత్త్వికంగా ఉండాలి ఆ ఆహారం.

అసలు యోగశాస్త్రంలోనే చెప్పారు యోగసాధకు డెంత మాత్ర మాహారం సేవించాలో. అర్ధం సవ్యం జనాన్నస్య - తృతీయ ముదకస్యచ - వాయోస్సంచారణార్థంతు - చతుర్థ మవశేషయేత్. జఠరాశయాన్ని నాలుగు భాగాలుగా భావించి అందులో రెండు వంతులు మాత్రమే ఘనపదార్థంతో నింపుకోవాలి. మూడోవంతు నీళ్లతో నింపాలి. పోతే నాలుగోవంతు అలాగే ఖాళీగా వదిలేయాలట ఎందుకు. గాలి ఆడటాని కంటారు యోగులు. కనుక ఆత్మ సమ్మితమైన దానికంటే ఎక్కువ మోతాదు పనికిరా దాహారం. అప్పుడే తేలికగా ఉంటుంది శరీరం. చురుకుగా కూడా పనిచేస్తుంది.

అంతే కాదు. ఆహార విషయంలోనే కాక నిద్ర కూడా అతిగా పోరాదు. అలాగని అతిగా మేలుకొనీ కూచోరాదు. నచాతిస్వప్న శీలస్య - జాగ్రతో నైవ అని నిద్రా జాగ్రత్తులకు సీలింగు పెడుతున్నది గీత. అతిగా నిద్రిస్తే మొద్దుబారి పోతుంది మనస్సు. యోగసాధనకు పనికిరాదు. అలాగే అసలే నిద్ర పోకుంటే విశ్రాంతి ఎఱగక బద్ధకిస్తుంది సాధన చేయటానికి. అసలివి

Dr Kuna Dayananda Swamy ebooks


రెండూ మనం తీసుకొనే ఆహారాన్ని బట్టి కూడా ఉంటాయి. ఎక్కువ ఆహారం తీసుకొంటే బద్ధకిస్తాము. నిద్ర వస్తుంది. అసలే మానేస్తే శరీరం నీరసించి అసలు యోగాభ్యాసాని కుత్సాహమే చూపలేడు సాధకుడు. కనుక అన్ని విషయాలలో మితంగా నడుచుకోట మెంతైనా మంచిది. శరీర మాద్యం ఖలు ధర్మ సాధన మన్నారు. శరీరం మాట వినకపోతే మనసు వినదు. మనసు వినకుంటే అసలే పనీ చేయలేము.

**యుక్తాహార విహారస్య - యుక్త చేష్టస్య కర్మసు**

**యుక్త స్వప్నావ బోధస్య - యోగో భవతి దుఃఖహా - 17**

అంచేత ఆహారవిహారాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అందులో ప్రతిలోమంగా నడుచుకొంటే కలిగే నష్టమేదో చెప్పి ప్రస్తుత మదే అనులోమంగా సేవిస్తే కలిగే లాభం వర్ణించి చెబుతున్నాడు. నష్టం యోగానికి నోచుకోక పోవటమైతే లాభం యోగమనేది నిర్విఘ్నంగా సాగి ఫలించటం. అది ఎలాగ. యుక్తాహార విహారస్య – యుక్తంగా ఉండా లాహారంలో గాని విహారంలో గాని. యుక్తమంటే నియమబద్ధం. ఎంతో అంత. ఎంత ఆహారమో అంతే సేవించాలి. ఎంత సంచారమో అంతే చేయాలి. రాత్రౌ శతపదం గచ్ఛేత్ – రాత్రి భోజనానంతరం వెంటనే పడుకోకుండా నూరడుగులు నడచి రమ్మన్నారు. అలాగే దివా విశ్రాంతి మాప్నుయాత్. పగలు భుజించిన తరువాత ఒకటి రెండు గంటలు పడుకోమన్నారు.

Dr Kuna Dayananda Swamy ebooks



అంతే కాదు. యుక్త చేష్టస్య కర్మసు. ఆహార విహారాలేగాక అసలు ఏ పని చేసినా అది ఎంత మాత్రమో అంత మాత్రమే. అతి మాత్రంగా చేయగూడదు. సముద్ర స్నానం చేసేవాడు సముద్రంలో ఎంత దూరం దిగుతాడు. తిరిగి రాగలిగినంత దూరమే దిగుతాడు. అసలు దిగకుండా పోడు. దిగితే అలాగే దిగిపోడు. అదే ఇక్కడా సూత్రం. ఏ పని చేసినా గంటల తరబడి చేస్తూ పోవటమూ మంచిది గాదు. అసలు మానేసి కూచున్నా మంచిది గాదు. దేనికైనా నియతంగా ఉండాలి పరిమాణం. అలా ఉన్నప్పుడే కాలం మిగులుతుంది మానవుడికి. కాలవ్యవధి ఉంటే దాన్ని ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. యోగాభ్యాసానికైనా వ్యవధి **Leisure** ఉండాలిగా. సమయ మనేది చాలా విలువైనది జీవితంలో. జీవితమంటేనే ఒక గొప్ప అవకాశం. అది ఆలోచనలతో పనులతో నిండి క్రిక్కిరిసి పోతే మరి ఏమంచి పనికీ ఆస్కారం లేకుండా పోతుంది. ఏమిటా మంచి పనులు. రెండే. ఒకటి ధర్మం. మరొకటి మోక్షం. ఆ రెండింటిలో కూడా మోక్షమనేది పరమ పురుషార్థమన్నారు. జీవిత సమస్యకు ఏకైకమైన పరిష్కారమదే. అది ఆత్మజ్ఞానం వల్లనే ప్రాప్తిస్తుంది. ఆ జ్ఞానం సాధించటానికే కర్మయోగం ధ్యానయోగం. మరి ఇలాంటి ధ్యానయోగాని కవకాశమంటూ లేకపోతే ఎలా కృషి చేస్తాడు. ఎలా నోచుకొంటాడా జ్ఞానానికి. అంచేత ఆహార విహార స్వప్న జాగ్రదాది విషయ వ్యవహారా లన్నింటిలోనూ జాగ్రత్త వహించాలి మానవుడు. అప్పుడే యోగో భవతి

Dr Kuna Dayananda Swamy ebooks



దుఃఖహా. సర్వ సంసార క్షయకారి అయిన యోగం ఫలిస్తుందని హామీ ఇస్తారు భాష్యకారులు.

**యదా వినియతం చిత్త మాత్మన్యేవావ తిష్ఠతే**

**నిః స్పృహ స్సర్వ కామేభ్యో - యుక్త ఇత్యుచ్యతే తదా - 18**

యుక్త యుక్త అని విధి విరామం లేకుండా వర్ణిస్తున్నారే ఎప్పుడవుతాడు యుక్తుడీ మానవుడని ప్రశ్న వచ్చింది. చెబుతున్నా డెప్పుడవుతాడో. యదా వినియతం చిత్త మాత్మన్యే వావతిష్ఠతే అని కండిషను. ఎప్పుడీ సాధకుడి మనస్సు బాహ్యమైన విషయాలేవీ ఆలోచించకుండా వాటన్నిటిలో నుంచీ వైదొలగి కేవలం తన స్వరూపంలోనే నిలకడ చెందుతుందో అప్పుడు. అప్పుడే అది అసలైన స్థితి. అది తప్పితే మిగతాదంతా గతే. చిత్తానికి రెండే దశలు. ఒకటి స్థితి **Stability**. మరొకటి గతి **Change or movement** ఇందులో నామరూపాలను గూర్చి ఆలోచిస్తున్నంత సేపూ దానికి గతే తప్ప స్థితి లేదు. ఎందుకంటే నామరూపాలనేవి విశేషాలు. ఒక విశేషం లాగా వేరొక విశేషముండదు. క్షణ క్షణమూ మారుతుంటాయి. అవి మానవుడి మనస్సును తమ మీది కాకర్షిస్తుంటాయి. అవి మారుతుంటే వాటి మీద వాలిన మనసు కూడా మారుతూ పోతుంది. అవి అసంఖ్యాకం కాబట్టి ఎక్కడికీ నిలవవు. వాటి ననుసరించి ఈ మనసు కూడా నిలవకుండా పరుగెత్తుతుంటుంది. ఇదే గతి అంటే. ఇది ఇలా జరుగుతున్నంత వరకూ యుక్త అనే మాట కర్థం

Dr Kuna Dayananda Swamy ebooks



లేదు. గతిలో లేదది. స్థితిలో ఉంది. అది మామూలుగా అందకపోతే ప్రయత్న పూర్వకంగా సాధించాలి. అందుకే చిత్తాన్ని నియమించుకో మంటున్నాడు. పరి పరి విధాల పరుగెత్తకుండా ఏకాగ్రం చేసుకోవాలి.

అలా ఏకాగ్రం కావాలంటే ఎలా కావాలి. ఏకైకమైన వస్తువును చూపాలి దానికి. ప్రాపంచికమైన పదార్థాలన్నీ ఏకం కావు. అనేకం. అసంఖ్యాకం. ఒకదాన్ని చూచిన కంట మరొక దాన్ని చూడలేము. అలాంటప్పుడు వాటిమీదికి మనసు పోతే అది ఏకాగ్రమెలా అవుతుంది. ఏకాగ్రం వాటన్నిటినీ గమనిస్తున్న ఆత్మ చైతన్యమొక్కటే. అది ఈ అనేక విధాలైన చరా చర పదార్థాలన్నిటినీ లోపలా బయటా వ్యాపించి ఉంది. కనుక అలాటి ఆత్మలోనే మనసు నిలపగలిగితే అదే ఏకాగ్రత.

అది కూడా అంత సులభం కాదు. చెప్పినంత సులభంగా నిలపలేడు మానవుడు. అలా నిలపాలంటే అసలు వాడికే పదార్థాల మీదా కోరిక ఉండకూడదు. నిః స్పృహ స్సర్వకామేభ్యః అది కావాలిది కావాలి - అదీ ఇదీ పోగు చేసుకొందామనే చాపల్యం పనికిరాదు. సర్వకామేభ్యః కామాలంటే కా మించే పదార్థాలు. దృష్టా దృష్ట విషయాలని వ్రాస్తున్నారు భాష్యకారులు. ఇహానికి సంబంధించినవి దృష్టమైతే పరానికి చెందిన స్వర్గాది భోగాలు అదృష్టం క్రిందికి వస్తాయి. అందులో ఏదైనా కామ్యమే. దేనివెంట బడ్డా మనసు నిలవదు - పరుగెడుతుంటుంది. అనవసరమైన కర్మకాండ పెరిగిపోతుంది. అందులో బడిపోతే మనసు అడుసులో బడ్డట్టే - మోక్ష

Dr Kuna Dayananda Swamy ebooks



మార్గంలో ప్రయాణానికే అది అడ్డుకట్ట. అంచేత దారి కడ్డంగా ఉండే ఈ బండరాళ్ల లాంటి కామ్య విషయాలన్నీ నిర్దాక్షిణ్యంగా మనసులో నుంచి త్రోసిపుచ్చ గలిగి ఉండాలి అభ్యాసి. అలా ఉన్నప్పుడే వాణ్ణి యుక్తుడని చెప్పవచ్చు నంటుంది గీత.

**యథా దీపో నివాతస్థో - నేంగతే సోపమా స్మృతా**

**యోగినో యత చిత్తస్య - యుంజతో యోగమాత్మనః - 19**

అయితే మరి యుక్తుడైన యోగి చిత్తమెప్పుడూ సమాహితమై ఉండాలని పేర్కొన్నారు గదా. అలా సమాహితమైన యోగి చిత్తమెలా ఉంటుందో దాన్ని వివరిస్తారా అని అడిగితే దానికి గీత ఒక చక్కని దృష్టాంతం మనకు వర్ణించి చెబుతున్నది. యథా దీపో నివాతస్థః – గాలి ఎక్కువగా వీచని ప్రదేశానికి నివాత మని పేరు. గాలి అసలు లేదని గాదు. ఉన్నా చలించదు. స్తంభించి ఉంటుంది. అలాటి ప్రదేశంలో ఒక దీపం వెలిగించి పెట్టాడొకడు. పెడితే అది ఎలా కనిపిస్తుంది నీకు. నేం గతే. దాని జ్వాల పైపైకి ప్రసరిస్తూ ఇటూ అటూ ఏమాత్రమూ చలించకుండా అలాగే చక్కగా వెలుగుతూ కనిపించదా. సోపమాస్మృతా. ఇదుగో యోగి అయిన వాడి మనస్సు కదీ సరియైన ఉపమానం. యోగి నోయత చిత్తస్య – యుంజతో యోగమాత్మనః – యోగి కూడా మనసులోని ఆలోచనలన్నీ కట్టిపెట్టి నిర్మలమూ ఏకాగ్రమూ చేసుకొని కూచుంటాడు. అలాగే యోగ మభ్యసిస్తూ పోతాడు. గాలిలాగా వాడి మనసునే కోరికలూ అటూ ఇటూ చెదర గొట్టవు. దీపంలాగా వెలుగుతూనే ఉంటుందది.

Dr Kuna Dayananda Swamy ebooks



మనసంటే అది జ్ఞానానికి నిలయం గదా. జ్ఞానమనేది దీపంలాగా ఒక ప్రకాశం ఒక స్ఫురణే గదా. దీపకాంతి పదార్థాన్ని చూపినట్టే జ్ఞాన ప్రకాశం కూడా ఆత్మ స్వరూపాన్ని చూపుతుంది. అయితే దీపం కదులుతూ చేస్తూ ఉంటే అది చూపే పదార్థా లెలా స్పష్టంగా ఉన్నవున్నట్టు గోచరించవో అలాగే వ్యగ్రమైన మనసుకు కూడా లక్ష్యమైన ఆత్మ స్వరూపం స్పష్టంగా యధాతథంగా కనపడక పోయే ప్రమాదముంది. అప్పుడిక యోగ మభ్యసించినా అభ్యసించకున్నా ఒక్కటే. ఫలసిద్ధికి నోచుకోలేడు సాధకుడు. కనుక మనసు తనకు వశమై ఏకాగ్రమై నిశ్చలమై ఉండాలి యోగికి. అలా ఉంటేనే అది నిశ్చలమూ ఏకాగ్రమూ అయిన దీపకాంతి లాగా ఆత్మావలోకానికి తోడ్పడుతుంది.

**యత్రో పరమతే చిత్తం - నిరుద్ధం యోగ సేవయా**

**యత్ర చై వాత్మనాత్మానం - పశ్య న్నాత్మని తుష్యతి - 20**

ఈ విధంగా యోగాభ్యాస బలంతో ఏకాగ్రత చెంది ఒక నివాత ప్రదీపంలాగా ఎప్పుడు మనసు నిలిచి పోతుందో అదే అసలైన యోగ సమాధి. యోగ సేవయా నిరుద్ధం. నిరంతరం యోగాన్ని అభ్యసిస్తూ పోయే వాడికి మనస్సు నిరుద్ధం కాక ఏమవుతుంది. అభ్యాస పాటవంతో తప్పకుండా అది ఆగిపోతుంది. సర్వతో నివారిత ప్రచారమని పేర్కొంటారు భాష్యకారులు. దాని ప్రచారమే సాధకుడికి ప్రతిబంధకం. దానికి బాహ్య విషయాల ఆలోచనలే దోహదం. ఆ ద్వారాలన్నీ మూసివేసి దాన్ని కదలకుండా నివారించ గలిగితే అదే నిరోధం చిత్తానికి. యోగశ్చిత్తవృత్తి నిరోధః అని గదా యోగుల నిర్వచనం.

Dr Kuna Dayananda Swamy ebooks



అలా నిరోధం మాత్రమే సాధిస్తే సుఖం లేదు మరలా. అది ప్రతిలోమ మార్గమే గాని అనులోమం గాదు. అవతలి కొమ్మ పట్టుకొంటే గాని ఇవతలి కొమ్మ వదిలేయ లేవు. లేకుంటే ఏదీ పట్టు చిక్కక పడిపోతావు. అంచేత ఇప్పుడు యోగి పట్టుకోవలసిన భావమేదో బయటపెడుతున్నాడు మహర్షి. యత్ర చైవాత్మనాత్మానం పశ్య న్నాత్మ ని తుష్యతి - ఆత్మానం పశ్యన్నంటున్నాడు. ఆత్మనే చూస్తుండాలట. దాన్ని ఏమరగూడదు. ఎప్పుడూ విడవకుండా చూస్తుండాలట. ఏమిటది. ఆత్మ. అంటే తన స్వరూపం. ఎలా ఉంటుందది. నేనున్నానే స్ఫురణే అది. అది నాలో ఎలా ఉందో అలాగే నేను చూచే బాహ్య ప్రపంచమంతా వ్యాపించి ఉన్నది. ఉండటమనే స్ఫురణ లేని పదార్థ మేముంది సృష్టిలో. నేనూ లేను నాకు కనిపించేదీ లేదు. నాతో సహా ప్రతి పదార్థాన్నీ ఉన్నది ఉన్నదనే గమనిస్తుంటాను. ప్రతి ఒక్కటీ ఉండటమనే స్ఫురణతోనే గోచరిస్తున్నది. అలాగే అనుభవానికి వస్తున్నది. ఉండకుండా ఉన్నట్టు స్ఫురించకుండా నేనూ లేను. నాదీ లేదు. అదే ఆత్మ అంటే. అదే చూస్తుండా లెప్పుడూ. చూస్తూనే ఉన్నాం గదా అని అడగవచ్చు. చూడటం లేదలా. స్ఫురించే పదార్థాన్ని చూస్తుంటావు. పదార్థం తాలూకు స్ఫురణను చూడటం లేదెవ్వడూ. స్ఫురించేవి దాని విశేషాలు. అవి మారుతుంటాయి ఎక్కడికక్కడ. ఏ స్ఫురణలో అవి నీకు స్ఫురిస్తున్నాయో ఆ స్ఫురణ సామాన్యం. అది మారదు. అది పట్టుకొంటేనే యోగం. లేకుంటే వియోగం.

Dr Kuna Dayananda Swamy ebooks



ఇప్పుడు నూటికి తొంభయి మంది దాన్ని గాదు పట్టుకోటం. స్ఫురించే విశేషాలను. అవే నామరూపాలు. అందుకే సంసార బంధమయి కూచున్నదది. దానిలో నుంచి బయటవడాలంటే స్ఫురించే నామరూపాలను గాక వాటిలో పరుచుకొని ఉన్న స్ఫురణ అనే అధిష్ఠానాన్ని **Basis** పట్టుకోవాలి. ఆత్మానం పశ్యన్నే మాట కర్థ మదీ. అయితే ఎలా పట్టుకోవాలది. ఆత్మనా - ఆత్మతోనే పట్టుకోవాలి. ఆత్మతో నంటే ఆత్మ తాలూకు అభిప్రాయంతో. దాని జ్ఞానంతో. దేన్ని పట్టుకోవాలన్నా దాని జ్ఞానంతోనే గదా పట్టుకొంటాము. అప్పుడే గదా దాని అనుభవం. అలాగే ఆత్మను గూడా ఆత్మ జ్ఞానంతోనే **The idea of Atman** గ్రహించవలసి ఉంది.

పోతే ఎక్కడ ఉందని గ్రహించాలి దాన్ని అని ప్రశ్న. ఏదైనా ఒకటి చూడాలన్నా గ్రహించాలన్నా అది ఎక్కడ ఉందో తెలుసుకోవాలి గదా ముందు. ఎక్కడో లేదది. ఎక్కడో ఒకచోట ఉండి కనిపించేది ప్రపంచమూ- అందులో ఇటూ అటూ సంచరిస్తున్న మనబోటి ప్రాణుల శరీరాలూ. అవి గ్రహించాలంటే ఎక్కడ దొరుకుతాయో వాటి చిరునామా తెలుసుకొని వెళ్లి పట్టుకోవలసి ఉంటుంది. ప్రస్తుత మీ ఆత్మ అలాంటిది గాదు. స్ఫురించే పదార్థం. **The Thing to be cognised** కాదది. స్ఫురణ **Awareness of Their presence.** అది ప్రతి పదార్థంలోనూ పరుచుకొని ఉంది. అదే ఆత్మ. కనుక దేశంలో కాలంలో వస్తువులో ఎక్కడో ఒక మూల ఉన్నదిగాదు.

Dr Kuna Dayananda Swamy ebooks



కనుక ఎక్కడ చూచినా చూడవచ్చు. ఎక్కడ చూస్తే అక్కడే ఆత్మ. అందుకే పశ్యన్నాత్మని. ఆత్మలోనే చూడవచ్చు. ఆత్మలో ఆత్మను ఆత్మతోనే పట్టుకోమని చెబుతున్నది గీత. అప్పుడే తుష్యతి. తృప్తి కలుగుతుంది. అది అంతటా ఉన్న పదార్ధం గనుకనే పట్టుకొనే నీవూ అదే పట్టు పడేదీ అదే పట్టుకొనే సాధనమూ అదే. ప్రమాతృ ప్రమేయ ప్రమాణాలు మూడూ నీ స్వరూపమే అయినప్పుడిక క్రొత్తగా పట్టుకొనే ప్రయత్నమేముంది. అవసరమేముంది. కేవల మీ సత్యాన్ని గుర్తు చేసుకోటమే గ్రహించట మనుభవించటం. అదే తృప్తి మానవుడికి. ప్రతి మానవుడికీ గాదు. ప్రతివాడూ ఈ సూక్ష్మాన్ని గుర్తించ లేడు గదా. అలా గుర్తించే సూక్ష్మ బుద్ధి గలవాడెవడో వాణ్ణే యోగి అంటున్నది గీత.

**సుఖ మాత్యం తికం యత్త - ద్బుద్ధిగ్రాహ్య మతీంద్రియం**

**వేత్తి యత్ర నచైవాయం - స్థిత శ్చలతి తత్త్వతః - 21**

యోగ సిద్ధుడైన వాడేది గుర్తిస్తాడది ఎలా గుర్తిస్తాడని అడిగితే దానికి జవాబిస్తున్నది గీత. సుఖమాత్యంతికం యత్ తత్ వేత్తి - వేత్తి అంటే గుర్తించటం. గుర్తించటమే కాదు వేత్తి అనే మాటకు దర్శనం అనుభవమని కూడా అర్థమే. దేన్ని గుర్తిస్తాడు యోగి దేన్ని అనుభవిస్తాడు. సుఖమాత్యంతికం - అనంతమైన సుఖాన్ని. సాంతమైన సుఖమైతే లోకులే అనుభవిస్తున్నారు. అందులో విశేషమేమీ లేదు. యోగాభ్యాసమే చేయనక్కర లేదు దానికోసమే అయితే. మరి ఇంత యోగాభ్యాసం చేసి పొందే సుఖమలా సాంతమైతే ఎలా. అనంతమైన సుఖమైతేనే గొప్ప. వాడందు కొన్న పరమాత్మ

Dr Kuna Dayananda Swamy ebooks



అనంతం గదా. కనుక తజ్జన్యమైన సుఖానుభవం కూడా అనంతమే కావలసి ఉంది. అదే ఆత్యంతికమంటే. అంత మతీత్య వర్తతే ఇతి ఆత్యంతికం **Endless Eternal.**

కాని ఎలా అందుకోవాలా సుఖం. బుద్ధి గ్రాహ్యమతీంద్రియ మన్నారు. బుద్ధితోనే అందుకోవాలది. ఇంద్రియాలతో గాదు. చక్షురాదీంద్రియాల కగోచరమది. ఇంద్రియ గోచరమైన సుఖమెప్పుడూ సాంతమే. అనంతం కాదు. ఇంద్రియవృత్తులే సాంతమైనప్పుడవి సాధించే సుఖ మనంతమెలా కాగలదు. పోతే అంతరింద్రియైన మనసు కూడా పనికిరాదు. మనసంటే సంకల్ప వికల్పాత్మకం. ఏది ఆలోచిస్తుంటే ఆ మేరకది పరిచ్ఛిన్న **Limited** మయిపోతుంది. ఆలోచనకు వచ్చేదీ పరిమితమే. తద్విషయమైన ఆలోచనా పరిమితమే. దీనినే వృత్తి జ్ఞాన **Idea** మంటారు వేదాంతులు.

కనుక బహిరింద్రియాలూ కావు. అంతరింద్రియమైన మనసూ కాదు సాధనం. అయితే మరేది సాధనం. ఒక్క బుద్ధే. బుద్ధి అంటే ఏమిటది. ఇంద్రియ నిరపేక్షమని అర్థం చెబుతున్నారు భగవత్పాదులు. ఇంద్రియాల అవసరం లేనిదది. చక్షురాదుల దగ్గరి నుంచీ అంతరింద్రియమైన మనస్సు వరకూ అన్నీ ఇంద్రియాలే. అవన్నీ విశేషాకారమైన వృత్తులు **Particulars corresponding to particular things.** బుద్ధి అలాంటిది కాదు. అదీ వృత్తే అయినా నిర్విశేషమైన వృత్తి – నిర్వికల్పమైన వృత్తి. విశేష జ్ఞానం కాదది. సామాన్యాకారమైన జ్ఞానం.

Dr Kuna Dayananda Swamy ebooks



ఆత్మాకారం. అఖండాకారం. అఖండమైన ఆత్మ ఎలా ఉందో అలా ఏర్పడే వృత్తి. అది లోకులకూ కర్మిష్ఠులకూ తత్త ద్దేవతో పాసకులకూ అంతుపట్టేది కాదు. కేవలమాత్మనే లక్ష్యంగా పెట్టుకొని దానికోస మభ్యాసం చేసి అందులో ఆరూఢులైన సాధకులకే లభిస్తుంది. దాని బలంతో దర్శిస్తారు అనుభవిస్తారు వారు అవిషయజనితమైన ఆత్మానందం. ఆత్మలోనే ఉండి ఆత్మ సుఖ మనుభవిస్తుంటారు కాబట్టి యత్ర నచైవాయం స్థిత శ్చలతి తత్త్వతః - తత్వం నుంచి జారిపడటమంటూ ఉండబోదు వాడికి. అలా స్థిరంగా తన స్వరూపంలో తాను నిలదొక్కు కొన్నప్పుడే వాడు యోగా రూఢుడు. స్థిరత్వ మేర్పడుతుంది. మనసూ ఇంద్రియాలూ ఇటూ అటూ లాగకుండా ఉన్నప్పుడు. అవి ఎప్పుడుంటా యలాగా. నీవు వాటిని నీ చెప్పుచేతల్లో ఉంచుకొన్నప్పుడు. అది ఎలాగా. నీవాత్మాభిముఖంగా నిరంతరమూ యోగమనే వాహనంలో కూచొని నిర్విరామంగా ప్రయాణం సాగించినప్పుడు. అప్పుడే నీవు నీ స్వరూపమనే గమ్యం చేరగలవు. ఆత్యంతికమైన సుఖ మనుభవించగలవు.

**యం లబ్ధ్వా - చాపరం లాభం - మన్యతే నాధికం తతః**

**యస్మిన్ స్థితో న దుఃఖేన - గురుణాపి విచాల్యతే - 22**

అత్యంత సుఖానుభవమే గాక మరి రెండు సత్యాలు కూడా సెలవిస్తున్నాడు మనకు గీతాచార్యుడు. అవేమిటంటే యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః - అంతకన్నా గొప్ప లాభం జీవితానికి

Dr Kuna Dayananda Swamy ebooks



మరొక టేదో ఉందని భావించడట వాడు. లోకంలో అయితే ఎన్నో ఉంటాయి మనమాసించే లాభాలు. అది కావాలిది కావాలనే గదా ఎప్పుడూ మన తాపత్రయం. అవి మన మాశ పడ్డట్టు మనకు ప్రాప్తిస్తాయని చెప్పలేము. కొన్ని లభిస్తే కొన్ని లభించవు. అన్నీ లభిస్తే గాని తృప్తి లేదు. అన్నీ అంటే ఎన్నని. అసంఖ్యాకం. అంతూ పంతూ లేదు వాటికి. కారణం. విశేషాల పుట్ట ఈ ప్రపంచం. మనసులో కలిగే కోరికలూ అలాటి విశేషాలే. రెండూ అసంఖ్యాక మనంత మయినప్పు డెన్ని లభించినా ఏమి సుఖం. అంతం లేదుగా లాభానికి.

లాభాని కంత మెప్పుడు. ఇక లభించ వలసిందేదీ లేనప్పుడు. ఎప్పుడది లేకపోతుంది. విశేషంగా కనపడ నప్పుడు. విశేషాలన్నీ కలిసి సామాన్యాకారంగా భాసించి నప్పుడది ఇక అనాత్మ కాదు. ఆత్మ స్వరూపం. అదే విశేషాలన్నింటినీ తనలో లయం చేసుకొని నిర్విశేషంగా దర్శనమిస్తుంది. ఇస్తే అదే ఏకైకమైన లాభం. ఇక వేరే లాభమేముంది. వేరనే ప్రశ్నే లేదు గదా. ఎందుకు. వేరుగా కనిపించేవి విశేషాలే. అవన్నీ లయమయి పోయాయి సామాన్యంలో. సామాన్యమే ఆత్మ. విశేషాలే అనాత్మ. కాబట్టి ఆత్మ ఒకటి లభిస్తే చాలు. అన్నీ మనకు లభించినట్టే. ఇక ఏ లాభమూ మనకక్కర లేదు. ఏదైనా మిగిలిపోతే గదా అది లాభమను కోటానికి. అన్నీ ఆత్మలోనే కలిసి వచ్చాయి. కాబట్టి అదే పరమ లాభం మన పాలిటికి. దాన్ని మించిన లాభమంటూ లేదని అనాత్మ దృష్టిని కొట్టివేస్తున్నదీ వాక్యం.

Dr Kuna Dayananda Swamy ebooks



పోతే ఇక లాభమే గాక ఏ దుఃఖమూ లేదని చెప్పి దుఃఖాన్ని కూడా త్రోసి పుచ్చుతున్నది గీత. యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే. తాపత్రయ మన్నారు సంసారాన్ని వర్ణిస్తూ వేదాంతులు. ఆధ్యాత్మిక ఆధి భౌతిక ఆధి దైవికాలని మూడు తాపాలతో తపించి పోతున్నారు జీవులు. తాపమంటే దుఃఖమే. ఎంత దుఃఖం ముంచుకు వచ్చినా యోగారూఢుడైన వాడు చలించడు. చలిస్తే వాడు ఆరూఢుడే కాడు. ఎప్పుడలా చలించబోడు. ఆత్మ తత్త్వే స్థితః అన్నారు ఆచార్యులవారు. ఆత్మ తత్త్వంలో పాదుకొన్నప్పుడే. ఆత్మకు చలనం లేదు గదా. అది అచలం. కనుక దానితో ఏకమైపోయిన యోగి బుద్ధి కూడా అచలమే. అచలం గనుకనే న దుఃఖేన గురుణాపి విచాల్యతే. పెద్ద పెద్ద కఱ్ఱలూ కత్తులూ నెత్తిన బడ్డా ఈషన్మాత్రం చలించడు యోగి. యోగి చలించడని కాదు. ఎవడలా చలించడో వాడు యోగి అని అర్థం చేసుకోవాలి మనం.

**తం విద్యా ద్దుఃఖ సంయోగ - వియోగం యోగ సంజ్ఞితం**

**స నిశ్చయేన యోక్తవ్యో - యోగో ఽ నిర్విణ్ణేన చేతసా - 23**

యత్రో పరమతే అనే శ్లోకం మొదలుకొని యం లబ్ధ్వా అనే శ్లోకం వరకూ ఈ మూడు శ్లోకాలలో ఏయే లక్షణాలుంటాయని ఆత్మావస్థాన విశేషమైన యోగాన్ని వర్ణించారో ఆ యోగ మెలాంటిదని మన మర్థం చేసుకోవాలో ఇప్పుడు సంగ్రహంగా బయటపెడుతున్నది గీత. అలాంటి లక్షణాలుంటేనే వాడు యోగి - లేదా యోగి అయిన వాడి కలాటి

Dr Kuna Dayananda Swamy ebooks



లక్షణాలుండి తీరాలని - మనమెలా చెప్పుకొన్నా చెప్పుకోవచ్చు నని వ్యాస హృదయం.

అందుకే ఒక షరతు పెట్టాడాయన. ఏమిటా షరతు. తం విద్యా ద్దుఃఖ సంయోగ వియోగం యోగ సంజ్ఞితం - అదే మీరు యోగమని తెలుసుకోండి - మరేదీ గాదు. అదేనట. ఏదది. ఎలాంటిది. దుఃఖ సంయోగ వియోగం. వియోగమే వాస్తవంలో యోగం. యోగమంటే ఉండటం. వియోగమంటే లేకపోవటం. ఒకటి లేకుండా పోవటమే మరొకటి ఉండటం. దుఃఖం లేకపోవటమే యోగమట. అంటే సంసార తాపత్రయం పూర్తిగా తొలగిపోతే అది వియోగం. ఆ వియోగమే యోగం. దీనిని విపరీత లక్షణమని పేర్కొన్నారు భగవత్పాదులు. **Two negatives make a positive.** దుఃఖముంటే అది సుఖమెలా అవుతుంది. సుఖం లేకుంటే అది యోగమెలా అవుతుంది. సుఖమా త్యంతిక మని గదా వర్ణించాడు. కాబట్టి దుఃఖంతో వియోగమే సుఖంతో యోగం. ప్రస్తుతం మనకున్నది దుఃఖంతో యోగం. సుఖంతో వియోగం. దీనికి భిన్నంగా సుఖంతో యోగం. దుః ఖంతో వియోగ మేర్పడాలి. అదే ప్రస్తుతం యోగమనే మాట కర్థం.

గీతా శాస్త్రార్థమంతా ఇక్కడే మనకు సాక్షాత్కరిస్తున్నది. జీవిత సమస్యా - దానికి పరిష్కారాన్వేషణా - ఇదే గదా శాస్త్రార్థం. అందులో విషాదయోగం సమస్య అయితే - సాంఖ్యయోగం దానికి పరిష్కారమని చెప్పామా లేదా. దానినే ఇక్కడ ఒక మాటలో ఒక చిన్న సమాసంలో

Dr Kuna Dayananda Swamy ebooks



సూచిస్తున్నాడు మహర్షి. దుఃఖ సంయోగం విషాదమైతే - దుఃఖ వియోగం సాంఖ్యం. ఇంతకన్నా చెప్పవలసిందే ముంది. శాస్త్రార్థమంతా ఒక ముక్కలో కలిసి వచ్చింది.

ఎటు వచ్చీ అలాటి ఆరూఢ స్థితి నందుకోటానికి కావలసిన కృషి చేయటమే మానవుడి కర్తవ్యం. కృషి చేస్తూ పోయే వాడా రురుక్షువు. చేసి దాని ఫలితం పొందిన వాడారూఢుడు. ఫలితం కావాలంటే ప్రయత్నం చేయక తప్పదు. కాబట్టి ఫలితాన్ని వర్ణించామంటే అప్పుడే అది వచ్చి ఒళ్లో బడిందని సంతోషించ రాదు. ప్రయత్నం చేస్తూ పోవాలి కొంతకాలం. అందుకే అంటున్నారు గురువుగారు. యోగఫల ముప సంహృత్య పునరన్వారంభేణ యోగస్య కర్తవ్యతా ఉచ్యతే. యోగఫలం చెప్పి ముగించి మరలా మొదటికి వచ్చి యోగమెలా చేయాలో వర్ణిస్తున్నారట.

ఎలా చేయాలట యోగం. సనిశ్చయేన యోక్తవ్యః యోగః అనిర్విణ్ణేన చేతసా. నిశ్చయమూ అనిర్వేదమూ - ఇవి రెండూ నియమంగా ఉండి తీరాలి యోగ మభ్యసించేటప్పుడు. నిశ్చయమంటే ఇది ఇంతే ఇలాగే చేయాలి యోగం - దీనికి తప్పకుండా సత్ఫలితముంది - అనే అధ్యవసాయమే నిశ్చయం **Conviction faith** . నిశ్చయం లేక ఫలితముందా లేదా అని సందేహిస్తూ పోతే అడుగు ముందుకు వేయలేవు. ముందుగానే నీరుగారి పోతావు. ఇక యోగమేమిటి. అభ్యాసమేమిటి. వట్టి మాట.

Dr Kuna Dayananda Swamy ebooks



అలాగే అనిర్వేదం కూడా ఎంతైనా అవసరం యోగాభ్యాసికి. నిర్వేదం లేకపోవటమే అనిర్వేదం. నిర్వేదమంటే విసుగు - చిరాకు. అలసత్వమంటారు పెద్దలు. ఏమాత్రం విసుగనిపించినా చేయటానికి బుద్ధి పుట్టదు. బద్ధకిస్తావు. కనుక ఫలసిద్ధే కావాలంటే ప్రయత్నం ఫలించాలంటే విసుగూ వేసటా లేకుండా నిర్విరామంగా శ్రద్ధాసక్తులతో యోగమభ్యసిస్తూ పోవాలి సాధకుడు. తాబేలులాగా ఎప్పటికైనా గమ్యం చేరగలడు. ఆత్యంతికమైన ఆత్మ సుఖ మనుభవించ గలడు.

**సంకల్ప ప్రభవాన్ కామాన్ - త్యక్త్వా సర్వా నశేషతః**
**మనసైవేంద్రియ గ్రామం - వినియమ్య సమంతతః - 24**
**శనై శ్శనై రుపరమే - ద్బుద్ధ్యా ధృతి గృహీతయా**
**ఆత్మ సం స్థం మనః కృత్వా - న కించి దపి చింతయేత్ - 25**

నడక తాబేలు నడక అయినా జీవిత గమ్యం చేరటం మాత్రం ఖాయం. అందులో సందేహం లేదు. ఏమిటా గమ్యం. ఆత్మ జ్ఞానం - తద్ద్వారా మోక్షం. అది దృష్టిలో పెట్టుకొనే ఈ ప్రయాణం - కనుక ఎప్పటికైనా చేరగలమనే నమ్మకం. చేస్తున్నప్పుడది ధ్యానయోగమైనా ధ్యేయం మీద దృష్టి ఉన్నది కాబట్టి అది తప్పకుండా జ్ఞానయోగంగా మారుతుంది. అయితే ప్రయత్నం సాగుతున్నప్పుడే అది వచ్చి ఒళ్లో బడలేదే అని ఒడి తడవి చూచుకోరాదు. ప్రయాణ మధ్యంలోనే ఉండి గమ్యమెక్కడా కనపడ లేదే అని అడిగి నట్టుంటుం దది. ఇంకా చేయవలసిన ప్రయాణముంది. అలాగే ధ్యానమింకా సాగించవలసి ఉంది. అది మరచిపోరాదు.

Dr Kuna Dayananda Swamy ebooks


ఏమిటది ఎలా సాగించాలో ఆ ప్రయత్నమింతకు ముందు నుంచీ చెబుతున్నా డిప్పుడూ చెబుతున్నాడు. సంకల్ప ప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వాన శేషతః – ఇది మొదట నీవు చేయవలసిన ప్రయత్నం. మనసుతోనే గదా ఎప్పటికైనా అందుకో వలసిందా భూమిక **Stage.** అది సరిగా లేకపోతే ఎలా. ఎలా ఉండాలది. పరిశుద్ధంగా ఉండాలి. కోరికలు గొడవ చేస్తున్నంత వరకూ స్తిమితంగా ఉండదది. నిర్మలంగా ఉండదు. కోరికలకు మూలమేమిటి. సంకల్పం. సంకల్పం వల్లనే ప్రభవిస్తాయి కోరికలన్నీ. అవన్నీ యోగ సాధకుడు నిశ్శేషంగా త్రోసి పారేయాలి. ఏ వస్తువు మీదా దృష్టి పెట్టరాదు. ఏదీ కావాలని కాంక్షించరాదు. ఏమున్నా లేకున్నా ఒకటేనని చూడాలి. దైవికంగా దాని పాటికది ఏది లభిస్తే అదే అనుభవిస్తూ పోవాలి. అదీ త్యాగమనే మాట కర్థం. అదే పనిగా వదిలేయటం కాదు. అదే కావాలని కోరటమూ కాదు. అలాగైతేనే మనసు నీకు వశమవుతుంది. లేకుంటే దానికి నీవు వశమై పోతావు.

మనసు స్వాధీనమైతే చాలు. మనసై వేంద్రియ గ్రామం వినియమ్య సమంతతః – ఇంద్రియాలు వాటి పాటి కవే అధీనమవుతాయి. మనసును బట్టి ఇంద్రియాలు. ఇంద్రియాలను బట్టి మనసు గాదు. మనసు పగ్గం – ఇంద్రియా లశ్వాలని గదా కఠోపనిషత్తు మాట. కాబట్టి మనసుతోనే అరికట్ట వచ్చు ఇంద్రియ వర్గాన్ని. ఎక్కడ ఉందని అది. మన శరీరంలో ఉన్నాయని పేరు ఇంద్రియాలు. కాని పట్ట పగ్గాలు లేకుండా తిరుగుతుంటాయి విషయ జగత్తులో. అంచేత సమంతతః ఎటూ పోనీయకుండా మనసుతో వాటిని

Dr Kuna Dayananda Swamy ebooks

అన్ని వైపుల నుంచీ వెనక్కు మళ్లించాలి. మనస్సునంతకు ముందే నిస్సంకల్పంగా మార్చుకొని కూచోవాలి.

ఈ విధంగా అంతరింద్రియ బహిరింద్రియాలు రెండూ పరిశుద్ధమైతే వాటిని మెల్ల మెల్లగా బుద్ధ్యా ధృతి గృహీత యా బుద్ధి బలంతో గట్టిగా పట్టుకొని వాటి వాటి పనుల నుంచి వాటిని విరమింప జేయాలి. ధృతి గృహీతయా. దానికెంతో ధైర్యముండాలి నీ బుద్ధికి. వికల్పాత్మక మైనది మనస్సయితే నిర్వికల్పమైనది బుద్ధి. అది మనస్సును కంట్రోలు చేస్తే మనసు చక్షురాదులైన ఇంద్రియాలను నిలదీస్తుంది.

అన్నీ నీ చెప్పుచేతల్లో ఉంటే ఇంకేమి. ఆత్మ సంస్థం మనః కృత్వా. నీమనస్సును నీ ఆత్మలోనే నిలిపి నకించి దపి చింతయేత్. మరేదీ ఇక ఆలోచించ గూడదు నీవు. మనస్సు నాత్మలో ఉంచటమేమిటి. ఆత్మ అంటే ప్రత్యగాత్మ. నీ అసలైన నేను. నీ స్వరూపమే అది. అందులో సంకల్పం కామ మనే వృత్తు లేర్పడితే చాలు. అదే మనసనే పేరుతో బయటికి వస్తుంది. వృత్తి రహితమైతే అదే మరలా ఆత్మగా మారుతుంది. రాక పోకలు మనసుకే ఆత్మకు గావు. రాకపోకలు కూడా వాస్తవం గావు. ఆ భాస. ఆత్మే అప్పటికి మనసుగా భాసిస్తున్నదన్న మాట. ఆత్మ అని గుర్తించక పోతే మనసు. గుర్తిస్తే మనసు గాదది. ఆత్మ. అదే ఆత్మ సంస్థం మనః కృత్వా అని చమత్కారంగా చెబుతున్నది గీత. అంతేగాదు. నకించిదపి చింతయే త్తనటంలో మళ్లీ ఆత్మ మనసుగా మారి పోకుండా జాగ్రత్త పడమని కూడా హెచ్చరిస్తున్నది సాధకుణ్ణి.

Dr.Kuna Dayananda Swamy ebooks

**యతో యతో నిశ్చరతి - మన శ్చంచల మస్థిరం**

**తతస్తతో నియమ్యైత - దాత్మన్యేవ వశం న యేత్ - 26**

అలా ఆత్మ సంస్థంగా మనస్సును చేయాలంటే అది అంత సులభమైన పనిగాదు. మనసంటే ఏమిటో అది ఎలాంటిదో తరువాత చెప్పబోతుంది గీత. పాదరసంలాగా అతి చంచలమది. అస్థిరం. స్థిరత్వమే మాత్రమూ లేదు దానికి. కోతిలాగా చపలమైన స్వభావం దానికి. ఒక్క క్షణం నిలకడగా ఉండబోదు. శబ్ద స్పర్శాదులైన విషయాల మీదికెప్పుడూ పరుగెడుతుంటుంది. అవి అనేకం అనంతం. వాటిని గ్రహించే ఇంద్రియ వ్యాపారాలూ అనేకమూ అనంతమే. మరి తద్ద్వారా పనిచేసే మనసు మాత్రం తక్కువా. ఇంద్రియ వ్యాపారాలంటే అంతకు ముందు మనో వ్యాపారమేగా అది. అంచేత మనోవృత్తులూ అసంఖ్యాకంగా జన్మిస్తూనే ఉంటాయి. సాగర తరంగాల లాంటివవి. అవిచ్ఛిన్నంగా ప్రసరిస్తూనే ఉంటాయి. ఆగమన్నా ఆగవు.

అంచేత యతో యతో నిశ్చరతి మనః - ఎటువైపు నీ మనస్సు పరుగెత్తుతుంటే అటు వైపు పోనీయకుండా దాన్ని నియమ్య నిరోధించటమే సాధకుడి డ్యూటీ. నిగ్రహించటం వరకే గాదు. అది ప్రతిలోమమైతే అనులోమ క్రియ మరొకటుంది. ఆత్మన్యేవ వశం నయేత్ - ఆత్మలోనే దాన్ని కట్టి పడేయాలి - అది అనులోమం - ఇలా ఎడా పెడా వాయిస్తే గాని అది నిలకడ చెందదు.

Dr Kuna Dayananda Swamy ebooks



మొదట ప్రతిలోమంగా దాన్ని విషయ ప్రపంచం మీది నుంచి మళ్లించాలి. తరువాత అనులోమంగా దాన్ని ఆత్మలోనే నిలుపుకోవాలి. అనాత్మ నుంచి మళ్లించాటానికే వైరాగ్యమని పేరు. ఆత్మలో నిలపటాని కభ్యాసమని పేరు. వైరాగ్యమూ అభ్యాసమూ ఇవి రెండే మార్గాలు మనో జయానికి. అప్పుడే సాధనకు పరిపూర్ణత. ఒక బస్సు ప్రయాణం గుర్తుంచుకొంటే సరిపోతుంది. - బస్సు విజయవాడ వదిలేసింది. హైదరాబాదు వైపు వెళ్లుతున్నది. విజయవాడ ఎంతెంత దూరమైతే హైదరాబాదంతంత దగ్గర పడుతుంది. అది ఎంత దగ్గరైతే ఇది అంత దూరమవుతుంది. ప్రయాణం ప్రయాణమే. ఫలితాలు రెండు. అలాగే ఇక్కడా యోగసాధన సాధనే. ఫలితాలు రెండు. అనాత్మ దూరం కావటమొక ఫలితం. ఆత్మ దగ్గర పడట మొక ఫలితం. ఆ దూరం కావటమే వైరాగ్యం. ఈ దగ్గర పడటమే అభ్యాసం. అభ్యాసం లేనిదే ఆత్మ కనపడదు. వైరాగ్యం లేనిదే అనాత్మ కనపడకుండా పోదు. అది ఎలా కనపడకుండా పోవాలో చెబుతున్నారు భాష్యకారులు. యాథాత్మ్య నిరూపణేన ఆభాసీకృత్య. ఇదీ ఆయన మాట. అనాత్మ ప్రపంచమనే దేమిటో దాని స్వరూపం లోతుకు దిగి నిరూపణ **Scrutiny** చేస్తే చాలు. అదంతా ఆ భాస అయిపోతుంది. ఆ భాస అయినప్పుడిక అభిమానమే ముంటుంది. కనుక వైరాగ్యమే. అప్పుడా భాసీ భూతమైన అనాత్మ ఏమవుతుంది చివరకు. ఆత్మగానే అనుభవానికి వస్తుంది. ఇదం సర్వం యదయమాత్మా అని ఉపనిష ద్వాణి. ఆత్మా ఆత్మే. అనాత్మా ఆత్మే. మాండూక్యం చెప్పిన ఏకాత్మ.

Dr Kuna Dayananda Swamy ebooks


**ప్రశాంత మనసం హ్యేనం - యోగినం సుఖ ముత్తమం**

**ఉపైతి శాంత రజసం - బ్రహ్మభూత మకల్మషమ్ - 27**

ఇలాంటి ఏకాత్మ భావమే బ్రహ్మ భావం - బృహత్వా ద్బ్రుం హణత్వా ద్బ్రృహ్మ అన్నారు. అన్నిటికన్నా పెద్దది. అన్నింటినీ తనలో ఇముడ్చుకొన్నది. అన్నిటినీ నలగగొట్టి తనలో కలుపుకొని తనకు తానే మిగిలిపోయింది. అదే బ్రహ్మమనే మాట కర్థం. అప్పుడంతా ఏకమే అది నేననే స్ఫురణే కాబట్టి బ్రహ్మమన్నా ఏకాత్మ భావమన్నా ఒక్కటే. బ్రహ్మ భూతమంటే ఇలాంటి బ్రహ్మ భావం లేదా ఏకాత్మ భావమందుకొన్న వాడవుతాడట. ఎవడు యోగి. యోగారూఢుడయిన వాడు. యోగాభ్యాసం చేసి చేసి అందులో సిద్ధి పొందినవాడు కేవలం బ్రహ్మ స్వరూపుడే. జీవన్ముక్తుడని పేర్కొంటారు భగవత్పాదులు. ఎందుకంటే అకల్మషం. వాడికిక ఏ కల్మషమూ లేదు. ధర్మాధర్మాది ద్వంద్వాలేవీ పనిచేయవు వాడిమీద. శుద్ధ చైతన్య స్వరూపుడు వాడు. శాంతరజసం - రజో మాలిన్యం కూడా కడిగేసినట్టయి పోయింది వాడికి. రజస్సంటే చలనాత్మకం చలనమే అనాత్మ భావం. విశేషాలే గదా చలిస్తాయి. నామరూపాలే విశేషాలు. అవి సచ్చిద్రూపంగా మారాయి వాడికి. ఇక చలనమేముంది. చలనం లేదంటే రజస్సు శమించినట్టే. శమిస్తే ప్రశాంత మనసం. వాడి మనస్సు కూడా దానితో పాటు శమించింది. అంటే మనసు ఆత్మగా మారింది. అది ఆత్మే. మనసు గాదు. అలాటి యోగిన ముపైతి. యోగసిద్ధుడికి

Dr Kuna Dayananda Swamy ebooks



లభిస్తుంది. ఏమిటి. సుఖ ముత్తమమ్. ఉత్తమమైన సుఖం. ఉత్తమమంటే నిరతి శయ మని భాష్యం. దేనికన్నా ఇక అధికమైన సుఖం లేదో అది. అంటే బ్రహ్మానందం. వాడు బ్రహ్మ భూతుడు గదా. కాబట్టి వాడికి లభించేది కూడా బ్రహ్మానందమే **Bliss.**

**యుంజన్నేవం సదాత్మానం - యోగీ విగత కల్మషః**

**సుఖేన బ్రహ్మ సంస్పర్శం - అత్యంతం సుఖ మశ్నుతే - 28**

ఈవిధంగా యోగారూఢుడికి కలిగే సిద్ధిని వర్ణించి మరలా వాడు దానికోసం చేయవలసిన సాధనా సిద్ధీ రెండూ కలిపి వర్ణిస్తున్నాడు వ్యాస భగవానుడు. యుంజన్నేవం సదాత్మానం. మనసు నెప్పుడూ పట్టిన పట్టు విడవకుండా యోగమార్గంలో నడుపుతూ పోవాలి. మార్గంలో ఎన్నో అంతరాయాలు పిలిస్తే పలుకుతుంటాయి. ప్రమాదాలస్యాది యోగ విఘ్నాలు చాలా వర్ణించారు యోగశాస్త్రంలో. అలాటివన్నీ అభ్యాస బలంతో దాటిపోవాలి యోగి. ఈశ్వరానుగ్రహం కూడా దానికి తోడయితే తప్పకుండా చిత్తేంద్రియాలకు పట్టిన మాలిన్యమంతా క్షాళితమయి పోతుంది. విగత కల్మషః - నిష్కల్మషు డవుతాడు. గుణకాలుష్యమే కాలుష్యం మానవుడికి. సత్త్వరజస్తమస్సులే గుణాలు. సత్త్వం మనస్సూ - రజస్సు ప్రాణమూ - తమస్సు శరీరమూ నని గదా పేర్కొన్నాము. అవి అంటి పెట్టుకొని ఉండటం వల్లనే మనసు మొదలు శరీరం వరకూ దెబ్బతిన్నాయి. వాటిని నిర్విశేషంగా చూడగలిగితే సామాన్య జ్ఞానమనే వెలుగులో

Dr Kuna Dayananda Swamy ebooks


చీకటిలాగా లయమయి పోతాయవి. వాటి ఆసరా లేకపోతే మనః ప్రాణేంద్రియాలిక ఆత్మాకారంగానే దర్శనమిస్తాయి. కల్మషమనే గంధం కూడా ఉండదిక.

అంతేకాదు. అది లేకపోవటం ప్రతిలోమ సిద్ధి అయితే అనులోమంగా యోగి అత్యంతం సుఖమశ్నుతే - అంతం లేని అనంతమైన బ్రహ్మానందాన్నే అనుభవించ గలడు. ఏమిటది. ఎలాగ. బ్రహ్మ సంస్పర్శమ్. బ్రహ్మంతోనే స్పర్శ ఏర్పడుతుంది వాడి బుద్ధికి. అపరోక్షంగానే బ్రహ్మం వాడి బుద్ధికి సోకుతుంది. సాక్షాత్కరిస్తుంది. అది కూడా సుఖేన - దాని పాటికది అనాయాసంగా. అంతవరకూ దానికోసం ఎంతో దీక్షతో సాధన చేసి ఉన్నాడు. ఆ సాధనకు ఫలిత మేర్పడేటప్పు డవ లీలగా అతి సుఖంగా ఏర్పడుతుంది. ఏర్పడిందో అప్పుడు యోగి మనస్సు మనస్సే గాదు. అది ఆత్మ లేదా బ్రహ్మం. వాడికి కలిగే సుఖం కూడా సాతిశయం **Relative** కాదు. నిరతిశయం.

**సర్వభూత స్థ మాత్మానం - సర్వభూతాని చాత్మని**

**వీక్షతే యోగ యుక్తాత్మా - సర్వత్ర సమదర్శనః - 29**

అయితే నిరతి శయమైన ఆ బ్రహ్మానందాన్ని అతడెలా అనుభవిస్తాడు. అలా అనుభవించేటప్పు డతనికీ లోకమేమయి పోతుంది. ఇది వాడికి కనిపిస్తుందా లేదా. కనిపిస్తుందంటే అది ద్వైతం. కనిపించదంటే అది అనుభవ విరుద్ధం. ఎందుకంటే వాడికింకా ఉపాధి ఉంది. ఉపాధి ఉందంటే

Dr Kuna Dayananda Swamy ebooks



లోకంతో వ్యవహార ముండక తప్పదు. అలాంటప్పుడు బ్రహ్మ జ్ఞాని ముక్తుడెలా అయ్యాడు. ముక్తుడయి మరలా లోకంతో సంబంధమెలా పెట్టుకొంటాడని పెద్ద సందేహం. దానికిప్పు డిస్తున్నాడు సమాధానం వ్యాసభట్టారకుడు. వినండి. ఇది చాలా అద్భుతమైన శ్లోకం. అద్భుతమైన సమాధానం. అన్ని ప్రశ్నలకూ సమన్వయమిది.

సర్వభూతాలని ఒక మాట ఆత్మ అని మరొక మాట రెండు మాటలు వినిపిస్తున్నాయి మనకిక్కడ. ఇందులో సర్వభూతాలనేవి విశేషం. ఆత్మ అనేది సామాన్యం. అంటే ఏమిటర్థం. భూతాలంటే అవి చేతనాలు కావచ్చు అచేతనాలు కావచ్చు. మొత్తం సృష్టి అంతా భూతమనే మాటలో కలిసి వచ్చింది.

ఇప్పుడీ జడ చేతనాత్మకమైన భూతాలన్నీ విశేషాలని గదా చెప్పాము. విశేషాలంటే ఏమిటి. ఎక్కడికక్కడ తెగిపోతుంటాయివి. దేనిపాటికదే. ఇది అది గాదు. అది ఇది గాదు. వృక్షం పక్షి గాదు. పక్షి పశువు గాదు. పశువు మనిషి గాదు. అలాగే నది పర్వతం కాదు. పర్వతం పట్టణం కాదు. పృథివి జలం కాదు - జలం వాయువు కాదు. వాయువాకాశం కాదు. భూమి చంద్రుడు కాదు. చంద్రుడు సూర్యుడు కాదు. నీ ఇష్టం. ఏదైనా తీసుకొనిచూడు. అన్నీ దేనిపాటికదే. వ్యాపకమేదీ కాదు. వ్యాప్యమే ప్రతిదీ. పరిచ్ఛిన్నమే. అదే విశేషమంటే. అన్నిటినీ వ్యాపించే స్తోమత దేనికీ లేదు.

Dr Kuna Dayananda Swamy ebooks



పోతే అలా వ్యాపించే శక్తి ఉన్నదొక్కటే. అది ఆత్మ. వీటి లాగా విశేషం **Particular** కాదది సామాన్యం **Universal.** అంటే అర్థం. వీటిలో ప్రతి ఒక్కదానినీ సమానంగా వ్యాపించేదని అర్థం. వ్యాపించటమంటే వాటి వెలపలే గాదు. లోపల గూడా. లోపలే గాదు. స్వరూపం కూడా. వాటి ప్రతి అణువూ కూడా. అదీ స్వరూపమంటే. ఎలా వ్యాపించ గలదు. సచ్చిద్రూప మాత్మ అంటే. సత్తంటే ఉండటం. చిత్తంటే స్ఫురించటం. ఉందనే స్ఫురణే ఆత్మ. అది నిరాకారం. నిరాకారమైన ఆకాశంలాగా జడం గాదు. స్ఫురణ **Consciouness** కాబట్టి చేతనం. తానున్నట్టు తనకు తెలుస్తుంటుంది. అలాంటిది గనుకనే సర్వ వ్యాపకం. వ్యాపకమంటే చెప్పాము గదా లోపల వెలపలా మాత్రమే గాక స్వరూపం కూడానని.

అలాంటప్పుడిక భూతాలెక్కడ ఉన్నాయి. అందులోనే ఉండాలి మరెక్కడా గాదు. అది ఎక్కడ ఉండాలి. వాటిలోనే. తరంగంలో జలమూ. జలంలో తరంగమూ. అదే సర్వభూతస్థ మాత్మానం - సర్వభూతాని చాత్మని అనే మాటల కర్థం. సర్వ పదార్థాలలో ఆత్మే. ఆత్మలోనే పదార్థాలు. అప్పుడే మయింది. ఆత్మే ఆధారం. ఆత్మే ఆధేయ మయింది **Both Container and contained.** అదే ఆధారమదే ఆధేయమయి నప్పుడదే ఉంది మరేదీ లేదని అర్థం. జలమే తరంగాని కాధారమయి తరంగంలో కూడా ఆధేయంగా జలముందంటే ఏమిటర్థం. జలమే ఉంది గాని తరంగాదులు లేవని గదా. అలాగే ఆత్మే ఉందిగాని అనాత్మ ప్రపంచం దానికి భిన్నంగా లేదని చెప్పినట్టయింది.

Dr Kuna Dayananda Swamy ebooks



లేకుంటే సరే ప్రశ్న లేదు. కాని మీరెంత లేదని సిద్ధాంతం చేసినా అనుభవంలో ఈ దేహేంద్రియాదులూ - బాహ్యంగా ఈ వస్తువాహనాదులూ కనిపిస్తున్నాయి గదా - కనిపిస్తున్న నేరానికి వాటితో అనుక్షణమూ సంవ్యవహారం Transaction తప్పటం లేదుగదా. మరి బ్రహ్మజ్ఞాని అయిన వాడెలా వ్యవహరిస్తాడనే ప్రశ్నకు జవాబేమిటి అని మరలా మొదటికే వచ్చాము. దానికి జవాబొక్కటే. కనిపిస్తున్నా అది ఆ భాస. ఆత్మే అనాత్మ రూపంగా భాసిస్తున్నది. కనుక దాని విభూతే ఈ మొత్తం. అంటే ఆత్మే ఆత్మగా ఉంటూ అనాత్మగా కూడా గోచరిస్తున్నది. ఇదుగో ఈ దృష్టి సడలకుండా ప్రపంచంతో వ్యవహరిస్తుంటాడు జ్ఞాని. అలా వ్యవహరిస్తున్నప్పు డెక్కడి కక్కడ ఆత్మ దృష్టిలో అనాత్మ అనాత్మగా గాక ఆత్మగానే దర్శన మిస్తుంటుంది వాడికి. అదీ వాడి అనుభవం. లోకానుభవాని కిది విలక్షణం. లోకులకూ మిగతా శాస్త్రజ్ఞులకూ ఎవరికీ కూడా ఆత్మ దృష్టి లేదు. ఆత్మ అంటే కర్తా భోక్తాగా కనిపిస్తుంటుంది వారికి. కేవల సాక్షి రూపమైన ప్రత్యగాత్మ వారి కనుభవం లేదు. అంచేత అనాత్మ నాత్మగా చూడలేరు. రెంటికీ తేడా కనిపిస్తుంటుంది వారికి. ఇక్కడ జ్ఞాని దృష్టి అలా కాదు. కేవల సచ్చిద్రూపమది. సచ్చిత్తులు తనలోనే గాక తాను చూచే ప్రతి పదార్థంలోనూ ఉన్నాయి. అందుకే వాటిని సామాన్యమన్నారు. ఈ సామాన్యాన్ని పట్టుకొన్నాడు జ్ఞాని. కనుక తన్నూ సచ్చిదాత్మకంగానే చూస్తాడు. తాను చూచే ప్రపంచమూ తద్రూపంగానే చూస్తాడు. ఆత్మా నాత్మలకు సరిహద్దు రేఖ చెరిగిపోయి రెండూ ఏకంగా కనిపిస్తాయి వాడికి.

Dr Kuna Dayananda Swamy ebooks


అయినా ఆ భాసగా కనిపిస్తుంది కాబట్టి వాస్తవమని గాక ఆభాస అనే చూపుపెట్టుకొనే వ్యవహరిస్తుంటాడు. ఇటు దేహేంద్రియాదులతో గాని అటు భార్యాపుత్ర మిత్ర గృహరామక్షేత్రాదులతో గాని. మనమిప్పుడొక అద్దంలో మన ముఖం చూస్తున్నా మనుకోండి. ఆ ప్రతి ముఖం చూస్తున్నా అది మన ముఖమే అంతకన్నా వేరే ఏమీ లేదనే దృష్టి వదలకుండానే చూస్తామా లేదా. అలాగే తన ఆత్మ చైతన్యచ్ఛాయే ఈ ప్రపంచమనే భావం తోనే వ్యవహరిస్తుంటాడు జ్ఞాని. భావ మద్వైతం. బాహ్య వ్యవహారం ద్వైతం. భావమే బింబం. బాహ్యం దాని ప్రతిబింబం. అదే ఇలా భాసిస్తున్నదని వ్యవహరిస్తున్నప్పు డిక ఇబ్బంది ఏముంది. సామాన్య విశేషాలు రెండూ తగాదా పడవెప్పుడూ కలిసే బతుకుతుంటాయి. జల తరంగాల లాగా. అలాగే దృగ్దృశ్యాలు రెండూ ఎప్పుడూ పేచీ పడవు. మీదు మిక్కిలవి ఒకేవిధంగా భావిస్తాడు జ్ఞాని.

కనుకనే అంటున్నది గీత. వీక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః - లోపలా వెలపలా అనే తేడా లేకుండా సర్వత్రా సమమైన తత్త్వాన్నే చూస్తుంటాడట యోగి. అందులో సర్వభూతాలలో ఆత్మను చూడటం వల్ల విక్షేప దోషానికి జవాబివ్వగలడు. సర్వభూతాలనూ మరలా ఆత్మలో చూడటం మూలంగా ఆవరణ దోషాని కివ్వగలడు. దృష్టిని మరచి దృశ్యంతో మాత్రమే సంబంధం పెట్టుకొంటే అది విక్షేపం. దృశ్యాన్ని మరచి కేవలం దృక్కును పట్టుకొంటే అది ఆవరణం. ఈ రెండే అవస్థాత్రయం. అందులో ఇదీ ఇందులో అదీ అనటం మూలాన

Dr Kuna Dayananda Swamy ebooks



దోషాలకూ తద్వారా అవస్థాత్రయానికీ పరిష్కార మేర్పడింది. అంటే జ్ఞాని నిత్యమూ తన పాటికి తానున్నా ప్రపంచంతో వ్యవహరిస్తున్నా సమాధిలోనే ఉంటాడనే సత్యం తెలిసి పోతున్నది. అయితే యోగ యుక్తుడయి ఉండాలి. అదీ షరతు. జ్ఞానయోగంతో యుక్తమయి ఉండాలి వాడి మనస్సు. ఇది ఇంతకు పూర్వం సాంఖ్యయోగంలో చెప్పుకొన్న విద్యా వినయ సంపన్నే అనే శ్లోకానికి ప్రతిరూప మీ శ్లోకం. అదీ సమదర్శనమే చెప్పిందిదీ సమదర్శనమే చెబుతున్నది. విషమంలో సమాన్ని చూస్తే విషమమే కనిపించదు. చూపూ సమమే. చూచే ప్రపంచమూ సమమే. వ్యవహారం సాగుతున్నా ఎక్కడికక్కడ అది సమదర్శనంలో సమంగానే మారి కనిపిస్తుంది జ్ఞాన యుక్తుడైన యోగికి. వైషమ్యం మనసుకు రాదు.

**యో మాం పశ్యతి సర్వత్ర - సర్వంచ మయి పశ్యతి**

**తస్యాహం న ప్రణశ్యామి - సచమే న ప్రణశ్యతి - 30**

ఇలాంటి ఏకాత్మ భావ మనుభవానికి వచ్చిన జ్ఞానికి కలిగే మహాఫల మేమిటో ఇప్పుడు వర్ణిస్తున్నది గీత. ముందు వచ్చిన శ్లోకానికిది సహోదరుడు. అక్కడ ఆత్మ అంటే ఇక్కడ మామ్మనే మాట ప్రయోగిస్తున్నాడు మహర్షి. అహమ్మనే సర్వ నామానికి ద్వితీయా విభక్తి ఏకవచన రూపం మాం. నన్ను అని అర్థం. నన్నంటే ఎవరా నన్ను. కృష్ణ పరమాత్మే బోధిస్తున్నాడు కాబట్టి పరమాత్మను అని చెప్పినా చెప్పవచ్చు. లేదా ఎవడికి వాడు నన్ను అనుకొంటాడు కాబట్టి ప్రత్యగాత్మను అని చెప్పినా చెప్పవచ్చు అర్థం. ఏదైనా ఒకటే సర్వవ్యాపకమూ నిరాకారమూ అయిన చైతన్యం.

Dr Kuna Dayananda Swamy ebooks


యోమాం పశ్యతి సర్వత్ర - దానినే సర్వత్రా చూడాలి ఎటు వచ్చీ. అలాగే సర్వంచ మయి పశ్యతి - తన్ను సర్వత్రా చూడటమే గాక సర్వాన్నీ మరలా తనలో చూచుకోవాలి. సర్వభూతస్థమనే వెనుకటి శ్లోక భావంలాగే నడుస్తున్నదీ శ్లోక భావం కూడా. అంతే కాదు. ఇవి రెండూ కూడా ఈశావాస్య మంత్ర వర్ణంలాగే నడుస్తున్నాయి. యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి - సర్వభూతేషు చాత్మానం - తతోన విజుగుప్సతే అని ఈశావాస్య శ్లోకం. ఆ భావమే ఇవి రెండూ అనువదిస్తున్నాయా అని తోస్తుంది. ఉపనిషత్సారమే గదా భగవద్గీత. అందులో ఆశ్చర్యమేముంది.

ఎప్పుడైతే తనలో సమస్తమూ సమస్త ప్రపంచంలో తన్నూ చూడగలుగుతాడో అప్పుడిక ప్రత్యగాత్మే పరమాత్మ. పరమాత్మే ప్రత్యగాత్మ. ఇరువురికీ తేడా లేదు. తస్యాహం న ప్రణశ్యామి. సచమే న ప్రణశ్యతి. వాడికి నేనెప్పుడూ తప్పిపోను. నాకు వాడెప్పుడూ తప్పిపోడు. నా చూపులోనే ఉంటాడు వాడు వాడి చూపులోనే ఉంటాను నేను. ఇద్దరమూ ఒకే ఒక ఆత్మ స్వరూపులం. ప్రత్యక్పరమ అనే హద్దులు చెరిగిపోయి అంతా ఏకైకమైన ఆత్మగా మిలిగిపోతుంది. అదే జ్ఞానికి కలిగే మహాఫలం మహాసిద్ధి. ఇక్కడ ప్రణశ్యతి అంటే నశించటం కాదు. తప్పిపోవటం పరోక్షమయి పోవటం **Absent missing** అని అర్థం వ్రాశారు భగవత్పాదులు. అంటే అపరోక్షంగా **Direct** పరమాత్మ తాలూకు అనుభవమే పొందగలడని భావం. అంతకన్నా మానవుడాసించే జీవిత గమ్యమే మున్నది. ఫలమే మున్నది.

Dr Kuna Dayananda Swamy ebooks



సర్వమూ సిద్ధించి నట్టే ఫలించినట్టే. సకల దుఃఖ నివృత్తి - సర్వసుఖప్రాప్తి అన్నారు దాన్ని వేదాంతులు. అదే బ్రహ్మాత్మ భావం. ప్రత్యక్పర అనే తేడా లేకుండా రెండూ ఏకైకమైన ఆత్మ స్వరూపంగా అనుభవానికి రావటం. అదే మోక్షమనే అపవర్గం.

**సర్వభూత స్థితం యో మాం - భజత్యేకత్వ మాస్థితః**

**సర్వధా వర్తమానోపి - స యోగీ మయి వర్తతే - 31**

అద్వైతాత్మ భావం స్వానుభవానికి రావటమే మోక్షమని వర్ణించాము గదా. అది ఎలా ఉంటుంది దాని స్వరూపం. దైనందిన వ్యవహారంలో జ్ఞాని అయిన వాడెలా కనిపిస్తాడు. జీవన్ముక్తుడు గదా వాడు. లోకంతో వ్యవహరిస్తూనే వాడు ముక్తుడని ఎలా అనిపించుకొంటాడని ప్రశ్న. దానికి సమాధానమిస్తున్నాడు వేదవ్యాసుడు.

వాడి స్వానుభవమెలా ఉంటుందని అడిగావా భజత్యేకత్వ మాస్థితః - ఏకత్వమే చూస్తుంటాడెప్పుడూ. ఎక్కడ ఉందా ఏకైకమైన తత్త్వం. మాం. అహంతా రూపంగా **Subjective** ఉందది. నేను నేననే స్ఫురణ సర్వత్రా వ్యాపించి ఉంది. సర్వత్రా అంటే ఎక్కడని. సర్వభూత స్థితం. సమస్త పదార్థాలలో సత్తా రూపంగా **Existance** వ్యాపించి ఉంది. చరాచర పదార్థాలు ప్రతి ఒక్కటీ లోకంలో అయం ఘటోస్తి అయం పటోస్తి - అయం వృక్షోస్తి - అయం మృగోస్తి - అయం మనుష్యోస్తి - అని ఉంది ఉందనే స్ఫురిస్తుంటుంది నీకు. అలా స్ఫురించేటప్పుడు నాకు స్ఫురిస్తుందనే

Dr Kuna Dayananda Swamy ebooks



చూస్తుంటావు. నీతో ముడిపెట్టుకొనే వాటి అస్తిత్వాన్ని చూస్తావుగాని నేననే భావం లేకుండా దేని అస్తిత్వాన్నీ నీవు గుర్తించటం లేదు. ఆ నేనే చిత్. ఆనా అస్తిత్వమే సత్. మాం భజతి అంటే అదే అర్థం.

అలా సర్వత్రా సత్తా స్ఫూర్తులనే పట్టుకొని కూచున్నప్పు డదే మోక్షావస్థ. వాడి కన్యంగా ఏ భావమూ లేదుగా. ఇది మోక్షంగాక మరేమిటి. బంధం లేకపోవటమే మోక్షం. అన్యమే బంధిస్తుంది నిన్ను. అన్యమనే భావమే లేకుంటే అది ఇక మోక్షమే. అంచేత జీవన్ముక్తుడైన యోగి సర్వథా వర్తమానోపి. జీవితంలో ఎలాగైనా నడచుకోనివ్వండి. పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ అని ఇంతకు పూర్వమే వచ్చిందీ విషయం. వాడే పని చేస్తున్నా - ఎలా ప్రవర్తిస్తున్నా సరే. ఏదో చేయటం లేదు. ఎలాగో ప్రవర్తించటం లేదు. వాడెక్కడో లేడు. వాడి శరీరంలో లేడు. వాడి గృహంలో లేడు. జన మధ్యంలో లేడు. జనాలతో వస్తు వాహనాలతో వ్యవహరించటమూ లేదు జ్ఞాని. మరెక్కడున్నాడు. సయోగీమయి వర్తతే. నాతోనే ఉన్నాడు. నాతోనే వ్యవహరిస్తున్నాడు. నాతో అంటే పరమాత్మతోనా కావచ్చు. పరమాత్మతోనైనా కావచ్చు. తన ఆత్మతోనైనా కావచ్చు. ఇన్ని ఆత్మలెక్కడ ఉన్నాయి. పరమాత్మ ఆత్మ తన ఆత్మే యోగికి. తన ఆత్మ పరమాత్మే. తేడా లేదు. అదే అనాత్మ ప్రపంచం కూడా వాడి దృష్టికి. ఆత్మా నాత్మలు రెండూ ఆత్మే. ముఖమూ ప్రతి ముఖమూ రెండూ ముఖమే వాటి స్వరూపం తెలిసిన వాడికి. తెలియని వాడికే ఇది నా ముఖం అది అద్దంలో

Dr Kuna Dayananda Swamy ebooks



కనిపించే ప్రతి ముఖమనే ద్వైత దృష్టి. తెలిసినవాడి కంతా ముఖమే. అలాగే సచ్చిద్రూపమైన ఆత్మా తదా భాస అయిన అనాత్మ - రెండూ కలిసి ఆత్మే జ్ఞానికి.

కనుక జ్ఞాని తన దేహంలో ఉన్నా - దేహానికి బాహ్యంగా ప్రపంచంలో ఉన్నా - అంతా తన ఆత్మే తన స్వరూపమే. ఆఖరుకు సుఖదుఃఖాదికమైన ఏ దశలో ఉన్నా అదంతా ఆత్మే. వస్తు భేదం లేదు. దశా భేదం లేదు. అసలు భేదమే లేదు. ఇతరులకు భేదంగా కనిపించేదంతా వాడి కభేదమే. కనుక ఎక్కడ ఎప్పుడే దశలో ఉన్నా ఎలా నడుచుకొన్నా పరవాలేదు. ఆత్మలోనే ఉంటాడు. ఆత్మలోనే వర్తిస్తుంటాడు. ఇదీ జీవన్ముక్తుడి వ్యవహారం. వాడిలా అభేద దృష్టితో ఉంటే మిగతా లోకులంతా భేద దృష్టితో వ్యవహరిస్తొంటారు కాబట్టి వాడి స్వరూపం వీరి కంతు పట్టదు. పైకి వాడూ తమలాగే ఆయా పనులు చేస్తున్నట్టు కనిపిస్తుంటుంది. పైకి ఇద్దరి జీవితమూ ఒకేలా ఉన్నట్టు భాసిస్తున్నా - లోపల వాడి అనుభవం వేరు. వీరి అనుభవం వేరు. అది పైకి కనిపించేది కాదు గదా.

**ఆత్మౌపమ్యేన సర్వత్ర - సమం పశ్యతి యో ర్జున**

**సుఖం వాయ దివా దుఃఖం - సయోగీ పరమో మతః - 32**

వ్యవహార మన్నందు కొక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి మనం. జ్ఞాని వ్యవహారం వేరు. జ్ఞానం లేని లోకుల వ్యవహారం వేరు. జ్ఞాని వ్యవహారం లోకోత్తరమైతే అజ్ఞానులైన లోకులది లౌకికమైనది.

Dr Kuna Dayananda Swamy ebooks



లౌకికమైనది విషమంగా అన్యోన్య విరుద్ధంగా ఉంటుంది. అలౌకికమైన దలా విషమంగా ఉండదు. అది సమం. విరుద్ధంగా ఉండదది అవిరుద్ధం. దేనితో ఎవరితో పేచీ పడదు. కారణం వాడు పట్టుకొన్నదీ నిత్యమూ అనుభవిస్తున్నదీ పరమాత్మ తత్త్వం. అది సర్వత్రా సమంగా పరచుకొని ఉన్న తత్త్వం. సర్వ పదార్థాలకూ స్వరూపమది. కనుక దేనికీ విరుద్ధం కాదు. అవిరుద్ధం. అలాంటివాడే జ్ఞాని గనుక లోకంతో వ్యవహరించేటప్పుడు వాడి దృష్టి కెలాటి వైషమ్యంగాని పక్షపాతం గాని ఉండరాదు. అలా ఉండకుంటేనే వాడు జ్ఞాని.

మరి ఎలా ఉంటుంది వాడి దృష్టి ఎలా వ్యవహరిస్తాడు లోకులతో నని ప్రశ్న వస్తే చెబుతున్నాడు మహర్షి. సర్వత్ర సమం పశ్యతి. సర్వత్ర సమమైన తత్త్వాన్నే దర్శిస్తుంటాడు. ఎలా దర్శిస్తాడు దాన్నైనా. ఆత్మౌపమ్యేన. తనతో పోల్చుకొని చూస్తాడు. ఏమిటా పోల్చుకొనే విషయం. సుఖం వాయ ది వా దుఃఖం - సుఖం గాని దుఃఖంగాని. ఒక్క సుఖదుఃఖాలనే గాదు. ఏ ద్వంద్వాలైనా ఎప్పుడెక్కడ ఏ ప్రాణి ఏది అనుభవిస్తున్నా అది తానే అనుభవిస్తున్నట్టు భావిస్తాడు. తనకే ఆ సుఖదుఃఖాను భవ మేర్పడితే ఎలా ఉంటుందో అలాగే గదా వాటికి కూడా నని సానుభూతి చూపుతాడు. వ్రాస్తున్నాడు చూడండి భగవత్పాదులు.

యధా మమ సుఖ మిష్టం తథా సర్వ ప్రాణినాం సుఖమను కూలం - యచ్చ దుఃఖం మమ ప్రతికూలం అనిష్టం యధా తథా

Dr Kuna Dayananda Swamy ebooks



సర్వప్రాణినాం దుఃఖమనిష్టం - ప్రతికూలం ఇత్యేవ మాత్మోపమ్యేన సుఖదుః ఖే అనుకూల ప్రతికూలే తుల్యతయా సర్వభూతేషు సమం పశ్యతి. నకస్యచి త్ప్రతికూల మాచరతి - సుఖదుఃఖాదులైన ద్వంద్వాలు నాకెలా అనుకూల ప్రతికూలాలో ఇష్టానిష్టాలో అలాగే గదా ప్రపంచంలో సకల ప్రాణులకూ నని భావించి దేనినీ బాధించడు. అన్నింటినీ సానుభూతిగా చూస్తుంటాడు. తనతో పోల్చుకోటమంటే ఇదే. అలా పోల్చుకొన్నప్పుడే సానుభూతి కలుగుతుంది.

ఏ బుద్ధుడి జీవితమో గుర్తు వస్తున్నది మనకిక్కడ. అయితే అది ధర్మమూ నీతి అనే స్థాయి వరకే చూచి చెప్పవలసిన మాట. భగవద్గీత అంతవరకే గాదిక్కడ చెబుతున్న విషయం. అంతవరకే అయితే ధర్మపురుషార్థం.అది కూడా దాటి మోక్ష పురుషార్థంగదా ఇప్పుడు బోధిస్తున్నది. సయోగీ పరమో మతః అంటున్నది వినండి గీత. జీవన్ముక్తుడైన జ్ఞాని జీవితమిది. అదే పరమం. ధర్మం కంటే ఉత్కృష్టమైనది. అయితే ధర్మాన్ని అతిక్రమించి పోవచ్చునా అని ఆశంక కలగవచ్చు. అది మరలా పొరబాటు. ధర్మాన్ని వదిలేస్తాడని గాదు అర్థం. జ్ఞాని సర్వత్రా ఆత్మనే చూస్తున్నప్పుడు ధర్మమెలా వదిలేస్తాడు. ధర్మ విరుద్ధంగా ఎలా ప్రవర్తిస్తాడు. జ్ఞానికి లోకం మీద ఎంతైనా సానుభూతీ దయాదాక్షిణ్యాలూ ఉంటాయి. ఉండి తీరుతాయి. అలా ఉండటమే గాక అది కూడా దాటి సర్వమూ ఆత్మాకారంగా దర్శించే జ్ఞానముంది వాడికి. కేవల ధార్మికుడికీ నైతికుడికీ

Dr Kuna Dayananda Swamy ebooks


**Moralist** అలాటి దృష్టి లేదు. సాత్త్వికమైన స్వభావమే ఉంది వాడికి. అంచేత భూత దయాది దైవ గుణాల వరకే పరిమితం వాడి జీవితం. అదీ గొప్పే కాదన లేదు. కాని అంతకన్నా పయి స్థాయి కెదిగి చూడలేదా దృష్టి. కారణం. ఏకాత్మ జ్ఞానం లేదు వాడికి. అందుకే జ్ఞాని నీతిగా ప్రవర్తించగలడే గాని నీతిపరుడు జ్ఞాని అనిపించుకోలేడు. అనిపించుకోగలిగితే వీడూ జ్ఞానిలాగా మహనీయుడే. జ్ఞాని బొంబాయి వరకూ ప్రయాణం చేస్తే ధార్మికుడు పూనా వరకే ఆగిపోయాడు. కారణం గుణ సంపర్కముంది ఇంకావాడికి. అది రజస్తమస్సులు కాకపోవచ్చు. సత్త్వమనే గుణముంది. గుణమేదైనా అది బంధకమే. మోచకం కాదు.

ప్రస్తుత మీ శ్లోకంలో ధార్మికుడి ధార్మిక జీవితమూ తొంగి చూస్తున్నది. జ్ఞాని జ్ఞాన జీవితమూ దర్శన మిస్తున్నది. అది ఎలాగంటే ఆత్మౌపమ్యేన – సర్వత్రా ఆత్మ తప్ప అనాత్మ లేదు కాబట్టి దానినే ప్రమాణంగా తీసుకొని సర్వత్ర సమం పశ్యతి – ఎక్కడ చూచినా సమమైన బ్రహ్మ తత్త్వాన్నే చూస్తాడు జ్ఞాని. అలా చూస్తున్నాడంటే సుఖంవా యది వా దుఃఖం – సుఖమైనా బ్రహ్మమే. దుఃఖమైనా అది బ్రహ్మమే. తేడా రాదు. తేడా వస్తే అది సమంగాదా దర్శనం. విషమం. కాబట్టి జ్ఞాని అయిన వాడెప్పుడూ అలా సుఖదుఃఖాది ద్వంద్వాత్మకంగా చూడడీ సృష్టిని. సర్వమూ ఆత్మాకారంగా ఏకాకారంగానే చూస్తూ ఉంటాడు. అలా ఉంటేనే వాడు జ్ఞాని – పరమోమతః – అందరి కన్నా – అంటే లోకులకన్నా నీతిపరులూ – ధార్మికులైన వారికన్నా పరముడూ అతీతుడూ అనిపించుకొంటాడని ధర్మపరంగా గాక జ్ఞానపరంగా చెబితే ఈ శ్లోకానికిదీ అర్థం.

Dr Kuna Dayananda Swamy ebooks


**యోఽయం యోగ స్త్వయా ప్రోక్తః - సామ్యేన మధుసూదన**

**ఏత స్యాహం న పశ్యామి - చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ - 33**

ఇంతవరకూ జరిగిపోయిన భాగమొక ఎత్తు. ఇక మీదట ఈ అధ్యాయంలో జరగబోయే భాగమొక ఎత్తు. ఇంత వరకూ జరిగింది మోక్ష పురుషార్థ వర్ణన అయితే ఇక మీదట రాబోయేది ధర్మ పురుషార్థం. సర్వమూ ఆత్మేననే జ్ఞానం వల్లనే మోక్షం. అది మొదట కర్మయోగం వల్లా తరువాత ధ్యానయోగం వల్లా పరిపాకానికి వస్తే అలాటి జ్ఞానమే మోక్షాన్ని మనకు ప్రసాదిస్తుంది. అలాటి జ్ఞాని ఎవడో వాడి అనుభవమెలా ఉంటుందో అదీ ఇంతదాకా మనకు వర్ణించి చెప్పింది గీత. అదే యోగమని కూడా పేర్కొన్నది. యోగమంటే జ్ఞానయోగం. అది కర్మ ధ్యానయోగాభ్యాసం మూలంగా బలం పుంజుకొన్న యోగం. అప్పుడు వాణ్ణి జ్ఞాని అన్నా అనవచ్చు. యోగి అన్నా అనవచ్చు. లేదా జ్ఞానయోగి అనీ అనవచ్చు. వాడి వ్యవహారమింత దాకా వర్ణిస్తూ వచ్చింది గీత.

పోతే ఇప్పుడలాంటి యోగాన్ని ఇంకా అందుకోలేని వాడూ - అందుకోటమింకా పూర్తి కాకుండానే ప్రారబ్ధం తీరి కన్నుమూసిన వాడూ - ఇలాటి సాధకుల గతేమిటి అని ప్రశ్న వచ్చింది. దానికి సమాధాన మిస్తున్నాడిప్పుడు మహర్షి. ఇవ్వటంలో ఉన్నట్టుండి ధర్మ పురుషార్థాన్ని పట్టుకు వస్తాడాయన. జన్మలూ జన్మాంతరాలూ - లోకమూ లోకాంతరాలూ - ఆయా లోకాలలో వారికి గలిగే అనుభవాలూ - ఇవన్నీ

Dr Kuna Dayananda Swamy ebooks

ప్రస్తావనకు వస్తాయిక్కడ. అలా ప్రస్తావించాడంటే ఇవన్నీ వాస్తవంగా ఉన్నాయి. అవన్నీ వాస్తవంగానే కలుగుతాయని భ్రాంతి పడరాదు మరలా. వాస్తవంలో ఇవి ఏవీ లేవు. ఉన్నదొక్క ఆత్మ చైతన్యమే. దానికి భిన్నంగా అనాత్మ అంటూ ఏదీ లేదు. స్వర్గం లేదు. నరకం లేదు. జన్మలు లేవు. జన్మాంతరాలు లేవు. కాని వస్తుతంత్రంగా ఏవీ లేకపోయినా మానవుడలా భావించటం లేదు. బుద్ధి తంత్రంగా ఉన్నాయనే భావిస్తున్నాడు. కాబట్టి మానవుడి ద్వైత దృష్టిని బట్టి ఇవన్నీ చెప్పవలసి వచ్చింది మహర్షి. అసతోమా సద్గమయ అన్నట్టు ధర్మం ద్వారానే బ్రహ్మాన్ని పట్టుకోవాలి. ధర్మం సంకేతం. బ్రహ్మం సత్యం. సంకేత మెప్పుడూ తన పాటికి తాను సత్యం కాదు. సత్యాన్ని చూపటానికే ఉందది. అలాగే ఇప్పుడీ పుణ్యపాప కర్మలూ తత్ఫలితంగా లోకాంతరయానమూ జన్మాంతర ప్రాప్తీ - ఇవన్నీ వ్యాసభగవానుడు వర్ణిస్తున్నాడంటే ఈ ప్రయోజనం కోసమే. ఏ ప్రయోజనం. సర్వమూ ఆత్మేననే జ్ఞాన ముదయించటం కోసం. ఇది కాదు ఇక్కడి కాగి పోకండి. చివరకు మోక్షమే పురుషార్థమని మానవులకు గుర్తు చేయటం కోసం.

అంతేకాదు. సాధకావస్థలోనే మరణిస్తే ఎప్పుడీ సాధనకిక అవకాశం. సిద్ధి లేకుండా సాధన కర్థమేమిటి. అంచేత సాధన పూర్తి అయి సిద్ధి పొందాలంటే జన్మలుండి తీరాలి. ఒక జన్మతో సరిపోయే వ్యవహారం కాదు. అనేక జన్మ సంసిద్ధ స్తతో యాతి పరాంగతి మన్నట్టు సాధన

Dr Kuna Dayananda Swamy ebooks


ఫలించటాని కవకాశ ముండాలి. అయితే అప్పటికి జన్మాంతరా ల సత్యమని చెప్పటం దేనికి. వాస్తవమేనని చెప్పండి అని ప్రశ్నించవచ్చు. అజ్ఞానం వదలనంత వరకూ వాస్తవమే ననుకోండి. తప్పేమీ లేదంటాడు వ్యాసభగవానుడు. స్వప్నం లాంటిదిది. స్వప్నం చూస్తున్నంత వరకూ వాస్తవమే ఆదశ. అలాగే ఆత్మ జ్ఞానం లేక అనాత్మ ప్రపంచమనే స్వప్నావస్థలో ఉన్నంత వరకూ మానవుడికి లోకాంతరా లున్నాయి. జన్మాంతరా లున్నాయి. అన్నీ ఉన్నాయి. అయితే వ్యావహారికంగానే వాటి కస్తిత్వం. పారమార్థికంగా కాదు. స్వప్నంలో నుంచి మెళకువ వస్తే అంతవరకూ చూచిన స్వప్న ప్రపంచం హుళక్కి అయినట్టే సర్వమూ ఆత్మ స్వరూపమనే జ్ఞాన ముదయిస్తే చాలు. ఈ లోకాంతర జన్మాంతరాలనే వ్యవహారం కూడా ఆభాస అయిపోతుంది. అసత్యమైనా సత్యాన్ని పట్టుకొనే వరకూ స్వప్నంలాగా ఈ దీర్ఘకాల స్వప్నం కూడా మనకు సహాయ పడుతున్నది. కనుక అది దృష్టిలో పెట్టుకొనే దీనినింతగా వర్ణించటం వ్యాసమహర్షి. అంతేగాని దీనిమీద తాత్పర్యం లేదాయనకు. తాత్పర్యం **Intention or Aim** మహర్షికి పారమార్థికమైన మోక్ష పురుషార్థం మీదనే. ధర్మపురుషార్థం మీద కాదు. కేవలం దాని కుపకారకమిది అని చెప్పటమే ఆయన హృదయం. ఇదే మీరు భగవద్గీత 18 అధ్యాయాలలోనూ తెలుసుకోవలసిన పరమ రహస్యం. ఎక్కడికక్కడ వ్యావహారికం. ఎక్కడికక్కడ పారమార్థికం. ఒకటి సంకేతం. మరొకటి సత్యం. కలలో మరచి పోగూడదు గీత శ్రవణం చేసే ప్రతి సాధకుడూ. మరిస్తే గీతా తాత్పర్యమే వాడికి బోధపడలేదని అర్థం.

Dr Kuna Dayananda Swamy ebooks

సరే ఇప్పుడిక్కడ ప్రశ్న ఏమిటో చూద్దాం. అర్జునుడికీ బోధ అంతా విన్న తరువాత ఉన్నట్టుండి ఒక పెద్ద సందేహం వచ్చింది. ఏమిటది. యోయం యోగ స్త్వయా ప్రోక్తః సామ్యేన. సమదర్శనం. సమదర్శన మెక్కడ చూచినా జ్ఞానికి సమమైన బ్రహ్మమే కనిపిస్తుంటుందని జ్ఞానయోగాన్ని ఇంతగా ప్రశంసిస్తూ వచ్చారు మీరు. కాని ఇంత గొప్ప యోగం మాబోటి మానవులకు పట్టు పడుతుందా అని అనుమానం. ఏతస్యాహం నపశ్యామి స్థితిం స్థిరాం – ఇది మీరు మాకెంత బోధించినా మేము దానినెంత విన్నా వినటం వరకే గాని మనసులో బాగా హత్తుకొంటుందా స్థిరంగా నిలబడుతుందా అని నమ్మకం కలగటం లేదు నాకు. కారణమేమంటే మనసనేది మానవుడికి స్థిరంగా ఉండదు. చంచలత్వాత్. అతి చపలమైనది. పాదరసంలాగా చెదిరిపోతుంటుంది. నిలకడ లేదు. మరి మనసే గదా దేనికైనా సాధనం. ప్రపంచానుభవమైనా పరమాత్మాను భవమైనా కలగవలసింది దానికేగదా. అలాంటప్పుడింత చంచలమైన మనస్సుతో అచలమైన ఆత్మ తత్త్వాన్ని ఎలా పట్టుకోగలమని ప్రశ్న.

**చంచలం హి మనః కృష్ణ - ప్రమాథి బలవద్దృఢం**

**తస్యాహం నిగ్రహం మన్యే - వా యోరివ సుదుష్కరమ్ - 34**

ప్రయత్నిస్తే పట్టుకోవచ్చు గదా అనవచ్చు. ప్రయత్నమనేది సాధ్యమైతేనే చేయగలం గాని అసాధ్యమైన విషయంలో ఎవడూ చేయలేడు. ఏమిటా అసాధ్యమంటారా. చంచలం హి మనః – మర్కటం లాగా చపలమైనది

Dr Kuna Dayananda Swamy ebooks



మనస్సు. అంతే కాదు. ప్రమాధి బలవ ద్దృఢం. మధిస్తుంటుం దెప్పుడూ. పురుగులాగా లోలోపల తొలుస్తుంటుంది. శరీరాన్ని ఇంద్రియాలనూ తన ఇష్టానుసారంగా తిప్పుతూ పరవశం చేస్తుంటుంది. తాను తిరగటమే గాక వాటిని గూడా తిప్పుతుంది తనతోపాటు. బలిష్ఠం కూడా. ఏదీ దాన్ని బంధించలేదు. దుర్నివారం. దృఢమైనది కూడా. ఎంత దృఢమైనదంటే తంతు నాగవత్తన్నారు భాష్యకారులు. తంతు నాగమంటే **Shark** అని అర్థం వ్రాశాడు మోనియరు విలియమ్సు. ఒక సొర చేప – ఒక మొసలి మన కాలు పట్టుకొంటే ఎలా విడిపించుకోలేమో – కాలు అక్కడికి తెగిపోయి ఊడి వచ్చినా ఆశ్చర్యం లేదో అలాటి దృఢమైన స్వభావం దానికి.

ఇలాటి మనస్సు నదుపులో పెట్టుకోమంటారు మీరు. అది సాధ్యమా. తస్యాహం నిగ్రహం మన్యే. దాన్ని అరికట్టటం అదుపులో పెట్టటం ఎలాటిదంటే వాయోరివ సుదుష్కరం. గాలిని మూట గట్టటమెంత దుష్కరమో అంత దుష్కరం. గాలి నెవడు మూట గట్టగలడు. కడితే కట్టు పడుతుందా. కడుతుంటేనే పారిపోతుంది. జారిపోతుంది. అలాగే నాకే ఆలోచనా రాగూడదు. ఒక్క పరమాత్మ ఆలోచనే రావాలంటే వింటుందా మాట. ఒక ఆలోచన వదిలేశామను కొంటుండగానే మరో ఆలోచన రెడీగా ఉంటుందక్కడ. అన్ని ఆలోచనలూ అరికట్టటమంటే సముద్ర తరంగాల నాపి వేయటమే. ఇదీ అర్జునుడి భయం. మనకూ కూడా ఇదే భయం.

Dr Kuna Dayananda Swamy ebooks


**అసంశయం మహాబాహో - మనో దుర్నిగ్రహం చలం**

**అభ్యాసేన తు కౌంతేయ - వైరాగ్యేణ చ గృహ్యతే - 35**

భయ నివృత్తి చేస్తున్నాడిప్పుడు పరమాత్మ. జీవుడి కేర్పడే భయం పోగొట్ట వలసింది దేవుడే గదా. అభయ హస్తం వరద హస్తం. రెండే హస్తాలాయనకు. అభయం మోక్షానికీ వరదం భోగానికీ. భోగమోక్షాలు రెండూ ప్రసాదించవలసింది ఆయనగారేగదా. అప్పుడే మనకు ధైర్యం. ఉత్సాహం. అవి లేకుంటే ఏ మహా కార్యమూ సాధించలేడు మానవుడు. అన్నిటికన్నా మహత్తరమైన కార్యం మోక్ష పురుషార్థం. అది ఆత్మజ్ఞానాధీనం. అది మనోవృత్త్యధీనం. ఆ మనసే మనకిప్పు డ ధీనం కావటం లేదు. ఎలాగా అని మధనపడుతుంటే హామీ ఇస్తున్నాడు భగవానుడు. అసంశయం. నీవు అడగటంలో తప్పు లేదు. మనో దుర్ని గ్రహం చలం. నీవన్నట్టు మనసనేది అరికట్టట మసాధ్యమే. అది చంచల మనటంలో సందేహం లేదు.

కాని అసాధ్యమని చేతులు ముడుచుకొని కూచోరాదు. దానివల్ల నీవేదీ సాధించలేవు. ఎప్పటికీ సాధించలేవు. లోకంలో వన్నీ ఎలా మనసుతోనే అనుభవానికి తెచ్చుకొంటున్నావో పరమార్థం కూడా అలాగే తెచ్చుకోగలవు. అభ్యాసేన తు కౌంతేయ – వైరాగ్యేణ చ గృహ్యతే అభ్యాసం, వైరాగ్యం. ఇవి రెండే మార్గాలు మనసును నిగ్రహించటానికి. అందులో అభ్యాస మనులోమం. వైరాగ్యం ప్రతిలోమం. బస్సు ప్రయాణం గుర్తు

Dr Kuna Dayananda Swamy ebooks



చేసుకోవాలి మనమిక్కడ. హైదరాబాదు వైపు వెళ్లట మభ్యాసమైతే విజయవాడ దూరం కావటం వైరాగ్యం. ప్రయాణం ప్రయాణమే. అవి రెండు ప్రయాణాలు కావు. ఒక్కటే ప్రయాణం. ఫలితాలు రెండు. ఏమిటది. హైదరాబాదు దగ్గర పడటమొక ఫలితం. విజయవాడ దూరం కావట మొక ఫలితం. రెండూ కలిసి గమ్యం చేరటమే అసలైన ముఖ్య ఫలం.

నన్నడగితే అభ్యాస వైరాగ్యాలని రెండుచెప్పారే గాని ఒక్క అభ్యాసమే చాలు. అదే సాధన అసలు. వైరాగ్య మందులోనే కలిసి వస్తుంది. హైదరాబాదు వెళ్లుతుంటే విజయవాడ దూరంగాక ఏమవుతుంది. దూరం చేసుకోటానికి వేరే ప్రయత్నం చేయాలా. అక్కరలేదు గదా. అలాగే ఇక్కడా కర్మయోగం ద్వారా కొంత - ధ్యాన యోగం ద్వారా కొంత - ప్రయత్నం సాగిస్తూ పోతే అదే అభ్యాసం. జ్ఞానోదయాని కదే చాలు. అజ్ఞాన జన్యమైన అనాత్మ భావమిక అప్రయత్నంగానే దూరమయి పోతుంది సాధకుడి మనస్సుకు. మనస్సే బస్సిక్కడ. అది చేయవలసిన ప్రయాణ మాత్మ స్వరూప మందుకోటానికి. అనాత్మను దూరం చేస్తుకోటానికి గాదు. దాన్ని అందుకొంటూ పోతే ఇది దూరం కాక ఏమవుతుంది. అంతే కాదు. ఆత్మను పట్టుకోకుండా అనాత్మ ఎలా దూరమవుతుంది. ఆ కొమ్మ పట్టుకోకుండా ఈ కొమ్మనెలా వదిలేస్తావు. కిందబడే ప్రమాదముంది. అలాగే వైరాగ్యమదే పనిగా అవలంబించాలని కాషాయాలు కట్టుకొని పరుగెత్తనక్కర లేదు. అంతగా అయితే మరీ ప్రపంచ వ్యవహారాలలో తలదూర్చకుండా కొంతకు

Dr Kuna Dayananda Swamy ebooks



కొంత వైరాగ్యం పాటిస్తూ తద్వారా మిగిలిపోయిన కాలం వృధా చేయక ఆత్మాభ్యాసం సాగించటం మంచిది. అదే మహర్షి హృదయమని నా భావన.

ఇంకొక సూక్ష్మమేమంటే అభ్యాసం ఆవరణ దోషానికీ వైరాగ్యం విక్షేప దోషానికీ జవాబు చెబుతాయనే దృష్టితో పేర్కొన్నారు రెండింటినీ. దీని కుపోద్బలకంగా భగవత్పాదులు కూడా ఈ భావమే బయట పెడుతున్నారు భాష్యంలో. అభ్యాసో నామ సమాన ప్రత్యయా వృత్తి శ్చిత్తస్య. ఆత్మకు సజాతీయమైన భావన చేస్తూ పోవట మభ్యాసమట. అలాగే వైరాగ్యేణ గృహ్యాతే విక్షేపరూపః ప్రచార శ్చిత్తస్య. విక్షేపాన్ని మనసుకు రాకుండా చేయటమే వైరాగ్యమట. ఈ రెండు మార్గాలలో కృషి చేస్తే మనసును నిరోధించే మహత్తరమైన బలమేర్పడుతుంది సాధకుడికి. సందేహం లేదని హామీ ఇస్తున్నాడు పరమాత్మ.

**అసంయతా త్మనా యోగో - దుష్ప్రాప ఇతి మే మతిః**

**వశ్యాత్మనా తు యతతా - శక్యోవాప్తు ముపాయతః - 36**

మొత్తానికి ప్రయత్నమనేది ఆవశ్యకం. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నారు. ప్రయత్నం చేయకుండా ఏ ఫలితమూ దానిపాటికది వచ్చి ఒళ్లో బడదు. నహి సుప్తస్య సింహస్య - ప్రవిశంతి మృగా ముఖమ్ - అని నీతి శాస్త్రం బోధిస్తున్నది. నిద్రించే సింహం నోట్లో మృగాలు తమంత తాము వచ్చి ప్రవేశించవట. అలాగే అసంయతాత్మనా - అభ్యాస వైరాగ్యాలతో మనస్సును వశం చేసుకోకపోతే యోగో దుష్ప్రాపః -

Dr Kuna Dayananda Swamy ebooks



యోగమనేది ఎప్పటికీ ప్రాప్తించదు. అది అసంభవమని మేమతిః - నా అభిప్రాయమంటాడు భగవానుడు. ఒక సంగీతమూ సాహిత్యమే నిరంతర సాధన లేకుండా నీకు పట్టు పడదు. భౌతికమైన విద్యలే నీకు సాధ్యం కావంటే ఇక అభౌతికమైన అధ్యాత్మ విద్య చెప్పేదేముంది. అది అన్నిటికన్నా దుర్లభం.

మరి ఎలా సులభమంటారు. వశ్యాత్మనాతు యతతా - ముందు చెప్పిన అభ్యాసాదులతో అంతకంతకు మనసు నీకు స్వాధీనమైతే మాత్రం శక్యో వాప్తు ముపాయతః - ఉపాయంతో పట్టుకోవచ్చు దాన్ని. దేన్ని. బ్రహ్మ జ్ఞానాన్ని. ఏదైనా మనస్సుకే. మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః అని పిచ్చి వాళ్లయి చెప్పారా. బంధంలో పడగొట్టిందీ మనసే. మళ్లీ పైకి లేపేదీ మనస్సే. రెండు శక్తులూ ఉన్నాయి దానికి. అందులో ఒక వైపే చూచామా నాణానికి మనమింత వరకూ. రెండో వైపు చూడక మరచి పోయాము. అదే అజ్ఞానం. దానికి తోడు ప్రయత్నం కూడా లేకపోతే ఏమవుతుంది. ఇక ఎప్పటికీ మన గతి ఇంతే. లేచే అవకాశమున్నా అది గుర్తించబోము. లేవలేము. అవకాశమేదో గాదు. మనసు నలాగే వదిలేయకుండా ఆ భావ ప్రవాహాన్ని మరలా ఆత్మాభిముఖంగా తిప్పటమే ప్రయత్నం. జల ప్రవాహం లాంటిది వృత్తి ప్రవాహం. ఎటు మళ్లిస్తే అటు వెళ్లి పోతుంది. పంట కాలువలు తీర్చి పొలాలకు నదీ జలాన్ని మళ్లించి నట్టు భావనదీ ప్రవాహాన్ని కూడా ఆత్మ వైపు మళ్లిస్తే జ్ఞానమనే పంట పండుతుంది. మోక్షమనే ధాన్యం చేతికి వస్తుంది. మానవ జీవితం

Dr Kuna Dayananda Swamy ebooks



సఫలమవుతుంది. ఇంతకూ మనస్సంయమాన్ని బట్టి ఉంటుంది మానవ జీవితానికి విజయం. మరి దేన్ని బట్టీ గాదు.

**అయతిః శ్రద్ధయో పేతో - యోగా చ్చలిత మానసః**

**అప్రాప్య యోగ సంసిద్ధిం - కాం గతిం కృష్ణ గచ్ఛతి - 37**

అయితే ఇప్పుడొక ప్రశ్న వచ్చింది. అది భాష్యకారులే బయటపెడుతున్నారు. అర్జునుడు కేవలం నిమిత్తమాత్రుడే. అతడు వేస్తున్నాడని గాదీ ప్రశ్న. మనందరికీ కలిగేదే ఇది. అందుకే భాష్యకారులందరి తరఫునా వకాలతు పుచ్చుకొని తనకు తానే ప్రశ్నించుకొంటున్నారు. అదేమిటంటే యోగాభ్యాసంలో పడిపోయి ఇహలోక పరలోక ప్రాప్తికి నిమిత్తమైన కర్మలన్నీ సన్న్యసించాడు యోగి. యోగసిద్ధికి ఫలమైన మోక్షమూ సమ్యగ్దర్శన మింకా పట్టుపడలేదు కాబట్టి అదీ ఆసించలేదు. ఇంతలోనే ప్రారబ్ధం తీరిపోయి మరణమనేది ముంచుకు వచ్చింది. అలాంటప్పుడిక అభ్యాసమనే దాని కాస్కారమేముంది. లేకుంటే మరణ కాలంలో బుద్ధి పనిచేయదు గదా ఇక వాడు మొదటి నుంచీ చేస్తూ వచ్చిన సాధన అంతా గంగపాలేనా. దానికి ఫలితమేలేదా అని ప్రశ్న.

అదే అడుగుతున్నాడిప్పు డర్జునుడు కృష్ణ భగవానుణ్ణి. ఏమని. అయతిః శ్రద్ధయో పేతః యోగా చ్చలిత మానసః - యత్నం చేశాడింత వరకూ. ఎంతో శ్రద్ధగా ఆస్తిక్య బుద్ధితోనే బ్రతికాడు బతికినంత

Dr Kuna Dayananda Swamy ebooks



కాలమూ. కాని ఏమి చేస్తాం. కాలం తీరి వెళ్లిపోతున్నాడు. యోగా చ్చలిత మానసః – అవసాన కాలంలో ఎంత వాడికైనా మనసు చలించక తప్పదు గదా. అలాగే తెలివి తప్పింది వాడికి. అప్పటికింకా సిద్ధి కలగ లేదనుకోండి. సిద్ధి అంటే ఇక్కడ యోగానికి ఫలమైన సమ్యగ్దర్శనం. ఆత్మజ్ఞానం. అది కలిగే లోపలనే వాడు కన్ను మూయవలసిన పరిస్థితి ఏర్పడిందనుకోండి. కాంగతిం కృష్ణ గచ్ఛతి. ఆ పరిస్థితిలో పోయిన ఆ యోగా భ్యాసికి పట్టే గతి ఏమిటో సెలవిస్తారా.

**కచ్చి న్నో భయ విభ్రష్ట - శ్ఛిన్నాభ్ర మివ నశ్యతి**

**అప్రతిష్ఠో మహా బాహో - విమూఢో బ్రహ్మణః పథి - 38**

అటు కర్మ మార్గానికీ ఇటు యోగమార్గానికీ రెంటికీ తప్పి గాలికి చెదిరిపోయిన మేఘంలాగా ఉభయ భ్రష్టుడయి పోతాడా వాడు. ఎందుకంటే అటు మామూలు నిత్యనైమిత్తి కాది కర్మలూ చేయటం లేదు వాడు. ఇటు ధ్యానయోగ మభ్యసించి దాని ఫలితమైన జ్ఞానమూ ఆర్జించ లేదు. మేఘంలాగా విరిసిపోక ఏమవుతుందా జీవితం. అప్రతిష్ఠో విమూఢో బ్రహ్మణః పథి. బ్రహ్మ ప్రాప్తి మార్గంలో ప్రతిష్ఠ పొందలేదు. మరణంలోనా తెలివి తప్పిపోయింది. ఇక ఉభయ భ్రష్టుడు కాక ఏమవుతాడు. అందుకే అడుగుతున్నాను. ఛిన్నా భ్ర మివ నశ్యతి. చెల్లా చెదరైన మబ్బులాగా విరిసి పోతుందా వాడి జీవితమని.

Dr Kuna Dayananda Swamy ebooks



**ఏతన్మే సంశయం కృష్ణ - ఛేత్తు మర్హస్య శేషతః**

**త్వదన్య స్సంశయ స్యాస్య - ఛ్ఛేత్తా న హ్యుప పద్యతే - 39**

ఇదే నాకు పట్టుకొన్న పెద్ద సమస్య. దీన్ని పరిష్కరించ వలసిన బాధ్యత నీదే. ఛేత్తు మర్హస్య శేషతః - పూర్తిగా దీన్ని పరిష్కరించగల వాడవు కూడా నీవే. ఎంచేతనంటే త్వదన్యః నీవు తప్ప వేరొకడు - వాడు దేవుడే కావచ్చు. ఋషీశ్వరుడే కావచ్చు. ఎవడూ మానవులకు కలిగిన ఈ సందేహాన్ని పోగొట్టలేడని నా నమ్మకం. ఛేత్తా నహ్యుప పద్యతే. ఇక్కడే ఉందొక రహస్యం. జీవిత మధ్యంలో వచ్చే సందేహా లెవరైనా తెలిసినవారు మనకన్నా గొప్పవారు తీరిస్తే తీర్చగలరేమో. కాని జీవితాంతంలో ఎదురయ్యే సమస్య పరిష్కరించే తాహతు ఒక్క భగవానుడికి తప్ప ఏ మానవుడికీ లేదు. ఋషిః దేవో వా అని వ్రాస్తున్నారు భాష్యకారులు. దేవతలూ ఋషులూ కూడా ఇక్కడ చేతు లెత్త వలసిందే. దేవతలకూ ఋషులకూ కూడా అంతు పట్టదు నా వ్యవహారమని తరువాత విశ్వరూపాధ్యాయంలో చెప్పబోతాడు కూడా.

కాబట్టి పరమాత్మ తత్త్వం పరమాత్మకే ఎరుక. జ్ఞాన క్రియా శక్తులు సమగ్రంగా ఉన్నవాడే పరమాత్మ అంటే. అలాటి సర్వజ్ఞుడు గనుకనే జననానికి పూర్వమూ - మరణాని కనంతరమూ కూడా ఏమి జరుగుతుందో చెప్పగలడు. తానే చెప్పాడా మాట. తాన్యహం వేద సర్వాణి అని. అంతే కాదు. నత్వం వేత్థ అని కూడా చెప్పాడు. మానవుడికే

Dr Kuna Dayananda Swamy ebooks



మాత్రమూ అంతు పట్టదట. జీవిత మధ్యంలో జరిగేదే మనకంతు పట్టటం లేదు. ఇక ముందు వెనుకలే మర్థమవుతాయి. ఏమి కారణం. వాడు సర్వజ్ఞుడైతే మన మల్పజ్ఞులం. వాడు సర్వశక్తి సమన్వితుడైతే మన మశక్తులం. అల్పశక్తులం. కనుకనే జీవితాంతంలో ఎవడి కేమవుతుందో ఊహించలేడు మానవుడు. ఊహించినా అది ఊహే కాని వాస్తవం కాదు. అంచేత అలాటి వాస్తవమేదో తెలుసుకోవాలని కోరటం సహజమే. ఎలా తెలుసుకోవాలంటే ఎలా తెలుసుకొంటాడు. ఎవరి నడిగితే ఎవడు చెబుతాడు. డోలు పోయి మద్దెలతో మొరపెట్టినట్టు ఎవరి నడిగినా ప్రయోజనం లేదు. మానవులందరూ పరిమిత ప్రజ్ఞావంతులే. పరిపూర్ణమైన జ్ఞానమెవడికీ లేదు. ఋషులు దేవతలే పనికి రారంటున్నారు భగవత్పాదులు. ఇక మానవ మాత్రుల విషయం చెప్పేదేముంది. మరి ఎవరి నడిగి తెలుసుకోవాలీ రహస్యం. సర్వజ్ఞుడైన పరమాత్మ నొక్కడినే. వాడే కృష్ణ రూపంగా కనిపిస్తున్నాడెదుట. అందుకే ఆయననే పట్టుకొని ప్రశ్నిస్తున్నా డర్జునుడు సందేహ నివృత్తి చేయమని.

**పార్థ నైనేహ నా ముత్ర - వినాశ స్తస్య విద్యతే**

**నహి కల్యాణకృ త్కశ్చిత్ - దుర్గతిం తాత గచ్ఛతి - 40**

చూడండి. ఇక ఇక్కడి నుంచి సమాధానమిస్తూ పోతాడు కృష్ణ పరమాత్మ. ఆ ఇవ్వటంలో ధర్మ పురుషార్థాన్ని పట్టుకు వస్తాడు రంగంలోకి. జ్ఞానమిక్కడి కిక్కడే ఫలిస్తే లేదు గాని ధర్మమనే ప్రసక్తి - ఫలించ లేదో-

Dr Kuna Dayananda Swamy ebooks


అయితే ఇక అంతా ధర్మ విషయమే. ఇది ఎలాంటిదంటే వెలుతురున్నంత వరకూ చీకటి అనే వార్తే లేదు. అది ఎప్పుడు తగ్గిపోయిందో - ఎంతెంత తగ్గుతుంటే అంతంత చీకటి చోటు చేసుకొంటుంది. చీకటనే దొకటి ఉందని గాదు మరలా. వస్తుసిద్ధంగా ఎక్కడా లేదది. లేకున్నా వెలుగు బలహీన పడటమే దానికెక్కడ లేని బలం. అది తాత్కాలికమే కావచ్చు. కాని అంతవరకూ దాన్ని భరించక తప్పదు. అలాగే జ్ఞానమింకా ఉదయించకుండానే పోయాడుగదా సాధకుడు. వాడికి లోకాంతర జన్మాంతర ప్రయాణం తప్పదు. వాస్తవంగా కాకపోయినా వ్యావహారికంగా **Hypothetical** నైనా ఒప్పుకోక తప్పదు. వాడికే గాక అసలు సాధనే చేయని లోకులకింకా తప్పదీ వ్యవహారం. వాడు జ్ఞానమింకా అందుకో లేదు. వీరికా ప్రయత్నమే లేదు. ఇక చీకటి గాక ప్రకాశమేముంది. జ్ఞానమనే ప్రకాశానికి నోచుకోనంత వరకూ ధర్మమనే చీకటి నీకిష్టం లేకపోయినా ఒప్పుకోక తప్పదు. తాత్కాలికంగానైనా అనుభవించక తప్పదు. అదే లోకాంతర జన్మాంతర వ్యవహారం. అదే ధర్మ పురుషార్థం **Religious fact**. దాన్ని ప్రమాణంగా తీసుకొని జవాబిస్తున్నా డిప్పుడు భగవానుడు.

పార్థ నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే - నాయనా నిరంతరా భ్యాస శీలుడైన యోగి ఒకవేళ జ్ఞానోదయం కలగక ముందే మరణించినా భయం లేదు. వాడిహంలో నీకు కనపడకుండా పోయినా వినాశం లేదు వాడికి. ఇహంలో కాకుంటే పరంలో బ్రతికి ఉంటాడు. ఇంతకంటే

Dr Kuna Dayananda Swamy ebooks



హీనమైన జన్మ రాదు వాడికి. పరంలో ఉత్తమ సుఖాలను భవించి మరలా వచ్చి జన్మిస్తాడు. ఉత్తమమైన జన్మ ఎత్తుతాడు. ఎందుకంటే నహి కల్యాణ కృత్కశ్చి ద్దుర్గతిం గచ్ఛతి. మంచి పనిచేసిన వాడెప్పుడూ చెడిపోడు. అధోగతి పాలుకాడు. పరమాత్మగా నేనిస్తున్నాను హామీ. జీవాత్మ దశలో బతుకుతున్న మీకు తెలియకపోవచ్చు. అన్నీ తెలిసనవాడను కాబట్టి నేను చెప్పే మాట నమ్మాలి మీరు.

**ప్రాప్య పుణ్య కృతాం లోకా - నుషిత్వా శాశ్వతీ స్సమాః**

**శుచీనాం శ్రీమతాం గేహే - యోగ భ్రష్టో ఽ భి జాయతే - 41**

ఏమిటా మాట. జీవులకు తెలియని రహస్యమేమని చెబుతున్నాడు పరమాత్మ. యోగభ్రష్టుడు సర్వనాశనమయి పోడు. అభిజాయతే. మరలా జన్మిస్తాడీ లోకంలో. ఎప్పుడు. దేహపాతమైన వెంటనేనా. కాదు. దానికొక క్రమమున్నది. అది మీకు తెలియదు. నాకు తెలుసు ఆ రహస్యం చెబుతున్నాను విను. ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ - చచ్చిన తరువాత యోగ సాధకుడు పుణ్య లోకాలకు వెళ్లిపోతాడు. అశ్వమేధాది యాగాలు చేసి పుణ్యం గడించిన వారి లోకాలకు వెళ్లుతాడని వ్రాస్తారు గురువుగారు. అలా వెళ్లి పోయి ఆ లోకాలలో ఉషిత్వా శాశ్వతీస్సమాః - చాలా సంవత్సరా లక్కడే ఉంటాడు. అవి దివ్య సంవత్సరాలైనా కావచ్చు.

అలా ఉంటూ అక్కడే ఉండిపో రెప్పటికీ. మరలా వచ్చి ఈ కర్మ భూమిలో జన్మిస్తారు యోగభ్రష్టులు. కర్మ భూమిలో అందరూ జన్మిస్తూనే

Dr Kuna Dayananda Swamy ebooks


ఉంటారు గదా. మరి వారి విశిష్టత ఏమిటి. శుచీనాం శ్రీమతాం గేహే. అదీ విశిష్టత. శుచీ శుభ్రతా ఆచారమూ సంస్కారమూ ఉన్నవారి ఇంట్లో జన్మిస్తారు. కేవల మాచార వ్యవహారాలే గాదు. శ్రీమంతులు కూడా అయి ఉండాలి వారు. ఇందులో ఆచారం చిత్తశుద్ధికైతే - సిరిసంపదలు జీవయాత్ర సుఖంగా సాగటానికి. ఒకటి ఆభ్యంతరం మరొకటి బాహ్యం. సంస్కారం లేనివారికి జన్మిస్తే అవాతావరణంలో కృషి చేయలేరు. సంస్కార మున్నా తగినంత ధన సంపత్తి లేనివారైతే కాలమంతా సంపాదనకే ఖర్చయి పోతుంది. ఇక యోగసిద్ధి పొందే అవకాశమేముంది. కనుక సాధనకు ఉండవలసిన రెండు సౌకర్యాలూ సూచన చేశాడీ మాటల్లో భగవానుడు.

**అథవా యోగినా మేవ - కులే భవతి ధీమతాం**

**ఏతద్ధి దుర్లభ తరం - లోకే జన్మయదీ దృశమ్ - 42**

అంతే కాదు. సంస్కారవంతులూ శ్రీమంతుల ఇళ్లలోనే గాక ఇంకా కొందరు మహనీయులు యోగుల కులంలోనే జన్మించినా జన్మించవచ్చు. యోగినా మంటే దరిద్రాణామని అర్థం వ్రాశారు గురువుగారు. శ్రీమంతులని ఇంతకుముందే పేర్కొన్నారు. కాబట్టి వీరు దానికి భిన్నంగా ధనహీనులయి ఉంటారని ఆయన ఉద్దేశం. అంతేకాదు. ఏతద్ధి దుర్లభ తరం లోకే జన్మ యదీ దృశం. ఇలా యోగులూ అకించనులూ అయిన వారి ఇంట్లో జన్మించట మనేది లోకంలో చాలా అరుదైన విషయమంటున్నాడు భగవానుడు. ఎందుకని. సంపన్నులకు జన్మిస్తే సిరిసంపదలన్నీ పిలిస్తే పలుకుతుంటాయి కాబట్టి ఆ మైకంలో పడి వాడికి పారమార్థికమైన స్మృతి

Dr Kuna Dayananda Swamy ebooks



లేకపోవచ్చు. దానికి తగిన ప్రయత్నం చేయకుండా భోగభాగ్యాలు వాడి దారి కడ్డు తగలవచ్చు. అలాటి ప్రమాదం లేదు దరిద్రులైన వారికి జన్మిస్తే. సాధన మార్గాని కడ్డు పడేదేదీ ఉండదు. అయితే పూటకు గతి లేనివాడు జీవితావసరాలు వెతుక్కోటంలోనే సరిపోతుంది గదా. ఇక సాధన ఎలా చేస్తాడు. అవకాశ మేముంది అని అడగవచ్చు. ఇప్పుడు కొత్తగా ప్రారంభిస్తాడని గాదు సాధన. ఇంతకు ముందు జన్మలో సౌకర్యాలుండి కొంత దూరం సాధనచేసినా వాడే ఇప్పుడిలాటి జన్మ ఎత్తాడు గనుక ఆ అభ్యాస బలమే ప్రేరణ చేస్తుంది వాణ్ణి ఇంకా సాగించమని. అది దీక్షగా చేయాలంటే కలిమి కంటే లేమే వాడికి దోహదం చేస్తుంది. లేమి వైరాగ్య భావాన్ని పెంపొందించి ఇతోధికంగా సాగించే అభ్యాసాన్ని బలపరుస్తుందని భావం. కనుకనే నాకెప్పుడూ సుఖాలుగాక కష్టాలే కలుగజేయి నీ స్మరణ నిరాటంకంగా చేయగలనని కోరుతుంది కుంతీదేవి కృష్ణ పరమాత్మను.

ఇప్పుడీ రెండు శ్లోకాలలో ఉదాహరించిన సాధకుల జన్మలు రెండూ రెండు శాఖలు. ఒకటి సంపన్నులైన వారికి జన్మించటం. వేరొకటి దరిద్రనారాయణులకు జన్మించటం. ధనమూ దారిద్ర్యమూ ఈ రెండింటిలోనే తేడా చెప్పాడు గాని శుచీనా మనే గుణంలో తేడా చూపలేదు. శుచిత్వ మంటే శుద్ధి. అది బహిశ్శుద్ధి అయినా కావచ్చు. అంత శ్శుద్ధి అయినా కావచ్చు. రెండూ శౌచం క్రిందికే వస్తాయి. రెంటినీ ఉద్దేశించింది గీత. అది అవశ్యంగా ఉండాలిద్దరికీ. అది ఉండి ఆపైన ఐశ్వర్య

Dr Kuna Dayananda Swamy ebooks



మొకడికుంటే దారిద్ర్య మింకొకడి కుండవచ్చు. దారిద్ర్యమున్న వాడి జన్మ ఐశ్వర్యంలో తులతూగే వాడి జన్మ కన్నా ఇంకా దుర్లభమని కూడా వీడికి కితాబిస్తున్నది గీత.

ఇప్పుడీ రెండు భావాలకూ రెండు గొప్ప ఉదాహరణలు మనకు భాగవతంలో దొరుకుతాయి. మొదటిది ప్రహ్లాదుడి జీవితం. రెండవది కుచేలుడి జీవితం. పుట్టుకతోనే అష్టైశ్వర్యాలతో తులతూగుతూ బ్రతికాడు ప్రహ్లాదుడు. వాడికి దారిద్ర్యం లేదు లేశమైనా. అయినా గొప్ప జ్ఞాని. ఎక్కడబడితే అక్కడ పరమాత్మనే చూస్తున్న జీవితమది. పోతే కుచేలు డలా కాదు. జన్మతః దరిద్రుడు. కుచేలుడనే మాటే చెబుతుందతని దారిద్ర్య మెలాటిదో. పైగా ప్రహ్లాదుడిలాగా ఒంటి వాడు కాదు. పెండ్లాం బిడ్డలున్న వాడు. ఆ బిడ్డలూ ఒకరిద్దరు గారు. భార్య కడుపు పండినంత మంది. కుచేల సంతానమని గదా వాడుక.

అయినా ఇద్దరూ ఇద్దరే. మహనీయులు – నిరంతర తత్త్వ చింతన పరాయణులు. అతడు భోగభాగ్యా లున్నాయి నాకేమని పొంగి పోలేదు. ఇతడవి ఏవీ లేవే నాకని కుంగిపోలేదు. జీవితం సాఫీ గానే సాగిపోయిం దిద్దరికీ. జీవితం జీవితంగా భావించ లేదిద్దరూ. పరమాత్మ విభూతిగా దర్శిస్తూ గడిపారు. అంచేత గుణమిద్దరికీ ఉంది. అది సమానం. లోపలా వెలపలా పరమాత్మనే చూస్తున్నా రిరువురూ. అదే శౌచమనే మాట కసలైన అర్థం.

Dr Kuna Dayananda Swamy ebooks



**తత్ర తం బుద్ధి సంయోగం - లభతే పౌర్వ దైహికం**

**యత తేచ తతో భూయ - స్సంసిద్ధౌ కురునందన - 43**

మరి ఇలాటి స్థిత ప్రజ్ఞత ఏర్పడాలంటే అది ఇప్పటికిప్పుడేర్పడింది గాదు. ఎన్నో జన్మల నుంచో కృషి చేసి ఉంటే గాని ఆ కృషికి ఫలంగా ఈ జన్మరాదు. ఈ జన్మలో అలాటి ఆలోచనా ప్రవర్తనా రాబోదంటున్నాడు భగవానుడు. తత్ర తం బుద్ధి సంయోగం లభతే. వాడిక జనకుడిలాగా శ్రీమంతుల ఇంట్లో జన్మించనీ జడ భరతుడిలాగా యోగుల ఇంట్లో జన్మించనీ. ఎక్కడ జన్మించాలో అది గూడా కాదు ముఖ్యం. జన్మిస్తూనే వాడలాటి బుద్ధి సంయోగం **Mental setup** తో జన్మిస్తాడు. ఎక్కడిదా బుద్ధి యోగం. పౌర్వ దైహికం. పూర్వ దేహాలకు సంబంధించింది. అది సంస్కారరూపంగా ఉండిపోయింది. మరణానంతరం వాడు మరలా జన్మ ఎత్తేసరికి నేలలో నాటిన విత్తనం మొలకెత్తినట్టు మళ్లీ అంకురిస్తుంది. వికసిస్తుంది. ఫలిస్తుంది.

ఫలించాలంటే క్షణాల మీద జరగక పోవచ్చు. యతతేచ తతో భూయః - ఈ వర్తమాన జన్మలో మరలా కృషి సాగిస్తాడు. అలా ముందుకు వచ్చిన **Brought forward** సంస్కారమే పురికొల్పుతుంది వాడిని ఇతోధికంగా ప్రయత్నం సాగించమని. దాని బలంతో ఇంకా దీక్షగా చేస్తూ పోతాడు సాధన. సంసిద్ధౌ. చేస్తూ పోతే ఎప్పటికైనా ఫలితం సిద్ధించకుండా పోదు. తీవ్ర వేగానా మాసన్న తమః అన్నట్టు తీవ్రంగా

Dr Kuna Dayananda Swamy ebooks



సాగిస్తే ఈ జన్మలోనే ముక్తుడయి పోవచ్చు. లేదా ఇంక ఒకటి రెండు జన్మలలో కావచ్చు. మొత్తం మీద కృషితో నాస్తి దుర్భిక్ష మన్నట్టు సిద్ధి అవశ్యం భావి.

దీని కుదాహరణ ప్రాయం భాగవతంలో ఇంద్రద్యుమ్న మహారాజు జీవితం. సగుణంగా గడచిందాయన జీవితం మొదట్లో. గొప్ప విష్ణుభక్తు డాయన. సగుణంగా చూచాడు పరమాత్మను. అది చాలదు. నిర్గుణ తత్త్వాని కెదగాలి నీవని బోధించాడు పరమాత్మ ఆయనను అగస్త్య మహర్షి శాపమనే వ్యాజంతో. దాని కనుగుణంగా జన్మ ఎత్తాడు గజేంద్ర రూపంలో. గజేంద్రుడుగా జన్మించినా అది కేవలమొక ఉపాధి మాత్రమే. లోపల భక్తి వాసన బ్రహ్మాండంగా గుప్తమయి ఉంది. అది జ్ఞానవాసనగా మారటానికి కొంతకాలం పట్టింది. మకర గ్రహణంతో అది కాలం కలిసి వచ్చి బయట పడ్డది. ఏ రూపంగా. భక్తిరూపంగా కాదు. అనన్య భక్తిరూపంగా. అంటే ఆత్మ జ్ఞానంగా. దానికి ప్రచోదకం పూర్వకృత కర్మ పరిపాకమే. పూర్వ పుణ్యఫల దివ్య జ్ఞాన సంపత్తి అదే. అదే క్రమంగా మోక్షమనే సిద్ధికి దారి తీసింది. మోక్షం దేనిలో నుంచి. మకరబంధం నుంచా. కాదు. గజ శరీర బంధం నుంచి. అదే గజేంద్ర మోక్షం. జిజీవిషేనాహ మిహా ముయా కి - మంత రృహిర్వ్యాపృత యేభయోన్యా. ఈ గజ యోనిలో బ్రతకటం నాకిష్టం లేదంటాడు గజేంద్రుడు. మరేదతని కిష్టం. ఇచ్ఛామి కాలేన నయత్ర విప్లవ - స్తస్యాత్మలో కావరణస్య మోక్షణం. నా ఆత్మ చైతన్య ప్రకాశాన్ని

Dr Kuna Dayananda Swamy ebooks



ఆవరించిన ఈ గజ శరీరమనే ఉపాధిలో నుంచి నాకు కావాలి మోక్షమంటాడు.

ఏమిటర్థం. గజమంటే అహంకారానికి సంకేతం. మకరమంటే మమకారానికి చిహ్నం. అహంకారమే జీవభావం. మమకారమే జగద్భావం. ముందు జీవభావం పోతేగాని జగద్భావం అంటే సంసారం తొలగిపోదు. ఇది ఇలాగే ఉంచుకొని సంసారం లేకుండా పోవాలంటే చస్తే పోదు. నీ అనంతమైన స్వరూపాన్ని శరీరం మేరకు పరిమితం చేసింది అహంకారం గదా. తన్నిమిత్తంగానే గదా నీకు విలక్షణంగా ఒక సంసారమంటూ ఏర్పడింది. ఏర్పడితే గదా దాన్ని మమ అని చూస్తున్నావు. కాబట్టి గజభావమే జీవభావం. గజేంద్ర మోక్షమంటే అహంతా రూపమైన భావం పోగొట్టుకోటం. అది పోవాలంటే పూర్వ జన్మల తాలూకు సంస్కారమెంతో పోగుచేసుకొని ఉండాలి. అది మనకు చాటి చెప్పటమే వేదవ్యాసుని వివక్షిత మింతకూ.

**పూర్వాభ్యాసేన తేనైవ - హ్రియతే హ్యవ శోపి సః**

**జిజ్ఞాసు రపి యోగస్య - శబ్ద బ్రహ్మాతి వర్తతే - 44**

భగవద్గీతా వ్యాసుడే గదా భాగవత వ్యాసుడు. భగవద్గీతలో చెప్పిన మాటే భాగవతంలో కథాముఖంగా నిరూపిస్తాడు. అక్కడ నిరూపించిన విషయాని కనురూపంగానే మరలా ఇక్కడికి వచ్చి మాటాడుతాడు. అలాటి మాటే ఇప్పుడు మరలా మాటాడుతున్నాడు. ఏమని. పూర్వాభ్యాసేన తేనైవ

Dr Kuna Dayananda Swamy ebooks


మ్రియతే హ్యపశోపి. పూర్వ పూర్వ జన్మలలో చేసుకొన్న అభ్యాసం వృధా పోదు. ఎప్పటికప్పుడు దాని సంస్కారం **Impression** పోగవుతూనే ఉంటుంది. అదేవాణ్ణి బలవంతంగా మోసుకొని తెచ్చి ఈ జన్మలో పడేస్తుంది. అవశోపి. వాడి వశంలో లేదది. మరణ సమయంలో బుద్ధి పనిచేయక తెలివి తప్పి పడిపోయాడు వాడు. అలాంటి వాడికే జన్మ ఎత్తితే బాగుండునో - ఎత్తి ఎలా ప్రయత్నం సాగించాలో ఏమి తెలుసు. అన్నీ తెలిసింది ఆ వాసనా శరీరమే. అది వీడు పరవశంగా పడి ఉంటే ఆ శరీరం తప్పించి మరొక శరీరం సృష్టించి అందులో తెచ్చి ప్రవేశపెడుతుంది.

అలా ప్రవేశ పెట్టినప్పటి నుంచీ జిజ్ఞాసువయి పోతాడు వాడు. తత్త్వమేమిటా అది ఎలా ఉంటుందా అని దాన్ని అన్వేషించే దృష్టి బలంగా ఏర్పడుతుంది వాడికి. దానితో శబ్ద బ్రహ్మాతి వర్తతే. శబ్ద బ్రహ్మాన్ని గూడా దాటి పోగలడు. శబ్ద బ్రహ్మమేమిటి. ఏమిటో చెబుతున్నాడు వినండి భగవత్పాదులు. వేదోక్త కర్మానుష్ఠాన ఫల మతివర్తతే. వేదోక్తమైన సత్కర్మ లాచరిస్తే కలిగే గొప్ప ఫలమేదైతే ఉందో అది శబ్ద బ్రహ్మం. స్వర్గాది భోగాలు. అది కూడా దాటిపోతాడంటే ఏమిటర్థం. అమృతం త్రాగిన వాడికి సోడా కొట్టి ఇచ్చాడన్నట్టుంది. యోగ మార్గంలో ఉన్న జిజ్ఞాసువుకు స్వర్గాదులు దేనికి. అంతకంటే అతీతమైన అపవర్గమే కోరి చేస్తున్నాడు వాడు సాధన. జిజ్ఞాసువుకే అక్కర లేదన్నప్పుడిక అందులో కృతార్థుడైన

Dr Kuna Dayananda Swamy ebooks



జ్ఞానికా. వాడసలే దాని ముఖం చూడడు. అందుకే ఆత్మజ్ఞానికి స్వర్గం కూడా నరకంతో సమానమే. రెండూ అంధకార బంధురమేనని చాటి చెప్పారు భగవత్పాదులు ఈశావాస్య భాష్యంలో.

పోతే ఇప్పుడొక ప్రశ్న వస్తున్నది. పూర్వాభ్యాస మంటున్నారు వ్యాసభగవానులు. పూర్వ జన్మలలో చేసిన అభ్యాసం యోగాభ్యాసమేనని ఎలా చెప్పగలం. మిగతా కర్మలు కూడా ఆచరించి ఉండవచ్చు గదా సాధకుడు. వాటికి ఫలితముండదా. అదే గదా ప్రారబ్ధరూపంగా వర్తమాన జన్మలో బయట పడుతుందని ఇంతకు ముందు వ్రాక్రుచ్చారు. అలాంటప్పుడు జన్మాంతర సంస్కారమనేది రెండు విధాలని ఒప్పుకోవలసి ఉంటుంది. ఒకటి ప్రారబ్ధ రూపం. మరొకటి ప్రయత్న రూపం. రెండూ ప్రస్తుత జన్మలో ప్రవేశించి నప్పుడు ప్రారబ్ధం యోగాభ్యాస ప్రయత్నాని కడ్డు తగలదా. తగిలితే మరలా సాధకుడితోధికంగా ఎలా కృషి చేయగలడు. ఇదే ప్రశ్న వచ్చింది భగవత్పాదులకు కూడా. దానికాయన ఎలా సమాధాన మిచ్చాడో చూద్దాం. న కృతం చేత్ యోగాభ్యాస జాత్ సంస్కారాత్ బలవత్తర మ ధర్మాది లక్షణం కర్మ – తదా యోగాభ్యాస జనితేన సంస్కారేణ హ్రియతే – యోగాభ్యాస సంస్కారం కన్నా బలవత్తర్తమైన అధర్మాది సంస్కారం లేకపోతే అప్పుడా యోగ సంస్కారమే వర్తమాన జన్మలో నిరాఘాటంగా పనిచేస్తుంది. అధర్మ శ్చేత్ బలవత్తరః కృతః తేన యోగ జోపి సంస్కారః అభిభూయత ఏవ – అలా కాక అధర్మ సంస్కారమే బలీయంగా ఏర్పడి

Dr Kuna Dayananda Swamy ebooks



ఉందో అప్పుడీ యోగ సంస్కారాన్ని అది దెబ్బ తీసి పనిచేయకుండా ఆపేస్తుంది. అయితే ఇక ఇది ఇంతేనా అని సాధకుడు బెంబేలు పడగూడదు. ఎందుకంటే అది తాత్కాలికమే. ఫలానుభవం వరకే. అనుభవించి బాకీ తీర్చుకొంటే చాలు. తత్ క్షయే తు యోగ జ స్సంస్కారః స్వయమేవ కార్యమారభతే. ప్రారబ్ధ కర్మ నశించగానే యోగాభ్యాస సంస్కారం స్వయంగానే రంగంలోకి వచ్చి మరలా ముందుకు సాగిపోతుంది. క్రమంగా ఫలితమిస్తుంది. ఒక్కమాట గుర్తుంచుకోవాలి మనం. న దీర్ఘ కాలస్థ స్యాపి వినాశ స్తస్యాస్తి. ప్రారబ్ధ మనుభవించటంతోనే సరిపోతే అది ఎప్పుడు మరలా బలం పుంజుకొంటుంది. ఆపాటికి అణగారి పోదా అని బెంగపెట్టుకో రాదు. ఎంతకాల మజ్ఞాత వాసం చేసినా యోగాభ్యాస వాసన నష్టమై పోదు. ప్రారబ్ధం తీరగానే పైకి వచ్చి అది చేయవలసిన పని చేస్తుంది. భయం లేదని హామీ ఇస్తారు స్వామివారు. ఇంతకూ ఇది ఒక గొప్ప సన్నివేశం **Position.** ప్రారబ్ధమా ప్రయత్నమా రెండింటికీ ఎప్పుడూ వైరమే. కాని అది మన భావనేగాని నిజంగా శత్రుత్వం లేదు వాటికి. ఒకటి చేసిన దాని కనుభవ రూపమైతే మరొకటి అనుభవానికి చేసే ప్రయత్న రూపం. ఒకటి గతానికి చెందినదైతే వేరొకటి అనాగతానికి సంబంధించినది. రెండూ కలిసే ఉంటాయి జీవితంలో. ఇదొక చిత్రం. ఎలాగంటే ఇంతకు ముందే చెప్పాము. జీవుడు భోక్తే గాక కర్త కూడా. ఒక పక్క ప్రారబ్ధ మనుభవిస్తుంటాడు. మరొక పక్క ప్రయత్నం చేస్తుంటాడు.

Dr Kuna Dayananda Swamy ebooks



అది దీనికీ ఇది దానికీ ఎప్పుడూ అడ్డు తగలదు. అలా తగిలేట్టయితే ఇంతకు ముందు జన్మలో ప్రయత్నం చేయకుండానే ఇప్పుడది ప్రారబ్ధరూపంగా ఎలా తయారయింది. కనుక రెండింటికీ అవకాశముంది ఎప్పుడూ.

ప్రారబ్ధం ప్రయత్నం రెండూ ప్రయాణికులే. జీవితమనే బస్సులో రెండూ ప్రయాణిస్తున్నాయి. అందులో ప్రారబ్ధం ముందుగానే ఒక చేతి గుడ్డ సీటు మీద వేసి ఎక్కింది బస్సు. ప్రయత్నం కూడా దానివెంటనే ఎక్కింది. ఎక్కి కూచోబోయింది సీటులో. నాచేతిగుడ్డ ఉందిక్కడ నీవు కూచో గూడదని మందలించింది ప్రారబ్ధం. చేసేది లేక కమ్మీ పట్టుకొని నిలబడి ప్రయాణం చేస్తున్నది ప్రయత్నం. ప్రయాణమేమో ప్రయాణమే. దాని కడ్డురాదు ప్రారబ్ధం. ఎటు వచ్చీ కొంచె మసౌకర్యం కలిగిస్తున్నది ప్రయత్నానికి. సీటులో కూచోలేదనే గాని ప్రయాణాని కడ్డు రాలేదు గదా అది పోగానే సాగుతున్నది గదా అని సంతోషిస్తున్నది ప్రయత్నం. కొంతసేపటికి తన స్టేషను వచ్చి ప్రారబ్ధం దిగిపోతుంది. పోతే ఇక ఏ గొడవా లేదు. ప్రయత్నం దర్జాగా సీటులోనే కూచొని సుఖంగా పయనిస్తుంది ముందుకు. అనతి కాలంలోనే గమ్యం చేరగలదు. ఇదీ ఇక్కడ మన మర్థం చేసుకోవలసిన విషయం. రెండింటికీ మనం చేయగల సమన్వయం కూడా ఇదే. ఇదే ఇంతకుముందు తృతీయాధ్యాయంలో సదృశం చేష్టతే అనే శ్లోకం దగ్గర చెప్పుకొన్నాము. ఇప్పుడూ చెప్పుకొంటున్నాం. ఎక్కడైనా చెప్పుకోవలసిన మాట ఇదే.

Dr Kuna Dayananda Swamy ebooks



**ప్రయత్నా ద్యత మానస్తు - యోగీ సంశుద్ధ కిల్బిషః**

**అనేక జన్మ సంసిద్ధ - స్త తో యాతి పరాంగతిమ్ - 45**

కాబట్టి ప్రారబ్ధ మది ఒక పెద్ద దయ్యం - దాన్ని ఎలాగా తప్పించుకోటమని గాబరా పడగూడదే మానవుడూ. ముఖ్యంగా యోగ సాధకుడు. ప్రతిలోమంగా **Negative** గాక అనులోమంగా **Positive** ఆలోచించా లెప్పుడూ. అదే జయం జీవితానికి. కృషితో నాస్తి దుర్భిక్షమని ఇంతకు ముందుగానే గదా హెచ్చరించాము. కనుక ప్రయత్నా ద్యత మానస్తు. అంతకంత కధికంగా ప్రయత్నం సాగిస్తూ పోవాలి సాధకుడు. అలా సాగించే కొద్దీ యోగి మనస్సుకు పట్టిన కిల్బిషం - మాలిన్యమంతా క్షాళితమయి సంశుద్ధ కిల్బిషుడవుతాడు.

అది కూడా ఒక్క జన్మలో జరిగే వ్యవహారం కాదు. ఇహైక భవికా ముక్తిః అని కొందరు పెద్దలు చెప్పారను కోండి. అది తీవ్రవేగులైన ఉత్తమాధికారుల విషయం. అందరూ అలాటి ఉత్తములు కారు. మధ్యము లుంటారు. మందాధి కారు లుంటారు. వారు మాత్ర మొక జన్మతోనే తరిస్తారని చెప్పలేము. అలా చెబితే అత్యాశ అవుతుంది. అయితే మరేమంటారు. అనేక జన్మ సంసిద్ధః - కొన్నిజన్మలు పడుతుంది యోగాభ్యాసం ఫలించటానికి. స్వామివారు వ్రాస్తున్నారు వినండి. అనేకేషు

Dr Kuna Dayananda Swamy ebooks



జన్మసు కించి త్కించి త్సంస్కార జాత ముపచిత్య - తేన ఉప చితేన అనేక జన్మ కృతేన సంసిద్ధః లబ్ధ సమ్యగ్దర్శనః - అనేక జన్మ లెందుకు కావలసి వచ్చిందంటే ఒక్కొక్క జన్మలో కొంచెం కొంచెం సంస్కారం పోగు చేసుకొని తద్వారా కడసారిగా వచ్చే జన్మలో సమ్యగ్దర్శనం సంపాదించే అవకాశ ముంటుంది సాధకుడికి. ఇదీ ఆయన మాట.

ఏ విద్యలోనైనా అభ్యాసమనేది ఉండి తీరుతుంది. ఒక సంగీతమే గాదు. సాహిత్యమే గాదు. నాట్యమే గాదు. శరీర వ్యాయామమే గాదు. కందుకాది క్రీడలే గాదు. మాటి మాటికీ అదేపనిగా కృషి చేస్తూ పోతే గాని ఫలితమీయదు. ఇదుగో ఆ చేయటానికి పట్టే కాలమే జన్మాంతరాలు. ఒక్కొక్క జన్మ ఒక్కొక్క అభ్యాస మనుకోండి **Exercise**. అలా అభ్యసిస్తూ పోతే తతో యాతి పరాంగతిం. చివరకు పరమ పదమైన మోక్షమే లభిస్తుంది సాధకుడికి. సందేహం లేదు.

**తపస్విభ్యో ఽధికో యోగీ - జ్ఞానిభ్యోఽపి మతోఽధికః**

**కర్మిభ్య శ్చాధికో యోగీ - తస్మా ద్యోగీ భవార్జున - 46**

ఇంతకూ నేను చెబుతున్నాను విను. యోగి అంటే ఎవరనుకొంటున్నావో. సామాన్యుడు కాడు. ఆత్మ దర్శనానికి నిరంతరమూ కృషి చేసే వాడే యోగి. వాడు తపస్వుల కన్నా గొప్పవాడు. శరీరేంద్రియ శోషణమేగా తపస్సంటే. అంతకన్నా ఏముంది. అలాంటి హఠయోగం

Dr Kuna Dayananda Swamy ebooks

జ్ఞానాని కేమి పనికి వస్తుంది. పోతే జ్ఞాని భ్యోపి మతో ధికః - తపస్వులే గాదు. జ్ఞానులకన్నా గొప్పవాడు. జ్ఞానమంటే ఇక్కడ ఆత్మజ్ఞానం కాదు. శాస్త్రార్థ పాండిత్యమని అర్థం వ్రాశారు భాష్యకారులు. కేవలం **Bookish** పుస్తక జ్ఞానం. అది పరోక్షమే. అపరోక్షం కాదు. అపరోక్షం కాకుంటే దర్శనం కాదు. అనుభవ మంతకన్నా కాదు.

అంతేకాదు. కర్మి భ్యశ్చాధికో యోగీ. యోగి కర్మిష్ఠుల కంటే గొప్ప వ్యక్తి. కర్మలు చేసేవాడు కర్మి. కర్మయోగం కాదిది - కర్మానుష్ఠానం. అగ్నిహోత్రాదులైన నిత్యనైమిత్తికాలు యాంత్రికంగా చేస్తూ పోయే వాడు కర్మి. వాడే కర్మిష్ఠుడు. జ్ఞానం లేదు వాడికి. జ్ఞానం కోసం ప్రయత్నమంత కన్నా లేదు. ఇక ఎందుకు పనికి వస్తాడు. అగమ్యం వాడి జీవితం. నిరర్థకం.

మరి యోగి జీవితమో. వీడు యాంత్రికంగా కర్మ చేయడు. శరీరాదులను శుష్కింప చేసుకొనే హఠయోగ మంతకన్నా చేయడు. తుదకు పుస్తకాలు చదివి ఎంతో జ్ఞానం సంపాదించాను. నాకంటే గొప్పవా డెవడున్నాడని విర్రవీగడు. నిరంతరమూ ఆత్మ దర్శనం కోసం నిరహంకారంగా నిష్కామంగా కర్మయోగం పాటిస్తూ దానితోపాటు ఏకాగ్రతతో ధ్యానయోగ మభ్యసిస్తూ తన జీవితకాలం సద్వినియోగం చేసుకొంటుంటాడు. ప్రయత్నం సక్రమంగా చేస్తూపోతే ఫలిత ముండకుండా పోదు. కుందేలు లాగా ఎగిరిపడ్డా గమ్యం చేరలేదు. దానికి [illegible]

Dr Kuna Dayananda Swamy ebooks



తాబేలులాగా పట్టు వదలకుండా ప్రయాణం చేస్తూ పోతే దానికంటే ముందుగానే గమ్యం చేరవచ్చు. అలాటివాడే యోగి. అందుకే తపస్వి కన్నా జ్ఞాని కన్నా కర్మి కన్నా ఉత్తముడు యోగి అని చాటటం. తస్మాద్యోగీ భవార్జున. కాబట్టి నీవు కూడా యోగాభ్యాస పరుడవయి జీవించమని సలహా ఇస్తాడు పరమాత్మ.

**యోగినా మపి సర్వేషాం - మద్గతే నాంతరాత్మనా**

**శ్రద్ధావాన్ భజతే యోమాం - సమే యుక్తతమో మతః - 47**

అంతకన్నా ఇంకా గొప్ప సందేశ మిస్తున్నాడిప్పు డర్జునుడితో సహా మనందరికీ. ఏమిటది. యోగినా మపి సర్వేషాం. యోగులలో కూడా చాలా తరగతు లున్నాయి. ఒకడు రుద్రుడే దేవత అని ఆరాధిస్తూ కూచుంటాడు. ఇంకొక డాదిత్యుణ్ణి ఉపాసిస్తాడు. ఇంకా ఒకడా దేవతనో ఈ దేవతనో పట్టుకొని కూచుంటాడు. దేవతో పాసనే గాని అది బ్రహ్మోపాసన గాదు. బ్రహ్మం తాలూకు శక్తి శకలాలే ఈ దేవతలనే వారు. బ్రహ్మం సమష్టి రూపమైతే వీరందరూ వ్యష్టి రూపులీ దేవతలు. అసలైన బ్రహ్మ స్వరూపాన్ని పట్టుకోక ఈ చిల్లర దేవతలను పట్టుకొని కూచుంటే ఏమి ఫలం. ఫలమనేది ఉన్నా అది ఏ కొంచెమో. పరిమితమే గాని అది పరిపూర్ణం కాదు. పరిపూర్ణం కాకుంటే అది జ్ఞానమెలా అవుతుంది. మోక్షమెలా సిద్ధిస్తుంది.

Dr Kuna Dayananda Swamy ebooks


అయితే మరి బ్రహ్మజ్ఞానమూ తన్నిమిత్తంగా మోక్షమనే ఫలమూ ఎలా సిద్ధిస్తుందని అడగవచ్చు. దానికీ దేవతోపాసనా రూపమైన యోగం కాదు సాధనం. మరేమిటి. మద్గతేనాంత రాత్మనా. శ్రద్ధావాన్ భజతే యోమాం. దేవతలకు కూడా దేవత పరాదేవత అయిన నన్నేసేవించా లంటాడు భగవానుడు. ఎవడా భగవానుడూ - ఎవడా పరా దేవత - అంటే మయివాసుదేవే అని ఒక్క మాటలో బయటపెట్టారు ఆచార్యులవారు. వాసుదేవుడే ఆ దేవత. దేవతగాని దేవతా. వసుదేవుని కుమారుడని గాదు వాసుదేవుడంటే. వసతి దీవ్యతీతి అని అర్థం చెప్పాలా శబ్దానికి. అంటే అస్తిభాతి. సచ్చిత్తులని భావం. అదే సర్వ జగద్వ్యాప్తమైన ఆత్మ చైతన్యం.

అది ఎక్కడో లేదు. సాధకుడి ఆత్మ స్వరూపమే. ఎటు వచ్చీ సమాహితమైన అంతః కరణంలో ఆ తత్త్వాన్ని శ్రద్ధా సక్తులతో ధ్యానిస్తూ ఉండాలి. దీనికే నిదిధ్యాసనమని పేరు. విజాతీయమైన అనాత్మ భావగంధం కూడా లేని సజాతీయమైన ఆత్మ స్వరూపాన్నే ధారావాహికంగా భజిస్తూ పోవటమే నిదిధ్యాస. అలాటి భావనతో ఎవడు నన్ను తన స్వరూపంగా నిత్యమూ గుర్తు చేసుకొంటూ పోతాడో వాడే అసలైన యోగి. సమే యుక్తతమో మతః - యోగులలో కూడా మిగతా వారికన్నా ఉత్తమోత్తముడైన మహాయోగి. కనుక ఏతా వతా భగవత్సందేశ సారాంశమేమంటే ఆనాటి

Dr Kuna Dayananda Swamy ebooks



నరుడితో సహా ఈనాటి మనబోటి నరులందరూ కూడా బుద్ధి జీవులయి జన్మించినందుకు ఇలాటి బుద్ధి యోగ మవలంబించి తద్వారా ఎప్పటికైనా ఏ జన్మకైనా సకల బుద్ధి ప్రకాశకమైన ఆ పరమాత్మ సాయుజ్యాన్ని అందుకోటం శ్రేయోదాయకం.

**ఇతి**

**ఆత్మసంయమ యోగః సమాప్తః**

* * *
* *
*

Dr Kuna Dayananda Swamy ebooks


# ఉపసంహారము

భగవద్గీతలో ఇప్పటి కారధ్యాయాలు పూర్తి చేశాము. అంటే మొదటి షట్కమయిం దన్న మాట. దీనితో త్వం పదార్ధ శోధన కూడా చేసిన వాళ్లమయ్యాము. తత్త్వమసి మహావాక్యంలో త్వం పదార్థ విచారణే మొదటి ఆరధ్యాయాలకూ విషయమని ఆదిలోనే ప్రస్తావించి ఉన్నాను. త్వం పదార్థమంటే జీవుడు. జీవుడు శుద్ధి అయితే గాని వాడీశ్వర సాయుజ్యాన్ని పొందలేడు. శుద్ధి లేకుండా జీవుడు లోకంతో వ్యవహరించవచ్చు. సంగీత సాహిత్యాది కళలెన్నైనా అభ్యసించవచ్చు. తర్క జ్యౌతిష గణిత భౌతిక రసాయనాది శాస్త్రాలన్నింటిలో ప్రవీణత గడించవచ్చు. ఆఖరు కధ్యాత్మ శాస్త్రంలో కూడా పరోక్ష జ్ఞాన మెంతైనా సంపాదించవచ్చు. దానికి సిద్ధమయి ఉంటే చాలు జీవుడు. శుద్ధుడు కానక్కర లేదు. కాని జీవుడీశ్వర సాయుజ్యం పొందాలంటే మాత్రం సిద్ధత కాదు శుద్ధత ఉండితీరాలి.

కారణమేమంటే జీవుడు జీవుడుగా ఉంటూనే ఆయా విద్యలూ కళలూ సాధించవచ్చు. జీవుడంటే కర్తా భోక్తా. ఒక పని చేస్తున్నానని భావించేవాడూ చేయటం మూలంగా దాని ఫలితం కూడా సాధించేవాడూ. మొదటి దహంకారమైతే రెండవది మమకారం. ఇవి రెండూ ఇటు లోక వ్యవహారానికీ

Dr Kuna Dayananda Swamy ebooks



అటు శాస్త్ర వ్యవహారానికీ అడ్డు రావు. అడ్డు రాకపోవటమే గాదు. అవశ్యంగా ఉండి తీరాలవి వాటిలో కృషి చేయటానికీ నిష్ణాతుడు కావటానికీ. అహం మమలు లేకుండా ఏదీ ఆలోచించలేము. మాటాడలేము. పనిచేయలేము. ఫలిత మాసించలేము. కాబట్టి సిద్ధత ఉంటే చాలు వీటికి. ఉండి తీరాలి కూడా.

అయితే ఇది ఎంత ఉన్నా పనికి రాదు వేదాంత రంగంలో. సిద్ధత కాదు. శుద్ధత కావాలక్కడ జీవుడికి. ఎందుకంటే జీవేశ్వరైక్యమే వేదాంతానికే కైకమైన లక్ష్యం. జీవభావ మిలాగే ఉంచుకొని దాన్ని మనమాసించ లేము. అహం మమలే గదా జీవ లక్షణం. అది ధర్మ పురుషార్థానికైనా పనికి వస్తుందేమో గాని మోక్ష పురుషార్థానికి **Realisation** సుతరామూ పనికిరాదు. అవి రెండూ శుద్ధి చెందాలిక్కడ. అహంకారమూ మమకారమూ రెండూ తొలగిపోవాలి. తప్పదు.

అసలు జీవుడంటే ఎవడు. శరీర మనః ప్రాణేంద్రియ సంఘాతమే నేనని భావించి దీనితో తాదాత్మ్యం **Identity** చెందిన చైతన్యమే గదా. దానికే అహంకారమని **Ego** పేరు. అలా ఈ పిండాండమే **Micro** ఎప్పుడు నేనయి కూచున్నానో ఆ మేరకు పరిచ్ఛిన్న **Limitted** మయి పోయింది చైతన్యం. ఇది దేహం మేరకే ఎప్పుడాగి పోయిందో ఇక దీని సరిహద్దులు దాటిన దంతా అచేతనమైన ప్రపంచమయి పోయింది. దానికే మమకారమని

Dr Kuna Dayananda Swamy ebooks



పేరు వచ్చింది. ఇందులో అహమనే భావమే జీవుడు. మమ అనే భావమే జగత్తు. అహమనే జీవభావం లేకపోతే మమ అనే జగద్భావ మెగిరిపోతుంది. వీడు శరీరం మేరకు తగ్గిపోవటం వల్లనే అది వీడి కన్యంగా పెరిగిపోయింది.

ఆ మాటకు వస్తే అసలీ రెండూ వస్తుతః లేవు. జీవుడూ లేడు. వీడు వ్యవహరిస్తున్న జగత్తూ లేదు. వస్తు సిద్ధం కావివి. ప్రతీతి సిద్ధం **Apparant**. జీవుడి అజ్ఞానం వల్లనే అఖండమైన ఆత్మ చైతన్యమిక్కడ ఒక జీవుడుగా అక్కడ ఒక జగత్తుగా విభక్తమయి గోచరిస్తున్నది. ఆ భాసే గాని వస్తువు కాదిది. మన అజ్ఞానం వల్లనే ఆభాసగా చూడవలసిన వాటిని మనం వాస్తవమని భావించి వాటికి వాస్తవత్వాన్ని కల్పించాము. అదే ఈ సంసార బంధం. తన్నిమిత్తంగానే జనన మరణాది కృతమైన విషాదం జీవుడికి.

కనుక ఈ జీవ భావాన్ని శుద్ధి చేయవలసిన బాధ్యత ఏర్పడింది మానవుడికి. చేయకుండా ఇలాగే ఉంచుకొంటే తాత్కాలికంగా అన్ని వ్యవహారాలూ సాగిపోతే పోవచ్చు గాని జనన మరణాది సంసార సమస్యకు మాత్రం పరిష్కారం చేసుకోలేము. జీవభావాన్ని శుద్ధి చేస్తే చాలు. జగద్భావాన్ని చేయనక్కర లేదు. జీవుడు పోతే జగత్తు పోతుంది. కారణమేమంటే దేహంలో బందీ అయిన చైతన్యమే జీవుడని చెప్పాము. దేహం నుంచి అది బయటపడిందో అది నిరాకారం కాబట్టి సర్వత్రా

Dr Kuna Dayananda Swamy ebooks


వ్యాపిస్తుంది. దేహమేమిటి. దేహం చుట్టూ ఉన్న ప్రపంచమేమిటి. ఇటు పిండాండమూ అటు బ్రహ్మాండమూ రెండూ దానితో నిండిపోతాయి. చరాచర పదార్థాలన్నింటి లోపలా వెలపలా మధ్యలో అంతా చైతన్యమే. అంతవరకూ వాస్తవంగా తోచిన జీవజగత్తులు రెండూ ఇప్పుడా చైతన్యం తాలూకు ఆభాసలుగా ఇంకా చెప్పవలసి వస్తే దాని విభూతిగా దర్శన మిస్తాయి. సంసారం విభూతిగా మారుతుంది. కాబట్టి సాంసారిక మైన తాపత్రయ మప్రయత్నంగా సమసిపోతుంది. అదే పరిష్కారం జీవిత సమస్యకు

అంచేత ఇలాటి పరిష్కారం త్వం పదార్థ శోధన వల్లనే జరగవలసి ఉంది. త్వం పదార్థమంటే జీవుడని గదా చెప్పాము. అహంకార మమకారాలే జీవుడని కూడా చెప్పాము. అవి ఉపాధులే గానీ స్వరూపం కావు జీవుడికి. జీవుడి స్వరూపం కేవలం చైతన్యమే. దానిమీద ఆరోపితమివి రెండూ. దానికి కారణమవి నా స్వరూపానికి వేరు కావని తెలియక పోవటమే. అదే అజ్ఞానం. దాన్ని పోగొట్టుకోవాలంటే జ్ఞానమే దానికి మందు. కనుక నా స్వరూపమేదో దాన్ని గుర్తించి తద్వారా ఈ అహం మమలను దానిలో లయం చేసుకోటమే శోధన.

శోధన చేయనంత వరకూ వాచ్యార్థమే గాని లక్ష్యార్థం మన అనుభవానికి రాదు. కర్తృత్వ భోక్తృత్వాలతో గూడిన జీవ భావమే వాచ్యార్థం. అప్పుడు జీవుడు శరీరమాత్ర పరిచ్ఛిన్నంగా కనిపిస్తుంటాడు. శరీరానికి

Dr Kuna Dayananda Swamy ebooks



బాహ్యంగా చరాచర ప్రపంచం వీడికి అన్యంగా కనిపిస్తుంటుంది. అదే సంసార బంధం జీవుడికి. ఎప్పుడైతే శోధన చేశామో కర్తృత్వ భోక్తృత్వా లెగిరిపోయి శుద్ధ చైతన్యాత్మకంగా మిగిలిపోతాడు జీవుడు. అప్పుడు జీవాత్మ కాడు వీడు. ప్రత్యగాత్మ. దీనికే లక్ష్యార్థమని పేరు. లక్ష్యార్థమనేది కొత్తగా మనం సృష్టించటం లేదు. అసలు మొదటి నుంచీ ఉన్నదదే. శుద్ధ చైతన్యమే మన స్వరూపం. దీన్ని మనం శోధించనక్కరలేదు. దానికి పట్టిన మాలిన్యాన్ని కడిగేయటమే మనం చేయవలసిన పని. అలా కడిగేస్తే ఏది మనకు సహజం కాదో అది తొలగిపోతుంది. ఏది మన స్వరూపమో అది మిగిలిపోతుంది. దీనికే భాగత్యాగ లక్షణ అని పేరు పెట్టా రద్వైతులు. జీవుడి మీద అజ్ఞానవశాత్తూ ఆరోపితమైన కర్తృత్వాదులను త్యాగం చేయాలి. జీవుడి స్వరూపమైన శుద్ధ చైతన్యాన్ని భజించాలి. అంటే దక్కించుకోవాలి. ఒక భాగాన్ని త్యాగం చేయాలి. ఒక భాగాన్ని నిలుపుకోవాలి. నేను నేననే స్ఫూర్తిని నిలుపుకోవాలి. అది కానిదంతా వదులుకోవాలి. అప్పుడది ఈశ్వర సాయుజ్యానికి సిద్ధమయి ఉంటుంది. ఇదే త్వం పదార్థ శోధనలో ఉన్న రహస్యం.

అదే ఇప్పుడీ మొదటి షట్కంలో జరిగిన ప్రక్రియ. ఆరధ్యాయాలలో మొట్టమొదట మన సమస్య ఏదో ప్రస్తావించాడు. అహం మమలే సమస్య. అదే విషాదయోగ మర్జునుడికి. కురుక్షేత్రం మమకారానికి నిలయమైన

Dr Kuna Dayananda Swamy ebooks



ప్రసరించిందని ఎప్పుడర్థమయిందో - కర్మగా కనపడేది ఏదో గాదు జ్ఞానమేనని చాటుతున్నది జ్ఞానయోగమనే నాలుగవ అధ్యాయం. అలాంటప్పుడిక కర్మ జ్ఞానమనే తేడా ఎందుకు చెప్పటం కర్మను జ్ఞానంలో కలుపుకొని అంతా అఖండమైన జ్ఞానంగా భావిస్తే సరిపోలేదా అని మరలా మనకు ఏకైకమైన సత్యాన్ని వర్ణించి చెబుతుంది అయిదవదైన కర్మ సన్న్యాసయోగం.

ఇక్కడికి అహం మమలు పూర్తిగా శుద్ధి అయినాయి. అహం అని శరీరాదులను చూచి గదా అనుకొన్నావు. అవి ఇప్పుడాత్మ స్వరూపమే. మమ అనేది బాహ్యమైన చరా చర పదార్థాలను చూచి గదా భ్రమపడ్డావు. అదీ ఇప్పుడు నీ స్వరూపమే. అంతటా నీ స్వరూపమే నీ జ్ఞానమే. జ్ఞేయం లేదు. అహమొక జ్ఞేయం. మమ ఒకజ్ఞేయ మింతకు ముందు. నీ స్వరూపానికి విజాతీయంగా కనిపించాయి. ఇప్పుడవి రెండూ నీ జ్ఞానానికి సజాతీయం. ఇక విషాద మేముంది. విశేష దృష్టే విషాదానికి మూలం. విశేష దృశ్యమూ లేదు విశేష దృష్టీ లేదిప్పుడు. రెండూ పరస్పర సాపేక్షం **Relative.** నిరపేక్షమైన **Absolute** జ్ఞానంలో కరిగిపోయాయి.

పోతే ఇక జీవ భావం పూర్తిగా శుద్ధి అయిపోయింది. సిద్ధాంతమేగాని ఇంకా అది నీకు దృష్టాంతం కాకపోవచ్చు. అలా కావాలంటే తొందర పడకుండా పునాదుల దగ్గరి నుంచీ గట్టి చేసుకొంటూ రావాలి. అదే

Dr Kuna Dayananda Swamy ebooks



ప్రపంచం. అందులో అర్జునుడెక్కిన రథం అహంకారాస్పదమైన శరీరం. యుద్ధం వీటితోనే. ఇందులో అహం మమతో పోరాడుతున్నది. మమ పోయి అహం మిగిలినా విషాదమే. మమ చేత అహం దెబ్బతిన్నా విషాదమే. విషాదయోగ సారమంతా ఇదే. పోతే ఈ విషాదమెలా తొలగిపోతుందో ఆ సూత్రం బయటపెడుతున్నది రెండవదైన సాంఖ్యయోగం. అసలీ అహమేమిటో మమ ఏమిటో వివేచన చేసి చూడమంటున్నది సాంఖ్యం. వాటికి దేహి దేహమని పేరు పెట్టింది. దేహి కేవల జ్ఞానమే. ఇక మిగతా మనః ప్రాణేంద్రియ శరీరాది సంఘాత మంతా దేహి కాదు. దేహం క్రిందికి వస్తుంది. అప్పుడు బాహ్యమైన ప్రపంచమెంతో ఈ దేహమనే ఉపాధి అంతే.

దేహేంద్రియాదులైన ఉపాధులే నేను కానని భావించటమే వివేచన. వివేచన చేసేసరికి మనోవృత్తుల దగ్గరి నుంచీ సమస్తమూ నీ జ్ఞానానికి జ్ఞేయంగా భాసిస్తుంది. అది విశేషమూ పరిచ్ఛిన్నమూ కాబట్టి నీ స్వరూపంలాగా అచలం కాదు. చలనాత్మకం. చలనమే కర్మ. ఇది ఎక్కడిది. ఉన్నది అచలమైన నీ జ్ఞానమే గదా. అయినా ఇది కనిపిస్తున్నదంటే అచలమైన నా జ్ఞానమే చలనాత్మకమైన కర్మ జగత్తుగా భాసిస్తున్నదని గ్రహించాలి. జ్ఞానమే ప్రసరిస్తే కర్మ. ఇదే కర్మయోగమనే మూడవ అధ్యాయం. అప్పటికి కర్మగా ప్రసరించినా అది జ్ఞానమే అలా

Dr Kuna Dayananda Swamy ebooks



ఆత్మ సంయమ యోగమనే ఆరవ అధ్యాయం మనకు బోధించే విధానం. ఆహార విహారాల దగ్గరి నుంచీ ఆసనాదుల దగ్గరినుంచీ ఇంద్రియ మనో నిగ్రహం దగ్గరి నుంచీ సాధకు డవలంబించ వలసిన నియమ నిష్ఠలను సాంగో పాంగంగా వర్ణించట మిందు కోసమే. అది కూడా ఈ జన్మలోనే ఫలిస్తుందో లేదో నని మనం బేజారయి పోకుండా ఒక పెద్ద హామీ కూడా ఇచ్చింది అధ్యాయం. ఈ జన్మలోనే ఫలించవచ్చు. లేదా శోధన పూర్తికాక పోతే రాబోయే జన్మలోనైనా ఇది నీకు కలిసి వచ్చి అక్కడి నుంచి మరలా నీవు శోధన పూర్తి చేసుకొని ఈశ్వర సాయుజ్య మందుకోటానికి సంసిద్ధుడవు కాగలవని అది ఇచ్చే హామీ. ఇలా ఆత్మానాత్మ వివేకమూ - కర్మయోగమూ - సత్త్వశుద్ధీ - జ్ఞానప్రాప్తీ - కర్మ సన్న్యాసమూ - జ్ఞాన నిష్ఠా - ఈ షట్సూత్ర ప్రణాళిక ద్వారా జీవుడిలో ఉన్న మాలిన్యాన్ని ప్రక్షాళనం చేసి అంచెల వారిగా వీణ్ణి ఈశ్వరుడి స్థాయికి పట్టుకురావటమే గీతలో ఇంతవరకూ మనం చెప్పుకొన్న ఈ ప్రధమ షట్క సారాంశం.

✦✦✦